వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

కర్ణ పర్వం



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
కర్ణ పర్వం

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

కర్ణ పర్వం

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

c 27476

సుందరయ్య గ్రంథాలయ నంబరు
A.C.No 96362
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, పోలకంపాడు,
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ॥శే॥ కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి



రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

కర్ణ పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంవయోగోధృవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా అవగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
1.	కర్ణజన్మను గురించి కుంతి తెలుపుట. (24)★	19
2.	ధృతరాష్ట్ర సంజయ సంవాదము. (26)	21
3.	కర్ణయుద్ధము, కర్ణవధాదుల సంక్షిప్త వర్ణనము. (21)	22
4.	ధృతరాష్ట్రుడు దుఃఖించుట, స్త్రీల ఆకులపాటు. (16)	23
5.	సంజయుడు ధృతరాష్ట్రునకు కౌరవపక్షమున మృత వీరుల గూర్చి చెప్పుట. (60)	24
6.	కౌరవులు సంహరించిన పాండవ వీరులు. (39+1)	27
7.	కౌరవ పక్షమున సజీవులను గూర్చి చెప్పుట, ధృతరాష్ట్రుని మూర్ఛ. (28)	29
8.	ధృతరాష్ట్రుని విలాపము. (31+1 $\frac{1}{2}$)	31
9.	ధృతరాష్ట్రుడు కర్ణ వధను సవిస్తరముగ చెప్పమని సంజయుని అడుగుట. (97)	33
10.	సేనాపతిగా కర్ణుని అభిషేకము. (56+2 $\frac{1}{2}$)	39
11.	కౌరవులు మకరవ్యూహమును పాండవులు అర్ధచంద్రాకార వ్యూహమును పన్నుట. (43)	42
12.	కౌరవ పాండవుల యుద్ధము. క్షేమధూర్తిని భీముడు వధించుట. (45)	45
13.	సాత్యకి వింధానువిందుల వధించుట. (38)	48

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపారశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
14.	శ్రుతకర్మ ప్రతివింధ్యులు చిత్రసేన చిత్రులను వధించుట – అశ్వత్థామ భీముని ఎదుర్కొనుట. (39)	49
15.	అశ్వత్థామ భీమసేనుల యుద్ధము. (44)	51
16.	అర్జునుడు సంశప్తకులతో అశ్వత్థామతో పోరుట. (51+15 $\frac{1}{2}$)	54
17.	అర్జునునిచేతిలో అశ్వత్థామ ఓటమి. (26)	58
18.	అర్జునుడు ఏనుగులతో గూడ దండధరాదులను వధించుట. (25)	60
19.	అర్జునుడు సంశప్తక సేనను వధించుట, శ్రీకృష్ణకృత అర్జున ప్రశంస. (58)	62
20.	అశ్వత్థామ పాండ్యరాజును వధించుట. (52)	66
21.	కౌరవ పాండవుల భయంకర యుద్ధము. (40)	70
22.	పుండ్రుని పరాజయము. వంగరాజ వధ (30)	72
23.	సహదేవుడు దుఃశాసనుని ఓడించుట. (22)	74
24.	కర్ణుని చేతిలో నకులుని పరాజయము. (78)	75
25.	ఉభయపక్షవీరుల తీవ్రయుద్ధము (43)	79
26.	కృపాచార్యుని వలన ధృష్టద్యుమ్నునికి భయము – కృతవర్మశిఖండిని ఓడించుట. (38+ $\frac{1}{2}$)	82
27.	అర్జునుడు సంశప్తకుల సంహరించుట. (43)	84
28.	యుధిష్ఠిర దుర్యోధనుల యుద్ధము. దుర్యోధన పరాజయము. సంకుల సమరము. (49)	86
29.	యుధిష్ఠిరుడు దుర్యోధనుని ఓడించుట (36)	89

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
30.	సాత్యకి కర్ణుల యుద్ధము. పాండవ విజయము. (44)	90
31.	పదునారవరోజు రాత్రి కౌరవ పక్షములో జరిగిన విశేషములు. (73)	93
32.	దుర్యోధనుడు సారథ్యము చేయ శల్యుని అర్థించుట. (66+$\frac{1}{2}$)	98
33.	త్రిపురాసురవృత్తాంతము (63+4$\frac{1}{2}$)	101
34.	త్రిపురాఖ్యానము. (163+7$\frac{1}{2}$)	105
35.	శల్యుడు కర్ణరథ సారథ్యమునకు అంగీకరించుట. (48)	115
36.	కర్ణుని యుద్ధ ప్రయాణము. (33)	118
37.	కౌరవులకు అపశకునములు గలుగుట. కర్ణుని ఆత్మస్తుతి - శల్యుని అపహాస్యము. (45)	119
38.	శ్రీకృష్ణార్జునుల ఉనికిని చెప్పినవారికి కర్ణుడు బహుమతులు ఇత్తుననుట. (26)	123
39.	కర్ణుని శల్యుడు ఆక్షేపించుట. (35)	124
40.	కర్ణశల్య సంవాదము. (56)	126
41.	హంసకాకీయోపాఖ్యానము. (87+1)	130
42.	కర్ణశల్య సంవాదము. (50)	136
43.	ఆత్మప్రశంసతో కర్ణుని గర్వోక్తులు. (9)	140
44.	కర్ణుడు మద్రాదిదేశవాసులను నిందించుట. (47)	141
45.	కర్ణశల్య సంవాదము. (48)	144
46.	శల్యుడు పాండవవీరులను అర్జునుని ప్రశంసించుట. (87+16)	147

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
47.	సంకులయుద్ధము, అర్జునకర్ణుల పరాక్రమము. (23)	153
48.	సంకుల యుద్ధము. (67+5 $\frac{1}{2}$)	155
49.	సంకుల సమరము, యుధిష్ఠిరుని పరాజయము. (92+19 $\frac{1}{2}$)	159
50.	కర్ణభీముల యుద్ధము, కర్ణపలాయనము. (49+13)	165
51.	భీముడు ఆర్గురు కౌరవులను చంపుట. సంకుల సమరము. (80)	168
52.	ఉభయసేనల సంకుల యుద్ధము. (42)	172
53.	అర్జునుడు పదివేల సంశప్తకుల వధించుట. (46+ $\frac{1}{2}$)	175
54.	సంకుల యుద్ధము. (42+4)	177
55.	అశ్వత్థామతో యుద్ధము నుండి యుధిష్ఠిరుడు తొలగుట. (39+3)	179
56.	సంకుల యుద్ధము. (147)	181
57.	అశ్వత్థామ ప్రతిజ్ఞ. (17)	189
58.	అర్జునునకు శ్రీకృష్ణుడు యుద్ధభూమిని జూపి చెప్పుట. (52)	190
59.	అశ్వత్థామ పరాజయము. (67)	193
60.	శ్రీకృష్ణుడు అర్జునుని కర్ణవధకు ప్రోత్సహించుట. (92+4)	196
61.	సంకుల యుద్ధము. (74+ $\frac{1}{2}$)	201
62.	కౌరవసేన యుధిష్ఠిరుని ఆక్రమించుట. (34)	205
63.	ధర్మజుని ఓటమి – పలాయనము (38+2 $\frac{1}{2}$)	207
64.	అశ్వత్థామ ఓటమి – కర్ణుడు పాంచాలురను సంహరించుట. (70)	209
65.	కృష్ణార్జునులు యుధిష్ఠిరుని కడకేగుట. (23)	213

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
66.	కర్ణుని మరణమును గూర్చి ధర్మజుని ప్రశ్న (48)	214
67.	అర్జునవాక్యము (23)	217
68.	యుధిష్ఠిరుని క్రోధవచనములు. (30+5)	219
69.	కృష్ణార్జున సంవాదము. (88)	222
70.	యుధిష్ఠిర సమాశ్వాసనము. (60+3)	227
71.	అర్జున ప్రతిజ్ఞ (40)	232
72.	కృష్ణార్జున సంవాదము. (40)	234
73.	శ్రీకృష్ణుడు అర్జునుని ప్రోత్సహించుట. (125)	236
74.	అర్జునుడు వీరోచితముగా పలుకుట. (58)	243
75.	ద్వంద్వ యుద్ధము - సుషేణవధ (17)	246
76.	భీమసేన విశోక సంవాదము (40+3 $\frac{1}{2}$)	248
77.	శకుని పరాజయము (79+2)	251
78.	కర్ణుడు పాండవసేనను సంహరించుట (32)	255
79.	సంకుల యుద్ధము (95+3)	258
80.	అర్జునుడు కౌరవసేనను ధ్వంసము చేయుట. (32)	265
81.	సంకులయుద్ధము - కర్ణపరాక్రమము (57+3)	267
82.	కర్ణపరాక్రమము - భీమదుశ్శాసన యుద్ధము (36+8 $\frac{1}{2}$)	270
83.	దుశ్శాసన వధ (52)	273
84.	నకుల పరాజయము (42)	277

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
85.	వృషసేన వధ (39)	280
86.	వాసుదేవ వాక్యము (23)	283
87.	కర్ణార్జున సమాగమము (117+11 $\frac{1}{2}$)	285
88.	అశ్వత్థామ – దుర్యోధనుల సంభాషణ (34+12)	291
89.	కర్ణార్జున యుద్ధము (97+5 $\frac{1}{2}$)	295
90.	కర్ణుని రథచక్రము క్రుంగిపోవుట (116+2)	303
91.	కర్ణవధ (68+1)	312
92.	శల్యుడు దుర్యోధనుని ఓదార్చుట (15)	317
93.	కౌరవసైన్య పలాయనము (60)	318
94.	రణభూమి వర్ణనము (68)	322
95.	కౌరవసేన శిబిరాలలో ప్రవేశించుట. (18)	327
96.	యుధిష్ఠిర హర్షము. (65)	328
	శ్రవణమహిమ	331

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
కర్ణ పర్వం

1. కర్ణజన్మము గురించి కుంతి తెలుపుట.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

వైశంపాయనుడు చెప్పాడు - రాజా! ద్రోణుడు చనిపోగా, దుర్యోధనాదులయిన రాజులు అందరూ మరీ తీవ్రమయిన ఉద్వేగాన్ని పొంది, అశ్వత్థామ వద్దకు వచ్చారు. మోహం వల్ల వారి బలం, ఉత్సాహం నశించాయి. వారు ద్రోణుని కోసం బాధపడుతూ, శోకంతో వ్యాకుల చిత్తులయి అశ్వత్థామకు చుట్టూ కూర్చున్నారు. వారు శాస్త్రానుకూల మయిన హేతువులతో రెండు గడియల పాటు అశ్వత్థామను ఓదార్చారు. ఆ తరువాత రాత్రి కాగా ఆ రాజులు తమగుడారాలకు వెళ్ళారు. కురువంశీయా! ఆ రాజులు వారి నివాసాలలో కూడా తీవ్రమయిన నాశాన్ని గూర్చి ఆలోచిస్తూ, దుఃఖశోకాలలో మునిగిపోయి, సుఖంగా ఉండలేకపోయారు. ఆ రాజులలో ప్రత్యేకించి కర్ణుడు, దుర్యోధనుడు దుఃశాసనుడు, శకుని ఆ రాత్రి దుర్యోధనుని నివాసంలో పాండవులకు తాము కలిగించిన కష్టాలను గూర్చి చింతిస్తూ ఉన్నారు. జూదం ఆడినప్పుడు ద్రుపద పుత్రిక అయిన కృష్ణను లాక్కొని రావటం, ఆమెకు అనేక క్లేశాలు కలిగించటం అనే వాటిని పలుమారులు గుర్తు తెచ్చుకొని, వారు విచారపడుతూ మనస్సులోనే చాలా ఉద్వేగానికి లోనయ్యారు. రాజా! ద్యూతంలో పాండవులకు కలిగించిన బాధలను గూర్చి బాగా విచారపడుతున్నవారికి ఆ రాత్రి నూరు సంవత్సరాల లాగా గడిచింది.

తరువాత స్వచ్ఛమయిన ప్రభాత కాలంలో దైవాధీను లయి కౌరవులు అందరు శాస్త్రోక్తంగా స్నాన సంధ్యావందనాదులను అనుష్ఠించారు. తరువాత నిర్వర్తించవలసిన పనులను చేసి, కొంత ఊరట చెంది, యుద్ధసన్నాహాన్ని చేయ నాజ్ఞాపించారు. కవచాదులను ధరించారు. మంగళ కృత్యాలను నిర్వర్తించారు. కర్ణుని సేనాపతిని చేసి, దధిపాత్రలు, వేయి, అక్షతలతో బ్రాహ్మణులను పూజించారు. వారికి గోవులను, అశ్వాలను, బంగారు నాణాలను, అమూల్యమయిన వస్త్రాలను దానం చేశారు. సూతులు, మాగధులు, వందులు నమస్కరిస్తూ, జయగీతికలను పలుకుతుండగా యుద్ధానికి బయలుదేరారు. రాజా! అలాగే పాండవులూ, ప్రాతఃకాల కృత్యాలను అన్నింటిని నిర్వర్తించి, యుద్ధం చేయటానికి దృఢనిశ్చయం చేసి, త్వరగా శిబిరాల నుంచి బయలుదేరారు. కౌరవపాండవుల మధ్య శరీరాలు గగుర్పొడిచే భయంకర యుద్ధం ప్రారంభ మయింది. మహారాజా! కర్ణుడు సేనాపతి అయిన తరువాత కురు పాండవ సేనల మధ్య రెండు రోజులు ఆశ్చర్యకరంగా యుద్ధం జరిగింది. అందులో కర్ణుడు చాలా విస్తారంగా శత్రునాశం చేసి, కౌరవులు అందరూ చూస్తుండగానే అర్జునుని చేతిలో మరణించాడు. ఆ తరువాత సంజయుడు హస్తి నగరానికి వేగంగా వెళ్ళి కురుక్షేత్రంలో జరిగింది అంతా ధృతరాష్ట్రునికి చెప్పాడు.

జనమేజయుడు అన్నాడు - వైశంపాయన మహర్షీ! భీష్ముడు, ద్రోణుడు హతు లయినారని విని, ధృతరాష్ట్ర మహారాజు చాలా ఆర్తిని పొంది ఉంటాడు. ద్విజశ్రేష్ఠా! దుర్యోధనుని మేలుకోరే కర్ణుని మరణవార్త విని, దుఃఖితు డయిన ఆయన ప్రాణాలు ఎలా నిలబెట్టుకొన్నాడు? ఆ రాజు 'తన పుత్రులు జయిస్తారు' అనే ఆశను కర్ణుని మీద పెట్టుకొన్నాడు. అలాంటి రాధేయుడు మరణిస్తే ఆయన ఎలా ప్రాణధారణ చేశాడు? తీవ్రమయిన సంకటస్థితిలో పడినప్పటికీ మానవులకు ప్రాణత్యాగం చేయటం చాలా కష్టం అని నేను అనుకొంటాను. అందువల్లనే కర్ణుడు హతుడయినా డని విని కూడా ఆ రాజు జీవితం వదలలేదు. ద్విజోత్తమా! 'వృద్ధు డయిన భీష్ముని, బాహ్లీకుని, ద్రోణుని, సోమదత్తుని, భూరిశ్రవుని, ఇతర మిత్రులను, పుత్రులను, పౌత్రులను గూడా శత్రువులు చంపారు' అని విని కూడా ఆయన ప్రాణాలు వదలలేదు గదా! ఇది చూస్తే మానవునికి మరణించటం కూడా చాలా దుష్కరం అని తెలుస్తుంది. మహామునీ! ఈ విషయాన్ని నాకు సవిస్తరంగా చెప్పవలసింది. మా పూర్వుల మహత్తర చరిత్ర వింటున్న నాకు తృప్తి కలగటం లేదు.

2. ధృతరాష్ట్ర సంజయ సంవాదము.

వైశంపాయనుడు చెప్పాడు – మహారాజా! కర్ణుడు చనిపోయాక, దీను డయిన సంజయుడు ఆ రోజు రాత్రికే వాయువేగం గల అశ్వాలు పూన్చిన రథంమీద హస్తినాపురానికి వెళ్ళాడు. ఆయన హస్తినా పురానికి వెళ్ళి, ఉద్వేగంతో గూడిన మనస్సుతో బంధుహీన మయిన ధృతరాష్ట్రుని నివాసానికి వెళ్ళాడు. ఆయన దుఃఖంతో ఉత్సాహహీనుడయిన రాజును చూసి, దోసిలొగ్గి, తల వంచి, ఆయన పాదాలకు నమస్కరించాడు. ధృతరాష్ట్రుని తగిన రీతిగా గౌరవించి, 'ఆహా ఎంత కష్టం' అని ఇలా అన్నాడు.'మహారాజా! నేను సంజయుడను. మీరు సుఖంగా ఉన్నారా? స్వదోషాల వల్ల ఆపదనంది ఇవ్వాళ మోహితుడవు కాలేదు గదా! విదురుడు, ద్రోణుడు, భీష్ముడు, శ్రీకృష్ణుడు చెప్పిన హిత వచనాలను స్వీకరించకపోవటం గుర్తు తెచ్చుకొని, బాధపడటం లేదు గదా! పరశురాముడు, నారదుడు, కణ్వుడు మున్నగు వారు చెప్పిన హితాన్ని స్వీకరించకపోవటం గుర్తుచేసుకొని, వ్యథచెందటం లేదు గదా! నీ హితం కోరే మంచి మనస్సుగల భీష్మద్రోణాదులను, యుద్ధరంగంలో శత్రువులు సంహరించటం గుర్తు చేసుకొని, విచార పడటం లేదా? దోసిలొగ్గి, ఇలా ప్రశ్నిస్తున్న సంజయునితో రాజు దుఃఖార్తు డయి దీర్ఘమయిన నిట్టూర్పులు విడుస్తూ, ఇలా అన్నాడు.

సంజయా! దివ్యాస్త్రాలు గల భీష్ముడు, గొప్ప విలుకాడయిన ద్రోణుడు హతులు కాగా నామనస్సు తీవ్రంగా వ్యథ చెందింది. కవచధారు లయిన పదివేల మంది రథికులను ప్రతిదినమూ భీష్ముడు చంపాడు. ఆయనను అర్జున రక్షితు డయిన శిఖండి సంహరించాడు అని విని, వ్యథచెందాను. భీష్మునికి భార్గవరాముడు ఉత్తమాస్త్రాలను ఇచ్చాడు. బాల్యంలో పరశురాముడు ధనుర్వేదం ప్రసాదించాడు. ద్రోణుని అనుగ్రహం వల్ల కుంతీపుత్రులు, ఇతర భూపతులు మహారథులు అయ్యారు. మహాధనుష్కుడు అయిన ద్రోణుని యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు సంహరించాడు. అందువల్ల నా మనస్సు తీవ్రంగా వ్యథచెందింది. *చతుర్విధమయిన అస్త్రవిద్యలో ఏ మగవాడూ సాటిరాని ఆ ద్రోణభీష్ములు పడిపోయారని విని, నా మనస్సు వ్యథచెందింది. ముల్లోకాల్లో అస్త్రవిద్యలో ఏ వీరుడూ సాటికాని ద్రోణుడు

★ *వి.స॰॥ అస్త్రాలు ముక్తాలు, అముక్తాలు, యంత్రముక్తాలు, ముక్తాముక్తాలు అని నాలుగు విధాలు. ధనుస్సుతోగాని, చేతితోగాని, ప్రయోగం చేసేవి ముక్తాలు. అవి బాణాదులు. చేతితో తీసుకొని ఉపయోగించేవాటిని ఖడ్గాదులను అముక్తాలు అంటారు. యంత్రాదులతో విసిరివేసే వాటిని – గోళాదులను యంత్రముక్తాలు అంటారు. ప్రయోగించి మళ్ళీ ఉపసంహరించేవి – అంటే శత్రువును గాయపరచి ప్రయోక్త చేతిలోనికి వచ్చేవి – శ్రీకృష్ణచక్రాదులు ముక్తాముక్తాలు.*

చనిపోయిన విషయం తెలిసి మావారు ఏం చేశారు? ధనంజయుడు పరాక్రమించి, సంశప్తకుల బలాన్ని యమలోకానికి పంపిన తరువాత, అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రం వ్యర్థం కాగా, సైన్యాలు పారిపోగా, మావాళ్ళు ఏం చేశారు? ద్రోణుడు చనిపోగా, శోకసాగరంలో మునిగి, పారిపోయే మావారిని సముద్రంలో నౌక మునిగిపోగా ఈదులాడే వారినిగా భావిస్తాను. సంజయా! సైన్యాలు అన్నీ పారిపోతే దుర్యోధనుడు, కర్ణుడు, కృతవర్మ, శల్యుడు, అశ్వత్థామ, కృపుడు మృతశేషులయిన నా పుత్రులు, తదితరుల ముఖాల రంగు ఎలా ఉంది ? సంజయా! ఇదంతా జరిగింది జరిగినట్లుగా పాండవుల, మాపక్షంవారి పరాక్రమాన్ని వివరించు. సంజయుడు చెప్పాడు - 'ఆర్యా! నీ అపరాధం వల్ల కౌరవ పక్షంలో జరిగింది విని వ్యధచెందకు. **దైవవశాన కలిగిన దానికి పండితుడు వ్యథ చెందడు.** ప్రారబ్ధవశాన మనుష్యునికి కోరిన వస్తువు లభించవచ్చు. లభించకపోవచ్చు. అది ప్రాప్తించినా, ప్రాప్తించకపోయినా ఏ పరిస్థితిలోనయినా జ్ఞాని అయినవాడు ఎప్పడూ వ్యథచెందడు.' ధృతరాష్ట్రుడు అన్నాడు - 'సంజయా! నాకు ఇంతకంటే అధికమయిన వ్యథ ఏదీ కలగదు. 'కావలసినది అంతా దైవ నిర్ణయ ప్రకారమే జరుగుతుంది.' అని ఇంతకుముందు నుంచీ నాకు గల నమ్మకం. కాబట్టి యథేచ్ఛగా చెప్పు.'

3. కర్ణయుద్ధము, కర్ణవధాదుల సంక్షిప్త వర్ణనము.

సంజయుడు చెప్పాడు - మహారాజా! గొప్ప విలుకా డయిన ద్రోణుడు చనిపోతే మహారథు లయిన నీ పుత్రులు విషాదంలో మునిగి అచేతను లయ్యారు. వారి ముఖాల్లో అశాంతి కన్పించింది. వారందరు శోకార్తులయి, తలలు వంచి, కనులు మూసుకొని, పరస్పరం మాట్లాడుకొనక మౌనంగా ఉన్నారు. వ్యథచెందుతున్నవారిని చూసి, నీ సైన్యాలు దుఃఖంతో భీతిచెంది బ్రాన్పడి పైకి చూడసాగారు. యుద్ధంలో ద్రోణుడు హతుడు కావటం చూసిన వారి చేతుల్లోని రక్తసిక్తాలయిన ఆయుధాలు జారిపోయాయి. నడుములు మొదలయిన చోట కట్టుకున్నవి, వ్రేలాడుతున్న ఆయుధాలు క్రిందపడుతుంటే ఆకాశంనుంచి పడుతున్న నక్షత్రాలులాగా ఉన్నాయి. మహారాజా! ఆ రీతిగా అచేతనమయి, నిశ్చలంగా ఉన్న నీ సైన్యాన్ని చూసి, దుర్యోధనుడు ఇలా అన్నాడు.

"మీ బాహుబలాన్ని గట్టిగా నమ్మి ఆశ్రయించి పాండవులను యుద్ధానికి పిలిచాను. అందువల్ల ఈ యుద్ధం జరిగింది. అలాంటి ఈ సైన్యం ద్రోణుడు చనిపోతే

విషాదం పొందినట్లు కన్పిస్తున్నది. సమరాంగణంలో యుద్ధం చేస్తున్న వీరులు అందరూ శత్రువుల చేతిలో చనిపోతారు. యుద్ధభూమిలో పోరాడే వానికి విజయమో, వీర స్వర్గమో కలుగుతుంది. ఇందులో విచిత్రం ఏముంది? కాబట్టి మీరు సర్వసన్నద్ధులయి యుద్ధం చేయండి. మహాధనుర్ధరుడు, మహాత్ముడయిన కర్ణుడు దివ్యాస్త్రాలతో యుద్ధభూమిలో ఎలా సంచరిస్తున్నాడో చూడండి. ఆ కర్ణునికి భయపడి మందమతి, కుంతీపుత్రుడయిన అర్జునుడు సింహాన్ని చూసిన చిన్న జంతువులాగా యుద్ధంలో విముఖు డవుతాడు. పదివేల ఏనుగులతో సమాన బలంగల భీమసేనుని ఆయన మానవ యుద్ధంతోనే దురవస్థపాలు చేశాడు. దివ్యాస్త్రాలు తెలిసినవీరుడు, మాయావి, భయంకరంగా గర్జించే ఘటోత్కచుని అమోఘమయిన శక్త్యాయుధంతో యుద్ధరంగంలో ఆయన సంహరించాడు. సత్యసంధుడు, ధీమంతుడు, అడ్డుకొనవీలుగాని పరాక్రమం గల ఆ కర్ణుని అక్షయ మయిన బాహుబల సంపదను ఇవ్వాళ యుద్ధంలో చూడండి. ఇంద్రోపేంద్రుల వంటి అశ్వత్థామ, కర్ణులు ఇద్దరి వీరవిజృంభణాన్ని ఆ పాండవులు చూస్తారు. వీరు లయిన మీ అందరిలో ప్రతి ఒక్కరు పాండవులను సైన్యంతో సహా సంహరించగలరు. బలవంతులు, అస్త్రవిద్యావేత్తలు అయిన మీరు అందరూ ఏకమయితే ఇక చెప్పేది ఏముంది? కాబట్టి మీరు పరస్పరం మీ పురుషకారాన్ని చూసుకోండి.'

సంజయుడు చెప్పాడు - అనఘా! ఈ రీతిగా చెప్పి దుర్యోధనుడు సోదరులతో కూడా కలిసి కర్ణుని సేనాపతిని చేశాడు. రాజా! కర్ణుడు సేనాపతి అయి, పెద్దగా సింహనాదం చేసి, యుద్ధోత్సాహంతో యుద్ధం చేశాడు. ఆర్యా! ఆయన సృంజయులు, పాంచాలురు, కేకయులు, విదేహులు - అందరిని ఎదిరించి మహాయుద్ధం చేశాడు. ఆయన ధనుస్సు నుంచి ఒక బాణం మొదలు ఇంకొక బాణం చివరను అతుకుకొన్నట్లుగా వందల కొలది బాణధారలు తుమ్మెదల బారుల వలె బయలుదేరాయి. పాంచాలురను, పాండవులను తీవ్రంగా పీడించి, వేలకొలది యోధులను సంహరించిన ఆ కర్ణుని అర్జునుడు కూల్చివేశాడు.

4. ధృతరాష్ట్రుడు దుఃఖించుట, స్త్రీల ఆకులపాటు.

మహారాజా! ఇది విని, ధృతరాష్ట్రుడు ఇప్పుడు దుర్యోధనుడు కూడా హతుడయినట్లే అని తలంచాడు. ఆయనకు అపార దుఃఖం కలిగింది. ఆయన అచేతనమయిన ఏనుగువలె వ్యాకులుడయి నేలమీద పడ్డాడు. ఆయన వ్యాకులత్వంతో నేలబడితే స్త్రీల ఆర్తనాదం తీవ్రం అయింది. ఆ ధ్వని అంతఃపుర భూభాగం అంతటా నిండింది. దుఃఖసముద్రంలో

మునిగిపోయిన భరతవంశీయ స్త్రీలు మనస్సు ఎక్కువగా ఉద్వేగాన్ని పొందగా దుఃఖశోకార్తులయి విలపించారు. భరతశ్రేష్ఠా! గాంధారి రాజు వద్దకు వచ్చి స్మృతి తప్పి, నేలమీద పడిపోయింది. అంతఃపుర స్త్రీల అందరి స్థితి ఇలాగే అయింది. ఎక్కువగా కన్నీరు కారుస్తూ స్మృతి తప్పుతూ దుఃఖితులయిన వారిని అందరినీ సంజయుడు ఓదార్చాడు. కొంత తెప్పరిల్లినవారు అందరు గాలి బాగా వీస్తుంటే అరటిచెట్ల వలె మాటిమాటికి వణికిపోతూ ఉన్నారు. తెలివియే చూపుగా గల ఆ కురువంశీయుని విదురుడు మొగం మీద నీళ్ళు చల్లి ఓదార్చాడు. ఆ రాజు మెల్లమెల్లగా తేరుకొని, అంతఃపుర స్త్రీలు అందరు అక్కడికి వచ్చారని తెలుసుకొని, పిచ్చివాడి లాగా మౌనంగా ఉన్నాడు. తరువాత చాలాసేపు చింతిల్లుతూ, మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ, ఆయన తన పుత్రులను నిందించాడు. పాండవులను మెచ్చుకొన్నాడు. ఆయన తన తెలివిని, శకుని ఆలోచనను నిందిస్తూ, మాటిమాటికి వణికిపోతూ, చాలాసేపు ఆలోచనలో పడ్డాడు. ఆ రాజు మనస్సు పదిలం చేసుకొని, దిటవు తెచ్చుకొని, గవల్గణుని కుమారుడు, సూతుడు అయిన సంజయుని మళ్ళీ ఇలా అడిగాడు. 'సంజయా ! ఇంతకుముందు నీవు చెప్పినది అంతా విన్నాను. నిరంతరం జయం కోరే నా పుత్రుడు దుర్యోధనుడు జయం కలగదనే నిరాశతో మరణించలేదు గదా! సంజయా! ఇంతకుముందు చెప్పిందే అయినా ఆ వృత్తాంతాన్ని మళ్ళీ చెప్పవలసింది.' జనమేజయా ! ఇలా అడగగా సంజయుడు ఇలా చెప్పాడు. 'రాజా! కర్ణుడు పుత్రులతో, ప్రాణాలనిచ్చే సోదరులతో సహా హతుడయినాడు. భీమసేనుడు దుఃశాసనుని యుద్ధంలో చంపాడు. ఆయన రక్తం కోపంతో త్రాగాడు.'

5. సంజయుడు ధృతరాష్ట్రునకు కౌరవపక్షమున మృత వీరుల గూర్చి చెప్పుట.

వైశంపాయనుడు చెప్పాడు – మహారాజా! ఈ విషయం విన్న ధృతరాష్ట్రుడు శోకమగ్నమానసు డయి సంజయునితో ఇలా అన్నాడు. 'నాయనా! అల్పాయువయిన నాకుమారుడు చేసిన అన్యాయం వల్ల కర్ణుడు హతుడయినాడని విన్నందువల్ల గలిగిన శోకం నా మర్మస్థానాలను కోసివేస్తున్నది. దుఃఖసముద్రంతీరాన్ని చేరదలచుకొన్న నా సంశయం పోగొట్టు. కౌరవులలో, సృంజయులలో ఎవరు బ్రతికి ఉన్నారు? ఎవరు మరణించారు?'

సంజయుడు చెప్పాడు – 'రాజా! ప్రతాపవంతుడు తేరిపార జూడరాని భీష్ముడు

పదిరోజులు యుద్ధం చేసి, పాండవ పక్షంలోని పదికోట్లమంది యోధులను సంహరించి, హతుడైనాడు. తరువాత మహారథుడు, హిరణ్యరథుడు అయిన ద్రోణుడు పాంచాలుర రథ సమూహాలను నాశనం చేసి, హతు డయ్యాడు. భీష్మద్రోణులు సంహరించగా మిగిలిన సైన్యంలో సగం కర్ణుడు చంపి, హతుడయ్యాడు. రాజపుత్రుడయిన వివింశతి వందల కొలది ఆనర్తదేశీయ యోధులను యుద్ధంలో సంహరించి, హతుడయ్యాడు. వికర్ణుడు క్షత్రియ నియమాన్ని స్మరిస్తూ వాహనం, ఆయుధాలు నశించగా శత్రువులకు ఎదురుగా నిలిచాడు. దుర్యోధనుడు చేసిన భయంకరమయిన అనేక క్లేశాలను, ప్రతిజ్ఞను గుర్తుకు తెచ్చుకొన్న భీమసేనుని చేత హతుడయ్యాడు. మహారథులు, అవంతీ దేశాధీశులయిన విందానువిందులు చాలా కష్టమయిన వీరకృత్యం చేసి, యమలోకానికి వెళ్ళారు. సింధు దేశాదు లయిన పదిదేశాలు తన వశంలో గల వీరుడు - సైంధవుడు పదునయిన బాణాలతో పదకొండు అక్షౌహిణులను జయించిన అర్జునునిచేత హతు డయ్యాడు. అలాగే వేగవంతు డయిన దుర్యోధనుని పుత్రుడు తండ్రి అదుపు ఆజ్ఞలలో ఉండి, అభిమన్యుని చేత హతుడైనాడు. అలాగే దుఃశాసన సుతుడు ద్రౌపదీపుత్రునితో యుద్ధం చేసి, యమలోకానికి పోయాడు. సముద్ర తీరంలో ఉండే కిరాతులకు ప్రభువు, ఇంద్రుని గౌరవాదరాలు పొందిన క్షత్రియధర్మాసక్తుడు అయిన భగదత్తుని అర్జునుడు పరాక్రమించి, యమలోకానికి పంపాడు. రాజా! అలాగే కౌరవ వంశీయుడు, గొప్ప కీర్తి గలవాడు అయిన భూరిశ్రవుడు ఆయుధాన్ని వదలివేయగా, యుద్ధరంగంలో సాత్యకి ఆయనను వధించాడు. క్షత్రియులలో శ్రేష్ఠుడు, అంబష్ఠ దేశాధిపతి అయిన శ్రుతాయువు యుద్ధభూమిలో నిర్భయంగా విహరిస్తుంటే అర్జునుడు ఆయనను సంహరించాడు.

మహారాజా! నిరంతరం కోపశీలుడు, అస్త్రవిద్యావిశారదుడు, యుద్ధోన్మత్తుడు, నీ పుత్రు డయిన దుఃశాసనుని భీమసేనుడు సంహరించాడు. అనేకవేల అద్భుతమయిన గజసేనలు గల సుదర్శనుని యుద్ధరంగంలో అర్జునుడు నేల గూల్చాడు. కోసల దేశాధిపతి శత్రువులకు ఆదరణీయులయిన వీరులను సంహరించి, పరాక్రమించిన అభిమన్యుని చేత హతుడయ్యాడు. శత్రువుల భయం పెంపొందించేవాడు, సుందరుడు అయిన మద్ర రాజపుత్రుడు కత్తి, డాలులను పట్టుకొని పలుమారులు భీమునితో యుద్ధం చేసి, చివరకు అభిమన్యుని చేతిలో మరణించాడు. మహాతేజస్వి, వేగంగా అస్త్రప్రయోగం చేసేవాడు, దృఢమయిన పరాక్రమం గలవాడు, యుద్ధరంగంలో కర్ణునితో సమానుడు అయిన వృషసేనుని; అభిమన్యుని వధను విని, ప్రతిజ్ఞ చేసిన అర్జునుడు పరాక్రమించి

కర్ణుడు చూస్తుండగానే యమలోకానికి పంపాడు. నిత్యమూ పాండవులతో వైరం పెట్టుకున్న రాజు శ్రుతాయువుకు అర్జునుడు ఆ వైరాన్ని గుర్తుచేసి సంహరించాడు. రాజా! తనమేనమామ కొడుకు, పరాక్రమం చేసేవాడు, శల్యపుత్రు డయిన రుక్మరథుని యుద్ధంలో సహదేవుడు సంహరించాడు. వృద్ధరా జయిన భగీరథుడు, కేకయ రాజయిన బృహత్ క్షత్రుడు అనే మహావీరులు యుద్ధంలో విజృంభిస్తూ హతులయ్యారు. రాజా! గొప్ప విద్వాంసుడు, మహాబలుడు అయిన భగదత్తపుత్రుని యుద్ధరంగంలో డేగలాగా సంచరిస్తూ నకులుడు కూల్చాడు. మహా బలపరాక్రమాలు కలవాడు, మీ తాత అయిన బాహ్లికుని బాహ్లికులతో కలిపి భీమసేనుడు సంహరించాడు. రాజా! అలాగే మహాబలుడు, మగధదేశీయుడు, జరాసంధుని కుమారుడు అయిన జయత్సేనుని మహాత్ము డయిన అభిమన్యుడు సంహరించాడు.

రాజా! శూరులం అని అనుకొనే నీ పుత్రులు, మహారథులు అయిన దుర్ముఖ దుస్సహులను భీమసేనుడు గదాఘాతాలతో చంపాడు. దుర్మర్షణుడు, దుర్విషహుడు, దుర్జయుడు వారి కర్తవ్యాలను బాగా చేసి, యమలోకానికి వెళ్ళారు. యుద్ధోత్సాహపూర్ణులు, సోదరులు అయిన కళింగ వృషకులు అసామాన్య వీర కృత్యాలు చేసి, యమ నివాసానికి వెళ్ళారు. నీ సచివు డయిన వృషకర్ముని భీముడు పరాక్రమించి, యమలోకానికి పంపాడు. అలాగే పదివేల ఏనుగుల బలం గల పౌరవ రాజును యుద్ధంలో అర్జునుడు పరిమార్చాడు. మహారాజా! శత్రువులను కొట్టటంలో కుశలులు అయిన రెండు వేలమంది వసాతులు, శూరసేనులు అందరూ యుద్ధంలో హతు లయ్యారు. అమితమయిన యుద్ధోత్సాహం కలవారు, కవచధారులు అయిన ఆభీషాహులు, ఉత్తమ రథికులయిన శిబులు అందరూ కాళింగులతో సహా హతు లయినారు. గోకులంలో నిత్యం పెరిగినవారు, తీవ్రకోపనులు యుద్ధంలో వెనుకడుగు వేయనివారు అయిన గోపాలురను అర్జునుడు సంహరించాడు. సంశప్తక గణంలో వేలకొలది శ్రేణులు ఉన్నాయి. వారందరూ అర్జునుని ఎదిరించి, యమలోకానికి వెళ్ళారు. మహారాజా! నీ బావమరదులు వృషకాచలులు అనే ఇద్దరు రాజులు నీ కోసమని పరాక్రమించి, అర్జునునిచే హతులయ్యారు. పేరుతో పనులతో భీకర కర్మలు ఆచరించే శాల్వరాజును భీమసేనుడు పడగొట్టాడు.

మహారాజా ! ఓఘవంతుడు, బృహంతుడు మిత్రునికి తోడు అయ్యేవారు. వారు ఇద్దరు కలిసి పరాక్రమిస్తూ, యమలోకానికి వెళ్ళారు. నరపతీ! అదే రీతిగా రథికశ్రేష్ఠుడయిన క్షేమధూర్తిని భీమసేనుడు యుద్ధంలో గదాఘాతంతో సంహరించాడు. జలసంధుడు మహత్తర యుద్ధం చేసి, రణంలో సాత్యకి చేత హతుడయ్యాడు. గాడిదలను

పూన్చిన రథంగల రాక్షసశ్రేష్ఠ డయిన అలంబుషుని ఘటోత్కచుడు పరాక్రమించి, యమలోకానికి పంపాడు. కర్ణుడు, ఆయన సోదరులు, కేకయులు అందరూ అర్జునునిచే హతు లయ్యారు. మాళవులు, మద్రకులు, భయంకరకార్యాలు చేసే ద్రావిడులు, యౌధేయులు, లలిత్థలు, క్షుద్రకులు, ఉశీనరులు, మావేల్లకులు, తుండికేరులు, సావిత్రీ పుత్రకులు తూర్పు, ఉత్తరం, పడమర, దక్షిణం దిక్కులలోని వీరులు, వారి పదాతి దళాల సమూహాలు, పదిలక్షల గుర్రాలు, రథసమూహాలు, శ్రేష్ఠమయిన ఏనుగులు హత మయినాయి. రాజా! అన్ని విద్యలలో నేర్పరు లయిన వారి వద్ద పెరిగినవారు, ధ్వజాలతో, ఆయుధాలతో గూడినవారు, కవచాలు, ఉత్తమవస్త్రాభరణాలు దాల్చిన శూరులు అనాయాసంగా యుద్ధం చేసే అర్జునునిచేత హతులయ్యారు. ఆ విధంగానే మహాబల సంపన్నులు, పరస్పరం జయింప కోరికగల ఇంకా అనేకరాజులు సేనా సమూహాలతో వేలకొలది చనిపోయారు. మీరు అడిగిన దానికి ఇది సమాధానం. మహేంద్రుడు వృత్రాసురుని, శ్రీరాముడు రావణుని, శ్రీకృష్ణుడు నరకాసురుని, భార్గవరాముడు కార్తవీర్యార్జునుని, కుమారస్వామి మహిషాసురుని, రుద్రుడు అంధకుని సంహరించినట్లుగా కర్ణుని జ్ఞాతులతో బంధువులతో, అమాత్యులతో సహా అర్జునుడు చంపాడు. రాజా! కౌరవులకు జయాశను కురుపాండవ వైరానికి మూలాన్ని అర్జునుడు దాటాడు. రాజా! ఈ విషయం బంధువులు, హితం కోరేవారు చెప్పిన దాన్ని నీవు ఇంతకుముందు తెలుసుకోలేకపోయావు. అందువల్లనే ఇప్పుడు ఈ మహత్తరమయిన సంకటస్థితి వచ్చి పడింది. రాజా! రాజ్యకాంక్షగల పుత్రుల మేలు కోరే నీవు కీడులనే పోగుచేసుకొన్నావు. వాటికి ఫలం ఇప్పుడు కలిగింది.

6. కౌరవులు సంహరించిన పాండవ వీరులు.

ధృతరాష్ట్రుడు అడిగాడు – 'నాయనా! పాండవులు యుద్ధంలో చంపిన మావారిని గూర్చి చెప్పావు. మా వాళ్ళు చంపిన పాండవ పక్షీయులను గూర్చి చెప్పవలసింది.' సంజయుడు చెప్పాడు – 'మహా పరాక్రమం, మహాబలం గల్గి పరాక్రమించిన కుంతిభోజ దేశవీరులను బంధువులతో, మంత్రులతో కూడా భీష్ముడు నేలగూల్చాడు. పాండవుల యందు ప్రేమాదరాలు గల నారాయణులు, బలభద్రులు అనే వందలకొలది శత్రుశూరులను వీరుడయిన భీష్ముడు యుద్ధంలో సంహరించాడు. అర్జునునితో సమానుడయిన సత్యజిత్తును ద్రోణుడు యుద్ధంలో సంహరించాడు. పాంచాలురలో యుద్ధవిద్యా విశారదులు, గొప్ప విలుకాండ్రు అయిన వారు అందరు ద్రోణుని ఎదుర్కొని, యమనివాసానికి వెళ్ళారు.

అలాగే వృద్ధులయిన విరాట ద్రుపదులు కుమారులతో గూడా మిత్రులకోసం పరాక్రమించి, యుద్ధంలో ద్రోణుని చేత హతులయ్యారు. శ్రీకృష్ణ బలరాములతో, అర్జునునితో సమానుడని ప్రసిద్ధుడు, రధయుద్ధంలో నేర్పరి అయిన అభిమన్యుడు శత్రువులను సంహరించాడు. అర్జునుని లొంగదీసుకోలేని మీ పక్షంలోని ఆరుగురు మహారథులు నాలుగు దిక్కుల నుండి చుట్టుముట్టి అర్జునపుత్రుని మట్టుపెట్టారు. వారి చేతిలో విరథుడయి క్షత్రియ ధర్మంలో ఉన్న అభిమన్యుని దుఃశాసన పుత్రుడు యుద్ధంలో సంహరించాడు.

మహత్తరసేనతో గూడిన అంబష్ఠుని కుమారుడు మిత్రులకోసం పరాక్రమిస్తూ, దుర్యోధన పుత్రుడైన లక్ష్మణుని ఎదిరించి, గొప్ప యుద్ధంచేసి, యమసదనం చేరాడు. అస్త్రవిద్యా నిపుణుడు అయిన బృహంతుని దుఃశాసనుడు పరాక్రమించి, యమలోకానికి పంపాడు. యుద్ధమదమత్తులయిన మణిమంతుడు, దండధారుడు అనే రాజులు మిత్రులకోసం పరాక్రమిస్తూ, యుద్ధభూమిలో ద్రోణునిచేతిలో హతు లయ్యారు. మహారథు డయిన అంశుమంతు డనే భోజదేశీయరాజును ద్రోణుడు పరాక్రమించి, యమలోకానికి పంపాడు. భారతా! సముద్రతట ప్రాంత పరిపాలకుని పుత్రునితో గూడా సముద్రసేనుడు బలవంతంగా యమనిలయానికి పంపాడు. సముద్ర తీరవాసి అయిన నలుని అశ్వత్థామ, వ్యాఘ్రదత్తుని వికర్ణుడు యమనివాసానికి పంపారు. విచిత్రంగా యుద్ధం చేసే చిత్రాయుధుడు తీవ్రయుద్ధం చేసి, చిత్రమైన రీతిగా పరాక్రమించి, వికర్ణుని చేతిలో యుద్ధంలో హతు డయ్యాడు. కేకయదేశయోధులతో గూడిన కేకయరాజు యుద్ధంలో భీమునితో సమానుడు. ఆయన పరాక్రమించి, తన సోదరుడయిన కేకయుని చేత హతుడయ్యాడు. వ్రతాపవంతుడు, గదాయుద్ధ నిపుణుడు, పర్వత దేశీయు డయిన జనమేజయుని నీ పుత్రుడయిన దుర్ముఖుడు కూల్చాడు. రాజా! గ్రహోలవళె వెలుగొందే నరశ్రేష్ఠులయిన రోచమాను లనే వీరులను ద్రోణుడు బాణాలతో వీరస్వర్గానికి పంపాడు. నరపాలా! ఇంకా అనేకమంది రాజులు పరాక్రమించి, తమ శత్రువులతో యుద్ధం చేస్తూ, అతికష్టమయిన సంహార కార్యాన్ని చేస్తూ, యమ లోకానికి వెళ్ళారు. అర్జునునికి మేనమామలయిన పురుజిత్తు, కుంతి భోజులు ద్రోణుని బాణాలచేత యుద్ధవిజేతలు పొందే లోకాలకు పంపబడ్డారు.

కాశిరాజయిన అభిభువును అనేకమంది కాశి దేశయోధులు చుట్టుముట్టి ఉన్నారు. వసుదానుని పుత్రుడు వారందరిచేత యుద్ధరంగంలో శరీర త్యాగం చేయించాడు. అమితౌజుడు, యుధామన్యుడు, పరాక్రమవంతుడయిన ఉత్తమౌజుడు వందలకొలది శూరులను సంహరించి, మన వారిచేత హతులయినారు. భారతా! పాంచాలయోధు డయిన మిత్రవర్మ,

క్షత్రధర్ముడు అనే మహాధానుష్కులను ద్రోణుడు యమలోకానికి పంపాడు. రాజా! యుద్ధంలో యుద్ధవీరులకు అధిపతి, శిఖండి పుత్రు డయిన క్షత్రదేవుని నీ మనుమడయిన లక్ష్మణుడు సంహరించాడు. సుచిత్రుడు, చిత్రుడు అనే మహారథు లయిన తండ్రీ కొడుకులు మహావీరులు. వారు యుద్ధభూమిలో వీరవిహారం చేస్తుండగా ద్రోణుడు సంహరించాడు. మహారాజా! పూర్ణిమాదులయిన పర్వదినాలలో సముద్రం వలె విజృంభించిన వృద్ధక్షేముని పుత్రుడు ఆయుధాలు నష్టంకాగా మృత్యువును పొందాడు. గొప్పవాడయిన సేనా బిందువు శత్రువులను యుద్ధంలో సంహరిస్తూ కౌరవ శ్రేష్ఠుడయిన బాహ్లికుని చేత హతు డయ్యాడు. చేదివీరులలో రథికశ్రేష్ఠ డయిన ధృష్టకేతువు దుష్కర యుద్ధంచేసి, యమలోకానికి వెళ్ళాడు. అలాగే వీరు డయిన సత్యధృతి యుద్ధభూమిలో మహా యుద్ధం చేసి, పాండవుల కోసం పరాక్రమించి యమలోకానికి చేరాడు. కురువంశీయశ్రేష్ఠా! సేనాబిందువు యుద్ధభూమిలో యుద్ధం చేసి మరణించాడు. శిశుపాలపుత్రు డయిన సుకేతువు అనే రాజు యుద్ధంలో శత్రువులను చంపి, ద్రోణునిచేత నిహతు డయ్యాడు. అలాగే వీరు డయిన సత్యధృతి, బలిష్ఠ డయిన మదిరాశ్వుడు, పరాక్రమించిన సూర్యదత్తుడు ద్రోణుని బాణాలచేత నిహతు లయ్యారు. శ్రేణిమంతుడు యుద్ధంచేస్తూ దుష్కరకృత్యం చేసి, యమనివాసానికి వెళ్ళాడు. అలాగే పరమాస్త్రవేత్త, మగధరాజు యుద్ధంలో పరాక్రమించి, భీష్ముని చేత హతు డయ్యాడు. విరాట పుత్రు డయిన శంఖుడు, మహారథు డయిన ఉత్తరుడు మహత్తర వీరకార్యం చేస్తూ, యమలోకం చేరారు. వసుదానుడు యుద్ధభూమిలో తీవ్రంగా పోరాడుతూ పరాక్రమించిన ద్రోణుని చేత యమలోకానికి పంపబడ్డాడు.

బలవంతుడు, బాహుబలశోభితుడు అయిన పాండ్యరాజు పరాక్రమించి, అశ్వత్థామచేత హతుడయి యమలోకానికి చేరాడు.

వీరేకాక ఇతర మహారథులు అనేకులు ద్రోణుని చేతిలో మరణించారు.

7. కౌరవ పక్షమున సజీవులను గూర్చి చెప్పుట, ధృతరాష్ట్రుని మూర్ఛ.

ధృతరాష్ట్రుడు అన్నాడు – 'సంజయా! నా పక్షానికి ముఖ్యులయిన భీష్మద్రోణ కర్ణులు మరణించగా మా సేనల ఉత్సాహం మందగించి ఉంటుంది. మిగిలినవారు బ్రతుకుతారని అనిపించదు. మహాధానుష్కులు, కురు వీరశ్రేష్ఠ లయిన భీష్మద్రోణులు మాకోసం హతులయినారని విన్న నా జీవితం నిష్ప్రయోజనం. వేయి యేనుగుల బాహుబలం గలవాడు, యుద్ధాలంకార మయిన రాధేయుడు హతు డయినా డంటే సహించలేకపోతున్నాను. సంజయా ! నా సైన్యంలోని శ్రేష్ఠులయినవారు మరణించారని చెప్పావు. ఇంకా నా పక్షంలో

ఎవరు జీవించి ఉన్నారో చెప్పు. ముఖ్యులయిన వీరులందరూ మరణించారని నీవు చెప్పావు. ఇంకా బ్రతికి ఉన్నవారు గూడా మరణించినట్లే అని నేను అనుకొంటాను.' సంజయుడు చెప్పాడు - మహారథుడు, సఫల ప్రయత్నుడు, వేగంగా చేతులు కదల్చగలవాడు, దృఢమయిన ఆయుధాలు, గట్టి పిడికిలి పట్టు, దృఢమయిన బాణాలు గల, బలవంతుడు, వేగవంతుడు, ద్రోణపుత్రు డయిన అశ్వత్థామ మీకోసం యుద్ధం చేయటానికి నిలిచి ఉన్నాడు. ద్విజశ్రేష్ఠుడయిన ద్రోణుడు ఆయనకు అద్భుతాలు, కాంతిమంతాలు అయిన చతుర్విధ దివ్య మహాస్త్రాలను ప్రసాదించాడు. ఆనర్తదేశంలో ఉండేవాడు, హృదికుని పుత్రుడు, మహారథుడు, సాత్వతవంశశ్రేష్ఠుడు, హస్తనైపుణ్యం గలవాడు, భోజవంశీయు డయిన కృతవర్మ మీకై యుద్ధం చేయగోరి ఉన్నాడు.

యుద్ధంలో కంపింపజేయ వీలుగానివాడు, మీ సేనానాయకులలో మొదటివాడు, తన మాటను నిలుపుకోవటానికి మేనల్లుళ్ళు అయిన పాండవులను వదలి నీ పక్షంలోకి వచ్చినవాడు, యుధిష్ఠిరునికి యుద్ధంలో కర్ణుని తేజోవధ చేస్తానని మాట ఇచ్చినవాడు, బలవంతుడు, దురాధర్షుడు, ఇంద్రునితో సమాన పరాక్రమం గలవాడు, ఋతాయన రాజపుత్రుడు అయిన శల్యుడు నీ కోసం యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నాడు. ఉత్తమజాతిలో పుట్టినవి, సింధుదేశీయాలు, పర్వతప్రాంత జాతులు, సముద్ర జాతులు, కాంబోజులు , వనాయుదేశ జాతులు అయిన అశ్వబలంతో గూడి గాంధారరాజు శకుని తన సైన్యంతో వేగవంతు డయి యుద్ధం చేయ సిద్ధంగా ఉన్నాడు. రాజా! మహాబాహువు, చిత్రంగా అస్త్రయుద్ధం చేసేవాడు, శరద్వంతుని కుమారుడు అయిన కృపాచార్యుడు మిక్కిలి బరువయి, చిత్ర మయిన ధనుస్సును చేతబట్టి, యుద్ధానికి నిలిచి ఉన్నాడు. కురుశ్రేష్ఠా! మహారథు డయిన కేకయ రాజకుమారుడు చక్కని అశ్వాలు కట్టిన జెండాగల రథం ఎక్కి, నీకోసం యుద్ధం చేయగోరి, నిలిచి ఉన్నాడు. అలాగే కురువంశశ్రేష్ఠుడు, నీ పుత్రుడు అయిన పురుమిత్రుడు మండుతున్న సూర్యుని రంగుగల రథం ఎక్కి, మేఘాలులేని ఆకాశంలో ప్రకాశించే సూర్యుని లాగా నిలిచి ఉన్నాడు.

గజ సమూహం మధ్యలో ఉన్న సింహం వలె విరాజిల్లుతున్న దుర్యోధనుడు బంగారంతొడుగుతో అలంకృతమయిన రథంమీద యుద్ధం చేయదలచి నిలిచి ఉన్నాడు. పురుషశ్రేష్ఠుడు, పద్మంవంటి కాంతి కలవాడు, సువర్ణనిర్మితమయిన చిత్ర కవచం దాల్చిన దుర్యోధనుడు స్వల్ప ధూమం గల అగ్ని వలె రాజుల మధ్యలో మేఘాల మధ్య అల్పప్రకాశం గల సూర్యునివలె విరాజిల్లాడు. డాలు, ఖడ్గాలను చేత దాల్చి, నీ సుతుడయిన సుషేణుడు,

వీరుడయిన సత్యజిత్తు చిత్రసేనుడు కూడా యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నారు. లజ్జాశీలుడు, భయంకరాయుధధారి, శీఘ్రభోజుడు, సుందరుడు, జరాసంధ పుత్రులలో పెద్దవాడు అయిన అదృఢుడు; చిత్రాయుధుడు, శ్రుతవర్మ, జయుడు, శలుడు, సత్యవ్రత దుశ్శలులు అనే నరశ్రేష్ఠులు సైన్యాలతో గూడా యుద్ధసన్నద్ధులయి ఉన్నారు. ప్రతి యుద్ధంలోనూ శత్రుసంహారం చేసేవాడు, తనను తాను శూరునిగా తలచేవాడు, జూదగాళ్ళకు అధిపతి అయిన రాజపుత్రుడు రథాలతో, గుర్రాలతో, ఏనుగులతో, పదాతులతో వచ్చి నీకోసం యుద్ధం చేయగోరి ఉన్నాడు. శ్రుతాయువు, ధృతాయుధుడు, చిత్రాంగదుడు, చిత్రసేనుడు అనే నరశ్రేష్ఠులు, ప్రహారశీలులు, అభిమాన వంతులు, ఆడినమాట తప్పనివారు యుద్ధం చేయగోరి ఉన్నారు. మహాత్ముడు, కర్ణపుత్రుడయిన సత్యసంధుడు యుద్ధంలో పోరాడగోరి ఉన్నాడు. ఆలాగే హస్తవేగం శ్రేష్ఠమయిన అస్త్రాలు గల ఇంకా ఇద్దరు కర్ణపుత్రులు అల్పధైర్యంతో ఛేదించలేని సేనను ఆశ్రయించి, నీకోసం యుద్ధంచేస్తూ ఉన్నారు. రాజా! ముఖ్యులయిన వీరితో, అమితమయిన ప్రభావం గల ఇంకా కొంతమంది యోధశ్రేష్ఠులతో దుర్యోధనుడు ఏనుగుల సమూహం మధ్య మహేంద్రుని వలె జయకాంక్షతో నిలిచాడు.

ధృతరాష్ట్రుడు అన్నాడు - సంజయా! మా పక్షంలో జీవించి ఉన్నవారిని గూర్చి, మరణించిన వారి గూర్చి ఉన్నది ఉన్నట్లు చెప్పావు. దీనివల్ల ముందు కలుగబోయే పరిణామాన్ని అర్థాపత్తి ప్రమాణంతో నేను స్పష్టంగా తెలుసుకొంటున్నాను. (నా పక్షపరాజయం నిశ్చితం) వైశంపాయనుడు చెప్పాడు - రాజా! ధృతరాష్ట్రుడు తన సైన్యంలో శ్రేష్ఠవీరుల మరణం, విధ్వంసం, కొద్దిమంది మాత్రమే మిగిలి ఉండటం విని, శోకంతో ఇంద్రియాలు అన్నీ వికలం కాగా, ఇలా అంటూనే మోహం పొందాడు. మోహం పొందుతూనే 'సంజయా! కొద్దిసేపు ఆగు నాయనా! నా మనస్సు ఈ అప్రియవాక్యాలు విని, చాలా వ్యాకులం అయింది. మనస్సు అవయవాలు పట్టుతప్పుతున్నాయి. ఈ మోహాన్ని అదుపుచేయలేకపోతున్నాను' అని అన్నాడు. అంబికాసుతు డయిన ధృతరాష్ట్రుడు అలా చెప్పి చిత్తం విభ్రాంతం కాగా మూర్ఛపోయాడు.

8. ధృతరాష్ట్రుని విలాపము.

జనమేజయుడు అడిగాడు - 'ద్విజశ్రేష్ఠా! ధృతరాష్ట్రుడు యుద్ధంలో కర్ణుడు చనిపోయినాడనీ, పుత్రులు నేలగూలారని విన్న తరువాత కొంచెం తేరుకొని ఏమన్నాడు? పుత్ర మరణం వల్ల ధృతరాష్ట్రునికి మహా దుఃఖం కలిగింది. ఆ సమయంలో ఆయన ఏమన్నాడో నాకు చెప్పవలసింది.' వైశంపాయనుడు చెప్పాడు - 'రాజా! కర్ణుని మరణం

నమ్మదగినది గాలేదు. ఆశ్చర్యకరంగా ఉంది. సర్వప్రాణులకు ఆ భయంకర మరణం సమ్మోహనకరం. మేరుపర్వతం తన స్థానం నుంచి ఇంకొక చోటికి పోయినట్లు, మహామేధావి అయిన పరశురామునికి కలిగిన అనుచితమయిన చిత్తమోహంలాగా, శత్రువులకు భయం కలిగించే ఇంద్రుని పరాజయం వలె, మహాతేజస్వి అయిన సూర్యుడు ఆకాశం నుంచి భూమి మీద పడినట్లు, అక్షయ జలం గల మహాసముద్రం ఊహకందని రీతిగా ఎండిపోయినట్లు, భూమి, ఆకాశం, దిక్కులు, జలం అద్భుతంగా సర్వనాశనం అయినట్లు, పుణ్యపాపకర్మలు రెండూ ఫలరహితాలు అయినట్లు, మహారాజుకు అనిపించింది. 'ఇది ఇలా జరిగి ఉండదు' అని అనుకొన్నాడు. మిగిలిన తమ పక్షంలోని ఇతర ప్రాణులకు కూడా ఇలాగే నాశనం జరుగుతుంది అని శోకాగ్నిదగ్ధుడు అయ్యాడు. ఆయన శరీరం అంతా సడలిపోయింది. దీర్ఘంగా నిట్టూర్పులు విడుస్తూ తీవ్రంగా దుఃఖితుడయి హాహాకారాలు చేస్తూ విలపించాడు.

ధృతరాష్ట్రుడు అన్నాడు – 'సంజయా! కర్ణుడు మహావీరుడు, సింహం ఏనుగుల వలె పరాక్రమవంతుడు, ఎద్దుమూపురం వంటి మూపురాలు గలవాడు, అతని కన్నులు, ఎద్దుకనులవలె ఉంటాయి. నడక గూడా అలాంటిదే. వజ్ర సమానమయిన దృఢదేహుడు. దానవర్షధారలు కురిపించే అతడు వృషభ స్వరూపుడు. మహేంద్రుని వంటి శత్రువు ఎదుర్కొన్నా ఆతడు వెనుదిరగడు. ఆయన అల్లెత్రాటి మ్రోతతో, బాణవర్షధ్వనితో యుద్ధరంగంలో రథాలు, గుర్రాలు, పదాతులు, ఏనుగులు నిలువక పరుగెత్తుతాయి. దుర్యోధనుడు మహాబాహు వయిన కర్ణుని ఆశ్రయించి, శత్రువులను జయించాలనే కోరికతో మహారథులయిన పాండవులతో వైరం పెట్టుకొన్నాడు. సహింపవీలుగాని పరాక్రమం గలవాడు, పురుషశ్రేష్ఠుడు అయిన ఆ కర్ణుని యుద్ధంలో అర్జునుడు ఎదుర్కొని ఎలా సంహరించాడు ? తన బాహుబలంతో గర్వించిన ఆతడు శ్రీకృష్ణుని, అర్జునుని, వృష్ణివంశీయులను, వారితోగూడిన ఇతరులను ఏమాత్రం లెక్కచేసేవాడు కాదు. పరాజయం లేని కృష్ణార్జునులను నేను ఒక్కడినే దివ్యరథం మీదినుంచి యుద్ధరంగంలో నేలగూలుస్తాను అని ఆ కర్ణుడు రాజ్యకాముకుడు, మూర్ఖుడు, లోభమోహితుడై దిగులు పడే దుర్యోధనునికి ఎల్లప్పుడు మెల్లమెల్లగా చెపుతుండేవాడు. ఆ కర్ణుడు పూర్వం కాంబోజులను అందరినీ, అవంతి దేశీయులను కేకయులతో గూడా జయించాడు. గాంధారులను, మద్రకులను, మత్స్యులను, త్రిగర్తులను, తంగణులను, శకులను, పంచాలురను, విదేహులను, కులిందులను, కాశికోసల రాజులను, సుహ్మలను, అంగులను, వంగ రాజులను, నిషాదులను, పుండ్రులను, చీరకులను, వత్సులను, కలింగులను, ఆనర్తులను, అశ్మకులను, ఋషికులను, (శబరులను, పరహూణులను, ప్రహూణులను, సరళులను, మ్లేచ్ఛదేశాధిపులను, దుర్గాలలో, వనాల్లో

ఉండే రాజులను, ఆటవికులను) యుద్ధాలలో జయించి పన్ను చెల్లించేవారిని చేశాడు. బాగా మొనలు తేలినవి. పదునయినవి, గ్రద్ద ఈకలు కల బాణ సమూహంతో శత్రువులను అందరిని జయించి, కప్పాములు, దుర్యోధనుని అభివృద్ధి కోసం రాధేయుడు తెచ్చాడు.

దివ్యాస్త్రవేత్త, పరమాస్త్రాలు తెలిసినవాడు, మహా తేజస్వి, సేనా రక్షకుడు అయిన కర్ణుని పరాక్రమవంతులు, శూరులు అయిన పాండవులు యుద్ధంలో ఎలా సంహరించగలిగారు ? చక్కగా వర్షాలు కురిపిస్తాడు కాబట్టి దేవతలలో ఇంద్రుని వృషుడు అంటారు. అలాగే మానవులలో కర్ణుడు దానశీలి కాబట్టి వృషుడు అంటారు. ఈ ఇద్దరు తప్ప మూడో వాడు ఎవడూ వృషుడు అనబడటం మనం వినలేదు. గుర్రాలలో ఉచ్చైఃశ్రవం శ్రేష్ఠం. రాజులలో కుబేరుడు శ్రేష్ఠుడు. దేవతలలో మహేంద్రుడు శ్రేష్ఠుడు, యుద్ధవీరులలో కర్ణుడు శ్రేష్ఠుడు. సమర్థులు, పరాక్రమవంతులు, శూరులు అయిన రాజులు జయించలేని కర్ణుడు దుర్యోధనుని రాజ్యాభివృద్ధికోసం సమస్త భూమండలం జయించాడు. మగధదేశాధీశుడయిన జరాసంధుడు స్నేహంతో శాంతుడయి కర్ణుని సహాయంతో యాదవులను, కౌరవులను మినహాయించి క్షత్రియులయిన రాజులను అందరిని బంధించాడు. అలాంటి కర్ణుని అర్జునుడు ద్వంద్వ యుద్ధంలో చంపాడు అని విని, నేను నౌక పగిలిపోయినవాడు సముద్రంలో మునిగిపోయినట్లు దుఃఖసముద్రంలో మునిగాను. రథికశ్రేష్ఠుడయిన ఆ కర్ణుడు ద్వైరథం (ఇద్దరు రథికులు పరస్పరం చేసే యుద్ధం)లో నిహతుడయినాడని విని, తెప్పలేనివాడు సముద్రంలో మునిగినట్లు శోకసముద్రంలో మునిగాను. సంజయా! ఇలాంటి దుఃఖంలో గూడా నేను నశించలేదంటే నా హృదయం ఛేదించ వీలులేని వజ్రానికంటే కూడా ఎక్కువ దృఢమయిన దనుకొంటాను. సూతా! జ్ఞాతులు, చుట్టాలు, మిత్రుల పరాభవ వృత్తాంతం విన్న తరువాత నాకంటే ఇతర మానవుడు ఎవడు చావకుండా ఉంటాడు? సంజయా! నేను విషం తిని గాని, అగ్నిలో దూకి గాని, కొండ కొమ్మునుంచి పడి గాని మరణించగోరుతాను. కాని కష్టదాయకమయిన ఈ దుఃఖాలను తట్టుకోలేను.'

9. ధృతరాష్ట్రుడు కర్ణ వధను సవిస్తరముగ చెప్పమని సంజయుని అడుగుట.

సంజయుడు చెప్పాడు - 'రాజా! శోభతో, వంశంతో, కీర్తితో, తపస్సుతో, విద్యతో నిన్ను ఈనాటి విద్వాంసులు యయాతితో సమానునిగా తలుస్తారు. వేదశాస్త్రజ్ఞానంలో నీవు మహర్షితుల్యుడవు. నీ కర్తవ్యాలు అన్నీ నెరవేర్చావు. మనస్సును చిక్కబట్టుకో, దాన్ని

విషాదంలో ముంచి వేయకు.' ధృతరాష్ట్ర డిలా అన్నాడు. 'సాలవృక్షంతో సమానుడయిన కర్ణుడు హతుడయినాడంటే దైవమే గొప్పదని, పురుష ప్రయత్నం నిష్ప్రయోజనం అని అనుకొంటాను. యుధిష్ఠిరుని సైన్యాన్ని, పాంచాలుర రథ సమూహాన్ని బాణవర్షంతో అన్నిదిక్కుల నుండి తహతహలాడించి, ఇంద్రుడు అసురులను వలె కర్ణుడు యుద్ధంలో పాండవులను సమ్మోహితులను చేసి, చివరకు పెద్దగాలి దెబ్బకు కూలిన వృక్షంవలె ఏ రీతిగా పడిపోయాడు? సముద్రానికి అంతం కనిపించనట్లు నాశోకానికి అంతాన్ని చూడలేకపోతున్నాను. చింత నాకు ఎక్కువగా పెరుగుతున్నది. మరణించాలని కోరిక కలుగుతున్నది. సంజయా! కర్ణుని మరణాన్ని, అర్జునుని విజయాన్ని విని కర్ణవధ నమ్మదగినదని నేను అనుకోలేను. కర్ణుని మరణవృత్తాంతం విన్నా గూడా నా హృదయం బ్రద్దలు కాలేదంటే ఇది వజ్రంవలె బలిష్ఠమని ఛేదింపవీలుగానిదనీ తెలుస్తోంది. కర్ణుడు హతుడయినాడని విని, తీవ్రంగా దుఃఖిస్తూ ఉన్న నాకు పూర్వం దేవతలు దీర్ఘాయువును ఇచ్చి ఉంటారు. సంజయా! ఈ నా జీవితం చాలా నింద్యమయింది. సంజయా ! మిత్రహీనుడినయిన నేను ఈనాడు నింద్యమయిన ఈ దుర్దశను అనుభవిస్తున్నాను. ఇపుడు మందబుద్ధినయిన నేను జనులందరి ఎదుట దీనుడ నయి జీవితం గడపాలి. ఇంతకుముందు నేను సమస్త జనుల గౌరవపాత్రుడ నయి ఉండి, ఇప్పుడు శత్రువులు అవమానిస్తుంటే ఎలా జీవించగలను ?

సంజయా! భీష్మద్రోణ కర్ణుల వధవల్ల, ఒక దుఃఖాన్ని మించిన ఇంకొక దుఃఖం కలగటంవల్ల సంకటస్థితిని పొందాను. సంజయా! యుద్ధంలో కర్ణుడు చనిపోవటం వల్ల ఇక మిగిలింది ఏమీ లేదు. నాకు, నా పుత్రులకు ఆతడే ఒడ్డు చేర్చేవాడు అయ్యేవాడు. ఆ శూరుడు అనేక బాణాలను ప్రయోగిస్తూ, యుద్ధంలో హతుడయ్యాడు కదా! ఆ పురుష శ్రేష్ఠుడు లేని నా బ్రతుకుకు అర్థం ఏముంది ? వజ్రాయుధాఘాతం వల్ల చీలిపోయిన శిఖరంవలె కర్ణుడు బాణ పీడితు డయి, రథంమీదినుంచి పడిపోయి ఉంటాడు. మత్తకరీంద్రం కూల్చిన ఏనుగువలె రక్తమోడుతూ, ఆతడు భూమిని అలంకరిస్తూ, భూమిమీద పడుకొని ఉంటాడు. కౌరవులకు బలం, పాండవులకు భయంకరుడు, ధనుర్ధారులకు ఆదర్శం అయిన ఆ కర్ణుని అర్జునుడు హతమార్చాడు. మహాధానుష్కుడు, మిత్రులకు అభయప్రదాత ఆ వీరుడు దేవేంద్రుడు ధ్వంసం చేసిన పర్వతంవలె హతుడయి శయనించాడు. కుంటివాడు త్రోవలో వెళ్ళటం, దరిద్రుని కోరిక తీరటం, దప్పిక గొన్నవానికి నీటిబిందువుతో దప్పి తీరటం కష్టమయినట్లు దుర్యోధనుని ఉద్దేశం నెరవేరటం దూరమయింది. మనం ఒక

రకంగా అవుతుందనుకొన్న పని ఇంకో రకంగా అవుతుంది. ఆహా! దైవం ఎంత బలమయినది? కాలాన్ని అతిక్రమించలేము గదా! సూతా! సంజయా! నా పుత్రుడు దుఃశాసనుడు దీన మనస్కు డయి, పౌరుషహీను డయి పారిపోతూ, హతుడు కాలేదు గదా? వత్సా! యుద్ధంలో దీనునివలె ప్రవర్తించలేదు గదా! ఇతర క్షత్రియశ్రేష్ఠులవలె ఆ శూరుడు నిహతుడు కాలేదా ? 'యుద్ధం చేయవద్దు' అనే యుధిష్ఠిరుని మాటను మూఢు డయిన దుర్యోధనుడు రోగి మేలు కలిగించే ఔషధాన్ని వలె గ్రహించలేదు. అంపశయ్య మీద పడుకున్న మహాత్ముడు భీష్ముడు జలం అడిగితే అర్జునుడు భూమిని భేదిస్తే ఏర్పడిన జలధారను చూసిన ఆ మహాబాహుడు దుర్యోధనునితో 'నాయనా! పాండవులతో సంధి చేసుకో. సంధివల్ల శాంతి కలుగుతుంది. మీ యుద్ధం నాతోనే అంతం అగుగాక. సోదరభావంతో పాండవులతో కలిసి రాజ్యాన్ని అనుభవించు' అని చెప్పాడు. ఆయన చెప్పినట్లు చేయని నా కొడుకు ఇప్పుడు తప్పక విచారపడుతుంటాడు. ముందు చూపు ఉన్న ఆయన మాట ఇప్పుడు సఫలమయి ముందుకు వచ్చింది.

సంజయా! ఆ నాటి జూదంవల్ల అమాత్యులు, పుత్రులు, చనిపోగా నేను ఇప్పుడు రెక్కలు తెగిన పక్షిని అయ్యాను. సంజయా! ఆడుకొనే పిల్లలు ఒక పక్షిని పట్టుకొని దాని రెక్కలు విరిచివేసి, సంతోషంతో వదలివేస్తే ఆ పక్షి రెక్కలు తెగిపోవటం వల్ల నడువలేదు. అలాగే నేను గూడా రెక్కలు తెగిన పక్షిని అయ్యాను. క్షీణించిన వాడిని, సర్వార్థాలు కోల్పోయిన వాడిని, జ్ఞాతులు బంధువులు దూరమయిన వాడిని, దీనుడిని, శత్రువులకు వశమయిన నాకు ఏది దిక్కు అవుతుంది?' వైశంపాయనుడన్నాడు - ఈ రీతిగా దుఃఖితుడయిన ధృతరాష్ట్రుడు విలపించి శోకంతో మనస్సు కలతచెంది మళ్ళీ సంజయునితో ఇలా అన్నాడు. 'సంజయా! కర్ణుడు మా కార్యం నిర్వర్తించటానికి కాంబోజులను, కేకయులతో గూడ అంబష్ఠులను, గాంధారులను, విదేహులను జయించాడు. సమర్థుడయిన ఆతడు దుర్యోధనుని వృద్ధికోసం సర్వభూమండలాన్ని జయించాడు. అంతటి వాడిని శూరులు, బాహుబల శోభితులయిన పాండవులు యుద్ధభూమిలో జయించారు గదా! సంజయా! మహాధనుష్కు డయిన ఆతనిని యుద్ధంలో అర్జునుడు సంహరిస్తే ఇంకా ఏ వీరులు మిగిలి ఉన్నారో చెప్పవలసింది. ఇంతకుముందు కర్ణుడు హతు డయ్యాడని నీవు చెప్పావు. మనవాళ్ళు కర్ణుని ఒంటరిగా వదలివేశారా? లేక పాండవులు అందరూ కలిసి యుద్ధంలో అతనిని సంహరించారా ? యుద్ధభూమిలో తనకు ఎదురునిలిచి, యుద్ధం చేయని శస్త్రధారులలో శ్రేష్ఠుడైన భీష్ముని శిఖండి ఉత్తమబాణాలతో కూల్చివేశాడు

గదా ! అలాగే ద్రోణుడు యుద్ధంలో అనేక బాణాలతో గాయపడి, సర్వాయుధత్యాగం చేసి, యోగ నిష్ఠలో ఉండగా ధృష్టద్యుమ్నుడు సంహరించాడు గదా! ఈ ఇద్దరిని అవకాశం పొంది, విశేషించి కపటం గానే సంహరించారు గదా! భీష్మద్రోణులు హతులయిన వృత్తాంతాన్ని విన్నాను. యుద్ధధర్మాను సారం యుద్ధం చేసే ఆ ఇద్దరిని సాక్షాత్తుగా వజ్రధారి అయిన ఇంద్రుడు కూడా యుద్ధంలో జయించలేడు. నిజం చెపుతున్నాను.

అనేక దివ్యాస్త్రాలను ప్రయోగించేవాడు, ఇంద్రుతుల్య వీరుడయిన కర్ణుని మృత్యువు ఎలా స్పృశించింది ? సువర్ణభూషితమూ, దివ్యమూ, శత్రుసంహారకమూ, మెరుపువలె మెరిసే శక్తి అనే ఆయుధాన్ని ఇంద్రుడు కుండలాలతో గూడా కర్ణునికి ఇచ్చాడు. యుద్ధాలలో శత్రువులను సంహరింగలదై, పదునయినదై, సువర్ణభూషితమై, దివ్యమయిన సర్పముఖం అనే బాణం ఆతని అమ్ములపొదిలో ఉండేది. మహారథులు, మహావీరులయిన భీష్మద్రోణాదులను ఆతడు నిర్లక్ష్యంచేశాడు. పరశురాముని వద్ద మహాఘోరమయిన బ్రహ్మాస్త్ర ప్రయోగం నేర్చాడు. బాణ పీడితులయి, యుద్ధవిముఖు లయిన ద్రోణాదులను చూసి, మహాబాహువయిన ఆయన అభిమన్యుని ధనుస్సును పదునయిన బాణాలతో ఖండించాడు. పదివేల ఏనుగుల బలం గలవాడు, వజ్రాయుధంవలె వేగవంతుడు, అపరాజితు డయిన భీమసేనుని వేగంగా విరథుని చేసి, వేళాకోళం చేశాడు. బాగా వంగిన ములుకులు గల బాణాలతో సహదేవుని జయించి, విరథుని చేసి, దయతో ధర్మం ఆలోచించి, చంపకుండా వదిలివేశాడు. వేలకొలది మాయలను సృష్టిస్తూ, జయకాంక్షి, రాక్షసశ్రేష్ఠు డయిన ఘటోత్కచుని ఇంద్రుడిచ్చిన శక్తి ఆయుధంతో సంహరించాడు. ఇన్ని రోజులు జరిగిన యుద్ధంలో అర్జునుడు భయపడి, ద్వంద్వయుద్ధంలో ఆతనిని ఎదుర్కొన లేదు. అంతటి వీరుడు యుద్ధంలో ఎలా హతు డయ్యాడు ?

యుద్ధంలో ఎల్లప్పుడు సంశప్తకులనే యోధులు అర్జునుని యుద్ధానికి పిలిచేవారు. అర్జునుడు, వారిని ముందు చంపి, తరువాత కర్ణుని చంపుతాను, అని చెప్పి, కర్ణుని వదలి వారిమీదికి వెళ్ళాడు. ఆ వీరుని అర్జునుడు ఎలా సంహరించాడు? ఆ కర్ణుని రథం విరిగిపోయిందా? ధనుస్సు ముక్కలయిందా? అస్త్రాలు నశించాయా? ఎందువల్ల శత్రువులు ఆతనిని సంహరించారు? పెద్దపులివలె వేగవంతు డయిన కర్ణుడు మహాధనుస్సును విదిలిస్తూ, దివ్యాస్త్రాలను, బాణాలను ప్రయోగిస్తుంటే యుద్ధభూమిలో జయించటానికి ఎవడికి శక్యం అవుతుంది? ఆతడు హతు డయినాడని చెపుతున్నావు కాబట్టి తప్పకుండా అతని ధనుస్సు విరిగి ఉండాలి, లేక రథం భూమిలో కూరుకుపోయి ఉండాలి. అస్త్రాలు

నశించి ఉండాలి. ఆతని నాశనానికి ఇంతకంటే వేరొక కారణం నాకు కన్పించటం లేదు. 'అర్జునుని చంపనంతవరకు నేను అడుగు కదపనని ఆ కర్ణుడు మహాఘోరమయిన నియమం పాటించేవాడు. యుధిష్ఠిరుడు ఆ కర్ణునికి యుద్ధంలో భయపడి, పదమూడు సంవత్సరాలు నిద్రపోలేదు. మహామనస్వి, బల పరాక్రమాలు గల కర్ణుని బలం చూసుకొని నా కొడుకు పాండవపత్నిని సభకు బలవంతంగా ఈడ్పించి, తెచ్చాడు. ఆ సభామధ్యంలో, కురుశ్రేష్ఠుల సన్నిధిలో, పాండవులు చూస్తుండగా ద్రౌపదిని 'దాసభార్య' అని అన్నాడు. అప్పుడు ద్రౌపదిని "నీకు భర్తలు లేరు. వీరు నిస్సారమయిన నువ్వులులాగా నపుంసకులు. కాబట్టి సుందరీ! ఇంకొక భర్తను ఆశ్రయించు" అని పూర్వం రోషంతో పరుషమయిన మాటలు సభలో అన్నాడు. అలాంటి కర్ణుని శత్రువులు ఎలా సంహరించారు? 'సుయోధనా! భీష్ముడు ద్రోణుడు పక్షపాత బుద్ధితో కుంతీపుత్రులను చంపకపోతే వాళ్ళను అందరిని నేను సంహరిస్తాను. నీ మనోవేదన తొలగించుకో ! గాండీవం గాని, అక్షయ బాణాలు గల బాణాలు గాని దట్టంగా పట్టించిన మంచి గంధం గల నా బాణం వేగంగా పరుగెత్తుకొని వస్తుంటే ఏంచేయగలవు?' అన్నాడు కర్ణుడు. ఆబోతు మూపురం గల ఆతనిని అర్జునుడు ఎలా సంహరించాడు? గాండీవాన్నుంచి బయలుదేరిన బాణాల తీవ్రమయిన తాకిడిని లెక్కచేయక 'ద్రౌపదీ! నీకు భర్తలేడు గదా!' అంటూ పాండవులను చూశాడు. సంజయా! తన బాహుబలాన్ని ఆశ్రయించిన ఆతనికి పుత్రులతో గూడిన, కృష్ణునితో గూడిన పాండవులంటే భయం లేదు. అలాంటి మహావీరునికి ఎదురుగా పరుగుతో వచ్చే ఇంద్ర సహితులయిన దేవతలవల్ల కూడా వధ కలుగుతుందని నేను అనుకోను. పాండవుల వల్ల కాదని వేరే చెప్పాలా? వ్రేళ్ళ తొడుగులను గ్రహించి, అల్లెత్రాటిని బిగిస్తున్న కర్ణుని ఎదుట ఏ మొగవాడు నిలువదగడు. సూర్యచంద్రులకాంతితో, కిరణాలతో భూమి దూరం కావచ్చు గాని యుద్ధంలో పారిపోని, కర్ణుని మరణం అసంభవం.

తనకు సహాయం కర్ణుడు, దుఃశాసనుడు ఉన్నారనే ధీమాతో మూర్ఖుడు, దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు శ్రీకృష్ణవచనాలను పాటించలేదు. కాబట్టి ఇప్పుడు నా పుత్రుడు, దుఃశాసన మరణాన్ని, కర్ణుని పతనాన్ని చూసి, తప్పక విచారపడుతుంటాడు. అర్జునునితో జరిగిన ద్వంద్వయుద్ధంలో కర్ణుడు హతుడయినాడని విని, విజయం పొందిన పాండవులను చూసి, దుర్యోధనుడు ఏమన్నాడు? దుర్మర్షణుడు, వృషసేనుడు హతులు కావటం, మహారథులయిన శత్రుపక్షంవారు వధిస్తుంటే చెల్లాచెదరయిన మన సైన్యాన్ని, పలాయనం చిత్తగిస్తూ యుద్ధవిముఖులయిన రాజులను, పారిపోయిన రథికులను చూసి, నా పుత్రుడు విచారపడుతున్నాడని అనుకొంటాను. ఎవరు బోధించినా విననివాడు,

'నేను విద్వాంసుడిని, మేధావిని' అని భావించే దుర్బుద్ధి, ఇంద్రియాలను జయించలేని దుర్యోధనుడు సైన్యం నిరుత్సాహపడటం చూసి, ఏమన్నాడు? మంచి మనస్సుగల ఆప్తులు వారించినా వినకుండా పాండవులతో బలవద్విరోధం పెట్టుకొన్న దుర్యోధనుడు తన పక్షంవారు ఎక్కువమంది యుద్ధంలో మరణిస్తే ఏమన్నాడు? తన సోదరు డయిన దుఃశాసనుని యుద్ధరంగంలో భీమసేనుడు సంహరించి, రక్తంత్రాగుతుంటే చూసి దుర్యోధనుడు ఏమన్నాడు? సభలో శకునితో కూడా దుర్యోధనుడు 'కర్ణుడు అర్జునుని సంహరిస్తాడు' అని చెప్పాడు. ఆ కర్ణుడు హతుడు అయిన తరువాత ఏమి చెప్పాడు?

నాయనా! పూర్వం పాండవులను వంచించి, జూదమాడి, సంతోషించిన శకుని కర్ణుడు చనిపోతే ఏమన్నాడు? మహాధానుష్కుడు, సాత్వతులలో మహారథుడు, కృతవర్మ హతు డయిన కర్ణునిచూచి ఏమన్నాడు? సంజయా! ధనుర్వేదాన్ని అభ్యసింపగోరే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ద్రోణపుత్రుని వద్దకువెళ్ళి నేర్చుకొంటారు. యువకుడు, రూపవంతుడు, చూడదగినవాడు, మహాయశస్వి అయిన అశ్వత్థామ కర్ణుడు చనిపోతే ఏమన్నాడు? ధనుర్వేదాచార్యుడు, రథికశ్రేష్ఠుడు, గౌతమ వంశీయుడు, శరద్వంతుని పుత్రు డయిన కృపాచార్యుడు కర్ణుడు హతు డయితే ఏమన్నాడు? మద్రదేశాధిపతి, శల్యుడు తన సారథ్యంలో హతు డయిన కర్ణుని చూసి, ఏమన్నాడు ? సంజయా! యుద్ధంలో దుర్జయులయిన యోధులు అందరూ హతుడయిన కర్ణుని చూసి, ఏమన్నారు? ఇంకా భూమండలం మీద యుద్ధం చేయటానికి వచ్చిన రాజులు కర్ణుడు హతుడు కావటం చూసి ఏ మాటలు పలికారు ? సంజయా! రథికశ్రేష్ఠుడు అయిన ద్రోణుడు హతుడు కాగా సేనాభాగాల ముందు ఏ వీరులు ఉన్నారు? సంజయా! శల్యుడు కర్ణుని రథసారథ్యంలో ఎలా నియుక్తుడయ్యాడో నాకు చెప్పు. యుద్ధంచేస్తున్న సూతపుత్రుని కుడి రధచక్రాన్ని ఎవరు రక్షించారు? ఎడమ చక్రాన్ని ఎవరు రక్షించారు? ఆ వీరుని వెనుకవైపు ఎవరు ఉన్నారు ? కర్ణుని వదలకుండా చివరి దాకా ఉన్న వీరులు ఎవరు? ఏ క్షుద్రులు పారిపోయారు? మీరు అందరూ కలిసి ఉండగా మహారథుడయిన కర్ణుడు ఎలా హతుడు అయ్యాడు?

సంజయా! మహారథులు, స్వయంగా శూరులు అయిన పాండవులు మేఘాలు వర్షధారలను వలె బాణవర్షాలను సృష్టిస్తూ ,ముందరికి వస్తుంటే మహత్తర బాణశ్రేష్ఠమూ, దివ్యమూ అయిన ఆ సర్పముఖాస్త్రం ఎలా వ్యర్థమయిందో నాకు చెప్పవలసింది. సంజయా! నా ఈ సైన్యంలో ఉత్కర్ష, ఉత్సాహం ఉడిగిపోయాయి. నా సేనలో ముఖ్యుడయిన వీరుడు హతుడయిన తరువాత ఇంక ఏమీ మిగలదని నాకు తోస్తున్నది. విలుకాండ్రలో శ్రేష్ఠులు, నాకోసం జీవితాన్నే త్యజించిన భీష్మద్రోణులు హతులయిన మాట విన్న తరువాత

నా జీవితం వల్ల ఏం ప్రయోజనం ఉంటుంది? వేయి ఏనుగులతో సమానమయిన బాహుబలం గల కర్ణుని పాండవులు సంహరించారు' అని మాటిమాటికి విని నేను సహించలేకపోతున్నాను. సంజయా! ద్రోణుడు హతుడు కాగా వీరులయిన కౌరవులకు శత్రువులతో యుద్ధం ఎలా జరిగిందో నాకు తెలుపవలసింది. కర్ణుడు కుంతీకుమారులతో యుద్ధం ఎలా సమకూర్చాడో, ఆతడు యుద్ధరంగంలో ఎలా శాంతుడు అయ్యాడో నాకు చెప్పవలసింది.'

10. సేనాపతిగా కర్ణుని అభిషేకము.

సంజయుడు చెప్పాడు – 'భారతా! ఆ నాటి పగటిపూట మహాధనుర్ధరుడయిన ద్రోణుడు చనిపోతే మహారథు డయిన అశ్వత్థామ సంకల్పం వ్యర్థం అయింది. కౌరవుల, సైన్యసముద్రం చెల్లాచెదరు అవుతుంటే, అర్జునుడు సోదరులతో కూడా తమసేనను పన్ని, నిలిచాడు. భరతశ్రేష్ఠా! నీ పుత్రు డయిన దుర్యోధనుడు అర్జునుడు అలా నిలిచి ఉన్నాడని తెలుసుకొని పారిపోతున్న తన సేనను చూసి, పౌరుషంతో వారించాడు. భరతవంశీయా! తన బాహుబలాన్ని ఆశ్రయించి తన సేనను నిలిపాడు. తమ లక్ష్యాన్ని సాధించుకొన్న శత్రువులు సంతోషంతో నిలిచి, చాలా శ్రమపడి యుద్ధం చేస్తుంటే తాను చాలాసేపు వారితో యుద్ధం చేసి, సాయంకాలం కావటం వల్ల సేనలను ఉపసంహరించాడు. ఈ రీతిగా కౌరవులు సైన్యాన్ని యుద్ధం నుంచి విరమింపజేసి, తమ శిబిరాన్ని ప్రవేశించి, తమకు మేలు కలిగించే ఆలోచనను పరస్పరం రహస్యంగా చేశారు. చాలా విలువయిన పరుపులుగల శ్రేష్ఠ పర్యంకాలమీద సుఖకర మయిన శయ్యలమీద ఉన్న దేవతలవలె వారు ఉత్తమాసనాల మీద కూర్చున్నారు. అప్పుడు దుర్యోధనుడు ఆ సమయానికి తగినట్లుగా తన వారితో చాలాచక్కగా వారిని సంబోధించి, 'మేధావులలో ఉత్తములారా! ఇప్పటి ఈ పరిస్థితిలో చక్కగా చేయదగిన పని చెయ్యాలి. ఆలస్యం లేకుండా చెప్పండి.' అన్నాడు.

సంజయుడు చెప్పాడు – ఈవిధంగా రాజు అనగానే యుద్ధం చేయదలచుకొని సింహాసనాల మీద కూర్చున్న ఆ వీరనరశ్రేష్ఠులు నానావిధాల చేష్టలు చేశారు. యుద్ధాగ్నిలో ప్రాణాలను హోమం చేయదలచుకొన్న ఆ వీరుల ఉద్దేశ్యాలను తెలుసుకొని, మేధావి, మాట తీరు బాగా తెలిసిన అశ్వత్థామ ఉదయకాల సూర్యునితో సమానకాంతి గల దుర్యోధనుని ముఖం చూసి, ఇలా అన్నాడు. 'తమకు కావలసినది సిద్ధించటానికి పండితులు

నాలుగు ఉపాయాలను చెప్పారు. రాగం (రాజుమీద సైనికులకున్న భక్తి) యోగం (సాధన సంపత్తి), దక్షత (ఉత్సాహం, బలం, నేర్పు), నీతి. కాని ఈ నాలుగు దైవాధీనాలు. మన పక్షంలో ఉన్న దేవతలవలె పరాక్రమవంతులు, మహారథులుగా విశ్వవిఖ్యాతులు, నీతిమంతులు, సాధనసంపన్నులు, సమర్థులు, ప్రభుభక్తులు అయినవారు అందరు హతు లయ్యారు. అయినా మనం విజయప్రాప్తి విషయంలో నిరాశ పడనక్కరలేదు. మన కర్తవ్యాన్ని ఉత్తమనీతి ననుసరించి చేసేటట్లయితే దానికి దైవాన్ని కూడా అనుకూలంచేసుకోవచ్చు. భారతా! కర్ణునే సేనాపతిగా పట్టాభిషిక్తుని చేద్దాం. కర్ణుని సేనాపతిని చేసి, శత్రువులను మథించుదాం. ఈయన మహాబలవంతుడు, శూరుడు, అస్త్రవిద్యానిపుణుడు, యుద్ధదుర్మదుడు, యమునివలె ఈయనను సహించవీలుగాదు. శత్రువులను యుద్ధంలో జయించగలవాడు.'

రాజా! అశ్వత్థామ నుండి ఈ మాటను విన్న నీ కొడుకు అప్పుడు కర్ణుని మీద చాలా గొప్ప జయాశను పెట్టుకొన్నాడు. భీష్ముడు, ద్రోణుడు హతులు కావటం వల్ల ఇక "కర్ణుడు తప్పక పాండవులను జయిస్తాడు" అని మనస్సులో ఆశపెట్టుకొని దిటవు తెచ్చుకొన్నాడు. తనకిష్టమయిన అశ్వత్థామమాట విని, దుర్యోధనుడు సంతోషించాడు. ఆయనమాట సంతోషంతో, గౌరవంతో కూడినది, యథార్థమయినది, తనకు మేలయినది, శుభమయినది. మహారాజా! దుర్యోధనుడు తన మనస్సును నెమ్మది పరచుకొని, తన బాహుబలాన్ని ఆశ్రయించి, కర్ణునితో ఇలా అన్నాడు. 'కర్ణా! నీ పరాక్రమం, నాతో నీకున్న స్నేహం నాకు బాగా తెలుసు. అయినా మహాబాహూ! నీకు హితకరమయిన మాట చెపుతాను. వీరా! నా మాట సావధానంగా విన్న తరువాత తగిన దాన్ని చేయవలసింది. ప్రాజ్ఞులలో శ్రేష్ఠుడి వయిన నీవే నాకు పెద్ద ఆధారం. నా సేనాపతులు, అతిరథులు అయిన భీష్మద్రోణులు హతులయ్యారు. వారికంటే చాలా ఎక్కువ శక్తిశాలివి అయిన నీవు నా సేనాపతివి కావాలి. రాధేయా! ఆ మహాధానుష్కులు ఇద్దరు వృద్ధులు, అర్జునుని మీద ప్రేమవాత్సల్యాలు గలవారు. నీ మాటవల్ల వారిని గౌరవించాను. నాయనా! తాను తాతను అనే సంబంధంతో భీష్ముడు పాండవులను మహాయుద్ధంలో పదిరోజులు రక్షించాడు. భీష్ముడు శస్త్రసన్యాసం చేయగా మహాయుద్ధంలో అర్జునుడు శిఖండిని ముందుంచుకొని, ఆయనను చంపాడు. ఆ మహాధానుష్కుడు అలా హతుడు కాగా అంపశయ్యను ఆశ్రయించాడు.

నీవు చెప్పటం వల్ల ద్రోణుడు సేనాపతి అయినాడు. శిష్యులుకావటం వల్ల పాండవులను ఆయన కూడా రక్షించాడని నా అభిప్రాయం. వృద్ధు డయిన ఆయనను ధృష్టద్యుమ్నుడు త్వరగా సంహరించాడు. మహావీరా! ప్రధానులయిన వారు ఇద్దరూ

చనిపోగా యుద్ధరంగంలో నీతో సమానుడయిన యోధుడు ఆలోచించినా నాకు కనపడటం లేదు. మాకు విజయం కలిగించటంలో నీవే సమర్థుడివి. ఇందులో ఏమీ సందేహం లేదు. పూర్వమూ, మధ్యలో, చివర కూడా నీవే మాకు మేలు చేశావు. అలాంటి నీవే ధురంధర పురుషునివలె యుద్ధరంగంలో సేనా నిర్వాహభారాన్ని మోయదగినవాడివి. కాబట్టి నిన్ను నీవే స్వయంగా సేనాపతిగా అభిషిక్తుని చేసుకో. అవ్యయుడు, ప్రభువు అయిన కుమారస్వామి దేవతలకు సేనాపతి అయినట్లు నీవే కౌరవసేనా భారాన్ని వహించవలసింది. మహేంద్రుడు, దానవులను వలె నీవు ఈ శత్రువులను అందరిని జయించు. యుద్ధంలో నిలిచిన నిన్ను చూస్తే పాండవసేనలోని మహారథులు, పాంచాలురు విష్ణువును చూసిన దానవుల వలె పారిపోతారు. కాబట్టి పురుషశ్రేష్ఠా ! ఈ మహాసైన్యాన్ని నీవే నడిపించు. యుద్ధసన్నద్ధుడ వయి నీవు నిలిస్తే మందబుద్ధులయిన పాండవులు అమాత్యులతో గూడిన పాంచాలురు, సృంజయులు కూడా పారిపోతారు. ఉదయించిన సూర్యుడు తన తేజస్సుతో వెలుగులను వెదజల్లుతూ చీకటిని పోగొట్టినట్లు నీవు శత్రువులను బాగా తపింపజేయి.'

సంజయుడు చెప్పాడు - రాజా! భీష్మద్రోణులు హతులు కాగా "కర్ణుడు పాండవులను జయిస్తాడు." అని నీ పుత్రునికి బలమయిన ఆశ కలిగింది. ఆ ఆశను మనస్సులో పెట్టుకొని కర్ణునితో ఇలా అన్నాడు - 'సూతపుత్రా! అర్జునుడు నీ ఎదుట నిలిచి, ఎప్పుడూ యుద్ధం చేయాలని అనుకోడు'. కర్ణుడు అన్నాడు - గాంధారీపుత్రా! ఇంతకుముందు నీ ఎదుట పుత్రులతో, శ్రీకృష్ణునితో గూడిన పాండవులను అందరినీ జయిస్తాను అని చెప్పాను. మహారాజా! నీ సేనాపతిని అవుతాను. ఇందులో సందేహం లేదు. ధైర్యం తెచ్చుకో. పాండవులు పరాజితులు అయినట్లే భావించు. సంజయుడు చెప్పాడు - 'మహారాజా! ఇలా చెప్పగా దుర్యోధన మహారాజు దేవతలతో ఇంద్రునివలె ఇతర రాజులతో కలిసి లేచి నిలుచున్నాడు. రాజా! విజయకాంక్షులయిన దుర్యోధనాది రాజులు సేనాపతిగా గౌరవించటానికి దేవతలు కుమారస్వామిని వలె కర్ణుని గౌరవింపదలిచారు. తరువాత విధివిధానాన్ని అనుసరించి, సేనాపతిగా అభిషేకించారు. అభిషేకం కోసం బంగారు కలశాలు, మట్టికుండలలో అభిమంత్రిత మయిన నీటిని ఉంచారు. ఏనుగు దంతాలు, ఖడ్గమృగాలు, ఎద్దుల కొమ్ములతో నిర్మితమయిన పాత్రలలో జలం ఉంచారు. ఆ పాత్రలలో మణులు, ముత్యాలు గూడా వేశారు. ఇంకా ఇతరమయిన పవిత్ర సుగంధ పదార్థాలు, ఓషధులను వేశారు. పట్టుగుడ్డలతో అలంకృతమయిన మేడికర్రతో చేసిన సింహాసనం మీద కర్ణుడు సుఖంగా కూర్చున్నాడు. ఆ స్థితిలో శాస్త్రం చెప్పిన రీతిగా ఆయనను పాత్రలలోని జలాలతో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, పూజ్యు లయిన

శూద్రులు అభిషేకించారు. సేనాపతిగా ఉత్తమాసనం మీద అభిషిక్తు డయిన కర్ణుని వారందరు స్తుతించారు. రాజేంద్రా! ఆ రీతిగా అభిషిక్తుడు, శత్రునాశకు డయిన రాధేయుడు, ఉత్తమవిప్రులకు బంగారు నాణాలను, గోవులను దానం చేశాడు. వారు ఆయనకు శుభాశీస్సుల నిచ్చారు.

సూతులు, మాగధులు, వందులు స్తోత్రం చేస్తుంటే రాధేయుడు, ఉదయకాలంలో బ్రహ్మవేత్తలచే స్తుతింపబడే సూర్యునిలాగా విరాజిల్లాడు. అప్పుడు పుణ్యాహవాచక ఘోషతో, యుద్ధవాద్యాలధ్వనులతో, శూరుల జయధ్వానాలతో భీకరధ్వని కలిగింది. అక్కడ కూడి ఉన్న రాజులు అందరూ రాధేయునికి జయజయధ్వానాలు పలికారు.

'కర్ణా! అనుయాయులతో, శ్రీకృష్ణునితో గూడిన పాండవులను జయించు' అని వందులు, బ్రాహ్మణులు ఆ పురుషశ్రేష్ఠునితో చెప్పారు. 'రాధేయా! మన విజయం కోసం పాంచాలురతో గూడిన పాండవులను ప్రతిరోజు ఉదయించిన సూర్యుడు తీవ్రకిరణాలతో చీకట్లను పారద్రోలినట్లు జయించు' అని ప్రోత్సహించారు. గుడ్లగూబలు ప్రజ్వలించే సూర్యకిరణాలను చూడలేనట్లు నీవు ప్రయోగించే బాణాలను కృష్ణునితో కూడా పాండవులు తేరిపారజూడలేరు. సాయుధుడి వయిన నీ ఎదుట పాండవులు, పాంచాలురు కూడా యుద్ధభూమిలో దానవులు మహేంద్రుని ఎదుట నిలువలేనట్లు నిలువలేరు.' సేనాపతిగా అభిషిక్తుడై, అమితకాంతిగల రాధేయుడు తన తేజస్సుతో, రూపంతో మరియొక సూర్యునివలె భాస్కరుని మించిపోయాడు. కర్ణుని సేనాపతిగా అభిషేకించిన తరువాత కాలునిచే ప్రేరితుడయిన నీ కుమారుడు తాను కృతార్థు డయినట్లు భావించాడు. రాజా! శత్రునాశకు డయిన కర్ణుడు కూడా సేనాపతి పదవిని పొంది, సూర్యోదయ సమయంలో యుద్ధానికి సిద్ధం కావలసిందని సేనను ఆజ్ఞాపించాడు. భారతా! నీ పుత్రులు చుట్టూ గల కర్ణుడు తారకామయమనే యుద్ధంలో దేవతలతో పరివృతుడయిన కుమారస్వామి వలె విరాజిల్లాడు.

11. కౌరవులు మకరవ్యూహమును పాండవులు అర్ధచంద్రాకార వ్యూహమును పన్నుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు – 'సంజయా! సేనాపతి పదవిని పొందిన కర్ణుడు యుద్ధానికి సిద్ధమయినాడు. దుర్యోధనుడు సోదరునివలె మాట్లాడినప్పుడు సూర్యోదయకాలంలో సైన్యాన్ని యుద్ధానికి సిద్ధం కమ్మని ఆజ్ఞాపించి, తరువాత ఏం చేశాడో చెప్పవలసింది. సంజయుడు చెప్పాడు – 'భరతవంశశ్రేష్ఠా! కర్ణుని అభిప్రాయం తెలుసుకొని నీ పుత్రులు ఆనందసూచక వాద్యధ్వనులతో సైన్య సన్నాహం చేయ నాజ్ఞాపించారు. ప్రాతః కాలానికి

బాగా ఎక్కువ ముందుగానే నీ సైన్యంలో 'సిద్ధంకండి, సిద్ధం కండి' అనే పెద్ద కేకలు వినిపించాయి. నరనాథా ! 'గజసైన్యం సిద్ధం చేయండి. రథసేనను సన్నద్ధం చేయండి. పదాతి దళాలను, అశ్వదళాలను సిద్ధం చేయండి' అని కేకలు పెడుతూ ఒకరినొకరు హెచ్చరించుకొంటున్న సంకుల మహత్తర ధ్వని ఆకాశం అంటుతున్నట్లుగా అయింది. అప్పుడు తెల్లని పతాకతో కొంగల రంగువలె తెల్లని రంగుగల గుర్రాలతో, బంగారు తొడుగుగల ధనుస్సుతో, నాగ కక్ష్య చిహ్నంగా గల జెండాతో, వందలకొలది అమ్ములపొదులతో, గదతో, రక్షణకోసం పైన నిర్మితమయిన ఆవరణతో, శతఘ్నులు, కింకిణులు, శక్తులు, శూలాలు, తోమరాలతో, అనేక ధనుస్సులతో నిండి నిర్మలమయిన సూర్యతేజస్సుగల, పతాకలు గల రథంమీద ఉండి కర్ణుడు కన్పించాడు. రాజా! ఆయన బంగారు జాలరులతో అలంకృతమయిన శంఖాన్ని ఊదుతూ, సువర్ణపుతొడుగుతో అందగిస్తున్న గొప్ప ధనుస్సును కదిలిస్తున్నాడు. ఆర్యా ! మహాధానుష్కుడై ఉన్న రథికశ్రేష్ఠుడై, చెనకవీలులేని చీకటిని పోగొడుతూ ఉదయిస్తున్న సూర్యునిలాగా ఉన్న కర్ణుని చూసి, మన పక్షంలోని కౌరవులలో భీష్ముడు లేడే అని గాని, ద్రోణుడు లేడే అని గాని, ఇతరులు లేరే అనిగాని అనుకోలేదు. తరువాత కర్ణుడు శంఖం ఊదుతూ, యోధులను తొందరచేస్తూ కౌరవుల మహా సైన్యాన్ని శిబిరాలలోనుంచి రప్పించాడు.

కర్ణుడు మకర వ్యూహాన్ని పన్ని, పాండవులను జయించటానికి సిద్ధమయినాడు. రాజా! మకర వ్యూహానికి ముఖభాగంలో కర్ణుడు ఉన్నాడు, దానినేత్రాల భాగంలో శకుని, ఉలూకుడు ఉన్నారు. అశ్వత్థామ శిరోభాగంలో, మెడభాగంలో కౌరవ సోదరులు ఉన్నారు. ఆ వ్యూహమధ్యంలో దుర్యోధన మహారాజు మహత్తర సేన చుట్టూ ఉండగా నిలిచాడు. రాజేంద్రా! ఆ మకర వ్యూహానికి ఎడమ కాలిభాగాన యుద్ధ మదమత్తులయిన నారాయణ గోపాలురతో గూడి కృతవర్మ ఉన్నాడు. రాజా! ఆ వ్యూహం కుడి, పాదంలో సత్యవిక్రముడయిన కృపాచార్యుడు మహాధానుష్కులయిన త్రిగర్తులతో, దాక్షిణాత్య సేనలలో గూడి ఉన్నాడు. ఎడమకాలి వెనుక భాగంలో మద్రదేశీయ మయిన విశాల సైన్యంతో గూడి శల్యుడు ఉన్నాడు. మహారాజా! మకర వ్యూహాన్ని కుడికాలి వెనుక భాగంలో సత్యప్రతిజ్ఞుడయిన సుషేణుడు వేలకొలది రథాలతో, మూడు వందల ఏనుగులతో పరివృతుడయి ఉన్నాడు. ఆ మకరానికి తోక భాగంలో మహావీరులు, రాజులు, సోదరులు అయిన చిత్ర చిత్రసేనులు గొప్ప సేనతో గూడి ఉన్నారు.

రాజేంద్రా! కర్ణుడు అలా బయలుదేరగా ధర్మరాజు ధనంజయుని చూసి,

ఇలా అన్నాడు. వీరా! అర్జునా! యుద్ధరంగంలో కర్ణుడు సిద్ధం చేసి, మహారథు లయిన వీరులతో రక్షితమయిన ధార్తరాష్ట్రుల సేనను చూడు. మహాబాహూ! గొప్పవీరులందరూ హతులుకాగా స్వల్పంగా మిగిలిన ఈ ధృతరాష్ట్రసేన గడ్డిపోచలతో సమానం అని నా ఉద్దేశ్యం. రథికశ్రేష్ఠా! ఈ కౌరవసేనలో గొప్ప విలుకాడయిన కర్ణుడు ఒక్కడే విరాజిల్లుతున్నాడు. ఆ రథికశ్రేష్ఠుడు దేవతలు, అసురులు, గంధర్వులతో గూడిన, కిన్నరులతో, గొప్ప నాగరాజులతో గూడిన చరాచరమయిన మూడులోకాలకు జయింపరాని వాడు. అర్జునా! మహాబాహూ! అతనిని నేడు నీవు చంపితే నీకు విజయమూ కలుగుతుంది. పన్నెండు సంవత్సరాలనుంచి నా హృదయంలో ఉన్న చింతాశల్యం లాగి వేయడమూ అవుతుంది. ఈ విషయాన్ని తెలుసుకొని నీకు ఇష్టమయిన వ్యూహం పన్నవలసింది.' అర్జునుడు సోదర వాక్యాన్ని విని, తమ సైన్యాన్ని అర్ధచంద్రవ్యూహంగా పన్నాడు. ఆ అర్ధచంద్రవ్యూహంలో ఎడమవైపు భీమసేనుడు ఉన్నాడు. దక్షిణంవైపు ధృష్టద్యుమ్నుడు ఉన్నాడు. వ్యూహ మధ్యంలో యుధిష్ఠిరుడు ఉన్నాడు. అర్జునుడూ అక్కడే ఉన్నాడు. నకుల సహదేవులు ధర్మరాజు వెనక ఉన్నారు. అర్జునుని రథచక్ర రక్షకులుగా పాంచాల వంశీయు లయిన యుధామన్యువు, ఉత్తమౌజుడు అర్జున రక్షితులయి యుద్ధంలో ఆయనను వీడకుండా ఉన్నారు. భారతా! మిగిలిన వీరులయిన రాజులు కవచధారులయి తగినచోట, సముచితోత్సాహంతో, తగిన యత్నంతో ఉన్నారు.

భారతా! ఈ రీతిగా మహాధనుష్కులయిన పాండవులు, నీవారు వ్యూహాలను పన్నుకొని యుద్ధం చేయటం మీదనే మనస్సు పెట్టారు. యుద్ధరంగంలో కర్ణుడు పన్నిన నీ సేనావ్యూహం చూసి, చుట్టాలతో గూడిన దుర్యోధనుడు పాండవులు హతు లయినట్లే భావించాడు. అదే రీతిగా నరేంద్రా! అర్ధచంద్రవ్యూహంగా పన్నిన తమ సేనను చూసి, యుధిష్ఠిరుడు కర్ణునితో గూడా కౌరవులు హతు లయినట్లే భావించాడు. ఆ తరువాత శంఖాలను, భేరులను, పణవాలను, ఆనకాలను, దుందుభులను, డిండిమాలను, ఝర్ఝరాలను మహాధ్వనులు కలిగేటట్లుగా, రెండు సేనలలోనూ మ్రోగించారు. జయాన్ని కోరే వీరుల సింహనాదాలు గూడా కలిశాయి. గుర్రాల సకిలింపులు, ఏనుగుల ఘీంకారాలు, భయంకరమయిన రథాల ఇరుసుల చప్పుళ్ళు విన్పించాయి. భారతా! గొప్ప విలుకాడు, కవచధారి అయిన కర్ణుని సేనాముఖంలో చూసి మనవారిలో ఎవరూ ద్రోణవధవల్ల కలిగే దుఃఖాన్ని అనుభవించలేదు. మహారాజా! సంతోషంతో ఉన్న నరులతో సంకులంగా ఉన్న రెండు సేనలూ పరస్పరం శౌర్యంతో సంహరించటానికి యుద్ధం చేయ సిద్ధంగా ఉన్నాయి.

రాజేంద్రా! అక్కడ రోషపూర్ణులు, సావధానంగా ఉన్న కర్ణార్జునులు తమ సేనలమధ్య సంచరించారు. ఆ రెండు సేనలు నృత్యం చేస్తున్నట్లుగా పరస్పరం ఎదుర్కొన్నవి. ఆ రెండు సేనల ప్రధాన పక్షాలనుంచి, ఉపపక్షాలనుంచి వీరులు యుద్ధం చేయాలనే కోర్కెతో బయలుదేరారు. మహారాజా! ఆ తరువాత పరస్పరం సంహరిస్తున్న రెండు సేనలలోని పదాతులు, గజాలు, అశ్వాలు, రథాల వారి మధ్య యుద్ధం ఆరంభమయింది.'

12. కౌరవ పాండవుల యుద్ధము. క్షేమధూర్తిని భీముడు వధించుట.

సంజయుడు చెప్పాడు - 'రాజా! సంతోష పూర్ణమయిన అశ్వపదాతి గజాలతో గూడి, దేవాసుర సేనలతో సమంగా వెలుగుతున్న ఆ బృహత్తరసేనలు రెండూ యుద్ధం చేయసాగాయి. తరువాత భయంకర పరాక్రమం గల చతురంగసైన్యాలు దేహాలను, ప్రాపాలను, ప్రాణాలను నాశనం చేసే అనేకాయుధాలతో యుద్ధం చేశాయి. నరశ్రేష్ఠులయిన వీరులు కాంతితో పూర్ణచంద్రసూర్యులతో సమానాలై, సువాసనగల పద్మాలతో సమానయిన నరశ్రేష్ఠుల శిరస్సులను ఖండించి, భూమిమీద పరిచారు. యుద్ధంచేస్తున్న వీరుల తలలను పరపక్షవీరులు అర్ధచంద్ర బాణాలతో, బల్లేలతో, చిన్న కత్తులతో, ఖడ్గాలతో, పట్టిసాలతో, పరశ్వథాలతో ఖండించారు. బాగా పరిపుష్టి లయిన బాహువులతో వీరులు కండపట్టి బలిసిన శత్రువుల దీర్ఘబాహువులను ఖండించారు. ఆ బాహువులు ఆయుధాలతో, ఆభరణాలతో విరాజిల్లాయి. ఎర్రటి అంగులి తలాలు గల్గి, ప్రకాశవంతాలయిన ఆ బాహువులు గరుత్మంతుడు పడవేసిన అయిదుతలల సర్పాల వలె విరాజిల్లాయి. శత్రువులచే హతు లయిన వీరులు ఏనుగులు, రథాలు, గుర్రాల మీదినుంచి నేలగూలారు. పుణ్యం క్షీణించగా స్వర్గనివాసు లయిన వారు విమానాల మీదినుంచి క్రిందపడ్డట్టుగా ఉన్నారు. అనేక వీరులు తమకన్న గొప్పవీరులు ప్రయోగించిన పెద్దపెద్ద గదలతో, పరిఘలతో, ముసలాలతో నలగగొట్టబడి యుద్ధభూమిలో వందల కొలది కూలారు.

ఆ సంకుల యుద్ధంలో రథాలను, రథాలు, మత్తగజాలను మత్తగజాలు, ఆశ్వికులను ఆశ్వికులు సంహరించారు. రథాలు పదాతులను; రథాలను గజాలు; రౌతులను పదాతులు; పదాతులను ఆశ్వికులు ఆ యుద్ధంలో చంపగా వారు నేలమీద పడుకొన్నట్లున్నారు. ఏనుగులు రథాకులను, అశ్వికులను, పదాతులను నేలగూల్చాయి. పదాతులు రథికులను, అశ్వికులను, ఏనుగులను నేలగూల్చారు. గుర్రాలు రథికులను, పదాతులను, ఏనుగులను నేలగూల్చాయి. రథికులు పదాతులను, ఏనుగులను నేలగూల్చారు. పదాతులు, అశ్వారోహకులు,

గజారోహకులు, రథికులు; రథికులు, ఆశ్వికులు, గజారోహకులు, పదాతులను చేతులతో, పాదాలతో, శస్త్రాలతో, రథాలతో పీడించగా మహాయుద్ధం జరిగింది. ఆ రీతిగా ఆ సైన్యాన్ని శూరులు వధిస్తుంటే, వారు చనిపోతుంటే, భీమసేనాది పాండవులు మనవారి మీదికి వచ్చారు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉపపాండవులు, ప్రభద్రకులు, సాత్యకి, చేకితానుడు ద్రావిడ సైనికులతో పాండ్య చోళ, కేరళులతో పెద్దవ్యూహం పన్ని వచ్చారు. వీరు అందరు విశాల వక్షఃస్థలాలు, పొడవైన భుజాలు, విశాలలోచనాలు గలవారు. చాలా ఎత్తయినవారు, వారు రకరకాలయిన శిరోభూషణాలు, ఎర్రని పండ్లు గలవారు. మదించిన ఏనుగులవలె పరాక్రమవంతులు. వారు అనేక విధాలయిన రంగుల వస్త్రాలు దాల్చారు. గంధపు పొడి అద్దుకొన్నారు. నడుములకు ఖడ్గాలు కట్టుకొన్నారు. వారి చేతుల్లో పాశాలు ఉన్నాయి. ఏనుగులనయినా ఎదుర్కొనగల బలవంతులు. రాజా! ఆ సైనికులు అందరూ మరణించ ప్రతిజ్ఞ చేసి ఒకరినొకరు వదలకుండా ఉన్నారు. వారు తలలమీద నెమలి పించాలు పెట్టుకొన్నారు. ధనుస్సులు చేతపట్టారు. వారి శిరోజాలు పొడవయినవి. మధురంగా మాట్లాడుతారు. మహాభయంకర పరాక్రమం గల వారిలో కొందరు కాలిబంటులు, కొందరు గుర్రపు రౌతులు ఉన్నారు. చేది, పాంచాల, కేకయ, కారూష, కోసల కాంచి, మాగధ దేశీయ సైనికులు కూడా మామీదికి వచ్చారు. ఆ పాండవ పక్షీయులలో, రథికులు, ఆశ్వికులు, గజారోహకులు, భయంకర పదాతులు నానా వాద్యాలను ధరించి వాయిస్తూ సంతోషంతో ఆడుతున్నారు, నవ్వుతున్నారు.

ఆ మహాసైన్య మధ్యంలో పెద్ద ఏనుగునెక్కి, గొప్ప మావటి వారి మధ్య ఉండి, భీమసేనుడు బయలుదేరాడు. యథావిధిగా సిద్ధం చేయబడిన ఆ మహాగజం ఉదయించిన సూర్యుడు గల ఉదయపర్వత శిఖరంలాగా భాసించింది. శ్రేష్ఠమయిన రత్నాలతో అలంకృతమయిన దాని గొప్ప ఇనుప కవచం శరత్కాలంలో నక్షత్రాలతో నిండిన ఆకాశంలాగా కాంతిమంతంగా ఉంది. అప్పుడు అందమయిన కిరీటం, అలంకారాలతో భాసిస్తూ తోమరం అనే ఆయుధం దాల్చిన భీమసేనుడు శరత్కాలంలో మధ్యాహ్న సూర్యునివలె తేజస్సుతో వెలుగుతూ, శత్రువులను దహించాడు. భీముడు ఎక్కి ఉన్న ఆ ఏనుగును ఏనుగుమీద ఉన్న క్షేమధూర్తి చూసి, మహామనస్వి అయిన భీముని యుద్ధానికి పిలిచాడు. భయంకర రూపంగల ఆ రెండు ఏనుగులకు వృక్ష సమృద్ధి గల రెండు పర్వతాలకు వలె అప్రయత్నంగా యుద్ధం జరిగింది. ఏనుగుల మీద ఉన్న ఆ వీరులు ఇద్దరు సూర్యకిరణాలవలె ఉన్న తోమరాలు అనే ఆయుధాలతో ఒకరినొకరు తీవ్రంగా గాయపరచుకొని, సింహనాదాలు చేశారు. మళ్ళీ ఏనుగులతోనే వెనక్కు వెళ్ళి,

మండలాకారంగా తిరిగారు. ఇద్దరూ ధనుస్సులు తీసుకొని, ఒకరినొకరు బాణాలతో గాయపరచుకొన్నారు. వారు గర్జనలతో, తాళధ్వనులతో, బాణ శబ్దాలతో, యుద్ధవీరులను సంతోషపెడుతూ, సింహనాదం చేశారు. యుద్ధవిశారదులయిన వారిద్దరు మహాబలులు. గాలికి పతాకలు కదులుతుండగా తొండాలు పైకెత్తిన ఏనుగులమీద ఉండి యుద్ధం చేశారు. వారు ఒకరి ధనుస్సును వేరొకరు ముక్కలు చేసి, పెద్దగా గర్జించారు. వర్షాకాలమేఘాలు వాన కురిసినట్లు శక్తులు, తోమరాలు అనే ఆయుధాలను కురిపించారు. అప్పుడు క్షేమధూర్తి పెద్దసింహనాదం చేస్తూ, తోమరంతో భీముని వక్షఃస్థలాన్ని ఛేదించి, తీవ్రవేగంతో ఆరు తోమరాలు ప్రయోగించాడు. తన శరీరంలో తగినభాగాన్ని ఆశ్రయించి ఉన్న ఆ తోమరాలతో; కోపంతో వెలిగిపోయే ఆ భీమసేనుడు మేఘాలు ఆవరించిన కిరణాలు గల సూర్యునివలె విరాజిల్లాడు. అప్పుడు భీముడు సూర్యవర్ణ తుల్యమై, సూటిగా పోయే, అయోమయ తోమరాన్ని గట్టిపూనికతో శత్రువుమీద ప్రయోగించాడు. అప్పుడు కులూతాధిపతి అయిన క్షేమధూర్తి ధనుస్సును బాగా వంచి, పదిబాణాలతో తోమరాన్ని ముక్కలు చేసి, అరవై బాణాలతో భీముని గాయపరిచాడు.

ఆ తరువాత భీముడు గర్జిస్తూ మేఘధ్వని గల ధనుస్సు తీసుకొని, బాణాలతో శత్రుగజాన్ని బాధించాడు. యుద్ధంలో భీముని బాణ సమూహంతో బాధితమయిన ఆ ఏనుగు ఎంత నిలువరించినా గాలి దెబ్బకు ఎగిరిపోయే మేఘంలాగా నిలువలేదు. భయంకర మయిన భీముని గజరాజం శత్రుగజాన్ని పెద్దగాలికి తూలిపోతున్న మేఘాన్ని వాయువేగంతో పోయే మేఘంలాగా వెంబడించింది. ప్రతాపవంతు డయిన క్షేమధూర్తి తన ఏనుగును ఆపి, వెంట పరిగెత్తుకొస్తున్న భీముని ఏనుగును బాణాలు వేసి, గాయపరిచాడు. అంతట భీముడు వంగిన ములుకుగల క్షురప్రం అనే బాణాన్ని చక్కగా ప్రయోగించి, శత్రువు ధనుస్సును ఛేదించి, శత్రుగజాన్ని బాధించాడు. రణరంగంలో కోపించిన క్షేమధూర్తి భీముని తీవ్రంగా గాయపరిచాడు, ఆయన ఏనుగు మర్మస్థానాలలో బాణాలతో కొట్టాడు. భారతా! భీముని ఆ ఏనుగు నేలగూలింది. అది పడకముందే భీముడు దాని మీది నుంచి నేలమీదికి దూకి, నిలుచున్నాడు. భీముడు కూడా ఆయన ఏనుగును గదతో నలగగొట్టాడు. ఆ నేలగూలిన ఏనుగుమీది నించి దూకి, క్షేమధూర్తి ఆయుధాన్ని ఎత్తిపట్టుకొని తన మీదికి వస్తుండగా భీముడు గదతో ఆయనను కొట్టాడు. చేతిలోని ఖడ్గంతోనే క్షేమధూర్తి తన ఏనుగుప్రక్కనే పడ్డాడు. వజ్రాయుధం దెబ్బకు ధ్వంసమయిన కొండవలె, పిడుగుపడిన సింహం వలె నేలగూలిన కులూత రాజును చూసి, న్యథజెందిన సీసేన పారిపోయింది.

13. సాత్యకి విందానువిందుల వధించుట.

సంజయుడు చెప్పాడు - 'కర్ణుడు యుద్ధంలో వంగిన ములుకులు గల బాణాలతో పాండవసేనను సంహరించాడు. రాజా! అలాగే నీ పుత్రుని సేనను కూడా మహారథు లయిన పాండవులు క్రుద్ధు లయి కర్ణుని ఎదుటనే సంహరించారు. ఆ యుద్ధంలో కర్ణుడు వేసిన బాణాల దెబ్బలు తిన్న ఏనుగుల గుంపులు పెద్దగా ఘీంకరించాయి. బాధతో మూలిగాయి. బాగా వాడిపోయాయి. పది దిక్కుల్లో గిరగిరా తిరిగాయి. ఆ రీతిగా కర్ణుడు తమ సేనలను సంహరిస్తుంటే, నకులుడు వేగంగా కర్ణుని మీదికి దూకాడు. దుష్కరమయిన వీరకార్యం చేస్తున్న అశ్వత్థామను భీమసేనుడు, విందానువిందులను సాత్యకి వారించారు. తమ మీదికి వస్తున్న శ్రుతకర్మను చిత్రసేనుడు అనే రాజు, చిత్రమయిన జెండా, ధనుస్సులు గల చిత్రుని ప్రతివింధ్యుడు ఎదుర్కొన్నాడు. దుర్యోధనుడు యుధిష్ఠిరుని, ధనంజయుడు సంశప్తక గణాలను ఎదుర్కొన్నారు. ఆ యుద్ధంలో ధృష్టద్యుమ్నుని కృపాచార్యుడు, కృతవర్మను శిఖండి ఎదుర్కొన్నారు. మహారాజా! శ్రుతకీర్తి శల్యుని, దుఃశాసనుని సహదేవుడు ఎదుర్కొన్నారు. కేకయ రాజులు సాత్యకిని బాణవర్షంతో కప్పివేయగా, సాత్యకి కేకయులను శరవర్షంతో ఆచ్ఛాదించాడు. మహారణ్యంలో రెండు ఏనుగులు తమ శత్రువయిన ఏనుగును దంతాలతో పొడిచినట్లు ఆ కేకయ సోదరులు సాత్యకి గుండెల్లో బాణాలు వేశారు. రణరంగంలో వారిద్దరి కవచాలు సాత్యకి బాణాలతో పగిలిపోయినా సత్యకర్ము డయిన సాత్యకిని బాణాలతో బాధించారు. సాత్యకి నవ్వుతూ వారిని అన్ని దిక్కులనుంచి బాణవర్షంతో కప్పివేశాడు. వారు సాత్యకి బాణవర్షంతో అడ్డగింపబడుతూనే సాత్యకి రథాన్ని వేగంగా బాణాలతో కప్పివేశారు. మహాకీర్తిమంతుడయిన సాత్యకి వారిద్దరి ధనుస్సులను ముక్కలు చేశాడు. తీక్షణమయిన బాణాలతో వారిని వారించాడు. ఆ విందానువిందులు చిత్రమయిన ధనుస్సులను తీసుకొని గొప్ప బాణాలను ప్రయోగిస్తూ, సాత్యకిని కప్పివేస్తూ, వేగంగా చక్కగా సంచరించారు. గ్రద్దల, నెమళ్ళ ఈకలు వెనుకగలిగి, స్వర్ణభూషణాలు గల వారు వేసిన బాణాలు అన్ని దిక్కులను వెలిగిస్తూ పడ్డాయి.

రాజా! ఆ మహాయుద్ధంలో బాణాలతో అంధకారం ఏర్పడ్డది. ఆ మహారథులు పరస్పరం ధనుస్సులను ఛేదించుకొన్నారు. అప్పుడు సాత్యకి కోపించి, ఇంకొక ధనుస్సును తీసుకొని, అల్లెత్రాటిని సంధించి, పదునయిన బాణంతో అనువిందుని శిరస్సును ఖండించాడు. రాజా! కుండలాలతో అలంకృతమయిన ఆతని శిరస్సు క్రిందపడింది. మహాయుద్ధంలో చనిపోయిన శంబరుని శిరస్సువలె అనువిందుని శిరస్సు కేకయసేనలను దుఃఖంలో ముంచివేస్తూ, వేగంగా నేలమీద పడింది. శూరు డయిన అనువిందుడు హతుడు కావటం చూసి, ఆతని సోదరుడు మహారథు డయిన విందుడు ధనుస్సును ఎక్కుపెట్టి, సాత్యకిని

నిరోధించాడు. ఆ విందుడు బంగారు పుంఖాలు గల్గి రాతిమీద సానపెట్టిన అరువది బాణాలతో సాత్యకిని గాయపరచి, పెద్దగా సింహనాదం చేసి, 'నిలు, నిలు' అన్నాడు. విందుడు చాలా వేగంగా అనేక వేల బాణాలతో సాత్యకి చేతులమీద, గుండెల మీద వేశాడు. రాజా! సాత్యకి బాణాలతో శరీరం అంతా గాయాలు కాగా, పూచిన మోదుగు చెట్టు వలె విరాజిల్లాడు. కేకయ రాజు బాణాలు తగిలిన సాత్యకి నవ్వుతున్నట్లు కేకయుని ఇరువది అయిదు బాణాలతో బాధించాడు. రథికశ్రేష్ఠులయిన వారిద్దరు పరస్పరం తమ చక్కని ధనుస్సులను ఖండించుకొన్నారు. సారథులను చంపుకొన్నారు. గుర్రాలను చంపుకొన్నారు. రథాలు ధ్వంసం కాగా వారిద్దరు నూరు చంద్రబింబాలతో అలంకృతమయిన డాళ్ళను, ఖడ్గాలను తీసుకొని, ఖడ్గయుద్ధం చేశారు. యుద్ధరంగంలో ఖడ్గచారులయిన వారిద్దరు దేవాసుర యుద్ధంలో మహాబలులయిన జంభాసుర మహేంద్రుల వలె విరాజిల్లారు. యుద్ధంలో వారు మండలాకారంగా వేగంగా తిరుగుతూ, ఒకరినొకరు ఎదుర్కొన్నారు. ఒకరినొకరు చంపుకోటానికి వారిద్దరూ బాగా ప్రయత్నించారు.

అప్పుడు సాత్యకి కేకయరాజు డాలును రెండుగా ధ్వంసం చేశాడు. కేకయరాజు కూడా సాత్యకి డాలును రెండు ముక్కలు చేశాడు. కేకయరాజు నక్షత్రసమూహంతో గూడిన ఆయన డాలును ఛేదించి, ముందుకు వెనకకు వెళ్ళే మండలాలుగా సంచరించాడు. శ్రేష్ఠమయిన ఖడ్గాన్ని ధరించి, యుద్ధరంగంలో సంచరిస్తూన్న ఆయనను సాత్యకి త్వరపడి, అడ్డగాంచేయి త్రిప్పి, ఖడ్గంతో ఖండించాడు. విందుడు కవచంతో గూడా మహారణంలో రెండుగా ముక్కలయి వజ్రాయుధంతో హతమయిన పర్వతంలాగా పడ్డాడు. రథికశ్రేష్ఠుడు, శూరుడు, శత్రుసంతాపకుడు అయిన సాత్యకి ఆ రాజును సంహరించి, వేగంగా యుధామన్యుని రథం ఎక్కాడు. తరువాత బాగా సిద్ధంచేసిన ఇంకొక రథం ఎక్కి, సాత్యకిని బాణాలతో కేకయుల మహాసైన్యాన్ని సంహరించాడు. ఆ రీతిగా వధించబడుతున్న కేకయుల మహాసేన ఆ సాత్యకిని వదలి, పదిదిక్కులకూ పారిపోయింది.'

14. శ్రుతకర్మ ప్రతివింధ్యులు చిత్రసేన చిత్రులను వధించుట - అశ్వత్థామ భీముని ఎదుర్కొనుట.

సంజయుడు చెప్పాడు - 'రాజా! ఆ తరువాత ద్రౌపదీ పుత్రుడయిన శ్రుతకర్మ క్రుద్ధు డయి చిత్రసేనుడు అనే రాజును ఏబది బాణాలతో కొట్టాడు. అభిసార రాజయిన చిత్రసేనుడు వంగిన ములుకులు గల బాణాలతో శ్రుతకర్మను కొట్టి, అయిదు బాణాలతో ఆయన సారథిని, గాయపరిచాడు. అప్పుడు కోపించిన శ్రుతకర్మ సేనాముఖంలో పదునయిన

బాణంతో చిత్రసేనుని మర్మస్థానంలో కొట్టాడు. ఆ మహాత్ముడు వేసిన బాణం తీవ్రంగా తగిలి, వీరుడయిన చిత్రసేనుడు మూర్ఛపోయాడు. ఈ అవకాశంతో శ్రుతకీర్తి ఆ రాజును తొంబది బాణాలతో కప్పివేశాడు. చిత్రసేనుడు మూర్ఛనుంచి తేరుకొని, బల్లెంతో శ్రుతకర్మ ధనుస్సును ఛేదించి, ఏడు బాణాలతో ఆయనను బాధించాడు. శ్రుతకర్మ బంగారు కవచంతో అలంకృతమూ, శత్రు బాణవేగాన్ని ధ్వంసం చేసే ఇంకొక ధనుస్సు తీసుకొని, బాణతరంగాలతో చిత్రసేనుని చిత్ర రూపధరుని చేశాడు. చిత్రమాలికలు దాల్చిన యువకుడయిన ఆ రాజు బాణాలతో చిత్రితుడయి యుద్ధరంగంలో ముళ్ళతో నిండిన ఏదుపందిలాగా విరాజిల్లాడు. చిత్రసేనుడు శ్రుతకర్మ వక్షఃస్థలం బాణంతో ఛేదించి, 'నిలు, నిలు' అన్నాడు. ఆ బాణం నాటుకొన్న శ్రుతకర్మ రక్తం కారుతుండగా గైరికాది ధాతువులతో తడిసిన పర్వతం లాగా ఉన్నాడు. అప్పుడు శరీరం అంతా రక్తంతో తడిసిపోగా ఎర్రటి కాంతితో శ్రుతకర్మ పూచిన మోదుగు చెట్టులాగా విరాజిల్లాడు. రాజా! శత్రువు ఇలా ఆక్రమించగా శ్రుతకర్మ కుపితుడయి చిత్రసేనుని శత్రునివారక మయిన ధనుస్సును రెండుగా ఛేదించాడు. ధనుస్సు విరిగిపోయిన చిత్రసేనుని మూడు వందల బాణాలతో కప్పివేసి, పదునయిన బాణాలతో వేధించాడు. ఇంకొక పదునయిన తీక్ష్ణమయిన బాణంతో ఆ మహాత్ముని శిరస్త్రాణంతో గూడిన శిరస్సును అపహరించాడు. చిత్రసేనుని శిరస్సు హఠాత్తుగా స్వర్గాన్నుంచి నేలమీద పడిన చంద్రునివలె విరాజిల్లింది.

ఆర్యా! అభిసార రాజయిన చిత్రసేనుడు హతుడు కావటం చూసిన ఆయన సైన్యం వేగంగా శ్రుతకర్మ మీదికి వచ్చింది. అప్పుడు శ్రుతకర్మ ఆ రాజు సైన్యాన్ని ప్రళయకాలంలో యమధర్మరాజు సర్వభూతాలను పారద్రోలినట్లు పారద్రోలాడు. నీ మనుమడు శ్రుతకర్మ వధిస్తుంటే ఆ సైనికులు దావాగ్నితో దగ్ధమయిన ఏనుగులు లాగా నలుదిక్కులకు వేగంగా పారిపోయారు. శత్రువిజయంలో నిరుత్సాహులయి పారిపోతున్న వారిని తీక్ష్ణమయిన బాణాలతో పారద్రోలుతూ' శ్రుతకర్మ విరాజిల్లాడు. అప్పుడు ప్రతివింధ్యుడు చిత్రుని అయిదు బాణాలతో ఛేదించి, సారథిని మూడు బాణాలతో, ధ్వజాన్ని ఒక బాణంతో కొట్టాడు. చిత్రుడు బంగారు పిడులుగల తొమ్మిది బాణాలు ప్రతివింధ్యుని మీద వేశాడు. భారతా! ప్రతివింధ్యుడు ఆయన ధనుస్సును బాణాలతో ఖండించి, ఐదు బాణాలతో కొట్టాడు. మహారాజా! తరువాత చిత్రుడు బంగరు గంటలు గల శక్తి ఆయుధాన్ని ఘోరమయిన అగ్ని శిఖనువలె నీ మనుమని మీద వేశాడు. పెద్ద ఉల్కతో సమానమయి, వేగంగా తన మీద పడుతున్న ఆ శక్తిని ప్రతివింధ్యుడు నవ్వుతూ, యుద్ధంలో రెండు ముక్కలుగా నరికాడు. పదునయిన ప్రతివింధ్యుని బాణాలతో రెండు ముక్కలయి పడుతున్న ఆ శక్తి ప్రళయకాలంలో సర్వభూతాలను, భయకంపితులను చేసే అశనివలె

No. 96362

(పిడుగువలె) నేలబడ్డది. తమ శక్తి ఆయుధం నిహతం కావటం చూసి, చిత్రుడు పెద్ద గదను ప్రతివింధ్యుని మీద విసిరాడు. ఆ గద మహారణంలో ఆయన రథాశ్వాలను, సారథిని, రథాన్ని మర్దించి వేగంగా నేలమీద పడింది.

భారతా! ఈ సమయంలోనే ప్రతివింధ్యుడు రథంమీదినుంచి దూకి, శక్తి ఆయుధాన్ని చిత్రుని మీద వేశాడు. రాజా! అలా మీదవచ్చి పడుతున్న శక్తిని మనస్వి అయిన చిత్రుడు పట్టుకొని, దాన్నే ప్రతివింధ్యుని మీదికి విసిరాడు. ఆ శక్తి శూరుడయిన ప్రతివింధ్యుని వద్దకు వచ్చి, ఆయన కుడిభుజాన్ని ఛేదించి, నేలబడ్డది. క్రిందపడిన అది ఆ ప్రదేశాన్ని పిడుగులాగా ప్రకాశింపజేసింది. రాజా! తరువాత ప్రతివింధ్యుడు చిత్రుని వధింపదలచి తోమరం అనే ఆయుధాన్ని వేశాడు. అది ఆయన కవచాన్ని, గుండెను ఛేదించి పెద్ద పాము కలుగులో దూరినట్లు వేగంగా భూమిలో ప్రవేశించింది. చిత్రుడు అప్పుడు తోమరం దెబ్బతిని, బాగా బలిసిన విశాలమయిన పరిఘల వంటి బాహువులను చాచి నేలగూలాడు. మీవారు చిత్రుడు హతుడు కావటం చూసి, వేగంగా ప్రతివింధ్యుని మీదికి నలువైపులా చుట్టుముట్టి పరుగెత్తారు. వారు వివిధమయిన బాణాలను, ముప్పలతో ఉన్న శతఘ్నులను ప్రయోగిస్తూ, సూర్యుని మేఘాల సమూహాలు వలె ఆయనను కప్పివేశారు. మహాబాహువయిన ఆయన వాటిని అన్నిటిని యుద్ధంలో ధ్వంసం చేసి, నీ సేనను ఇంద్రుడు అసురసేనను వలె పారద్రోలాడు. రాజా! పాండవులు యుద్ధంలో వధిస్తుంటే మీవాళ్ళు గాలి వేగంగా వీస్తే ఎగిరిపోయే మేఘాలలాగా చెల్లాచెదరు అయ్యారు. అన్నివైపులనుండి వధిస్తుండగా సేన పారిపోతుంటే అశ్వత్థామ ఒక్కడే భీముని త్వరితంగా ఎదుర్కొన్నాడు. అప్పుడు వారిద్దరు తలపడటం దేవాసుర యుద్ధంలో వృత్రమహేంద్రులు తలపడినట్లు ఘోరంగా ఉన్నది.'

15. అశ్వత్థామ భీమసేనుల యుద్ధము.

సంజయుడు చెప్పాడు – 'రాజా! తరువాత అశ్వత్థామ తన అస్త్రప్రయోగపాటవాన్ని ప్రదర్శిస్తూ, చాలా త్వరగా ఒక బాణంతో భీముని గాయపరిచాడు. మానవుల మర్మస్థానాలు తెలిసినవాడు, అస్త్రప్రయోగంలో నిపుణు డయిన ఆయన మళ్ళీ భీముని తొంబది పదునయిన బాణాలతో కొట్టాడు. రాజా! అశ్వత్థామ వేసిన పదునయిన బాణాలు తగిలిన భీముడు యుద్ధభూమిలో కిరణాలతో గూడిన సూర్యునిలాగా విరాజిల్లాడు. భీముడు చక్కగా ప్రయోగించిన వేయి బాణాలతో అశ్వత్థామను కప్పివేసి, సింహనాదం చేశాడు.

అప్పుడు అశ్వత్థామ బాణాలతో భీముని బాణాలను వారించాడు. తరువాత నవ్వుతూ, భీముని నుదుట ఒక బాణం నాటాడు. వనంలో మదించిన ఖడ్గమృగం ముఖాన కొమ్మును దాల్చినట్లు అశ్వత్థామ వేసిన బాణాన్ని భీముడు నుదుట ధరించాడు. తరువాత భీముడు నవ్వుతూ, అశ్వత్థామను నుదుట తగిలేటట్లు మూడు బాణాలు వేసి, గాయపరిచాడు. ఆ బ్రాహ్మణుడు నుదుట నాటుకొన్న బాణాలతో వర్షాకాలంలో వానతో తడిసిన మూడు శిఖరాలు గల పర్వతశ్రేష్ఠంలాగా శోభిల్లాడు. తరువాత అశ్వత్థామ నూరుబాణాలతో భీముని పీడించాడు. తీవ్రంగా వీచేగాలి పర్వతాన్నివలె ఆయన భీముని చలింపజేయలేదు. ఈ రీతిగానే భీముడు అశ్వత్థామను పదునయిన వందలకొలది బాణాలు వేసినా జలప్రవాహం పర్వతాన్నివలె కంపింపజేయలేకపోయాడు. ఉత్తమరథాల మీద ఉన్న వారిద్దరు పరస్పరం ఘోరమయిన బాణాలతో కప్పివేసుకొంటూ విరాజిల్లారు. జనక్షయాన్ని చేసే వారిద్దరు ఒకరినొకరు బాణశ్రేష్ఠాలతో తపింపజేస్తూ ఉంటే, బాగా ప్రకాశిస్తున్న ఇద్దరు సూర్యులు తమ కిరణాలతో తపింపజేస్తున్నట్లు ఉన్నారు. మహాసంగ్రామంలో ఒకరినొకరు ప్రతీకారం చేసుకొనటానికి ప్రయత్నిస్తున్నారు. వారు నిర్భయులయి పరస్పరం అస్త్రాలను ధ్వంసం చేస్తున్నారు. బాణాలే కోరలుగా గలవారు, ధనుస్సులే ముఖాలుగా గలవారు, దుర్ధర్షులు, వరశ్రేష్ఠ లయిన వారిద్దరు యుద్ధరంగంలో పెద్దపులులు లాగా సంచరించారు. బాణసమూహంతో అంతటా కప్పబడిన వారిద్దరు ఆకాశంలో మేఘాలు కప్పివేసిన చంద్రసూర్యులవలె అదృశ్యులయ్యారు. తరువాత శత్రువులను అణచివేసే వారిద్దరు ఒక్కక్షణంలో మేఘ సమూహం తొలగిన తరువాత కనిపించే అంగారక బుధగ్రహాలలాగా విరాజిల్లారు.

ఆ యుద్ధం దారుణంగా జరుగుతుండగా అక్కడనే అశ్వత్థామ భీముడు తనకుడివైపు ఆయ్యేటట్టుగా చేశాడు. ఆయన భయంకరమయిన వందలకొలది బాణాలను వర్షధారలతో పర్వతాన్ని వలె భీముని ముంచివేశాడు. శత్రువుయొక్క ఆ విజయలక్షణాన్ని భీముడు సహించలేదు. అప్పుడు భీముడు కూడా గమనాగమనాది మండలాకారంగా తిరగటంతో అశ్వత్థామ కుడివైపు వచ్చేటట్లు చేశాడు. ఆ పురుష సింహుల మధ్య మండాలాకారంగా తిరుగుతూ, అనేక విధాలయిన పరిభ్రమణాలతో భయంకర యుద్ధం జరిగింది. ధనుస్సులను పూర్తిగా వంచివేసిన బాణాలతో వారు ఒకరినొకరు గాయపరుచుకొన్నారు. ఒకరినొకరు వధించటానికి చాలా ఎక్కువ ప్రయత్నం చేశారు. యుద్ధంలో ఒకరినొకరు విరథులను చేయటానికి యత్నించారు. తరువాత అశ్వత్థామ

మహాస్త్రాలను ప్రకటం చేశాడు. భీముడు కూడా ఆ అస్త్రాలతోనే వాటిని ధ్వంసం చేశాడు. మహారాజా! పూర్వం సర్వప్రజల సంహారానికి ఘోరమయిన గ్రహయుద్ధం జరిగినట్లు వారిద్దరి మధ్య భయంకరమయిన అస్త్రయుద్ధం జరిగింది. భారతా! వారిద్దరు వదిలిన బాణాలు అన్నిదిక్కులను వెలిగింపజేస్తూ, నీ సైన్యానికి నలుమూలలా పడసాగాయి. ప్రజాసంహార కాలంలో కలిగే యుద్ధం ఉల్కాపాతంతో వ్యాప్తమయి భయంకరంగా కన్పించినట్లు వారి బాణసమూహంతో నిండి, ఆకాశం ఘోరంగా కన్పించింది. వారిరువురి బాణాలు రాచుకోవటం వల్ల అక్కడ నిప్పురవ్వలతో ప్రదీపించే బాణాగ్ని జనించింది. అది రెండు సేనలను దహించింది. మహారాజా! అక్కడ ఆకాశంలో సంచరిస్తున్న సిద్ధులు వారిలో ఒకరితో ఒకరు 'ఈ యుద్ధం ఇంతకుముందు జరిగిన యుద్ధాలను మించిపోయింది. ఆ యుద్ధాలు అన్నీ కూడా ఈ యుద్ధంలో పదునారవపాలు కూడా కావు. ఇలాంటి యుద్ధం మళ్ళీ ముందు ఎప్పుడూ జరగబోదు. ఆహా! బ్రాహ్మణక్షత్రియులు ఇద్దరు జ్ఞానసంపన్నులేగదా! ఆహా! ఇద్దరూ శౌర్య సంపన్నులు, భీకర పరాక్రమం గలవారు, ఆహా ! భీముడు భయంకరబలం గలవాడు. ఈ అశ్వత్థామ అస్త్ర విద్యావిశారదుడు. ఆహా! ఏమి పరాక్రమసారం! ఆహా! వీరిద్దరి శరీర సౌష్ఠవం ఎంత గొప్పది! వీరిద్దరు యుద్ధభూమిలో కాలాంతక యముల లాగా కన్పిస్తున్నారు. ఆవిర్భవించిన ఇద్దరు రుద్రులులాగా, ఇద్దరు సూర్యులులాగా ఘోరరూపులయిన ఈ పురుష శ్రేష్ఠులు యుద్ధభూమిలో కన్పిస్తున్నారు.' అని సిద్ధులు చెప్పుకొనే మాటలు పలుమారులు విన్పించాయి. అక్కడ కూడిఉన్న దేవతల సింహనాదాలు కూడా వినపడ్డాయి. ఆశ్చర్యకరమై, ఊహకందనిదయి వారి యుద్ధం ఉన్నది. అది సిద్ధచారణ సమూహాలకు ఆశ్చర్యకరం అయింది. అప్పుడు దేవతలు, సిద్ధులు, పరమర్షులు 'అశ్వత్థామా! బాగు, బాగు, భీమా! చాలా బాగుంది! అని వారిద్దరిని ప్రశంసిస్తూ పలికారు.

రాజా! ఆ శూరులు ఇద్దరు పరస్పరం అపకారం చేసుకొంటూ కోపంతో కన్నులు పెద్దవి చేసి, ఒకరినొకరు చూసుకొన్నారు. కోపంతో వారి కన్నులు ఎరుపెక్కాయి. కోపంతో పెదవులు, వణుకుతున్నాయి. కోపంతో పండ్లుకొరుకుతున్నారు. కోపంతో పెదవులు కొరుక్కుంటున్నారు. ఆ మహారథులు యుద్ధభూమిలో బాణాలే జలధారలుగా, శస్త్రాల కాంతులే మెరుపులుగా, బాణవర్షంతో ఒకరినొకరు కప్పివేస్తున్నారు. వారు పరస్పరం ధ్వజాలను, సారథులను, గుర్రాలను గాయపరచి ఒకరినొకరు గాయపరచుకొన్నారు. మహారాజా! యుద్ధంలో క్రోధపూర్ణులయినవారు ఇద్దరు బాణాలు తీసుకొని, ఒకరినొకరు

చంపుకోదలచి వేగంగా వాటిని ప్రయోగించారు. మహారాజా! సేనాగ్రభాగంలో ఆ రెండు బాణాలు వెలుగులు వెదజల్లుతూ సమీపింపవీలుగానివై, వజ్రవేగంతో వారికి తగిలి, గాయపరిచాయి. చాలా వేగంగా తగిలిన ఆ బాణాల దెబ్బలవల్ల మహావీరులయిన అశ్వత్థామ భీములు తమ రథాల మీద పడిపోయారు. రాజా! అశ్వత్థామ మూర్ఛపొందాడని తెలిసి, సారథి సర్వసైన్యాలు చూస్తుండగా రథాన్ని రణరంగం నుంచి బయటకు నడిపాడు. అలాగే భీముడు పలుమారులు స్మృతి తప్పటం వల్ల యుద్ధభూమినుంచి ఆయన రథాన్ని సారథి పక్కకు నడిపాడు.'

16. అర్జునుడు సంశప్తకులతో అశ్వత్థామతో పోరుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు – 'సంజయా! అర్జునునకు సంశప్తకులతో, ఇతర రాజులతో పాండవులకు జరిగిన యుద్ధాన్ని గూర్చి నాకు వివరించు. అశ్వత్థామకు అర్జునునకు జరిగిన యుద్ధం ఇతర రాజులకు పాండవులతో జరిగిన యుద్ధాన్ని గురించి చెప్పు.' సంజయుడు చెప్పాడు – 'రాజా! మన పక్షంలోని వీరులకు శత్రువులతో జరిగిన, దేహపాపాలను నాశనం చేసే యుద్ధం ఎలా జరిగిందో చెపుతాను విను. శత్రునాశకు డయిన అర్జునుడు తీవ్రమయిన గాలి సముద్రాన్ని వలె – జలధి సమానమయిన సంశప్తక సేనను ప్రవేశించి, కల్లోలపరిచాడు. చక్కని కన్నులు, కనుబొమలు, పండ్లు గలిగినవి, పూర్ణచంద్రుని వంటి ముఖాలు గల వీరుల శిరస్సులను అర్జునుడు బాణాలతో ఖండించి, భూమిమీద పరిచాడు. ఆ శిరస్సులు కాడలు లేని పద్మాలులాగా ఉన్నాయి. బాగా గుండ్రంగా పొడుగ్గా, పుష్టిగా ఉండి, చందనమూ, అగరులతో అలంకృతాలై, ఆయుధాలు, చేతి తొడుగులు గలవై, అయిదు తలలుగల పాముల వంటి శత్రువుల చేతులను అర్జునుడు యుద్ధంలో మంగలి కత్తి వంటి బాణాలతో ఖండించాడు. రథాలకు కట్టిన పెద్దబరువు మోసే గుర్రాలను, వాటిని నడిపే సారథులను, ధ్వజాలను, ధనుస్సులను, బాణాలను, రత్నపు అలంకారాలు గల శత్రువుల చేతులను అర్జునుడు బాణాలతో పలుమార్లు ఖండించాడు. రాజా! అర్జునుడు అనేక వేల బాణాలతో ఆరోహకులతో గూడిన రథాలను, ఏనుగులను, గుర్రాలను చంపి, యమలోకానికి పంపాడు.

ఆ సమయంలో సంశప్తకవీరులు మహారోషపూర్ణులయి ఎద అయిన ఆవులకోసం పోరాడే మదమత్తమయిన ఆబోతులవలె గర్జిస్తూ, హుంకరిస్తూ, కొమ్ములతో పొడిచే వృషభాలలాగా తమను బాణాలతో గాయపరుస్తున్న అర్జునుని మీదికి బాణాలు వేస్తూ,

వచ్చారు. ముల్లోకాల విజయంలో దైత్యులకు ఇంద్రునితో జరిగిన యుద్ధంలాగా ఆ అర్జునునికి, ఆ సంశప్తకులకు మధ్య శరీరం జలదరించేలాగా ఘోరయుద్ధం జరిగింది. అర్జునుడు శత్రువుల అస్త్రాలను తన అస్త్రాలతో నివారించి, బాణాలతో వేగంగా వారిని కొట్టి, ప్రాణాలు అపహరించాడు. అర్జునుడు సంశప్తకుల రథాల త్రివేణువును, చక్రాలను, అక్షాలను ఖండించాడు. యోధులను, అశ్వాలను, సారథులను చంపాడు. వీరుల ఆయుధాలను, అమ్ములపొదులను ధ్వంసం చేశాడు. జెండాలను మథించాడు. రక్షణకు ఏర్పరచిన చర్మమయ ఆవరణాలను, కూబరాలను భిన్నంచేశాడు. రథాలమీది మెత్తలను, కాడులను ముక్కలు చేశాడు. రథాలమీది ఆసనాలను, వాహనాలకు కట్టే కాష్ఠాలను ముక్కలు చేశాడు. గాలి మేఘాలను చెల్లాచెదరు చేసినట్లు అర్జునుడు రథాలను ముక్కలు ముక్కలు చేసి, అందరిని ఆశ్చర్యమగ్నులను చేశాడు. తాను ఒక్కడే వేయిమంది మహారథులతో సమానంగా చూడదగిన పరాక్రమం ప్రదర్శించాడు. అది శత్రువులకు భయాన్ని పెంపొందించింది. సిద్ధులు, దేవతలు, ఋషుల సమూహాలు ఆయనను స్తుతించాయి. దేవదుందుభులు మ్రోగాయి. కృష్ణార్జునుల శిరస్సుల మీద పూలవాన కురిసింది. ఈ క్రిందిరీతిగా ఆకాశవాణి పలికింది. 'చంద్రునికాంతి, అగ్ని దీప్తి, వాయువు బలం, సూర్యుని ప్రకాశాలను ఈ కృష్ణార్జునులు ధరించి ఉన్నారు. ఒకేరథం మీద ఉన్న ఈ వీరులు బ్రహ్మేశంకరులవలె జయింప శక్యంకానివారు. సర్వప్రాణి శ్రేష్ఠులయిన వీరిద్దరు నరనారాయణులు.' భారతా! ఈ ఆశ్చర్యకరమయిన దృశ్యాన్ని చూసి, ఆకాశవాణిని విని, అశ్వత్థామ సర్వసన్నద్ధుడయి యుద్ధరంగంలో కృష్ణులమీదికి వెళ్ళాడు. అప్పుడు శత్రునాశక బాణాలను ప్రయోగిస్తున్న అర్జునుని చూసి, అశ్వత్థామ బాణం పట్టుకొన్న చేతితో పిలుస్తూ నవ్వుతూ ఇలా అన్నాడు. 'వీరా! నన్ను యోగ్యుడయిన అతిథిగా భావిస్తే అన్నివిధాలా నాకు యుద్ధం అనే ఆతిథ్యాన్ని ఇవ్వవలసింది.' ఈవిధంగా యుద్ధం చేయాలనే కోర్కెతో ఆచార్య పుత్రుడు పిలువగా అందుకు అంగీకరించి, అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. 'మాధవా! సంశప్తకులను వధించాలి. నన్ను అశ్వత్థామ యుద్ధానికి పిలుస్తున్నాడు. ఈ రెండింటిలో నేను ఇపుడు ఏమి చేయాలి ? నీ అంగీకారమయితే మొదట అశ్వత్థామకు యుద్ధాతిథ్యం గ్రహించే అవకాశం ఇస్తాను.' వైదిక విధానంలో ఆహూతుడయిన ఇంద్రాధిదేవతను వాయువు యజ్ఞానికి చేర్చినట్లు అర్జునుని మాటలు విన్న కృష్ణుడు జయదాయకమయిన రథంమీద అశ్వత్థామ ఎదుటికి తీసుకొనివెళ్ళాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు ఏకాగ్ర మనస్కుడయిన అశ్వత్థామను చూసి, 'అశ్వత్థామా!

స్థిరంగా ఉండి బాణాలు వేయి. నీ మీదికి వచ్చే బాణాలను ఓర్చుకో. యజమానిని ఆశ్రయించి ఉండి బ్రతుకీడ్చే వ్యక్తికి తన రక్షకుని ఋణం తీర్చుకునే సమయం ఆసన్నమయింది. బ్రాహ్మణుని వివాదం సూక్ష్మం (బుద్ధి ద్వారా సాధ్యం). కాని క్షత్రియుల జయపరాజయాలు స్థూలమయిన ఆయుధాలతో నెరవేరుతాయి. అజ్ఞానం వల్ల అర్జును నుంచి దివ్య సత్కారాన్ని కోరుతున్నావు. దాన్ని పొందగోరి, స్థిరంగా ఉండి, అర్జునునితో యుద్ధం చెయ్యి.' ఇలా శ్రీకృష్ణుడు చెప్పగా అశ్వత్థామ సరే అని శ్రీకృష్ణుని అరువది బాణాలతో అర్జునుని మూడు బాణాలతో, గాయపరిచాడు. తీవ్రంగా కోపించిన అర్జునుడు మూడు బాణాలు వేసి, అశ్వత్థామ ధనుస్సును ఖండించాడు. అశ్వత్థామ చాలా ఘోరమయిన ఇంకొక ధనుస్సు తీసుకొన్నాడు. ఒక్క క్షణంలో ఆ ధనుస్సుకు అల్లెత్రాటిని సంధించి, మూడు వందల బాణాలు శ్రీకృష్ణుని మీద, వేయి బాణాలు అర్జునుని మీద వేసి వారిని బాధించాడు. ఆ తరువాత అశ్వత్థామ ప్రయత్నపూర్వకంగా అర్జునుని యుద్ధభూమిలో కదలకుండా చేసి, ఆయన మీద వేలకొలదీ లక్షల కొలది బాణాలు వర్షించ నారంభించాడు. ఆర్యా! ఆ సమయంలో వేదవేత్త అయిన అశ్వత్థామ అమ్ములపొది నుంచి, ధనుస్సునుంచి, నారినుంచి, బాహువుల నుండి, చేతులనుండి వక్షఃస్థలం నుంచి, నోటినుంచి, ముక్కు నుంచి, కన్నుల నుంచి, చెవులనుంచి, శిరస్సునుంచి ఇతరాంగాల నుంచి, రోమాలనుంచి, కవచాన్నుంచి, రథాన్నుంచి, జెండానుంచి బాణాలు బయల్వెడలాయి. శ్రీకృష్ణార్జునులను మహత్తరమయిన బాణ సమూహంతో కొట్టి సంతోషంతో, అశ్వత్థామ మహామేఘ సమూహాల గర్జన వంటి సింహనాదం చేశాడు.

మహారాజా! అశ్వత్థామ ప్రయోగించగా అంతటా పడుతున్న ఆ బాణాలు రథంమీద ఉన్న శ్రీకృష్ణార్జునులను కప్పివేశాయి. తరువాత ప్రతాపవంతుడయిన అశ్వత్థామ తీక్ష్ణమయిన వందలకొలది బాణాలతో శ్రీకృష్ణార్జునులను నిశ్చేష్టులను చేశాడు. చరాచర ప్రపంచ రక్షకులు బాణాలతో ఆచ్ఛాదితులు కావటం చూసి, స్థావర జంగమప్రాణులు అన్నీ హాహాకారాలు చేశాయి. సిద్ధులు, చారణ సమూహాలు ఆ చుట్టుప్రక్కల చేరి, లోకాలకు మూడింటికి మేలు కలుగుగాక అని పలికారు. రాజా! కృష్ణార్జునులను యుద్ధభూమిలో బాణాలతో కప్పివేస్తున్న అశ్వత్థామ పరాక్రమం వంటి పరాక్రమాన్ని అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. అశ్వత్థామ ధనుష్టంకారం రథికులను రణరంగంలో భయపెట్టేదిగా ఉంది. ఆయన సింహనాదాన్ని పలుమారులు విన్నాను. యుద్ధభూమిలో సంచరిస్తున్న అశ్వత్థామ ధనుస్సు అల్లెత్రాడు కుడి ఎడమనుంచి బాణాలు వేసే సమయంలో మేమమధ్యంలో మెరిసే మెరుపులాగా కన్పించింది. చాలా వేగంగా యుద్ధంచేసేవాడు, దృఢమయిన రీతిగా చేతిని కదిలించగల అర్జునుడు మోహావేశుడయి చూస్తుండిపోయాడు. తన పరాక్రమాన్ని అశ్వత్థామ హరించాడని అర్జును డనుకొన్నాడు. రాజా! యుద్ధకార్యాన్ని నిర్వహిస్తున్న అశ్వత్థామ శరీరం రణభూమిలో పరమేశ్వరుని భీకర రూపంలాగా

తేరిపారజూడరానిదయింది. నరపాలా! ద్రోణపుత్రుడు యుద్ధంలో అధికుడవుతూ అర్జునుడు తగ్గుతుండగా శ్రీకృష్ణునికి రోషం కలిగింది. రాజా! ఆయన రోషంతో నిట్టూర్పు విడుస్తూ, చూపుతో దహిస్తున్నట్లు అశ్వత్థామను, అర్జునుని పలుమారులు చూచాడు. అప్పుడు క్రుద్ధుడయి శ్రీకృష్ణుడు అర్జునునితో ప్రేమపూర్వకంగా ఇలా అన్నాడు. 'భరతనందనా! పార్థా! ఈరోజు అశ్వత్థామ నిన్ను మించిపోతున్నాడు. ఇప్పుడు యుద్ధంలో నీ పరిస్థితి నాకు ఆశ్చర్యకరంగా ఉన్నది. ఇప్పుడు నీ చేతిలో గాండీవం ఉన్నదా? పిడికిలి పట్టుసడలలేదు గదా! నీ బలం, భుజబలం వెనుకటివలెనే ఉన్నదా? యుద్ధంలో ఇప్పుడు అశ్వత్థామ నీకంటే సైచేయిగా ఉన్నాడు. భరతశ్రేష్ఠా! గురుపుత్రు డని ఈయనను గౌరవిస్తూ, ఉపేక్షించకు. పార్థా! ఇది ఉపేక్షించదగిన సమయంకాదు.

అశ్వత్థామ సింహనాదాన్ని విని, అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు - 'మాధవా! అశ్వత్థామ నా విషయంలో ఎంత దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాడో చూడు. తాను నిర్మించిన బాణ గృహంలో చిక్కి, మనం మరణించామని అనుకొంటున్నాడు. నా ధనుర్విద్య, బలాలతో ఈయన కోరికను ఇదుగో వమ్ము చేస్తాను చూడు.' అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రాలను ఒక్కొక్కదాన్ని మూడు ముక్కలు చేసి భరతశ్రేష్ఠుడయిన అర్జునుడు మంచును గాలివలె ధ్వంసం చేశాడు. తరువాత మళ్ళీ అర్జునుడు అశ్వాలను, సారథులను, రథాలను, ఏనుగులను వారి ధ్వజాలను, పదాతుల సమూహాలను భీకర బాణాలతో ధ్వంసం చేశాడు. ఏయే వ్యక్తులు ఏయే రూపాల్లో ఉండి అది చూశారో వారు అందరూ తాము అర్జునుని బాణాలతో ఆవరింపబడ్డట్టు భావించారు. గాండీవ ప్రయుక్తాలయి నానారూపాలయిన బాణాలు క్రోసెడు దూరంలో ఉన్న ఏనుగులను, మనుష్యులను చంపుతున్నాయి. మదధారలను కార్చే ఏనుగుల తొండాలు తెగి, గొడ్డలితో నరికిన పెద్ద చెట్లలాగా నేలబడ్డాయి. తరువాత ఏనుగులు మావటివారితో సహా ఇంద్రుని వజ్రాయుధంతో మథితాలయిన పర్వత సమూహాలవలె నేల గూలాయి. బాగా అలంకరింపబడిన గంధర్వ నగరం వంటి ఆకారం గలిగి, మంచి శిక్షణ పొందిన గుర్రాలు కలిగి, యుద్ధమదమత్తులయిన వీర శత్రువుల రథాలను, శత్రువులను ధ్వంసం చేశాడు. చక్కగా అలంకృతా లయిన అశ్వాలను, రౌతులను, పదాతులను అర్జునుడు సంహరించాడు. అర్జునుడనే ప్రళయకాల సూర్యుడు సంశప్తకులు అనే మహాసముద్రాన్ని తీవ్రమయిన బాణ కిరణాలతో ఎండించాడు. మహాపర్వతం లాగా నిలిచి ఉన్న అశ్వత్థామను మహావేగం గల, వజ్రాయుధం వంటి బాణాలతో ఇంద్రుడు పర్వతాన్నివలె అర్జునుడు ఛేదించాడు. క్రుద్ధ డయిన ఆచార్యపుత్రుడు గుర్రాలతో కూడా సారథి అయిన శ్రీకృష్ణుని మీద అర్జునుని మీద బాణాలు వేస్తూ, యుద్ధం చేయదలచి రాగా, అర్జునుడు ఆ బాణాలను ఖండించాడు. ఆ తరువాత చాలా తీవ్రంగా కోపించిన అశ్వత్థామ తగిన అతిథి వచ్చినప్పుడు గృహస్థు తన గృహాన్ని కూడా సమర్పించినట్లు

అర్జునునిపై తన అస్త్రాల నన్నింటిని వేసి సమర్పించాడు. దాత పంక్తిలో కూర్చొనదగని వారిని వదలి పంక్తిలో కూర్చోదగిన ఉత్తమ యాచకుల వద్దకు వచ్చినట్లు, అర్జునుడు సంశప్తకులను వదలి అశ్వత్థామవైపు వచ్చాడు.'

17. అర్జునునిచేతిలో అశ్వత్థామ ఓటమి.

సంజయుడు చెప్పాడు - 'రాజా! ఆ తరువాత ఆకాశంలో నక్షత్ర మండల సమీపంలో పరస్పర యుద్ధం చేసే శుక్రాచార్య బృహస్పతులవలె యుద్ధరంగంలో శ్రీకృష్ణ సన్నిధిలో శుక్రబృహస్పతి సమాన తేజస్సులయిన అశ్వత్థామ అర్జునుల మధ్య యుద్ధం జరిగింది. అతిచారగతితో చరించే రెండు గ్రహాలు జగత్తుకు భయజనకాలు అయినట్లు ఆవీరులు ఇద్దరు తమ బాణా లనే ప్రజ్వలించే కిరణాలతో పరస్పరం సంతాపకరులు అయ్యారు. అప్పుడు అర్జునుడు ఒక బాణం అశ్వత్థామ కనుబొమల మధ్య తగిలేటట్లు వేశాడు. దానితో ఆయన పైకిలేచి ఉన్న కిరణం గల సూర్యునిలాగా విరాజిల్లాడు. తరువాత అశ్వత్థామ వేసిన వందలకొలది బాణాలు తీవ్రంగా తగిలిన శ్రీకృష్ణార్జునులు తమ కిరణాలతో ప్రకాశిస్తున్న యుగాంతసూర్యులు లాగా ఉన్నారు. శ్రీకృష్ణుడు గాయపడగా అర్జునుడు అన్నివైపులా అంచులు గల అస్త్రాన్ని ప్రయోగించాడు. పిడుగుతో, అగ్నితో, యమదండంతో సమానమయిన బాణాలతో అశ్వత్థామను గాయపరిచాడు. సమధిక తేజోవంతుడై, చాలా భయంకర కార్యాలు చేసే అశ్వత్థామ దెబ్బతింటే మృత్యువు కూడా వ్యథజెందే అతితీవ్ర వేగంగల బాణాలతో శ్రీకృష్ణార్జునుల మర్మస్థానాలను గాయపరిచాడు. అర్జునుడు పరిశ్రమ పూర్వకంగా బాణాలు వేసే అశ్వత్థామ బాణాలను వారించి, ఆయనవేసినవాటికంటె రెండు రెట్లు మంచి పుంఖాలు గల బాణాలతో ఏకవీరు డయిన ఆయనను అశ్వసూతధ్వజాలతో కూడా కప్పివేసి, సంశప్తక సైన్యంమీదికి వెళ్ళాడు.

తరువాత అర్జునుడు వెనుదిరుగని వీరులయిన శత్రువుల ధనుస్సులను, బాణాలను, అమ్ములపొదులను, అల్లెత్రాళ్ళను, చేతులను, భుజాలను, చేతులలో ఉన్న శస్త్రాలను, గొడుగులను, కేతువులను, గుర్రాలను, నొగలను, వస్త్రాలను, వారు ధరించిన పూలమాలలను, భూషణాలను, డాళ్ళను, అందమయిన కవచాలను, ప్రియమయిన శిరస్సులను బాణాలతో ఖండించాడు. చక్కగా అలంకృతాలయిన రథాలు, గుర్రాలు, ఏనుగులు, వాటి మీద ప్రయత్నపూర్వకంగా యుద్ధంచేస్తూ స్థిరంగా వాటి మీద ఉన్న వీరులు అర్జునుడు వేసిన వందలకొలది బాణాలతో గాయపడి, ఆ వీరులతోపాటు ఆవాహనాలు

నేలగూలాయి. పద్మాలవలె, సూర్యునివలె, పూర్ణచంద్రుని వలె కిరీటాలతో, పూలమాలలతో, ఆభరణాలతో ఉజ్జ్వలమయిన ముఖాలు గల మానవ శిరస్సులు భల్లాలతో, అర్ధచంద్ర బాణాలతో, క్షురాలతో విరిగి నేలబడ్డాయి. అప్పుడు ఇంద్రుని ఏనుగైన ఐరావతం వంటి ఏనుగులతో కలింగ, వంగ, అంగ, నిషాద దేశవీరులు రాక్షసుల గర్వాన్ని పోగొట్టే అర్జునుని చంపదలచి, ఆయన మీదికి వచ్చారు. అర్జునుడు ఆ వీరుల ఏనుగులను, వారికవచాలను, డాళ్ళను, చేతులను, మావటివారిని, ధ్వజాలను, పతాకలను ఖండించాడు. వారంతా వజ్రాయుధ ధ్వస్తాలయిన పర్వతశిఖరాలలాగా నేలగూలారు. వారందరు నశింపగా అర్జునుడు ఉదయిస్తున్న సూర్యునితో సమానమయిన వర్ణం గల బాణాలతో అశ్వత్థామను, వాయువు ఉదయిస్తున్న సూర్యుని మేఘసమూహంతో కప్పినట్లు, కప్పివేశాడు. అప్పుడు అశ్వత్థామ అర్జునుని బాణాలను పదునయిన బాణాలతో వారించి, వర్షాకాలంలో మేఘం చంద్రసూర్యులనువలె శ్రీకృష్ణార్జునులను బాణాలతో కప్పివేశాడు. వారి బాణాలతో పీడితుడయిన అర్జునుడు ముందుకు వెళ్ళి, త్వరగా శస్త్రాలతో శత్రువుల బాణాల వల్ల కలిగిన అంధకారాన్ని నాశనం చేసి, మంచి ఈకలు గల తన బాణాలతో అశ్వత్థామను మీసేనలోని, ఇతర సమస్త సైనికులను గాయపరిచాడు. రథంమీద ఉన్న అర్జునుడు బాణాలు తీసుకోవటంగాని, సంధించటం గాని, వదలటంగాని కన్పించలేదు. కాని రథాలు, ఏనుగుల, పదాతుల దేహాలు బాణాలతో గ్రుచ్చినట్లుగా హతులు అయినట్టుగా జనం చూశారు. అశ్వత్థామ త్వరగా పది బాణాలను సంధించి ఒక బాణంలాగా వదిలాడు. చక్కని పుంఖాలు గల ఆ బాణాలలో అయిదు అర్జునుని, అయిదు శ్రీకృష్ణుని ఛేదించాయి. ఆ బాణాలు తీవ్రంగా తగిలి, సర్వమనుష్యశ్రేష్ఠులు, కుబేర ఇంద్రులతో సమాను లయిన ఆ వీరుల దేహాలనుండి రక్తం స్రవించింది. ధనుర్విద్యాపారంగతుడయిన అశ్వత్థామ చేతిలో పరాభూతులయిన వారిని యుద్ధంలో హతులయినారని ఇతరులు అనుకొన్నారు. దశార్హవంశ ప్రభువయిన 'శ్రీకృష్ణుడు అర్జునునితో పొరపాటు చేస్తున్నావెందుకు ? ఈ యోధుని జయించు. ఉపేక్షిస్తే ఈయన ఇంకా అనేక దోషాలు చేస్తాడు. చికిత్స చేయని రోగంవలె ఈయన ఇంకా చాలా కష్టాలు కలిగిస్తాడు' అని అన్నాడు. పొరపాట్లు చేయని అర్జునుడు 'సరే' అని ప్రయత్నపూర్వకంగా మంచి గంధం పూసుకున్న అశ్వత్థామ శ్రేష్ఠమయిన భుజాలను, వక్షఃస్థలాన్ని, శిరస్సును అనుపమానమయిన ఊరువులను బాణాలతో చీల్చివేశాడు.

క్రోధపూర్ణుడయిన అర్జునుడు గాండీవ విముక్తాలయి, గొర్రె చెవి వంటి

ములుకులు గల బాణాలతో యుద్ధరంగంలో ద్రోణపుత్రుని శరీరం చీల్చాడు. త్వరగా గుర్రాల పగ్గాలను ఖండించాడు. గుర్రాలను గాయపరిచాడు. అవి ఆయన రథాన్ని వేగంగా చాలా దూరం లాక్కుపోయాయి. అర్జునుని బాణాలతో బాగా గాయపడిన అశ్వత్థామ వాయువేగం గల గుర్రాలు చాలా దూరం రథం లాక్కుపోగా మతిమంతుడయిన ఆయన వెనక్కు తిరిగివచ్చి, అర్జునునితో యుద్ధం చేయదలచలేదు. ఆంగిరసుని వంశంలో శ్రేష్ఠుడయిన ఆయన వృష్ణివీరు డయిన శ్రీకృష్ణుడు, అర్జునులకు విజయం నిశ్చితమని తెలుసుకొన్నాడు. ఆర్యా! అశ్వత్థామ గుర్రాలను నిలిపి, విశ్రామం పొంది రథాలు, గుర్రాలు, పదాతులతో నిండి ఉన్న కర్ణుని సైన్యంలో ప్రవేశించాడు. ప్రతీకారశీలి అయిన అశ్వత్థామను రణరంగంనుంచి గుర్రాలు లాక్కుపోగా మంత్రాలతో, ఔషధులతో, ఉపచారాలతో రోగం శరీరంనుంచి తొలగినట్లు తొలగిపోయాడు. అప్పుడు శ్రీకృష్ణార్జునులు గాలికి ఎగురుతున్న పతాక గలది, జలప్రవాహం వలె గంభీరధ్వని గల రథంమీద సంశప్తకులను ఎదిరింప వెళ్ళారు.

18. అర్జునుడు ఏనుగులతో గూడ దండధరాదులను వధించుట.

సంజయుడు చెప్పాడు – 'ఆ తరువాత దండధారుడు పాండవసేనలో రథగజ అశ్వపదాతులను వధించటం వల్ల ఉత్తరంవైపు నుండి పెద్దధ్వని బయలుదేరింది. రథాన్ని వెనక్కు త్రిప్పిన శ్రీకృష్ణుడు గరుడవేగమూ, వాయు వేగమూ కల గుర్రాలను తోలుతూనే అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! మగధదేశ నివాసి అయిన దండధారుడు మహాపరాక్రమవంతుడు. శత్రువులను మథించి వేసే ఏనుగు ఈతనికి ఉన్నది. ఆ శస్త్రాస్త్రవిద్యతో, దేహబలంతో ఇతడు భగదత్తునివంటివాడు. ముందు ఇతనిని సంహరించి, తరువాత సంశప్తకులను సంహరింతువు గాని' అనే మాట పూర్తి అయ్యేలోపలనే శ్రీకృష్ణుడు అర్జునుని దండధారుని వద్దకు తీసుకుపోయాడు. మాగధ వీరులలో సర్వశ్రేష్ఠుడయిన దండధరుడు అంకుశాన్ని పట్టి, ఏనుగుతో యుద్ధం చేయటంలో అసమానుడు, గ్రహాల్లో కేతుగ్రహ వేగం సహింపరానిదయినట్లు ఆతని విజృంభణం శత్రువులకు అసహ్యం అవుతుంది. ధూమకేతువు అనే కీడును సూచించే గ్రహం సర్వభూమండలానికి అనిష్టకారకం అయినట్లు ఆ భయంకర వీరుడు అక్కడి శత్రువులను మథించాడు. చక్కగా అలంకృతమై, గజాసుర సమానమై, పెద్ద మేఘంలాగా గర్జించే, ఏనుగునెక్కి దండధారుడు బాణాలు ప్రయోగించి, రథాలను ఏనుగుల సమూహాలను, పదాతులను వేలకొలదిగా చంపుతున్నాడు.

ఆయన ఏనుగు పాదాలతో గుర్రాలు, సారథితో గూడిన రథాలను, మనుష్యులను త్రొక్కి చంపుతున్నది. ఏనుగులను తొండంతో కొట్టి, పాదాలతో త్రొక్కి చంపుతున్నది. అది కాలచక్రం లాగా సర్వసంహారం చేస్తున్నది. ఆతడు బలిష్ఠములయిన తన ఏనుగులతో ఇనుప కవచాలను, భూషణాలను ధరించిన కాళుల గుర్రాలను, పదాతులను నేలమీద పడేసి త్రొక్కించివేస్తున్నాడు. లావయిన తామర కాడను విరగదీసినప్పుడు వచ్చే ధ్వని అది తొక్కి వేస్తుంటే వస్తున్నది.

అల్లెత్రాటి ధ్వనులతో మృదంగాల భేరులు, అనేక శంఖాల ధ్వనులతో వేలకొలది రథాలు, గుర్రాలు, ఏనుగులతో నిండిన చోట ఉన్న ఏనుగుదగ్గరికి అర్జునుడు వచ్చాడు. అప్పుడు ఆ దండధారుడు పన్నెండు ఉత్తమబాణాలతో అర్జునుని, పదునారు బాణాలతో శ్రీకృష్ణుని, మూడేసి బాణాలతో రథాశ్వాలను గాయపరిచి, పలుమారులు వికటాట్టహాసం చేశాడు. అంతట అర్జునుడు దండధారుని అల్లెత్రాడు, బాణంతో గూడిన ధనుస్సును ఖండించి అలంకృతమయిన ధ్వజాన్ని, మావటీలను, గజపాదరక్షకులను బాణాలతో చంపాడు. గిరివ్రజరాజు అందుకు కోపించాడు. మదధారలు చెక్కిళ్ళనుండి స్రవింపజేస్తూ, వాయువేగం గల్గి, మేఘంలాగా ఉన్న ఏనుగుతో శ్రీకృష్ణార్జునులను కలవరపెట్టదలచి, వారిద్దరి మీదికి తోలాడు. తోమరాలను ప్రయోగించి వారిని గాయపరిచాడు. అప్పుడు అర్జునుడు ఏనుగు తొండంవంటి ఆ దండధారుని బాహువులను, పూర్ణచంద్రుని వంటి ముఖంగల శిరస్సును మూడుబాణాలతో ఖండించాడు. తరువాత ఏనుగును వందల బాణాలతో కొట్టాడు. బంగారు కవచం దాల్చిఉన్న ఆ ఏనుగు శరీరంమీద అర్జునుడు వేసిన సువర్ణాలంకృత బాణాలు దిగబడితే, దావాగ్నితో మండిపోయే ఓషధీ వృక్షాలు గల పర్వతం వలె విరాజిల్లింది. నొప్పితో బాధపడుతున్న ఆ ఏనుగు మేఘధ్వని లాగా ఘీంకరిస్తూ, అన్నివైపులా తిరుగుతూ భ్రమిస్తూ, మధ్యమధ్య క్రిందపడుతూ, లేస్తూ పరుగెత్తసాగింది. బాగా గాయపడటం వల్ల అది మావటివానితో సహా నేలగూలింది. వజ్రాయుధం దెబ్బతో చీలిపోయిన పర్వతంలాగా అది ఉన్నది. మంచువలె తెల్లనైనది, సువర్ణమాలికలు గలది, హిమవత్పర్వత శిఖరం వంటి ఏనుగుతో కూడా సోదరుడు హతుడు కాగా దండుడు శ్రీకృష్ణార్జునులను చంపగోరి, ముందుకు వచ్చాడు. సూర్యకిరణాలవలె ప్రకాశిస్తున్న పదునయిన మూడు తోమరాలతో శ్రీకృష్ణుని, అయిదింటితో అర్జునుని గాయపరచి చాలాపెద్దగా గర్జించాడు. ఇంతలోనే అర్జునుడు ఆయన బాహువులను ఖండించాడు. తోమరాలతో క్షురాలతో ఖండితాలై, గూడి, చక్కని భుజకీర్తులు గలిగి, మంచిగంధం అలదిన ఆయన బాహువులు ఏనుగు

మీదినుంచి ఒక్కమారే క్రింద పడుతూ పర్వత శిఖరంపై నుంచి పడుతున్న సుందరమయిన సర్పాలలాగా విరాజిల్లాయి. అర్జునుడు అర్ధచంద్ర బాణంతో ఖండించగా దండుని శిరస్సు ఏనుగుమీది నుంచి క్రింద పడ్డది. రక్తంతో తడిసి క్రిందపడుతూ పశ్చిమ దిక్కునందలి అస్తమయ పర్వతం మీదినించి పడుతున్నట్లు విరాజిల్లింది. శ్వేతవరాహంలాగా ఉన్న దండుని ఏనుగును సూర్యకిరణాలతో సమానమయిన ఉత్తమబాణాలతో అర్జునుడు ఛేదించాడు. అది వజ్రాయుధం ఛేదించిన హిమవత్పర్వత శిఖరంవలె ఘీంకరిస్తూ నేలగూలింది.

తరువాత దానితో సమానమయిన ఉత్తమ గజాలు ఆయనను జయించటానికి ముందుకు వచ్చాయి. యుద్ధంలో దండుని ఏనుగులను దండధారుని వలె అర్జునుడు సంహరించాడు. అప్పుడు శత్రుసేన అంతా చెల్లాచెదరయింది. గజాలు, అశ్వాలు, పదాతులు, గుంపులు గుంపులుగా వచ్చి యుద్ధరంగంలో పరస్పరం గాయపరచుకొంటూ, నాలుగు వైపులనుంచి దూకారు. అతిగా వాగుతూ వారు కొట్టుకొని మరణించారు. ఆ తరువాత ఇంద్రుని దేవగణాలవలె, అర్జునుని ఆయన సేనలు చుట్టి నిలిచి, 'మహావీరా! మరణం వల్ల ప్రజలవలె మాకు భయకారకుడయిన ఈ దండుని నీవు సంహరించటం మా అదృష్టం. బలవంతు లయిన శత్రువులు తీవ్రంగా పీడించిన ఈ మమ్ములను నీవు రక్షించకపోతే వీరు చనిపోతే మాకు సంతోషం కలిగినట్లే వారికి కలిగి ఉండేది.' ఈ రీతిగా పలుమారులు మిత్రులు అనే మాటలు విని, మంచి మనస్సు గల అర్జునుడు వారిని తగిన రీతిగా ఆదరించి, సంశప్తక సమూహాన్ని చంపటానికి వెళ్ళాడు.'

19. అర్జునుడు సంశప్తక సేనను వధించుట, శ్రీకృష్ణకృత అర్జున ప్రశంస.

సంజయుడు చెప్పాడు - 'రాజా! అంగారకగ్రహం వక్రి అయి అతిచార గమనంతో లోకానికి అనిష్టకరం అయినట్లు అర్జునుడు తిరిగి వచ్చి, సంశప్తకులను అనేకులను సంహరించాడు. భారతా! పార్థుని బాణపు దెబ్బలు తిని, పదాతులు, గుర్రాలు, ఏనుగులు సంచలించాయి. భ్రమించాయి, మలినాలయ్యాయి, నేలబడ్డాయి, నశించాయి. యుద్ధభూమిలో ఎదిరించి, యుద్ధం చేస్తున్న శత్రువీరుల వాహనాలను, వాటిమీద ఉన్నవారిని, సూతులను, ధ్వజాలను, ధనుస్సులను, ఖడ్గాలను, బాణాలను, చేతులను, చేతిలో ఉన్న శస్త్రాస్త్రాలను, బాహువులను, తలలను, అర్జునుడు భల్లాలు, క్షురాలు, అర్ధచంద్రాలు, వత్సదంతాలతో ఖండించాడు. ఎదకు వచ్చిన ఆవుకోసం పోరాడుతున్న వృషభాలు ఒక వృషభాన్నివలె అర్జునునితో పోరాడుతూ శూరులు వందలు, వేలుగా నేలగూలుతున్నారు. ముల్లోకాలను

జయించే సమయంలో దైత్యులకు ఇంద్రునితో జరిగినట్లు వారికి, ఆయనకు మధ్య శరీరం గగుర్పొడిచే భీకరయుద్ధం జరిగింది. అపుడు ఉగ్రాయుధసుతుడు పాముల వంటి మూడు బాణాలతో అర్జునుని కొట్టాడు. వెంటనే అర్జునుడు అతని శిరస్సును శరీరం నుండి తెగగొట్టాడు. వెంటనే సంశప్తకులు కోపించి, అర్జునునిపై నానావిధ శస్త్రాలను వర్షించారు. అది వర్షాకాలంలో హిమవత్పర్వతం మీద వాయుసహితమైన మేఘాలు వర్షించినట్లు ఉంది. అన్నివైపుల నుండి వచ్చే శత్రువుల అస్త్రాలను అన్నిటిని చక్కని అస్త్రాలతో నివారించి, అర్జునుడు వారిని ఎన్నో బాణాలతో సంహరించారు.

అర్జునుడు తన బాణాలతో శత్రువుల త్రిశూలాలను విరిచివేశాడు. గుర్రాలను చంపివేశాడు. రథచక్రరక్షకులను, సారథులను చంపాడు. కొంతమంది చేతుల నుండి బాణాలు జారిపోయాయి. కొన్ని రథాల చక్రాలు, జెండాలు విరిగిపోయాయి. కొన్ని రథాల పగ్గాలు, కాడులు, రథపుటిరుసులు విరిగిపోయాయి. అన్ని పరికరాలూ ధ్వంసమైపోయాయి. శ్రేష్ఠ రథాలు ఎన్నో చోట్ల విరిగి పడిపోయాయి. అగ్నితో, వాయువుతో, నీటితో విధ్వస్తమయిన సంపన్నుల గృహాలవలె ఆ రణభూమి భాసిస్తోంది. ఏనుగుల నడుములకు కట్టే కవచాలు పిడిగులవంటి బాణాలతో తెగిపోయి, కొండమీది యిళ్లు వడగళ్లతో, గాలివానతో, అగ్నితో కాలిపోయి పడిపోయినట్లుంది ఆ దృశ్యం. అర్జునుని బాణాలు తగిలిన శత్రువుల గుర్రాలు రౌతులతో సహా పడిపోయాయి. కొన్నింటి నాలుకలు తెగిపోయాయి. కొన్నింటి పేగులు బయటకు వచ్చి, రక్తం కారుతున్నాయి. ఆ దృశ్యం చూడ శక్యం కాకుండా ఉంది. మారిషా ! అర్జునుని బాణాలతో పదాతులు గుర్రాలు, ఏనుగులు గిరగిరతిరిగాయి. జారిపడ్డాయి. పెద్దగా అరిచాయి. గ్లాని చెందాయి. మహేంద్రుడు దానవులను వలె సానపెట్టినవి, వజ్రాయుధాలవలె, పిడుగులవలె, విషంవలె ఉన్న అనేక బాణాలతో అర్జునుడు శత్రువులను సంహరించాడు. చాలా విలువయిన కవచాలు, ఆభరణాలు దాల్చినవారు; నానావిధాలయిన వస్త్రాలు ఆయుధాలు గలవారు; రథాలు, ధ్వజాలతో గూడిన వీరులు అర్జునుని చేత హతులయి యుద్ధభూమిలో పడి ఉన్నారు. పుణ్యకార్యాలు చేసినవారు, విశిష్టమయిన వంశంలో పుట్టిన వారు, ఉత్తమ విద్యావంతులు, యుద్ధవిజితులయి శరీరాలతో భూమిని, సంపాదించిన పుణ్యకర్మలతో స్వర్గాన్ని పొందారు. అప్పుడు రథికశ్రేష్ఠ డయిన అర్జునుని మీదికి అనేక జనపదాలకు అధిపతులయిన వారు కుపితులయి తమసేనా సమూహాలతో యుద్ధానికి వచ్చారు. రథాలను, గుర్రాలను, ఏనుగులను ఎక్కిన వీరులు, పదాతులు, అర్జునుని వధింపదలచి నానావిధాలయిన ఆయుధాలను వేగంగా ప్రయోగిస్తూ, ఆయన మీదికి దూకారు. యోధులు అనే పెద్ద పెద్ద మేఘాలు కురిపించిన ఆయుధా లనే వర్షాన్ని అర్జును డనే పెద్దగాలి పదునయిన బాణాలతో ధ్వంసం చేసింది.

అశ్వాలు, పదాతులు, ఏనుగులు రథాలు గల మహాశస్త్ర సమూహా లనే మహా ప్రవాహాన్ని, శస్త్రాస్త్రా లనే సేతువు ద్వారా త్వరగా దాటదలచిన అర్జునునితో శ్రీకృష్ణుడు 'అనఘా! పార్థా! ఆడుకొంటున్నావేమిటి ? త్వరగా ఈ సంశప్తక సైన్యాన్ని మధించు, తరువాత కర్ణవధకు త్వరపడు.' అన్నాడు. అర్జునుడు శ్రీకృష్ణునితో సరే ! అని మిగిలి ఉన్న సంశప్తకులను అస్త్రాలను ప్రయోగించి, వధించాడు. అర్జునుడు బాణాలు తీసుకోవటం, సంధించటం, త్వరగా బాణాలను వదలటం యుద్ధభూమిలో ఎవరికీ కనపడలేదు. హతులయిన నరులు మాత్రం కన్పిస్తున్నారు. ఇది పరమాశ్చర్యకరం అని అంటూ శ్రీకృష్ణుడు రథాశ్వాలను తోలాడు. హంసలవలె, చంద్రకిరణాలవలె తెల్లని అర్జున రథాశ్వాలు, హంసలు సరస్సును ప్రవేశించినట్లు శత్రుసేనను ప్రవేశించాయి. అప్పుడు జననాశం జరుగుతుండగా యుద్ధభూమిని చూస్తున్న శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. 'అర్జునా! దుర్యోధనుని కారణంగా భూమిమీద గల రాజుల, భరతవంశీయుల మహాభయంకర మయిన నాశం జరుగుతున్నది. భారతా! బంగారు తొడుగులు గల ధానుష్కుల ధనుస్సులు, భూషణాలు, అమ్ములపొదులు పడి ఉన్నాయి చూడు. సువర్ణమయమయిన పుంఖాలతో వంగిన ములుకులు గల బాణాలను కుబుసం విడిచిన పాములు లాగా నూనెతో కడిగిన బాణాలను చూడు. భారతా! విచిత్రతోమరాలను, విసిరివేయగా చెల్లాచెదరుగా పడిఉన్న డాళ్ళను చూడు. బంగారు ప్రాసాయుధాలను, బంగారు శక్త్యాయుధాలను, బంగారు రేకులు తాపడం చేసిన పెద్ద పెద్ద గదలను, బంగారుమయమయిన ఋష్ట్యాయుధాలను, బంగారు దండాలు గల బల్లేలను చూడు. దూరంగా పడిఉన్నాయి. పరిఘలు, భిందిపాలాలు, భుశుండులు, కుణపాలు, ఇనుముతో చేసిన కుంతాయుధాలను, పెద్దపెద్ద రోకళ్ళవంటి ఆయుధాలను పడిఉన్నాయి చూడు. జయాన్ని కాంక్షించేవారు, వేగశాలులయిన వీరసైనికులు నానావిధాలయిన శస్త్రాలను చేతబట్టి, విగత జీవులయినా బ్రతికిఉన్నట్లే కనపడుతున్నారు. దెబ్బలతో నుజ్జయిన శరీరాలు, ముసలాలతో తలలు పగిలిపోయిన వారు, ఏనుగులు గుర్రాలు త్రొక్కివేయగా రథాల తాకిడికి నలిగిపోయిన వేలకొలది యోధులను చూడు. శత్రునాశకుడయిన అర్జునా! బాణాలు, శక్తులు, ఋష్టులు, తోమరాలు, ఖడ్గాలు, పట్టిశాలు, ప్రాసాలు, నఖరాలు, లగుడాలు అనే ఆయుధాలతో మనుష్యుల ఏనుగుల, గుర్రాల శరీరాలు అనేక విధాలుగా ఖండితాలై, ప్రాణాలు పోయి, రక్తప్రవాహాల్లో మునిగిపోయాయి. వాటితో అన్నింటితో యుద్ధభూములు నిండిపోయి ఉన్నాయి.

భుజకీర్తులతో, చక్కని అలంకారాలతో, చేతితొడుగులతో, కేయూరాలతో అలంకృతాలయి మంచి గంధం పూసిన మృతవీరుల బాహువులతో రణభూమి శోభాయమానంగా ఉన్నది. వ్రేళ్ళతొడుగులతో భూషణాలు గల చేతులు విసిరివేసినట్లు

పడి ఉన్నాయి. వేషవంతులయిన వీరుల ఏనుగు తొండాల వంటి తొడలు, కుండలాలు, శిరోలంకారాలు గల శిరస్సులతో భూమినిండి ఉంది. బంగారు చిరుమువ్వలు గలవై, అందమయినవై, అనేక విధాలుగా ముక్కలయిపడి ఉన్న రథాలను, కోడిపీటలను, అమ్ముల పొదులను, (అనుకర్షాలను, ఉపాసంగాలను) పతాకలను, నానావిధాలయిన జెండా కర్రలను, నేలగూలిన యోధుల చుట్టు ప్రక్కలపడి ఉన్న తెల్లని మహాశంఖాలను, పర్వత సమానాలై, నాలుకలు తెగిపోయి పడిఉన్న ఏనుగులను చూడు. కొన్నిచోట్ల విచిత్రమయిన వైజయంతీ పతాకలు పడి ఉన్నాయి. హతులయిన గజయోధులు, అనేకమయిన కంబళ్ళతో గూడిన ఏనుగుల మీద వేసే అంబారీలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి చూడు. ఏనుగులపైన కప్పే అనేక విచిత్ర కంబళ్ళు చినిగిపోవటం వల్ల విచిత్రంగా ఉన్నాయి. తెగిపడిపోయిన నానావిధాలయిన గంటలు నేలగూలుతున్న ఏనుగుల తాకిడికి పొడిపొడి అయ్యాయి. నేలబడిన వైడూర్యమణులు పొదిగిన దండాలను, అంకుశాలను, గుర్రాల శిరస్సులలో గల తురాయిలను, రత్నాలను కూర్చిన కవచాలను చూడు. రౌతుల ధ్వజాగ్రభాగాల్లో ఏనుగుల మీద కప్పే బంగరు కంబళ్ళు చిక్కుకొన్నాయి. విచిత్ర మణులు కూర్చి, సువర్ణంతో అలంకృతాలు అయిన గుర్రాలమీద కప్పే కంబళీలు నేలబడి ఉన్నాయి, చూడు. రాజులు దాల్చే శిరోమణులను, విచిత్రమయిన బంగరు హారాలను, చెల్లాచెదరుగ పడి ఉన్న గొడుగులను, వింజామరలను చూడు. చంద్రునివలె, నక్షత్రాలవలె మెరిసే సుందరమయిన కర్ణాలంకారాలతో, గడ్డం మీసాలతో అందంగా ఉన్న, నిండు చందురుని వంటి రాజుల ముఖాలతో నిండి ఉన్న భూమిని చూడు. తెల్లకలువలు, ఎర్రకలువలు, పద్మాల గుంపులతో సరస్సు వికసించి, కన్పించునట్లు కుముదాలు, ఉత్పలాలతో సమమయిన రాజుల ముఖాలతో యుద్ధభూమి వికసించినట్లున్నది. తారాసమూహంతో విచిత్ర శోభగల్గి, నిర్మల చంద్రకాంతులతో గూడిన ఆకాశంవలె ఈ రణభూమి కన్పిస్తున్నది. శరత్కాల నక్షత్రాలతో శోభిస్తున్నట్టుంది. 'అర్జునా! మహాయుద్ధరంగంలో నీవు చేసిన వీరకర్మ నీకే తగును.' దేవలోకంలో మహేంద్రునికే తగును.

ఈవిధంగా శ్రీకృష్ణుడు యుద్ధభూమిని అర్జునునికి చూపించి చెపుతూ వెళ్ళుతూనే దుర్యోధనుని సైన్యంలో మ్రోయించే శంఖాల దుందుభుల మ్రోతలను; భేరులు, పణవాల ధ్వనులను; రథాల; గజాల, అశ్వాల నాదాలను; దారుణమయిన శస్త్రాల ధ్వనులను విన్నాడు. వాయువేగంతో త్వరగా పరుగెత్తే గుర్రాలు గల రథంతో శ్రీకృష్ణుడు ఆసైన్యంలో ప్రవేశించాడు. నీ సైన్యాన్ని పాండ్యరాజు నాశనం చేయటం చూసి, ఆయన ఆశ్చర్యపడ్డాడు. బాణాలను, అస్త్రాలను ప్రయోగించటంలో శ్రేష్ఠ డయిన ఆ పాండ్యరాజు యుద్ధంలో శత్రుసమూహాలను నానావిధాల బాణాలతో ఆయువులేని ప్రాణులను యమధర్మరాజు

హరించినట్లు చంపాడు. పాండ్యరాజు పదునయిన బాణాలతో శత్రుపక్షంలోని ఏనుగుల గుర్రాల, నరుల శరీరాలను ఛేదించి, వారిని దేహాలు, ప్రాణాలు లేని వారినిజేసి నేలగూల్చాడు. ఇంద్రుడు అసురులను వలె పాండ్యరాజు బాణాలతో శత్రుశ్రేష్ఠులు ప్రయోగించిన నానావిధాలయిన శస్త్రాస్త్రాలను ఛేదించి, వారిని వధించాడు.'

20. అశ్వత్థామ పాండ్యరాజును వధించుట

ధృతరాష్ట్రుడు అడిగాడు - 'సంజయా! ఇంతకుముందే పాండ్యరాజు మహావీరుడుగా లోకప్రసిద్ధుడు అని చెప్పావు. కాని ఆతడు యుద్ధభూమిలో చేసిన వీరకార్యాన్ని గూర్చి చెప్పలేదు. కాబట్టి ఆ మహావీరుని పరాక్రమాన్ని, విద్యను, మహత్తును, పరాక్రమాన్ని, ప్రమాణాన్ని, దర్పాన్ని విస్తారంగా చెప్పవలసింది.' సంజయుడు చెప్పాడు - 'మహారాజా! రథోత్తములయిన భీష్మద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణ అర్జున శ్రీకృష్ణులు మహావిద్వాంసులు, ధనుర్విద్యలో శ్రేష్ఠులు అని నీవు అనుకొంటావు. పరాక్రమవంతుడయిన పాండ్యరాజు ఈ మహారథులను అందరిని ఆక్షేపిస్తాడు. ఆయన ఏ రాజూ తనతో సమానుడు అనుకోడు. భీష్మద్రోణులతో తాను సమాను డనటం గూడా ఆయన అంగీకరించడు. శ్రీకృష్ణార్జునులకన్న తను తక్కువ అనటం గూడా ఆయన ఇష్టపడడు. సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడు, రాజశ్రేష్ఠ డయిన ఆ పాండ్యరాజు అవమానితు డయిన యమునివలె కర్ణసైన్యాన్ని ధ్వంసం చేశాడు. బలిష్ఠ డయిన పాండ్యరాజు రథాలు, గుర్రాలు, ఏనుగులతో నిండి, ఉత్తమపదాతులతో క్రిక్కిరిసి ఉన్న కర్ణుని సేనను కుమ్మరి చక్రాన్నివలె గిరగిరా తిరిగేటట్టు చేశాడు. పాండ్యుడు చక్కగా ప్రయోగించిన అస్త్రాలతో వాయువు మేఘాలనువలె సర్వసైనికులను, గుర్రాలు, సారథులు, ధ్వజాలు, రథాలు లేనివారిని చేశాడు. వారి ఆయుధాలను, ఏనుగులను చంపాడు. ఇంద్రుడు వజ్రాయుధంతో పర్వతాలను ధ్వంసం చేసినట్లు పాండ్యుడు ఏనుగులను వాటిమీద ఉండే వీరులను వారి పతాకలను, ఆయుధాలను ధ్వజాలను, పాదరక్షకులతో సహా వధించాడు. శక్తులు, ప్రాసలు, అమ్ములపొదులతో గూడిన ఆశ్వికులను, గుర్రాలను, పులిందులు, ఖసులు, బాహ్లికులు, నిషాదులు, ఆంధ్రకులు, కుంతలులను, శూరులు, యుద్ధంలో కర్కశులయిన దాక్షిణాత్యులను, భోజులను ఆయన శస్త్రాలు, కవచాలు లేని వారిని బాణాలతో ప్రాణహీనులను చేశాడు.

ఏమాత్రం తొట్రుపాటు లేకుండా యుద్ధరంగంలోని బాణాలతో చతురంగ బలాలను సంహరిస్తున్న పాండ్యుని తొట్రుపాటు లేని అశ్వత్థామ చూసి ఎదుర్కొన్నాడు. భయపడని ఆయనను అశ్వత్థామ నిర్భయుడయి చిరునవ్వుతో మధురంగా పిలుస్తూ

ఇలా అన్నాడు. 'పద్మపు రేకులవంటి కన్నులుగలవాడా, గొప్ప వంశం, విద్య గలవాడా ! వజ్రంలాంటి కాంతివంతమయిన దేహం గలవాడా! ప్రఖ్యాతమయిన బలం పౌరుషం గలవాడా! నీ ధనుస్సుకున్న అల్లెత్రాడు నీ పిడికిలిలో ఒక్క మారే ఉన్నది. అది గోళాకారంగా కన్పిస్తున్నది. సుదీర్ఘమయిన బాహువులతో ధనుస్సును లాగి, మ్రోగిస్తూ, మహామేఘంలాగా కన్పిస్తున్నావు. మహావేగం గల బాణవర్షాన్ని శత్రువుల మీద కురిపిస్తున్న నీకు యుద్ధరంగంలో నేను తప్ప ఇంకొక ప్రతివీరుడు కన్పించటం లేదు. భయంకరమయిన బలంగల సింహం అడవిలో మృగ సమూహాన్ని లాగా ఎలాంటి భయం లేకుండా నీవు ఒక్కడివే రథికులను, గజారోహకులను, పదాతులను, రౌతులను అనేకులను సంహరిస్తున్నావు. రాజా! నీవు మహత్తరమయిన రథధ్వనితో భూమ్యాకాశాలను ప్రతిధ్వనింపజేస్తూ శరత్కాలంలో సస్యాన్ని నాశనం చేసే, గర్జించే మేఘంలాగా విలసిల్లుతున్నావు. అమ్ములపొదిలో నుంచి సర్పాల్లాగా తీక్ష్ణమయిన బాణాలను తీస్తూ, శివునితో అంధకునివలె నా ఒక్కడితో యుద్ధంచేయి.' అని అశ్వత్థామ చెప్పగా సరే అని పాండ్యరాజు నామీద బాణం వేయమనగా ఆయన వేశాడు. ఆ బాణం తగిలిన పాండ్యరాజు మలయధ్వజుడు కర్ణుని అనే బాణంతో ద్రోణపుత్రుని కొట్టాడు. ఆచార్యశ్రేష్ఠుడయిన అశ్వత్థామ నవ్వుతూ మర్మభేదకాలు, చాలా భయంకరాలు అయిన బాణాలతో పాండ్యరాజును గాయపరిచాడు. తరువాత అశ్వత్థామ బాగా పదునయిన ములుకులు గల్గి మర్మస్థానాలను భేదించే పదవగతితో గూడిన బాణాలను ప్రయోగించాడు.* పాండ్యరాజు పదునయిన తొమ్మిది బాణాలతో అశ్వత్థామ వేసిన బాణాలను ఖండించాడు.

---

* *పదిరకాలయిన బాణాల గతులు ఇలా ఉంటాయి.*

1. ఉన్ముఖి, 2. అభిముఖి, 3. తిర్యక్, 4. మంద, 5. గోమూత్రిక, 6. ధ్రువ, 7. స్థలిత, 8. యమకాక్రాంత, 9. క్రుష్ట, 10. అతిక్రుష్ట.

వీటిల్లో మొదటి మూడు గతులు క్రమంగా శిరస్సు, హృదయం, పార్శ్వభాగాలను స్పృశించేవి. అంటే ఉన్ముఖీ గతితో వేసే బాణం శిరస్సు మీద, అభిముఖీ గతితో ప్రేరితమయిన బాణం గుండెల మీద, తిర్యగ్గతితో ప్రయోగించిన బాణం పార్శ్వభాగం మీద గాయం కలిగిస్తుంది. మందగీతితో వేసిన బాణం చర్మాన్ని కొంచెం కొంచెం గాయపరుస్తుంది. గోమూత్రికా గతితో ప్రయుక్తమయిన బాణం కుడి ఎడమవైపులు పోతుంది. కవచాన్ని ఛేదిస్తుంది. ధ్రువాగతి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదించేది అవుతుంది. స్థలితాగతి గురి తప్పేగతి అవుతుంది. దానితో ప్రయుక్తమయ్యే బాణం లక్ష్యభ్రష్టం అవుతుంది. యమకాక్రాంతిగతితో వేసే బాణం పలుమారులు లక్ష్యాన్ని ఛేదించి, బయటకు పోతుంది. లక్ష్యమయిన వాని ఒక అవయవాన్ని భుజము మొదలయినవానిని ఛేదించేది క్రుష్టా గతి. పదవగతి పేరు అతిక్రుష్ట. దీనితో వేసే బాణం శత్రువు శిరస్సును ఖండించి, దానితోపాటు దూరంగా పోయి పడుతుంది. (ఇది నీలకంఠీయంలో చెప్పిన విశేషం).

నాలుగు బాణాలు వేగంగా వేసి, గుర్రాలను గాయపరిచాడు. అవి నిర్జీవాలు అయ్యాయి. పాండ్యుడు పదునయిన బాణాలతో, సూర్యతేజస్వి అయిన అశ్వత్థామ బాణాలను ఛేదించి, దీర్ఘమయిన అల్లెత్రాటిని కూడా ఛేదించాడు. అప్పుడు అశ్వత్థామ తన దివ్య ధనుస్సుకు మరో అల్లెత్రాటిని కూర్చాడు. తన రథానికి సేవకులు వేరే గుర్రాలను కట్టటం చూశాడు. వేలకొలది బాణాలు ప్రయోగించి, ఆకాశాన్ని దిక్కులను బాణపూర్ణం చేశాడు. బాణాలు వేస్తున్న మహాత్ము డయిన అశ్వత్థామ బాణాలు అక్షయ మయినవి అని తెలిసికూడా పురుషశ్రేష్ఠ డయిన పాండ్యుడు వాటిని నాశనం చేశాడు.

ఈ రీతిగా అశ్వత్థామ ప్రయోగించిన బాణాలను పాండ్యుడు ఖండించాడు. ఆయన చక్ర రక్షకులను పదునయిన బాణాలతో యుద్ధభూమిలో సంహరించాడు. శత్రువులాఘవాన్ని చూసి, అశ్వత్థామ పూషతమ్ముడయిన పర్జన్యుడు జలవర్షం కురిపించినట్లు ధనుస్సును మండలాకారం చేసి, బాణవర్షం కురిపించాడు. మహాభాగా! ఎనిమిదేసి ఎద్దులు కట్టిన ఎనిమిది బండ్లనిండుగా ఉన్న ఆయుధాలను అశ్వత్థామ ఆ పగలులోని ఎనిమిదవ భాగ సమయంలో శత్రువుల మీద ఉపయోగించాడు. యమధర్మరాజు వలె కోపించినవాడు, అంతకునికే అంతకు డయిన అశ్వత్థామను అక్కడ చూసిన వారు అందరూ దాదాపుగా మూర్ఛపోయారు. వర్షాకాలంలో పర్జన్యుడు కొండలతో గూడిన భూమిని వర్షధారలతో వలె ఆచార్యపుత్రుడు ఆ పాండవసేనను బాణవర్షంతో ముంచెత్తాడు. అశ్వత్థామ అనే మేఘుడు వర్షించిన దుఃస్సహమయిన ఆ బాణవృష్టిని పాండ్య డనే వాయువు వాయవ్యాస్త్రంతో ఉపశమింపజేసి, సంతోషంతో సింహనాదం చేశాడు. అలా సింహనాదం చేస్తున్న పాండ్యుని మలయపర్వతం లాగా చందనం, అగురు పూసిన జెండాను అశ్వత్థామ ఖండించి, నాలుగు గుర్రాలను చంపాడు. ఒక బాణంతో సూతుని చంపి, మేఘంలాగా ధ్వనించే ధనుస్సును అర్ధచంద్రబాణంతో ఖండించి, రథాన్ని నువ్వు గింజలంత ముక్కలు చేశాడు. అశ్వత్థామ శత్రువు ఆస్త్రాలను అస్త్రప్రయోగంతో నివారించి, సర్వాయుధాలను ముక్కలుచేసి, శత్రువు అందుబాటులోకి వచ్చినా యుద్ధం చెయ్యాలనే కోరికతో సంహరించలేదు.

ఇంతలోనే కర్ణుడు శత్రువుల గజసేన మీద విరుచుకు పడ్డాడు. పాండవుల మహత్తర సేనను పారద్రోలాడు. రథికుల రథాలు ధ్వంసం చేశాడు. గజారోహకుల ఏనుగులను, అశ్వారోహకుల గుర్రాలను చంపాడు. వంగిన వాడిములుకులు గల అనేక బాణాలతో ఏనుగులను సంహరించాడు. అప్పుడు ద్రోణసుతుడు పాండ్యరాజు విరథుడు

అయినా యుద్ధకాంక్షతో చంపలేదు. బాగా తీర్చిదిద్దిన బలిష్ఠమయిన ఒక ఏనుగు దాని ప్రభువు, మావటివాడు హతులు కాగా, ప్రతిధ్వనిని, అనుసరిస్తూ అశ్వత్థామ బాణహత మయి పాండ్యరాజు మీదికి వచ్చింది. ఆయన సింహంలాగా ఎగిరి దానిపైకి ఎక్కాడు. గజయుద్ధనిపుణు డయిన పాండ్యరాజు మలయధ్వజుడు పర్వతశిఖర సమానమూ, గజశ్రేష్ఠ మయిన ఆ ఏనుగును వేగంగా గర్జిస్తూ, సింహం పర్వతశిఖరం మీదికి దూకినట్లు అధిరోహించాడు. పర్వతరా జయిన పాండ్యుడు అంకుశంతో ఏనుగును అదుపుచేసి, తోలుతూ, అస్త్రప్రహారానికి ఉత్తమయత్నపరుడై, బలక్రోధప్రేరితుడై సూర్యకిరణాలవలె తేజోవంతమయిన తోమరాన్ని చేతబట్టి, గర్జిస్తూ, దాన్ని త్వరగా ఆచార్యపుత్రుని మీదికి విసిరాడు. శ్రేష్ఠమయిన మణులతో, ఉత్తమ వజ్రాలతో, వస్త్రంతో, పూలమాలలతో, ముత్యాలతో అలంకృతమయిన కిరీటాన్ని గురిచూసి, సంతోషంతో 'హతుడి వయ్యావు' అని పలుమారులు కేకలు వేస్తూ విసిరాడు. సూర్యచంద్ర గ్రహ, అగ్నులవంటి కాంతిగల ఆ కిరీటం మహేంద్రుని వజ్రాయుధంతో హతమయిన మహాపర్వత శిఖరం పెద్ద ధ్వని చేస్తూ నేలబడినట్లు చాలావేగంగా నేలబడి చూర్ణం అయింది. కాలితో తొక్కిన పన్నగపతిలాగా అశ్వత్థామ తీవ్రకోపంతో మండిపోతూ యముని దండంతో సమానమై, శత్రువులకు ఆర్తిని కలిగించే పదునాలుగు బాణాలను తీసుకొన్నాడు. ఏనుగు కాళ్ళను, తొండాన్ని అయిదింటితో, పాండ్యరాజు చేతులను, శిరస్సును మూడింటితో, గొప్ప తేజోవంతులు మహారథు లయిన పాండ్యరాజు సేవకులను ఆరుగురిని ఆరు బాణాలతో కొట్టాడు. చాలా పొడవయినవి, మంచి గంధం పూసినవి, బంగారం, ముత్యాలు, మణులు, వజ్రాలు పొదిగిన అలంకారాలు గల పాండ్యరాజు భుజాలు నేలమీద పడి, గరుత్మంతుడు చంపిన పాములవలె గిలగిలకొట్టుకున్నాయి. పూర్ణచంద్రుని వంటి ముఖం, కోపంతో ఎర్రనయిన విశాలమయిన కన్నులు, ఎత్తయిన ముక్కు, కుండలాలు గల పాండ్యరాజు శిరస్సు విశాఖ నక్షత్రాల మధ్య ఉన్న చంద్రునివలె ప్రకాశిస్తున్నది. యుద్ధనిపుణుడయిన అశ్వత్థామ అయిదు ఉత్తమబాణాలు వేసి, ఆ ఏనుగును ఆరుముక్కలు చేశాడు. మూడు బాణాలు వేసి రాజును నాలుగు ముక్కలు చేశాడు. యజ్ఞ కర్మనిపుణుడయిన పురోహితుడు దశహవిర్దాన యజ్ఞంలో ఇంద్రాదులయిన పదిమంది దేవతలకు హవిస్సును పదిభాగాలు చేసినట్లుగా చేశాడు. అశ్వత్థామ పితృప్రియమయిన చితాగ్ని మృత శరీరాన్ని పొంది, జ్వలించి, దాన్ని దగ్ధం చేసి నీళ్ళు పోయటం వల్ల చల్లారినట్లు పాండ్యరాజు గుర్రాలను, మనుష్యులను, ఏనుగులను, ముక్కలు ముక్కలు చేసి రాక్షసులకు మృష్టాన్నం సమర్పించి, చివరకు

అశ్వత్థామ బాణంతో శాంతించాడు. పరిపూర్ణంగా విద్యలను పొందినవాడు, కృతకృత్యుడు అయిన గురుపుత్రుని మిత్రులతో గూడి సమీపించి, నీ కుమారుడు బలి చక్రవర్తిని జయించిన విష్ణుదేవుని దేవేంద్రుడు పూజించినట్లు సమధికంగా గౌరవించాడు.

21. కౌరవ పాండవుల భయంకర యుద్ధము.

ధృతరాష్ట్రుడు అడిగాడు – 'సంజయా! ఏకైక వీరుడయిన అర్జునుడు శత్రువులను పారద్రోలగా, పాండ్యరాజు చనిపోతే, యుద్ధరంగంలో అర్జునుడు ఏమి చేశాడు ? అర్జునుడు యుద్ధవిద్యను సమాప్తం చేసినవాడు, బలవంతుడు, విజయప్రయత్నశీలి. మహానుభావుడయిన శంకరుడు ఆతనికి "నీవు సమస్త ప్రాణులకు అజేయుడవవుతావు" అని వరం ఇచ్చాడు. శత్రునాశకుడయిన అర్జునుని వల్లనే నాకు తీవ్రమయిన భయం కలుగుతుంది. అతడు యుద్ధం ఎలా చేశాడో చెప్పు సంజయా !' సంజయుడు చెప్పాడు – 'రాజా! పాండ్యరాజు చనిపోయాక శ్రీకృష్ణుడు కలవరపాటుతో అర్జునునితో హితకరమయిన మాట చెప్పాడు. 'అర్జునా! యుధిష్ఠిరుడు కన్పించటం లేదు. ఇతర పాండవులు కన్పించటం లేదు. తిరిగివచ్చిన పాండవవీరులు మహత్తరమయిన శత్రుసేనను భగ్నం చేశారు. అశ్వత్థామ సంకల్పానుసారం కర్ణుడు సృంజయులను సంహరించాడు. మన సేనలోని అశ్వరథగజబలాలు ఎక్కువగా నాశనం అయ్యాయి' అని వీరుడయిన వాసుదేవుడు అర్జునునికి అంతా చెప్పాడు. ఇది అంతా విని, సోదరునికి కలిగిన ఘోరమయిన భయస్థితిని చూసి, అర్జునుడు 'శ్రీకృష్ణా! త్వరగా ఈ గుర్రాలను తోలు' అని అన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఎదురులేని రథంమీద ముందుకు వెళ్ళాడు. అక్కడ దారుణమయిన యుద్ధం జరిగింది. అప్పుడు భయరహితులయిన భీమసేనాదులగు పాండవ వీరులు, కర్ణాదు లయిన మేము పరస్పరం ఎదుర్కొన్నాం. రాజపత్తమా! అప్పుడు మళ్ళీ కర్ణునికి పాండవులకు మధ్య యమలోకాన్ని పెంపొందించే మహాయుద్ధం ఆరంభమయింది.

కౌరవ పాండవులు ధనుస్సులను, బాణాలను, పరిఘులను, ఖడ్గాలను, పట్టిశాలను, తోమరాలను, ముసలాలను, భుశుండులను, శక్తులను, ముష్టులను, పరశువులను, గదలను, పదునయిన ప్రాసాయుధాలను, కుంతాలను, భిందిపాలాలను, మహాంకుశాలను తీసుకొని పరస్పరం చంపదలచి, త్వరగా వచ్చారు. ఉభయపక్షాల వారు బాణాలతో గూడిన అల్లెత్రాడుల ధ్వనులతో రథచక్రాల ధ్వనులతో ఆకాశం, అంతరిక్షం, దిక్కులను, విదిక్కులను, భూమిని ప్రతిధ్వనింపజేస్తూ శత్రువుల మీదికి విరుచుకుపడ్డారు. మహత్తరమయిన ఆ

శబ్దంతో సంతోషోత్సాహపూర్ణులయి, మహాఘోరమయిన కలహసముద్రం ఆవలి ఒడ్డుకు చేరదలచి, వీరులు వీరులతో తలపడ్డారు. అల్లెత్రాళ్ళు, చేతితొడుగులు, ధనుస్సుల ధ్వనులు, ఏనుగుల ఘీంకారాలు, యుద్ధభూమిలో పడిపోతున్న పదాతుల అరుపులు చాలా అధికమయ్యాయి. నానావిధాలయిన శూరుల తాళధ్వనులు, సింహనాదాలు విని, అక్కడ సైనికులు తీవ్రంగా భయపడ్డారు. పడ్డారు. గ్లానిచెందారు. సింహనాదాలు చేస్తూ శస్త్రవర్షాన్ని కురిపిస్తున్న శత్రువులను వీరుడయిన కర్ణుడు అనేకులను బాణాలు వేసి, మథించాడు. కర్ణుడు బాణాలతో అయిదుగురు పాంచాలవీరుల పదునైదు రథాలను, గుర్రాలతో, సూతులతో ధ్వజాలతో కూడా యమలోకానికి పంపాడు. మహాయుద్ధంలో మహాపరాక్రమవంతులు, త్వరగా అస్త్రాలు ప్రయోగించే యోధశ్రేష్ఠులు కర్ణుని అన్నివైపులనుంచి త్వరగా చుట్టుముట్టారు. అప్పుడు కర్ణుడు బాణవర్షంతో శత్రుసేనను గగ్గోలు పరుస్తూ పక్షులతో నిండిన సరస్సును ఏనుగువలె చొరబడ్డాడు. రాధేయుడు శత్రువుల మధ్యలోకి వచ్చి, ఉత్తమ మయిన ధనుస్సును కంపింపజేస్తూ, పదునయిన బాణాలతో శత్రుశిరస్సులను త్రెంచి, పడేశాడు. శరీరధారుల డాళ్ళు, కవచాలు, చీలిపోయి నేలబడ్డాయి. రెండవ సూర్యునిలా వెలిగిపోతున్న ఆయన స్పర్శను గూడా వారు ఓర్చుకోలేకపోయారు. రౌతు గుర్రాలను కొరడాతో కొట్టినట్లు కర్ణుని ధనుస్సునుంచి వెలువడి కవచాలను, శరీరాలను, ప్రాణాలను మధించే బాణాలు శత్రువుల హస్తత్రాణాలను కూడా దెబ్బకొడుతున్నాయి. సింహం మృగసమూహాలను వలె కర్ణుడు తన బాణాలబారిన పడిన పాండవ సృంజయ పాంచాల వీరులను వేగంగా సంహరించాడు. మాన్యా! అప్పుడు పాంచాలరాజు ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ పుత్రులు, నకుల సహదేవులు సాత్యకితో గూడి కలిసి, కర్ణుని ఎదుర్కొన్నారు. కౌరవ పాంచాల పాండవ వీరులు పరిశ్రమపూర్వకంగా యుద్ధంలో మగ్నులయి ఉండగా, యోధులు ప్రియమయిన ప్రాణాలమీద మమకారం వదలి, పరస్పరం పోరాడారు.

మాన్యా! ఉభయపక్షవీరులు సర్వసన్నద్ధులు, కవచధారులు, శిరస్త్రాణాలను, ఆభరణాలను దాల్చినవారు, మహాబలులు, గదలతో, ముసలాలతో, కొందరు పరిఘలతో, కాలదండాలవలె పయికెత్తిన ఆయుధాలతో కేకలు పెడుతూ, పిలుస్తూ ఒకరిమీదికొకరు దూకారు. పరస్పరం పోరాడారు. ఒకరినొకరు గాయపరచుకొన్నారు. శరీరాలనుంచి రక్తం కారుతుండగా మస్తిష్కాలు, కన్నులు, ఆయుధాలు లేనివారయ్యారు. రక్తంతో నిండి ఉండటం వల్ల దంతాలు దానిమ్మగింజలలాగా ఉన్నాయి. అటువంటి ముఖాలతో కొందరు శస్త్రాస్త్రవ్యాప్తులయి నిర్జీవులయినా సజీవులు లాగానే ఉన్నారు. మహాసముద్రంలా

సువిశాలమయిన ఆ రణభూమిలో పరస్పరం కుపితులయిన కొందరు యోధులు పరశువులు, పట్టిసాలు, ఖడ్గాలు, శక్తులు, భిందిపాలాలు, నఖరాలు, ప్రాసాలు, తోమరాలు అనే ఆయుధాలతో వీలయినంతగా ఒకరినొకరు చీల్చటం ఛేదించటం, విసరివేయటం, ముక్కలు చేయటం, సంహరించటం చేశారు. ఒకరినొకరు సంహరించటం వల్ల యుద్ధవీరులు రక్తసిక్తులయి రక్తం ప్రవహిస్తుండగా మొదలు నరికిన మంచిగంధపు చెట్లవలె, నిర్జీవులయి నేలగూలారు. రథికులు రథికులను, గజారోహకులు గజారోహకులను, పదాతులు పదాతులను, రౌతులు రౌతులను చంపగా వేల కొలది నేలగూలారు. క్షురాలతో, భల్లాలతో, అర్ధచంద్రబాణాలతో ఖండితాలయిన, ధ్వజాలు, శిరస్సులు, గొడుగులు, ఏనుగుతొండాలు, మానవుల భుజాలు నేల మీద పడ్డాయి. యుద్ధంలో నరులను, ఏనుగులను, రథాలను, గుర్రాలను మర్దించారు. అశ్వారోహకుల చేతిలో హతులయిన శూరులు, తొండాలు తెగిపోయిన ఏనుగులు పతాకలతో ధ్వజాలతో గూడి, పిండి అయిపోయిన పర్వతాలవలె పడ్డారు. పదాతులు ఎగిరిదూకి ఏనుగులను, రథాలను పడగొట్టుతూ సంహరిస్తూండగా అంతటా అవి పడి ఉన్నాయి. రౌతులను ఎదుర్కొని పదాతులు త్వరగా సంహరించారు. రౌతులు పదాతిసమూహాలను చంపగా యుద్ధంలో అందరూ పడిఉన్నారు. ఆ మహాయుద్ధంలో హతులయిన వీరుల ముఖాలు, శరీరాలు నలిపివేసిన పద్మాలవలె, వాడినపూలమాలికల వలె శోభాహీనాలుగా ఉన్నాయి. రాజా! ఏనుగుల, గుర్రాల, పదాతుల అందమయిన రూపాలు బురద కొట్టుకొన్న వస్త్రాలవలె చూడటానికి వీలుకాని వయ్యాయి.

22. పుండ్రుని పరాజయము. వంగరాజ వధ

సంజయుడు చెప్పాడు – 'రాజా! నీ పుత్రుడయిన దుర్యోధనుడు పురికొల్పగా మావటివారు ఏనుగులనెక్కి, ధృష్టద్యుమ్నుని చంపదలచి ఆయనపైకి వెళ్ళారు. తూర్పు దేశంవారు, దక్షిణదేశం వారు, శ్రేష్ఠులయిన గజయోధులు, అంగవంగ దేశీయులు, పుండ్రులు, మగధ దేశంవారు, తామ్రలిప్తులు, మేకలులు, కోసలులు, మద్రదేశీయులు, దశార్ణులు, నిషదులు – గజయుద్ధంలో నేర్పరులయిన వీరందరు కళింగ దేశీయులతో గూడి బాణాలతో, తోమరాలతో, నారాచాలతో సమృద్ధిగా వర్షంకురిసే మేఘాలలాగా యుద్ధభూమిలో పాంచాలసేనలను ముంచివేశారు. శత్రువులసేననంతను త్రొక్కివేయదలచిన ఆ ఏనుగులను మావటివారు వ్రేళ్ళతో, అంకుశాలతో పలుమారులు పురికొల్పారు. ఇది చూసి, ధృష్టద్యుమ్నుడు నారాచాలను వర్షంగా కురిపించాడు. కొండలంత ఉన్న ఏనుగులలో

ఒక్కొక్కదానిని పది బాణాలతో, ఆరింటితో, ఎనిమిదింటితో గాయపరిచాడు. మేఘాలు సూర్యుని క్రమ్మినట్లు గజారోహకులయిన వీరులు ధృష్టద్యుమ్నుని కప్పివేయటం చూచి పాండవులు, పాంచాలులు పదునయిన ఆయుధాలు ధరించి, కేకలు వేస్తూ, వారిమీదికి వెళ్ళారు.

నకులుడు, సహదేవుడు, ఉపపాండవులు, ప్రభద్రకులు, సాత్యకి శిఖండి చేకితానుడు అనే వీరులు అందరు అల్లెత్రాడులు అనే వీణతీగలను మీటుతూ, శూరుల తాళాలతో ప్రేరితులయి వీరనృత్యం చేస్తూ, మేఘాలు కొండలమీద వానకురిసినట్లు ఆ ఏనుగులను బాణవర్షంతో ముంచెత్తారు. మ్లేచ్ఛ వీరులు పురికొల్పిన ఏనుగులు అతికోపంతో పదాతులను, గుర్రాలను, రథాలను తొండాలతో విసిరివేసి కాళ్ళతో త్రొక్కివేశాయి. శత్రువులను అవి దంతాలతో చీల్చివేశాయి. మరికొందరిని తొండాలతో ఎత్తి విసిరివేశాయి. చాలామంది యోధులు వాటి దంతాల్లో చిక్కుకొని భయంకరస్థితిలో క్రిందపడ్డారు. సాత్యకి తన ఎదుట ఉన్న వంగదేశాధిపతి యొక్క ఏనుగు మర్మస్థానాలను తీవ్రవేగం గల బాణంతో ఛేదించి, నేలగూల్చాడు. శరీరాన్ని కుంచించుకొని, ఏనుగుమీద నుంచి దూకబోతున్న వంగరాజు వక్షఃస్థలంలో సాత్యకి ఒక బాణం వేశాడు. దాంతో గాయపడిన ఆయన నేలమీద పడ్డాడు. కదులుతున్న పర్వతంలాగా తనమీదికి వస్తున్న పుండ్రరాజు ఏనుగును సహదేవుడు ప్రయత్నపూర్వకంగా వేసిన మూడు బాణాలతో చంపాడు. సహదేవుడు ఆ ఏనుగు మీద ఉన్న పతాకను, మావటిని, కవచాన్ని, ధ్వజాన్ని దాని ప్రాణాలను హరించి, మళ్ళీ అంగ దేశాధిపతి మీదికి వెళ్ళాడు. సహదేవుడు నకులుని వారించి, అంగరాజు పుత్రుని యమదండ సమానమయిన మూడు బాణాలతో ఏనుగును, నూరు బాణాలతో ఆయనను బాధించాడు. అంగరాజు పుత్రుడు సూర్యకిరణాలవలె తీవ్రమయిన ఎనిమిది వందల తోమరాలను నకులుని మీద విసిరాడు. ఆయన వాటిలో ప్రతిదాన్ని మూడుముక్కలు చేశాడు. నకులుడు ఆ రాజు పుత్రుని అర్ధచంద్రబాణంతో ఖండించాడు. హతుడయి ఆ మ్లేచ్ఛుడు ఆ ఏనుగుతో కూడా నేలగూలాడు. గజ విద్యావిశారదుడయిన అంగరాజపుత్రుడు హతుడు కాగా, క్రుద్ధులై అంగదేశీయు లయిన మావటివారు ఏనుగుల గుంపుతో నకులుని ఎదుర్కొన్నారు. ఆ ఏనుగుల మీద జెండాలు ఎగురుతున్నాయి. వాటి ముఖాలు చాలా అందంగా ఉన్నాయి. వాటిని కట్టటానికి తయారుచేసిన త్రాళ్ళు, సువర్ణమయాలు. అవి ప్రజ్వలిస్తున్న పర్వతాల లాగా ఉన్నాయి. ఆ ఏనుగులతో నకులుని త్రొక్కించి వేయదలచిన మేకలులు, ఉత్కళులు, కాళింగులు, నిషధులు, తామ్రలిప్తకులు అయిన యోధులు మహోత్సాహంతో బాణాలను, తోమరాలను వర్షించసాగారు. వారందరూ

ఆయనను సంహరింపదలచారు. సూర్యుని మేఘాలలాగా నకులుని కప్పివేస్తున్న వారిని చూసి, పాండవులు, పాంచాలురు, సోమకులు, క్రోధపూర్ణులయి ఆమ్లేచ్ఛుల మీదికి దూకారు. బాణవర్షాలను, వేలకొలది తోమరాలను ప్రయోగిస్తున్న రథికులకు గజయోధులతో యుద్ధం జరిగింది. నారాచాలు తగలటం చేత ఏనుగుల కుంభస్థలాలు, మర్మస్థానాలు పగిలాయి. వాటి దంతాలు, అలంకారాలు ధ్వంసం అయ్యాయి. సహదేవుడు వాటిల్లో ఎనిమిది మహాగజాలను బాగా పదునయిన అరువది నాలుగు బాణాలతో వేగంగా కొట్టాడు. అవి మావటివారితో పాటు నేలగూలాయి. తన వంశాన్ని ఆనందింపజేసే నకులుడు ప్రయత్నపూర్వకంగా ఉత్తమ ధనుస్సును లాగి, అలవోకగా దూరం వెళ్ళే నారాచాలతో అనేక గజాలను సంహరించాడు. అప్పుడు పాంచాలురు, సాత్యకి, ఉపపాండవులు, ప్రభద్రకులు, శిఖండి మహాగజాలను బాణవర్షంతో ముంచెత్తారు. పాండవు లనే మేఘాలు శత్రుగజా లనే పర్వతాలను బాణా లనే వర్షం కురిపించి, పడగొట్టితే వజ్రాయుధ వర్షంతో ధ్వంసమయిన పర్వతాలవలె నేలగూలాయి. ఆ పాండవయోధ రథికవీరులు, గజసేనను నాశనం చేసిగట్లు తెగిపోయిన నదిలాగా నలుదిక్కులకు పారిపోతున్న నీ సేనను చూచారు. ఆ నీ సేనను పాండవుల సైనికులు మథించి, కల్లోలం చేసి, మళ్ళీ కర్ణుని పైకి వెళ్ళారు.

23. సహదేవుడు దుఃశాసనుని ఓడించుట.

సంజయుడు చెప్పాడు – 'మహారాజా! ఆ రీతిగా క్రుద్ధుడయిన సహదేవుడు నీసేనను దహిస్తుండగా దుఃశాసనుడు సోదరుడయిన నకులుని ఎదుర్కొన్నాడు. యుద్ధంలో వారిద్దరు తలపడటం చూసి, అక్కడ ఉన్న మహారథులు పెద్దగా సింహనాదాలు చేశారు. ఉత్తరీయాలను ఊపారు. నీ పుత్రుడు బలిష్ఠుడయిన సహదేవుని వక్షఃస్థలంలో మూడుబాణాలు వేశాడు. అప్పుడు సహదేవుడు నీకొడుకును ఒక బాణంతో గాయపరచి, డెబ్బది బాణాలను వేసి, సారథిని మూడు బాణాలతో కొట్టాడు. అప్పుడు దుఃశాసనుడు సహదేవుని ధనుస్సును ఖండించి, ఆయన బాహువుల మీద, వక్షఃస్థలంమీద డెబ్బది మూడుబాణాలు వేశాడు. బాగా కోపించిన సహదేవుడు ఖడ్గం తీసుకొని, గిరగిరా త్రిప్పి నీ పుత్రుని రథంమీదికి విసిరాడు. ఆ ఖడ్గం బాణమూ, అల్లె త్రాటితోగూడిన ధనుస్సును ఛేదించి, ఆకాశంలో నుంచి పడిన సర్పంలాగా నేలపై పడింది. సహదేవుడు ఇంకొక ధనుస్సును తీసుకొని, ప్రాణాలు తీసే ఒక బాణాన్ని దుఃశాసనుని మీద ప్రయోగించాడు. యమదండం వంటి కాంతి గలిగి తన మీద పడబోతున్న ఆ బాణాన్ని దుఃశాసనుడు పదునయిన అంచుగల

ఖడ్గంతో ముక్కలు చేశాడు. ఆ పదునయిన ఖడ్గాన్ని గిరగిరా త్రిప్పి సహదేవునిమీదకి విసిరాడు. ఆయన ఇంకొక ధనుస్సు తీసుకొని బాణం చేపట్టాడు. తన మీదకి వచ్చిపడుతున్న ఆ ఖడ్గాన్ని సహదేవుడు నవ్వుతూ, పదునయిన బాణాలతో కొట్టి పడవేశాడు. నీపుత్రుడు అరువది నాలుగు బాణాలను సహదేవుని రథంమీదికి వేగంగా వేశాడు. రాజా! చాలా వేగంగా వచ్చి పడుతున్న అనేకమయిన ఆ బాణాలలో ఒక్కొక్క దానిని అయిదు బాణాలు వేసి, సహదేవుడు ఖండించాడు.

సహదేవుడు నీపుత్రుడు వేసిన బాణాలను వారించి ఆయన మీద అనేక బాణాలను ప్రయోగించాడు. నీపుత్రుడు గూడా ఆ బాణాలను ఒక్కొక్క దాన్ని మూడు భాగాలు చేసి చీల్చివేస్తూ, భూమి బ్రద్దలయ్యేటట్లు పెద్దగా గావుకేకలు పెట్టాడు. తరువాత దుఃశాసనుడు సహదేవుని గాయపరచి, ఆయన సారథిమీద తొమ్మిది బాణాలు వేశాడు. అప్పుడు సహదేవుడు మృత్యుకాలంలో యముని వంటి ఒక ఘోరబాణాన్ని తీసుకొన్నాడు. ఆయన సుదృఢమయిన ధనుస్సునులాగి, నీ పుత్రుని మీద బాణం వేశాడు. అది వేగంగా ఆయన కవచాన్ని, ఆయనను ఛేదించి, పుట్టలోకి పాములాగా భూమిలో దూరింది. నీ పుత్రుడు ఆ బాణాఘాతంతో మూర్ఛపోయాడు. ఆయన మూర్ఛితుడు కావటం చూసి, సారథి భయపడి, పదునయిన బాణాలు తనకు తగులుతున్నా, రథాన్ని యుద్ధరంగం నుంచి ప్రక్కకు తోలాడు. సహదేవుడు కౌరవవీరుని ఓడించి, దుర్యోధనసేనను చూసి, దాన్ని అన్నివైపుల నుంచి మథించివేశాడు. రాజా! ఒక మానవుడు కోపించి, చీమల గుంపును అపి వేసినట్లు ఆయన కౌరవసేనను మథించి వేశాడు.'

24. కర్ణుని చేతిలో నకులుని పరాజయము.

సంజయుడు చెప్పాడు - 'రాజా! యుద్ధంలో సైన్యాన్ని పారద్రోలుతున్న వేగశీలి అయిన నకులుని కర్ణుడు కోపంతో నిలువరించాడు. అప్పుడు నకులుడు నవ్వుతూ కర్ణునితో ఇలా అన్నాడు. 'ఆహా! ఇంతకాలానికి దేవతలు నన్ను చల్లగా చూశారు. పాపాత్ముడా! యుద్ధంలో నీ కన్నుల ముందున్న నన్ను చూడు. శత్రుత్వానికి, కలహానికి, సర్వానర్థాలకు నీవే మూలం. నీ దోషంవలన కురువంశీయులు ఒకరినొకరు ఎదుర్కొని క్షీణించారు. ఇవ్వాళ నిన్ను యుద్ధంలో చంపి కృతకృత్యుడిని, నిర్విచారుడిని అవుతాను.' అని పలుకగా కర్ణుడు నకులునికి ఇలా సమాధానం చెప్పాడు. 'వీరా! ఈ వీరవచనాలు రాజపుత్రునికి, అందునా విలుకానికి తగి ఉన్నాయి. ముందు నన్ను బాణాలతో కొట్టు. నీ పౌరుషం చూద్దాం.. శూరా! యుద్ధంలో ముందు వీరకృత్యం చేసి, తరువాత ఆత్మస్తుతి

చేసుకోవటం సముచితం. నాయనా! శూరులయినవారు యుద్ధభూమిలో గొప్పలు చెప్పుకోకుండా యథాశక్తిగా యుద్ధం చేస్తారు. నీ శక్తిని అంతా ఉపయోగించి, నాతో యుద్ధం చేయి. నీ పొగరు అణుస్తాను.' అని కర్ణుడు వేగంగా నకులుని యుద్ధంలో డెబ్బదిమూడు బాణాలతో కొట్టాడు. నకులుడు పాములవంటి ఎనుబది బాణాలు వేసి కర్ణుని గాయపరచాడు. కర్ణుడు ఆయన ధనుస్సును ఛేదించి, రాతిమీద నూరిన బంగారుపిడులు గల ముప్పది బాణాలతో నకులుని బాధించాడు. విషపూర్ణమయిన పాములు భూమిని ఛేదించి, నీరు త్రాగినట్లు ఆ బాణాలు నకులుని కవచం చీల్చి, ఆయన రక్తం త్రాగాయి. తరువాత నకులుడు బంగరు వెనుక భాగము గల ఇంకొక ధనుస్సు తీసుకొని, డెబ్బది బాణాలతో కర్ణుని, మూడు బాణాలతో సారథిని గాయపరిచాడు. నకులుడు క్రుద్ధుడై పదునయిన క్షురప్రంతో కర్ణుని ధనుస్సును ఖండించాడు. వీరుడయిన నకులుడు సర్వలోకాల్లో విఖ్యాతుడు, మహారథుడు, ఛిన్నధనుస్సు గల కర్ణుని చూసి, నవ్వుతూ మూడువందల బాణాలతో కొట్టాడు.

మాన్యా! నకులుడు గాయపరిచిన కర్ణుని చూసి, దేవతలతో సహా అక్కడ ఉన్న రథికులు పరమాశ్చర్యం చెందారు. అప్పుడు వైకర్తనుడయిన కర్ణుడు ఇంకో ధనుస్సు తీసుకొని, నకులుని మెడ ఎముకకు తగిలేటట్టు అయిదు బాణాలు వేశాడు. అక్కడ నాటుకొని ఉన్న ఆ బాణాలతో నకులుడు తన కిరణాలతో లోకంలో వెలుగులు ప్రసరిస్తున్న సూర్యునిలాగా విరాజిల్లాడు. మాన్యా! అప్పుడు నకులుడు కర్ణుని ఏడుబాణాలతో గాయపరిచి, మళ్ళీ ఆయన వింటి కొప్పును విరుగగొట్టాడు. యుద్ధభూమిలో ఆయన చాలవేగవంతమయిన ఇంకొక ధనుస్సును తీసుకొని, నకులుని బాణాలతో అన్ని దిక్కుల నుంచి కప్పివేశాడు. కర్ణుని ధనుస్సు నుండి వెలువడిన బాణాలు వేగంగా కప్పి వేస్తుండగా, మహారథుడయిన నకులుడు ఆ బాణాలను బాణాలతో త్వరగా ఖండించాడు. అప్పుడు ఆకాశంలో విసిరిన వలలాగా ఉన్న బాణసమూహం ఆకాశంలో ఎగురుతున్న మిణుగురు పురుగులులాగా కనిపించింది. బాణాలతో కప్పివేసిన ఆకాశం మిడుతల దండుతో నిండినట్లు కన్పించింది. మాటిమాటికి పడుతున్న సువర్ణవికారమయిన ఆ బాణాలు గుంపులు గుంపులుగా ఉన్న క్రౌంచపక్షులులాగా విరాజిల్లాయి. ఆకాశం అంతా బాణసమూహంతో నిండి, సూర్యుడు ఆచ్ఛాదితుడు కాగా ఆకాశంలోది ఏదీ భూమిమీద పడటం లేదు. బాణసమూహంతో అంతటా మార్గాలు మూసుకుపోయి, మహాత్ములయిన కర్ణ నకులులు ప్రళయకాలంలో ఉదయించిన సూర్యులలాగా ప్రకాశించారు. రాజేంద్రా! కర్ణుని ధనుస్సు నుండి వచ్చినబాణాల దెబ్బలు తిన్న సోమకులు బాధతో మూలుగుతూ తీవ్రంగా గాయపడి, అక్కడక్కడ

దాగుకొనసాగారు. రాజా! అలాగే నకులుని బాణాలతో చనిపోతున్న నీ సేనలు గాలి ఎగరగొట్టిన మేఘాలలాగా అన్ని దిక్కులకు చెల్లాచెదరయిపోయారు. వారు ప్రయోగించే దివ్య మహాశరాలు చంపుతుంటే ఆ రెండు సేనలు బాణాలు పడే ప్రదేశాల నుంచి తొలగి ప్రేక్షకులలాగా ఉండిపోయారు. జనులు తొలగిపోగా ఆ మహాత్ములు పరస్పరం బాణవర్షంతో గాయపరచుకోసాగారు. రణరంగంలో ఒకరినొకరు చంపదలచి దివ్యాస్త్రాలను ప్రయోగిస్తూ, త్వరగా బాణాలతో కప్పివేసుకొంటున్నారు. నకులుడు ప్రయోగించిన గ్రద్ద ఈకలు, నెమలి ఈకలు గల బాణాలు కర్ణుని కప్పివేసి, ఆకాశంలో నిలిచినట్లే మహాయుద్ధంలో కర్ణుడు వేసిన బాణాలు నకులుని కప్పివేసి, ఆకాశంలో నిలిచాయి.

రాజా! మేఘాలు కప్పివేసిన సూర్యచంద్రులవలె బాణగృహంలో ప్రవేశించిన నకుల కర్ణులు ఎవరికీ కన్పించలేదు. అప్పుడు కుపితు డయిన కర్ణుడు మిక్కిలి భయంకర స్వరూపం దాల్చి, నకులుని అన్నివైపుల నుంచి బాణవర్షంతో కప్పివేశాడు. మహారాజా! కర్ణుడు చాలా తీవ్రంగా బాణాలు వేసి, గాఢంగా కప్పివేసినా మేఘాలు క్రమ్మిన సూర్యునివలె నకులుడు వ్యధజెందలేదు. ఆర్యా! అప్పుడు కర్ణుడు పెద్దగా నవ్వి, నకులునిమీద వందలు, వేలు బాణాలు వేశాడు. ఆ మహామనస్వి అయిన కర్ణుడు వేసిన గాఢమయిన బాణసమూహం మహాంధకారం కల్పించింది. ఎడతెరపి లేకుండా శ్రేష్ఠశరాలు పడటం చేత మేఘాలు క్రమ్మివేసినట్లున్నది. మహారాజా ! తరువాత కర్ణుడు మనస్వి అయిన నకులుని ధనుస్సును ఛేదించి, నవ్వుతూ, రథం మీదనుంచి సారథిని నేలగూల్చాడు. ఆయన నకులుని రథాశ్వాలను నాల్గింటి మీద నాలుగు బాణాలు వేసి, త్వరగా యముని ఇంటికి పంపాడు. వెంటనే బాణాలతో ఆయన దివ్యరథాన్ని నువ్వుగింజలంత ముక్కలు చేశాడు. పతాకను, చక్రరక్షకులను, గదను, ఖడ్గాన్ని, నూరుచంద్ర బింబాలు గల డాలును, ఇంకా ఇతర సాధనాలను అన్నింటిని కర్ణుడు ధ్వంసం చేశాడు. నరపాలా ! అప్పుడు గుర్రాలు చావగా, రథం ధ్వంసంకాగా, నకులుడు త్వరగా రథం దిగి, పరిఘాయుధాన్ని చేతబట్టి, నిలిచాడు. నకులుడు వైకెత్తిపట్టుకున్న మహాఘోరమయిన పరిఘను బాగా పదునయిన బాణాలతో కర్ణుడు ముక్కలు చేశాడు. నకులుడు నిరాయుధుడు కావటం చూసి, కర్ణుడు బాగా వంగిన ములుకులు కల అనేక బాణాలను ఆయన మీద వేశాడు. కాని తీవ్రంగా బాధించలేదు. అస్త్రవిద్యాకుశలు డయిన కర్ణుడు బాధిస్తున్నందువలన ఇంద్రియాలు కలత చెందిన నకులుడు యుద్ధభూమి నుండి పారిపోయాడు. భారతా! కర్ణుడు పలుమారులు నవ్వుతూ ఆయనను వెంబడించి, ఎక్కుపెట్టిన ధనుస్సును ఆయన మెడలో వేశాడు. రాజా! కంఠంలో ధనుస్సు గల

నకులుడు ఆకాశంలో పరివేషం కలిగిన చంద్రునివలె, ఇంద్రధనుస్సుతో శోభించే నల్లనిమేఘంలాగా విరాజిల్లాడు. అప్పుడు కర్ణుడు ఆయనతో ఇలా అన్నాడు – 'వ్యర్థంగా వీరాలాపాలు పలికావు. మాటిమాటికి నేను బాధిస్తుంటే ఇప్పుడు సంతోసంతో ఆ మాటలు చెప్పు. పాండుకుమారా! నీకన్న బలవంతు లయిన కురువీరులతో యుద్ధం చేయకు. నీకు సమానులయినవారితో పోరు సలుపు. ఇందుకు సిగ్గుపడకు. మాద్రీకుమారా! ఇంటికైనా వెళ్ళు. లేక కృష్ణార్జునులు ఉన్న చోటికి వెళ్ళు. అని చెప్పి ఆయనను వదిలివేశాడు.

రాజా! ధర్మవేత్త అయిన కర్ణుడు వధించదగిన స్థితిలో ఉన్న నకులుని వధించలేదు. వెనక కుంతికి చేసిన వాగ్దానం గుర్తుతెచ్చుకొని, ఆయనను వదలివేశాడు. విలుకాడయిన సూతపుత్రుడు వదలివేయటం వల్ల నకులుడు సిగ్గుపడుతూ, యుధిష్ఠిరుని రథం వైపు వెళ్ళాడు. సూతపుత్రుని చేత సంతాపమందిన ఆయన దుఃఖసంతప్తుడయి, కుండలో ఉన్న పాములవలె నిట్టూర్పు విడుస్తూ యుధిష్ఠిరుని రథం ఎక్కాడు. నకులుని జయించిన తరువాత కర్ణుడ కూడా చంద్రునివలె తెల్లని గుర్రాలు పూన్చిన, గొప్పపతాకం గల రథంమీద ఉండి త్వరగా పాంచాలసేనల మీదికి వెళ్ళాడు. పాంచాలుర రథ సమూహం మీదికి వెళుతున్న కర్ణుని చూసిన పాండవసేనలలో పెద్దకోలాహలం చెలరేగింది. సూర్యుడు ఆకాశ మధ్యభాగానికి రాగా అక్కడ సూతపుత్రుడు చక్రంలాగా తిరుగుతూ తీవ్రయుద్ధం చేశాడు. పాంచాలుర రథసేనాసమూహాలలో కొన్ని రథాల చక్రాలు విరిగాయి. కొన్నింటి ధ్వజాలు, పతాకాలు ధ్వంస మయినాయి. కొన్నింటి గుర్రాలు హతమయ్యాయి. సూతులు హతులయ్యారు. కొన్నింటి కాడులు విరిగాయి. అప్పుడు పాంచాలురు గుంపులు గుంపులుగా పారిపోవటం చూశాం. అక్కడక్కడ తత్తరపాటు చెందిన మదగజాలు అడవిలో దావాగ్నితో శరీరాలు కాలినవానివలె తిరిగాయి. కొన్ని ఏనుగుల కుంభస్థలాలు పగిలి రక్తం కారుతున్నది. కొన్నింటి తొండాలు తెగాయి, కొన్నింటి కవచాలు చీలాయి. కొన్నింటి తోకలు తెగాయి. మనస్వి అయిన కర్ణుడు సంహరించటం వల్ల ఏనుగులు ముక్కలయిన మేఘాలవలె ఉన్నాయి. బాణాలకు, తోమరాలకు, నారాచాలకు భయపడి మిడుతలు అగ్నివైపు వెళ్ళినట్లు అవి ఆ కర్ణునిమీదికే వెళ్ళాయి. కొన్ని మదమత్తమహాగజాలు ఎర్రని జలధారలను స్రవించే పర్వతాలలాగా శరీరాలనుంచి రక్తం కారుతుండగా ఆర్తరావాలు చేస్తూ కనిపించాయి. ఆ రణభూమిలో శ్రేష్ఠాశ్వాలు కవచాలు చినిగినవి; వాలబంధాలు (తోకక్రింది నుంచి కట్టేత్రాళ్ళు) తెగినవి; వెండి, కంచు బంగారు అలంకారాలు పోయినవి, ఇతరాభరణాలు తొలగినవి; కళ్ళేలు లేనివి; చామరాలు, బొంతలు అమ్మల పాదులు క్రిందపడినవి; యుద్ధాలంకారు లయిన అశ్వారోహకులు హతులు కాగా యుద్ధభూమిలో తిరుగుతూ ఉన్న హయోత్తమాలు

కనిపించాయి. భారతా! ప్రాసలు, ఖడ్గాలు, బుష్టులు చేతులలో లేనివారు, చొక్కాలు, తలపాగలు మాత్రమే ధరించిన వారు, హతులయినవారు, బాధపడుతున్నవారు, వణుకుతూన్నవారు, అనేకాంగాలు కోల్పోయిన రౌతులను యుద్ధభూమిలో అక్కడక్కడ చూశాం. వేగవంతమయిన గుర్రాలు కట్టిన రథాలు రధికులు లేక తిరుగుతుండగా చూశాం. అనేక రధాల అక్షాలు, కూబరాలు విరిగాయి. కొన్నింటి చక్రాలు ధ్వంసమయ్యాయి. పతాకలు, ధ్వజాలు కొన్నింటికి లేవు. కొన్నింటి ఈషాదండాలు, బంధురాలు ముక్కలయ్యాయి. సూతపుత్రుని బాణాల దెబ్బలు తగిలి, అటు ఇటు పరుగులు తీస్తున్న రధికులు కొందరు ఆయుధాలు వీడి, కొందరు ఆయుధాలను పట్టి, మరణించారు.

నక్షత్ర సమూహాల వంటి చిహ్నాలు గల కవచాలు కప్పుకొని, ఉత్తమమయిన గంటలతో శోభిల్లుతూ, చాలా రంగులతో, విచిత్ర పతాకలతో అలంకృతాలయిన ఏనుగులు అంతటా పరుగెత్తుతుంటే చూశాం. కర్ణుని ధనుస్సునుండి వచ్చిన బాణాలు తగిలి తెగిన తలలను, బాహువులను, తొడలను, ఇతరాంగాలను రణభూమిలో అంతటా చూశాం. కర్ణుని బాణాలు తగిలినా పదునయిన బాణాలు వేస్తూ, యుద్ధం చేస్తున్న యోధుల మహాభయంకర మయిన సంగ్రామం చెలరేగింది. కర్ణుడు యుద్ధంలో వధిస్తున్నా సృంజయులు మిడతలు అగ్నివైపు పోయినట్లు ఆయనకు ఎదురు వెళ్తున్నారు. కర్ణుడు ప్రళయకాలంలోని ప్రచండాగ్నివలె అక్కడక్కడ పాండవసేనను దగ్ధం చేస్తున్నాడు. ఆ సమయంలో క్షత్రియులు ఆయనకు దూరంగా వెళ్ళారు. మరణించగా మిగిలిన పాంచాలురలోని మహారథులు చెల్లాచెదరయి పారిపోతుంటే కర్ణుడు బాణాలు వేస్తూ, వారి వెంటపడ్డాడు. కవచాలు, ధ్వజాలు ధ్వంసమయిన వారిని సూతపుత్రుడు మిట్టమధ్యాహ్నం నడినెత్తిమీదికి వచ్చిన ప్రచండ భాస్కరునిలాగా తపింపజేశాడు.

25. ఉభయపక్షవీరుల తీవ్రయుద్ధము

సంజయుడు చెప్పాడు - 'రాజా! నీ పుత్రుని పెద్దసేనను పారద్రోలుతున్న యుయుత్సుని హెచ్చరించి, ఉలూకుడు 'నిలు నిలు' అన్నాడు. రాజా! వజ్రాయుధంతో ఇంద్రుడు పర్వతాన్ని కొట్టినట్లు యుయుత్సుడు పదునయిన ములుకులు గల బాణాలతో ఉలూకుని కొట్టాడు. అప్పుడు ఉలూకుడు కోపించి, యుద్ధంలో నీ పుత్రుని ధనుస్సును క్షుప్రం అనే బాణంతో ఛేదించి, ఆయనను కర్ణి అనే బాణంతో కొట్టాడు. యుయుత్సుడు విరిగిన ధనుస్సు వదలి, కన్నులు ఎర్రబడగా ఇంకొక గొప్ప విల్లును పట్టి, ఉలూకుని

అరువది బాణాలతో గాయపరిచాడు. సారథిని మూడింటితో కొట్టాడు. మళ్ళీ ఆయనను బాణపీడితుని చేశాడు. ఉలూకుడు క్రుద్ధ డయి యుయుత్సుని సువర్ణభూషితాలయిన ఇరువది బాణాలతో కొట్టి, ఆయన బంగారుటెక్కెం ఖండించాడు. రాజా! ఆ బంగారు మహాధ్వజం కర్ర విరిగిపోగా ఛిన్నభిన్నమయి ఎదుటనే నేలబడ్డది. యుయుత్సువు క్రోధమూర్ఛితు డయి ఉలూకుని గుండెలలో అయిదు బాణాలు వేసి, గాయపరిచాడు. ఆర్యా! భరతవంశశ్రేష్ఠా! యుద్ధంలో ఉలూకుడు నూనెతో కడిగిన బాణంతో యుయుత్సుని సారథి శిరస్సును ఖండించాడు. వెంటనే యుయుత్సుని సారథి శిరస్సు ఆకాశాన్నుంచి విచిత్రమయిన తార నేలమీద పడినట్లు పడింది. నాలుగు గుర్రాలను, ఆయనను అయిదు బాణాలతో గాయపరిచాడు. బాగా గాయపడిన యుయుత్సువు ఇంకొక రథంమీదికి వెళ్ళాడు.

రాజా! రణంలో ఉలూకుడు ఆయనను జయించి, త్వరగా పాంచాలులను, సృంజయులను పదునయిన బాణాలతో కొడుతూ వెళ్ళాడు. మహారాజా! నీ సుతు డయిన శ్రుతకర్మ ఎలాంటి తొట్రుపాటులేకుండా ఒక్క అరనిముషంలో శతానీకుని అశ్వ, సూత, రథహీనుని చేశాడు. మహారథుడయిన శతానీకుడు హతాశ్వమయిన రథంమీదనుండి కోపంతో నీ పుత్రుని గురి చూసి, గదను విసిరాడు. ఆ గద గుర్రాలు, సారథితో సహా రథాన్ని భస్మం చేసి, భూమిని బ్రద్దలు చేస్తున్నట్లు వేగంగా పడింది. ఆ వీరులు ఇద్దరు విరథులయి ఒకరినొకరు చూసుకొంటూ యుద్ధవిరమణ చేసి, తొలిగారు. తొట్రుపడుతున్న నీ కొడుకు వివిత్సునిరథం ఎక్కాడు. శతానీకుడు త్వరగా ప్రతివింధ్యునిరథం ఎక్కాడు. శకుని సుతసోముని పదునయిన బాణాలతో మహాజల ప్రవాహం పర్వతాన్ని వలె కంపింపజేయలేకపోయాడు. తన తండ్రికి శత్రు వయిన అతనిని చూసి, సుతసోముడు అనేక సహస్రబాణాలతో ఆయనను కప్పివేశాడు. అలవోకగా అస్త్రప్రయోగం చేసేవాడు, చిత్రంగా యుద్ధం చేసేవాడు, యుద్ధంలో జయశీలుడు అయిన శకుని ఇతర బాణాలతో ఆ బాణాలను త్వరగా ఖండించాడు. ఆ బాణాలను పదునయిన బాణాలతో నివారించి, శకుని బాగా కోపించి, సుతసోముని మూడు బాణాలతో భేదించాడు. మహారాజా! నీ బావమరది బాణాలతో ఆయన గుర్రాన్ని, జెండాను, సారథిని నువ్వగింజలంత ముక్కలు చేశాడు. అది చూచి చూపరులు కోలాహలం చేశారు. గుర్రాలు చనిపోయి, రథం ధ్వంసమై, జెండా విరిగినా నిలకడయిన సుతసోముడు ఉత్తమ ధనుస్సును తీసుకొని, రథంమీదినుంచి దిగి, నేలమీద నిలిచాడు. రాతిమీద నూరిన బాణాలతో నీబావమరిదినీ, ఆయన రథాన్ని సుతసోముడిని కప్పివేశాడు. ఆయన వేసిన బాణసమూహం మిడుతల దండువలె ఉంది.

తన రథానికి సమీపంలో పడినా మహారథు డయిన శకుని ఏమాత్రం వ్యథజెందలేదు. మహాకీర్తిమంతు డయిన ఆయన సుతసోముని బాణాలను తన బాణ సమూహంతో మథించాడు. రథంమీద ఉన్న శకుని; సుతసోముడు పదాతిగా ఉండి యుద్ధం చేయటం అనే నమ్మశక్యంగాని, అద్భుతమయిన పనిని చూసి, నేలమీద ఉన్న యోధులు, ఆకాశంలో ఉన్న సిద్ధులు ఆనందపడ్డారు. రాజా! శకుని మంచిపదునయిన బాణాలతో సుతసోముని ధనుస్సును, అమ్ములపొదులను పూర్తిగా ధ్వంసం చేశాడు. ధనుసు విరిగిన సుతసోముడు వైడూర్యమణులతో నల్లకలువ వంటి వర్ణం గలిగి, ఏనుగుదంతంతో చేసిన పిడిగల ఖడ్గాన్ని పైకెత్తి, సింహనాదం చేశాడు. ధీమంతు డయిన సుతసోముడు గిరగిరా త్రిప్పుతున్న ఆ ఖడ్గం నిర్మలమయిన ఆకాశంలాగా మెరుస్తున్నది. శకుని దాన్ని చూసి, అది తనపాలిటి యమదండం అనుకొన్నాడు. ఖడ్గధారి అయిన ఆయన విద్యాబలసంపన్నుడు కావటం వల్ల పదునాల్గురీతుల మండలాకారంగా రణభూమిలో నలువైపుల సంచరించాడు. ఆయన యుద్ధభూమిలో భ్రాంతం, ఉద్భ్రాంతం, ఆవిద్ధం, ఆప్లుతం, విప్లుతం, సృతం, సంహితం, సముదీర్ణం మున్నగు గతులను ప్రదర్శించాడు. శకుని ఆయన మీద బాణాలను వేశాడు. సుతసోముడు వానిని ఉత్తమ ఖడ్గంతో వేగంగా ఖండించాడు.

అప్పుడు శకుని క్రుద్ధుడయి సుతసోమునిమీద పాములవంటి బాణాలను వేశాడు. గరుత్మంతునితో సమానపరాక్రమంగల సుతసోముడు విద్యతో, బలంతో ప్రావీణ్యం చూపుతూ, ఆ బాణాలను ఖడ్గంతో నరికివేశాడు. రాజా! సుతసోముడు ఖడ్గాన్ని మండలాకారంగా త్రిప్పుతున్నప్పుడు శకుని మంచి తీక్ష్ణమయిన క్షురప్రం అనే బాణంతో కాంతిమంత మయిన ఆ ఖడ్గాన్ని ఛేదించాడు. భారతా! ఖండిత మయిన ఆ మహాఖడ్గం తొందరగా నేలమీద పడ్డది. పిడితో గూడిన సగం ఖడ్గం ఆయన చేతిలో మిగిలింది. మహారథుడైన సుతసోముడు ఖడ్గం ముక్కలయిందని తెలిసి, ఆరు అడుగులు ముందుకు దూకి, మిగిలిన ఆ ముక్కను శకుని మీదికి విసిరాడు. రణంలో అల్లెత్రాటితో గూడి స్వర్ణవజ్రభూషిత మయిన శకుని ధనుస్సు వెంటనే నేలమీద పడ్డది. సుతసోముడు శ్రుతకీర్తి మహారథం మీదికి వెళ్ళాడు. అప్పుడు శకుని కూడా ఇంకొక ధనుస్సును తీసుకొని, అనేక శత్రుసమూహాలను చంపుతూ, పాండవసేన మీదికి వెళ్లాడు. యుద్ధభూమిలో నిర్భయంగా సంచరిస్తున్న శకునిని చూసి, పాండవసేనలలో మహానాదం కలిగింది. ఆ పాండవ సేనలు శకుని పారద్రోలుతుండగా పారిపోతూ కన్పించాయి. రాజా! దేవప్రభు వయిన ఇంద్రుడు రాక్షససేనను మర్దించినట్లు పాండవసేనను శకుని నాశనం చేశాడు.

26. కృపాచార్యుని వలన ధృష్టద్యుమ్ననికి భయము - కృతవర్మశిఖండిని ఓడించుట.

సంజయుడు చెప్పాడు - 'రాజా! అరణ్యంలో సింహాన్ని శరభమృగం పోరులో వారించినట్లు ధృష్టద్యుమ్నుని కృపాచార్యుడు యుద్ధంలో నిలువరించాడు. బలవంతు డయిన కృపుడు అడ్డగింపగా ధృష్టద్యుమ్నుడు ఒక్క అడుగు కూడా కదలలేకపోయాడు. ధృష్టద్యుమ్నుని రథాన్ని ఎదుర్కొన్న కృపాచార్యుని రథాన్ని చూసి, సర్వప్రాణులు భీతిల్లాయి. ధృష్టద్యుమ్నుడు అయిపోయాడని అనుకొన్నారు. అక్కడ ఉన్న సమస్తరథికులు, రౌతులు ఇలా అనుకొన్నారు. 'ద్రోణాచార్యుడు మరణించటంవల్ల దివ్యాస్త్రాలు తెలిసినవాడు, ఉదారచిత్తుడు, మహాతేజస్వి, నరశ్రేష్ఠుడు, శరద్వంతుని పుత్రుడయిన కృపాచార్యుడు తీవ్రంగా కుపితు డయి ఉంటాడు. ఇప్పుడు కృపాచార్యుడు ఎదుర్కొన్న ధృష్టద్యుమ్ననికి మేలు కలుగుతుందా? ఈ పాండవసేన ఇప్పుడు మహత్తరమయిన భయాన్నుంచి విముక్తి అవుతుందా? ఇక్కడికి వచ్చిన మమ్ములను అందరిని ఈ బ్రాహ్మణుడు చంపుతాడో ఏమో ! ఇప్పుడు ఈయన రూపం యమధర్మరాజు రూపంలాగా కన్పిస్తున్నది. ఇవ్వాళ కృపాచార్యుడు ద్రోణాచార్యుని అడుగుజాడలలోనే నడుస్తాడు. కృపాచార్యుడు వేగంగా బాణాలు వేయగలవాడు. యుద్ధంలో ఎల్లప్పుడు విజేత. అస్త్రవంతుడు, బలపరాక్రమాలు గలవాడు, కోపపూర్ణుడు. ధృష్టద్యుమ్నుడు ఇవ్వాళ యుద్ధవిముఖుడు అయినట్లు కన్పిస్తున్నాడు.' ఈ రీతిగా ధృష్టద్యుమ్నుని కృపాచార్యుని గురించిన మాటలు మీవారికి శత్రువులతో జరిగే సమాగమంలో వినపడ్డాయి.

కృపుడు కోపంతో నిట్టూర్పు విడిచి ధృష్టద్యుమ్నుడు నిశ్చేష్టుడు అయ్యేరీతిగా ఆయన మర్మస్థానాలన్నింటిలో తగిలేటట్లు బాణాలు వేసి, బాధించాడు. కృపుడు బాణాలతో కొడుతుంటే మూర్ఛకలిగి ధృష్టద్యుమ్ననికి ఏం చేయాలో తెలియలేదు. అప్పుడు సారధి ఆయనతో ఇలా అన్నాడు - 'ధృష్టద్యుమ్నా! నీకు క్షేమమేనా? యుద్ధంలో నీకు ఇటువంటి సంకటస్థితి కలగటం నేను ఎప్పుడూ చూడలేదు. కృపుడు నీ మర్మస్థానాలను గురిచూసిన మర్మభేదకా లయిన బాణాలు దైవవశాన నీకు తగలవలసిన చోట తగలలేదు. శక్తిశాలి అయిన పురుషుడు సముద్రాన్నుంచి నదీ వేగాన్ని మళ్ళించినట్లు మన రథాన్ని త్వరగా ప్రక్కకు తోలుతాను. నీ పరాక్రమాన్ని వమ్ము చేసిన ఈ బ్రాహ్మణుడు అవధ్యుడని అనుకొంటాను.' అప్పుడు ధృష్టద్యుమ్నుడు మెల్లగా ఇలా అన్నాడు. "సారధీ ! నా మనస్సు ఇప్పుడు మోహమగ్నం అవుతున్నది. శరీరం అంతా చెమట పట్టుతున్నది. వణుకు పుడుతున్నది.

ఒళ్ళు గగుర్పొడుస్తున్నది. యుద్ధంలో బ్రాహ్మణుని వదలి అర్జునుడున్నచోటికి మెల్లిగా వెళ్ళు. ఇవ్వాళ అర్జునుని గాని భీముని గాని చేరితేనే నాకు క్షేమం కలుగుతుంది అని నా దృఢమయిన నమ్మకం.' అప్పుడు సారథి గుర్రాలను తొందరచేస్తూ, రథాన్ని భీముడు నీ సైనికులతో యుద్ధం చేస్తున్న చోటికి తోలాడు. మాన్యా! ధృష్టద్యుమ్నుని రథం త్వరగా పోవటం చూసి, కృపుడు వందలకొలది బాణాలు వేస్తూ, ఆయన వెంట పడ్డాడు. శత్రువులను అణచివేసే కృపుడు మాటిమాటికి శంఖం పూరించాడు. మహేంద్రుడు నముచిని వలె ఆయన ధృష్టద్యుమ్నుని భీతిల్లజేశాడు. మరోవైపు భీష్ముని పాలిటి మృత్యువు, దుర్జయవీరు డయిన శిఖండిని కృతవర్మ మాటిమాటికి నవ్వుతూ నిలువరించాడు. శిఖండి కృతవర్మను ఎదుర్కొని, అయిదు పదునయిన బాణాలతో మెడ ఎముకకు తగిలేటట్టు కొట్టాడు. కృతవర్మ తీవ్రంగా కోపించి, అరువది బాణాలతో శిఖండిని ఛేదించి, ఒక బాణంతో ఆయన ధనుస్సును త్రుంచాడు. ద్రుపద పుత్రుడు ఇంకొక ధనుస్సు చేకొని 'నిలు, నిలు' అని కృతవర్మను హెచ్చరించాడు.

రాజేంద్రా! బంగారు రెక్కలు గల పదునయిన తొంబది బాణాలను శిఖండి వేశాడు. అవి కృతవర్మ కవచానికి తగిలి మొక్క పోయాయి. వ్యర్థమయి అవి నేలబడటం చూసి, శిఖండి పదునయిన క్షురప్రంతో కృతవర్మ ధనుస్సును ముక్కలు చేశాడు. ధనుస్సు ధ్వంసమయి కొమ్ములు విరిగిన వృషభంలాగా ఉన్న కృతవర్మను శిఖండి క్రుద్ధు డయి ఎనుబది బాణాలను భుజాలమీద, ఎదురు రొమ్ము మీద వేశాడు. బాణాలతో బాగా గాయపడిన కృతవర్మ కుండమాతిలో నుంచి నీటిని వలె శరీరానికి తగిలిన గాయాలనుంచి రక్తం కార్చాడు. రాజా! రక్తంతో బాగా తడిసిన కృతవర్మ వర్షంతో నానిన గైరిక పర్వతంలాగా విరాజిల్లాడు. కృతవర్మ అల్లెత్రాటిని సంధించి, బాణంతో సహా ఇంకొక ధనుస్సు తీసుకొన్నాడు. బాణ సమూహంతో శిఖండి భుజాల మీద తగిలేటట్లు కొట్టాడు. స్కంధప్రదేశంలో గ్రుచ్చుకొని ఉన్న బాణాలతో శిఖండి కొమ్ములతో, చిరుకొమ్మలతో విశాలమైన గొప్ప చెట్టులాగా శోభిల్లాడు. వారు ఒకరినొకరు తీవ్రంగా గాయపరచుకొని, రక్తంతో తడిసి రక్తసరస్సులో మునిగి, తేలినట్లున్నారు. పరస్పరం కొమ్ములతో పొడుచుకున్న ఎద్దుల వలె ఉన్నారు. ఒకరినొకరు చంపుకొనే ప్రయత్నం చేస్తున్న ఆ మహారథులు రథాలమీద అక్కడ మండలాకారంగా తిరిగారు. కృతవర్మ శిఖండిని బంగారు ఈకలు గలిగి, రాతిమీద సానపెట్టిన పదునయిన డెబ్బది బాణాలతో గాయపరిచాడు. కృతవర్మ ప్రాణాలు తీసే బాణాన్ని త్వరగా శిఖండిమీద వేశాడు. రాజా! ఆ బాణం బాగా తగలటం

వల్ల వెంటనే శిఖండి మూర్ఛపోయాడు. మోహావిష్ట డయిన ఆయన త్వరగా రథదండాన్ని ఊతం చేసుకొన్నాడు. కృతవర్మ బాణఘాతంతో సంతప్తుడై, మాటిమాటికి నిట్టూరుస్తున్న శిఖండిని సారథి త్వరగా యుద్ధభూమినుంచి తొలగించి తీసుకుపోయాడు. ద్రుపద పుత్రుడు పరాజితుడు కాగా, పరపక్షం గాయపరుస్తుంటే, పాండవసేన అంతటా పారిపోసాగింది.'

27. అర్జునుడు సంశప్తకుల సంహరించుట.

మహారాజా! తరువాత అర్జునుడు నీ సైన్యాన్ని వాయువు తీవ్రంగా వీచి, దూదికుప్పను ఎగరగొట్టినట్లు ధ్వంసం చేశాడు. ఆ అర్జునుని కౌరవులతో గూడ త్రిగర్తులు, శిబులు, సాల్వులు, సంశప్తకులు, నారాయణబలం ఎదుర్కొన్నారు. భరతనందనా! సత్యసేనుడు, చంద్రదేవుడు, మిత్రదేవుడు, శ్రుతంజయుడు, సౌశ్రుతి, చిత్రసేనుడు, మిత్రవర్మ అనే ఏడుగురు సోదరులు, నానాశాస్త్ర విశారదులు, గొప్ప విలుకాండ్రు అయిన పుత్రులు చుట్టూ ఉండగా త్రిగర్తరా జయిన సుశర్మ యుద్ధభూమిలో నిలిచి ఉన్నాడు. వారు బాణసమూహాలను సృజిస్తూ, యుద్ధరంగంలో అర్జునుని మీద కురిపించగా అవి జలప్రవాహాలు సముద్రాన్నివలె ఆయనను ఎదుర్కొన్నాయి. లక్షల కొలది ఆ యోధులు అర్జునుని ఎదుర్కొని, గరుత్మంతుని చూసిన సర్పాలవలె నశించారు. తగలబడుతున్నా మిడతలు అగ్నిని వదలనట్లు యుద్ధంలో హతులవుతూ కూడా ఆ వీరులు అర్జునుని వదలలేదు.

అర్జునుని మీద సత్యసేనుడు మూడు బాణాలు, మిత్రదేవుడు అరువది మూడు, చంద్రసేనుడు ఏడు, మిత్రవర్మ డెబ్బదిమూడు, సౌశ్రుతి ఏడు, శ్రుతంజయుడు ఇరువది, సుశర్మ తొమ్మిది బాణాలు వేశారు. యుద్ధరంగంలో అనేక రాజులు తనను గాయపరచగా, అర్జునుడు వారిని గాయపరిచాడు. సౌశ్రుతిని ఏడు బాణాలతో సత్యసేనుని మూడు బాణాలతో కొట్టాడు. శ్రుతంజయుని ఇరువదితో, చంద్రదేవుని ఎనిమిదింటితో మిత్రదేవుని నూరు బాణాలతో, శ్రుతసేనుని మూడింటితో, మిత్రవర్మను తొమ్మిదింటితో, సుశర్మను ఎనిమిదింటితో కొట్టాడు. అర్జునుడు శ్రుతంజయుడనే రాజును చంపి, శిరస్త్రాణంతో గూడిన సౌశ్రుతి శిరస్సును శరీరాన్నుంచి వేరు చేసివేశాడు. వేగంగా బాణాలు వేసి చంద్రసేనుని యమలోకానికి పంపాడు. విజయం కోసం ప్రయత్నించే ఇతర మహారథులను ఒక్కొక్కని ఐదేసి, అయిదేసి బాణాలు వేసి, నిలువరించాడు. కోపించిన సత్యసేనుడు శ్రీకృష్ణుని ఉద్దేశించి, ఒక తోమరాన్ని వేసి, పెద్దగా సింహనాదం చేశాడు. ఆ తోమరం మాధవుని కుడి భుజాన్ని ఛేదించి, నేలమీద పడింది. తోమరం గాఢంగా తగలటంవల్ల

శ్రీకృష్ణుని చేతిలోని చెర్నాకోల, పగ్గాలు జారిపడిపోయాయి. బాగా చీలిపోయిన భుజాలు గల శ్రీకృష్ణుని చూసి, అర్జునుడు తీవ్రంగా కోపం తెచ్చుకొని, శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. 'శ్రీకృష్ణా! రథం సత్యసేనునివైపు పోనియ్యి. ఈతనిని యమలోకానికి పంపుతాను.' ఆ శ్రీకృష్ణుడు ఇంకొక చెన్నకోల తీసుకుని గుర్రాల పగ్గాలు చేతబట్టి, గుర్రాలను సత్యసేనుని రథంవైపు తోలాడు. భుజం చీలిపోయిన శ్రీకృష్ణుని చూసి, మహారథుడు, పార్థుడు పదునయిన బాణాలు వేసి, సత్యసేనుని వారించి, కుండలాలతో అలంకృతమయిన ఆ రాజు శిరస్సును ఖండించాడు. సత్యసేనుని శిరస్సును ఖండించి, మిత్రవర్మను పదునయిన బాణాలతో, ఆతని సారథిని తీక్షణమయిన వత్సదంతంతో సంహరించాడు. అర్జునుడు క్రుద్ధుడయి వందలకొలది బాణాలు వేసి, లక్షలకొలది సంశప్తక గణాలను పడగొట్టాడు. అర్జునుడు మనస్వి అయిన మిత్రదేవుని శిరస్సును బంగారు రెక్కలు గల క్షురప్రం అనే బాణంతో త్రెంచివేశాడు. అర్జునుడు సుశర్మ మెడ దగ్గర తగిలేటట్టు బాణంతో కొట్టాడు. అప్పుడు సంశప్తకులు అందరు అర్జునుని చుట్టుముట్టి, కోపంతో, బాణ సమూహంతో గాయపరిచి, పది దిక్కులూ పిక్కటిల్లేట్లు సింహనాదం చేశారు. వారు గాయపరచగా ఇంద్రసమాన పరాక్రమం గల అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు.

నరేంద్రా! దానినుంచి వేలకొలది బాణాలు ఆవిర్భవించాయి. ముక్కలవుతున్న ధ్వజాలు, ధనుస్సులు, పతాకలతో గూడిన రథాలు, అమ్ములపొదులు, నొగలు, ధురాలు, చక్రాలు, కవచాలు, బాణాలు, పడిపోతున్న గుర్రాలు, ప్రాసలు, ఋష్టులు గదలు, పరిఘలు, శక్తులు, తోమరాలు, పట్టిశాలు, చక్రాలతో గూడిన శతఘ్నులు, తొడలతో కూడా భుజాలు, కంఠసూత్రాలు, గదలు, కేయూరాలు, హారాలు, అలంకారాలు, కవచాలు, గొడుగులు, వింజామరలు, కిరీటాలతో కూడిన శిరస్సులు నేలబడ్డాయి. అక్కడక్కడ మహాశబ్దం వినిపించింది. కుండలాలతో గూడి చక్కని కన్నులు గలవి, నిండు చందురుని వంటి శిరస్సులు ఆకాశంలోని నక్షత్ర సమూహంలాగా నేలబడి కన్పించాయి. హతులై నేలబడియున్న వీరుల శరీరాలు మంచి పూలమాలలు, మంచివస్త్రాలు, మంచి గంధపుపూత గలిగి కనిపించాయి. హతు లయిన రాజపుత్రులు, క్షత్రియులతో నిండి ఉన్న యుద్ధరంగం అప్పుడు గంధర్వనగరంలాగా కన్పించింది. నేలగూలిన ఏనుగులతో, గుర్రాలతో గూడి ఉన్న యుద్ధభూమి పగిలిపోయిన పర్వతాలవలె అడుగుపెట్ట వీలుకానిదిగా ఉంది. బాణాలతో శత్రువులను, ఏనుగులను, గుర్రాలను సంహరిస్తున్న అర్జునునికి ఆయన రథచక్రాలు పోవటానికి కూడా త్రోవ దొరకలేదు. రక్తంతో బురదగా మారిన రణరంగంలో సంచరిస్తున్న

ఆయన రథచక్రాలు భయంతో శిథిలం అవుతున్నట్లున్నాయి. మనోవేగం, వాయువేగం, గల రథాశ్వాలు రక్తసిక్త రణభూమిలో దిగబడుతున్న రథచక్రాలను మిక్కిలి శ్రమపడి లాగుతున్నాయి. అర్జునుని చేత హతమవుతున్న కౌరవసేన అంతా దాదాపుగా యుద్ధవిముఖం అయినట్లున్నది. అనేక సంశప్తక గణాలను జయించిన పార్థుడు పాగలేని అగ్నిజ్వాలలాగా విరాజిల్లాడు.

28. యుధిష్ఠిర దుర్యోధనుల యుద్ధము. దుర్యోధన పరాజయము. సంకుల సమరము.

సంజయుడు చెప్పాడు - 'మహారాజా! అనేక బాణాలను విడుస్తున్న యుధిష్ఠిరుని దుర్యోధనుడు నిర్భయు డయి స్వయంగానే ఎదుర్కొన్నాడు. గబగబా వస్తున్న దుర్యోధనుని చూసి, ధర్మరాజు త్వరగా బాణాలతోకొట్టి 'నిలు ! నిలు !' అన్నాడు. అందువల్ల క్రుద్ధుడయిన దుర్యోధనుడు పదునయిన తొమ్మిది బాణాలతో ఆయనను కొట్టాడు. ఆయన సారథిని ఒక బాణం వేసి, గాయపరిచాడు. అప్పుడు యుధిష్ఠిరుడు దుర్యోధనుని గురి చూసి, బంగరు ఈకలు గల్గి, రాతిమీద పదునుపెట్టిన పదమూడు బాణాలు వేశాడు. యుధిష్ఠిరుడు నాలుగు బాణాలతో ఆయన రథాశ్వాలు నాలిగింటిని చంపాడు. అయిదవ బాణంతో సారథి శిరస్సు ఖండించాడు. ఆరో బాణంతో ధ్వజాన్ని, ఏడోదానితో ధనుస్సును, ఎనిమిదవ దానితో ఖడ్గాన్ని నేలబడవేశాడు. అయిదు బాణాలతో దుర్యోధనుని తీవ్రంగా గాయపరిచాడు. గుర్రాలు చచ్చిన ఆ రథంమీది నుంచి నీకుమారుడు దూకి, పెద్ద సంకటస్థితిలో పడి నేల మీద నిలుచున్నాడు. ఆపన్నుడయిన ఆయనను చూసి కర్ణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు మున్నగువారు ఆ రాజును రక్షించటానికి ముందుకు వచ్చారు. పాండవులు అందరూ యుధిష్ఠిరుని చుట్టూ నిలిచి, ఆయనను అనుసరించారు. అప్పుడు యుద్ధం జరిగింది. ఆ మహాయుద్ధంలో అప్పుడు యుద్ధ వాద్యాలను మ్రోగించారు. కిలకిలారావాలు మార్మ్రోగాయి. పాంచాలురు కౌరవులతో తలపడినచోట పదాతులు పదాతులను, ఏనుగులు ఏనుగులను, రథాలు రథాలను, అశ్వాలు అశ్వాలను ఎదుర్కొన్నాయి. ఆ రణభూమిలో జరగబోయే ఊహాతీతమయి శస్త్రాస్త్రాలుగల ఉత్తమమయిన వివిధ ద్వంద్వ యుద్ధాలు చూడదగినట్లున్నాయి.

మహావేగులు, పరస్పరం చంపుకోగోరే ఆ శూరులు అందరూ యుద్ధంలో విచిత్రంగా, వేగంగా, చక్కగా యుద్ధం చేశారు. వీరయోధుల వ్రతాన్ని అనుష్ఠించినవారు యుద్ధంలో ఒకరినొకరు కొట్టసాగారు. వారు యుద్ధంలో ఏమాత్రం వెనకడుగు వేయలేదు.

రాజా! రెండు గడియల కాలం మాత్రం ఆ యుద్ధం చూడటానికి బాగుంది. తరువాత పిచ్చివాళ్ళ కొట్లాటలాగా అది హద్దులు దాటింది. ఏనుగు వద్దకు వచ్చి ఒక రథికుడు పదునయిన బాణాలతో చీల్చివేస్తూ, వంగిన ములుకులు గల బాణాలు వేసి, దాన్ని యముని సన్నిధికి పంపాడు. అప్పుడప్పుడు అక్కడక్కడ ఏనుగులు గుర్రాలను సమీపించి, పట్టుకొని వాటిని విసిరివేస్తూ, చాలా భయంకరంగా చీల్చివేశాయి. రౌతులు అనేకులు ఉత్తమగజాలను నాలుగువైపుల నుంచి చుట్టుముట్టి పరుగెత్తిస్తూ చప్పట్లుకొట్టారు. అందువల్ల విశాల శరీరాలు గల ఆ ఏనుగులు పరుగెత్తి పారిపోతుంటే ఆ రౌతులు వాటిని ప్రక్కలనుంచి, వెనుకనుంచి బాణాలువేసి, గాయపరిచారు. రాజా! మదమత్తములయిన ఏనుగులు చాలా గుర్రాలను పారద్రోలుతూ, దంతాలతో క్రుమ్మివేశాయి. మరికొన్ని ఏనుగులు వాటిని కాళ్ళతో త్రొక్కివేశాయి. అనేక గజాలు కోపంతో రౌతులతో సహా గుర్రాలను దంతాలతో చీల్చివేశాయి. మరికొన్ని బలిష్ఠాలయిన ఏనుగులు గుర్రాలను తొండాలతో పట్టుకొని, వేగంగా విసిరివేశాయి. కాలిబంటులు దెబ్బతీయటానికి అవకాశం దొరికినప్పుడు నాలుగువైపుల నుంచి కొట్టగా ఏనుగులు ఆర్తధ్వనులు చేస్తూ, నాలుగు దిక్కులకు పారిపోయాయి. మహాయుద్ధంలో త్వరగా పారిపోతున్న పదాతులు తమ ఆభరణాలను తీసి విసిరివేస్తూ, దూకుతుంటే మహాగజాలు ఆపదాతుల విచిత్రాభరణాలు తమను కొట్టడానికి వేస్తున్న ఆయుధా లనుకొని వాటిని తొండాలతో తీసుకొని దంతాలతో ముక్కలు చేశాయి. ఆ భూషణాలను ధ్వంసం చేయటంలో నిమగ్నమయిన ఏనుగులను, గజారోహులను బలాధికులు, మహావేగం గల పదాతులు చుట్టుముట్టి చంపారు. సుశిక్షితాలయిన ఏనుగులు పదాతులను తొండాలతో ఆకాశానికి ఎగురవేసి, క్రిందపడుతున్న వారిని దంతాల అగ్రభాగాలతో చీల్చివేశాయి.

ఏనుగులు మరికొన్ని కొందరు సైనికులను తొండాలతో పట్టుకొని, దంతాలతో పొడిచి చంపాయి. కొన్ని మహాగజాలు సేనమధ్యలోకిపోయి, యోధుల శరీరాలను నలిపివేసి గిరగిరా త్రిప్పి, విసిరివేశాయి. మరికొన్ని వింజామరలను వలె త్రిప్పిత్రిప్పి చంపాయి. ఏనుగులకు ముందు నడిచే పదాతులు ప్రతిపక్షంలోని ఏనుగుల శరీరాలను అక్కడక్కడ యుద్ధభూమిలో గాయపరిచారు. కొన్నిచోట్ల పదాతులు ప్రాసతోమరశక్త్యాయుధాలను శత్రుపక్షంలోని ఏనుగుల దంతాల మధ్య, కుంభస్థలాల మీద, పెదవుల మీద ప్రయోగించి, వాటిని లొంగదీశారు. ప్రక్కల నిలిచి ఉన్న మిక్కిలి భయంకరులయిన రథికులు, రౌతులు అనేక గజాలను నిలిపి, బాణాలతో చీల్చివేయగా అవి అక్కడే నేలగూలాయి. మహాయుద్ధంలో

కొంతమంది రౌతులు డాలు పట్టుకొని, ఉన్న పదాతిని తోమరంతో వేగంగా నేలమీద పడవేసి, దొర్లించారు. ఆ యుద్ధంలో అనేకమయిన ఏనుగులు వచ్చి, ఆవరణం గల రథాలను తొండాలతో పట్టుకొని విసిరివేశాయి. మహాబలం గల కొన్ని ఏనుగులు బాణాలతో కొట్టబడి వజ్రాయుధం దెబ్బతిన్న పర్వతశిఖరంలాగా నేలగూలాయి. యుద్ధంలో కొంతమంది యోధులు ప్రతిపక్ష యోధుల నెదుర్కొని పిడికిలి పోటులతో చంపారు. ఒకరిజుట్టు ఇంకొకరు పట్టుకొని లాగి, గాయపరచుకొన్నారు. ఒక యోధుడు ఇంకొక యోధుని తన భుజాలు పైకెత్తి, కొట్టి, నేలమీద పడవేసి, గుండెల మీద కాలు వేసి, త్రొక్కి పట్టి, గిలగిలలాడుతున్న ఆతని శిరస్సు ఖండించాడు. రాజా! క్రిందపడిపోతున్న ఒకని శిరస్సును ఇంకొకడు ఖండించాడు. జీవించి ఉన్న శత్రువు శరీరంలో ఇంకొకడు తన శస్త్రాన్ని దించాడు. భారతా! అక్కడ యోధులమధ్య మహా ముష్టియుద్ధం జరిగింది. అలాగే ఒకరిజుట్టు ఇంకొకరు పట్టుకొని చేసే యుద్ధం జరిగింది. భయంకరమయిన బాహుయుద్ధం జరిగింది. ఒక వీరునితో ఇంకొకడు యుద్ధమగ్నుడయి ఉండగా, వారికి తెలియకుండా ఇంకొకడు వచ్చి నానాశస్త్రాలు అనేక రీతులుగా ప్రయోగించి, యుద్ధంలో ప్రాణాలు తీశాడు. యోధులు యుద్ధమగ్నులై సంకుల సమరం సాగుతుండగా కొన్నివేల మొండెములు లేచి నిలిచాయి. రక్తాలతో తడిసిన శస్త్రాలు, కవచాలు, ముదురు ఎర్ర రంగువేసిన వస్త్రాలవలె ప్రకాశించాయి. ఈ విధంగా శస్త్రాస్త్ర సంకులమయిన దారుణ యుద్ధం పొంగిపొర్లుతున్న గంగానదివలె జగత్తును కోలాహలంతో నింపివేసింది. రాజా! బాణాల వల్ల అయిన గాయాలతో బాధపడుతున్న యోధులు తమవారు, ఇతరులు అని తెలుసుకోవటం లేదు. జయకాంక్షులయిన రాజులు యుద్ధం చెయ్యాలి అనే యుద్ధం చేస్తున్నారు. ఆ యుద్ధంలో దగ్గరకు వచ్చిన తమవారిని, శత్రువులను చంపారు. రెండు సేనలలోని వీరులు ఏ పద్ధతి లేని యుద్ధం చేశారు. విరిగిపోయిన రథాలతో, పడిపోయిన ఏనుగులతో, నేలగూలిన గుర్రాలతో, కూల్చివేసిన పదాతులతో యుద్ధభూమి ఒక్క క్షణకాలంలోనే అడుగుపెట్ట వీలులేనిది అయింది. రెండు గడియల కాలంలో యుద్ధభూమిలో రక్తప్రవాహాలు పారాయి. కర్ణుడు పాంచాలురను చంపగా అర్జునుడు త్రిగర్తులను సంహరించాడు. రాజా! భీమసేనుడు కౌరవ గజసేనను పూర్తిగా సంహరించాడు. విశాలమయిన కీర్తిని కోరుతున్న కౌరవ పాండవసేనలకు సూర్యుడు అపరాహ్ణకాలంలో ప్రవేశించేటప్పటికి మహానాశం సంభవించింది.'

29. యుధిష్ఠిరుడు దుర్యోధనుని ఓడించుట

ధృతరాష్ట్రుడు అన్నాడు - 'సంజయా! నీవు చెపుతుండగా అనేక దుఃఖ వార్తలను విన్నాను. పుత్రుల నాశాన్ని కూడా విన్నాను. నీవు చెప్పినట్లే యుద్ధం జరిగింది. సూతా! ఇక మీద కౌరవులు భూమిమీద లేనట్లే అని నా నిశ్చితాభిప్రాయం. దుర్యోధనుడు విరథుడు అయ్యాడు. ధర్మరాజు ఆతనితో ఎలా యుద్ధం చేశాడు? దుర్యోధనుడు ధర్మపుత్రునితో ఎలా వ్యవహరించాడు ? సంజయా! అపరాహ్ణసమయంలో శరీరం గగుర్పొడిచే యుద్ధం ఎలా జరిగింది ? జరిగింది జరిగినట్లు చెప్పు. చెప్పటంలో నీవు నేర్పరివి. సంజయుడు చెప్పాడు - 'నరేంద్రా! ఉభయసైన్యాలు విభిన్న ప్రదేశాల్లో విడిపోయి పెనగుతుండగా నీ పుత్రుడు విషంతో గూడిన సర్పంలాగా మహా కోపపూర్ణుడయి ఇంకొక రథాన్ని ఎక్కి, ఉన్నాడు.

కోపంతో కన్నులు అటూ ఇటూ త్రిప్పుతూ సర్వసైన్యాన్ని చూచాడు. శోభతో వెలుగుతూ సైన్యమధ్యంలో ఉన్న ధర్మపుత్రుని చూచాడు. యుద్ధభూమిలో ఆయన ఇంద్రుని లాగా వెలుగుతున్నాడు.

ధర్మరాజును చూచాడు. సూతునితో ఇలా అన్నాడు. 'త్వరగా పద, పద సారథీ ! కవచధారి అయి వెల్లగొడుగుతో వెలుగుతున్న యుధిష్ఠిరుడు ఉన్నచోటికి నా రథం నడుపు.' రాజు ఇలా ప్రేరేపింపగా సూతుడు ఉత్తమమయిన దుర్యోధనరథాన్ని యుధిష్ఠిరుని రథానికి ఎదురుగా తోలాడు. అప్పుడు యుధిష్ఠిరుడు మదించిన ఏనుగువలె క్రుద్ధు డయి 'దుర్యోధనుడున్న చోటికి రథం తోలు' అని సారథిని ఆజ్ఞాపించాడు. రథశ్రేష్ఠులు, సోదరులు అయిన వారిద్దరు వీరులు తలపడ్డారు. వారిద్దరు ఒకరిమీద ఒకరు యుద్ధంలో బాణవర్షం కురిపించారు. దుర్యోధన మహారాజు యుధిష్ఠిరుని ధనుస్సును పదునయిన బాణంతో ఖండించాడు. యుధిష్ఠిరుడు ఆ అవమానాన్ని సహించలేదు. విరిగిన ధనుస్సును వదలివేసి, ధర్మపుత్రుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, దుర్యోధనుని ధనుస్సును ధ్వజాన్ని ముక్కలు చేశాడు. అప్పుడు దుర్యోధనుడు ఇంకొకధనుస్సు తీసుకొని యుధిష్ఠిరుని గాయపరిచాడు. మిక్కిలి కుపితులు అయిన వారు ఒకరిమీద ఒకరు బాణవర్షం కురిపించారు. ఒకరినొకరు జయించాలనే కోరికతో రోషపూర్ణమయిన రెండు సింహాలవలె గర్జిస్తూ, రెండు ఆంబోతుల వలె రంకెవేస్తూ బాణాలతో కొట్టుకొన్నారు. వారిద్దరు అవకాశాన్ని అందిపుచ్చుకోవలెనని వెతుకుతూ సంచరించారు. సంపూర్ణంగా ధనుస్సు లాగి విడిచిన బాణాలతో గాయాలయిన వారిద్దరు పూచిన మోదుగు చెట్లలాగా విరాజిల్లారు.

రాజా! వారిద్దరు మాటిమాటికి సింహనాదాలు చేస్తూ, మహాయుద్ధంలో కరతల ధ్వనులను, ధనుష్టంకారాలను, శంఖధ్వనులను వ్యాపింపజేశారు. వారు ఒకరినొకరు తీవ్రంగా పీడించారు. యుధిష్ఠిరుడు క్రుద్ధుడయి వజ్రవేగం గల, మూడు బాణాలతో నీకుమారుని వక్షస్థలంలో నాటుకొనేటట్లు కొట్టాడు. రాజయిన నీ పుత్రుడు బంగరు ఈకలు గల్గి, రాతిమీద నూరిన, పదునయిన అయిదు బాణాలతో త్వరగా ఆయనను కొట్టాడు. దుర్యోధన మహారాజు పూర్తిగా శక్తి ఆయుధాన్ని యుధిష్ఠిరుని మీద ప్రయోగించాడు. తనమీదికి వచ్చిపడుతున్న దాన్ని ధర్మరాజు వెంటనే పదునయిన మూడు బాణాలతో ఛేదించి, ఆయనను అయిదు బాణాలతో గాయపరిచాడు. ఆ శక్తి పెద్ద ధ్వని చేస్తూ పడింది. అగ్ని జ్వాలవంటి అది క్రిందపడుతూ పెద్ద ఉల్కలాగా ప్రకాశించింది. నరనాథా ! శక్తి ధ్వంసం కావటం చూసి, నీ పుత్రుడు పదునయిన తొమ్మిది బాణాలతో యుధిష్ఠిరుని కొట్టాడు. ఆయన దుర్యోధనునుద్దేశించి త్వరగా ఒక బాణం తీసుకొన్నాడు. ఆ బాణాన్ని ధనుస్సు మధ్యలో సంధించి యుధిష్ఠిరుడు వదిలాడు. ఆ బాణం మహారథు డయిన నీ పుత్రుని గాయపరిచి, మూర్ఛిల్లచేసి, భూమిని ఛేదించింది. క్రుద్ధు డయిన దుర్యోధనుడు వేగంగా గదను ఎత్తి, కలహానికి అంతం కల్పింపదలచి ధర్మరాజు మీదికి వచ్చాడు. గదను ఎత్తిపట్టి దండధారి అయిన యమునిలాగా ఉన్న ఆయనను చూసి, ధర్మరాజు జ్వలిస్తున్న మహావేగం గల మహాశక్తిని నీ పుత్రునిమీద ప్రయోగించాడు. రథంమీద ఉన్న ఆయన కవచాన్ని ఛేదించి ఆశక్తి గుండెలో దిగబడింది. దానివల్ల మిక్కిలి ఉద్విగ్న హృదయుడయి మూర్ఛిల్లి పడిపోయాడు. భీముడు తన ప్రతిజ్ఞను స్మరించి 'రాజా! ఈతడు నీ చేత హతుడు కారాదు' అన్నాడు. యుధిష్ఠిరుడు వెనుదిరిగాడు. అప్పుడు కృతవర్మ త్వరగా వచ్చి, మోహసముద్రంలో మునిగిపోయిన నీ పుత్రు డయిన రాజును రక్షింప సన్నద్ధుడయ్యాడు. భీముడు కూడా బంగారు తొడుగు గల గదను తీసుకొని, యుద్ధంలో కృతవర్మ మీదికి వేగంగా దూకాడు. మహారాజా! యుద్ధంలో విజయం కోరిన నీవారికి శత్రువులతో అపరాహ్ణ సమయంలో ఇలా యుద్ధం జరిగింది.

30. సాత్యకి కర్ణుల యుద్ధము. పాండవ విజయము.

సంజయుడు చెప్పాడు - 'రాజా! మీవాళ్ళు కర్ణుని ముందుంచుకొని మళ్ళీ వచ్చి, దేవాసుర యుద్ధంలాంటి యుద్ధం చేశారు. ఏనుగులు, కాలిబంటులు, రథాలు, గుర్రాలు, శంఖాల ధ్వనులతో అత్యంతం హర్షోత్సాహ పూర్ణులయిన గజారోహకులు,

రథికులు, పదాతులు, ఆశ్వికుల సముదాయాలు క్రోధంతో తలపడుతు నానాశస్త్రాస్త్ర ప్రహారాలతో పరులను చంపసాగాయి. ఆ మహా యుద్ధంలో వీరపురుషులు పదునయిన పరశ్వధాలు, పట్టిశాలు, బాణాలతో ఏనుగులు, రథాలు, గుర్రాలను, వాహనాలతో గూడిన వీరులను సంహరించారు. యుద్ధభూమి మానవుల శిరస్సులతో నిండి అద్భుతంగా ఉంది. ఆ శిరస్సుల దంతాలు స్వచ్ఛంగా, తెల్లగా ఉన్నాయి. అవి కమలాలవలె, సూర్యునివలె, చంద్రునివలె తేజోవంతాలు. ముఖాలు కన్నులు, ముక్కులు చక్కగా ఉన్నాయి. ప్రకాశవంతమయిన కిరీటాలు, కుండలాలు వాటికున్నాయి. వందలకొలది, పరిఘలు, ముసలాలు, శక్తులు, తోమరాలు, నఖరాలు, భుశుండులు గదలతో, పడిపోయిన ఏనుగులు, పదాతులు, గుర్రాలు, వేలకొలది అక్కడ ఉన్నాయి. వాటినుండి రక్తనదీ ప్రవాహాలు ఏర్పడ్డాయి. శత్రువులు చంపిన సైన్యం ప్రజాక్షయంలో పెంపొందిన యముని రాజ్యంలాగా విరాజిల్లింది. ఆ సేనలో రథాలు, నరులు, అశ్వాలు, పడిపోయాయి. తీవ్రంగా గాయపడిన అవి చూట్టానికే భయంకరంగా ఉన్నాయి. అప్పుడు నీ సైనికులు, నీ పుత్రులు సాత్యకిని ఎదుర్కొన్నారు. సమధికరక్త ప్రవాహాలతో భయంకరమై, మహావీరులు, శ్రేష్ఠమయిన అశ్వాలు, రథాలు, ఏనుగులతో సంకులమై; ఉప్పు సముద్రంవలె తీవ్రమయిన ఘోషతో గూడిన సైన్యం దేవదానవ సేనలవలె విలసిల్లింది. కర్ణుడు శినివంశవీరు డయిన సాత్యకిని సూర్యకిరణ సమానకాంతి గల బాణాలు వేసి, గాయపరిచాడు. శినివంశశ్రేష్ఠుడు రథ, అశ్వసారథులతో గూడిన పురుషశ్రేష్ఠ డయిన కర్ణుని సర్పవిష సమప్రభావం గల బాణాలతో సాత్యకి కప్పివేశాడు. సాత్యకి బాణాలతో పీడింపబడిన కర్ణునికి అతిరథు లయిన నీ ఆప్తులు ఏనుగులు, పదాతులు, రథాలతో కూడా సహాయంగా వచ్చారు. ధృష్టద్యుమ్నాదు లయిన శత్రుపక్షవీరులు చాలా వేగంతో విజృంభించిరాగా మహాసముద్రం వంటి మనసైన్యం పరిగెత్తింది. అప్పుడు మహత్తరమయిన వీర రథ అశ్వగజ నాశం జరిగింది. శ్రీకృష్ణార్జునులు అపరాహ్ణకాల విధులను యథావిధిగా ఆచరించి, శాస్త్రోక్తంగా శంకరుని పూజించి, శత్రువధ చేయాలనినిశ్చయించుకొని, నీ సైన్యాన్ని ఎదుర్కొనవచ్చారు. అర్జునుని రథధ్వని మేఘగర్జన లాగా ఉంది. ఆయన రథంమీది ఉన్నతమయిన పతాక గాలికి రెపరెపలాడుతున్నది. ఆ రథానికి తెల్లగుర్రాలను కట్టారు. శత్రువులు నిరుత్సాహులయి ఆ రథం చూశారు.

అర్జునుడు రథంమీద గాండీవంతో నృత్యం చేస్తున్నట్లు ఆకాశాన్ని, దిక్కులను, విదిక్కులను బాణపూర్ణం చేశాడు. ఆయన ఆయుధాలు, ధ్వజాలతో గూడిన విమానాల వంటి రథాలను సారథులతో సహా బాణాలతో, గాలి మేఘాలను వలె ధ్వంసం చేశాడు.

ఆయన బాణాలతో శత్రువుల ఏనుగులను, మావటీలను; జెండాలతో, ఆయుధాలతో పతాకాలతో కూడిన రౌతులను, గుర్రాలను; పదాతులను యమలోకానికి పంపాడు. అర్జునుని దుర్యోధనుడు ఒక్కడే సూటిగా పోయేబాణాలతో కొడుతూ ఎదురువచ్చాడు. అర్జునుడు ఏడుబాణాలతో ఆయన ధనుస్సును, సూతుని అశ్వాలను, జెండాను నాశనంచేసి, ఒక బాణంతో గొడుగును ఛేదించాడు. ప్రాణహారకమయిన బాణాన్ని సంధించి, దుర్యోధనుని మీద ప్రయోగించాడు. అశ్వత్థామ దాన్ని ఏడుముక్కలుగా చేశాడు. పాండవుడు బాణాలతో అశ్వత్థామ ధనుస్సును ఖండించి, అశ్వాలను చంపి, కృపాచార్యుని ధనుస్సును ముక్కలు చేశాడు. కృతవర్మ ధనుస్సును, ధ్వజాన్ని ఛేదించి, గుర్రాలను చంపాడు. దుఃశాసనుని ధనుస్సు ముక్కలు చేసి, కర్ణుని ఎదుర్కొన్నాడు. అప్పుడు కర్ణుడు సాత్యకిని వదలి త్వరపడుతూ అర్జునుని మూడు బాణాలతో కొట్టి, ఇరువది బాణాలతో శ్రీకృష్ణార్జునులను మరల మరల గాయపరిచాడు. క్రుద్ధ డయిన ఇంద్రునివలె శత్రువులను గాయపరచి పీడిస్తూ, అనేక బాణాలు వేస్తున్న కర్ణునికి ఏమాత్రం అలసట కలుగలేదు. ఇంతలో సాత్యకివచ్చి కర్ణుని పదునయిన తొంబది తొమ్మిది బాణాలతో కొట్టి, మళ్ళీ వంద బాణాలు వేశాడు. ఆ తరువాత పాండవ వీరులు అందరూ కర్ణుని పీడించారు. యుధామన్యువు, శిఖండి, ఉపపాండవులు, ప్రభద్రకులు, ఉత్తమౌజుడు, యుయుత్సువు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు, చేదికరూష, మత్స్యకేకయసేనలు, బలవంతుడయిన చేకితానుడు, మంచి నియమాలు గల ధర్మరాజు – వీరందరు భయంకర పరాక్రమం గల చతురంగ బలాలతో కర్ణుని చుట్టుముట్టి, కర్ణవధను నిశ్చయించుకొని, చతురంగ బలాలతో వచ్చి, బాణాలతో ముంచెత్తారు. ఆ శస్త్రవర్షాన్ని కర్ణుడు పదునయిన బాణాలు వేసి, ఛేదించాడు. గాలి వేగంగా వీచి, చెట్టును విరిచి, ఎగరగొట్టినట్లు అస్త్రబలంతో ఎగరగొట్టాడు. రథికులను మావటీలతోడి ఏనుగులను, రౌతులతోడి గుర్రాలను, పదాతి సమూహాలను ధ్వంసం చేస్తూ కర్ణుడు కన్పించాడు. కర్ణుని అస్త్రతేజస్సుతో హతమవుతున్న పాండవసేన శస్త్రాలు, దేహాలు, ప్రాణాలు కోల్పోయింది. దాదాపుగా వెనుదిరిగింది. అప్పుడు అర్జునుడు నవ్వుతూ కర్ణాస్త్రాలను అస్త్రాలతో నాశనంచేసి, బాణ వర్షాలతో ఆకాశాన్ని భూమిని, దిక్కులను కప్పివేశాడు. ఆయన వేసిన బాణాలు కొన్ని ముసలాలవలె, పరిఘలవలె, ఇంకా కొన్ని శతఘ్నులవలె, మరికొన్ని పిడుగులవలె పడ్డాయి. ఆ బాణాలతో హతమవుతున్న పదాతులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు గల ఆ సైన్యం గట్టిగా కన్నులు మూసుకొని, గిరగిరా తిరుగుతూ, కేకలు వేయసాగింది.

అప్పుడు అశ్వాలు, నరులు, ఏనుగులు మరణం నిశ్చయమయిన యుద్ధం చూశాయి.. తీవ్రంగా బాణాలు తగులుతుండగా ఆర్తులు, భీతులయి పారిపోయారు. అప్పుడు సూర్యుడు అస్తమయ పర్వతాన్ని చేరి, అస్తమించాడు. చీకటివల్ల, ఎక్కువగా క్రమ్ముకొన్న దుమ్ము వల్ల మేము మంచి వస్తువును గాని, చెడుదాన్ని గాన్ని చూడలేకపోయాం. భరతవంశీయా! ఆ మహాధానుష్కులు రాత్రి యుద్ధం చేయ భయపడి, సర్వయోధులతో కూడా అప్పుడు యుద్ధ విరమణచేసి, శిబిరాలకు వెళ్ళారు. రాజా! అప్పుడు కౌరవులు వెనుదిరిగిపోగా, సూర్యాస్తమయం కాగా, పాండవసేనలు విజయాన్ని పొంది, ఆనందపూర్ణమనస్కులయి వివిధ యుద్ధవాద్య ధ్వనులతో, సింహనాదాలతో, కేకలతో శత్రువులను అపహాస్యం చేస్తూ శ్రీకృష్ణార్జునులను ప్రశంసిస్తూ, తమశిబిరాలకు వెళ్ళారు. పాండవవీరులు యుద్ధవిరమణ చేయగా సమస్త సైనికులు, రాజులు పాండవులకు ఆశీస్సులు ఇచ్చారు. యుద్ధవిరమణ కాగా సంతోషపూర్ణులయిన పాండవులు శిబిరాలకు వెళ్ళి, రాత్రంతా అక్కడ ఉన్నారు. ఆ తరువాత రుద్రుని క్రీడాస్థలమయిన శ్మశానం లాగా ఉన్న ఘోరమయిన యుద్ధభూమికి రాక్షసులు, పిశాచాలు, క్రూరమృగాలు గుంపులు గుంపులుగా చేరాయి.

31. పదునారవరోజు రాత్రి కౌరవ పక్షములో జరిగిన విశేషములు.

ధృతరాష్ట్రుడు అన్నాడు - 'అర్జునుడు మనవారిని అందరినీ ఇష్టం వచ్చినట్లు వధించాడని స్పష్టమయింది. యుద్ధభూమిలో ఆయుధం చేతబట్టిన అతని చేతిలోనుంచి ఎవరూ కూడా తప్పించుకోలేరు. అర్జునుడు ఒక్కడే సుభద్రాహరణం చేశాడు. ఒక్కడే ఖాండవవనదహనంతో అగ్నిని తృప్తుని చేశాడు. అతడు ఒక్కడే భూమిని అంతా జయించి, రాజులను కప్పం కట్టేవారిని చేశాడు. దివ్యమయిన ధనుస్సును చేపట్టి ఒక్కడే నివాతకవచులను సంహరించాడు. కిరాతరూపంలో ఉన్న శంకరునితో ఏకవీరుడయి యుద్ధం చేశాడు. భరతవంశీయులను ఒంటరిగానే రక్షించాడు. ఒంటరిగానే శివుని సంతోషపెట్టాడు. ఉగ్రతేజస్సుగల అతడు ఒక్కడే సమస్తరాజులను జయించాడు. సంజయా! వారు నిందులుగాక పోగా ప్రశంసింప దగినవారు. తరువాత వారు ఏమిచేశారో చెప్పు. యుద్ధవిరమణ తరువాత దుర్యోధనుడు ఏం చేశాడు ?'

సంజయుడు చెప్పాడు - 'రాజా! కౌరవులు శత్రువుల బాణాలదెబ్బలకు గాయపడ్డారు. వారి అవయవాలు ఛిన్నమయ్యాయి. వారికవచాలు నాశనమయ్యాయి.

వాహనాలు ధ్వంసమయ్యాయి. శత్రువుల చేతిలో ఓడిన అభిమానవంతులయిన వారు దీనమయిన కంఠస్వరంతో మనసులోనే బాధపడ్డారు. విషంపోయి కోరలు తీసిన పాదాలతో త్రొక్కిన పాములలాగా కౌరవులు శిబిరంలో ఉండి మళ్ళీ ఆలోచించసాగారు. అప్పుడు కర్ణుడు కోపపరవశుడయి సర్పంలాగా బుసకొడుతూ, చేతితో చేతిని పిసుకుతూ, నీపుత్రుని చూసి కౌరవులతో ఇలా అన్నాడు. 'సర్వసంసిద్ధుడు, దృఢమయినవాడు, సమర్థుడు, ధీరుడు అయిన అర్జునుడు అప్పుడు నిబ్బరంగా ఉన్నాడు. సమయానికి తగ్గట్టు శ్రీకృష్ణుడు అతనికి కర్తవ్యం చెపుతున్నాడు. త్వరగా బాణాలు వేసి అతడు ఇవ్వాళ మనలను వంచించాడు. రాజా! రేపు అతని సంకల్పాన్ని అంతను నేను నాశనం చేస్తాను.' అని అనగా దుర్యోధనుడు సరే అని సమస్తరాజులు వెళ్ళటానికి అనుమతించాడు. ఆయన అనుజ్ఞ పొంది ఆ రాజులందరూ తమ తమ శిబిరాలకు వెళ్ళారు. కౌరవులు ఆ రాత్రి సుఖంగా నిద్రించి, మరునాడు సంతోషంతో యుద్ధానికి బయలుదేరారు. కురువంశ శ్రేష్ఠుడయిన ధర్మరాజు బృహస్పతి, శుక్రుల మతానుసారం ప్రయత్నపూర్వకంగా దుర్జయమయిన వ్యూహం పన్నటం వారు చూచారు. అప్పుడు దుర్యోధనుడు ప్రతీకారం చేయటంలో సమర్థుడయిన కర్ణుని స్మరించాడు. యుద్ధంలో ఇంద్రసమానుడు, బలంలో మరుద్గణ తుల్యుడు, పరాక్రమంలో కార్తవీర్యసమానుడు అయిన కర్ణుని మీదికి దుర్యోధనుని మనస్సు పోయింది. అత్యంత సంకట స్థితిలో మనస్సు బంధువు మీదికి పోయినట్లు గొప్ప విలుకాడయిన కర్ణుని మీదికి సర్వసైన్యాల మనస్సు పోయింది. ధృతరాష్ట్రుడు అడిగాడు - 'సూతా! తరువాత దుర్యోధనుడు ఏం చేశాడు ? మూర్ఖులారా? మీ మనస్సు కర్ణుని మీదికి పోవటానికి కారణం ఏమిటి ? చలితో బాధపడేవారు సూర్యుని కోసం ఎదురు చూచినట్లు కర్ణునికోసం ఎదురు చూశారా? సంజయా! యుద్ధవిరమణ జరిగిన తరువాత మళ్ళీ యుద్ధం ప్రారంభంకాగా కర్ణుడు అక్కడ ఏరీతిగా యుద్ధం చేశాడు ? పాండవులందరూ కర్ణునితో ఎలా యుద్ధం చేశారు ? కర్ణుడు ఒక్కడే సృంజయులతో సహా పాండవులను చంపగలడు గదా! యుద్ధంలో కర్ణుని భుజబలం ఇంద్రవిష్ణువుల భుజబలంతో సమానం. మనస్వి అయిన అతని శస్త్రాలు భయంకరమయినవి. యుద్ధంలో దుర్యోధనుడు కర్ణుని ఆశ్రయించే మత్తుడయి ఉంటాడు. యుధిష్ఠిరుని చేతిలో తీవ్రంగా పీడితుడయిన దుర్యోధనుని చూసి, పరాక్రమించిన పాండవులను చూసి, మహారథు డయిన కర్ణుడు ఏంచేశాడు ? మూర్ఖ డయిన దుర్యోధనుడు యుద్ధంలో కర్ణుని ఆశ్రయించి, పుత్రులతో, శ్రీకృష్ణునితో గూడిన పాండవులను జయించాలని

ఉత్సాహపడుతుంటాడు. వేగశాలి, వీరుడయిన కర్ణుడు కూడా పాండవులను యుద్ధంలో అతిక్రమించలేకపోయాడు. ఆహా! ఇది ఎంత దుఃఖకరం! దైవం నిజంగా అన్నింటికి ఆశ్రయం అవుతుంది. ఆహా! సంజయా ! ఆనాటి ద్యూతక్రీడయొక్క ఘోరపరిణామం ఈనాడు ఇలా వ్యక్తం అయింది. దుర్యోధనుడు కలిగించిన మనస్సుకు ముల్లువంటి అనేక తీవ్రదుఃఖాలను సహించాను. నాయనా! దుర్యోధనుడు ఆ కాలంలో శకునిని గొప్పనీతి వేత్త అనుకొనేవాడు. కర్ణుడు గూడా నిత్యమూ వేగవంతుడయిన వీరుడు అనుకొని అతనిని అనుసరించేవాడు. సంజయా! ఈవిధంగా మహాయుద్ధాలు జరుగుతుండగా నిత్యము నా పుత్రులు హతులయినారని, ఓడిపోయారని వింటున్నాను. పాండవులను యుద్ధంలో అడ్డుకొనే వాడు మనవాళ్ళలో ఒక్కడు కూడా లేడా? అబలల మధ్యలోకి నిర్భయంగా చొరబడినట్లు పాండవులు దూసుకొని పోతున్నారు. నిజంగా ఇందులో దైవమే బలవత్తరం గదా !'

సంజయుడు చెప్పాడు - 'రాజా! పూర్వం నీవు జూదం మొదలయినవి ధర్మమే అని భావించి సమ్మతించిన వాటిని గుర్తు తెచ్చుకో. మానవుడు అయిపోయిన దానిని గురించి తరువాత చింతిస్తాడు. ఆ పని సిద్ధించదు. చింతతో తాను నశిస్తాడు. పాండవుల రాజ్యం అపహరించటం అనే పనిలో సాపత్యం కలుగదని తెలిసికూడా ఇది ఉచితమా? అనుచితమా? అని అప్పుడు ఆలోచించలేదు. 'రాజా! మన మధ్య యుద్ధం వద్దు' అని పాండవులు చాలాసార్లు అనేక విధాలుగా చెప్పారు. నరనాథా ! పుత్రమోహం వల్ల ఆ మాట పెడచెవిన పెట్టావు. నీవు పాండవుల విషయంలో ఘోరమయిన పాపాలు చేశావు. నీ కారణంగానే ఘోరమయిన నరసంహారం జరుగుతోంది. అదంతా గత విషయం. అందుకు దుఃఖించకు. జరిగిన యుద్ధవృత్తాంతం చెపుతాను. విను.

తెల్లవారిన తరువాత కర్ణుడు రాజు దగ్గరికి వచ్చి దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'రాజా! అర్జునునితో ఈ రోజు యుద్ధం చేస్తాను. ఆ వీరుని సంహరిస్తాను. లేక ఆతడయినా నన్ను సంహరిస్తాడు. నాకు, అర్జునునికి అనేకమయిన పనులు రావటం వల్ల మాయిద్దరికి ద్వంద్వయుద్ధం జరుగలేదు. నాబుద్ధిని అనుసరించి చెప్పే నామాట విను. యుద్ధంలో అర్జునుని చంపకుండా తిరిగి రాను. మనపక్షంలోని మహావీరులు హతులయ్యారు. యుద్ధంలో నేను నిలువగా ఇంద్రుడిచ్చిన శక్తి ఆయుధం నశించిన నామీదికి అర్జునుడు యుద్ధానికి వస్తాడు. రాజా! ఇప్పుడు హితకరమయిన విషయం చెపుతాను. విను. నాకు, అర్జునునికి సమబలమయిన దివ్యాస్త్రాలున్నాయి. వీనుగులాంటి

పెద్దశరీరాలను ఛేదించటంలో, వేగంగా అస్త్రప్రయోగంలో, దూరలక్ష్యాన్ని ఛేదించటంలో, చక్కగా యుద్ధం చేయటంలో, దివ్యాస్త్రప్రయోగంలో అర్జునుడు నాకు సాటికాడు. భారతా! శరీరబలంలో, శౌర్యంలో, అస్త్రవిజ్ఞానంలో, శత్రువులను జయించే ఉపాయాలను తెలియటంలో అర్జునుడు నాతో సమానం కాడు. విజయం అనేది నా ధనుస్సు పేరు. ఇది సర్వాయుధాలలో శ్రేష్ఠమయినది. ఇంద్రుని ప్రియంకోరి విశ్వకర్మ దీన్ని నిర్మించాడు. దానితో ఇంద్రుడు రాక్షసగణాన్ని జయించాడు. దీని ధ్వనివిన్న రాక్షసులు పదిదిక్కులలో ఏదిక్కు ఎటుందో తెలియనంతగా మోహితులయ్యారు. మహోత్తమమయిన దీన్ని ఇంద్రుడు పరశురామునికి ఇచ్చాడు. పరశురాముడు నాకు ఇచ్చాడు. యుద్ధంలో ఎదురుపడ్డ రాక్షసులందరిని ఇంద్రుడు దానితో జయించినట్లు విజేతలలో శ్రేష్ఠుడయిన అర్జునునితో నేను విజయం అనే ఈ ధనుస్సుతో యుద్ధం చేస్తాను. ఈ ధనుస్సుతోనే పరశురాముడు ఇరువది యొక్క మారులు సమస్త భూమండలాన్ని జయించాడు. పరశురాముడు ఇచ్చిన ఘోరమయిన ఈ ధనుస్సు గాండివాని కంటే గొప్పది. పరశురాముడు దీని దివ్యకార్యాలను స్వయంగా చెప్పాడు. దీనితో అర్జునునితో యుద్ధం చేస్తాను. దుర్యోధనా ! జయశీలురలో శ్రేష్ఠుడయిన అర్జునుని సంహరించి, బంధువులతో కూడా నిన్ను సంతోషపెడతాను. పార్థివా ! శత్రువీరులు హతులుకాగా పర్వతాలు, వనాలు, ద్వీపాలు, సముద్రాలతో గూడిన సమస్తభూమండలమూ ఇవ్వాళ నీపుత్రపౌత్రుల పరంపరలో స్థిరపడుతుంది. చక్కగా ధర్మానురక్తుడయిన ఆత్మవంతునికి సిద్ధివలె, ఇవ్వాళ నీకు మేలు చేయగోరిన నాకు అశక్యమయినది ఏదీ లేదు. అగ్నిని చెట్టు తట్టుకోలేనట్లే యుద్ధంలో అర్జునుడు నావేగాన్ని తట్టుకోలేడు.

అర్జునుని కంటే నేను ఏవిషయంలో తక్కువ వాడినో ఇప్పుడు నీకు తప్పక చెప్పాలి. అతని ధనుస్సునారి దివ్యమయినది, అలాగే అమ్ములపొదులు అక్షయాలు. అతని రథసారథి శ్రీకృష్ణుడు. నాకు అటువంటివాడు లేడు. యుద్ధంలో అపజయం లేనిది, శ్రేష్ఠమయినది, దివ్యము అయినది అతని ధనుస్సు గాండీవం ఉన్నది. మహత్తరం, దివ్యం, ఉత్తమం అయిన విజయమనేది నా ధనుస్సు. రాజా! ఆ ధనుస్సుతో నేను పార్థునికంటే అధికుడను. ఇంక దేనివల్ల వీరుడయిన అర్జునుడు అధికుడో చెపుతాను. విను. సర్వలోకాలు నమస్కరించే శ్రీకృష్ణుడు అతని రథసారథి. బంగారు సొమ్ములు గల అతని దివ్యరథం అగ్నిదేవుడు ఇచ్చినది. వీరా! అది బాణాదులతో ఛేదింప వీలుగానిది. అతని రథాశ్వాలు మనస్సు అంత వేగవంతాలు. ధ్వజంగూడా దివ్యమయినది. జెండామీద

ఉండే వానరుడు ఆశ్చర్యకరుడు. జగత్తుకు సృష్టికర్త అయిన శ్రీకృష్ణుడు అతని రథాన్ని రక్షిస్తున్నాడు. ఈ వస్తుసామగ్రితో అతని కన్నా తక్కువ అయినా నేను అర్జునునితో యుద్ధం చేస్తాను. యుద్ధానికి శోభను గూర్చే ఈ శల్యుడు శ్రీకృష్ణునితో సమానుడు. ఈయన నాకు సారథ్యం చేస్తే నీకు విజయం నిశ్చయం. యుద్ధంలో శత్రువులు తేలికగా జయించలేని శల్యుడు నాకు సారథి కావాలి. గ్రద్ద ఈకలు కట్టిన బాణసముదాయం బండ్లమీద నావద్దకు వస్తుండాలి. రాజేంద్రా ! ఉత్తమమయిన గుర్రాలు పూన్చిన శ్రేష్ఠరథాలు నిరంతరం నా వెనక వస్తుండాలి. ఈరీతిగా అన్నీ ఉంటే నేను అర్జునుని కంటే ఉత్తమగుణాలతో అధికుడి నవుతాను. శ్రీకృష్ణుని కన్నా శల్యుడు అధికుడు. అర్జునుని కంటే నేను అధికుడిని. శ్రీకృష్ణుడు అశ్వాలమనస్సులు ఎరిగినంతగా శల్యుడు హయవిద్యనెరిగినవాడు. శల్యునితో బాహుబలంతో సమానుడు లేడు. అలాగే అస్త్రవిద్యలో నాతో సమానుడయిన వీలుకాడు లేడు. అలాగే అశ్వహృదయం తెలియటంలో శల్యునితో సమానుడు ఎవ్వడూ లేడు. ఆయన సారథి అయితే శ్రీకృష్ణసారథ్యం గల అర్జునరథంకంటే నా రథం చాలా గొప్పది అవుతుంది. ఈ వ్యవస్థ అంతా జరిగితే రథం మీద నుండే నేను అర్జునునికంటే చాలారెట్లు అధికుడిని అవుతాను. కురుసత్తమా! యుద్ధంలో అర్జునుని జయిస్తాను. అలా అయితే ఇంద్రసహితులయిన దేవతలు కూడా నన్ను ఎదిరించలేరు. మహారాజా! ఇదంతా నీవు చేయాలని కోరుతున్నాను. నా ఈ కోరిక తీర్చవలసింది. ఇంకమీరు సమయం వృధా చేయవద్దు. ఇలా చేస్తే నా ఇచ్ఛానుసారం సహాయం చేసినట్లు అవుతుంది. భారతా! అప్పుడు యుద్ధంలో నేను ఏంచేస్తానో చూస్తావు. నాతో తలపడే పాండవులను యుద్ధంలో తప్పక జయిస్తాను. రాజా! దేవదానవులు కూడా యుద్ధంలో నాతో తలపడలే రనగా మానవజాతీయులయిన పాండవులు నాఎదుట నిలువలేరని వేరే చెప్పాలా ?' సంజయుడు చెప్పాడు - 'రాజా! కర్ణుడు ఇలా అనగా నీ పుత్రుడు పరమానందపడి, ఆయన మాటలను ఆదరించి, కర్ణునితో ఇలా అన్నాడు. 'కర్ణా! నీవు అన్నట్లు అన్నీ సమకూరుస్తాను. అమ్ములపొదులునిండిన, గుర్రాలు పూన్చిన రథాలు యుద్ధభూమిలో నీవెంట వస్తాయి. గ్రద్దఈకలు కట్టిన బాణాలు నిండిన బండ్లు నీ వెంట వస్తాయి. కర్ణా! మేము తక్కిన రాజులందరూ నిన్ను అనుసరించి వస్తాం.' సంజయుడు చెప్పాడు - 'మహారాజా! ప్రతాపవంతుడయిన నీ కుమారుడు ఇలా చెప్పి మద్రదేశాధిపతి అయిన శల్యుని సమీపించి, ఇలా అన్నాడు.'

32. దుర్యోధనుడు సారథ్యము చేయ శల్యుని అర్థించుట.

సంజయుడు చెప్పాడు - 'మహారాజా! నీ కుమారుడు శల్యుని వద్దకు వినయంతో వెళ్ళి, ప్రేమపూర్వకంగా ఇలా అన్నాడు. ఆడినమాట తప్పనివాడా! మహాభాగా! శత్రువులకు సంతాపం పెంపొందించేవాడా! మద్రరాజా! కర్ణుడు చెప్పినది విన్నావుగదా. రాజశ్రేష్ఠులమధ్యలో అతడు అడిగినదే నేను స్వయంగా అడుగుతున్నాను. కర్ణునిసారథ్యం చేయుమనే తలవంచి వినయంతో నిన్ను నేను యాచిస్తున్నాను. కాబట్టి పాండవ వినాశనానికి, నాకు మేలు కలగటానికి నామీద ఉండే ప్రేమతో సారథ్యం చేయవలసింది. నీవు సారథివి అయితే కర్ణుడు నా శత్రువులను జయించగలడు. మహాభాగా! శ్రీకృష్ణ సమానుడి వయిన నీవు తప్ప కర్ణుని రథాశ్వాల పగ్గాలు పట్టగలవాడు ఇంకొకడు లేడు. మద్రేశ్వరా! బ్రహ్మ సారథి అయి మహేశ్వరుని రక్షించినట్లు శ్రీకృష్ణుడు అన్ని ఆత్సమయాలలో అర్జునుని కాపాడినట్లు నీవు కర్ణుని రక్షించు. కౌరవపక్షానికి భీష్ముడు, ద్రోణుడు, కృతవర్మ, శకుని, అశ్వత్థామ నేను అనే తొమ్మిదిమందిమి బలం. రాజా! ఈ రీతిగా నాసేనలో ఈ తొమ్మిది భాగాలు చేశారు. మహాత్ములయిన భీష్మద్రోణుల భాగాలు ఇప్పుడు లేవు. వారికి నిర్ణయించిన భాగాలకంటే అధికంగా నా శత్రువులను వారు నాశనం చేశారు. వృద్ధ లయిన ఆ మహాధనుష్కులను యుద్ధంలో మోసం చేసి, వధించారు. వారు దుష్కరమయిన మహత్కార్యం చేసి, ఇక్కడినుండి స్వర్గానికి వెళ్ళారు. అలాగే ఇంకా ఇతర వీరశ్రేష్ఠులు యుద్ధంలో హతులయ్యారు. మనపక్షంలో చాలామంది యథాశక్తిగా సమృద్ధిగా తమ కర్తవ్యాన్ని చక్కగా నెరవేర్చి, యుద్ధంలో ప్రాణాలు వదలి వీరస్వర్గం చేరారు. నరనాథా ! ఆ సైన్యంలో చాలా భాగం హతమయింది. పూర్వం సంపూర్ణంగా ఉన్న నా సైన్యాన్ని స్వల్పసంఖ్యగల పాండవులు హతం చేశారు. ఇంక ఇప్పుడు చెప్పవలసింది ఏముంది ? పాండవులు మిగిలి ఉన్న నాసేనను చంపకుండా ఉండేటట్లు నీకర్తవ్యం నిర్వహించు. పాండవులు యుద్ధంలో చంపగా మిగిలినది; వీరులుగల ఈ నాసేన. మాకు ఇష్టమయినది చేయ ఆసక్తి గలవాడు కర్ణుడొకడు మాత్రమే.

పురుషశ్రేష్ఠ ! విశ్వంలో ప్రసిద్ధమహారథుడి వయిన నీవు మామేలు గోరేవారిలో రెండవవాడివి. శల్యా! కర్ణుడు నేడు యుద్ధంలో అర్జునునితో తలపడగోరుతున్నాడు. నాకు ఆయన మీదనే జయాశ ఎక్కువగా ఉంది. ఆయన రథాశ్వాల పగ్గాలు పట్టగలవాడు ఇంకొకడు భూమండలంలోనే లేడు. యుద్ధభూమిలో అర్జునుని రథాశ్వాల పగ్గాలు పట్టటంలో కృష్ణుడు శ్రేష్ఠుడయినట్లు నీవు కూడా కర్ణుని రథాశ్వాల పగ్గాలు పట్టవలసింది. రాజా! ఆ శ్రీకృష్ణునితోగూడిన అర్జునుడు ఆయన చేత రక్షింపబడుతూ చేసే మహత్కార్యాలు

మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం గదా! పూర్వం ఏ యుద్ధంలో కూడా అర్జునుడు ఈ రీతిగా శత్రువులను వధించలేదు. ఇప్పుడు శ్రీకృష్ణుడు తోడు ఉండటంవల్లనే అధికంగా పరాక్రమిస్తున్నాడు. కృష్ణునితో సహితుడయిన అర్జునుడు కౌరవుల మహాసైన్యాన్ని యుద్ధభూమిలో ప్రతిరోజూ పారద్రోలుతూ కన్పిస్తున్నాడు. రాజా! ఇప్పుడు కర్ణుని భాగం, నీ భాగం మిగిలి ఉన్నాయి. కాబట్టి ఇవ్వాళ కర్ణునితో గూడా ఆ భాగాన్ని ఒక్కసారిగానే నాశనం చేయి. అరుణునితో గూడి సూర్యుడు చీకటిని పోగొట్టినట్లు కర్ణునితో గూడి అర్జునుని మహాయుద్ధంలో జయించు. ప్రాతఃకాలంలో ఉదయించే సూర్యులవలె తేజోవంతులయిన కర్ణశల్యులను ఉదయిస్తున్న ఇద్దరు సూర్యులను వలె యుద్ధభూమిలో చూసి, మహారథులయిన శత్రువులు పారిపోవుదుగాక. మాన్యా! సూర్యారుణులను చూసి, చీకటి నశించినట్లు పాంచాలురు, స్పంజయులతో గూడా పాండవులు నశింతురుగాక ! రథికులలో శ్రేష్ఠుడు కర్ణుడు. సారథులలో శ్రేష్ఠుడివి నీవు. మీ ఇద్దరికలయిక వంటి కలయిక లోకంలో పూర్వం కాలేదు. ఇకముందు కాబోదు. సమస్తపరిస్థితులలో శ్రీకృష్ణుడు అర్జునుని రక్షించినట్లే నీవు గూడ యుద్ధంలో కర్ణుని రక్షించవలసింది.

యుద్ధభూమిలో యుద్ధం చేసే ఆయనకు సారథ్యం చేయి.

నీవు సారథివయితే ఈయనను ఇంద్ర సహితులయిన దేవతలు కూడా తేరిపార జూడలేరనగా ఇక పాండవులు ఎదిరించలేరని చెప్పవలెనా? నామాటలను శంకించకు.'

సంజయుడు చెప్పాడు – 'దుర్యోధనుని మాటలు విన్న శల్యుడు కోపపూర్ణుడయి ఆయన కనుబొమలను మూడుభాగాలను కలిపి, ముడివేసి, మాటిమాటికి చేతులు విదిలిస్తున్నాడు. శల్యుడు కోపంతో ఎర్రబడిన విశాలనేత్రాలను ఇటూ, అటూ కదిలిస్తూ కులం, ఐశ్వర్యం, విద్యలతో మత్తుడయి ఇలా అన్నాడు. 'గాంధారీ కుమారా! నన్ను అవమానిస్తున్నావు. నిశ్చయంగా అందువల్లనే నిర్భయంగా నన్ను సారథ్యం చెయ్యమని అడుగుతున్నావు. మనకంటే కర్ణుడు గొప్పవాడని ప్రశంసిస్తున్నావు. యుద్ధంలో కర్ణుడు నాతో సమానుడని నేను లెక్కించను. రాజా! నాభాగంగా ఎక్కువనే కేటాయించు. ఆ మహాసేనను యుద్ధంలో జయించి, వచ్చిన త్రోవనే వెళ్తాను. కురునందనా! అలా కాకపోతే నేను ఒక్కడినే యుద్ధం చేస్తాను. యుద్ధంలో శత్రువులను దగ్ధం చేసే నా పరాక్రమం ఇవ్వాళ చూడు. కురువీరా! నావంటివాడు మనస్సులో ఏదో ఒకకోరిక పెట్టుకొని యుద్ధంలో ప్రవృత్తుడు కాడు. కాబట్టి నన్ను సందేహించకు. దుర్యోధనా! యుద్ధంలో నన్ను అవమానించకు. లావయి వజ్రంలాగా కఠినమయి సుదృఢమయిన ఈనా బాహువులను చూడు. విచిత్రమయిన నాధనుస్సును, సర్పాలవంటి నా ఈ బాణాలను చూడు. వాయువేగంగల ఉత్తమమయిన

గుర్రాలు పూన్చిన నా రథాన్ని చూడు. గాంధారీపుత్రా! బంగారుతొడుగుతో అలంకృతమయిన నా ఈ గదను చూడు. రాజా! నా పరాక్రమంతో, తేజస్సుతో సమస్తభూమండలాన్ని చీల్చి వేస్తాను. కొండలను ముక్కలుచేసి విసిరివేస్తాను. సముద్రాలను ఎండగడతాను. రాజా! ఇలాగా పరాక్రమసంపన్నుడను, శత్రుసంహారంలో సమర్థుడ నయిన నన్ను యుద్ధంలో నీచుడయిన సూతపుత్రునికి సారథ్యం చేయమని ఎందుకు నియోగిస్తావు ? రాజేంద్రా! నన్ను నీచకార్యంలో నియోగించటం నీకు తగదు. శ్రేష్ఠుడినయిన నేను మిక్కిలి నీచుడు, పాపాత్ముడయిన వాని దాస్యం చేయలేను. ప్రేమతో తన దగ్గరికి వచ్చి తన ఆజ్ఞాపాలకుడయిన శ్రేష్ఠపురుషుని చాలానీచుడ యిన వ్యక్తికి అధీనం చేసేవానికి గొప్పవాడిని తక్కువవాడిగాను, తక్కువవాడిని, గొప్పవాడిగాను చేసిన పాపం కలుగుతుంది.

బ్రహ్మదేవుడు బ్రాహ్మణులను ముఖాన్నుంచి, క్షత్రియులను బాహువులనుంచి, వైశ్యులను ఊరువులనుంచి, శూద్రులను పాదాలనుంచి సృజించాడని వేదం చెపుతున్నది. భారతా! వీరినుండియే అనులోమవిలోమ క్రమంలో విభిన్నవర్ణాల ఉత్పత్తి జరిగింది. నాలుగువర్ణాలు పరస్పరం కలియటంవల్ల అన్యజాతులు ఆవిర్భవించాయి. వీరిలో క్షత్రియులు అందరికి రక్షకులు, అందరినుంచి పన్ను తీసుకొనేవారు, దాతలు అని చెప్పారు. బ్రాహ్మణులు యజ్ఞాలు చేయటం, వేదాధ్యాపనం, పవిత్రమయిన దానాలు తీసుకోవటం వాటితో జీవితం గడుపుతూ సర్వజగత్తును అనుగ్రహించటం కోసం ఈ భూమిమీద బ్రహ్మదేవుడు నిలిపాడు. కృషి, వ్యవసాయం, పశుపోషణ, ధర్మానుసారం దానం చేయటం, వైశ్యుల కర్తవ్యం. శూద్రులు బ్రాహ్మణక్షత్రియ వైశ్యులకు సేవచేయటానికి నియుక్తులయ్యారు. బ్రాహ్మణక్షత్రియులకు సూతులు పరిచారకులుగా నియుక్తులయ్యారు. క్షత్రియుడు సూతునికి సేవకుడు అని ఎక్కడా ఎప్పుడూ ఎవ్వరూ చెప్పినట్లు వినలేదు. నేను రాజర్షికులంలో జన్మించిన మూర్ధాభిషిక్తుడనయిన రాజును. లోకప్రసిద్ధమహారథుడను. సూతులకు సేవించదగినవాడిని, వందులకు సుత్తించదగినవాడిని. శత్రుసేనలను నాశనం చేసే నేను ఇంతటి వాడినై ఉండి యుద్ధంలో సూతపుత్రునికి సారథ్యం చేయటానికి ఉత్సహింపను. ఇంతటి అవమానాన్ని పొంది, ఇంక నేను ఏమాత్రమూ యుద్ధం చేయను. గాంధారీపుత్రా! ఇక నాకు సెలవియ్యి. నా నివాసానికి వెళ్తాను.'

సంజయుడు చెప్పాడు – 'మహారాజా! యుద్ధానికి అలంకారమయిన శల్యుడు ఇలా పలికి, కోపంతో రాజుల మధ్య నుండి లేచి, వేగంగా వెళ్ళాడు. నీకుమారుడు, ప్రేమతో, గౌరవంతో ఆయనను పట్టుకొని, నిలిపి, సామోపాయంతో సర్వప్రయోజన సాధకమయిన మధురవాక్యాన్ని పలికాడు. 'మహారాజా! శల్యా! నీవిషయంలో నీవు చెప్పింది

అంతా యథార్థమే. సందేహం లేదు. నాకున్న అభిప్రాయాన్ని చెపుతాను. జాగ్రత్తగా సావధానంగా విను. రాజా! కర్ణుడు నీకంటే గొప్పవాడు కాదు. నిన్ను సందేహించటం లేదు. మద్రాధిపతి అయిన శల్యమహారాజు ఆడినమాట తప్పే పని ఏదీ చేయడు. పురుషశ్రేష్ఠ లయిన మీపూర్వులు అందరూ సత్యాన్నే పలుకుతుండేవారు. కాబట్టే నిన్ను **ఆర్తాయని** అంటారు అని నా ఉద్దేశ్యం. మానదా! నీవు యుద్ధంలో శత్రువులకు శల్యం (ముల్లు) లాంటివాడివి. కాబట్టి నిన్ను భూమండలంలో శల్యుడు అంటారు. యజ్ఞాలలో సమృద్ధిగా దక్షిణలు ఇచ్చేవాడా! ధర్మజ్ఞా! రాజా! నీవు వెనక చెప్పినదే చెయ్యి. నేను చెప్పినట్లుగా నాకోసం చేయవలసింది. కర్ణుడుగాని, నేను గాని నీకంటే బలవంతులం కాము. ఇక్కడ యుద్ధంలో ఉత్తమమయిన అశ్వాల నియామకుడివి కమ్మని నిన్ను వరం కోరుతున్నాను. శల్యా! అర్జునుని కంటే కర్ణుడు అధికంగా గుణవంతుడని అనుకొంటాను. ఈ లోకం అంతా నిన్ను శ్రీకృష్ణుని కంటే గొప్పవాడని అనుకొంటున్నది. నరశ్రేష్ఠా! కర్ణుడు అర్జునునికంటే అస్త్రాలతోనే అధికుడు. నీవు అశ్వజ్ఞానంలో, బలంలో శ్రీకృష్ణునికంటే చాలాగొప్పవాడివి. మహామనస్వి అయిన శ్రీకృష్ణుడు అశ్వహృదయాన్ని ఎరిగినదానికంటే మద్రరాజపుత్రుడి వయిన నీవు రెండు రెట్లు ఎక్కువగా తెలిసినవాడివి.' శల్యుడు అన్నాడు - 'గాంధారీపుత్రా! ఈమహాసైన్యమధ్యంలో నన్ను శ్రీకృష్ణునికంటే శ్రేష్ఠుడ వని చెపుతున్నావు. అందువల్ల నాకు నీమీద ప్రీతి కలుగుతున్నది. వీరా! నీవు అనుకొన్నట్లే పాండవశ్రేష్ఠు డయిన అర్జునునితో యుద్ధం చేసే కర్ణునికి సారథ్యం చేస్తాను. కాని వీరా! కర్ణునికి ఒక షరతు పెడుతున్నాను. నేను ఇతని ఎదుట నా ఇష్టానుసారం మాట్లాడుతాను.' సంజయుడు చెప్పాడు - 'రాజా! నీ పుత్రుడు 'అలాగే' అని కర్ణునికి శల్యుని ఉద్దేశ్యం చెప్పాడు.

33. త్రిపురాసురవృత్తాంతము

దుర్యోధనుడు చెప్పాడు - మద్రాధిపా ! మళ్ళీ నేను చెప్పే విషయం విను. దేవాసుర యుద్ధంలో పూర్వకాలంలో జరిగిన వృత్తాంతం ఇది. మార్కండేయమహర్షి మానాన్నకు చెప్పింది సంపూర్ణంగా చెపుతాను. రాజర్షిశ్రేష్ఠా ! మనసుపెట్టి దీన్ని విను. ఈవిషయంలో ఇంకోవిధంగా అనుకోవద్దు. రాజా! ఒకరినొకరు జయించవలెననే కోరికతో దేవతలకు, అసురులకు మధ్య మొదటి మారు తారకామయం అనే యుద్ధం జరిగింది.* యుద్ధంలో దేవతలు దైత్యులను జయించారు అని విన్నాం. దైత్యులు ఓడిపోగా తారకుని ముగ్గురు కొడుకులు తారాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనేవారు భయంకర కమయిన తపస్సును మహోత్తమ నియమాలతో చేశారు. వారు తపస్సుతో తమ శరీరాలను

శుష్కింపజేశారు. వారు ఇంద్రినిగ్రహం, తపస్సు నియమాలు సమాధితో ఉన్నారు. బ్రహ్మదేవుడు ప్రీతుడయి వారికి వరం ఇవ్వటానికి ఉద్యుక్తుడు అయ్యాడు. వారు ముగ్గురు కలసి సర్వలోకపితామహుడయిన బ్రహ్మదేవుని "సర్వప్రాణులవల్ల మాకు వధలేకుండాలి" అని వరం అడిగారు. అప్పుడు లోకేశ్వరుడయిన బ్రహ్మదేవుడు "అసురులారా! అందరికీ అమరత్వం అసంభవం. మీరు ఈ తపస్సును మాని, దీనికంటే ఇతరమయిన మీకిష్టమయిన వరం కోరుకోండి." అన్నాడు.

"అప్పుడు వారందరూ కలిసి పలుమారులు ఆలోచించి, చర్చించుకొని, సర్వలోకేశ్వరుడయిన బ్రహ్మకు నమస్కరించి, ఇలా అన్నారు.

"పితామహా! మాకు వరప్రదానం చేయి." ఇచ్ఛానుసారం వెళ్ళే నగరాకార మయిన సుందర విమానాన్ని నిర్మించుకొని, దానిలో నివసించగోరుతాం. ఆ పురం అభీష్టవస్తు సంపన్నం కావాలి. దేవదానవులు నాశనం చేయలేనిది కావాలి. దేవా! నీవు ఆదరంతో ప్రసన్నుడివయితే, ఆ మూడు పురాలు యక్షులు, రాక్షసులు, ఉరగులు, నానాజాతీయులయిన ఇతర ప్రాణులు, కృత్యలు, శస్త్రాలు, బ్రహ్మవేత్తల శాపాలతో నశించకుండా ఉండాలి." బ్రహ్మదేవుడు అన్నాడు - "దైత్యులారా! కాలం తీరితే అంతా నశిస్తుంది. ఇప్పుడు బ్రతికి ఉన్నవాడికి ఎప్పుడో ఒకప్పుడు మరణం కలుగుతుంది అని తెలుసుకోండి. ఈ మూడు పురాల నాశానికి ఇంకేదయిన నిమిత్తం కోరండి."

దైత్యులు అన్నారు - "దేవా! నీ అనుగ్రహం కారణంగా, మేము మూడు పురాలలో నివసిస్తూ ఈ సమస్త భూమండలం మీద సంచరిస్తాం. దేవా! వేయి సంవత్సరాలు నిండగా మేము ఒకరినొకరం కలుస్తాం. ఈ పట్టణాలు మూడూ అప్పుడు కలుస్తాయి. ఏకమయిన వీటిని ఒక బాణంతో కొట్టే దేవ శ్రేష్ఠుడు మాకు మృత్యుకారకు డవుతాడు." "అలాగే అగుగాక!" అని బ్రహ్మదేవుడు స్వధామానికి వెళ్ళాడు. వరాలను పొంది, వారు ముగ్గురు సంతోషించారు. వారిలో వారు చర్చించుకొని మూడుపురాలు సృష్టించటానికి దైత్య దానవ పూజితుడు, అజరామరుడు, మహోసురు డయిన విశ్వకర్మను కోరారు.

తరువాత, ధీమంతు డయిన మయుడు తన తపస్సుతో మూడు పురాలను నిర్మించాడు. వాటిల్లో ఒకటి హిరణ్మయం. రెండోది వెండిది. మూడోది ఇనుపది. రాజా! బంగారంతో నిర్మించినది స్వర్గ లోకంలో ఉంది. వెండితో చేసింది అంతరిక్షంలో ఉన్నది. ఇనుముతో చేసింది భూలోకంలో ఉన్నది. ఇది ఆజ్ఞానుసారం అంతటా తిరుగుతుంది. ఒక్కొక్కదానికి పాడవు, వెడల్పు, మూరేసి యోజనాలు ఉంది. ప్రతిపురంలో మహాభవనాలు, బురుజులు, అనేక ప్రాకారాలు, వాకిళ్ళు ఉన్నాయి. పెద్దపెద్ద భవనాలతో ఆ పురాలు నిండి ఉన్నాయి. విశాలమయిన రాజవీథులు, నానావిధ ప్రాసాదాలు, పెద్ద వాకిళ్లతో

శోభిల్లుతున్నాయి. రాజా! ఆ పురాలలో, ప్రత్యేకంగా ఒక్కొక్కరు రాజు అయ్యారు. తారకాక్షుని విచిత్ర నగరం సువర్ణమయం. కమలాక్షుని నగరం వెండిది. నిద్యున్మాలిది ఇనుపది. ఆ ముగ్గురు రాక్షసరాజులు, అస్త్రతేజస్సుతో, ముల్లోకాలను ఆక్రమించి నిలిచారు. 'ప్రజాపతి అంటే ఎవరు?' అని ప్రశ్నించారు. సాటిలేని ఆ దానవముఖ్యుల వద్దకు లక్షలు, కోట్లు, పదికోట్ల మంది దానవులు ఆయా ప్రదేశాలనుంచి వచ్చారు. మాంసాహారులు, మిక్కిలి మదించినవారు, పూర్వం దేవతల చేతిలో ఓడిపోయిన దానవులు మహత్తరమయిన ఐశ్వర్యం కోరి, త్రిపుర దుర్గాలను ఆశ్రయించారు. మయాసురుడు వీరందరికి అప్రాప్తమయిన వస్తువులను సమకూర్చేవాడు. ఆతని ఆశ్రయంతో, వాళ్ళందరూ ఎలాంటి భయం లేకుండా ఉన్నారు. త్రిపురాలను ఆశ్రయించినవాడు మనస్సులో ఏది కావాలని కోరితే, దానిని మయుడు తన మాయతో కల్పించి ఇచ్చేవాడు. తారకాక్షుని కుమారుడు హరి అనే మహాబలుడు మహత్తర తపస్సు చేశాడు. ఆ తపస్సుకు బ్రహ్మ సంతోషించాడు. బ్రహ్మదేవుని ఆతడు "మా పట్టణంలో మహిమాన్వితమయిన బావి ఏర్పడాలి. శస్త్రాఘాతాలతో మరణించిన దానవులను అందులో వేస్తే వారు పునర్జీవితులయి మహాబలులు కావాలి" అని కోరాడు.

హరి బ్రహ్మవలన ఆవరం పొంది, అక్కడ మృతులను బ్రతికించే బావిని సృష్టించాడు. ఒక దైత్యుడు ఏ రూపంలో, ఏ వేషంతో మృతుడయితే ఆ బావిలో పడవేయగా అదే రూపవేషాలతో మళ్ళీ బ్రతికేవాడు. మహా తపస్సిద్ధులు, దేవతలకు భయాన్ని పెంపొందించే వారు, ఆ బావిని సంపాదించి, సర్వలోకాలను బాధించారు. రాజా! యుద్ధంలో వారికి ఎప్పుడూ క్షయం కలగలేదు. ఆ పట్టణాల్లో నివసించిన సమస్త దైత్యులు లోభమోహాలకు వశు లయి, వివేక హీనులు, లజ్జాహీను లయి లోకాలను కొల్లగొట్టసాగారు. వరదానంతో మత్తులయినవారు దేవతలను, వారి గణాలను పారద్రోలి, అక్కడ తమ ఇష్టం వచ్చినట్లు విహరించసాగారు. దుష్ప్రవర్తన గల దానవులు దేవతలకు చాలా ఇష్టమయిన సమస్త దేవోద్యానాలను, పవిత్రమయిన ఋషుల ఆశ్రమాలను, జనపదాలను నాశనం చేశారు.

దేవతలను, ఋషులను, పితృదేవతలను నిలువనీడలేనివారిని చేశారు. దేవతలు కాని ముగ్గురు దైత్యులు మూడు లోకాలను ఆక్రమించారు.

అన్ని లోకాలు పీడితాలు కావటం వల్ల, ఇంద్రుడు దేవతలతో కలిసి, వజ్రాయుధ ఘాతాలతో పురత్రయాన్ని నాలుగువైపులనుంచి ఆక్రమించి యుద్ధం చేశాడు. రాజేంద్రా! బ్రహ్మదేవుడు ఇచ్చిన వర ప్రభావంతో అభేద్యాలయిన ఆ పురాలను ఛేదించలేని ఇంద్రుడు భయపడి, ఆ పురత్రయాన్ని వదలి, ఆ దేవతలతో కలిసి రాక్షసులు చేసిన అపకారాన్ని

చెప్పటానికి పితామహుని వద్దకు వెళ్ళాడు. దేవతలు జరిగినది అంతా ఉన్నది ఉన్నట్లు చెప్పి, బ్రహ్మదేవునికి నమస్కరించి, రాక్షసుల వధోపాయం అడిగారు.

అది విన్న బ్రహ్మదేవుడు 'దేవతలారా! మీకు అపకారం చేసినవాడు నాకు కూడా అపకారియే. అసురులు అందరూ దురాత్ములే. వాళ్ళు ఎల్లప్పుడు అపకారం చేస్తుంటారు. మిమ్ములను పీడిస్తుంటారు. నాకు సర్వప్రాణులు సమానమే. ఇందులో సందేహం లేదు. ధర్మద్రోహులను తప్పక సంహరించాలి అనే వ్రతాన్ని నేను పాటిస్తాను. ఆ కోటలను ఒకే బాణంతో ఛేదించాలి. కాని ఇంకో విధంగా కాదు. భగవంతుడు పరమేశ్వరుడు తప్ప, ఒక బాణంతో, ఆ పట్టణాలను ఇంకొకడు ఛేదింప శక్తుడు గాడు. అనాయాసంగా మహత్కార్యాలను చేయగలవాడు, విజయశీలుడు, ఈశ్వరుడు అయిన మహాదేవుని మీరు యోధునిగా వరించండి. ఆ దైత్యులను ఆయన చంపగలడు. ఆయన మాటలు విన్న దేవతలు బ్రహ్మను ముందుంచుకొని, వృషభధ్వజుని శరణందారు. తపస్సును, నియమాలను ఆశ్రయించి, ధర్మజ్ఞులయిన దేవతలు, ఋషులతో కూడా, సనాతన బ్రహ్మస్వరూపు డయిన పరమేశ్వరుని స్తుతిస్తూ శరణందారు. రాజా! భయాలు కలిగినప్పుడు అభయం ఇచ్చేవాడు, సర్వాత్ముడు, మహాత్ముడు అయిన శివుని, నిండు మనస్సుతో దేవతలు దేవునికిష్టమయిన వాక్కులతో స్తుతించారు. నానా విధాలయిన తపోవిశేషాలతో, మనోవృత్తులను సంపూర్ణంగా నిరోధించే ఉపాయం తెలిసినవాడు; తన జ్ఞానస్వరూప బోధ నిరంతరం గల్గి, అంతఃకరణాన్ని స్వాధీనంలో ఉంచుకునే వాడు; లోకంలో సాటిలేనివాడు, నిష్కల్మషుడు, తేజోరాశి, మహేశ్వరు డయిన ఉమాపతిని దేవతలు దర్శించారు. వారు ఏకరూపుడయిన పరమేశ్వరుని, తమ భావనానుసారం నానారూపునిగా కల్పించుకొన్నారు. ఆ పరమాత్మలో తమ, ఇతరుల ప్రతిబింబాలను చూశారు. ఇదంతా చూసినవారు ఒకరినొకరు చూసుకొంటూ అందరూ పరమాశ్చర్యం పొందారు. జన్మలేనివాడు, జగత్పతి, అయిన శంకరుని సర్వప్రాణి మయునిగా చూసి, దేవతలు, బ్రహ్మర్షులు కూడా సాష్టాంగ ప్రణామాలు చేశారు. శంకరుడు వారిని లేవనెత్తి, మంగళకామనతో ఆదరించి, చిరునవ్వుతో 'విషయం ఏమిటో చెప్పండి, చెప్పండి' అని అడిగాడు. పరమేశ్వరుని అనుజ్ఞను పొంది, వారందరు మనస్సు స్తిమితంకాగా ? 'దేవా! నమస్కారం, నమస్కారం, నమస్కారం' అని ఇలా అన్నారు.

"దేవా! నీవు దేవతలకే దేవుడవు. విలుకాడవు. వనమాలాధారివి. నీకు నమస్సులు, ప్రజాపతి అయిన దక్షుని యజ్ఞం నాశనం చేసినవాడివి. ప్రజాపతుల స్తుతులందేవాడివి.

అందరి స్తుతులందిన వాడివి, స్తుతింపదగినవాడివి, స్తుతులందేవాడివి, శుభస్వరూపుడవు అయిన నీకు నమస్సులు. విశేషంగా రక్తవర్ణుడివి, పాపులను వీడిపించే రుద్రుడవు, నీలకంఠుడివి, శూలధారివి, అమోఘఫలదాతవు, మృగ నేత్ర సమాన నేత్రుడవు, శ్రేష్ఠమయిన ఆయుధంతో యుద్ధం చేసేవాడవు నీవు. పూజనీయుడవు, శుద్ధుడవు, ప్రళయకాలంలో సమస్తం క్షయం చేసేవాడివి, నిలువరించటానికి, ఓడించటానికి వీలుగాని వాడివి, శుక్లవర్ణుడివి, బ్రహ్మవు, బ్రహ్మచారివి, ఈశానుడివి, అప్రమేయుడివి, నియంతవు, వ్యాఘ్రచర్మధారివి, నిరంతరం తపోరతుడవు, పింగళ వర్ణుడవు, వ్రతశీలివి, కృత్తివాసుడివి అయిన నీకు నమస్సులు. కుమారస్వామి తండ్రికి, ముక్కంటికి, శ్రేష్ఠమయిన ఆయుధం ధరించినవానికి, శరణాగతుల దుఃఖం పోగొట్టేవానికి, బ్రహ్మద్వేషుల సమూహాన్ని నాశనం చేసేవానికి నమస్కారం. వృక్షాల అధిపతికి, నరుల అధిపతికి, గోవుల ప్రభువుకు, యజ్ఞాల అధిపతికి నిత్యం నమస్కారం. సైన్యంతో గూడినవానికి, మూడు కన్నులు గలవానికి, అమితమయిన తేజస్సు గలవానికి నమస్సులు; దేవా! మనస్సుతో, వాక్కుతో, కర్మలతో నీశరణందిన మమ్ము కాపాడు." అప్పుడు భగవానుడు బ్రహ్మాదిదేవతలకు ప్రసన్నుడయి, స్వాగతం చెప్పి, ఆనందం కలిగించి "భయపడకండి మీకోసం ఏం చేయాలో చెప్పండి" అని అన్నాడు.

34. త్రిపురాఖ్యానము.

దుర్యోధనుడు చెప్పాడు – "పితృదేవతలకు, దేవతలకు, ఋషుల సమూహానికి మహాత్ముడయిన శంకరుడు అభయం ఇచ్చాడు. బ్రహ్మదేవుడు ఆయనను పూజించి, లోకానికి మేలు కలిగించే మాటను ఇలా చెప్పాడు. "దేవా! మీ ఆజ్ఞానుసారం, ప్రజాపతి పదవిలో ఉన్న నేను దానవులకు మహావరం ఇచ్చాను. ఆ వరప్రభావం వల్ల వాళ్ళు మితిమీరిపోయారు. కాలత్రయానికి ప్రభువయిన పరమేశ్వరా! వాళ్ళను ఇంకొకడు సంహరించలేడు. వారిని వధించటంలో నీవే ప్రతిపక్షివయిన శత్రువువు. దేవా! శంకరా! ఆపన్నులయి, రక్షింప వేడుతున్న దేవతలకు ప్రసన్నుడివి కావలిసింది. దానవులను జయించు. మానదా! నీ అనుగ్రహం వల్ల, జగత్తు అంతా సుఖంగా పెంపొందింది. లోకేశా! నీవే శరణు అయినవాడవు. కాబట్టి నిన్ను శరణు పొందాము." శంకరుడు అన్నాడు – "మీకోసం, శత్రువులను అందరిని చంపవలెనని ఉద్దేశ్యం. ఆ దేవద్వేషులు బలవంతులుగా ఉన్నారు. కాబట్టి నేను ఒక్కడినే వారిని సంహరింపలేను. కాబట్టి మీరు అందరు కలిసి, నా సగం

తేజస్సుతో పరిపుష్టలయి, యుద్ధంలో శత్రువులను జయించండి. మీరు అందరూ ఏకమయితే మిక్కిలి బలవంతులు అవుతారు."

దేవత లన్నారు – "దేవా! యుద్ధంలో మా బలానికంటే, వారు రెండు రెట్లు బలవంతులు అని మా అభిప్రాయం. ఇంతకు ముందు జరిగిన యుద్ధంలో వారి బలం మాకు తెలిసింది." స్థాణువు అన్నాడు – "మీకు కీడు చేసిన వారిని తప్పక వధించవలసిందే. నా తేజస్సు బలాల అర్ధభాగంతో శత్రువులను సంహరించండి." దేవతలన్నారు – "మహేశ్వరా! నీ తేజో బలాల అర్ధభాగాన్ని మేము భరించలేం. మా అందరి సగం బలంతో నీవే శత్రువులను జయించు." శంకరుడన్నాడు – "నా బలాన్ని భరించే శక్తి మీకు లేకపోతే మీ అర్ధతేజస్సుతో పెంపొంది, నేనే వీళ్ళను సంహరిస్తాను." రాజశ్రేష్ఠా! దేవతాశ్రేష్ఠులు అలాగే చేయమని చెప్పారు. శంకరుడు ఇంద్రాదులందరిలోని తేజస్సులో సగం గ్రహించి, తేజస్సుతో వారందరికంటె అధికు డయ్యాడు. ఆ దేవుడు బలంతో, సర్వదేవతల కన్నా బలవత్తరుడు అయ్యాడు. ఆనాటి నుండి శంకరుడు మహాదేవుడు అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. అప్పుడు మహాదేవుడు ఇలా అన్నాడు. "దేవతలారా! నేను ధనుస్సును, బాణాలను ధరించి, రథాన్ని అధిష్ఠించి, యుద్ధంలో ఆ శత్రువులను చంపుతాను. ఇప్పుడు మీరు నాకు రథాన్ని, ధనుర్బాణాలను వెతకండి. వాటితో వీళ్ళను అందరిని నేలగూలుస్తాను."

దేవతలన్నారు – 'దేవదేవా! మేము ముల్లోకాల తేజస్సులను అధిక మాత్రంగా ఏకం చేసి, మీకోసం మహాతేజోవంత మయిన రథం కల్పిస్తాం. విశ్వకర్మ బుద్ధిపూర్వకంగా నిర్మించిన ఆ రథం చాలా అందంగా ఉంటుంది." అంతట దేవశ్రేష్ఠులు రథాన్ని కల్పించారు. విష్ణువును, చంద్రుని, అగ్నిని కలిపి ఆయనకు బాణం కల్పించారు. రాజా! ఆ ఉత్తమ బాణానికి శృంగాకార మయిన భాగం అగ్ని అయ్యాడు. అగ్రభాగం చంద్రుడయ్యాడు. మునికి విష్ణువయ్యాడు. సమస్త ప్రాణులను ధరిస్తూ పర్వతాలు, వనాలు, ద్వీపాలతో గూడి, విశాలమయిన పురసమూహం గల భూదేవిని దేవతలు రథం చేశారు. ఆ రథానికి మందర పర్వతం ఇరుసు అయినది. మహానది అయిన గంగ జంఘ (ఇరుసుకు ఆధారమయిన కొయ్య) అయింది. దిక్కులు, విదిక్కులు రథానికి ఆవరణం అయ్యాయి. నక్షత్ర సమూహం ఈషాదండం (ఏడికోల); కృతయుగం కాడి అయ్యాయి. ఆ రథానికి సర్పశ్రేష్ఠుడయిన వాసుకి కూబరం (నొగ) అయ్యాడు. హిమవంతం అపస్కరం (రథానికి వెనక ఉండే కర్ర), వింధ్య పర్వతం దానికి ఆధార దండం అయింది. ఉదయాస్తమయ పర్వతాలను దేవతలు ఆ రథ చక్రాలకు ఆధార మయిన కాష్ఠంగా చేశారు. దానవులకు ఉత్తమ నివాసస్థాన మయిన సముద్రాన్ని రథానికి కట్టే త్రాడును చేశారు. సప్తర్షి మండలం

రథానికి పరిష్కరం (చక్రాల రక్షణకు ఏర్పరిచే సాధనం) చేశారు. గంగ, సరస్వతి, సింధువు అనే మూడు నదులతోపాటు, ఆకాశం త్రివేణు కాష్ఠయుక్తమయిన ధురం (తొట్టికు ముందు భాగం) అయింది. ఆ రథానికి బంధన సామగ్రి జలమూ, సర్వనదులు అయ్యాయి. రేయింబవళ్ళు, కలలు, (ముప్పది కాష్ఠలకాలము) కాష్ఠలు, (పదునెనిమిది రెప్పపాట్ల కాలము) ఋతువులు, అనుకర్షం (క్రింద ఉండే కర్ర) అయినవి. ప్రకాశవంతమయిన గ్రహాలు, నక్షత్రాలు రథానికి వరూథం (రక్షకమయిన ఆవరణం) అయ్యాయి. త్రివేణుతుల్యమయిన ధర్మార్థకామా లనే మూడింటిని కలిపి, రథంలోని ఆసనం చేశారు. పూలు, పండ్లతో గూడిన ఓషధులు, లతలు, రథానికుండే గంటలు అయ్యాయి. ఉత్తమ రథానికి సూర్యచంద్రులను చక్రాలు చేశారు. రాత్రి పగళ్ళను, పూర్వపక్షం అపరపక్షంగా చేశారు.* ధృతరాష్ట్రాదులయిన పదిమంది నాగరాజులను కూడా ఈషాదండంలో భాగం చేశారు. బుసకొడుతున్న పెద్దపెద్ద సర్పాలను ఆ రథానికి గుర్రాలను కట్టే త్రాళ్ళను చేశారు. ద్యులోకాన్ని యుగంలో భాగం చేశారు. సంవర్తక వలాహకాలనే ప్రళయకాలమేఘాలను యుగచర్మాలను చేశారు. కాలపృష్ఠం, నహుషుడు, కర్కోటకుడు, ధనంజయుడు, ఇంకా ఇతర సర్పాలను గుర్రాల జూలును కట్టే త్రాళ్ళు చేశారు. దిక్కులు, విదిక్కులు కూడా రథాశ్వాల పగ్గాలు అయ్యాయి. సంధ్య, ధృతి, మేధ, సన్నతులతో గూడిన ఆకాశాన్ని, గ్రహాలను, నక్షత్రాలను, తారలను, విచిత్ర శోభాకరాలను, రథంపైన కప్పుకు ఆవరణం చేశారు. ఇంద్రవరుణ యమకుబేరు లను లోకపాలకులు నలుగురిని, దేవతలు ఆ రథానికి అశ్వాలను చేశారు. సినీవాలి, అనుమతి, కుహువు, సువ్రత అయిన రాక అనువాని కధిపతు లయిన దేవతలను గుర్రాలకు పగ్గాలను చేశారు. వీని అధికారి దేవతలను గుర్రాల కళ్ళేలకు ఉండే ముళ్ళను చేశారు. ధర్మం, సత్యం, తపస్సు, అర్థం అనేవాటిని కళ్ళేలను చేశారు. రథానికి ఆధార భూమి మనస్సు అయింది. సరస్వతీదేవి రథం ముందుకు పోయేదారి అయింది. మెరుపులు గాలికి ఎగురుతూ నానావర్ణాలతో విచిత్రాలయిన పతాకలయి, ఇంద్రధనుస్సులను బంధించిన ఆ రథశోభను పెంపొందింపజేశాయి. వషట్కారం చెన్నకోల అయింది. గాయత్రి ఆ రథంపైభాగాన కట్టే త్రాడు అయింది. పూర్వం మహాత్ముడయిన పరమేశ్వరుని యజ్ఞంలో నిర్మితమయిన సంవత్సరం ధనుస్సు అయింది. సావిత్రి మహాధ్వని గల అల్లెత్రాడు అయింది. మహార్హయినది, రత్నాలంకృతమై, అభేద్యమై,

* వెనక హిమవద్వింధ్య పర్వతాలు చక్రాలు అని, ఇక్కడ సూర్యచంద్రులు చక్రాలు అనడం చేత ఆ రథానికి నాలుగు చక్రాలు ఉన్నట్టు తోస్తుంది. (నీలకంఠీయం).

రజోగుణ రహితమై, స్వచ్ఛమై, కాలచక్రానికి అందని దివ్యమయిన కవచం నిర్మితమయింది. బంగరు కొండ మేరుపర్వతం జెండా కర్ర అయింది. మెరుపులతో అలంకృతాలయిన మేఘాలు పతాకలు అయ్యాయి. అవి యజుర్వేదీయ ఋత్విక్కుల మధ్యలో ఉన్న అగ్నులవలె ప్రకాశించాయి.

సమస్త జగత్తేజఃపుంజం ఏకీభూతం అయినట్లున్న ఆ రథాన్నిచూసి, దేవతలు అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. వారు మహాత్ముడయిన పరమేశ్వరునికి, రథం సిద్ధంగా ఉందని నివేదించారు. మహారాజా! ఈ రీతిగా, శత్రువులను మర్దించటానికి రథశ్రేష్ఠం నిర్మితమయింది. శంకరుడు ఆ రథం మీద తన ఆయుధాలను ఉంచాడు. ధ్వజదండాన్ని ఆకాశం అంత ఎత్తుచేసి, దానిమీద తన వృషభ మయిన నందిని స్థాపించాడు. తరువాత బ్రహ్మదండం, కాలదండం, రుద్ర దండం, జ్వరం అనే నాలుగు, రథానికి పార్శ్వ రక్షకా లయి, శస్త్రాలు దాల్చి నిలిచాయి. అథర్వాంగిరసులు మహాత్ముడయిన శివునికి చక్రరక్షకు లయ్యారు. ఋగ్వేదం, సామవేదం, పురాణాలు ముందుండి శోభను పెంపొందించాయి. ఇతిహాస యజుర్వేదాలు వెనుక భాగాన్ని రక్షించేవి అయ్యాయి. దివ్యవాక్కులు, విద్యలు ప్రక్కల సంచరించేవిగా నిలిచాయి. రాజేంద్రా! స్తోత్రాలు, కవచాలు, వషట్కారం, ఓంకారం అగ్రభాగంలో ఉండి, అత్యంత శోభాకరా లయ్యాయి. ఆరు ఋతువులతో గూడిన సంవత్సరాన్ని, విచిత్రమయిన ధనుస్సును చేసి, మహాదేవుడు తన ఛాయనే, యుద్ధంలో నాశంలేని అల్లెత్రాటిని చేశాడు. భగవంతు డయిన రుద్రుడు కాలస్వరూపుడు గదా! కాబట్టి ఆయనకు సంవత్సరం ధనుస్సు అవుతుంది. అందువల్లనే రుద్రాంశ అయిన కాళరాత్రిని, ఆయన తెగిపోని అల్లెత్రాటిని చేశాడు. విష్ణువు, అగ్ని, చంద్రుడు బాణం అయ్యారు. సమస్త జగత్తు అగ్ని సోమస్వరూపం. అలాగే సమస్త ప్రపంచం విష్ణుమయం అని అంటారు. అమిత తేజస్వి అయిన భవునికి విష్ణుదేవుడు ఆత్మయే కాబట్టి, ఆ రాక్షసులు పరమేశ్వరుని ధనుస్సు, అల్లెత్రాటి, స్పర్శను సహించలేకపోయారు. మహేశ్వరుడు, ఆ బాణంలో అసహ్యమూ, ప్రచండమూ అయిన తన కోపాన్ని; భృగువు, అంగిరసుల వల్ల కలిగిన మిక్కిలి దుస్సహమయిన క్రోధాగ్నిని స్థాపించాడు. ధూమ్రవర్ణుడై, చర్మవస్త్రుడై, భయంకరుడు, పదివేల మంది సూర్యులతో సమానుడయిన నీలలోహితుడు, తేజస్సుల జ్వాలలతో ఆవరింపబడి జ్వలించాడు. అత్యంత కఠినమయిన లక్ష్యాన్ని ఛేదించేవాడు, బ్రహ్మద్వేషులను సంహరించేవాడు హరుడు. ధర్మాశ్రితు లయిన నరులను నిత్యం రక్షించేవాడు, అధర్మాశ్రితులను నిత్యం సంహరిస్తాడు. ఆయనకు ఉపయోగంలోకి వచ్చే రధాది సాధనాలు గుణవంతాలు, శత్రుధ్వంసంలో సమర్థాలు, భయంకర బలశోభితాలు.

భయంకర రూపం, మనోజవం గలవి, అవి చుట్టూ ఉన్న శివుడు విలసిల్లుతూఉంటాడు. రాజా! ఈ విశ్వజగత్తు అంతా ఆయన అంగాలను ఆశ్రయించి ఉన్నది. స్థావర జంగమాత్మకమయిన ఇది అద్భుతంగా కన్పిస్తూ శోభించింది.

పరమేశ్వరుడు కవచం ధరించి, విల్లుచేతబట్టి సర్వసన్నద్ధ మయిన రథం చూశాడు. చంద్ర, విష్ణు, అగ్నులవల్ల ఏర్పడ్డ బాణాన్ని తీసుకొని, యుద్ధసన్నద్ధు డయ్యాడు. రాజా! శంకరునికి దేవతలు పవిత్రుడై, పవిత్ర సువాసనలను వహించే వాయుదేవుని, వింజామర వీచే వానినిగా చేశారు. మహదేవుడు దానవ వధకు సన్నద్ధుడయి, దేవతలకు కూడా భీకరుడయి, భూమిని కంపింపజేస్తూ, ఆ రథాన్ని నొక్కి పట్టుకొని, ఆరోహించసాగాడు. ఆ రథం ఎక్కదలచుకొన్న దేవేశ్వరుని మహర్షులు, గంధర్వులు, దేవ సమూహాలు, అప్సరసల సంఘాలు స్తుతించాయి. బ్రహ్మర్షులు స్తుతిస్తుండగా, వందులు నమస్కరిస్తుండగా, నృత్యం బాగా తెలిసిన అప్సరసల సమూహాలు నృత్యం చేస్తుండగా, వరదుడయిన శంకరుడు శోభిస్తూ, ఖడ్గాన్ని బాణాన్ని, ధనుస్సును దాల్చి 'నాకు సారథి ఎవరు?' అని నవ్వుతూ అడిగాడు. 'దేవాధిపా! నీవు ఎవరిని నియోగిస్తే, వారు నీకు సారథి అవుతారు. ఇందులో సందేహం లేదు.' అని వారన్నారు. పరమేశ్వరుడు మళ్ళీ వారితో ఇలా అన్నాడు. 'మీరే బాగా ఆలోచించి, నాకంటే శ్రేష్ఠతరుని సారథిని చేయండి. ఆలస్యం చేయవద్దు.' మహాత్ము డయిన శివుని ఈ మాటవిని, దేవతలు బ్రహ్మ వద్దకు వెళ్ళి,' ఆయనను ప్రసన్నుని, చేసికొని ఇలా అన్నారు. 'దేవా! దేవశత్రుల వినాశానికి నీవు చెప్పినట్లే చేశాం. వృషభధ్వజుడు మాకు ప్రసన్నుడయ్యాడు. చిత్రమయిన ఆయుధాలతో గూడిన రథం కూడా నిర్మించాం. ఆ రథశ్రేష్ఠానికి సారథి ఎవరు కావాలో మాకు తోచటం లేదు. దేవశ్రేష్ఠా! విధాతా! కాబట్టి తగిన సారథిని నిర్ణయించి, నియమించు. దేవా! 'మేలు చేస్తాను' అని నీవు పూర్వం మాకు మాట ఇచ్చావు. దాన్ని సఫలం చేయి. దేవా! మేము తయారుచేసిన ఆ శ్రేష్ఠరథం, భారాన్ని వహించి, శత్రువులను పారద్రోలుతుంది. యోద్ధగా పినాకహస్తు డయిన శంకరుని నియమించాం. ఆయన దానవులను భయపెడుతూ సన్నద్ధుడయి ఉన్నాడు. అలాగే నాలుగు వేదాలు రథాశ్వాలు. మహాత్ముడయిన ఆయనకు పర్వతాలతో గూడిన భూమి రథం అయింది. నక్షత్ర సమూహమే ధ్వజంగా గలవాడు, కవచధారి అయిన శివుడు రథికుడు అయినాడు. కాని సారథి కనపడలేదు. దేవా! ఈ రథాదులకంటే అధికుడయిన సారథిని వెతకాలి. రథం, గుర్రాలు, యోద్ధ - వీరందరి ప్రతిష్ఠ సారథి మీద ఆధారపడి ఉంటుంది. కవచాలు, శస్త్రాలు, ధనుస్సు సారథివైనే

ఆధారపడి ఉంటాయి. పితామహా! నీవు తప్ప, మాకు ఇంకెవరూ సారథిగా ఉండదగినవారు కన్పడటం లేదు. దేవా! సర్వగుణాలతో గూడిన నీవొక్కడవే దేవతలకంటే అధికుడివి.

దేవా! ఈ లోకంలో, వేగంగా పరుగెత్తే ఉపనిషత్తులతో గూడిన వేదాలు అనే గుర్రాలను నియంత్రించగల వాడవు నీవే. కాబట్టి నీవే స్వయంగా సారథివి కావలసింది. బలం, ధైర్యం, పరాక్రమం వినయం అనే గుణాలతో రథికుని కంటే శ్రేష్ఠుని యుద్ధంలో సారథిని చేయాలి. శంకరుని కంటే అధికుడు ఇంకెవ్వరూ లేరు. పితామహా! ఏ లోటు లేనట్లు సారథ్యం చేసి, మమ్ములను ఉద్ధరించు. శంకరునికంటే నీవే అధికుడివి. ఇక్కడ నీకంటే గొప్పవాడులేడు. దేవాధిపా! అందరికంటే నీవే విశిష్టుడివి.

కాబట్టి దేవతల విజయానికి, దేవద్వేషుల వధకు, త్వరగా నీవు రథం ఎక్కి, ఉత్తమాశ్వాలను నియంత్రించు.

దేవా! దేవతలకు కంటకులయినవారు నీ అనుగ్రహం వల్ల హతులవుతారు. మహాబాహూ! అలాంటి నీవు రాక్షసుల వలన కలిగిన మహాభయంనుంచి కాపాడు. వ్యగ్రత లేని మహావ్రతా! నీవే మాకు గతి. నీవే మాకు రక్షకుడివి. ప్రభూ! నీ అనుగ్రహం వల్లనే, దేవతలు అందరూ స్వర్గంలో పూజితు లవుతున్నారు."

అని వారు శిరస్సులు వంచి, నమస్కరించి, ముల్లోకాలకు అధిపతి అయిన బ్రహ్మను సారథ్యం చేయటానికి ప్రసన్నుని చేసుకొన్నారు అని మేము విన్నాం. పితామహుడు అన్నాడు - "దేవతలారా! మీరు చెప్పినదానిలో కొద్దిగాకూడా అబద్ధం లేదు. యుద్ధం చేసే శివుని రథాశ్వాలను నియంత్రిస్తాను." లోకసృష్టికర్త, భగవంతు డయిన పితామహుడు ఇలా పలికి జటాభారాన్ని ముడివేశాడు.

మృగచర్మ వస్త్రాన్ని బిగించాడు. కమండలాన్ని ప్రక్కనపెట్టాడు. తరువాత ఆ బ్రహ్మ చెన్నకోల చేతబట్టి, వెంటనే రథం ఎక్కాడు.

మహాత్ముడయిన మహేశ్వరునికి సారథ్యం చేయటానికి నియమితుడై, లోక పూజితుడయిన బ్రహ్మ త్వరగా లోక పూజితమయిన రథాన్ని ఎక్కగానే, వాయువేగం గల గుర్రాలు తలలు వాల్చి, భూమిని తాకాయి. స్వతేజస్సుతో వెలుగుతున్న లోకపితామహుడు, బ్రహ్మ రథం ఎక్కి, పగ్గాలను, చెన్నకోలను పట్టాడు. అప్పుడు బ్రహ్మ గుర్రాలను లేవనెత్తి, నిలిపి, శంకరుని రథం ఎక్కమన్నాడు. శివుడు విష్ణుచంద్ర అగ్నులవల్ల ఏర్పడ్డ బాణాన్ని తీసుకొని, ధనుస్సుతో శత్రువులను కంపింపజేస్తూ రథం ఎక్కాడు. రథారోహణంచేసిన శంకరుని పరమర్షులు, గంధర్వులు, దేవసమూహాలు, అప్సరసల సమూహాలు స్తుతించాయి. ఖడ్గం, బాణం, ధనుస్సులను దాల్చి, ప్రకాశిస్తున్న వర ప్రదాత అయిన శంకరుడు ముల్లోకాలను తన తేజస్సుతో వెలిగిస్తూ, రథంలో ఉన్నాడు. పరమేశ్వరుడు మళ్ళీ

ఇంద్రాదులయిన దేవతలతో ఇలా అన్నాడు - "అసురులను నేను చంపను అని మీరు ఏమాత్రమూ శోకించవలదు. ఈ బాణంతో రాక్షసులు హతు లయ్యారనే మీరు తెలుసుకోండి." ఆ దేవతలు 'మీమాట నిజం, దానవులు హతులయినట్లే, అని అన్నారు. భగవానుడు అన్న మాట మిథ్యకాదు అని భావించి, దేవతలు పరమానంద పడ్డారు. రాజా! అంత దేవాధిపుడు సమస్త దేవగణాలతో గూడి, సాటిలేని మహారథంమీద బయలుదేరాడు.

మహాయశుడయిన శివదేవుని, ఆయన పారిషదులు పూజిస్తున్నారు. కొందరు నృత్యం చేస్తున్నారు. మాంసభక్షకులు, తీవ్ర లయిన మరికొందరు, ఒకరినొకరు భయపెడుతూ పరిగెత్తుతున్నారు. మహాభాగ్యశాలులు, ఉత్తమగుణసంపన్నులు అయిన మహర్షులు, దేవతలు, ఇతర జనులు అందరు మహాదేవునికి జయం కలగాలని ఆకాంక్షించారు. నరశ్రేష్ఠా! ఈ రీతిగా లోకాలకు అభయంకరుడు, దేవ ప్రభు వయిన శంకరుడు బయలుదేరగా, దేవతలూ, సమస్త జగత్తు సంతుష్టమయింది. రాజా! ఋషులు అక్కడ దేవాధిపుని అనేక స్తోత్రాలతో స్తుతిస్తూ, ఆయన తేజస్సును మాటిమాటికి పెంపొందింపజేస్తున్నారు. ఆయన యుద్ధప్రస్థాన సమయంలో వేల, లక్షల కోట్ల గంధర్వులు వివిధమయిన వాద్యాలను వాయించారు. రథాన్ని ఎక్కి, వరదాత అయిన శంకరుడు అసురుల వైపు వెళ్ళాడు. విశ్వనాథు డయిన ఆయన బ్రహ్మకు సాధువాదాలు చెపుతూ, నవ్వుతూ ఇలా అన్నాడు. "దేవా! పద. దైత్యులవైపు సావధానంగా గుర్రాలను తోలు. యుద్ధంలో శత్రువులను సంహరిస్తున్న నా బాహుబలం నేడు చూడు. రాజా! దైత్యులు, దానవులు రక్షించే త్రిపురాల వైపు బ్రహ్మ మనస్సుతో, వాయువుతో సమానవేగం గల అశ్వాలను తోలాడు. లోక పూజితా లయిన ఆ హయాలు ఆకాశాన్ని త్రాగుతున్న ట్లున్నాయి. ఆ రథం మీద శివదేవుడు దేవతలకు విజయం కలిగించటానికి బయలుదేరాడు. శంకరుడు రథంమీద ఉండి, త్రిపురాలకు అభిముఖంగా వెళ్ళుతుండగా, నందీశ్వరుడు దిక్కులు పిక్కటిల్లేటట్లు, పెద్ద ధ్వని వచ్చేటట్లు రంకె వేశాడు. మహాభయంకర మయిన వృషభం వేసిన రంకెను విని, దేవశత్రువు లయిన తారకు లనే పేరు గలవారు నశించారు. మహారాజా! ఇతర దైత్యులు యుద్ధాభిముఖులై అక్కడ ఉన్నారు. శూలధారి అయిన శంకరుడు క్రోధ పరవశు డయ్యాడు. సమస్త ప్రాణులు భయపడ్డాయి. ముల్లోకాలు, భూమి కంపించాయి. ఆయన ధనుస్సులో బాణం సంధించగా, చంద్రుడు, అగ్ని, విష్ణువు, బ్రహ్మ, రుద్రుడు క్షోభించారు. మహాభయంకరంగా అపశకునాలు కలిగాయి. ధనుస్సు క్షుబ్ధంకాగా, భూమి అత్యంతం శిథిలం అయింది. క్రుంగింది. అప్పుడు నారాయణుడు ఆ బాణ భాగంనుంచి

ఇవతలకు వచ్చి, వృషభరూపం దాల్చి మహారథాన్ని పైకి, ఎత్తాడు. రథం శిధిలం అవుతుండగా, శత్రువులు గర్జిస్తుండగా, మహాబలు డయిన శివభగవానుడు చాలా వేగంగా గర్జించాడు. నరోత్తమా! అప్పుడాయన వృషభం శిరస్సు మీద, గుర్రంవీపు మీద ఉన్నాడు. వృషభహయాల మీద ఉన్న భగవాను డయిన రుద్రుడు దానవుల పట్టణాన్ని చూశాడు. అప్పుడాయన వృషభం గిట్టను రెండుగా చీల్చాడు. అశ్వాల స్తనాలను కోసి వేశాడు. రాజా! నీకు మేలు కలుగుగాక ! అప్పటినించి గోవులకు గిట్టలు రెండుగా చీలి ఉండేవి. అద్భుత కార్యాలు చేసేవాడు, బలవంతుడు అయిన రుద్రునిచే పీడితాలయిన గుర్రాలకు స్తనాలు లేవు.

అంతట శర్వుడు ధనుస్సుకు నారి ఎక్కించి, బాణాన్ని సంధించి, దానిలో పాశుపతాస్త్రాన్ని కలిపి, త్రిపురాలు ఏకం కావాలి అని ధ్యానించాడు. మహారాజా! రుద్రుడు విల్లునెత్తి నిలువగా, కాలప్రేరణ వల్ల పురత్రయం ఒకటి అయ్యాయి. మూడూ ఏకమయి త్రిపురత్వాన్ని పొందగా, మహాత్ములు అయిన దేవతలకు పరమానందం కలిగింది. అప్పుడు దేవతల సమూహాలు, సిద్ధులు, మహర్షులు మహేశ్వరుని స్తుతిస్తూ, జయజయధ్వానాలు చేశారు. సహించరాని తేజస్సు కలవాడై, ఇలాంటిది అని చూపటానికి వీలులేని భయంకర తేజస్సు గల పరమేశ్వరుడు, అసురులను సంహరిస్తుండగా, ఆయన ఎదుట పురత్రయం ప్రకటం అయింది. లోకేశ్వరు డయిన భగవానుడు దివ్యమయిన ఆ ధనుస్సును బాగా లాగి, త్రిలోకసార మయిన ఆ బాణాన్ని, త్రిపురాలను గురిచూసి, వదిలాడు. ధర్మాత్మా! ఆ ఉత్తమబాణాన్ని ప్రయోగించగా, పడిపోతున్న పురాలలోనుంచి తీవ్రమయిన ఆర్తనాదం విన్పించింది. ఆయన ఆ అసుర సమూహాలను దగ్ధం చేసి, పడమటి సముద్రంలో పారవేశాడు. ఈ రీతిగా క్రుద్ధుడయిన మహేశ్వరుడు ముల్లోకాల మేలును కోరి, త్రిపురాలను, విశేషంగా దానవులను మాడ్చివేశాడు. ఆయన తన క్రోధం వల్ల ఆవిర్భవించిన వహ్నిని **హోహో** అని పలికి, 'సర్వలోకాలను భస్మం చేయవద్దు' అని ఆ క్రోధాగ్నితో అన్నాడు. అంతట దేవతలు, జనులు, మహర్షులు స్తిమితపడి, సాటిలేని పరాక్రమవంతు డయిన శివుని; శ్రేష్ఠమయిన వాక్కుతో స్తుతించారు. పరమేశ్వరుని అనుజ్ఞ పొంది, తమ కోర్కెలు తీరగా ప్రజాపతి మొదలయిన దేవతలు అందరూ వచ్చిన త్రోవనే వెళ్లారు. ఈ రీతిగా లోక సృష్టికర్త అయిన మహేశ్వరుడు లోకాలకు మేలు కలిగించాడు.

విశ్వవిధాత, పితామహుడు, భగవానుడు,, పరముడు, అవినాశి అయిన బ్రహ్మ రుద్రునికి సారథ్యం చేసినట్లే, నీవు కూడా, మహా మనస్వి అయిన రాధేయుని గుర్రాల పగ్గాలను పట్టుకొని, సారథ్యం చేయవలసింది. రాజశ్రేష్ఠా ! నీవు, కృష్ణునికంటే, కర్ణుని

కంటే, విశేషించి అర్జునుని కంటే చాలా గొప్పవాడివి. ఆ విషయంలో వేరే ఆలోచన లేదు. యుద్ధంలో ఈ కర్ణుడు రుద్రునితో సముడు. నీతిలో నీవు బ్రహ్మసముడివి. కాబట్టి ఆయన అసురులనువలె, నా శత్రువులను జయించ నీవు సమర్థుడివి. శల్యా! ఇవ్వాళ ఈ కర్ణుడు, తెల్ల గుర్రాలు గలిగి, కృష్ణుడు సారథ్యంలో సాగే అర్జునుని త్వరగా చంపే రీతిని కల్పించు. మద్రాధిపా! నా రాజ్యాశ, జీవితాశ నీ మీదనే ఆధారపడి ఉన్నాయి. నీవు కర్ణునికి సారథ్యం చేయటం మీదనే, ఆయన విజయం కూడా ఆధారపడి ఉంది. కర్ణుడు, రాజ్యం, మేము, విజయం అన్నీ నీమీదనే నిలిచి ఉన్నాయి. కాబట్టి ఇవ్వాళ యుద్ధభూమిలో కర్ణుని రథాశ్వాలను నీ వశం చేసుకో.

మళ్ళీ ఇంకొక ఇతిహాసం చెపుతాను విను. పూర్వం ధర్మవేత్త అయిన ఒక బ్రాహ్మణుడు నా ఎదుట మా తండ్రితో ఇది చెప్పాడు. శల్యా! కారణకార్యయుక్తమై విచిత్రమయిన ఈ ఇతిహాసాన్ని విని, బాగా ఆలోచించుకొన్న తరువాతనే నా పని చేసిపెట్టు. ఈ విషయంలో ఇంకో విధంగా ఆలోచించవద్దు. మహాయశస్వి అయిన జమదగ్ని భార్గవుల వంశంలో జన్మించాడు. ఆయన పుత్రుడు తేజస్సు, గుణాలతో గూడిన పరశురాముడు అనే పేరుతో ప్రసిద్ధుడు. ఆయన అస్త్రసంపాదన కోసం, నిర్మలమనస్సుతో నియమాలను పాటించి, ఇంద్రియాలను అదుపుచేసుకొని, తీవ్రంగా తపస్సు చేసి, పరమేశ్వరుని ప్రసన్నుని చేసుకొన్నాడు. ఆ మహాదేవుడు ఆయన భక్తికి, శాంతికి సంతుష్టుడై, ఆయన మనస్సులోనిది తెలుసుకొన్నాడు. అందరికి సుఖం కలిగించే మహాదేవుడు - శంకరుడు ఆయనకు ప్రత్యక్షం అయ్యాడు. మహేశ్వరుడు అన్నాడు - 'రామా! నీకు శుభం కలుగుగాక ! నీ తపస్సుకు సంతుష్టుడ నయ్యాను. నీ కోరిక నాకు తెలిసింది. నీవు హృదయం నిర్మలం చేసుకో. కోరింది అంతా నీకు లభిస్తుంది. నీవు పరమ పవిత్రుడివి అయినంతనే నీకు అస్త్రాలను ఇస్తాను. భృగువంశీయా! అయోగ్యుడు, అసమర్థుడు అయినవానిని అస్త్రాలు దగ్ధం చేస్తాయి.' శంకరుడు ఇలా చెప్పగా, ఆయనకు తలవంచి, నమస్కరించి, పరశురాముడు ఇలా అన్నాడు. "దేవాధిపుడి వయిన నీవు, నన్ను అస్త్రాలను ధరించ పాత్రునిగా అనుకొన్నపుడే, సేవకుడి నయిన నాకు దివ్యాస్త్రాలను ఇయ్యవలసింది."

దుర్యోధనుడు చెప్పాడు - "తరువాత ఆయన అనేక సంవత్సరాల పాటు తపస్సు, ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం, పూజ, ఉపహారం, కానుకలు, హోమం, మంత్రజపం మున్నగు సాధనాలతో శంకరుని ఆరాధించాడు. భార్గవుని యెడల ప్రసన్నుడయిన మహాదేవుడు పరశురాముని గుణగణాలను పరమేశ్వరి ఎదుట అనేకవిధాల మెచ్చుకొన్నాడు. 'దృఢమయిన వ్రతానుష్ఠానం గల పరశురాముడు నా యందు భక్తిగలవాడు.' ఈ

విధంగా శత్రునాశకుడయిన శంకరుడు దేవతలు, పితృదేవతల ఎదుట ఆయన గుణాలను అనేక రీతుల ప్రశంసించాడు. ఇదే సమయంలో దైత్యులు మహాబలవంతులు అయ్యారు. దర్పమోహాదులతో గూడిన వారు దేవతలను బాధించసాగారు. అప్పుడు దేవతలందరు వారిని చంపివేయ దృఢనిశ్చయం చేసుకొని, శత్రువులను వధించటానికిగట్టి ప్రయత్నం చేశారు. కాని వారిని ఓడించనే లేకపోయారు. అంతట దేవతలు పార్వతీపతి అయిన మహేశ్వరుని సమీపించి, భక్తితో ప్రసన్నుని చేసుకొని, శత్రుసమూహాన్ని జయించవలసిందని కోరారు. అప్పుడు శంకరుడు శత్రునాశం చేస్తానని దేవతలకు మాట ఇచ్చాడు. భృగువంశీయుడయిన రాముని పిలిచి ఇలా అన్నాడు. 'భార్గవా! లోకానికి హితం కోసం, నా ప్రీతికోసం కలిసివచ్చిన దేవశత్రువులను వధించు.' అని చెప్పగా, ప్రభువయిన ముక్కంటితో పరశురాముడు ఇలా అన్నాడు. పరశురాముడు అన్నాడు - "దేవేశా! అస్త్రవిద్యాభ్యాసం లేని నాకు, యుద్ధమదమత్తులు, అస్త్రవిద్యావిశారదులు అయిన దానవులను అందరిని చంపటానికి సామర్థ్యం ఏమున్నది?" మహేశ్వరుడు అన్నాడు - "రామా! నా అనుమతిని పొంది నీవు వెళ్ళు. శత్రువులను సంహరించగలవు."

పరమేశ్వరుని ఈ మాట విని, పూర్తిగా తలదాల్చి, పరశురాముడు మంగళాశాసనాలు పొంది, దానవులమీదికి వెళ్ళాడు. మహాదర్పం, బలంగల దానవులతో ఇలా అన్నాడు. 'యుద్ధమదంతో కన్నుగానని దైత్యులారా! నాకు యుద్ధాన్ని ఇవ్వండి. మహాసురులారా! మిమ్ములను జయించటానికి దేవదేవుడు శంకరుడు పంపాడు.' అని భార్గవరాముడు అనగా, దైత్యులు యుద్ధం ప్రారంభించారు. భార్గవ నందనుడు ఆ దైత్యులను యుద్ధంలో సంహరించాడు. పోరులో వజ్రాయుధంతో, పిడుగులతో సమానమయిన దానవుల దెబ్బలతో ద్విజోత్తముడయిన భార్గవుని శరీరం బాగా గాయపడ్డది. పరమేశ్వరుడు స్పృశింపగా వెంటనే ఆయన శరీరం మీది గాయాలు మటుమాయం అయ్యాయి. ఆయన వీరకృత్యానికి శంకరుడు ప్రీతుడయ్యాడు. మహాత్ముడయిన భార్గవరామునికి ఆయన అనేక విధాలయిన వరాలు ఇచ్చాడు. ప్రీతిపూర్ణుడై, దేవదేవుడయిన శూలి ఇలా అన్నాడు. 'భృగునందనా! దానవుల శస్త్రాలు తగలటం చేత నీ శరీరంలో కలిగిన బాధవలన నీ మానవోచిత కర్మ నశించింది. (ఇప్పుడు నీవు దేవతుల్యుడివి అయ్యావు.) నీకు కావలసిన దివ్యాస్త్రాలను నానుండి తీసుకో.'

దుర్యోధనుడు చెప్పాడు - 'తరువాత మహాతపస్వి రాముడు తాను మనస్సులో కోరుకొన్న సమస్త అస్త్రాలను, నానావిధా వరాలను పొంది, తలవంచి, శివునికి నమస్కరించి, ఆయన అనుమతిని పొంది వెళ్ళాడు. ఈరీతిగా ఆ ఋషి పూర్వం జరిగింది చెప్పాడు.

పురుష శ్రేష్ఠా! పరశురాముడు మహాత్ము డయిన కర్ణునికి, సంతోషపూర్ణ మనస్కు డయి దివ్యమయిన ధనుర్వేదం ఇచ్చాడు. రాజా! కర్ణునిలో ఏదయినా పాపం ఉంటే, పరశురాముడు ఈయనకు దివ్యాస్త్రాలను ఇచ్చేవాడు కాదు. కర్ణుడు సూతవంశంలో పుట్టాడని నేను ఎప్పుడూ అనుకోలేదు. క్షత్రియ వంశంలో జన్మించిన దేవపుత్రుడు ఈయన, అని నేను అనుకొంటాను. ఇతని తల్లి తన రహస్య ప్రవర్తనను దాచి పెట్టుకోటానికి, ఇతనిని అన్యకులంవాడినిగా ప్రసిద్ధుని చేయటానికి సూతకులంలో వదలి ఉంటుందని అనుకొంటాను. శల్యా! ఈ కర్ణుడు సూతకులంలో పుట్టినవాడు కాదు. సహజ కవచకుండలాలు గలవాడు. దీర్ఘబాహుడు, మహారథుడు, సూర్య సదృశుడు ఈయన. లేడి కడుపున పెద్దపులి పుడుతుందా? రాజేంద్రా! ఏనుగు తొండాల్లాగా బలిసిన ఈయన భుజాలు ఉన్నాయి చూడు. సర్వశత్రువులను నాశనం చేసేది ఈయన వక్షఃస్థలం. ఈ కర్ణుడు ఇక సామాన్యుడు ఏమాత్రం కాడు. భార్గవరాముని శిష్యుడు, ప్రతాపవంతుడయిన ఈయన మహాత్ముడే గదా!

35. శల్యుడు కర్ణరథ సారథ్యమునకు అంగీకరించుట.

దుర్యోధనుడు చెప్పాడు – "రాజా! ఈరీతిగా సర్వలోకాలకు తాత, భగవంతుడు, దేవుడు అయిన బ్రహ్మ సారథ్యం చేశాడు. రుద్రుడు రథికు డయ్యాడు. వీరా! రథికునికన్న చాలా ఎక్కువ వానిని రథసారథిని చేయాలి. కాబట్టి పురుషశ్రేష్ఠా! యుద్ధంలో కర్ణరథాశ్వాలను నియంత్రించు. దేవసమూహాలు ప్రయత్నం చేసి, బ్రహ్మదేవుని సారథిగా వరించినట్లు, మేము కూడా, ప్రయత్నపూర్వకంగా కర్ణునికంటె గొప్పవాడివయిన నిన్ను వరించాం. మహారాజా! దేవతలు ఈశ్వరునికంటె అధికు డయిన పితామహుని వరింపగా, ఆయన సారథ్యం చేసినట్లు, మహా తేజస్వీ! నీవు కూడా రాధేయుని గుర్రాలను యుద్ధంలో నియంత్రించు." శల్యుడన్నాడు – "నరశ్రేష్ఠా! శంకరునికి బ్రహ్మదేవుడు సారథ్యం చేయటం, శివుడు ఒకే బాణంతో త్రిపురాలను ధ్వంసం చేయటం అనే మానవాతీతవృత్తాంతాన్ని, దేవ శ్రేష్ఠుల విషయాన్ని పెద్దలు, విద్వాంసులు చెప్పగా విన్నాను. భగవంతుడు బ్రహ్మసారథి అయిన పురాతన వృత్తాంతం అంతా శ్రీకృష్ణునికి కూడా తెలిసే ఉంటుంది. జరిగింది, జరగబోయేది యథార్థంగా శ్రీకృష్ణునికి తెలుసు. ఈ విషయం తెలిసికూడా శ్రీకృష్ణుడు రుద్రునికి బ్రహ్మవలె, అర్జునునికై సారథ్యం స్వీకరించాడు. ఒకవేళ సూతపుత్రుడు అతికష్టం మీద అర్జునుని సంహరిస్తే, శంఖచక్ర గదా హస్తుడయిన కేశవుడు పార్థుని మృతిని

చూసి, స్వయంగానే యుద్ధం చేస్తాడు. నీ సేనను దగ్ధం చేస్తాడు. శ్రీకృష్ణుడు కోపిస్తే శత్రుసేనలలో నీవాడయిన ఒక్కరాజు కూడా నిలువలేడు."

సంజయుడు చెప్పాడు – "ఆ విధంగా మాట్లాడుతున్న శల్యునితో, దైన్యంలేని మనస్సు గల నీ సుతుడు ఇలా అన్నాడు. "మహాబాహూ! సర్వశాస్త్రాలు తుదముట్టనేర్చినవాడు, యుద్ధంలో సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడు, వైకర్తను డయిన కర్ణుని అవమానించకు. భయంకరమూ, మహత్తరమూ అయిన ఆయన అల్లెత్రాటి ధ్వని విని, పాండవసైన్యాలు పది దిక్కులకు పారిపోతాయి. మహాబాహూ ! రాత్రియుద్ధంలో మాయావి ఘటోత్కచుడు, మాయ లనేకం చేస్తుంటే కర్ణుడు చంపటం నీకు తెలుసుగదా! అర్జునుడు ఎక్కువగా భయపడి ఇన్నాళ్ల వరకూ కర్ణునికి ఎదురు నిలువలేదు. బలిష్ఠ డయిన భీముని, వింటికొనతో పొడిచి యుద్ధానికి ప్రేరేపించాడు. 'మూఢుడా ! అని తిండిపోతూ !' అని చాలా పేర్లతో హేళన చేశాడు. మాన్యా! శూరులయిన మాద్రీపుత్రులను, మహారణంలో ఓడించి కూడా, ఏదో ఒక కారణంవల్ల చంపక వదలివేశాడు. సాత్యకిని కర్ణుడు జయించి, విరథుని చేశాడు. కర్ణుడు యుద్ధరంగంలో నవ్వుతూనే, ధృష్టద్యుమ్నుడు ముందున్న సృంజయులను పలుమారులు ఓడించాడు. కర్ణుడు వజ్రాయుధు డయిన ఇంద్రునే సంహరించగలడు. అలాంటివానిని పాండవులు యుద్ధంలో ఎలా జయించగలరు ? నీవు కూడా సర్వాస్త్రవేత్తవు. సర్వవిద్యావిశారదుడవు. భుజబలంలో నీతో సమానుడు భూమండలంలో ఎవ్వడూ లేడు. రాజా! నీవు శత్రువుల పాలిటి కంటకానివి. పరాక్రమంలో నిన్ను ఎవరూ ఓర్చలేరు. కాబట్టి నిన్ను శల్యుడు అంటారు. రాజా! నీ బాహుబలాన్ని సాత్వత వీరులు అందరూ ఎదుర్కొని నిలువలేకపోయారు. నీ బాహుబలానికంటె శ్రీకృష్ణుడు అధికబలవంతుడా ఏమిటి? అర్జునుడు మరణిస్తే కృష్ణుడు పాండవ సేనలను ఆదుకొన్నట్లే, కర్ణుడు నేలగూలితే, నీవే కౌరవ మహాసేనను ఆదుకోవాలి. సారథ్యం మాత్రమే చేస్తానని ప్రతిజ్ఞ చేసిన శ్రీకృష్ణుడు నా సేనను ఎలా ఎదుర్కొంటాడు ? ఒకవేళ ఆయన అలా చేస్తే, నీవు మాత్రం సారథ్యం వదలి పాండవసేనను ఎందుకు సంహరించవు ? మాన్యా! యుద్ధంలో మరణించిన సోదరుల, వీరుల, రాజులందరి ఋణవిముక్తుడిని కావటానికి నీ ఆధారంతోనే ముందుకు వెళ్ళగోరుతాను."

శల్యుడన్నాడు – "గాంధారీ పుత్రా! నీవు సర్వసైన్యాల ఎదుట, నన్ను శ్రీకృష్ణునికంటె గొప్పవాడనని అంటున్నావు. అందువల్ల నాకు నీ మీద ప్రీతి కలిగింది. కర్ణుడు పాండవ శ్రేష్ఠ డయిన అర్జునునితో యుద్ధం చేసేటప్పుడు నీవు కోరినట్లు సారథ్యం చేస్తాను. కాని కర్ణుడు నేను పెట్టే ఒక షరతును అంగీకరించాలి. నేను నాకు తోచినట్లు మాట్లాడుతాను.

యుద్ధంలో." సంజయుడు చెప్పాడు -" రాజా! నీ పుత్రుడు అందుకు అంగీకరించి, సర్వక్షత్రియుల ఎదుట, కర్ణునితోపాటు ఆ షరతును అంగీకరిస్తున్నట్లు చెప్పాడు శల్యునికి. సారథ్యానికి అంగీకరించి, శల్యుడు ప్రోత్సహించగా దుర్యోధనుడు ఆనందపడి, కర్ణుని కౌగిలించుకొన్నాడు. నీ కుమారుడు ప్రశంసిస్తూ, కర్ణునితో 'మహేంద్రుడు దానవులను వలె, యుద్ధంలో పాండవులను జయించు !' అని అన్నాడు. గుర్రాలను తోలటానికి శల్యుడు అంగీకరించగా, కర్ణుడు ఆనందపూర్ణ మనస్కు డయి దుర్యోధనునితో మళ్ళీ ఇలా అన్నాడు. "రాజా! ఈ శల్యుడు సంతోషంగా, ఉత్సాహంగా మాట్లాడటం లేదు. కాబట్టి మళ్ళీ మధురవచనాలు ఈయనకు చెప్పు. అప్పుడు మహామేధావి అయిన దుర్యోధనుడు మేఘ గంభీరమయిన కంఠంతో, శల్యునితో మళ్ళీ ఇలా అన్నాడు. "శల్యా! కర్ణుడు ఇవ్వాళ అర్జునునితో యుద్ధం చేయాలని అనుకొంటున్నాడు. పురుషశ్రేష్ఠ ! యుద్ధంలో నీవు ఆయనకు సారథ్యం చెయ్యి. రాజా! కర్ణుడు ఇతరులను అందరిని చంపి, అర్జునుని చంపగోరుతున్నాడు. ఆయన రథాశ్వాల పగ్గాలు పట్టుమని నిన్ను మళ్ళీ మళ్ళీ యాచిస్తున్నాను. అర్జునునికి శ్రీకృష్ణుడు శ్రేష్ఠుడయిన సలహాదారు, సారథి అయినట్లే నీవు కర్ణుని అన్ని విధాలా కాపాడు." సంజయుడన్నాడు - అప్పుడు సంప్రీతుడయిన శల్యుడు నీ పుత్రు డయిన దుర్యోధనుని కౌగిలించుకొని ఇలా అన్నాడు. శల్యుడన్నాడు - రాజా! ఇలా నీవు భావిస్తే నీకు ఇష్టమయింది అంతా తప్పక చేస్తాను. భరతశ్రేష్ఠా! ఎక్కడయినా, ఎప్పుడయినా నీవు నేను చేయదగిన పనిలో నియోగిస్తే నిండు మనస్సుతో ఆ కార్యభారాన్ని తప్పక వహిస్తాను. కర్ణుని మేలుగోరి ఇష్టమయినవి కాని, ఇష్టంకాని మాటలు కాని, నేను మాట్లాడితే నీవు గాని కర్ణుడు గాని వాటినన్నింటిని క్షమించాలి." కర్ణుడు అన్నాడు - "మద్రరాజా! శంకరునికి బ్రహ్మవలె, అర్జునునికి శ్రీకృష్ణునివలె నీవు మాకు నిత్యం హితం చేస్తూఉండు."

శల్యుడన్నాడు - "ఆత్మనింద, ఆత్మస్తుతి, పరనింద, పరస్తుతి అనే ఈ నాలుగు రీతుల ప్రవర్తనను ఉత్తమ పురుషులు ఎప్పుడూ అనుసరించలేరు. కాని విద్వాంసుడా! నీకు విశ్వాసం కలిగించటం కోసం, ఆత్మప్రశంసా పూర్వకాలయిన మాటలు అంటే వాటిని నీవు యథార్థంగానే భావించాలి. ప్రభూ! నేను పొరపడకపోవటంలో, గుర్రాలను నడపటంలో, జ్ఞానంలో, విద్యలో, అశ్వవైద్యంలో ఇంద్రుని సారథ్యంలో మాతలిలాంటి యోగ్యుడిని. కాబట్టి అనఘా! సూతపుత్రా! యుద్ధభూమిలో అర్జునునితో యుద్ధం చేస్తున్న నీ రథసారథ్యం చేస్తాను కాబట్టి నిశ్చింతగా ఉండు."

36. కర్ణుని యుద్ధ ప్రయాణము.

దుర్యోధనుడు అన్నాడు - 'కర్ణా! దేవేంద్రునికి మాతలివలె శ్రీకృష్ణునికంటె చాలాగొప్ప సారథి అయిన ఈ శల్యుడు నీకు సారథ్యం చేస్తాడు. మాతలి ఇంద్రుని రథం పగ్గాలను పట్టుకొన్నట్లు, శల్యుడు నేడు నీ రథాశ్వాలను అదుపుచేస్తాడు. యోద్ధవయిన నీవు రథం మీద ఉండగా, శల్యుడు సారథిగా ఉండగా మీ శ్రేష్ఠరథం యుద్ధంలో పాండవులను పరాజయంపాలు చేస్తుంది.' సంజయుడు చెప్పాడు - "రాజా! తరువాత దుర్యోధనుడు మరునాడు ఉదయం యుద్ధం ప్రారంభంకాగా శల్యునితో మళ్ళీ ఇలా అన్నాడు. 'మద్రరాజా! యుద్ధంలో కర్ణుని ఉత్తమాశ్వాలను వశం చేసుకో. నీ రక్షణలో రాధేయుడు అర్జునుని జయిస్తాడు.' భారతా! ఇలా చెప్పిన తరువాత రథాన్ని స్పృశించి, 'అలాగే' అన్నాడు. శల్యుడు సారథ్యానికి పూర్తిగా అంగీకరించగా, కర్ణుడు ప్రసన్న చిత్తుడయి సారథితో 'సూతా! నా రథాన్ని త్వరగా సిద్ధం చెయ్యి' అని పలుమారులు చెప్పాడు. అప్పుడు సారథి జయశీలమై, గంధర్వ నగరంలాగా విశాలమై యథావిధిగా సిద్ధమై, మంగలకరమయిన రథాన్ని చూపి 'స్వామీ! మీకు జయం ! రథం, సిద్ధం' అని చెప్పాడు. వేదవేత్త అయిన పురోహితుడు ముందుగా మంగళకార్యాలు నిర్వర్తించాడు. రథికశ్రేష్ఠుడయిన కర్ణుడు రథాన్ని యథావిధిగా పూజించి, దానికి ప్రదక్షిణం చేసి, శ్రద్ధా పూర్వకంగా సూర్యోపస్థానం చేసి, సమీపంలో ఉన్న శల్యునితో రథం ఎక్కమన్నాడు. ఆ తరువాత దుర్జయమూ, విశాలమూ, శ్రేష్ఠమూ అయిన కర్ణ రథాన్ని, మహా తేజస్వి అయిన శల్యుడు సింహం పర్వతం ఎక్కినట్లు ఎక్కాడు. శల్యుడు తన ఉత్తమరథం ఎక్కటం చూసి, కర్ణుడు మెరుపుతో గూడిన మేఘాన్ని సూర్యునివలె అధిరోహించాడు. సూర్యాగ్నులతో సమాన తేజస్సుగల వారిద్దరు ఒకే రథాన్ని ఎక్కి, ఆకాశంలో మేఘం పయినున్న సూర్యాగ్నులవలె విరాజిల్లారు.

తేజోవంతులలో సర్వోత్తము లయిన ఆ వీరులు ఇద్దరూ, వంది మాగధులు స్తుతిస్తుండగా, యజ్ఞంలో ఋత్విక్కులు, సదస్యుల స్తుతులుపొందే ఇంద్రాగ్నులవలె శోభించారు. శల్యుడు పగ్గాలు పట్టుకొన్న రథం మీద ఉన్న కర్ణుడు ఘోరమయిన ధనుస్సును లాగుతూ, పరివేషం గల సూర్యునివలె ప్రకాశించాడు. రథంమీద ఉన్న కర్ణుడు బాణాలు అనే కిరణాలతో, మందర పర్వతం మీద ఉన్న భాస్కరునివలె మిక్కిలిగా విలసిల్లాడు. యుద్ధం చేయటానికి రథంమీద ఉన్న కర్ణుని చూసి, దుర్యోధనుడు ఇలా అన్నాడు. 'మహావీరా! కర్ణా! ఇంతకుముందు ద్రోణభీష్ములు చేయని దుష్కర కార్యాన్ని, యుద్ధభూమిలో విలుకాండ్రు అందరు చూస్తుండగా నీవు చేసి చూపించు. భీష్మద్రోణులు

అర్జునభీములను తప్పక చంపుతారని నాకు మనస్సులో గట్టి నమ్మకం ఉండేది. రాధేయా! మహాయుద్ధంలో వారు చేయని పనిని, అపరదేవేంద్రునిలాగా నీవు చేయవలసింది. రాధేయా! ధర్మరాజును పట్టుకో. అర్జునుని, భీముని, నకుల సహదేవులను సంహరించు. నీకు జయమగుగాక, మేలు కలుగుగాక, బయలుదేరు, యుధిష్ఠిరుని సైన్యాలను అన్నింటిని భస్మం చెయ్యి.' అప్పుడు మ్రోగిస్తున్న వేలకొలది తూర్యాలు, పదివేల భేరుల మ్రోతలు ఆకాశంలో మేఘ గర్జనలవలె విరాజిల్లాయి.

కర్ణుడు రథస్థుడయి దుర్యోధన వచనం స్వీకరించి శల్యునితో ఇలా అన్నాడు. 'మహాబాహూ! గుర్రాలను తోలు, అర్జునుని, భీముని, నకుల సహదేవులను, యుధిష్ఠిరుని వధిస్తాను. శల్యా! గ్రద్ద ఈకలు గల వందలు, వేల కొలది బాణాలను ప్రయోగించే నా బాహుబలాన్ని అర్జునుడు ఇవ్వాళ చూచుగాక. శల్యా! పాండవుల వినాశనానికి, దుర్యోధనుని విజయానికి మిక్కిలి పదునయిన బాణాలను ఇవ్వాళ నేను ప్రయోగిస్తాను.' శల్యుడన్నాడు - 'సర్వాస్త్రపరిజ్ఞానం గలవారు, మహాధానుష్కులు, మహాబలులు, వెనుదిరుగనివారు, మహాభాగులు, జయించవీలుగాని వారు, సత్యపరాక్రములు అయిన పాండవులను సూతపుత్రా! నీవు ఎలా అవమానించగలవు? వారు సాక్షాత్తు ఇంద్రునికి కూడా మనస్సులో భయం కలిగించగలరు. రాధాకుమారా! యుద్ధభూమిలో పిడుగుపడేటప్పటి ఉరుముల వంటి గాండీవధ్వనిని విన్న తరువాత ఇలా అనలేవు. యుద్ధంలో భీముడు ఏనుగుల సమూహాన్ని దంతాలను విరగగొట్టి, చంపివేయటం చూసినప్పుడు ఇలా మాటాడవు. యుద్ధభూమిలో యుధిష్ఠిర నకులసహదేవులు పదునయిన బాణాలతో ఆకాశంలో మేఘాలు క్రమ్మినప్పటి స్థితిని కల్పించటం చూచినప్పుడు; చేయి తిరిగినవారు, దుర్జయులు అయిన ఇతర శత్రుపక్షరాజులను బాణాలు వేసి వధిస్తూఉండటం చూచినప్పుడు ఇలాంటి మాటలు నీనోటివెంట రావు.'' సంజయుడు చెప్పాడు - "మద్రదేశాధిపతి అన్న మాటలను పట్టించుకోకుండా కర్ణుడు శల్యుని "పద, పద" అన్నాడు."

37. కౌరవులకు అపశకునములు గలుగుట. కర్ణుని ఆత్మస్తుతి - శల్యుని అపహాస్యము.

సంజయుడు చెప్పాడు - "కర్ణుడు యుద్ధం చేయగోరి నిలిచి ఉండటం చూసి, కౌరవులు అందరూ సంతోషపరవశు లయి కోలాహలం చేయసాగారు. అప్పుడు మీవారు అందరూ దుందుభుల ధ్వనులతో, భేరీభాంకారాలతో, బాణ శబ్దాలతో, నానావిధ గర్జనలతో, మృత్యువే మనలను యుద్ధంనుండి మళ్ళించాలి అని నిశ్చయం చేసుకొని

యుద్ధానికి బయలుదేరారు. రాజా! ఆ రీతిగా కర్ణుడు బయలుదేరగా, యోధులు సంతోషపూర్ణులు కాగా భూమి కంపించింది. చాలా ఎక్కువగా అవ్యక్తధ్వని చేసింది. ఆ సమయంలో సూర్యమండలం నుంచి సప్తమహాగ్రహాలు బయటకు వస్తూ కన్పించాయి. ఉల్కాపాతం అయింది. దిక్కులలో మంటలు వచ్చినట్లు అయింది. వర్షం లేకుండానే పిడుగులు పడ్డాయి. భయంకరంగా గాలులు వీచాయి. మృగాలూ పక్షులూ మహాభయాన్ని సూచిస్తూ పలుమారులు మీ సేనకు అప్రదక్షిణంగా తిరిగాయి. యుద్ధానికి బయలుదేరిన కర్ణుని గుర్రాలు నేలమీద పడ్డాయి. భయంకరమయిన అస్థివర్షం అంతరిక్షం నుంచి పడ్డది. శస్త్రాలు జ్వలించాయి. ధ్వజాలు కంపించాయి. గుర్రాలు కన్నీరు కార్చాయి. అక్కడ ఆ సమయంలో కౌరవుల వినాశానికి సూచనగా ఇవే కాకుండా, ఎన్నో దారుణమయిన, అపశకునాలు కలిగాయి. విధిచేత మోహితులయిన మనవారు అందరూ ఆ అపశకునాలను లెక్కచేయలేదు. యుద్ధానికి బయలుదేరిన కర్ణునికి రాజులు జయజయధ్వానాలు చేశారు. అక్కడ కౌరవులు పాండవులను జయించామనే అనుకొన్నారు. అప్పుడు ప్రకాశిస్తున్న సూర్యాగ్నుల వంటి కర్ణుడు రథం మీద ఉండి, భీష్మద్రోణుల పరాక్రమం అస్తమించటం చూసి, అర్జునుని మహత్కార్యాలను గుర్తుచేసుకొని, అభిమానంతో, దర్పంతో దగ్ధుడవుతూ, క్రోధంతో మండిపోతూ, దీర్ఘమయిన నిట్టూర్పులు విడుస్తూ, శల్యుని పిలిచి ఇలా అన్నాడు.

"ఆయుధాలు ధరించి రథంమీద ఉన్న నేను, వజ్రాయుధం చేత దాల్చి, క్రుద్ధు డయిన ఇంద్రునికి కూడా భయపడను. భీష్మప్రముఖులు నేల గూలటం చూసి కూడా నాకు ఆందోళన ఏమీ కలుగదు. ఇంద్రునితో, విష్ణునితో సమానులు, ప్రశంసాపాత్రులు అయిన భీష్మద్రోణులనే శత్రువులు చంపగా ఇక నేనెంత? అని అనుకొన్నా నాకు ఇవ్వాళ యుద్ధభూమిలో జంకు గొంకులు లేవు. యుద్ధంలో మహాబలులయిన రాజులను, సూతులు, ఏనుగులు, రథాలతో కూడా ఇతరులు చంపిన శత్రువులను చూసి కూడా మహాస్త్రవేత్త, గురువు అయిన ద్రోణుడు శత్రువుల నందరిని యుద్ధంలో వధించలేదు ఎందుకు? కురువీరులారా? ఆ ద్రోణుని స్మరించి నేను సత్యం చెపుతున్నాను. తెలుసుకోండి. ఉగ్రరూపి అయిన మృత్యువు వలె, యుద్ధంలోకి వచ్చిన అర్జునుని నాకంటే ఇతరుడు ఓర్వలేడు. విద్యలో పొరపాటు లేకపోవటం, బలం, ధైర్యం, మహాస్త్రాలు, వినయం, ద్రోణునిలో ఉన్నాయి. మహాత్ము డయిన ఆయనయే మృత్యువశుడయినాడనగా, ఇతరులు అందరూ మరణాసన్నులే అని అనుకొంటాను. బాగా ఆలోచించినా కర్మ అనిత్యం కావటం వల్ల, ఈ లోకంలో ఏ వస్తువూ నిత్యం అని అనుకోను, ద్రోణాచార్యుడే హతుడు

కాగా, ఇతరుడు ఎవడు నిస్సందేహంగా రేపు ప్రొద్దుటిదాకా బ్రతికి ఉంటాను అని దృఢంగా నమ్మగలడు ? అస్త్రాలు గాని, బలంగాని, పరాక్రమం గాని, ఉత్తమ కార్యాలు గాని, ఉత్తమ నీతిగాని, ఉత్తమాయుధాలు గాని మానవుడు సుఖంగా ఉండటానికి చాలవు. ఇవి అన్నీ ఉన్న ద్రోణుని యుద్ధంలో శత్రువులు సంహరించారు గదా! అగ్నితో, సూర్యునితో సమానతేజోవంతుడు, పరాక్రమంలో విష్ణుమహేంద్ర తుల్యుడు, నీతిలో బృహస్పతి, శుక్రసముడు అయిన ద్రోణుని దుస్సహమయిన ఏ అస్త్రమూ రక్షించలేదు గదా! శల్యా! ద్రోణుని మరణం తరువాత అన్నివైపుల నుంచి హాహాకారాలు విన్పించగా, స్త్రీ బాలవృద్ధులు రోదిస్తుండగా, దుర్యోధనుని పురుషకారం అణిగిపోయింది.

అందువల్ల, ఇప్పుడు దుర్యోధనునికి సహాయపడటం నా ధర్మం కాబట్టి శత్రుసేనవైపు రథం నడుపు. సత్యసంధు డయిన యుధిష్ఠిరుడు, భీమార్జునులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, సృంజయులు నకుల సహదేవులు ఉన్నచోటికి రథం నడుపు. వారిని అందరిని నేను తప్ప ఇంకెవడు ఎదిరించగలడు ? కాబట్టి శల్యా! యుద్ధంలో పాంచాలురు, పాండవులు, సృంజయులు ఉన్నవైపు త్వరగా వెళ్ళు ! యుద్ధంలో ఎదిరించి వాళ్ళనయినా సంహరిస్తాను, లేకపోతే ద్రోణుని త్రోవలో యముని చేరుతాను. శల్యా! ఆ శూరుల మధ్యకు నేను వెళ్ళను అని అనుకోకు. ఇలా చేయటం అనే మిత్రద్రోహాన్ని నేను సహించను. ప్రాణాలు వదలి ద్రోణుని అనుసరించి పోతాను. అయువు తీరిన తరువాత విధ్వంసునికి గాని, మూఢునికి గాని, యముని సత్కారం నుంచి విముక్తి కలుగదు. కాబట్టి విధ్వంసుడా ! పాండవులను ఎదుర్కొంటాను. దైవవిధానాన్ని ఎవరూ వ్యతిరేకించలేరు. దుర్యోధనుడు నా విషయంలో మంగళకరంగా ప్రవర్తిస్తాడు. రాజ్యప్రాప్తి అనే ప్రయోజనం ఆయనకు సిద్ధించటానికై ఇష్టమయిన భోగాలను, విడువరాని జీవితాన్ని కూడా విడిచిపెడతాను. పెద్దపులితోలు కప్పిన, ఉత్తమాశ్వాలు కట్టిన రథాన్ని నాకు గురువరుడు పరశురాముడు ప్రసాదించాడు. దీనికి సువర్ణ మయమయిన మూడు కోశాలు ఉన్నాయి. త్రివేణుకము ఉన్నది. నడిచేటప్పుడు ఇరుసు చక్రాలు ధ్వనిచేయవు. శల్యా! తరువాత ఆయన ఈ రథాన్ని చక్కగా పరిశీలించాడు. చిత్ర మయిన ధనుస్సులను, ధ్వజాలను, గదలను, భయంకరాకారం గల బాణాలను, తేజోవంతమయిన ఖడ్గాన్ని, ఉత్తమాయుధాన్ని, చక్కగా, ఉగ్రంగా ధ్వనించే తెల్లని శంఖాన్ని ఇచ్చాడు. జెండా గలది; పిడుగుపాటు ధ్వనివంటి ధ్వనిగలది; తెల్లని గుర్రాలు గలది; ఉత్తమములయిన అమ్ముల పొదిగల ఈ రథాన్ని అధిరోహించి యుద్ధంలో అర్జునుని వధిస్తాను. ఒకవేళ సర్వం హరించే మృత్యువు, ఎప్పుడూ అప్రమత్తమయి ఆతనిని కాపాడుతుంటే, దాన్నయినా సరే ఎదిరించి చంపుతాను.

లేకపోతే భీష్ముని ముందుంచుకొని యమలోకానికి వెళ్తాను. పలుమాటలు ఎందుకు ? యముడు, వరుణుడు, కుబేరుడు, ఇంద్రుడు అందరూ కలిసి ఒకే మారు యుద్ధంలో తమసేనా సమూహాలతో అర్జునుని రక్షించదలచి ఇక్కడికి వస్తే వారితో సహా అతనిని జయిస్తాను."

సంజయుడు చెప్పాడు - "యుద్ధోత్సాహపూర్ణుడయి, తన గొప్పలు చెప్పుకొంటున్న కర్ణుని మాటలు విని శల్యుడు ఆతనిని అపహసించాడు. ఇంక అలాంటి మాటలు చెప్పవద్దని నిషేధించి ఇలా అన్నాడు. "కర్ణా! ఇక గొప్పలు చెప్పుకోవటం చాలించు. మహా ఉత్సాహం ఉన్నా, మేరమీరి మాట్లాడావు. ఆహా! మానవశ్రేష్ఠ డయిన అర్జును డెక్కడ? మానవాధముడ వయిన నీవెక్కడ ? అర్జునుడు కాకపోతే ఇంకెవడు దేవేంద్ర రక్షితమయిన అమరావతివలె, శ్రీకృష్ణ రక్షితమయిన యదువంశీయుల నగరాన్ని బలపూర్వకంగా మథించి, పురుషశ్రేష్ఠ డయిన శ్రీకృష్ణుని చెల్లెలు సుభద్రను హరించగలడు ? ముల్లోకాలకు ప్రభువైన శంకరుని, అడవిజంతువును సంహరించటంలో కలిగిన వివాదంలో యుద్ధానికి పిలవటం అర్జునుడికి తప్ప ఇంకెవరికి శక్యమవుతుంది ? అగ్నిదేవుని యందు గల గౌరవంతో అర్జునుడు రాక్షసులను, దేవతలను, మహోసర్పాలను, నరులను, గరుడులను, పిశాచులను, యక్షులను, రాక్షసులను బాణప్రయోగంతో జయించాడు. అగ్నిదేవునకు హవిస్సును ఇచ్చాడు. కర్ణా! కురుజాంగలంలో, ఘోషయాత్రా సమయంలో, గంధర్వులు శత్రువులయి దుర్యోధనుని అపహరించినప్పుడు, ఈ అర్జునుడే, యుద్ధంలో సూర్యకిరణ తుల్యాలయిన బాణాలతో, అసంఖ్యాకులయిన శత్రువులను సంహరించి, ధృతరాష్ట్ర పుత్రుని బంధవిముక్తుని చేసిన సంఘటన గుర్తు ఉందా? ఆ యుద్ధంలో మొదట నీవే పారిపోయావు. అప్పుడు పాండవులు గంధర్వులను జయించి, కలహప్రియులయిన ధృతరాష్ట్ర పుత్రులను విడిపించిన విషయం గుర్తుందా? ద్రోణుడు, అశ్వత్థామ, భీష్ముడు ఉన్న ఉత్తర గోగ్రహణంలో, సంతోషపూర్ణమయిన సైన్య, వాహనాలు గల కౌరవులను అర్జునుడు ఓడించాడు గదా! అప్పుడు నీవు అర్జునుని ఎందుకు జయించలేదు? కర్ణా! నీ మరణానికే, ఇదిగో ఇంకొక మహాయుద్ధం వచ్చి పడింది. శత్రుభయంతో యుద్ధంలో నుంచి పరుగెత్తకుండా నిలిస్తే, తప్పక హతుడివి అవుతావు."

సంజయుడు చెప్పాడు - "రాజా! మహా మనస్వి అయిన శల్యుడు ఈ రీతిగా, చాలా పరుషంగా నిందిస్తూ, శత్రువును స్తుతిస్తుంటే తీవ్రంగా రోషపరవశుడై కర్ణుడు మద్రరాజుతో ఇలా అన్నాడు. "అయితే అయిందిలే, ఏమిటీ ఈ ఎత్తిపొడుపు మాటలు? ఆతనికి, నాకూ యుద్ధం జరగబోతోంది. ఆతడు యుద్ధంలో నన్ను జయించగలిగితే,

నీ బడాయి మాటలు నిజం అవుతాయి." "అలాగే కానియ్యి!" అని శల్యుడు ఇంకేమీ మాటాడలేదు. కర్ణుడు యుద్ధకాంక్షతో పద, పద అన్నాడు. సూర్యుడు చీకటిని నాశనం చేస్తున్నట్లు, శ్వేతాశ్వాలు కల్గి, శల్యుడు సారథిగా గల కర్ణరథం శత్రునాశం చేస్తూ ముందుకు సాగింది. అప్పుడు ఉత్సాహ సంతోషపూర్ణుడయిన కర్ణుడు వ్యాఘ్రచర్మం కప్పిన, తెల్లగుర్రాలు గల రథంతో వెళ్ళుతూ పాండవ సేనను చూసి, అర్జునుడు ఎక్కడ ఉన్నా ? డని అడిగాడు."

38. శ్రీకృష్ణార్జునుల ఉనికిని చెప్పినవారికి కర్ణుడు బహుమతులు ఇత్తుననుట.

సంజయుడు చెప్పాడు – "యుద్ధప్రయాణ సమయంలో కర్ణుడు నీ సేనను సంతోషపెడుతూ, అందులో ఉన్న ప్రతివానిని, 'పాండవులు ఎక్కడ ఉన్నారు?' అని అడిగాడు. నాకు ఈరోజు అర్జునుని చూపించినవానికి మనస్సులో కోరుకొన్నంత భూమి ఇస్తాను. అర్జునుని గూర్చి చెప్పినవానికి, ఆది అక్కరలేకపోతే, బండెడు రత్నాలను ఇస్తాను. అర్జునుని చూపించేవానికి అదీ ఇష్టంకాకపోతే, ప్రతిరోజూ పాలిచ్చే నూరు ఆవులను, కంచు పాలపాత్రను ఇస్తాను. అర్జునుని చూపించేవానికి నూరు ఉత్తమగ్రామాలను ఇస్తాను. అర్జునుని ఉనికి చెప్పినవానికి నల్లనికేశపాశాలు గల యువతులు గల్గి, కంచరగాడిదలు పూన్చిన రథాన్ని ఇస్తాను. అర్జునుని చూపించేవానికి ఆ ధనం చాలదనుకొంటే, బంగారు రథం బహూకరిస్తాను. దానికి ఏనుగు బలం గల ఆరు ఎద్దులు పూన్చి ఉంటాయి. దాంతోపాటు వానికి బంగారు నగలు మెడలో ధరించి సర్వాలంకార భూషితలై, గీత వాద్యాలలో నిపుణులు అయిన పదహారేండ్ల పడుచులను బహుమతిగా ఇస్తాను. అర్జునుని చూపేవానికి అదీ సరిపోకపోతే నూరు గ్రామాలను. నూరు ఏనుగులను, వంద బంగారు రథాలను కానుకగా ఇస్తాను. బాగా బలిసినవి, ఉత్తమగుణాలు గలవి, నెమ్మదయినవి, రథాన్ని తేలికగా లాగగలవి, బాగా తరిఫీదు పొందిన పదివేల గుర్రాలను ఇస్తాను. అర్జునుని జాడ చెప్పేవానికి కొమ్ములకు బంగారు తొడుగులు గల్గి, బాగా పాలు ఇచ్చే ఆవులను దూడలతో సహా ఇస్తాను.

అర్జునుని చూపేవానికి అదీ ఇష్టంలేకపోతే అంతకంటే శ్రేష్ఠమయిన ధనాన్ని, బంగారు అలంకారాలు, చక్కని మణిభూషణాలు గల అయిదువందల తెల్లగుర్రాలను బహూకరిస్తాను. అర్జునుడు ఉండే చోటును చెప్పేవానికి రథానికి కట్టటానికి చక్కగా సరిపోయే పదునెనిమిది అశ్వాలను ఇస్తాను. ఉత్తమమయిన కాంబోజదేశీయాశ్వాలను

పూన్చి, స్వచ్ఛమయి, బంగారంతో చేసిన రథం బహూకరిస్తాను. అర్జునుని చూపించేవాడికి అదీ తృప్తికరం కాకపోతే నానావిధాలయిన బంగారు సొమ్ములతో అలంకృతాలై, బంగారు గొలుసులు గలవై, భారతవర్షానికి పశ్చిమానగల అడవులలో పుట్టినవి, గజ శిక్షకులు బాగా తీర్చిదిద్దిన ఆరువందల ఏనుగులను బహుమతిగా ఇస్తాను. అర్జునుని ఉనికిని చూపే వ్యక్తికి ఇంకా ఉత్తమ ధనం ఇస్తాను. వైశ్యులు నివసించేవి, సర్వసమృద్ధాలు, ధనపూర్ణాలు, సమీపంలో అడవులు, జలం గలవి, ఎలాంటి భయాలు లేనివి, రాజభోజ్యాలు అయిన పదునాల్గు గ్రామాలను ఇస్తాను. అర్జునుని గూర్చి తెలిపేవానికి మగధదేశీయులు బంగారు నగలు మెడలో గలవారు, నవయువతులు అయిన వందమంది దాసీలను బహూకరిస్తాను. అర్జునుని చూపేవానికి అదిగూడా ఇష్టంకాకపోతే అతడు కోరినదాన్ని దేన్నయినా స్వయంగా ఇస్తాను. పుత్రులు, స్త్రీలు, విహారవనాలు, ఇంకా నాకు ఉన్న ఇతర ధనంలో ఆతడు మనఃపూర్వకంగా ఏమి అడిగినా ఇస్తాను. శ్రీకృష్ణార్జునులు ఎక్కడ ఉన్నారో చెప్పినవానికి ఆ శ్రీకృష్ణార్జునులను సంహరించి, వారి సంపదలను ఇస్తాను." యుద్ధభూమిలో కర్ణుడు ఇలాంటి చాలా మాటలు చెపుతూ ఉత్తమ శంఖాన్ని పూరించాడు. మహారాజా! కర్ణుడు పలికిన ఆ మాటలను విని, అనుయాయులతో కూడా దుర్యోధనుడు ఆనందించాడు. అప్పుడు అన్నివైపులా నగారాలు మ్రోగినవి. మద్దెలల మ్రోతలు విన్పించాయి. వాద్యధ్వనులు, సింహనాదాలు, ఏనుగుల ఘీంకారాలు విన్పించాయి. నరశ్రేష్ఠా! రాజా! సైన్యాలలో ఆనందపరవశు లయిన యోధుల సింహనాద ధ్వనులు వెలువడ్డాయి. ఇలా హర్షోల్లాసంతో నిండిన సైన్యం మధ్యంలోనుంచి వెళ్లుతూ, ఇంకా గొప్పలు చెప్పుకొంటున్న కర్ణునితో శల్యుడు పెద్దగా నవ్వుతూ ఇలా అన్నాడు.

39. కర్ణుని శల్యుడు ఆక్షేపించుట.

"కర్ణా! బంగారు నగలు గల, ఏనుగుల లాంటి ఆరు వృషభాలను, ఏ పురుషునికీ ఇవ్వకుండానే అర్జునుని చూస్తావు. రాధేయా! నీవు చిన్ననాటి నుంచి, కుబేరునిలాగా, ధనం దానం చేస్తూనే ఉన్నావు. ఏ ప్రయత్నం లేకుండానే ఇవ్వాళ అర్జునుని చూస్తావు. చాలా పెద్ద మూర్ఖునిలాగా ఇతరులకు దానాలు చేస్తున్నావు. అయోగ్యులకు దానం చేస్తే కలిగే దోషాలను మూర్ఖత్వం వల్ల తెలుసుకోలేకపోతున్నావు. అనేక విధాల ధనాలను ఇస్తానని, ఇక్కడ ప్రకటిస్తున్నావు గదా! ఆ ధనరాశులతో నానావిధ యజ్ఞాలు చేయవచ్చు. కాబట్టి ఆ వైభవాలతో యజ్ఞాలు చేయి. మోహవశాన కృష్ణార్జునులను చంపాలనుకొంటున్నావు. ఆ కోరిక వృథా. నక్క యుద్ధంలో రెండు సింహాలను చంపినట్లు మేము ఎన్నడూ

వినలేదు. ఎవ్వరూ, ఎన్నడూ కోరనిది నీవు కోరుకొంటున్నావు. నీకు తగిన మిత్రులు లేరు. నిజంగా వారు ఉంటే, నిప్పులో దూకబోతున్న నిన్ను తప్పక నివారించేవారు. ఏది చేయగలవో, ఏది చేయలేవో, నీవు ఎరుగవు. నిస్సందేహంగా నిన్ను కాలం పక్వం చేసింది. (పండిన పండురాలినట్లు తప్పక పడిపోతావు) నిజంగా బ్రతుకదలచినవాడు ఎవడైనా వినదగని, అసంబద్ధ మయిన ఇలాంటి డంబాలు పలుకుతాడా? నీవు చేయదలచుకొన్నది, మెడలో పెద్దబండ కట్టుకొని సముద్రం దాటటం లాంటిది. కొండకొమ్మునుంచి దూకటం వంటిది. నీవు శ్రేయస్సును పొందాలనుకొంటే, సర్వయోధులతో, పన్నిన వ్యూహాలతో సురక్షితుడ వయి అర్జునునితో యుద్ధం చెయ్యి. దుర్యోధనుని మేలుకోరే ఇలా మాట్లాడుతున్నానుగాని నిన్ను హింసించాలని కాదు. నీవు బ్రతుకదలచుకొంటే నా మాటల మీద శ్రద్ధపెట్టు."

కర్ణుడన్నాడు – "శల్యా! నా భుజ బలాన్ని ఆశ్రయించి, యుద్ధంలో అర్జునుని ఎదుర్కొనగోరుతున్నాను. మిత్రునిలాగా ఉన్న శత్రువువయిన నీవు నన్ను భయపెట్టగోరుతున్నావు. ఇంద్రుడే నన్ను ఈ అభిప్రాయం నుంచి నివర్తింపజేయలేడు. ఇక సామాన్య మనుష్యుని విషయం వేరే చెప్పాలా?" సంజయుడు చెప్పాడు – "కర్ణుని మాటలు పూర్తికాగానే, మద్రరా జయిన శల్యుడు, కర్ణుని మిక్కుటంగా కోపింప జేయదలచి ఇలా అన్నాడు. "చేతి ఒడుపుగల అర్జునుడు ప్రయోగించగా, అల్లెత్రాటితో ప్రేరితాలయి, పదునయిన ములుకులు గల బాణాలు నిన్ను తాకినప్పుడు, అర్జునుని ఎదిరించినందుకు సంతాపం జెందుతావు. సూతపుత్రా! సవ్యసాచి అయిన పార్థుడు దివ్యధనుస్సును చేతబట్టి, సైన్యాన్ని తపింపచేస్తూ, నిశితమయిన బాణాలతో నిన్ను మర్దించినప్పుడు పశ్చాత్తాపం జెందుతావు. తల్లిఒడిలో పడుకొని ఉన్న పసివాడు ఒకడు ఆకాశంలోని బాలచంద్రుని తీసుకొన గోరినట్లు, మోహంవల్ల నీవు రథంమీద వెలుగుతున్న అర్జునుని ఇవ్వాళ జయింపగోరుతున్నావు. పదునయిన మొనలు గల త్రిశూలాన్ని తీసుకొని, శరీరం అంతా గోకు కొనదలుస్తున్నావు. పదునయిన అంచులాగా బాధపెట్టే అర్జునునితో కర్ణా! నీవు యుద్ధం చేయగోరుతున్నావు. సూతపుత్రా! నీవు ఈనాడు అర్జునుని యుద్ధానికి పిలవటం వేగం గల, చిన్న, మూఢమృగం క్రుద్ధమయి, పెద్ద జూలు గల్గి, గర్జిస్తున్న సింహాన్ని పోరుకు పిలిచినట్లే ఉంది. అడవిలో మాంసం తిని తృప్తినందిన నక్క, మహాపరాక్రమం గల సింహాన్ని పోరుకు పిలిచినట్లు, సూతపుత్రా! రాజపుత్రు డయిన పార్థుని యుద్ధానికి పిలువకు. అర్జునుని ఎదుర్కొని నాశనం కావద్దు. కర్ణా! నాగలి కర్రువంటి దంతాలు గల్గి, మదధారలు కారుతున్న మహాగజాన్ని కుందేలువలె, అర్జునుని యుద్ధంలో ఆహ్వానిస్తున్నావు.

అర్జునునితో యుద్ధం చేయాలనుకోవటం, మహావిషం గలిగి, కోపపూర్ణమై, కన్నంలో ఉన్న పామును కట్టెతో కొట్టటం లాగా ఉంటుంది. పెద్దజూలు గలిగి, క్రుద్ధమయిన సింహాన్ని నక్కవలె, నరోత్తము డయిన అర్జునుని మూఢుడి వయి అతిక్రమించి, గర్జిస్తున్నావు.

కర్ణా! ఏదో ఒక పాము తన పతనంకోసం, పక్షిశ్రేష్ఠుడు, వేగవంతుడు, దృఢమయిన రెక్కలు గలవాడు, వినతా కుమారుడయిన గరుత్మంతుని పోరుకు పిలిచినట్లు అర్జునుని ఆహ్వానిస్తున్నావు. పెద్ద చేపలు, మొసళ్ళు గలిగి అగాధమై, చంద్రోదయ సమయంలో పెచ్చు పెరుగుతున్న సముద్రాన్ని పడవలేకుండా దాటదలుస్తున్నావు. వత్సా! కర్ణా! దుందుభి ధ్వని వంటి ధ్వని గలిగి, వాడికొమ్ములతో కుమ్మే వృషభం వంటి అర్జునుని యుద్ధానికి పిలుస్తున్నావు. కప్పవలె, బాణాలు అనే జలాన్నిచ్చే నవరూపమేఘు డయిన అర్జునుని కెదురుపడి, గర్జింపదలుస్తున్నావు. కర్ణా! తన ఇంట్లో ఉండే ఇంటి కుక్క, అరణ్యంలో ఉన్న పెద్దపులిని జూచి మొరిగినట్లు, ధనంజయుని చూసి, మొరుగుతున్నావు. కర్ణా! కుందేళ్ళతో అడవిలో ఉంటూ నక్క, సింహాన్ని చూడనంతవరకు తానే సింహం అనుకొంటుంది. రాధేయా! అలాగే నీవూ ధనంజయుని చూడకుండా, నిన్ను నీవు సింహాన్ని అనుకొంటున్నావు. ఒకే రథంమీద ఉన్న కృష్ణులను ఇద్దరిని చూడనంతవరకు, నిన్ను నీవు పెద్దపులిని అనుకొంటున్నావు. కర్ణా! మహాయుద్ధంలో గాండీవధ్వనిని వినినంత వరకే నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతావు. రథధ్వనితో, ధనుశ్శబ్దాలతో, పదిదిక్కులను ప్రతిధ్వనింపజేస్తూ, గర్జిస్తున్న పులివంటి అర్జునుని చూసి, నక్కవు అవుతావు. మూర్ఖుడా! నిత్యమూ నీవు నక్కవే. అర్జునుడు నిత్యమూ పెద్ద పులియే, వీరులను తీవ్రంగా ద్వేషించటం వల్ల నక్కలాగా కన్పిస్తున్నావు. బలాబలాలతో ఎలుక పిల్లీ; కుక్క పులీ; నక్క సింహాలు; కుందేలు వీనుగూ - సమానాలు కావు. అబద్ధం నిజం, విషం అమృతం వలె నీవూ, అర్జునుడూ మీరు చేసిన పనులవల్ల అంతటా ప్రఖ్యాతులయ్యారు."

40. కర్ణశల్య సంవాదము.

సంజయుడు చెప్పాడు - "శల్యుడు ఈ రీతిగా ఆక్షేపించగా కుపితుడయిన కర్ణుడు 'శల్యాల (బాణాలు)లాంటి మాటలు అనటంవల్లనే ఇతని పేరు శల్యు డయింది.' అని నిశ్చయించుకొని శల్యునితో ఇలా అన్నాడు. "శల్యా! గుణవంతుల గుణాలు గుణవంతులకే తెలుస్తాయి కాని గుణహీనులకు కాదు. గుణహీనుడ వయిన శల్యా! గుణాలు, అవగుణాలు నీకెలా తెలుస్తాయి ? శల్యా! మహాత్ము డయిన అర్జునుని మహాస్త్రాలను, పరాక్రమాన్ని,

కోపాన్ని, ధనుస్సును, బాణాలను, బలాన్ని నేను చక్కగా ఎరుగుదును. అలాగే శ్రీకృష్ణుని మాహాత్మ్యం నాకు తెలిసినంతగా నీకు తెలియదు. అలాగే నా బలపరాక్రమాలు, అర్జునుని బలపరాక్రమాలు బాగా తెలిసే యుద్ధంలో గాండీవధారి అయిన అర్జునుని పిలుస్తున్నాను. శల్యా! ఇదిగో ఈ బాణం మంచి ఈకలు గలది, రక్తం త్రాగేది. ఒక అమ్ముల పొదిలో ఉంటుంది. బాగా శుభ్రంచేసి అలంకృతమై ఉంది. అనేక సంవత్సరాల నుంచి పూజితమయి, మంచి గంధపు పొడులలో పడుకుని ఉన్నది; పదాతులను, గుర్రాలను, ఏనుగుల గుంపులను సంహరించే విషపూర్ణ మయిన, భయంకర మయిన సర్పమయాస్త్రం ఈ బాణం. భయంకరం, ఘోరం అయిన ఈ బాణం శరీరంలో ఉండే కవచాన్ని, ఎముకలను చీల్చివేస్తుంది. క్రుద్ధుడ నయిన నేను దీనితో మేరువును కూడా ఛేదిస్తాను. అలా మహాప్రభావ సంపన్నమయిన ఈ బాణాన్ని అర్జునునిమీద, దేవకీపుత్రుడయిన శ్రీకృష్ణునిమీద తప్ప ఇతరుల మీద ప్రయోగించను. ముమ్మాటికి ఇది నిజం, విను. శల్యా! నేను మిక్కిలి కుపితుడనయి, ఈ బాణంతో శ్రీకృష్ణార్జునులతో యుద్ధం చేస్తాను. ఆ పని నాకు మాత్రమే తగినది. సమస్త వృష్ణివీరుల సంపత్తి శ్రీకృష్ణునియందు ప్రతిష్ఠితమయి ఉంది. సర్వపాండవుల విజయం అర్జునునియందు ప్రతిష్ఠితమయి ఉంది. ఈ రెండు తటస్థపడ్డప్పుడు ఎవడు వెనుదిరుగుతాడు? పురుషశ్రేష్ఠులయిన వారిద్దరు కలిసి ఒక రథంమీద ఉన్నారు. నన్ను ఒక్కడినే ఎదుర్కొన వస్తున్నారు. శల్యా! ఇది ఎంతమంచి అవకాశమో చూడు. ఒకే దారంలో గ్రుచ్చిన మణులలాగా, ప్రేమసూత్ర బద్ధులు అయిన ఆ ఇద్దరు పరాజయంలేనివారు, మేనత్త మేనమామల పిల్లలు, శల్యా! వారిని నేను చంపటం నీవు చూస్తావు.

గరుత్మంతుడు, వానరుడు జెండాల గుర్తులు గలవారు. అర్జునుని వద్ద గాండీవం, శ్రీకృష్ణుని వద్ద చక్రం ఉన్నాయి. పిరికివారికి భయజనక మయిన ఈసన్నివేశం శల్యా! నాకు హర్షకరం. నీవు దుష్టస్వభావుడివి, మూర్ఖుడివి, మహాయుద్ధాలు తెలియనివాడివి. భయంతో నీగుండె పగిలినట్లుంది. భయంవల్లనే, అసందర్భపు మాటలు మాట్లాడుతున్నావు. నీచ దేశంలో పుట్టినవాడా! ఏదో బలమయిన కారణంతో వాళ్లను తెగపొగడుతున్నావు. పాపదేశజాతా! దుష్టబుద్ధీ, నీచా! క్షత్రియకళంకా! ముందు వాళ్ళను ఇద్దరిని చంపి, తరువాత బంధువులతో కూడా నిన్ను చంపుతాను. శత్రువువు మిత్రుడివయి, శ్రీకృష్ణార్జునులతో నన్ను ఎందుకు భయపెడుతున్నావు? ఇవ్వాళ వాళ్ళు నన్ను చంపటం గాని, లేక వాళ్ళను నేను చంపటంగాని తప్పదు. నాబలమేమిటో నాకు బాగా తెలుసు. కాబట్టి కృష్ణార్జునులకు నేను భయపడను. వేయిమంది శ్రీకృష్ణుల నయినా! వందమంది అర్జునుల నయినా నేను ఒక్కడినే చంపగలను. నీచ దేశజాతా! నోరుమూసుకొని ఉండు. స్త్రీలు, బాలురు,

వృద్ధులు, ఆటల్లో పడ్డవారు, స్వాధ్యాయపరులు, మద్రదేశవాసులను గురించి పాడే గాథలు, రాజసమక్షంలో పూర్వం బ్రాహ్మణులు చెప్పిన గాథలు ఉన్నవి ఉన్నట్లు చెపుతాను. మూఢా! శల్యా! వాటిని అన్నింటిని ఏకాగ్రతతో విని, నోరుమూసుకో ! లేకపోతే, తెలిస్తే సమాధానం చెప్పు.

మద్రదేశంలోని అధమ మనుష్యులు ఎల్లప్పుడు మిత్రద్రోహులు, మమ్ములను నిష్కారణంగా ద్వేషించేవారు, మద్రదేశంలోని అధమవ్యక్తి, నీచ వాక్యాలు పలుకుతాడు. నరాధము డయిన మద్రకునిలో స్నేహ భావనలేదు. మద్రదేశీయుడు నిత్యము దురాత్ము డని, ఎప్పుడూ అబద్దాలు చెవుతా డని, కుటిలు డని, చచ్చేదాకా దుష్టులుగానే మద్రదేశీయు లుంటారని మేము విన్నాం.

పేలపిండిని, మాంసాన్ని తినే శిష్టులు కాని మద్రదేశీయుల ఇండ్లలో తండ్రి, కొడుకు, తల్లి, అత్త, మామ, మేనమామ, అల్లుడు, కూతురు, సోదరుడు, మనుమడు, ఇతర బంధువులు, మిత్రులు, అతిథులు, దాసదాసీజనం స్వేచ్ఛగా పరస్పరం కలుస్తుంటారు. పరిచితులు, అపరిచితులు అయిన స్త్రీలు, పురుషులతో సంబంధం పెట్టుకొంటారు. గోమాంసం తిని మద్యం త్రాగి ఏడుస్తారు. నవ్వుతారు, పాడతారు, అనుచితమయిన మాటలు మాట్లాడుతారు. కామంతో చేసే పనులలో ప్రవర్తిస్తారు. అక్కడి స్త్రీ పురుషులు అందరు కామ విషయాలను మాట్లాడుకొంటారు. వారి పాపకర్మలు లోకప్రసిద్ధాలు. పాగరుబోతులయిన మద్రదేశీయులలో ధర్మం ఎలా ఉంటుంది ? మద్రదేశీయునితో పగ కాని, స్నేహం కాని పనికిరాదు. మద్రదేశీయులలో మిత్రభావన లేదు. మద్రదేశీయుడు ఎప్పుడూ అపవిత్రుడే. 'మద్రదేశీయుల వద్ద దాచిన సొమ్ము, గాంధారదేశీయులలో శౌచాచారం నశించినట్లు; క్షత్రియుడు పురోహితు డయిన యజమాని యజ్ఞంలో హోమం చేసిన హవిస్సు వ్యర్థం అయినట్లు, శూద్రులకు సంస్కారం జరిపించే బ్రాహ్మణుడు పరాభవం పాలయినట్లు, బ్రహ్మద్రోహులు ఈ లోకంలో నిత్యమూ అవమానాలపాలయినట్లు, మద్రదేశీయులతో మైత్రి చేసిన నరుడు పతితుడు అయినట్లు, మద్రనివాసులలో మైత్రిలేనట్లు వృశ్చిక స్వభావా! శల్యా! 'నీ విషం నాశన మయింది. నేను అథర్వవేదీయ మంత్రాలతో నీ విషం విరిచి వేశాను.' అంటూ బుద్ధిమంతులయిన విషవైద్యులు తేలుకుట్టగా, విషాధిక్యంతో బాధపడుతున్నవానికి చికిత్స చేస్తూ అనేది సత్యంగానే కనపడుతుంది. విద్వాంసుడా! శల్యా! మెదలకుండా కూచో. ఇంకొక మాట చెపుతాను. విను, మద్యంత్రాగిన మత్తులో ఒళ్ళు తెలియక, బట్టలు విప్పివేసి నాట్యం చేసేవారు, మైథునంలో అదుపును, మర్యాదను వదలి ప్రవర్తించేవారు, తమ ఇష్టానుసారం ఏదో ఒక మగవాడిని ఎన్నుకొనేవారు అయిన

మద్రదేశీయస్త్రీల పుత్రుడయిన నరాధముడు ఇతరులకు ధర్మోపదేశం ఎలా చేస్తాడు ? ఒంటెలలాగా, గాడిదల లాగా నిలుచుని మూత్రవిసర్జనం చేసేవారు, ధర్మభ్రష్టులు, సిగ్గులేనివారు అయిన మద్రదేశస్త్రీల పుత్రుడివయిన నీవు, ఇక్కడ నాకు ధర్మోపదేశం చేయగోరుతున్నావు ?

ఎవడయినా పురుషుడు మద్రదేశీయ స్త్రీని గంజిపోయుమని అడిగితే, ఆమె ఆతని మెడబట్టి లాక్కుపోతుంది. గంజి పోసే ఉద్దేశ్యం లేక, ఇలా దారుణంగా అంటుంది. నాకు అత్యంత ప్రియమయిన గంజిని ఎవ్వడూ అడగరాదు. కొడుకునయినా, భర్తనయినా ఇస్తాను గాని గంజిమాత్రం ఈయను! సామాన్యంగా మద్రదేశ స్త్రీలు గౌరవర్ణం - మంచి రంగు గలిగి బాగా పొడుగ్గా ఉంటారు. కంబళ్ళను కట్టుకొంటారు. బాగా తింటారు. సిగ్గు వదిలేస్తారు. అపవిత్రంగా ఉంటారు అని వింటాం. మద్రదేశీయులు జుట్టు దగ్గరినుంచి కాలిగోళ్లదాకా నింద్యులుగా ఉంటారు. వారందరూ చెడ్డపనులు చేస్తుంటారు. వారిని గూర్చి నేను గాని, ఇతరులు గాని ఇంకా అనేక విషయాలు చెప్పగలం. మద్రదేశీయులు, సింధు, సౌవీరదేశీయులు పాపదేశాల్లో పుట్టిన మ్లేచ్ఛులు. వారికి ధర్మకర్మలు ఎలా తెలుస్తాయి? ఈ జగత్తులోని ధర్మవిషయాలు ఎలా చెప్పగలరు ? యుద్ధంలో హతుడయి పడిపోవటం, క్షత్రియునికి చాలా ముఖ్యమయిన ధర్మం అనీ, అది సజ్జనులు మెచ్చుకొనే ధర్మం అనీ మేము విన్నాం. మరణించి స్వర్గానికి వెళ్ళగోరే నాకు, ఆయుధాలతో జరిగే యుద్ధంలో, ప్రాణాలు వదలటమే ప్రథమ కర్తవ్యం. అలాంటి నేను, ధీమంతుడయిన దుర్యోధనునికి ప్రియమిత్రుడిని. నాకున్న ధనం, నా ప్రాణాలు, ఆయనకే అంకితం చేశాను. పాపదేశంలో పుట్టినవాడా! శల్యా! మాలో మాకు తగవుపెట్టటానికి, భేదం కల్పించటానికి, పాండవులు మా దగ్గర నిన్ను పెట్టారనే స్పష్టం అవుతున్నది. అందువల్లనే నీవు మా విషయంలో శత్రువు లాగా ప్రవర్తిస్తున్నావు. ధర్మం బాగా తెలిసినవానిని నాస్తికులవలె, నీవంటి వాళ్ళు వందమంది అయినా, నన్ను యుద్ధవిముఖుని చేయలేరు. ఎండవేడికి తహతహలాడే జింకవలె, నీ ఇష్టం వచ్చినట్లు విలపించు, నోరు ఎండబెట్టుకో. క్షత్రియ వృత్తిలో ఉన్న నన్ను భయపెట్టడం నీతరం గాదు. యుద్ధంలో వెనుదిరగకుండా, శరీరాలు త్యజించే నరశ్రేష్ఠులకు కలిగే గతిని గురించి, మా గురువులు పరశురాముడు పూర్వం చెప్పినది గుర్తుచేసుకొంటున్నాను. ధృతరాష్ట్ర పుత్రులను రక్షించటానికి, శత్రువులను వధించటానికి పురూరవుని ప్రవర్తనను అనుసరించేవానినిగా నన్ను తెలుసుకో. (యుద్ధంలో వెనుకడుగు వేయకపోవటమే పురూరవునికి శీలం)

మద్రాధిపా! నన్ను ఈ అభిప్రాయం నుంచి మరలించే ప్రాణిని, ముల్లోకాల్లో నేను చూడలేను అని నా ఉద్దేశ్యం. శల్యా! ఇంక మాట్లాడకుండా ఉండు. భయంతో ఎక్కువగా మాట్లాడుతున్నావా ఏమిటి? నీచ మద్రకా! ఇంక నీవు ఊరకుండకపోతే, నిన్ను ముక్కలు చేసి, మాంసం తినే జంతువులకు ఆహారంగా వేస్తాను. శల్యా! నేను మిత్రులయిన దుర్యోధన, ధృతరాష్ట్రుల కార్యనిర్వహణ మీద దృష్టిపెట్టటం, అపవాదం కలుగుతుందని భీతిల్లటం, నీవు అనే మాటలు క్షమిస్తాను అని ప్రతిజ్ఞ చేయటం అనే మూడు కారణాల వల్ల ఇంకా నీవు బ్రతికి ఉన్నావు. మద్రరాజా! మళ్ళీ ఇలాంటి మాటలు చెపితే, వజ్రాయుధం లాంటి గదతో, నీ శిరస్సు పిండి చేసి పారేస్తాను. నీచ దేశజాతా! ఇవ్వాళ శ్రీకృష్ణార్జునులు కర్ణుని చంపారు అని కాని, కర్ణుడు వాళ్ళనిద్దరిని చంపాడని కాని ఇక్కడ వినేవాళ్ళు వింటారు, చూచేవాళ్ళు చూస్తారు." నరనాథా ! కర్ణుడు ఈరీతిగా పలికి మళ్ళీ శల్యుని 'పద, పద' అని ఏమాత్రం తొణకకుండా హెచ్చరించాడు."

41. హంసకాకీయోపాఖ్యానము.

సంజయుడు చెప్పాడు - "మాన్య రాజేంద్రా! యుద్ధప్రశంసా పరమయిన కర్ణుని వాక్కులు విన్న శల్యుడు దృష్టాంతంతో ఇలా చెప్పాడు. "యుద్ధరంగంలో వెనుదిరుగనివారు, యజ్ఞ పరాయణులు, మూర్ధాభిషిక్తులు అయిన రాజుల వంశంలో జన్మించాను, స్వయంగా ధర్మతత్పరుడిని. కర్ణా! మద్యపానంతో మత్తుడయిన వాడిలాగా కన్పిస్తున్నావు. నీ మేలుకోరే మిత్రుడిని కావటం వల్ల, ప్రమత్తుడి వయిన నీకు చికిత్స చేస్తాను. నీచ కుల కళంకా! కర్ణా! కాకి దృష్టాంతంగా కథ చెపుతాను విను, విన్నతరువాత నీ ఇష్టం వచ్చినట్లు చేయి. మహాబాహూ! కర్ణా! నిరపరాధినయిన నన్ను చంపా లనుకొంటున్నావు. అంత తీవ్రమయిన దోషం నాలో ఏముందో గుర్తురావటం లేదు. రాజయిన దుర్యోధనుని హితం కోరేవాడిని, రథసారథిని, నీకు మంచి ఏదో, చెడు ఏదో, తెలిసినవాడిని. కాబట్టి నేను తప్పకుండా చెప్పాలి. కర్ణా! ఈ రథానికి నేను బాధ్యత గల కుటుంబిని. కాబట్టి సమస్థితి, విషమస్థితి, రథికుని బలాబలాలు, రథికునితో పాటు గుర్రాలకు కలిగే శ్రమ, బాధలు, రథంలో కావలసిన ఆయుధాలు సరిగా ఉన్నవా లేవా తెలుసుకోవటం, శుభాశుభాలు సూచించే మృగాల పక్షుల అరుపులు తెలియటం, శత్రువు భారమేనా, అతిభారమా తెలియటం, శల్యచికిత్స, అస్త్రప్రయోగం, యుద్ధం, శుభాశుభశకునాలు తెలిసి ఉండాలి. కాబట్టి నీకు ఈ దృష్టాంతాన్ని చెపుతాను.

ఒక కథ చెపుతారు – సముద్ర తీరంలోని ఒకానొక ధర్మాత్ముడయిన రాజు రాజ్యంలో, ధనధాన్యాలు పుష్కలంగా ఉన్న ఒక వైశ్యుడు ఉండేవాడు. ఆయన యజ్ఞయాగాదులు చేసేవాడు, మిక్కిలి ఉదారుడు, ఓర్పుగలవాడు, స్వధర్మనిరతుడు, పవిత్రుడు. ఆయనకు అనేక పుత్రులున్నారు. సంతానం మీద ప్రేమ ఎక్కువ. సర్వప్రాణులమీద దయగలవాడు. ఆయనకు చిన్న వయస్సులో, కీర్తిమంతులయిన పుత్రులు చాలామంది ఉన్నారు. వారి ఎంగిలి తిని, బ్రతికే ఒక కాకి కూడా అక్కడ ఉండేది. వైశ్యుని చిన్న పిల్లలు దానికి మాంసాహారం, పెరుగు, పాలు, పాయసం, తేనె, నెయ్యి సమృద్ధిగా పెట్టేవారు. చిన్నపిల్లలయిన వైశ్యపుత్రుల ఎంగిలితో, బ్రతికే ఆ కాకి పొగరెక్కి, తనతో సమానమయినవి, తనకంటె గొప్పవి అయిన పక్షులను అవమానించసాగింది. ఇలా ఉండగా, ఒకనాడు ఆ సముద్ర తీరానికి గరుత్మంతునితో సమానంగా ఆకాశంలో ఎగురుతూ, మానస సరోవరంలో నివసించే హంసలు హర్షపూర్ణమతు లయి వచ్చాయి. ఆ సమయంలో హంసలను చూసి, ఆ పిల్లలు కాకితో ఇలా అన్నారు. 'పక్షీ! అన్నిపక్షులలోకి నీవే శ్రేష్ఠమయిన దానివి, ఆకాశ సంచారులయిన హంసలు ఆకాశంలోకి పోయి, చాలా దూరం ఎగురుతున్నాయి. నీవుగూడా వీటితో సమానంగా ఎగరటంలో సమర్థురాలివి. అంతశక్తి ఉన్నా నీవు ఇంత వరకు వీటిలాగా ఎగరలేదు.' అల్పబుద్ధి లయిన ఆ పిల్లలు అందరు, వంచనతో చెప్పే మాటలను, మూర్ఖతవల్ల, పొగరు వల్ల, నిజమే అని ఆ కాకి అనుకొన్నది. చాలాదూరం ఎగిరే ఈ హంసలలో ఏది గొప్పదో తెలుసుకోదలచి, ఉచ్ఛిష్టంతో మదించిన ఆ కాకి ఎగిరి, వాటి వద్దకుపోయింది. వాటిల్లో ఒకదాన్ని శ్రేష్ఠం అని ఎంచుకొన్నది. దుర్బుద్ధి అయిన కాకి ఎగురుదాం, రా! అని ఆ హంసను పిలిచింది. బలిష్ఠాలై, ఎగరటంలో గొప్పవై, అక్కడికి వచ్చిన హంసలు, పలుకూతలు కూస్తున్న కాకి అరపులు విని, పగలబడి నవ్వాయి. ఆకాశంలో ఎగిరే హంసలు దానితో ఇలా అన్నాయి.

మానస సరస్సు నివాసం గల మేము ఈ భూమిమీద విహరిస్తుంటాం. పక్షులన్నిటిలో చాలాదూరం ఎగరటంలో మేము మన్నన పొందుతాం. దుర్బుద్ధిగల కాకీ! నీవు కాకివయి ఉండి; చాలాదూరం ఎగిరే, బలిష్ఠమయి, చక్రచిహ్నాలు తమ అవయవాల మీద గల హంసలను ఎగరటంలో పోటీకి పిలుస్తున్నావేమిటి ?' మూఢమయిన కాకి హంస మాటలు విని, జాతిగతమయిన నీచత వల్ల, తనగొప్పలు చెప్పుకొంటూ, మాటిమాటికి హంసను నిందిస్తూ ఇలా సమాధానం చెప్పింది. కాకి అన్నది – 'హంసా! నేను నూటొక్కరకాలుగా ఎగురుతాను, ఇందులో సందేహం లేదు. వాటిలో ఒక్కొక్కదానితో ఒక్కొక్క యోజనం

దూరం ఎగురుతాను. అవి అన్నీ విభిన్నమయినవి, విచిత్రమైనవి. వాటిల్లో కొన్నిటిపేర్లు ఇవి. పైకి ఎగరటం, క్రిందికి దిగుతూ ఉండటం, నాలుగువైపులా ఎగరటం, సాధారణంగా ఎగరటం, మెల్ల మెల్లగా ఎగరటం, అందమయిన రీతిగా ఎగరటం, అడ్డంగా ఎగరటం, ఇంకొకదానిని అనుకరిస్తూ ఎగరటం, అన్నివయిపులా ఎగరటం, వెనుకవైపుకు ఎగరటం, స్వర్గంవైపు ఎగరటం, ఎదుటివైపు ఎగరటం, చాలా వేగంగా ఎగరటం, ఇతరులను కదిలించకుండా ఎగరటం, ప్రచండ వేగంతో ఎగరటం, సుందర గమనంతో ప్రారంభించి, గిరగిరా తిరిగి క్రిందికి దిగటం, సుందరగతితో ఆరంభించి, గిరగిరా తిరిగి పైకి ఎగరటం, ఒక రకం ఎగరటంలో ఇంకో రకంగా ఎగరటం చూపటం, ఒక్క క్షణం చక్కగా ఎగిరి, రెక్కలు రెపరెపలాడించటం ఒకసారి పైకి, ఇంకోసారి క్రిందికి పోవటం, ఒక లక్ష్యాన్ని ఉద్దేశించి ఎగరటం, ఇవి ఇరువది ఆరు రకాలు. వాటిల్లో మహా డీనం కాక ఇరతమయిన అన్ని ఎగరటాలకు ఒకలక్ష్యం వైపు పోవటం, లక్ష్యం వరకు వెళ్ళి తిరిగి రావటం, ఎదురువెళ్లటం అని మూడు భేదాలు ఈరీతిగా డెబ్బది యారు భేదాలు, ఇవికాక ఇరువది అయిదు నిపాతాలు ఉన్నవి. ఇవి అన్నీ కలిపితే నూటొక్క భేదాలు అవుతాయి. మహా డీనం కాక ఇతరమయిన ఇరువది అయిదు భేదాలు చెప్పారు. వీటన్నిటికి విడివిడిగా ఒక్కొక్క సంపాతం (రెక్కలు టపటపా కొట్టటం) కూడా ఉంటాయి. ఈ ఇరువది అయిదు సంపాతాలు కలిపితే నూటొక్క సంఖ్య పూర్తి అవుతుంది.* ఇప్పుడు మీరు అందరూ చూస్తుండగా, ఇన్ని రకాలుగా ఎగురుతాను. అప్పుడు మీరు నా బలం చూడండి. ఈ నూట ఒకటిలో దేనితోనయినా, ఆకాశంలో ఎగురగలను. హంసలారా! వీటిల్లో ఏ గతిలో ఎగరాలో, యథోచితంగా ఆలోచించి చెప్పండి. కాబట్టి పక్షులారా! మీరందరు గట్టిగా నిశ్చయించుకొని, నిరాశ్రయమయిన ఆకాశంలో ఈ విభిన్నమయిన ఎగరటాతో నాతోపాటు ఏదో ఒకదానితో తప్పక ఎగురుతారు కదూ!' ఇలా కాకి అనగా హంసలలో ఒక హంస

★ *నీలకంఠీయానుసారం వీకోత్తరశత పక్షి గమనాలు.*

1. *ఉడ్డీనం = పైకిపోవటం.*
2. *అవడీనం = క్రిందికిపోవటం.*
3. *ప్రడీనం = అన్నివైపుల పోవటం.*
4. *డీనం = కేవలం గమనం మాత్రమే.*
5. *నిడీనం = మెల్లగా పోవటం.*
6. *సండీనం = అందంగా పోవటం.*
7. *తిర్యగ్డీనం = అడ్డంగా పోవటం.*

ఈ అడ్డంగా పోవటం నాలుగు దిక్కులకు పోవటంతో నాలుగు రకాలు.

ఇంతవరకు పక్షిప్రయాణాలు 6 + 4 = 10

11. *డీనం = ఇతర పక్షిగమనాన్ని అనుకరించటం. మల్లునివలె ఎగిరెగిరిపోవటం.*
12. *పరిడీనం = అంతటా తిరగటం.*
13. *పరాడీనం = వెనక్కుపోవటం.*

నవ్వి, కాకితో ఇలా అన్నది. రాధేయా! ఆ మాట చెపుతాను, విను.

హంస చెప్పింది - 'కాకీ! నీవు నూటొక్క రకాలుగా ఎగురగలవు అనటం నిజం. సమస్త పక్షులకు తెలిసిన ఒకే ఒక గమనంతో నేను ఎగురుతాను. కాకీ! నాకు అంతకంటే ఇంకొకటి తెలియదు. ఎర్రని కనులు గల కాకీ! నీకు ఏది తగినది అని అనిపిస్తే, ఆ రీతిగానే ఎగురు, అప్పుడు అక్కడికి వచ్చిన కాకులు పెద్దగా నవ్వి, వాటిలో ఆవి ఇలా అనుకొన్నాయి. 'ఈ హంస ఒకే గమనంతో నూరు రకాల ఎగరటాన్ని ఎలా జయిస్తుంది? ఈ కాకి బలిష్ఠమయింది. వేగంగా ఎగురగలదు. కాబట్టి నూటిలో ఒకే గమనంతో కాకి హంసను జయిస్తుంది.' ఆ తరువాత హంస, కాకులు పోటీపడి ఎగిరాయి. ఒకే గమనంతో హంస, శతగమనాలతో కాకి బయలుదేరాయి. ఇటునుంచి చక్రాంగం హంస ఎగిరింది. అటునించి కాకి ఎగిరింది. కాకి విభిన్నమయిన ఎగరటాలతో, ప్రేక్షకులను ఆశ్చర్య చకితులను చేయదలచి తన పనులను పొగడుకొంటున్నది. అప్పుడు కాకి మాటిమాటికి చేస్తున్న తన విన్యాసాలను చూసి, హర్షాతిరేకంతో, కాకులు పెద్దపెట్టున

14. సుడీనకం = స్వర్గంవైపు వెళ్ళటం.

15. అభిడీనం = ఎదురుగా వెళ్ళటం.

16. మహోడీనం = మామూలుగా పోవటం. పవిత్రంగా ఉదాత్తంగా పోవటం.

17. నిడీనం = నిశ్చలంగా పోవటం.

18. అతిడీనం = ప్రచండంగా పోవటం.

19. అవడీనం = క్రిందకి దిగటం.

20. ప్రడీనం = మొదట సుందరంగా గమనం ప్రారంభించి, తరువాత చిత్రంగా పోవటం.

21. సండీనడీనడీనకం = విహరిస్తూ క్రిందపడటం.

22. సండీనోడ్డీనడీనకం = విహరిస్తూ పైకి ఎగరటం.

23. డీనడీనకం = ఒక విధంగా ఎగురుతూ, దాన్ని ఇంకొక గతితో ఛేదించటం

24. సంపాతం = క్షణకాలం చక్కగా ఎగిరి, మళ్ళీ రెక్కలు టప టప కొట్టడం.

25. సముదీషం = ఒకసారి పైకి, ఒకసారి క్రిందికి ఎగరటం

26. వ్యతిరిక్తకం = ఒక లక్ష్యం కల్పించుకొని దానివైపు ఎగరటం. పక్షుల గమనంలో ఇవి ఇరువది యారు భేదాలు. మహోడీనం అనే 26వ దాన్ని వదలి, తక్కిన ఇరవై అయిదింటికి ఉద్దేశించిన వైపు పోవటం గతం అవుతుంది. లక్ష్యం వరకు వెళ్ళి, మళ్ళీ తిరిగి రావటం ప్రత్యాగతం అవుతుంది. ప్రతిగతి ఎదురువెళ్లటం.

ఈ మూడు భేదాలతో 25 గతులు 75 అవుతవి. వీటికి మహోడీనం కలిపితే 76 అవుతవి. 25 గతులలో క్రిందికి రావటం 25 నిపాతాలు. ఇవ్వికూడా కలిపితే మొత్తం 101 గతి భేదాలు అవుతవి.

కావుకావుమని భిన్నస్వరాలలో పలికాయి. అవి రెండేసి గడియలకు మాటిమాటికి ఎగురుతూ 'చూడు చూడు కాకి ఆలా ఎగురుతున్నది. ఇలా ఎగురుతున్నది' అంటూ హంసలను హేళన చేస్తున్నాయి. వాటిని కటువుగా మాట్లాడుతున్నాయి. మాన్యా! హంసమాత్రం మృదులగమనంతో ఎగరనారంభించింది. రెండు గడియలలోనే కాకి ఓడిపోతున్నట్లనిపించింది. అప్పుడు కాకులు హంసను అవమానిస్తూ ఇలా అన్నాయి. ఆ ఎగురుతున్న హంస కాకికంటె వెనుక పడుతున్నది. ఆ సమయంలో హంస ఆ మాటలు విని, సముద్రం మీద పైపైకి, పశ్చిమ దిక్కుకు ఎగురసాగింది. అప్పుడు కాకి ఆయాసపడుతూ, వాలటానికి సముద్రమధ్యంలో ద్వీపాలు గాని, చెట్లుగాని, కనిపించక పోవటం వల్ల పరవశమయింది. దానికి భయం కలిగింది. కాకి ఇలా అనుకుంది - 'బాగా అలసట కలిగినప్పుడు నేను ఎక్కడ వాలాలి? అనేక జలజంతువులకు వాసమయిన దీన్ని తాళలేను. లెక్కలేనన్ని మహా ప్రాణులతో నిండి ఉన్న ఈ సముద్రం, ఆకాశానికంటే గూడా విశిష్టంగా ఉంది. కర్ణా! సముద్రంలో సంచరించే మనుష్యుడు కూడా, లోతు కారణంగా, దిక్కులతో ఆవృతమయిన ఆ జలరాశి గాంభీర్యాన్ని తెలుసుకోలేడు. కాబట్టి ఆకాకి కొంచెం దూరం మాత్రమే సముద్రం మీద ఎగిరి, ఆ జలరాశి ఆవలిఒడ్డుకు ఎలా చేరగలదు ?

ఆ హంస రెండు గడియలు ఎగిరి, ఇటు అటు చూసి, కాకి కోసం ఎదురుచూస్తూ ముందరికి వెళ్ళలేకపోయింది. చక్రాంగం కాకిని దాటి ముందుకుపోయింది. అయినా ఈ కాకి కూడా ఎగురుతూ, నా దగ్గరికి రావాలి అని ఆలోచించి దానికోసం ఎదురుచూడసాగింది. అప్పుడు కాకి బాగా అలసిపోయి హంస దగ్గరకు వచ్చింది. కాకి స్థితి దయనీయంగా ఉండటం హంస చూసింది. కాకి ఇంక నీటిలో మునిగిపోతుంది. అప్పుడు సజ్జననియమాన్ని గుర్తు తెచ్చుకొని, దాన్ని ఉద్ధరించదలచి హంస ఇలా అంది. 'కాకీ! నీవు అనేక రకాలుగా ఎగురుతాను అని గొప్పగా చెప్పావు గదా! ఆ గతులను వర్ణించేటప్పుడు వాటిలో దాచదగిన ఈ రహస్యమయిన గమనాన్ని గురించి చెప్పలేదే! కాకీ! ఇప్పుడు నీవు ఎగిరే గతిని ఏపేరుతో పిలుస్తారు? పలుమారులు రెక్కలతో, ముక్కుతో నీటిని తాకుతున్నావే. వాయసమా! ఇప్పుడు ఏ గమనంలో ఎగురుతున్నాం చెప్పు. కాకీ! త్వరగా రా, రా నీకోసం ఎదురుచూస్తున్నాను. శల్యుడు చెప్పాడు - దుష్టాత్మా! కర్ణా! ఆర్తమయిన ఆ కాకి రెక్కలతో, ముక్కుతో నీటిని మాటిమాటికి స్పృశించటం హంస చూచింది. అది ఎగిరేవేగంతో అలసిపోయింది. దాని శరీరం శిథిలం అయింది. ఆ నీటికి అంతులేకపోవటం చూసి, క్రిందికి పడిపోతున్నది. అప్పుడు హంసతో ఇలా అన్నది.

'సోదరా! హంసా! మేము కాకులం. ఊరికే కా, కా అని అరుస్తుంటాం. ఎగరటం మాకేం తెలుసు? హంసా! ఈ ప్రాణాలతోనే నిన్ను శరణందుతున్నాను. ఈ నీటి దరిచేర్చు.' తీవ్రంగా ఆర్తిచెందిన ఆ కాకి మహాసముద్రంలో నీటిని రెక్కలతో, ముక్కుతో తగులుతూ తీవ్రంగా అలిసి, ఆ జలంలో పడిపోయింది. దానికి అప్పుడు చాలా బాధ కలిగింది. దీనమయిన మనస్సుతో, సముద్రజలంలో పడిపోయి, మరణించబోతున్న ఆ కాకిని చూసి, హంస ఇలా అన్నది. కాకీ! నీవు నూటొక్క గతులతో ఎగురుతాను అని ఆత్మస్తుతి చేసుకొంటూ చెప్పావు. అలాంటి నీవు నూటొక్క రీతిగా ఎగురుతూ, నాకంటే గొప్పవాడివి అయి ఉండి, ఇలా బాగా అలసిపోయి సముద్రంలో పడ్డావేమిటి ? సముద్రజలంలో పడి గిలగిల కొట్టుకుంటున్న కాకి, నీటిపయిన ఉన్న హంసను చూసి, దాన్ని ప్రసన్నం చేసుకోవటానికి ఇలా అన్నది.

'హంసా! వైశ్యబాలకుల ఎంగిలి తిని, బలిసి మదించిన నేను, ఇతరమయిన అనేక వాయసాలను, పక్షులను అవమానించి అపర గరుత్మంతుడి నని గర్వించాను. హంసా! ప్రాణాలతో నిన్ను శరణందుతున్నాను. నన్ను ద్వీపం ఒడ్డుకు చేర్చు. నేను క్షేమంగా నా దేశాన్ని చేరగలిగితే, ఇంక ముందు ఎవ్వరిని అవమానించను. ఈ ఆపదనుంచి నన్ను బయటపడవేయి.' ఈ విధంగా పలుకుతూ దీనమయి, అచేతనమయి, విలపిస్తూ, కాకా అని అరుస్తూ మహాసముద్రంలో మునుగుతూ, నీటితో తడిసి, మిక్కిలి దుర్దశలో ఉన్న కాకిని, హంస దయతో, కాళ్ళతో వేగంగా నీళ్ళలోనుంచి పైకెత్తి, తన వీపుమీదికి మెల్లగా ఎక్కించుకొన్నది. అచేతనమయిన కాకిని వీపుమీదికి ఎక్కించుకొని, హంస పూర్వం తాను పోటీపడి ఎగిరిన ప్రదేశానికి వచ్చింది. ఆ కాకిని అక్కడ ఉంచి, ఊరడించి, హంస మనోవేగంతో తన ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళింది. కర్ణా! ఈరీతిగా, ఎంగిలి తిని బలిసిన కాకి, హంస చేతిలో ఓడిపోయి, బలపరాక్రమమదాన్ని వదలి శాంతించింది.

పూర్వం వైశ్యుని ఇంట ఎంగిలి తిన్న కాకి వలె, నిన్ను కౌరవులు ఎంగిలి తినిపించారు అనటంలో సందేహం లేదు. కర్ణా! అందువల్లనే నీవు నీతో సమానులను, నిన్నుమించిన వారిని అవమానిస్తున్నావు. విరాటనగరంలో ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, భీష్ముడు, ఇతర కౌరవులు నీకు రక్షకులుగా ఉన్నారు. అప్పుడు ఒక్కడుగా వచ్చిన అర్జునుని ఎందుకు చంపలేదు? అక్కడ అర్జునుడు మీతో ఒక్కొక్కరితోను, అందరితోను కలిపి పోరి, సింహం నక్కలను వలె ఓడించాడు. అప్పుడు నీ పరాక్రమం ఏమయింది? యుద్ధంలో, అర్జునుడు నీ సోదరుని చంపటం చూసి, కౌరవవీరులు అందరు చూస్తుండగా, మొట్టమొదట నీవే పారిపోయావు. కర్ణా! అలాగే ద్వైతవనంలో గంధర్వులు అందరు

ఎదిరించినప్పుడు, కౌరవులను అందరిని వదలి, మొదట నీవే పారిపోయావు. కర్ణా! అర్జునుడు రణంలో చిత్రసేనాదు లయిన గంధర్వులను తీవ్రంగా బాధించి, జయించి, భార్యతో కూడా దుర్యోధనుని చెరనుంచి విడిపించాడు. కర్ణా! కృష్ణార్జునుల పురాతన ప్రభావాన్ని నీ గురువయిన పరశురాముడు కౌరవ రాజసభలో వివరంగా చెప్పాడు. శ్రీకృష్ణార్జునులు అవధ్యులు అని సమస్త రాజుల సన్నిధిలో భీష్మద్రోణులు నిరంతరం చెప్పటం నీవు విన్నావు. సమస్తప్రాణులకంటే బ్రాహ్మణుడు శ్రేష్ఠుడయినట్లు, నీకంటే అర్జునుడు శ్రేష్ఠుడని, ఎన్ని ఉదాహరణలతో ఎంతని చెప్పేది? ఒకే రథంమీద ఉన్న వసుదేవ పుత్రుని, కుంతీ పుత్రుని, ఉత్తమరథం మీద ఉన్నవారిని ఇప్పుడే చూడగలవు. బుద్ధి గలిగి హంసను కాకి ఆశ్రయించినట్లే, వృష్ణివంశీయుడయిన శ్రీకృష్ణుని, పాండురాజపుత్రుడయిన అర్జునుని ఆశ్రయించు. యుద్ధంలో విజృంభించిన శ్రీకృష్ణార్జునులను ఒక రథంలో చూసినప్పుడు కర్ణా! నీవు ఇలా మాట్లాడవు. అర్జునుడు వందల కొలది బాణాలతో నీ పాగరు నాశనం చేసినప్పుడు, నీకూ అర్జునునికీ ఉన్న తేడాను చూస్తావు. దేవతలలో, అసురులలో, మనుష్యులలో ప్రఖ్యాతులు, నరశ్రేష్ఠ లయిన శ్రీకృష్ణార్జునులను నీవు అవమానించటం, మిణుగురు పురుగు సూర్యుని అవమానించినట్లే ఉంటుంది. మానవలోకంలో అర్జున శ్రీకృష్ణులు, ప్రకాశంలో సూర్యచంద్రులవలె సుప్రసిద్ధులు, నీవు మిణుగురు పురుగువలె ప్రసిద్ధుడవు. కర్ణా! ఈ రీతిగా నరశ్రేష్ఠులు, మహాత్ములు అయిన శ్రీకృష్ణార్జునులను అవమానించకు. డంబాలు పలుకకుండా నోరుమూసుకొని ఉండు."

42. కర్ణశల్య సంవాదము.

సంజయుడు చెప్పాడు – "మహాత్ముడయిన కర్ణుడు మద్రరాజు అయిన శల్యుని అప్రియవచనాలు విని, అసంతుష్టుడయి, 'అర్జున కృష్ణులు ఎంతటివారో నాకు బాగా తెలుసు శల్యా! రథాన్ని తోలే శ్రీకృష్ణుని బలం, అర్జునునికి ఉన్న మహాస్త్రాలు నాకు పూర్తిగా ఉన్నది ఉన్నట్లు తెలుసు. నీకు అవి ఏవీ తెలియవు. శస్త్రధారులలో శ్రేష్ఠులయిన వారిద్దరిని, నిర్భయంగా ఎదిరిస్తాను. పరశురామునివల్ల, ఒక బ్రాహ్మణుని వల్ల కలిగిన శాపాలు, నాకు సంతాపాన్ని కలిగిస్తున్నాయి. పూర్వం ఒకప్పుడు దివ్యాస్త్రప్రాప్తిని గోరి, బ్రాహ్మణవేషం వేసి, పరశురాముని వద్ద శిష్యునిగా ఉన్నాను. శల్యా! అక్కడకూడా అర్జునునికి మేలు చేయదలచిన ఇంద్రుడు విఘ్నం కలిగించాడు. ఒక రోజున మా గురువుగారు నా తొడమీద తలపెట్టి నిద్రించారు. అప్పుడు ఇంద్రుడు ఒక పురుగు

ఆకారంలో ప్రవేశించి, నావద్దకు వచ్చి నా తొడ తొలవసాగాడు. అందువల్ల గాయమయింది. ఈ పనితో ఇంద్రుడు నా కోరికకు విఘ్నం కలిగించాడు. తొడకు పెద్దగా గాయం కావటం వల్ల, నా శరీరం నుంచి రక్తం ప్రవాహంగా కారింది. గురువుగారికి నిద్రాభంగం అవుతుందేమో అని, భయంతో కదలకుండా ఉన్నాను. ఆ బ్రాహ్మణుడు లేచి ఇదంతా చూచాడు. శల్యా! ఇంత ధైర్యంగా నేను కదలకుండా ఉండటం గమనించి, పరశురాముడు 'ఓరీ! నీవు బ్రాహ్మణుడివి కావు. మరి ఎవరివి? నిజంచెప్పు' అన్నాడు, అప్పుడు నేను నిజం తెలుపుతూ, 'మహాత్మా! నేను సూతుడిని' అని చెప్పాను. నావృత్తాంతం విన్న పరశురాముడు కోపపూర్ణ చిత్తుడయి, 'సూతా! నీవు వంచనచేసి బ్రహ్మాస్త్రం పొందావు. కాబట్టి అవసరమయినప్పుడు ఈ అస్త్రం నీకు స్ఫురించదు. మరణకాలంలో తప్ప ఇతర సమయాల్లో ఈ బ్రహ్మాస్త్రం నీకు ఉపయోగపడుతుంది. బ్రాహ్మణేతరుని యందు ఆ బ్రహ్మాస్త్రం స్థిరంగా ఉండదు. అని శపించాడు. ఆ అస్త్రం భయంకరమయిన ఈ తుముల యుద్ధంలో ఉపయోగపడుతుంది. శల్యా! వీరులను ఆకర్షించే సర్వసంహారకమూ, అత్యంత భయంకరమూ అయిన ఈ ఘోరయుద్ధం భరతవంశీయులయిన క్షత్రియులకు వచ్చి పడింది. ఇది క్షత్రియజాతిలోని మిక్కిలి ప్రధానమయిన వీరులకు సంతాపకరం అవుతుందని నా నమ్మకం.

శల్యా! ఉగ్రధనుర్ధరుడు, శ్రేష్ముడు, వేషవంతుడు, భయంకరుడు, తట్టుకొనవీలుగాని పరాక్రమవంతుడు, ప్రతిజ్ఞ తప్పనివాడు, పాండురాజపుత్రుడు అయిన అర్జునుని యుద్ధంలో మృత్యుముఖం చేరుస్తాను. ఆ బ్రహ్మాస్త్రమే కాక నా దగ్గర ఇంకో అస్త్రం కూడా ఉంది. దానితో ప్రతాపవంతుడు, బలవంతుడు, అస్త్రవిద్యానిపుణుడు, ఉగ్రధానుష్కుడు, మహాతేజస్వి, క్రూరుడు, శూరుడు, భయంకరుడు, శత్రువేగం సహించగలవాడు అయిన అర్జునుని యుద్ధంలో చంపుతాను. జలాధిపతి, వేగవంతుడు, అప్రమేయుడు అయిన సముద్రుడు, జనులను ముంచివేయటానికి మహావేగాన్ని అనుసరించినప్పుడు, అనంతమయిన ఆ జలరాశిని చెలియలికట్ట నిలిపివేస్తుంది. అల్లెత్రాటిని నిపుణంగా లాగేవారిలో ఉత్తముడై, మర్మచ్ఛేదకాలు, వీరులను చంపేవి, మిక్కిలి సంతాపకరాలు అయిన బాణాలను ప్రయోగిస్తున్న అర్జునుని ఇవ్వాళ యుద్ధంలో ఎదిరించి యుద్ధం చేస్తాను. మహాబలుడు, మహాస్త్రాలు గలవాడు, సమీపింపవీలుగాని వాడు, సముద్రుని లాంటివాడు, బాణ సమూహం గలవాడు, రాజులను ముంచివేసే అర్జునుని చెలియలికట్టవలె బాణాలతో నిలువరిస్తాను. ఇవ్వాళ యుద్ధంలో ధనుర్ధారులలో అర్జునునితో సమానుడు ఇంకొకడు ఉన్నాడని అనుకోను. దేవదానవులను కూడా జయించగల పార్థునితో నాకు జరిగే ఘోరయుద్ధం ఇవ్వాళ

చూడు. యుద్ధకాంక్షి అయిన అర్జునుడు మానవాతీత మయిన మహాస్త్రాలతో సన్నద్ధుడై వస్తాడు. యుద్ధంలో ఆతని ప్రతి అస్త్రాన్ని, ఇంకో అస్త్రంతో ధ్వంసం చేసి, ఉత్తమ బాణాలతో పార్థుని నేలగూలుస్తాను. వేడిమితో మండుతూ, సర్వదిక్కులను తపింపజేస్తూ, చీకటిని పోగొడుతుండే సూర్యునివంటి అర్జునుని, మహామేఘంవలె బాణాలతో కప్పివేస్తాను. పొగలే శిఖలుగా గలవాడు, తేజస్వి, జ్వలిస్తున్నవాడు, లోకం అంతా దగ్ధం చేస్తున్న అగ్నివంటి పార్థుని, మేఘుడినై బాణవర్షంతో చల్లారుస్తాను. ధరింపవీలుగానిదై, ఇంత అని చెప్పవీలుగానిదై, మిక్కిలిపదునయిన కోరలు గల్గి, అగ్నివలె ప్రభావవంతమై, కోపంతో జ్వలిస్తూ. కీడు చేసే, మహత్తర మయిన సర్పంలాంటి అర్జునుని బాణాలతో శమింపజేస్తాను. వృక్షాదులను విరిచివేసే, బలిష్ఠమయిన ప్రచండవాయువు వలె మథించి వేసే ప్రహారశీలుడై ధ్వంసం చేసే అర్జునిని వేగాన్ని, ఇవ్వాళ యుద్ధరంగంలో నేను నిలిపివేసి ఎదుర్కొంటాను. రథమార్గాలలో సంచరించటంలో నేర్పరి, శక్తిశాలి, మహాభారాన్ని వహింపగలవాడు, లోకంలోని సమస్త ధానుష్కులలో శ్రేష్ఠుడు, మహావీరు డయిన ధనంజయుని యుద్ధంలో ఎదుర్కొంటాను.

ఈనాడు యుద్ధభూమిలో ధనుస్సు ధరించినవారిలో అర్జున తుల్యుడు లేడని అనుకొంటాను. సమస్త భూమండలాన్ని జయించిన తనిని యుద్ధభూమిలో ఎదిరించి బలంగా యుద్ధం చేస్తాను. ఖాండవ వన దహన సమయంలో, ఖాండవ ప్రస్థంలో దేవతలతో గూడా సర్వప్రాణులను జయించిన అర్జునునితో, నేను తప్ప తన జీవితాన్ని రక్షించుకొంటూ ఇంకెవడు యుద్ధం చేయగోరుతాడు? అభిమానవంతుడు, అస్త్రవిద్యావేత్త, చేతి నేర్పు గలవాడు, దివ్యాస్త్రాలు తెలిసినవాడు, సమస్తాన్ని మథించే అతిరథు డయిన అర్జునుని శరీరంనుంచి శిరస్సును పదునయిన బాణాలతో నేడు హరిస్తాను. శల్యా! మృత్యువును ముందుంచుకొని, యుద్ధంలో మరణమో, జయమో కలగాలని ఈ అర్జునునితో యుద్ధం చేస్తాను. ఇంద్రతుల్యు డయిన అర్జునునితో నాకంటే ఇతరుడు ఎవడు ఏకరథు డయి యుద్ధం చేయగలడు ? నేను అర్జునుని యుద్ధోత్సాహాన్ని క్షత్రియుల సమూహంలో సంతోషంగా చెవుతాను. నీవు మందబుద్ధివి, మూర్ఖుడివి, నీవు అర్జునుని పౌరుషాన్ని పట్టుదలతో నాముందు ఎందుకు వర్ణిస్తావు? అనిష్టుడు, నిష్కరుడు, నీచ హృదయుడు, ఓర్పులేని వాడు, ఓర్పుగలవానిని నిందించేవాడు - వీరిని వందమందిని వధిస్తాను. కాని కాలయోగం వల్ల ఓర్పుగల నేను ఇవన్నీ సహిస్తాను. పాపపు పనులు చేసేవాడా! నీవు నన్ను భయపెడుతూ, మూర్ఖునిలాగా, పాండవులకోసం అనిష్టవచనాలు పలికావు. నా విషయంలో మృదువుగా వ్యవహరించాల్సింది. కాని నీవు కుటిలబుద్ధివి, మిత్రద్రోహివి కావటం వల్ల నీపాపంతోనే మరణించావు. ఎవరితోనయినా ఏడడుగులు నడిస్తేనే మైత్రి

కలుగుతుంది. (కాని నీలో ఆ మైత్రి ఉదయించలేదు). భయంకరమయిన కాలం ఆసన్నమయింది. దుర్యోధనుడు యుద్ధభూమికి వచ్చాడు. నేను ఆతనికోరిక తీర్చదలిచాను. కాని అతని కార్యం సిద్ధించే అవకాశం లేకుండా చేయటంలో నీమనస్సు ఆసక్తమయింది. మిద్, నంద్, ప్రీ, త్రా, మి, ముద్ ధాతువులకు నిపాతనం వల్ల మిత్రశబ్దం ఏర్పడుతుంది. ఈధాతువులన్నింటి అర్థం నాలో ఉంది అని సత్యం చెపుతున్నాను. దుర్యోధనునికి ఇదంతా తెలుసు. (మిద్ మొదలయిన ధాతువులకు క్రమంగా స్నేహం, ఆనందం, సంతోషపెట్టటం, రక్షించటం, ప్రేమగా చూడటం, సంతోషం అనేవి అర్థాలు). శద్, శాస్, శో, శృ శ్వస్, షద్ ధాతువులనుండి, నానావిధాలయిన ఉపసర్గలతో కూడిన సద్ ధాతువునుండి శత్రు శబ్దం సిద్ధిస్తుంది. ఈ ధాతువులు అన్నింటి తాత్పర్యం నా విషయంలో నీకు సమన్వయిస్తుంది. (శద్ మొదలయిన ధాతువులకు అర్థం క్రమంగా ఛేదించటం శాసించటం, క్షీణింపజేయటం, హింసించటం, శిథిలం చేయటం, చంపటం).

దుర్యోధనుని కోసం, నీకు సంతోషం కలగటానికి, కీర్తికోసం, నాకోసం, భగవంతుని కోసం ప్రయత్నపూర్వకంగా అర్జున కృష్ణులతో పోరాడుతాను. ఇవ్వాళ నేను చేసే ఆ మహత్కార్యం చూడు. దివ్యమానుషా లయిన నా ఉత్తమాస్త్రాలను బ్రహ్మాస్త్రాన్ని చూడు. మదించిన ఏనుగును మిక్కిలి మదించిన ఏనుగులాగా, భయంకరపరాక్రము డయిన అర్జునుని సంహరిస్తాను. యుద్ధంలో అజేయమూ, అప్రమేయమూ అయిన బ్రహ్మాస్త్రాన్ని జయంకోసం మనస్సులో స్మరించి, అర్జునుని మీద వేస్తాను. నా రథం చక్రం విషమస్థితిలో పడిపోకుండా ఉంటే, యుద్ధంలో అతడు దానినుంచి తప్పించుకోలేడు. శల్యా! దండధారి అయిన యమునికి, పాశహస్తు డయిన వరుణునికి, గదాధారి అయిన కుబేరునికి, వజ్రహస్తు డయిన ఇంద్రునికి, చంపనుద్యుక్తు డయిన ఏ ఇతర శత్రువుకయినా నేను భయపడనని తెలుసుకో. కాబట్టి అర్జునునుంచిగాని, కృష్ణుని నుంచిగాని నాకు ఎలాంటి భయమూలేదు. ఆ ఇద్దరితో రణరంగంలో యుద్ధం తప్పక జరుగుతుంది.

నరేంద్రా! ఒకప్పుడు నేను శస్త్రాభ్యాసం కోసం విజయుడు అనే బ్రాహ్మణుని ఆశ్రమసమీపంలో సంచరించాను. ఆ సమయంలో ఘోరరూపాలు, భయంకరాలు బాణాలు వేస్తూ, తెలియక, అజాగ్రత్తవల్ల ఆ బ్రాహ్మణుని హోమధేనువు దూడను బాణంతో చంపాను. శల్యా! అప్పుడు ఆ బ్రాహ్మణుడు ఏకాంతంలో తిరుగుతూన్న నా వద్దకు వచ్చి 'నీవు పొరపాటున నా హోమధేనువు దూడను చంపావు. కాబట్టి నీవు యుద్ధరంగంలో యుద్ధం చేస్తూ చేస్తూ మిక్కిలి భయావహస్థితిని పొందినప్పుడు నీ రథచక్రం గుంటలో పడిపోతుంది.' అని అన్నాడు. బ్రాహ్మణుని ఆ శాపం వల్ల నాకు తీవ్రమయిన భయం

కలుగుతున్నది. చంద్రుడు రాజయిన ఈ బ్రాహ్మణులు శాపవరాలతో ఇతరులకు దుఃఖసుఖాలు కలిగిస్తారు. మద్రరాజా! శల్యా! ఆయనకు వేయి ఆవులను, ఆరువందల ఎద్దులను ఈయబోయాను. కాని ఆయన అనుగ్రహం పొందలేకపోయాను. బండి ఇరుసంత లావున్న దంతాలు గల ఏడువందల ఏనుగులను, వందలకొలది దాసదాసీ జనాన్ని, ఆ బ్రాహ్మణునికి ఈయజూపాను. అయినా ఆయన ప్రసన్నుడు కాలేదు. తెల్లదూడలు గల నల్ల ఆవులను పదునాలుగు వేలు ఇయ్యజూపాను. ఆ ద్విజశ్రేష్ఠుని అనుగ్రహం పొందలేకపోయాను. సమస్తమయిన వసతులతో, సమృద్ధమయిన నా గృహాన్ని, నా వద్దనున్న ధనాన్ని, నా సర్వస్వాన్ని సన్మానంతో ఆయనకు ఇవ్వ సిద్ధమయినాను. ఆయన ఇష్టపడలేదు. అప్పుడు నేను ప్రయత్నపూర్వకంగా అపరాధం క్షమించమని అడిగాను. అప్పుడు ఆయన 'సూతా! నేను అన్నది తప్పక జరుగుతుంది. దీనికి తిరుగులేదు!' అన్నాడు. అసత్యం చెప్పటం ప్రజలను చంపుతుంది. అందువల్ల పాపం కలుగుతుంది. కాబట్టి ధర్మరక్షణకై అబద్ధం చెప్పటానికి ఇష్టపడను. నీవు లోభం కలిగించి బ్రాహ్మణునికి కలిగే ఉత్తమ గతిని నాశనం చేయవద్దు. నామాటను లోకంలో ఎవ్వడూ అసత్యం చేయలేడు. కాబట్టి శాపఫలం పొందుతావు. నీవు ఎంత ఆక్షేపించినా నీయందుండే స్నేహంతో ఇది అంతా నీకు చెప్పాను. నీవు ఆక్షేపించటం, నిందించటం మానవని నాకు తెలుసు. నోరుమూసుకొని కూర్చుని నా మాట పాటించు."

43. ఆత్మప్రశంసతో కర్ణుని గర్వోక్తులు.

సంజయుడు చెప్పాడు – "మహారాజా! శత్రునాశకుడయిన కర్ణుడు, మద్రరాజును నివారించి, మళ్ళీ ఇలా అన్నాడు. "శల్యా! నీవు దృష్టాంతంగా ఒక కథ చెవుతూ నాతో వాగావు. యుద్ధరంగంలో నీవు ఇలాంటి మాటలతో నన్ను భయపెట్టలేవు. ఇంద్రునితో కలిసి, దేవతలు అందరు నాతో యుద్ధంచేసినా నాకు ఏమీ భయంలేదు. ఇక కృష్ణునితో అర్జునుడు కలిసి వస్తే లెక్క ఏమిటి ? ఇలాంటి మాటలతో నన్ను భయపెట్టటం నీవల్ల కాదు. యుద్ధభూమిలో నీవు భయపెట్టటానికి ఇంకెవడి నయినా వెతుక్కో. నన్ను పరుషంగా అనటం మాత్రమే నీకున్న బలం. దుర్మతీ! నా ఉత్తమగుణాలను చెప్పలేక నానా మాటలు అంటున్నావు. మద్రదేశీయా! కర్ణుడు భయపడటం కోసం పుట్టలేదు. నేను పరాక్రమించటానికి, నాకీర్తిని పెంపొందించుకోవటానికి పుట్టాను. శల్యా! నీవు సారథివై సఖుడివి కావటం చేత, మైత్రితో నిన్ను నేను క్షమించటం చేత, దుర్యోధనుని అభీష్టం సిద్ధించాలనుకోవటం చేత, ఈ మూడు కారణాలతో నీవు ఇప్పుడు బ్రతికి ఉన్నావు. శల్యా ! మిక్కిలి మహత్తరమయిన

దుర్యోధనుని పనికి సిద్ధం కావటం, ఆ కార్యభారం నామీద ఉండటం వల్ల ఈ క్షణం నీవు బ్రతికి ఉన్నావు. నీవు మాట్లాడే అప్రియమయిన మాటలు క్షమిస్తాను. అని పూర్వం ప్రతిజ్ఞ చేశాను. వేయి మంది శల్యులు అడ్డుపడ్డా, నేను శత్రువులను జయిస్తాను. మిత్రద్రోహం మహాపాపం అని నేను అనుకోవటం వల్ల ఇప్పుడు నీవు బ్రతికి ఉన్నావు."

44. కర్ణుడు మద్రాదిదేశవాసులను నిందించుట.

శల్యుడు అన్నాడు - "కర్ణా! శత్రువులను గూర్చి నీవు చేసే ఆక్షేప వచనాలు ప్రలాపాలు మాత్రమే. నీ వంటి కర్ణులు వేయిమంది లేకపోయినా, యుద్ధంలో శత్రువులను జయించవచ్చు." సంజయుడు చెప్పాడు - "అలా పరుషంగా మాట్లాడుతూ, అనిష్టంగా కన్పించే శల్యునితో, అంతకంటే రెండు రెట్లు అప్రియవచనాలు కర్ణుడు పలుకసాగాడు. "మద్రదేశరాజా! ధృతరాష్ట్రుని సన్నిధిలో చెపుతుండగా, నేను విన్నది చెపుతాను. ఏకాగ్ర చిత్తంతో విను. ఒకసారి ధృతరాష్ట్రుని నివాసంలో బ్రాహ్మణులు అనేకులు వచ్చి, చిత్రమయిన వివిధ దేశాలను, పూర్వపు రాజుల వృత్తాంతాలను చెపుతున్నారు. అక్కడ వృద్ధుడయిన ఒక బ్రాహ్మణోత్తముడు, బాహ్లీక దేశాన్ని, మద్రదేశాన్ని నిందిస్తూ ఇలా చెప్పాడు. హిమాలయాలు, గంగ, సరస్వతి, యమున, కురుక్షేత్రాల సరిహద్దులకు బయట ఉండేవారు, సట్లెజ్, బియాస్, రావి, చీనాబ్, ఝేలం అనే అయిదు నదులకు, ఆరవదయిన సింధునదికి మధ్యలో ఉండేవారు, అయిన వాహీకులు ధర్మబాహ్యులు, అపవిత్రులు. వారిని త్యజించాలి. గోవర్ధనం అనే మర్రిచెట్టు, సుభద్రం అనే వేదిక రెండూ అక్కడి రాజభవన ద్వారం ముందు ఉన్నాయి. అవి నాకు చిన్ననాటి నుంచీ గుర్తున్నాయి. నేను చాలా రహస్యకార్యార్థం వాహీక దేశంలో ఉన్నాను. అందువల్ల, అక్కడివారితో కలిగిన సంబంధంవల్ల, ఈ విషయం అంతా నాకు తెలిసింది. అక్కడ శాకలం అనే నగరం, ఆపగ అనే నది ఉన్నాయి. అందులో జర్తికులు అనే వాహీకులు నివసిస్తుంటారు. వారి నడవడి నింద్యం. వారు వేయించిన యవలను, వెల్లుల్లితోపాటు గోమాంసమూ తింటారు. బెల్లంతో తయారుచేసిన మద్యంత్రాగి, మత్తులు అవుతారు. తీపి పూరీలు, అరిసెలు, మాంసం, వాటియవాన్నం, కొన్న అన్నం తింటారు. వారికి శీలం లేదు. అక్కడి స్త్రీలు బయటికి బాగా కనిపించే పూలమాలలను, మైపూతలను ధరించి, మత్తలయి, నగ్నలయి పట్టణాల్లో ఇళ్ళలో, కోట గోడలమీద నిలిచి పాడతారు, ఆడతారు. వాళ్ళు గాడిదలు ఓండ్రపెట్టినట్టు, ఒంటెలు అరిచినట్లు ఉండే కంఠాలతో, మదమత్తులయి, రకరకాల పాటలు పాడతారు. మైథున

కాలంలో చాటుమాటు పాటించరు. వారందరూ స్వేచ్ఛా చారిణులు. మదమత్తులయి, ఒకరితోనొకరు సరసాలాడుకొంటూ, ఇతరులను గాయపరిచినదానా! హత్యచేసినదానా! భర్తను చంపినదానా! అని పిలుచుకొంటూ, ఆడుతుంటారు. పండుగ పబ్బాలలో, సంస్కార హీనలయిన ఆ స్త్రీలు అన్నికట్టుబాట్లను మీరి, ప్రవర్తిస్తారు. మదమత్తులు వాహీకదేశీయులయిన స్త్రీల బంధువు ఒకడు అక్కడినుంచి వచ్చి, కురుజాంగలంలో నివసిస్తూ, అత్యంతం ఖిన్నచిత్తుడయి ఇలా గొణుక్కున్నాడు.

'పాడవయినది, గౌర వర్ణం గలది, సన్నని కంబళివంటి చీరను కట్టుకొన్న నాప్రేయసి, కురుజాంగలంలో ఉండే వాహీకుడినయిన నన్ను, నిరంతరం గుర్తుచేసుకొంటూ ఉంటుంది. ఇది నిజం. నేను సట్లెజ్‌ను అందమయిన రావి నదిని దాటి, నాదేశానికి వెళ్ళి, శంఖాలతో చేసిన పెద్దపెద్ద గాజులు తొడుక్కునే అక్కడి సుందరీమణులను ఎప్పుడు చూస్తానో కదా! మణిసిల ఆలేపంతో కన్నులను అలంకరించుకొని, ఉజ్జ్వలంగా కన్పించేవారు, గోధుమరంగు గలవారు, కన్నులు నుదురు కాటుకతో శోభించేవారు, శరీరాన్ని అంతను కంబలితో, చర్మంతో కప్పుకొన్నవారు, అందగత్తె లయిన రమణీమణులు మద్దెల, డోలు, శంఖం, మర్దలాలను వాయిస్తూ నృత్యంచేసేవారిని ఎప్పుడు చూస్తానో కదా! మేము అందరం మద్యమదమత్తులమయి గాడిదలు, ఒంటెలు, కంచర గాడిదల మీద ఎక్కి సుఖకరమయిన త్రోవలు గల జమ్మి, గోగు, వెదురు పొదలు గల అడవులలో సుఖంగా ఎప్పుడు వెళ్తామో కదా! త్రోవలో అరిసెలను, తీపి పూరీలను, మజ్జిగతో కూడా పేలపిండిముద్దలను తింటూ, బాగా బలిష్ములమయి వెళ్ళుతూ, బాటసారుల వస్త్రాలను అపహరించి, వాళ్ళను బాగా ఎప్పుడు కొడతామో కదా!' సంస్కార శూన్యులు, దురాత్ములయిన వాహీకులు ఇలాంటి స్వభావం గలవారే. వివేకం గల ఏ సత్పురుషుడు వారి ఎదుట రెండు గడియలు నిలుచుంటాడు? శల్యా! ఆ బ్రాహ్మణుడు నిరర్థకమయిన ఆచార వ్యవహారాలు గల వాహీకులను గూర్చి చెప్పాడు. ఆలాంటి వారి పాపపుణ్యాలలో, ఆరో భాగాన్ని నీవు తీసుకొంటున్నావు. ఇలా చెప్పి, ఆ బ్రాహ్మణోత్తముడు అవినీతులయిన వాహీకులను గూర్చి ఇంకా చెప్పాడు. అదీ చెపుతాను విను.

ఆ దేశంలో ఒక రాక్షసి ఉంది. ఆమె ప్రతి కృష్ణపక్ష చతుర్దశినాడు, సర్వసంపదలతో నిండిన శాకల నగరంలో, రాత్రిపూట దుందుభి మ్రోగిస్తూ ఇలా పాడుతుంటుంది. గోమాంసాన్ని తృప్తిగా తిని, బెల్లంతో చేసిన మద్యంత్రాగి, నిండుదోసిలి ఉల్లిగడ్డలతో పాటు చాలా గొర్రెలను తింటూ బాగా లావయినవారు, చక్కగా అలంకరించుకొన్న

గోధుమ రంగు గల స్త్రీలతో కలిసి ఈ శాకల నగరంలో వాహీకుల గాథలను ఎప్పుడు పాడుతానో గదా! పందిమాంసం, కోడి మాంసం, గోమాంసం, గాడిద మాంసం, ఒంటె మాంసం, గొర్రె మాంసం తిననివారి బ్రతుకు వ్యర్థం.' మద్యంతో మత్తులయి శాకల దేశీయులు, ఆబాల వృద్ధులయిన జనులు ఈరీతిగా గానం చేస్తారు. వారిలో ధర్మం ఎలా ఉంటుంది ? శల్యా! ఈ చెప్పింది తెలుసుకో. ఆ బ్రాహ్మణుడు కౌరవ సభలో చెప్పింది మళ్ళీ చెపుతాను విను. శతద్రు (సట్లేజ్), విపాశ (వ్యాస్), ఐరావతి (రావి),, చంద్రభాగ (చీనాబ్) వితస్త (జీలం) అనే అయిదు నదులు, ఆరవది సింధునది ప్రవహిస్తుంటాయి. అక్కడ పీలు (గోగు) చెట్లు అడవులు చాలా ఉన్నాయి. హిమాలయానికి ఇవతలిదయిన ఆ ప్రదేశాన్ని ఆరట్ట దేశం అంటారు. అక్కడ ధర్మం నశించింది. అక్కడికి వెళ్ళగూడదు. ధర్మకర్తలు నశించిన వారు సంస్కార హీనులు, వ్యభిచారం వల్ల పుట్టినవారు అయిన వాహీకులు యజ్ఞాలు చేయరాదు. వారు ఇచ్చే ద్రవ్యాన్ని దేవతలు, పితరులు, బ్రాహ్మణులు స్వీకరించరు అని విన్నాం. విద్వాంసుడయిన బ్రాహ్మణుడు సాధువుల సదస్సులో ఇలా చెప్పాడు – 'వాహీకులు పేలపిండి, మద్యం అతుకుకొన్న, కుక్కలు నాకిన కట్టె కుండలలో, మట్టికుండలలో అసహ్యం లేకుండా తింటారు. గొర్రెల, ఒంటెల, గాడిదలపాలు త్రాగుతారు. వాటితో తయారయిన పెరుగు మొదలయినవాటిని తింటారు. జారజ పుత్రులను కనేవారు, నీచులు, ఆరట్టకులు అనే వాహీకులు అన్ని అన్నాలు తింటారు. అన్ని పశువులపాలు త్రాగుతారు. కాబట్టి విద్వాంసుడు వారిని దూరంగా ఉంచాలి.' శల్యా! ఇది తెలుసుకో. కౌరవసభలో బ్రాహ్మణుడు చెప్పినది ఇంకా నీకు మళ్ళీ చెపుతాను.

'యుగంధర నగరంలో పాలు త్రాగి, అచ్యుత స్థలం అనే నగరంలో ఒకరాత్రి నివసించి, భూతిలయంలో స్నానం చేసి, మానవుడు స్వర్గానికి ఎలా వెళ్ళగలడు ? పర్వతం నుంచి బయలుదేరి, వెనకచెప్పిన పంచ నదులు ప్రవహించే ఆరట్ట మనే పేరుతో ప్రసిద్ధమయిన వాహీక ప్రదేశాలు ఉన్నాయి. ఉత్తమ వ్యక్తులు ఆ దేశాల్లో రెండు రోజులు కూడా నివసించరు. విపాశా నదిలో రెండు పిశాచాలు ఉన్నాయి. వాటిల్లో ఒకదాని పేరు బహికం. ఇంకో దానిపేరు హీకం. ఈ ఇద్దరి సంతానాన్ని బాహీకులు అంటారు. బ్రహ్మ వీటిని సృష్టించలేదు. నీచ జాతిలో పుట్టిన ఈ మనుష్యులు నానా విధ ధర్మాలను ఎలా తెలుసుకోగలరు ? కారస్కరాలు, మాహిషకాలు, కారండాలు, కేరళాలు కర్కోటకాలు, వీరకాలు అనే దేశాలు ధర్మహీనాలు కాబట్టి ఈ దేశాలను వదలివెయ్యాలి. పెద్దపెద్ద

రోళ్ళను వడ్డాణంగా ధరించిన ఒక రాక్షసి, ఒక తీర్థయాత్రికుని ఇంటిలో ఉండి ఇలా అన్నది. బ్రహ్మదేవునితో సమానమయిన కాలంగల (అతి ప్రాచీనులయిన) నీచ బ్రాహ్మణులు నివసించేది ఆరట్ట దేశం. అక్కడి నీటిపేరు వాహీకం. ఆ అధమ బ్రాహ్మణులకు వేదజ్ఞానం లేదు. యజ్ఞవేదికలు అక్కడ లేవు. వారు యజ్ఞయాగాదులు చేయరు. వారు సంస్కారహీనులు. దాసులతో సంయోగం గల కులట లయిన స్త్రీల సంతానం వారు, కాబట్టి దేవతలు వారిచ్చే ఆహారం స్వీకరించరు. ప్రస్థలం, గాంధారం, ఆరట్టం, ఖశం, వసాతి, సింధు, సౌవీరాలు అనే దేశాలు చాలా నింద్యమయినవి.

45. కర్ణశల్య సంవాదము.

కర్ణుడు చెప్పాడు – "శల్యా! ఇది బాగా తెలుసుకో. మళ్ళీ కొన్ని విషయాలు చెపుతాను. నేను చెప్పేది అంతా ఏకాగ్రమయిన మనస్సుతో చక్కగా విను. పూర్వకాలంలో ఒకనాడు మాయింటికి ఒక బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. ఆయన మాయింటిలోని ఆచార వ్యవహారాలు చూసి, సంతోషించి ఇలా అన్నాడు. నేను హిమత్పర్వత శిఖరం మీద చాలాకాలం ఒంటరిగా ఉన్నాను. విభిన్న ధర్మాలుగల అనేక దేశాలను చూశాను. ఈ దేశాలు అన్నింటిలోని జనులు, ఏకారణం వల్లనూ ధర్మ విరుద్ధంగా ప్రవర్తించరు. వేదవేత్తలయినవారు చెప్పిన ధర్మాన్ని వారు యథాతథంగా అనుసరిస్తారు. చెపుతారు. మహారాజా! నానాధర్మాలతో నిండి ఉన్న అనేక దేశాలలో సంచరించాను. తిరిగివస్తూ వాహీక దేశంలో నిలిచాను. ఆ దేశంలో వాహీకుడు మొదట బ్రాహ్మణు డయి తరువాత క్షత్రియు డవుతాడు. తరువాత వైశ్యు డవుతాడు. అతడే శూద్రు డవుతాడు. మంగలి అవుతాడు. మళ్ళీ ఆతడే బ్రాహ్మణుడు అవుతాడు. ద్విజు డయిన వాడే మళ్ళీ దాసు డవుతాడు.* అక్కడ ఒకే కులంలోని కొందరు బ్రాహ్మణులు కాగా, కొందరు స్వేచ్ఛాచారులయి, వర్ణసంకర సంతానాన్ని కంటారు. గాంధార, మద్రక, వాహీక దేశీయులు మందబుద్ధులు. సమస్త భూమండలంలో సంచరించి, వాహీకులలో మాత్రమే ధర్మవ్యవహారంలో విపరీత ప్రవర్తన చూచాను. ఆ దేశంలో ధర్మసాంకర్యం వ్యాపించే విషయం విన్నాను.' శల్యా! ఈ చెప్పింది బాగా తెలుసుకో. వాహీకుల నీచకార్యాలను ఇతరులు కూడా కొన్ని చెప్పారు. వాటిని చెపుతాను విను.

పూర్వకాలంలో ఒకప్పుడు కొందరు దోపిడీ దొంగలు ఆరట్ట దేశంనుంచి ఒక

* *(విభిన్న) జాతుల కర్మలను చేయటం వల్ల అతన్ని ఆయా జాతుల పేర్లతో వ్యవహరిస్తారు.*

ఉత్తమ స్త్రీని అపహరించారు. అధర్మంగా ఆమెను బలాత్కరించారు. అందువల్ల ఆమె వారిని శపించింది. 'ఇప్పుడు నేను బాలికను. బంధువులున్నారు. అయినా నన్ను మీరు అధర్మంగా చెరిచారు. కాబట్టి ఈకులంలోని స్త్రీలు అందరు వ్యభిచారిణులు ఆవుతారు. నరాధములారా! ఇందువల్ల మీరు ఈ ఘోరమయిన పాపాన్నుంచి విముక్తి పొందలేరు.' కాబట్టి వారి ఆస్తిపాస్తులకు వారసులు మేనళ్ళుల్లు అవుతారు కాని కొడుకులు కారు. కురు దేశీయులు, పాంచాలురు, సాల్వులు, మాత్స్యులు, నైమిషులు, కోసలులు, కాశీ దేశీయులు, ఆంగదేశీయులు, కాళింగులు, మాగధులు, చేది దేశీయులు అయిన ఉత్తమ వ్యక్తులకు ధర్మం తెలుసు. భిన్నభిన్న దేశాలలో, బాహీకులు తప్ప, దాదాపుగా అంతటా ఉత్తమ పురుషులుంటారు. మత్స్యదేశంనుంచి కురుపాంచాల దేశాలవరకు, నైమిషంనుంచి చేదిదేశం వరకు విశిష్ట లయిన సజ్జనులు ప్రాచీన మయిన ధర్మాన్ని అనుసరించి బ్రతుకుతారు. మద్ర, పంచనదదేశీయులు అలాంటివారు కాదు. అక్కడివారు కుటిలులు. రాజా! శల్యా! ఈ రీతిగా తెలుసుకొని, నీవు జడుని వలె నోరు మూసుకొని ఉండు. నీవు అలాంటి వారిని రక్షించే రాజువు. వాళ్ళు చేసే మంచి చెడుల ఆరవభాగాన్ని తీసుకొనేవాడవు. లేక వారిని సరిగా రక్షించకపోవటం వల్ల, వారి పాపాలను మాత్రమే తీసుకొనే వాడివి. రక్షించే రాజు పుణ్యం పొందుతాడు. నీవు పుణ్య భాజనుడివి కావు. సర్వదేశాల్లో, పూర్వం శాశ్వతమయిన ధర్మం పూజను పొందుతుండగా, పంచనద దేశంలోని ధర్మాన్ని చూసి, బ్రహ్మదేవుడు, ఛీ ఛీ అన్నాడు. సంస్కారహీనులు, జారులవల్ల పుట్టినవారు, పాపాత్ములు అయిన పంచనద వాసుల ధర్మాన్ని, బ్రహ్మదేవుడు కృతయుగంలోనే నిందించాడు. అలాంటి దేశ వాసివయి, నీవు లోకంలో ఎందుకు ధర్మోపదేశం చేస్తావు ? బ్రహ్మదేవుడు ఈ రీతిగా, పంచనద దేశ వాసుల ధర్మాన్ని నిందించాడు. స్వధర్మ తత్పరు లయిన అన్యదేశీయులతో పోలిస్తే, వీరిని ఆయన ఆదరించలేదు.

ఆహా! శల్యా! ఇది బాగా తెలుసుకో. ఇంకా ఈ విషయంలో కొంత విషయం చెపుతాను. కల్మాషపాదుడనే రాక్షసుడు సరస్సులో మునిగిపోతూ ఇలా చెప్పాడు. క్షత్రియునికి యాచన మలం (పాపం). వేదశాస్త్రాలకు వ్యతిరేకంగా వ్యవహరించటం బ్రాహ్మణునికి మలం. భూమికి మలం వాహీకులు, స్త్రీలకు మద్రదేశీయస్త్రీలు మలం. ఒకరాజు మునిగిపోయే ఆ రాక్షసుని ఉద్ధరించి, ఇలా ప్రశ్నించాడు. ఆయన ప్రశ్నకు రాక్షసు డిచ్చిన సమాధానం చెపుతా విను. 'మనుష్యులలో మలం మ్లేచ్ఛులు, మ్లేచ్ఛుల మలం ఈడిగవాడు. మద్యవిక్రేతల మలం నపుంసకులు. నపుంసకుల మలం రాజపురోహితులు. నన్ను ఈ సరస్సునుంచి

తీయకపోతే, రాజపురోహితుల పురోహితుల, మద్రదేశవాసుల మలం అంతా నీకే వస్తుంది. రాక్షస ప్రభావానికి లోనయిన వారికి, విష ప్రభావంతో హతులయినవారికి, ఉత్తమమయిన ఈ సిద్ధవాక్యమే రాక్షస భావాన్ని నివారించేది, జీవితాన్ని రక్షించే సిద్ధౌషధం అని చెప్పారు. పాంచాల దేశీయులు వేదోక్త ధర్మాన్ని ఆశ్రయిస్తారు. కురుదేశీయులు ధర్మానుకూల కార్యాలు చేస్తారు. మత్స్యదేశీయులు నిజం చెపుతారు. శూరసేనులు యజ్ఞాలు చేస్తారు. ప్రాచ్య దేశీయులు దాస్యం చేస్తారు. దాక్షిణాత్యులు వృషలులు, వాహీక దేశీయులు దొంగలు. సౌరాష్ట్ర దేశీయులు వర్ణసంకరులు. చేసిన మేలు మరవటం, ఇతరుల సొత్తు అపహరించటం, మద్యపానం, గురుదారా గమనం, కఠినంగా పలకటం, గోవధ, రాత్రిళ్ళు బయట తిరగటం, ఇతరుల వస్త్రాలను ఉపయోగించటం, అనేవి ధర్మమయిన ఆరట్ట దేశీయులకు, పంచనద వాసులకు అధర్మమనేదే లేదు. వారు నింద్యులు. పాంచాలురు, కౌరవులు, నైమిషులు, మత్స్యదేశీయులకు ధర్మం తెలుసు. ఉత్తర దేశీయులు, అంగులు, మగధ దేశీయులయిన వృద్ధులు శాస్త్రోక్తాలయిన ధర్మాన్ని అనుసరించి జీవిస్తారు.

అగ్ని మొదలయిన దేవతలు తూర్పు దిక్కులను ఆశ్రయించి ఉంటారు. శుభకర్మలు చేసే యముడు రక్షించే దక్షిణ దిక్కున పితృదేవతలుంటారు. దేవతలను పాలిస్తూ, బలవంతుడయిన వరుణుడు పడమటి దిక్కును రక్షిస్తుంటాడు. భగవంతుడయిన సోముడు బ్రాహ్మణులతో కూడా ఉత్తర దిక్కును రక్షిస్తుంటాడు. మహారాజా! రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు పర్వతశ్రేష్ఠమయిన హిమవంతాన్ని, గంధమాదన పర్వతాన్ని రక్షిస్తుంటారు. శాశ్వతుడయిన విష్ణువు సర్వప్రాణులను రక్షిస్తుంటాడు. మగధ దేశీయులు, సూచనతోనే అభిప్రాయం తెలుసుకొంటారు. కోసల దేశీయులు, చూపులను గమనించి, మనస్సులోది తెలుసుకొంటారు. కురుపాంచాలదేశీయులు సగం మాటతోనే పూర్తివాక్యం తెలుసుకొంటారు. శాల్వదేశీయులు పూర్తిగా చెపితేనే తెలుసుకొంటారు. శిబి దేశీయులతో పాటు పార్వతీయులు వైవారికి పూర్తిగా వ్యతిరేకులు. వారికి వివరించి చెప్పినా తెలియదు. రాజా! యవనులు, మ్లేచ్ఛులు, సర్వోపాయాలతో విషయం తెలుసుకొంటారు. విశేషించి శూరులు వారు. తాము కల్పించుకున్న సంజ్ఞల మీదనే పట్టుకలిగి ఉంటారు. (వైదిక ధర్మాన్ని అంగీకరించరు). ఇతర దేశీయులు చెప్పకుండా తెలుసుకోలేరు. కాని వాహీక దేశీయులు ప్రతి పనీ వ్యతిరేకంగా చేస్తారు. (వారు తెలుసుకోవటమే వ్యతిరేకరీతి) మద్రదేశీయులు కొందరికి ఏమీ తెలియదు. శల్యా! నీవు అలాంటి వాడివి. ఇంక బదులు చెప్పకు. భూమండలంలోని సర్వదేశాలకు మద్రదేశీయులు మలం అంటారు. మద్యపానం,

గురుతల్పగమనం, భ్రూణ హత్య, ఇతర ధనాపహరణ, అనేవి ధర్మ మయిన ఆరట్ట దేశీయులకు, పంచనద నివాసులకు అధర్మం ఏదీలేదు. వారు నింద్యులు. ఇది అంతా తెలుసుకొని నోరుమూసుకో. వ్యతిరేకంగా మాట్లాడకు. అలా చేయకపోతే నిన్ను ముందు చంపి, తరువాత కృష్ణార్జునులను వధిస్తాను."

శల్యుడన్నాడు – "కర్ణా! నీవు పాలించే అంగదేశంలో జరిగే దేమిటి! రోగగ్రస్తులను వదలి వేయటం, తమ భార్యాపుత్రులను అమ్ముకోవటం అంగదేశంలో జరుగుతుంటుంది. అతిరథ మహారథులను లెక్కించేటప్పుడు, భీష్ముడు నిన్ను గూర్చి చెప్పింది తెలుసుకొని, కోపం వీడి శాంతించు. కర్ణా! అంతటా ఉత్తమ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఉత్తమనియమాలు గల స్త్రీలు ఉన్నారు. అన్నిదేశాల్లో పురుషులు, పురుషులతో మాట్లాడేటప్పుడు, ఉపహాసంతో పరస్పరం గాయపరచుకొంటారు. స్త్రీలతో రమిస్తుంటారు. ఎదుటివారి తప్పులు చెప్పటంలో అందరూ నేర్పరులే. తమ దోషాలను మాత్రం తెలుసుకోరు. తెలిసినా, తెలియనివారై ఉంటారు. తమతమ ధర్మాన్ని అనుసరించే రాజులు అంతటా ఉన్నారు. వారు దుష్టులను నిగ్రహిస్తారు. అంతటా ధర్మాత్ములు ఉంటారు. కర్ణా! ఒక దేశంలో ఉండటం వల్ల ప్రతివాడూ పాపం చేయడు. తమ తమ స్వభావాలతో మానవులు మహాత్ములు అవుతారు. దేవతలు గూడా వారితో సాటిరారు."

సంజయుడు చెప్పాడు – అప్పుడు దుర్యోధనుడు కర్ణశల్యులను ఇద్దరిని నిరోధించాడు. కర్ణుని మైత్రి భావంతోను శల్యుని నమస్కారంతోను శాంతింపజేశాడు. మాన్యా! అప్పుడు దుర్యోధనుడు కర్ణుని వారించాడు. కర్ణుడు ఏమీ సమాధానం చెప్పలేదు. శల్యుడు శత్రువులకు అభిముఖు డయినాడు. నవ్వుతూ కర్ణుడు శల్యుని 'ముందుకు పద' అని ప్రోత్సహించాడు."

46. శల్యుడు పాండవవీరులను అర్జునుని ప్రశంసించుట.

సంజయుడు చెప్పాడు – "భరతవంశ శ్రేష్ఠా! తరువాత పాండవులు శత్రుసేనలు తట్టుకొనలేనట్లుగా, సాటిలేని మహావ్యూహాన్ని పన్నారు. దాన్ని ధృష్టద్యుమ్నుడు రక్షిస్తున్నాడు. ఆ వ్యూహాన్ని చూసిన కర్ణుడు రథఘోష, సింహనాద ధ్వనితో, యుద్ధవాద్యాల మ్రోతలతో, భూమిని కంపింపజేస్తూ బయలుదేరాడు. మహాతేజస్వి, శత్రుసంతాపకుడు, యుద్ధవిద్యాకుశలుడు అయిన ఆయన, ప్రతివ్యూహాన్ని యథావిధిగా పన్ని, ఆసురసేనను ఇంద్రుని వలె, పాండవసేనను నాశనం చేయ ప్రారంభించాడు. యుధిష్ఠిరుని గాయపరచి, తనకు కుడివైపు చేశాడు.

ఆ నీ సైన్యాలు అన్నీ కర్ణునిచూసి, యుద్ధం చేయాలనే కాంక్షతో ఉత్సాహ హర్షపూర్ణా లయ్యాయి. అప్పుడు మీ సైనికులు అన్న మాటలు ఇలా విన్పించాయి. ఇవ్వాళ కర్ణార్జునుల మధ్య మహాయుద్ధం జరగబోతున్నది. ఇవ్వాళ రాజయిన దుర్యోధనుని శత్రువులు అందరు హతులవుతారు. ఇవ్వాళ యుద్ధభూమిలో, అర్జునుడు కర్ణుని చూసి, వరిగెత్తుతాడు. ఇవ్వాళ మేము అందరం కర్ణునే అనుసరిస్తాం. రణభూమిలో కర్ణబాణమయ మయిన భయంకర యుద్ధాన్ని చూస్తాం. చాలాకాలానికి తరువాత వచ్చిన ఇది ఇవ్వాళ జరుగుతుంది. దేవదానవ సంగ్రామం వంటి ఘోరయుద్ధాన్ని ఇవ్వాళ చూస్తాం. ఇవ్వాళ ఇప్పుడు భయంకరమయిన మహాయుద్ధం జరుగుతుంది. ఇవ్వాళ ఇప్పుడు రణభూమిలో వీరిద్దరిలో ఒకరికి విజయం లభిస్తుంది. రాధేయుడు అర్జునుని మహారణంలో తప్పక వధిస్తాడు. లేదా ఈ లోకంలో వీమనుష్యుని కోరికలు అంటకుండా ఉంటాయి.

సంజయుడు చెప్పాడు - "కురునందనా! ఇలా సైనికులు పలుమాటలు పలికి, వేల నగారాలను ఇతర వాద్యాలను మ్రోగించారు. రకరకాల భేరీధ్వనులు విన్పించాయి. సమృద్ధిగా సింహనాదాలు చేశారు. గంభీరంగా ధ్వనించే డోళ్ళు, మృదంగ ధ్వనులు అక్కడ అంతటా విన్పించాయి. మాన్యా! చాలామంది సైనికులు నృత్యం చేస్తూ, శత్రువులను భయపెడుతూ, యుద్ధరంగంలో ఉన్నవారు ఒకరినొకరు ఎదుర్కొన్నారు. వారిలో వీరులయిన వదాతులు పట్టిశాలను, ఖడ్గాలను ధరించినవారు, ధనుర్బాణాలను, భుశుండులను దాల్చినవారు, శూలహస్తులు, చక్రాయుధులు అయి వీనుగుల పాదరక్షకులుగా నిలిచారు. దేవదానవ యుద్ధంలాంటి మహాయుద్ధం వారిమధ్య ప్రారంభమయింది."

ధృతరాష్ట్రుడు అడిగాడు - "సంజయా! భీమునిచేత రక్షితులు, మహాధానుష్కులు, దేవతలకు కూడా జయింపవీలు గానివారు, అయిన పాండవు లందరినీ ఎదుర్కొనదగిన వ్యూహాన్ని కర్ణుడు ఎలా పన్నాడు? సైన్యంలోని రెండు పక్షాలు, ఉపపక్షాలుగా ఏయే వీరులు ఉన్నారు? వారు ఏరీతిగా తగినట్లుగా యోధులను విభజించి నిలిచారు ? మావాళ్ళను ఎదుర్కొనటానికి తగినట్లుగా, పాండవులు ప్రతివ్యూహం ఎలా పన్నారు? మిక్కిలి దారుణమయిన మహాయుద్ధం ఎలా ప్రవర్తిల్లింది? కర్ణుడు యుధిష్ఠిరుని ఎదుర్కొనినప్పుడు, అర్జునుడు ఎక్కడ ఉన్నాడు ? అర్జునుని సన్నిధిలో యుధిష్ఠిరుని ఎవడు ఎదుర్కొనగలడు? పూర్వం, ఖాండవవనంలో సర్వప్రాణులను తానొక్కడే ఎదుర్కొనిన అర్జునుని, కర్ణుని కంటె ఇతరుడు ఎవడు బ్రతకదలచినవాడు ఎదుర్కొని యుద్ధం చేయగలడు ?"

సంజయుడు చెప్పాడు - "రాజా! వ్యూహనిర్మాణాన్ని, అర్జునుడు ఎక్కడికి వెళ్ళాడో అన్నదాన్ని, తమ తమ రాజును సేన చుట్టు కాచుకొని యుండగా, యుద్ధం ఎలా జరిగిందో అదీ - చెపుతాను విను. రాజా! కృపాచార్యుడు, వేగవంతులయిన మాగధులు కృతవర్మ కుడివైపు పక్షాన్ని ఆశ్రయించి, ఉన్నారు. వారికి ఎదుటి కుడిపక్షాన్ని శకుని, మహారథుడయిన ఉలూకుడు నిర్మలమయిన ప్రాసాయుధాలు గల గుర్రపు రౌతులతో

గూడి నీ పక్షాన్ని రక్షించారు. ఏ మాత్రం తొట్రుపడని గాంధార వీరులు, దుర్జయులయిన పర్వత దేశవాసులు, మిడుతలదండువలె, పిశాచాలు కూడా కన్నెత్తి చూడలేని రీతిగా ఉన్నారు. కృష్ణార్జునులను సంహరింపదలచిన వారు, యుద్ధనిపుణులయిన సంశప్తకులు. వెనుదిరుగని రథికులు ముప్పది నాలుగు వేలమంది నీ పుత్రులతో గూడి, కౌరవ సైన్యంలో ఎడమభాగాన్ని రక్షించారు. వారికి ప్రక్కన యవనులతో కూడా, కాంబోజులు, శకులు రథాలతో, అశ్వాలతో, పదాతులతో గూడి, కర్ణుని ఆజ్ఞానుసారం, మహాబలుడయిన కృష్ణుని, అర్జునుని యుద్ధానికి పిలుస్తూ నిలిచి ఉన్నారు. కౌరవ సేనాగ్రభాగమధ్యంలో నిలచి విచిత్రకవచాన్ని, బాహుపురులను, హారాలను ధరించి, కర్ణుడు సేనాముఖాన్ని రక్షిస్తూ ఉన్నాడు. సూర్యునితో, అగ్నితో సమానమయిన ప్రకాశం కలవాడు, మహాబాహువు, శస్త్రధారులలో శ్రేష్ఠుడు, వీరుడు అయిన కర్ణుడు మహోత్సాహంతో, సేనాపతిని రక్షించుకొంటున్న నీ పుత్రులతో గూడి, నీ సేనాముఖంలో ఉండి, దాన్ని నడిపిస్తూ విలసిల్లాడు. పెద్ద ఏనుగు మూపుమీద పచ్చని కన్నులు గల, అందగాడు అయిన దుఃశాసనుడు, సైన్యాలు చుట్టూ ఉండగా వ్యూహానికి వెనక ఉన్నాడు. మహారాజా! ఆయన వెంట స్వయంగా దుర్యోధనుడు నడిచాడు. విచిత్రమయిన అస్త్రాలు, చిత్రకవచాలు గల సోదరులు ఆయనను రక్షిస్తున్నారు. మహా పరాక్రమవంతులయిన మద్రకేకయులతో రక్షింపబడుతూ ఆయన దేవతలతో గూడిన ఇంద్రునివలె విరాజిల్లాడు. అశ్వత్థామ, కౌరవవీరులలోని మహారథులు, శూరులయిన మ్లేచ్ఛులతో కూడా నిత్యం మదమత్తాలయిన మహాగజాలు, వర్షిస్తున్న మేఘాలవలె మదధారలను స్రవిస్తూ, ఆ రథసమూహాన్ని అనుసరించి నడిచాయి. పతాకలతోగూడిన ధ్వజాలతో, జ్వలిస్తున్న పరమాయుధాలతో, అశ్వారోహకులతో కలిసి వారు వృక్షాలుగల పర్వతాలవలె విరాజిల్లారు. పట్టిశాలను, ఖడ్గాలను ధరించినవారు, యుద్ధంలో వెనుకడుగువేయని శూరులు వేలమంది ఆ పదాతులకు, ఏనుగులకు పాదరక్షకులుగా ఉన్నారు. అశ్వారోహకులతో, రథాలతో, అలంకృతా లయిన ఏనుగులతో గూడిన ఆశ్రేష్ఠవ్యూహం దేవదానవ సైన్యంలాగా విరాజిల్లింది. విద్వాంసుడు, సేనాపతి అయిన కర్ణుడు బృహస్పతి చెప్పిన రీతిగా చక్కగా పన్నిన ఆ మహావ్యూహం, నృత్యం చేస్తున్నట్లుగా, శత్రువులకు భయంకరమయి విలసిల్లింది. ఆ మహాసేనకు గల పక్ష ప్రపక్షాల నుండి యుద్ధకాంక్షతో పదాతులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు వర్షాకాలంలోని మేఘాలలాగా బయలుదేరి వస్తున్నాయి.

కౌరవసేనకు ముందున్న కర్ణుని చూసి, యుధిష్ఠిరుడు అర్జునునితో ఇలా

అన్నాడు. "అర్జునా! పక్షాలతో, ప్రపక్షాలతో కర్ణుడు రణభూమిలో పన్నిన శత్రువుల మహావ్యూహం ప్రకాశిస్తున్నది చూడు. ఆ ఈ మహత్తర శత్రుబలాన్ని చక్కగా జూసి, అది మనలను పరాభవించకుండా ఉండేటట్లు నీతిని అనుసరించు." అని రాజు చెప్పగా అర్జునుడు దోసిలొగ్గి, 'నీవు చెప్పినట్లే అంతా ఉన్నదిగాని ఇంకోరీతిగా లేదు. భారతా! యుద్ధనీతిశాస్త్రంలో ఈ వ్యూహాన్ని నాశనం చేయటానికి చెప్పిన ఉపాయాన్ని అనుసరిస్తాను. ప్రధాను డయిన సేనాపతి వధయే దీని వినాశానికి తగినది. దాన్ని చేస్తాను' అన్నాడు. యుధిష్ఠిరుడన్నాడు - "కాబట్టి నీవే కర్ణుని, భీముడు దుర్యోధనుని, నకులుడు వృషసేనుని, సహదేవుడు శకునిని, శతానీకుడు దుఃశాసనుని, సాత్యకి, కృతవర్మను, ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను ఎదుర్కొనాలి. నేను స్వయంగా కృపాచార్యునితో యుద్ధం చేస్తాను. ద్రౌపదీ పుత్రులు శిఖండితో కలిసి మిగిలిన కౌరవులతో పోరాడాలి. ఆయా శత్రువులను మనవారిలో ఆయా వీరులు సంహరించాలి." సంజయుడు చెప్పాడు - ధర్మరాజు ఇలా చెప్పగా అర్జునుడు 'సరే!' అని తన సైన్యాలను ఆయన చెప్పినట్లు ఆదేశించి, స్వయంగా సేనాముఖానికి వచ్చాడు.

"మహారాజా! పాండవసైన్యానికి అర్జునుడు దక్షిణ పక్షంలో ఉన్నాడు. మహాబాహు వయిన భీముడు వామపక్షాన్ని ఆశ్రయించి ఉన్నాడు. సాత్యకి, ద్రౌపదీ పుత్రులు, యుధిష్ఠిరుడు తమ సేనలు చుట్టు ఉండగా వ్యూహానికి ప్రముఖభాగంలో ఉన్నారు. అర్జునుడు తన సైన్యంలో శత్రుబలానికి ప్రతిగా వ్యూహం పన్ని, నిలిపాడు. ధృష్టద్యుమ్న శిఖండులను ముందు నిలిపాడు. ధృష్టద్యుమ్నుడు అగ్రభాగాన ఉన్న ఆ మహాసైన్య వ్యూహం అశ్వ, హస్తి, పదాతి, రథాలతో నిండి విరాజిల్లింది.

బ్రహ్మదేవుని ముఖంనుంచి మొదట ఆవిర్భవించినవాడు, వేదమంత్రాలతో ప్రజ్వలించేవాడు, అందరికంటె మొదట కలిగినవాడు, సర్వ విశ్వానికి నాయకుడు అయిన అగ్నిదేవుని దేవతలు బ్రాహ్మణుడు అంటారు. ఆయన అర్జునుని దివ్యరథానికి ఆశ్వా లయి ఉన్నాడు. పూర్వం బ్రహ్మను, రుద్రుని, ఇంద్రుని, వరుణుని వహించిన ఆద్యమయిన రథాన్ని అధిష్ఠించి శ్రీకృష్ణార్జునులు వెళ్ళారు. అత్యద్భుతంగా కన్పిస్తూ వస్తున్న ఆ రథాన్ని చూసి శల్యుడు యుద్ధమదమత్తు డయిన కర్ణునితో మళ్ళీ ఇలా అన్నాడు. "కర్ణా! తెల్లని అశ్వాలు పూన్చి, శ్రీకృష్ణుడు సారథిగా గల ఈ రథం వచ్చింది. కర్మల పరిపాకంవలె సమస్త సేనలకు వారింపవీలుగానిది ఇది. నీవు అడిగే ఆ అర్జునుడు ఈ రథం ఎక్కి వచ్చాడు. మహత్తరమయిన మేఘగర్జనవలె భయంకరమయిన ధ్వని వినవస్తున్నది. ఈ వచ్చేవారు మహాత్ములయిన శ్రీకృష్ణార్జును లని నిశ్చయం అవుతున్నది. కర్ణా! ఆ రథగమనం వల్ల లేచిన దుమ్ము ఆకాశాన్ని ఆవరించి ఉన్నది. రథచక్రాలతో సంచలింపజేయబడినట్లు

భూమి కంపిస్తున్నది. నీ సైన్యానికి ఎదురుగా పెద్దగాలి తీవ్రంగా వీస్తున్నది. మాంసాహారులయిన పశుపక్షులు కూస్తున్నాయి. మృగాలు భయంకరంగా అరుస్తున్నాయి. మహాఘోరమై, భయదాయకమై, గగుర్పాటు కలిగించేది మేఘంలాంటి కబంధాకారమయిన కేతుగ్రహం సూర్యునిచుట్టి ఉన్నది. కర్ణా! చూడు. అన్నిదిక్కుల యందు నానావిధాలయిన మృగాలగుంపులు, బలిష్ఠాలై, మదించిన పెద్దపులులు, సింహాలు సూర్యుని చూస్తున్నాయి. చూడు. రాబందులు, గ్రద్దలు వేలకొలది గుంపులు గుంపులుగా ఎదురెదురుగా నిలిచి, పరస్పరం ఘోరంగా అరుస్తున్నాయి. చూడు. కర్ణా! నీ మహారథంలో కట్టిన రంగుగల శ్రేష్ఠ మయిన వింజామరలు ప్రజ్వలిస్తున్నాయి. ధ్వజం కూడా తీవ్రంగా కదులుతున్నది. విశాల శరీరంతో, మహావేగంతో ఆకాశంలో గరుత్మంతునిలాగా ఎగరగల, రథాశ్వాలు వణికిపోతున్నాయి చూడు. కర్ణా! ఇలాంటి అపశకునాలవల్ల, వందలు వేలకొలది రాజులు హతులయి పడిపోతారు.

రాధేయా! గగుర్పాటు కలిగించే శంఖాల భీకరధ్వని, భేరుల, మృదంగాల ధ్వనులు అంతటా వినపడుతున్నాయి. అనేక విధాలయిన బాణధ్వనులను, నరుల, అశ్వాల రథాల మ్రోతలను, మహాత్ముల అల్లెత్రాటి ధ్వనులను, చేతితొడుగుల ధ్వనులను కర్ణా! విను. రథ ధ్వజాల మీద బంగారు, వెండి నక్షత్రాలు, ఖచితమయిన వస్త్రాల యందు శిల్పులు చిత్రించిన వర్ణాలుగల పతాకలు, గాలికి బాగా కంపిస్తూ, శోభిస్తున్నాయి. బంగారంతో చేసిన చంద్రుడు, నక్షత్రాలు, సూర్యుడు, చిరుమువ్వలు గల అర్జునుని రథంమీది పతాకలు, మేఘంలో మెరుపులలాగా విరాజిల్లుతున్నాయి. కర్ణా! చూడు. కర్ణా! దేవతల విమానంలాంటి అర్జునుని రథంమీద గాలి ఎక్కువగా వీచటంచేత ధ్వజాలు గణగణ మ్రోగుతూ ప్రకాశిస్తున్నాయి. మహా మనస్వులయిన పాంచాలుర పతాకలతో గూడిన రథాలను, పరాజయంలేనివాడై కపిశ్రేష్ఠుని ధ్వజంతో నిన్ను ఎదుర్కొనటానికి వస్తున్న అర్జునుని చూడు. అర్జునుని ధ్వజాగ్రభాగంలో శత్రువులకు దుఃఖాన్ని పెంపొందిస్తూ, అన్ని వైపులనుంచీ భయంకరు డయిన వానరుడు కన్పిస్తున్నాడు. ధీమంతుడయిన శ్రీకృష్ణుని, గద, శార్ఙ్గమనే ధనుస్సు, శంఖం, వక్షఃస్థలంలోని కౌస్తుభమణి చాలా బాగా ప్రకాశిస్తున్నాయి. శంఖం, గదలను చేతదాల్చిన వాసుదేవుడు, వాయువేగం గల తెల్లని గుర్రాలను తోలుతూ ఇదిగో వస్తున్నాడు.

అర్జునుడు బాగా లాగిన గాండీవం టంకారం చేస్తున్నది. హస్తలాఘవం గల ఆయన వేసిన పదునయిన బాణాలు శత్రువులను సంహరిస్తున్నాయి. పారిపోవటం ఎరగని రాజుల శిరస్సులతో ఈ యుద్ధభూమి నిండింది. ఆ శిరస్సుల ముఖాలు

పూర్ణచంద్రునిలాంటివి. వారి కన్నులు సువిశాలమయి ఎర్రబడి ఉన్నాయి. పెద్ద పరిఘల ఆకారమూ, పవిత్రమయిన సుగంధం పూత గల్గి, ఆయుధాలను ఎత్తిపట్టిన మహావీరుల భుజాలను అర్జునుడు ఖండించి, పడేస్తున్నాడు. నేత్రాలు, నాలుకలు, ప్రేగులు తెగిన, గుర్రాలు క్షీణించి రౌతులతో నేలమీద పడినాయి, పడుతున్నాయి. కొండకొమ్ములవంటి ఏనుగులను అర్జునుడు ఛిన్నభిన్నం చేసి చంపుతుంటే, కొండల్లాగా పడుతున్నాయి. రథికులయిన రాజులు చనిపోతే గంధర్వ నగరంలాగా, విశాలమయిన వారి రథాలు స్వర్గవాసుల పుణ్యవిమానాలవలె కూలుతున్నాయి. నానావిధాలయిన వేలకొలది మృగాల గుంపులను సింహంవలె, అర్జునుడు నీ సైన్యాన్ని తీవ్రంగా కల్లోలం చేశాడు, చూడు. నీ సైనికులు ఎదుర్కొనటంవల్ల, వీరులయిన ఈ పాండవులు తమమీద దాడిచేస్తున్న రాజులను, చతురంగ సైన్యాలను చంపుతున్నారు. మేఘాలు క్రమ్మిన సూర్యునిలాగా మాటుపడిన అర్జునుడు కన్పించటం లేదు. ఆయన ధ్వజాగ్రం కనిపిస్తున్నది, అల్లెత్రాటి మ్రోత విన్పిస్తున్నది. కర్ణా! నీవు ఇంతకుముందు ఎక్కడ ఉన్నాడు ? అని అడుగుతున్న కృష్ణ సారథి, శ్వేతవాహనుడు అయిన అర్జునుని యుద్ధంలో శత్రువులను సంహరిస్తుండగా చూడగలవు. కర్ణా! ఇవ్వాళ పురుషశ్మశ్రులై, రక్తనయనులై, శత్రుతాపనులై ఒకేరథం మీద ఉన్న శ్రీకృష్ణార్జునులను చూస్తావు. శ్రీకృష్ణుడు సారథిగా, గాండీవం ధనుస్సుగా గల అర్జునుని చంపగలిగితే కర్ణా! నీవు మాకు రాజువు అవుతావు. సంశప్తకులు పోరుకు పిలువగా, ఈతడు వారికి ఎదురువెళ్ళాడు. బలవంతు డయిన అతడు యుద్ధభూమిలో శత్రువులతో పోరాడుతున్నాడు." అని శల్యుడు చెపుతుంటే విని, కర్ణుడు తీవ్రకోపంతో, 'క్రుద్ధులయిన సంశప్తకులు అన్నిదిక్కులనుండి ఆక్రమిస్తున్నారు చూడు. శల్యా! మేఘాలు కప్పిన సూర్యునివలె, అర్జునుడు కన్పించటం లేదు. యోధు లనే సముద్రంలో మునిగిన అర్జునుడు అంతమైనట్లే.' అన్నాడు.

శల్యుడన్నాడు - 'కర్ణా! వరుణుని నీటితో, అగ్నిని వంటచెరుకుతో ఏ వీరుడు ధ్వంసం చేయగలడు? గాలిని ఎవడు పట్టగలడు? మహా సముద్రాన్ని ఎవడు త్రాగగలడు ? యుద్ధభూమిలో అర్జునుని స్వరూపం ఇలాంటిదని అనుకొంటాను. ఇంద్రునితో గూడిన దేవదానవులు కూడా అర్జునుని జయించలేరు. అలాకాకపోతే నీ ఇష్టంవచ్చినట్లు అర్జునుని వధను గూర్చి అనుకొని సంతోషపడు. యుద్ధంలో ఆతనిని జయింపశక్యం కాదు. కాబట్టి ఇంకోటి ఏదో కోరుకో. అర్జునుని యుద్ధభూమిలో జయించుదాం అనుకొనేవాడు చేతులతో భూమిని పైకెత్తేవాడు, కోపంతో ఈలోకాన్ని దగ్ధం చేసేవాడు స్వర్గంనుంచి

దేవతలను పడదోసేవాడు కావాలి. అనాయాసంగా క్లిష్టకార్యాలు చేసేవాడు, భయంకరుడు, వీరుడు, మహాబాహువు అయిన అర్జునుడు అపరమేరుపర్వతంలాగా వెలుగుతున్నాడు చూడు. నిరంతర క్రోధపూర్ణుడయి, పాతపగను గుర్తుచేసుకొంటూ, పరాక్రమవంతుడు, భయంకరు డయిన ఈ భీముడు యుద్ధంలో నిలిచాడు. శత్రుగణాలను జయించేవాడు, ధర్మాత్ములలో శ్రేష్ఠుడు, ధర్మరాజయిన యుధిష్ఠిరుడు యుద్ధరంగంలోనిలిచి ఉన్నాడు. యుద్ధంలో ఈయనను జయించటం తేలికకాదు. పురుషశ్రేష్ఠులు, సోదరులు, అశ్వినీ దేవతలవలె, దుర్జయులయిన ఈ నకుల సహదేవులు యుద్ధభూమిలో నిలిచి ఉన్నారు. అయిదు పర్వతాలవల ఈ ఉపపాండవులు యుద్ధం చేయాలనే కోరికతో నిలిచి ఉన్నారు. రణరంగంలో వీరు అర్జునునితో సమానులు. సర్వసమృద్ధిగలవారు, సత్యవిజయులు, మహాతేజోవంతులు, వీరులు, ధృష్టద్యుమ్నుడు లయిన ద్రుపద పుత్రులు యుద్ధసన్నద్ధులయి ఉన్నారు. కోపించిన యమునివంటివాడు, ఇంద్రునివలె ఓర్వరానివాడు, సాత్వత వీరులలో శ్రేష్ఠుడు అయిన ఈ సాత్యకి యుద్ధంచేయదలచి, మనమీదికి వస్తున్నాడు.' రాజా! ఈ రీతిగా కర్ణశల్యులు సంభాషిస్తుండగానే కురు పాండవ సేనలు రెండు గంగాయమునలవలె వేగంగా ఎదుర్కొన్నాయి."

47. సంకులయుద్ధము, అర్జునకర్ణుల పరాక్రమము.

ధృతరాష్ట్రుడు అడిగాడు - "సంజయా! ఆ రీతిగా సైన్యాలు వ్యూహాలయి, పరస్పరం ఎదుర్కొనగా, అర్జునుడు సంశప్తకులను, కర్ణుడు పాండవులను ఎలా ఎదుర్కొన్నారు ? యుద్ధవిషయాలు చెప్పటంలో నేర్పరివి. కాబట్టి యుద్ధాన్ని వివరంగా చెప్పు. యుద్ధంలో వీరులు పరాక్రమించటం వింటూ ఉంటే, నాకు తృప్తి కలగటం లేదు." సంజయుడు చెప్పాడు - "రాజా! నీ పుత్రుని దుర్నీతి వల్ల, శత్రువుల ఆ విశాలసేన యుద్ధంలో నిలవటం తెలుసుకొని అర్జునుడు వ్యూహం పన్నాడు. అశ్వారోహకులు, ఏనుగులు, రథాలు, పదాతులు నిండిన వ్యూహముఖంలో ధృష్టద్యుమ్నుడు నిలిచి ఉన్నాడు. ఆయన వల్ల ఆ విశాల సేనావ్యూహం శోభించింది. పావురాళ్ళరంగు గల గుర్రాలు గలవాడు, చంద్రసూర్యులతో సమానకాంతి గలవాడు, ధనుర్ధారి అయిన ధృష్టద్యుమ్నుడు సాకారమయిన యమునిలాగా విరాజిల్లాడు. దివ్యమయిన కవచాలు, ఆయుధాలు దాల్చినవారు, దీప్తశరీరులు సింహసమాన పరాక్రమవంతులు అయిన ఉపపాండవులు అందరు ధృష్టద్యుమ్నుని రక్షిస్తున్నారు. ప్రకాశవంతమయిన దేహాలు గల అనుయాయులతో గూడి, తారాగణాలు చంద్రునివలె

వారు ధృష్టద్యుమ్నుని చుట్టు నిలిచిఉన్నారు. సైన్యాలు, వ్యూహాలు తీరి ఉండగా, యుద్ధరంగంలో అర్జునుడు సంశప్తకులను చూసి, క్రుద్ధుడయి, గాండీవ ధనుష్టంకారం చేస్తూ వారిపైకి వెళ్ళాడు. అప్పుడు సంశప్తకులు మృత్యువును గెంటివేసి విజయం కలగాలనే దృఢసంకల్పంతో, అర్జునుని చంపగోరి, ఆయనమీదికి వెళ్ళారు. పదాతులు, అశ్వసమూహం, మదించిన ఏనుగులు, రథాల సమూహం, శూరవీర సమూహమూ సమృద్ధిగా గల సంశప్తక సేన వేగంగా అర్జునుని పీడింపనారంభించింది. నివాత కవచులతో పూర్వం అర్జునునికి యుద్ధం జరిగింది అని విన్నాం. అలాంటి భయంకర రణమే సంశప్తకులతో ఆయనకు జరిగింది.

అర్జునుడు యుద్ధంలో ఉన్న శత్రువుల రథాలను, అశ్వాలను, ధ్వజాలను, ఏనుగులను, పదాతులను, బాణాలను, ధనుస్సులను, ఖడ్గాలను, చక్రాలను, పరశ్వధాలను, ఆయుధాలతో ఎత్తి ఉన్న బాహువులను, నానావిధాయుధాలను, శత్రువుల శిరస్సులను వేలకొలది ఖండించాడు. పాతాళం అడుగు భాగంలాంటి సైన్యం అనే గొప్ప సుడిగుండంలో మునిగిపోయిందని అర్జునుని రథాన్ని భావించి, సంశప్తకులు సంతోషంతో హర్షధ్వానాలు చేశారు. అర్జునుడు మళ్ళీ శత్రువులను సంహరించి, మరల ఉత్తరంవైపు ఉన్న శత్రువులను చంపాడు. దక్షిణ పశ్చిమదిక్కులలో ఉన్న శత్రువులను, క్రుద్ధు డయిన రుద్రుడు పశువులను వధించినట్లు వధించాడు. మాన్యా! అప్పుడు పాంచాలురకు, చేది వీరులకు సృంజయులకు మీ సేనలతో పరమదారుణ మయిన సంగ్రామం జరిగింది. యుద్ధమదమత్తమై, ఉత్సాహపూర్ణమైన సేనను తీసుకొని, రథికసేనతో యుద్ధం చేయటంలో నేర్పరులయిన కృపుడు, కృతవర్మ, శకుని కలిసి శూరశ్రేష్ఠ లయిన కోసలులు, కాశిదేశీయులు, మత్స్యదేశీయులు, కారూషులు, కేకయులు, శూరసేనులతో పోరాడారు. వారి ఆ యుద్ధం క్షత్రియ వైశ్య శూద్ర వీరుల శరీరాలను, పాపాలను, ప్రాణాలను నాశనం చేస్తూ, ధర్మయుక్తమూ, స్వర్గప్రాపకమూ, యశస్కరమూ అయింది. భరతశ్రేష్ఠా! కురువీరు డయిన దుర్యోధనుడు సోదరులతో కురువీరులతో, మద్రదేశీయుల మహారథులతో రక్షితుడయి, పాండవులతో, పాంచాలురతో, సాత్యకితో రణరంగంలో యుద్ధం చేస్తున్న కర్ణుని రక్షించాడు. కర్ణుడు కూడా, పదునయిన బాణాలతో మహాసేనను, చంపి, రథశ్రేష్ఠులను నాశనం చేసి, యుధిష్ఠిరుని పీడించాడు. వేలమంది శత్రువుల వస్త్రాలు, ఆయుధాలు, దేహాలు, ప్రాణాలు అపహరించి, స్వర్గం, కీర్తి వారికి కల్పించి, తనవారికి సంతోషం కలిగించాడు. ఆర్యా! ఈరీతిగా పదాతి హయగజనాశకమయిన కౌరవ సృంజయుల సంగ్రామం దేవాసుర యుద్ధంలాగా జరిగింది."

48. సంకుల యుద్ధము.

ధృతరాష్ట్రుడు అడిగాడు - "సంజయా! కర్ణుడు పాండవ సైన్యంలో ప్రవేశించి, జననాశం చేస్తూ, యుధిష్ఠిరుని ఎదుర్కొన్న విషయం వివరించు. పాండవ మహావీరులు ఎవరు యుద్ధంలో కర్ణుని అడ్డుకొన్నారు? కర్ణుడు ఎవరెవరిని బాధించి యుధిష్ఠిరుని పీడించాడు ?" సంజయుడు చెప్పాడు - "రాజా! కర్ణుడు యుద్ధరంగంలో నిలిచి, శత్రువులను బాధించే ధృష్టద్యుమ్నాదులయిన పాండవ వీరులను చూసి, చాలా త్వరగా పాంచాలుర మీదికి వెళ్ళాడు. చాలా వేగంగా దూసుకొని వస్తున్న మహా మనస్వి అయిన ఆయనను, జయశీలురయిన పాంచాలురు, హంసలు మహాసముద్రం వైపు ముందుకుపోయినట్లు వెళ్ళారు. అప్పుడు రెండు సేనలనుండి వేలకొలది శంఖాల ధ్వని హృదయాలను కంపింపజేసింది. భయంకరమయిన భేరుల మ్రోతలు వెలువడ్డాయి. వీరుల నానావిధ బాణాలు పడటం, ఏనుగుల, గుర్రాల, రథాల, ధ్వనులు, సింహనాదాలు దారుణంగా కలిగాయి. కొండలతో, చెట్లతో గూడిన భూమి, వాయువు మేఘాలతో గూడిన ఆకాశం, సూర్యచంద్ర గ్రహ నక్షత్రాలతో గూడిన అంతరిక్షం గిరగిరా తిరుగుతున్నట్లు వ్యక్తమయింది. ఆ రీతిగా సమస్తప్రాణులు, ఆ తుములనాదం విని, వ్యథ జెందాయి. అల్పప్రాణులు అన్నీ దాదాపుగా మరణించాయి. అప్పుడు కర్ణుడు తీవ్రంగా కోపించి, త్వరగా అస్త్రాలను ప్రయోగిస్తూ, ఆసుర సేనను ఇంద్రుడువలె, పాండవ సేనను చంపాడు. కర్ణుడు పాండవసేనలో ప్రవేశించి, బాణాలను వేస్తూ, ప్రభద్రకులలో శ్రేష్ఠులయిన డెబ్బదివీడు మంది వీరులను హతమార్చాడు. తదనంతరం రథికశ్రేష్ఠ డయిన కర్ణుడు పదునయిన ఇరవై అయిదు బాణాలతో పాంచాలురను ఇరవై యైదు మందిని చంపాడు. వీరు డయిన కర్ణుడు చేదిదేశీయవీరులను వేలమందిని బాణాలతో చంపాడు. యుద్ధభూమిలో మానవాతీతమయిన వీరకృత్యం చేస్తున్న కర్ణుని పాంచాలుర రథ సమూహాలు చుట్టుముట్టాయి.

అప్పుడు కర్ణుడు, తట్టుకో వీలుగాని బాణాలను అయిదింటిని సంధించి భానుదేవుడు, చిత్రసేనుడు, సేనాబిందువు, తపనుడు, శూరసేనుడు అనే అయిదుగురు పాంచాలవీరులను సంహరించాడు. దానితో పాంచాలసేనలో మహత్తరమయిన హాహాకారాలు కలిగాయి. పదిమంది పాంచాల రథికులు మళ్ళీ చుట్టుముట్టగా, కర్ణుడు వారిని బాణాలతో సంహరించాడు. జయింపవీలుగాని కర్ణుని పుత్రులు, రథచక్ర రక్షకులు అయిన సుషేణ సత్యసేనులు ప్రాణాల మీది మోహం వీడి, యుద్ధం చేశారు. కర్ణుని పెద్దకొడుకు వృషసేనుడు, స్వయంగా కర్ణుని వెనుకనుండి రక్షించాడు. కవచధారులయిన ధృష్టద్యుమ్నుడు, సాత్యకి,

ఉపపాండవులు, భీముడు, జనమేజయుడు, శిఖండి, మహావీరులయిన ప్రభద్రకులు, చేది, కేకయ, పాంచాల మత్స్యదేశీయ వీరులు, నకుల సహదేవులు రాధేయుని చంపగోరి మీదికి దూకారు. తమ సేనలను మర్దిస్తున్న ఆ కర్ణుని ఈ వీరులు అందరూ వివిధశస్త్రాలతో, శరవర్షంతో, వర్షాకాలంలో మేఘాలు పర్వతాన్నివలె వర్షించారు. రాజా! తండ్రిని రక్షిస్తూ, యుద్ధకుశలు లయిన కర్ణపుత్రులు, మీ సేనలోని ఇతర వీరులు పాండవవీరులను వారించారు. సుషేణుడు భీమసేనుని ధనుస్సును ఒక బాణంతో ఖండించి, ఏడుబాణాలతో భీముని గుండెను గాయపరచి, భయంకరంగా సింహనాదం చేశాడు. అప్పుడు భయంకర పరాక్రము డయిన భీముడు గట్టి ధనుస్సు తీసుకొని, అల్లెత్రాటిని ఎక్కించి, సుషేణుని ధనుస్సును ఖండించాడు. ఆయన క్రుద్ధుడయి, బాణాలతో నృత్యం చేస్తున్నట్లు పదిబాణాలతో ఆతనిని గాయపరిచాడు. ముప్పది ఏడు పదునయిన బాణాలతో కర్ణుని వేగంగా కొట్టాడు. కర్ణపుత్రు డయిన భానుసేనుని, మిత్రుల మధ్యలో, అందరూ చూస్తుండగా, పదిబాణాలు వేసి గుర్రాలు, సూతుడు, ఆయుధాలు ధ్వజంతో కూడా నేలగూల్చాడు. క్షురప్రం అనే బాణంతో ఖండితమయిన, చంద్రతుల్య మయిన ఆతని శిరస్సు కాడను వీడిన పద్మంలాగా అందంగా కన్పించింది.

ఈ రీతిగా భీముడు కర్ణసుతుని చంపి, మీ సేనలోని వారిని మళ్ళీ బాధించాడు. కృపకృతవర్మల ధనుస్సులను ఖండించి, ఆ ఇద్దరిని వేధించాడు. దుఃశాసనుని మూడు బాణాలతో, శకునిని ఆరు ఇనుప బాణాలతో గాయపరచి, ఉలూకుని, పతత్రిని ఇద్దరిని రథహీనులను చేశాడు. భీముడు సుషేణునిపై 'చచ్చావు' అంటూ బాణం వేశాడు. భీముని బాణాన్ని కర్ణుడు ఖండించి, మూడు బాణాలతో కొట్టాడు. అప్పుడు భీముడు మంచి పదునయిన ములికి గల బాణాన్ని, సుషేణుని గురిచూసి వేయగా, కర్ణుడు దాన్ని కూడా ఖండించాడు. పుత్రుని కాచుకొనదలచి, కర్ణుడు భీముని చంపదలచి, క్రూరమయిన డెబ్బదిమూడు బాణాలతో గాయపరిచాడు. సుషేణుడు ఉత్తమమయిన ధనుస్సును తీసుకొని, అయిదు బాణాలు నకులుని బాహువులమీద, గుండెలమీద వేశాడు. భారాన్ని సహించే, దృఢమయిన ఇరువది బాణాలతో నకులుడు ఆతని గాయపరచి, కర్ణునికి భయంకలిగేటట్లు పెద్దసింహనాదం చేశాడు. మహారాజా! మహారథు డయిన సుషేణుడు నకులుని పదిబాణాలతో గాయపరచి, వేగంగా ఒక బాణంతో ఆయన ధనుస్సు ఖండించాడు. అప్పుడు క్రోధపరవశు డయిన నకులుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, యుద్ధంలో సుషేణుని తొమ్మిది బాణాలతో నిలువరించాడు. రాజా! నకులుడు బాణాలతో దిక్కులను

కప్పివేసి, సారథిని చంపి, సుషేణుని మూడు బాణాలతో కొట్టి, ధనుస్సును మూడు బాణాలతో మూడు ముక్కలు చేశాడు. అప్పుడు కోపపరవశుడయిన సుషేణుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, నకులుని అరువది బాణాలతో, సహదేవుని ఏడు బాణాలతో కొట్టాడు. ఒకరినొకరు చంపుకొనవలెనని, వేగంగా బాణాలతో కొట్టుకొంటున్న ఆ మహత్తర యుద్ధం దేవాసుర యుద్ధం లాగా ఘోరంగా జరిగింది.

సాత్యకి వృషసేనుని ఏడు ఇనుప బాణాలతో గాయపరచి, మళ్ళీ డెబ్బది బాణాలతో కొట్టి, సారథిమీద మూడు బాణాలు వేశాడు. మహారాజా! వృషసేనుడు మహారథు డయిన సాత్యకిని, మెడబొమికెకు తగిలేటట్టు వంగిన ములికి గల ఒక బాణంతో కొట్టాడు. మహారాజా! వృషసేనుడు వేసిన బాణంతో పీడితుడయి సాత్యకి కోపపూర్ణుడయ్యాడు. దారుణంగా క్రుద్ధుడయి, వేగంతో వీరుడయిన సాత్యకి త్వరగా పదునైదు బాణాలు తీసుకొన్నాడు.

సాత్యకి వృషసేనుని సూతుని మూడు బాణాలతో చంపి, ఒకబాణంతో ధనుస్సు ఖండించాడు. ఏడు బాణాలతో గుర్రాలను చంపాడు. ధ్వజాన్ని ఒక బాణంతో కొట్టి, మూడు బాణాలతో ఆయన గుండెల్లో కొట్టాడు.

వృషసేనుడు అప్పుడు తన రథం మీద ఒక్కక్షణకాలం స్పృహతప్పి పడిపోయి, మళ్ళీలేచి, సూతుడు, అశ్వాలు, రథం సాత్యకి ధ్వంసం చేయటం వల్ల, సాత్యకిని చంపదలచి, కత్తి డాలు పట్టుకొని ఆయనను ఎదుర్కొన్నాడు. వేగంగా తన మీదికి వస్తున్న వృషసేనుని ఖడ్గాన్ని, డాలును, సాత్యకి పందిచెవుల వంటి ములుకులు గల పదిబాణాలతో ముక్కలు చేశాడు. రథమూ, ఆయుధాలు లేని వృషసేనుని, దుఃశాసనుడు చూసి, యుద్ధంలో కలతచెందినట్లు భావించి, తన రథం మీదికి ఎక్కించుకొని, త్వరగా ప్రక్కకు తీసుకొనిపోయాడు. కర్ణపుత్రు డయిన వృషసేనుడు ఇంకొకరథం ఎక్కాడు. ఉపపాండవులను ముప్పది ఏడు బాణాలతో, సాత్యకిని అయిదింటితో, భీముని అరువది నాలుగుతో, సహదేవుని అయిదింటితో, నకులుని ముప్పదితో, శతానీకుని ఏడింటితో, శిఖండిని పదింటితో, ధర్మరాజును నూరు బాణాలతో కొట్టాడు. రాజేంద్రా! జయకాంక్షులు, మహావీరులయిన వీరిని, ఇంకా ఇతరులను, మహాధానుష్క డయిన అతడు తీవ్రంగా గాయపరిచాడు. తేరిపారజూడ వీలుగాని ఆ వీరుడు, మళ్ళీ కర్ణుని పృష్ఠభాగాన్ని రక్షిస్తూ నిలిచాడు. సాత్యకి తొమ్మిది కొంగ్రొత్త బాణాలతో దుఃశాసనుని సూతుని, అశ్వాలను, రథాన్ని ధ్వంసం చేసి, నుదుట మూడు బాణాలు నాటాడు. దుఃశాసనుడు యథావిధిగా సిద్ధంచేసిన ఇంకొక రథం ఎక్కి, కర్ణుని బలం పెంపొందిస్తూ, పాండవులతో యుద్ధం చేశాడు. అప్పుడు కర్ణుని ధృష్టద్యుమ్నుడు పది బాణాలతో, ఉపపాండవులు డెబ్బది

మూడింటితో, యుయుధానుడు, ఏడింటితో, భీముడు అరువదినాలుగింటితో, సహదేవుడు ఏడింటితో, నకులుడు ముప్పది బాణాలతో, శతానీకుడు ఏడింటితో, వీరుడయిన శిఖండి పదింటితో, ధర్మరాజు నూరు బాణాలతో కొట్టారు. రాజేంద్రా! ఆ మహాయుద్ధంలో మహావీరులు, జయకాంక్షులయిన వీరూ, ఇంకా ఇతరులు మహాధానుష్కు డయిన సూతపుత్రుని బాధించారు. శత్రునాశకుడు, వీరు డయిన సూతపుత్రుడు రథంమీద తిరుగుతూ, వారిలో ప్రతిఒక్కరిని, పదేసి పదేసి బాణాలతో ప్రతిగా గాయపరిచాడు. మహాభాగా! మహామనస్వి అయిన కర్ణుని అస్త్రబలాన్ని, ఒడుపును అప్పుడు చూశాం. ఆది పరమాశ్చర్యకరంగా ఉంది. వేగంగా బాణాలు తీసుకోవటం, సంధించటం, వదలటం, చూపరులు చూడలేదు. కాని హతులయిన శత్రువులను మాత్రం చూశారు.

రాజేంద్రా! మేము ఒక్కక్షణంలో పశ్చిమ దిక్కులో చూసి ఆయన లాఘవం వల్ల ఆయనను తూర్పుదిక్కున కూడా చూశాం. కాని కర్ణుడు అసలు ఎక్కడ ఉన్నాడో చూడలేకపోయాము. రాజా! అంతటా పడి, అన్ని దిక్కులను కప్పివేస్తూ, మిడుతల దండులాగా ఉన్న ఆయన బాణాలను మాత్రమే చూడగలిగాం.

అంతరిక్షం, ఆకాశం, దిక్కులు పదునయిన బాణాలతో నిండిపోయాయి. ఆప్రదేశంలోని ఆకాశం ఎర్రని మేఘంతో కప్పివేసినట్లు విరాజిల్లింది. ధనుస్సు చేత దాల్చి రాధేయుడు నృత్యం చేస్తున్నట్లున్నాడు. తనమీద వేసిన బాణాలకు మూడురెట్లు బాణాలను వారిలో ఒక్కొక్కరి మీద వేశాడు. వారిని మళ్ళీ పదేసి పదేసి బాణాలతో, ఛత్ర, అశ్వసూతరథాలతో గూడా గాయపరిచి, కొట్టి, సింహనాదం చేశాడు. అప్పుడు వారు ఆయనకు త్రోవ ఇచ్చారు. రాధేయుడు బాణవర్షంతో వారిని అందరిని మథించి, ధర్మజుని సేనలో నిరాటంకంగా ప్రవేశించాడు.

రాధేయుడు, యుద్ధంలో వెనుదిరుగని చేది దేశీయుల మూడువందల రథికులను చంపి, పదునయిన బాణాలతో యుధిష్ఠిరుని గాయపరిచాడు. అప్పుడు పాండవులు, శిఖండి, సాత్యకి, యుధిష్ఠిరుని రాధేయుని నుండి రక్షించటానికి చుట్టూ నిలిచారు. అలాగే సర్వసన్నద్ధులు, శూరులు, గొప్ప విలుకాండ్రు అయిన మీ వాళ్ళు అందరూ వారించ వీలులేని కర్ణుని అన్ని రకాలుగా రక్షించసాగారు. నానావిధాలయిన యుద్ధవాద్యాల తీవ్రధ్వనులు వెలువడ్డాయి. గర్జిస్తున్న శూరుల సింహనాదాలు వినిపించాయి. అప్పుడు మళ్ళీ భయరహితు లయిన పాండవులు, కర్ణుడుముందున్న మేము - కురుపాండవులు అందరూ పరస్పరం ఎదుర్కొన్నారు."

49. సంకుల సమరము, యుధిష్ఠిరుని పరాజయము.

సంజయుడు చెప్పాడు – "రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతులు వేలమంది చుట్టూ ఉండగా, కర్ణుడు పాండవసేనను చీల్చివేస్తూ, యుధిష్ఠిరుని మీదికి వెళ్ళాడు. కర్ణుడు ఏమాత్రం తొట్రుపడకుండా, శత్రువులు ప్రయోగించిన వేలకొలది ఆయుధాలను తీవ్రమయిన బాణాలువేసి, ఛేదించి, వారిని గాయపరిచాడు. కర్ణుడు పాండవపక్షం వారి శిరస్సులను, బాహువులను, ఊరువులను ఖండించాడు. హతు లయిన వారు నేలగూలగా ఇతరులు పారిపోయారు. సాత్యకి మళ్ళీ ప్రేరేపించగా, ద్రావిడ నిషాద జాతీయులయిన పదాతులు యుద్ధంలో కర్ణుని చంపదలచి ఎదుర్కొన్నారు. కర్ణుని బాణాలు తీవ్రంగా తగలటం వల్ల బాహువులు, శిరస్త్రాణాలు పోయి విరిగిన మద్దిచెట్ల తోపువలె నేలగూలారు. ఈ రీతిగా వందలు, వేలు, పదివేలమంది వీరులు యుద్ధభూమిలో హతులయి శరీరాలతో నేలగూలినా, వారు తమ కీర్తితో అన్నిదిక్కులను నింపారు. క్రుద్ధు డయిన యమునిలాగా ఉన్న కర్ణుని, పాండవులు, పాంచాలురు, వ్యాధిని మంత్రాలు మందులవలె అడ్డుకొన్నారు. మంత్రాలు మందులు వేసినా, మిక్కిలి తీవ్రమయిన వ్యాధి వాటికి అతీతమయినట్లు, కర్ణుడు వారినందరిని సంహరించి, మళ్ళీ యుధిష్ఠిరుని ఎదుర్కొన్నాడు. రాజును రక్షింపగోరిన పాండవ పాంచాల కేకయవీరులు అడ్డుకొనగా, మృత్యువు బ్రహ్మవేత్తలను వలె, కర్ణుడు వారిని దాటి వెళ్ళలేకపోయాడు. ఆ విధంగా నివారితుడయి, దగ్గరలో ఉన్న కర్ణునితో యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "కర్ణ! కర్ణ! మిథ్యాదృష్టి! సూతపుత్రా! నామాట విను. వేగశాలి అయిన అర్జునునితో నిరంతరం పోటీ పడుతుంటావు. దుర్యోధనుని ఉద్దేశానుసారం నడుస్తూ, మమ్ములను బాధిస్తున్నావు. మహత్తరమయిన పౌరుషాన్ని ఆశ్రయించి, ఇవ్వాళ నీ బలాన్ని, నీ పరాక్రమాన్ని, పాండవులయందున్న ద్వేషాన్ని అంతా చూపించు. మహాయుద్ధంలో నీకున్న యుద్ధశ్రద్ధను వదిలిస్తాను."

మహారాజా! కర్ణునితో యుధిష్ఠిరుడు ఇలా అని సువర్ణపుంఖాలు గల్గి, ఇనుముతో చేసిన పది బాణాలువేసి గాయపరిచాడు. భారతా! సూతపుత్రుడు నవ్వుతూ, గొప్ప ధనుస్సు దాల్చి, వత్సదంతాలు అనే పేరుగల పదిబాణాలతో ఆయనను కొట్టాడు. ఆర్యా! సూతపుత్రుడు అవమానకరంగా ప్రవర్తించి, గాయపరచగా, యుధిష్ఠిరుడు ఆజ్యం పోస్తే మండే అగ్నిలాగా, కోపంతో భగ్గుమన్నాడు. జ్వాలా మాలికలు చుట్టుకొన్న యుధిష్ఠిరుని దేహం, యుగాంతంలో సమస్తాన్ని దహింపగోరిన సంవర్తాగ్ని యొక్క ఇంకొక రూపంలాగా కన్పించింది. అప్పుడు ఆయన, బంగారంతో అలంకృతమయిన పెద్ద ధనుస్సును బాగాలాగి,

పర్వతాలను కూడా బ్రద్దలు కొట్టే ఒక పదునయిన బాణం సంధించాడు. అప్పుడు త్వరపడిన యుధిష్ఠిరుడు, సూతపుత్రుని చంపదలచి ధనుస్సును సంపూర్ణంగా లాగి యమదండంతో సమానమైన బాణాన్ని విడిచాడు. వజ్రంలాగా ధ్వనించే ఆ యుధిష్ఠిరుని బాణం వేగంగా వచ్చి, కర్ణుని కుడిడొక్కలో దూరింది. ఆ బాణం దెబ్బతో కర్ణుడు ధనుస్సును వదలి, రథంమీదనే మూర్ఛిల్లాడు. ఆయన శరీరం అంతా శిథిలం అయింది. ప్రాణాలుపోయినట్లు నిశ్చేష్టుడయి, శల్యునికి అభిముఖంగా పడ్డాడు. అర్జునుని హితంగోరిన యుధిష్ఠిరుడు కర్ణుని ఇంకో బాణంతో కొట్టలేదు. అలాంటి దుఃస్థితిలో ఉన్న కర్ణుని చూసి, ముఖాలు అన్నీ వివర్ణాలు కాగా, మహత్తరమైన ధృతరాష్ట్ర సైన్యం అంతా హాహాకారాలు చేసింది. యుధిష్ఠిరుని పరాక్రమం చూసిన పాండవ సైన్యంలో సింహనాదాలు, గర్జనలు, కిలకిలారావాలు కలిగాయి. రాధేయుడు త్వరలోనే కోలుకొని, యుధిష్ఠిరుని నాశనం చేయదలిచాడు. అమేయాత్మబలం గల ఆయన, బంగారు కవచం గల విజయం అనే ధనుస్సును ఆకర్ణాంతం లాగి, యుధిష్ఠిరుని మీద పదునయిన బాణాలను కురిపించాడు. ఆయనకు చక్రరక్షకులుగా ఉన్న పాంచాల దేశీయు లయిన చంద్రదేవుని, దండధారుని యుద్ధంలో చంపాడు. ధర్మజుని రథసమీపంలో, ఇరుప్రక్కల, ప్రముఖులయిన ఆ పాంచాల వీరులు, చంద్రుని సమీపంలో ఉండే రెండు పునర్వసు నక్షత్రాలవలె ప్రకాశించారు.

యుధిష్ఠిరుడు కర్ణుని మళ్ళీ ముప్పది బాణాలతో కొట్టాడు. ఆయన చక్ర రక్షకులయిన సుషేణ సత్యసేనులను చెరి మూడు బాణాలతో కొట్టాడు. ఆయన శల్యుని తొంబది బాణాలతో, సూత పుత్రుని డెబ్బది మూడింటితో, ఆయనకు రక్షణగా ఉన్నవారిని, సూటిగాపోయే మూడేసి మూడేసి బాణాలతో గాయపరిచాడు. అప్పుడు కర్ణుడు నవ్వుతూ, ధనుస్సును త్రిప్పుతూ, ఒక బాణంతో ఆయన ధనుస్సును ఖండించి, ఆయన మీద అరువది బాణాలు వేసి సింహనాదం చేశాడు. అంతట పాండవీరులు కోపపూర్ణులై, యుధిష్ఠిరుని కాపాడదలచి కర్ణుని బాణాలతో గాయపరుస్తూ, ఆయన మీదికి వెళ్ళారు. సాత్యకి, చేకితానుడు, యుయుత్సువు, పాండ్యరాజు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ద్రౌపదీ పుత్రులు, ప్రభద్రక గణం, నకుల సహదేవులు, భీమసేనుడు, శిశుపాల పుత్రుడు, కారూషులు మత్స్యులు, కేకయులు, కాశికోసల వీరులు – వీరందరూ కలిసి కర్ణుని బాణాలతో కొట్టారు. పాంచాల వీరుడయిన జనమేజయుడు రథాలు, ఏనుగులు, అశ్వాలసేనలను తీసుకొని, అన్నివైపుల నుంచి కర్ణుని ఆక్రమించాడు. ఆయనను చంపాలనే కోరికతో చుట్టుముట్టి బాణాలు, వారాహకర్ణాలు, నారాచాలు, నాళీకాలు, పదునయిన

బాణాలు, వత్సదంతాలు, విపాఠాలు, క్షురప్రాలు చటకాముఖాలు, నానావిధాలయిన భయంకరాస్త్రాలతో గాయపరచ సాగాడు. పాండవసేనలోని మహావీరులు అందరూ అన్నిదిక్కుల నుంచి చుట్టుముట్టగా, బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, బాణాలతో అన్ని దిక్కులను నింపాడు కర్ణుడు.

అప్పుడు కర్ణుడు చేది దేశవీరులను పదిమందిని చంపాడు. ఆయన ప్రయోగించిన వేలకొలది బాణాలు అన్నిదిక్కులను ఆక్రమించి, మిడుతలదండు వలె కన్పించాయి. బంగరు ఈకలు గలవి, బాగా పదునయినవి, కర్ణునివేరు గల బాణాలు నరుల, అశ్వాల శరీరాలను ఛేదించి యుద్ధభూమి అంతటా పడ్డాయి. ఆ రణంలో చేది వీరుల యొక్క, సృంజయు లందరి రథాలు వందలకొలదీ కర్ణుడొక్కడే నాశనం చేశాడు. కర్ణుని బాణాలు బాగా కప్పివేయటం చేత విశాలమయిన చీకటి ఆవరించింది. ఆ సమయంలో శత్రుపక్షంలో గాని, మనపక్షంలో గాని, వీది ఎక్కడ ఉన్నదో తెలియలేదు. భయంకరంగా ఆ చీకటి అంతటా వ్యాపించగా, కర్ణుడు క్షత్రియులను అనేకులను దహిస్తూ సంచరించాడు.

అప్పుడు వీరుడయిన కర్ణుడు అగ్నిలాగా మండుతున్నాడు బాణాలే మహాజ్వాలలు, పరాక్రమమే వేడిమి, ఆయన పాండవు లనే అడవిని దగ్ధం చేస్తూ రణభూమిలో సంచరించాడు.

పాండవులలోని మహారథులు, సమస్త సృంజయులలోని వేలకొలది మహావీరులు కర్ణుని మీద బాణవర్షం, కురిపిస్తూ అన్నివైపుల నుంచి చుట్టుముట్టారు.

మహాధనుర్ధరుడు, అయిన కర్ణుడు నవ్వుతూ, మహాస్త్రాలను సంధించి, మానవశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరుని ధనుస్సును బాణాలతో ఖండించాడు. ఒక నిమిషంలో తొంబది బాణాలను కర్ణుడు సంధించి, ధర్మజుని కవచాన్ని ఛేదించాడు. రత్నాలతో చిత్రమైన ఆ బంగారు కవచం పడిపోతూ సూర్యునితో శ్లిష్టమయి మెరుపుతో గూడిన మేఘం గాలికి పడిపోయినట్లు విరాజిల్లింది. ఆయన శరీరం నుంచి భ్రష్టమయిన రత్నాలంకృత కవచం, రాత్రి మేఘాలు లేని ఆకాశంవలె విలసిల్లింది. బాణాలతో కవచం భిన్నంకాగా యుధిష్ఠిరుడు రక్తంతో తడిసిపోయాడు.

ఆయన ఉదయిస్తున్న సూర్యునిలాగా ప్రకాశించాడు. యుద్ధంలో కవచం బ్రద్దలయి శరీరం అంతటా బాణాలు దిగబడినా, ఆయన క్షత్రియ ధర్మాన్ని అనుసరించి, సింహనాదం చేశాడు.

అంతట ఆయన అంతా ఇనుముతో చేసిన శక్తి ఆయుధాన్ని కర్ణుని మీద వేశాడు. ఆకాశంలో మండుతూ వస్తున్న దాన్ని, కర్ణుడు ఏడుబాణాలతో ఖండించాడు. ఆయన బాణాలు తగిలి, ఆ శక్తి ముక్కలయి నేలబడ్డది. అప్పుడు యుధిష్ఠిరుడు కర్ణుని నాలుగు తోమరాలతో బాహువులను, నుదుటిని, గుండెలను తగిలేటట్లు కొట్టి సంతోషంతో సింహనాదం చేశాడు. శరీరం నుంచి రక్తంకారుతుండగా, క్రుద్ధు డయిన కర్ణుడు సర్పంలాగా బుసకొడుతూ, ఒక బాణంతో ధర్మజుని ధ్వజాన్ని ఖండించాడు. మూడు బాణాలతో

ఆయనను బాధించాడు. ఆయన అమ్ములపొదులను ఛేదించాడు. రథాన్ని నువ్వగింజలంతగా ఛేదించాడు.

భారతా! ఇంతలో శూరులు, పాండవులలో మహారథులు రాధేయుని మీద బాణవర్షం కురిపించారు. రాధేయుని మీద సాత్యకి ఇరువది అయిదు, శిఖండి తొమ్మిది బాణాలను వర్షించారు. కర్ణుడు సాత్యకిని అయిదు ఇనుపబాణాలతో, ఇంకా ఇతరమయిన మూడు బాణాలతో గాయపరిచాడు. కర్ణుడు ఆయన కుడిభుజాన్ని మూడు బాణాలతో, ఎడమ భుజాన్ని పదునారుబాణాలతో, సారథిని ఏడు బాణాలతో గాయపరిచాడు. సూతపుత్రుడు సాత్యకి నాలుగు గుర్రాలను, నాలుగు బాణాలతో వేగంగా యమనివాసానికి పంపాడు. మహారథు డయిన ఆయన ఇంకో బాణంతో ఆయన ధనుస్సును ఖండించి, శిరస్త్రాణంతో గూడా సారథి శిరస్సును శరీరం నుంచి వేరుచేశాడు. గుర్రాలు, సూతుడు హతులయిన రథం మీదనే ఉండి, సాత్యకి వైడూర్యాలతో మణులతో విభూషితమయిన శక్తిని కర్ణుని మీదికి విసిరాడు. భారతా! మీదపడుతున్న ఆశక్తిని త్వరగా కర్ణుడు రెండు ముక్కలు చేశాడు. విలుకాండ్రలో మేటి ఆయిన ఆతడు వారిని అందరిని నిలువరించాడు. ఆయన ధనుర్విద్యా నైపుణ్యంతో, బలంతో పాండవులలోని మహారథులను పదునయిన బాణాలతో వారించాడు. సింహం స్వల్పజంతువులను వలె, రాధేయుడు వారిని బాధించాడు. ధర్మరాజును వంగిన ములుకులు గల బాణాలతో పీడించాడు. పదునయిన బాణాలు వేస్తూ రాధేయుడు ధర్మపుత్రుని ఎదుర్కొన్నాడు.

అప్పుడు దంతాలవలె తెల్లనివై, నల్లని తోకలు గల గుర్రాలను పూన్చిన రథంమీద ధర్మజుడు ఉండి యుద్ధవిముఖుడై, శిబిరానికి వెళ్ళాడు. పార్శ్వ రక్షకులు, సారథి చనిపోగా, కర్ణుని ఎదుర్కొని నిలువలేక విముఖుడై, ధర్మజుడు ఖిన్నమనస్కుడై, యుద్ధభూమి నుండి తొలగిపోయాడు. అప్పుడు కర్ణుడు యుధిష్ఠిరుని వెంబడించి వజ్రం, ఛత్రం, అంకుశం, మత్స్యం, ధ్వజం, కూర్మం, కమలం మున్నగు శుభలక్షణ సంపన్నమై గౌరవర్ణం గల చేతితో ఆయన మూపును స్పృశించి, తనను పవిత్రుని చేసుకోవటానికి, ఆయన్ను పట్టుకోవాలనుకొన్నాడు. అప్పుడు ఆయనకు తాను కుంతీదేవికి ఇచ్చిన మాట గుర్తువచ్చింది.

అప్పుడు శల్యుడు ఇలా అన్నాడు. "రాజశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరుని పట్టుకోవద్దు. పట్టుకొన్న వెంటనే నిన్ను వధించి, తన క్రోధాగ్నితో నిన్ను బూడిద చేస్తాడు." రాజా! కర్ణుడు నవ్వుతూ ధర్మజుని నిందిస్తూ ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! సుక్షత్రియ కులంలో పుట్టావు. క్షత్రియ ధర్మతత్పరుడివి. అలాంటి నీవు, మహాయుద్ధంలో ప్రాణరక్షణకు భయపడి, యుద్ధంమాని ఎలా పారిపోతావు? నీవు క్షత్రియ ధర్మంలో నిపుణుడివని నా విశ్వాసం. కౌంతేయా! నీవు బ్రాహ్మబలంలో, స్వాధ్యాయంలో, యజ్ఞాలు చేయటంలో నిపుణుడివి, కాబట్టి యుద్ధం చేయకు. వీరులను ఎదుర్కొనకు. మాన్యా! వీరులను

ఎప్పుడూ నిందించకు. మహాయుద్ధాలకు వెళ్ళకు. ఇతరులను అప్రియవచనాలు పలుకు. నావంటివారితో అలాంటి మాటలు అనకు. మావంటి వారిని నిందిస్తే, నీకు ఇలాంటి అనిష్టఫలమే కలుగుతుంది. కొంతేయా! నీ ఇంటికి వెళ్ళు, లేకపోతే శ్రీకృష్ణార్జునులు ఉన్నచోటికి వెళ్ళు. రాజా! నిన్ను కర్ణుడు యుద్ధంలో ఏనాడూ సంహరించడు." కర్ణుడు ఇలా అని, యుధిష్ఠిరుని వదలి, ఇంద్రుడు రాక్షససేనను చంపినట్లు పాండవసేనను వధించాడు.

రాజా! అప్పుడు సిగ్గుపడుతూ ధర్మరాజు అక్కడినుంచి తొలగిపోయాడు. రాజు యుద్ధభూమినుంచి తొలగిపోవటం తెలుసుకొని చేది పాండవ పాంచాలురు, మహారథుడు సాత్యకి, శూరులయిన నకుల సహదేవులు, ఉపపాండవులు ఆయన వెనుక వెళ్ళారు. యుధిష్ఠిర సైన్యం వెనుదిరగటం చూసి, వీరు డయిన కర్ణుడు కౌరవ సైనికులతో కలిసి హర్షంతో కొంతదూరం వారివెంట వెళ్ళాడు. అప్పుడు కౌరవసేనలలో భేరీ శంఖ మృదంగాల ధ్వనులు, ధనుస్సుల మ్రోతలు, సింహనాదాలు విస్తరించాయి. కౌరవ్యా! మహారాజా! యుధిష్ఠిరుడు త్వరగా శ్రుతకీర్తి రథం ఎక్కి, కర్ణుని వీరవిజృంభణను చూశాడు. యుధిష్ఠిరుడు తనసేనను శత్రువులు తరుమటం చూసి, క్రుద్ధుడయి 'ఊరక చూస్తుంటారేమిటి? వీరిని చంపండి' అని తన యోధులతో అన్నాడు. రాజాజ్ఞనుసరించి, అప్పుడు భీమసేనాదులయిన పాండవ సేనలోని మహారథులు అందరు నీ పుత్రులను ఎదుర్కొన్నారు. అక్కడ రథాలు, ఏనుగులు, అశ్వాలు, పదాతుల ధ్వనులు, శస్త్రాల ధ్వనులు, యోధుల ధ్వనులు కలిసి, భీకర మయిన శబ్దం వినిపించింది. ఆ మహాయుద్ధంలో యోధులు పరస్పరం 'లేవండి !' 'కొట్టండి !' 'ఎదుర్కోండి !' 'ముందుకు దూకండి' అని కేకలు వేస్తూ కొట్టుకోసాగారు. ఆ సమయంలో అక్కడ అస్త్రాలతో ఆవృతులయి, పరస్పరం యుద్ధం చేస్తున్న వీరుల బాణవర్షం, ఆకాశంలో మేఘచ్ఛాయ వలె ఏర్పడ్డది. జెండాలు, ధ్వజాలు, గొడుగులు, గుర్రాలు, సూతులు, ఆయుధాలు, అవయవాలు, శరీరాలు కోల్పోయి రాజులు నేలగూలారు. పర్వత శిఖరాలనుంచి పెద్దరాళ్ళు దొర్లుతూ క్రిందపడ్డట్లు, పైన ఉన్న వారితో కూడా, హతులయిన గజాలు, వజ్రాయుధంతో బ్రద్దలైన పర్వతాల లాగా నేలగూలాయి. చినిగిపోయి, పగిలిపోయి అస్తవ్యస్తంగా పడిపోయిన అలంకారాలు, భూషణాలు గల రౌతులతో అశ్వాలు, వేలకొలది వీరులు హతులయి పడిపోయారు. మహా యుద్ధంలో వేలకొలది పదాతుల సమూహాలు, ఏనుగులు, అశ్వాలు, రథాలు, శత్రువీరులచే హతులయి ఆయుధాలు అవయవాలు కోల్పోయారు, అవన్నీ చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. వీరుల

విశాలమయిన రక్తనయనాలు, పద్మాలతో, చంద్రునితో సమానమయిన ముఖాలు, శిరస్సులతో యుద్ధభూమి అంతా కప్పుకుపోయింది. భూమిమీద కోలాహలం విన్పించినట్లే, ఆకాశంలో అప్సరసల గీతాలు, వాద్యాల ధ్వనులు విమానాలనుంచి విన్పించాయి. శత్రువీరుల చేతిలో హతులయిన వేలకొలది వీరులను, అప్సరసలు విమానాల్లో ఇనుమిక్కిలిగా ఎక్కించుకొని వెళ్ళుతున్నారు.

మహాదాశ్చర్యకరమయిన ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసి, వీరస్వర్గం పొందాలనే కోరికతో, శూరులు హర్షపూర్ణమనస్కులయి, పరస్పరం వేగంగా చంపుకోసాగారు. రథికులు రథికులతో, పదాతులు పదాతులతో, ఏనుగులు ఏనుగులతో యుద్ధరంగంలో చిత్రంగా పోరాడారు. ఏనుగులు, గుర్రాలు, పదాతులు నాశనమయ్యే యుద్ధం పెచ్చు పెరగగా, సైన్యం వల్ల రేగిన దుమ్ము అంతటా క్రమ్ముకొనగా, సరిగా కనపడక సేనలు తమ వారిని తాము, పరులను పరులు చంపుకొన్నారు. ఇరుపక్షాల సైనికులు ఒకరినొకరు జుట్టుపట్టుకొని, పండ్లతో కొరుకుతూ, గోళ్ళతో గ్రుచ్చుతూ, పిడిగుద్దులు గుద్దుతూ మళ్ల యుద్ధం చేశారు. అది దేహాలను, పాపాలను, ప్రాణులను నాశనం చేసేదయింది. ఏనుగులు, గుర్రాలు, నరులు నాశనమవుతున్న మహాయుద్ధం అలా జరుగుతుండగా మానవుల, అశ్వాల, గజాల శరీరాలనుంచి రక్తనది ప్రవహించింది. ఆ రక్తప్రవాహంలో పడిపోయిన అనేక గజ, అశ్వ, నరుల దేహాలు కొట్టుకుపోయాయి. నరులు, ఏనుగులు, గుర్రాలతో నిండిన రణభూమిలో పదాతులు, గుర్రాలు, ఏనుగులు, రౌతుల రక్తమే ఆ నదీ జలం. వారి మాంసం, గడ్డ కట్టిన రక్తం అందులోని బురదలాగా ఉంది. మానవుల, అశ్వాల, ఏనుగుల దేహాలను ప్రవాహంలో తీసుకుపోతున్న ఆ లోహితనది మహాఘోరమయి, పిరికివారిని భయకంపితులను చేస్తోది. విజయకాంక్షులయిన వీరులు, అంతులేని దానిలో జలం తక్కువగా ఉన్న చోట తేలుతూ, లోతు ఎక్కువ ఉన్న చోట మునుగుతూ, తేలుతూ ఆవలి ఒడ్డుకు చేరుతున్నారు. వారి శరీరాలు అన్ని రక్తసిక్తాలు, వారి కవచాలు, ఆయుధాలు, వస్త్రాలు రక్తంతో తడిసి ఉన్నాయి. అనేక యోధులు అందులో స్నానం చేస్తున్నారు. అనేకుల నోటిలోకి ఆ రక్తంపోయింది. చాలామంది కలిసిపోయారు.

హతులయిన, హతులవుతున్న ఏనుగులు, గుర్రాలు, రథాలు, మనుష్యులు, అస్త్రశస్త్రాలు, అలంకారాలు, వస్త్రాలు, కవచాలు, భూమి ఆకాశం, ద్యులోకం, సర్వదిక్కులు, సమస్తమూ మాకు అరుణవర్ణంగానే కన్పించింది. భారతా! అన్నివైపులా వ్యాపించి, పెంపొందిన ఆ రక్తరాశి వాసన, స్పర్శ, రసం, రూపం, శబ్దం - అన్నీ ఇంచుమించు సైన్యానికి

అంతకూ విషాదకరమయ్యాయి. చాలావరకు బాగా నష్టమయిన ఆ కౌరవసేన మీదికి భీముడు మున్నగువారు, సాత్యకిప్రముఖు లయిన వీరులు మళ్ళీ దూకారు. రాజా! ఓర్చుకొన వీలులేని వేగంతో, మీదికి దూకుతున్న వారిని చూచి, నీ పుత్రులసైన్యం తిరుగు ముఖం పట్టింది. రథాలు, అశ్వాలు, ఏనుగులతో నిండి, పదాతులు, అశ్వాలతో పరిపూర్ణమయిన ఆ సైన్యం కవచాలు, అంగీలు ధ్వంసమైనాయి. ఆయుధాలు, ధనుస్సులు నాశన మయ్యాయి. అంతటా శత్రువులు మర్దించటంచేత, నీ సైన్యం అరణ్యంలో సింహంచేత బాధితమయిన ఏనుగుల గుంపువలె పారిపోయింది."

50. కర్ణభీముల యుద్ధము, కర్ణపలాయనము.

"మహారాజా! నీ సేనను పాండవులు పారద్రోలటం చూసి, దుర్యోధనుడు యోధులను, తన సేనలను అన్నివిధాల నిలపటానికి ప్రయత్నించాడు. నీ కుమారుడు పెద్దగా కేకలు పెడుతూ వారిస్తున్నా, నీ సేన వెనుదిరిగి ముందుకు రాలేదు. అపుడు వ్యూహానికి పక్ష ప్రపక్షాలలో నిలిచి ఉన్న శకుని, శస్త్రధారులయిన కౌరవులు, రణరంగంలో భీముని మీదికి విరుచుకుపడ్డారు. కర్ణుడు కూడా, దుర్యోధనునితో కూడా పారిపోతున్న కౌరవులను చూసి, 'భీముని రథం వైపు పోనియ్యి' అని శల్యునితో అన్నాడు. కర్ణుడు ఇలా చెప్పగా, మద్రదేశాధిపతి శల్యుడు భీముడు ఉన్నచోటికి, హంసలవలె తెల్లని రంగు గల శ్రేష్ఠాశ్వాలను తోలాడు. యుద్ధంలో శోభిల్లే శల్యుడు తోలగా, గుర్రాలు భీమసేనుని రథం దగ్గర పాండవసేనలో కలిశాయి. తనమీదికి వస్తున్న కర్ణుని చూసి, భీముడు కోపపూర్ణుడయి కర్ణుని వధింప నిర్ణయించుకొన్నాడు. ఆయన ధృష్టద్యుమ్ననితో, సాత్యకితో ఇలా అన్నాడు. 'ధర్మాత్ముడు యుధిష్ఠిరుడు నేను చూస్తుండగానే ప్రాణసంకట స్థితి నుండి విముక్తు డయినాడు. ఆయనను మీరు రక్షించండి. నా ఎదుటనే, దుర్మార్గుడయిన కర్ణుడు, దుర్యోధనుని మెప్పుకోసం ధర్మరాజు కవచాదులగు యుద్ధసామగ్రిని అంతను నాశనం చేశాడు. ధృష్టద్యుమ్నా! ఆ దుఃఖానికి ప్రతీకారం చేసి, నేడు అంతు చూస్తాను. మహాఘోరమయిన యుద్ధంలో ఇవ్వాళ నేను కర్ణునయినా చంపుతాను. అతడయినా నన్ను చంపుతాడు. నీకు నిజం చెపుతున్నాను. ధర్మరాజును ఇవ్వాళ మీ వద్ద న్యాసంగా ఉంచుతున్నాను. ఎలాంటి పరాకులేకుండా, మీరందరు ఆయన రక్షణభారం వహించండి." ఇలా అని భీముడు మహత్తర సింహనాదంతో దిక్కులు పిక్కటిల్లజేస్తూ కర్ణుని మీదికి వెళ్ళాడు.

యుద్ధాన్ని మెచ్చుకొనే భీముడు వేగంగా రావటం చూసి, మద్రాధిపతి శల్యుడు కర్ణునితో ఇలా అన్నాడు. "పాండునందనుడయిన భీముని చూడు. చాలాకాలం నుంచి సంపాదించి పెట్టుకొన్న కోపాన్ని, నీ మీద తీర్చుకొన గోరటం నిశ్చయం. కర్ణా! పూర్వం అభిమన్యుడు, ఘటోత్కచుడు, హతులు అయినప్పుడు కూడా, ఇతని ఇంత భీకరరూపాన్ని ఏ నాడూ చూడలేదు. ప్రళయకాలంలోని అగ్నివలె, తేజోవంతమయిన ఆకృతిదాల్చిన ఈతడు కుపితుడయి ముల్లోకాలను సంపూర్తిగా నిలువరించగలడు." సంజయుడు చెప్పాడు – "రాజా! ఈ రీతిగా శల్యుడు కర్ణునితో చెపుతుండగానే, క్రోధ దీప్తుడయిన భీముడు కర్ణునివైపు వచ్చాడు. యుద్ధప్రియుడయి, అలా వచ్చిన భీముని చూసి, కర్ణుడు నవ్వుతూ శల్యునితో ఇలా అన్నాడు. "మద్రరాజా! ఇవ్వాళ నీవు భీముని గురించి చెప్పిన మాటలు యథార్థం. ఇందులో సందేహం లేదు. ఈ భీముడు శూరుడు, వీరుడు, కోపిష్ఠివాడు, శరీరం మీద ఏమాత్రం ఆపేక్షలేనివాడు. ప్రాణాలు లెక్కచేయనివాడు మహాబలవంతుడు. పూర్వం విరాటనగరంలో అజ్ఞాతవాసం చేస్తూ ఉన్నప్పుడు ద్రౌపదికి సంతోషం కలిగించటానికి గూఢంగా ఉండి కేవలం బాహుబలం ఆశ్రయించి, ఉపకీచకులతో కూడా కీచకుని తుదముట్టించాడు. ఆ భీముడు ఇవ్వాళ కవచధారి అయి, యుద్ధరంగాగ్రంలో నిలిచాడు. దండధారి అయి వచ్చిన యముని యుద్ధభూమిలో ఎదుర్కొనగలడా? 'యుద్ధంలో అర్జునుని నేను చంపాలి, లేకపోతే నన్ను అతడు చంపాలి.' అని చాలాకాలం నుంచి నేను కోరుకొనే కోరిక ఇది. ఇప్పుడు భీముడు ఎదుర్కొనటం వల్ల ఆ కోరిక ఇవ్వాళే నెరవేరుతుంది. భీముని చంపినా, లేక విరథుని చేసినా, అర్జునుడు నన్ను ఎదుర్కొంటాడు. అది మంచికే అవుతుంది. ఇప్పుడు నీవు ఏది ఉచితం అనుకొంటున్నావో చెప్పు." కర్ణుని మాటలు విని, శల్యుడు అప్పటికి తగిన మాట ఇలా చెప్పాడు. "మహాబలుడయిన భీమసేనుని ఎదిరించు. భీముని ఓడించిన తరువాత అర్జునుని మీదికి వెళ్ళవచ్చు. కర్ణా! చాలాకాలం నుంచి నీ మనస్సులో నిలిచి ఉన్న కోరిక ఈ నాటికి నెరవేరబోతున్నది. నిజం చెపుతున్నాను."

ఇలా శల్యుడు చెప్పగా కర్ణుడు మళ్లీ ఇలా అన్నాడు. "అర్జునుని నేను యుద్ధంలో చంపుతాను లేదా నన్ను అర్జునుడు చంపుతాడు. ఈ ఉద్దేశ్యంతో మనస్సు యుద్ధంమీద పెట్టి భీముడు ఉన్న చోటికి పద. నరనాథా ! తరువాత శల్యుడు రథాన్ని భీముడు మీ సేనను పారద్రోలుతున్న చోటికి వేగంగా తోలాడు. అప్పుడు కర్ణభీములు ఎదురు పడ్డ ఆ సమయంలో తూర్యధ్వనులు, భేరుల మహా ధ్వనులు మార్మ్రోగాయి. భీమసేనుడు

క్రుద్ధుడయి, సమీపింప వీలులేని ఆ కర్ణుని సేనను, నిర్మలమయిన, పదునయిన బాణాలు వేసి పారద్రోలాడు. మహారాజా! కర్ణభీముల మహాయుద్ధంలో భయంకరమూ, భీషణమూ, ఘోరమూ అయిన సంహారం జరిగింది. రాజేంద్రా! అప్పుడు రెండు గడియలలో భీముడు కర్ణుని మీదికి దూకాడు. అలా తన మీదికి వస్తున్న ఆయనను చూసి, కర్ణుడు మిక్కిలి కుపితుడయి గుండెల్లో తగిలేటట్లు బాణం వేశాడు. అమేయమయిన ఆత్మబలంగల ఆయన, మళ్ళీ భీమునిమీద బాణవర్షం కురిపించాడు. సూతపుత్రుని బాణపుదెబ్బలు తగిలిన భీముడు బాణాలతో ఆయనను కప్పివేశాడు. పదునయిన తొమ్మిది బాణాలతో కర్ణుని గాయపరిచాడు. కర్ణుడు బాణాలు ప్రయోగించి భీముని ధనుస్సును మధ్యలోకి రెండుగా ఖండించాడు. ధనుస్సు విరిగిన ఆయనను కవచాదులయిన సమస్తాన్ని ఛేదించే చాలా పదునయిన బాణంతో గుండెలలో నాటుకొనేటట్లు కొట్టాడు. భీముడు ఇంకొక ధనుస్సు తీసుకొని మర్మస్థానాలు బాగా తెలిసినవాడు కాబట్టి, కర్ణుని మర్మస్థానాలలో పదునయిన బాణాలతో కొట్టాడు. ఆకాశాన్ని కంపింపజేస్తున్నట్లు బలంగా సింహనాదం చేశాడు. మదధారలను అధికంగా స్రవిస్తూ మదించిన ఏనుగును, అరణ్యంలో కొరవులతో కొట్టినట్లు కర్ణుడు ఇరవై అయిదు బాణాలతో ఆయనను కొట్టాడు. ఆ బాణాలతో శరీరం అంతా గాయాలు కాగా, క్రోధ పరవశుడయిన భీముడు ఆవేశంతో, కోపంతో కన్నులు ఎర్రబడగా కర్ణుని వధింపగోరి ఉత్తమమయిన బాణాన్ని ధనుస్సుపై సంధించాడు. మహాధానుష్కుడు, క్రుద్ధుడు అయిన వాయునందనుడు ధనుస్సును బలంగా లాగి కర్ణుని చంపదలచి బాణం వదిలాడు. బలిష్ఠుడయిన ఆయన వదలిన బాణం పిడుగులాగా, మెరుపువలె ధ్వనిస్తూ, వజ్రాయుధం పర్వతాన్ని ఛేదించినట్లు, కర్ణుని యుద్ధరంగంలో చీల్చివేసింది. భీముడు తీవ్రంగా బాణంతో కొట్టటం చేత కర్ణుడు మూర్ఛపోయి రథం వెనుక కూలబడ్డాడు.

కర్ణుడు రక్తసిక్త శరీరుడయి ఉండగా, భీముడు ఆయన నాలుక కోయటానికి సిద్ధమయినాడు. శల్యుడు ఆయనను బ్రతిమలాడుతూ ఇలా అన్నాడు. శల్యుడన్నాడు – "మహాబాహా! భీమసేనా! హేతుయుక్తమయిన ఒక మాట చెపుతాను. విను. అది విని తగినపని చేయి. అర్జునుడు పరాక్రమవంతుడయిన కర్ణుని చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. నీకుమేలు కలుగుతుంది. అర్జునుని ఆ ప్రతిజ్ఞను సఫలం చేయి." భీముడన్నాడు – "రాజసత్తమా! అర్జునుని సత్యప్రతిజ్ఞను ఎరుగుదును. ఈ కర్ణుడు నా ఎదుట యుధిష్ఠిరుని అవమానించాడు. ఆ కోపంతో పరవశుడినయి ఏ విషయం లెక్కచేయలేదు. కర్ణుడు మూర్ఛపోయి పడినా నాకోపం చల్లారలేదు. ఈ సమయంలో ఈతని నాలుక కోయటమే తగునని నా ఉద్దేశ్యం. మాతులా! రాజులందరు కూడి ఉండగా నీచుడు, క్రూరుడయిన ఈ కర్ణుడు

మేము వింటుండగా, ద్రౌపదిని అన్న చాలా మాటలు, దూరంలో ఉండి కూడా, నీవు వినే ఉంటావు. అందువల్లనే ఈతని నాలుక కోసి వేయాలని అనుకొన్నాను. ధర్మరాజుకు ప్రియంకోరి, నేను ఈ ప్రతిజ్ఞ చేశాను. హేతుయుక్తంగా, అర్థవంతంగా నీవు చెప్పిన మాటను నేను చేదయిన మందునువలె స్వీకరిస్తున్నాను. ప్రతిజ్ఞ వ్యర్థమయితే అర్జునుడు బ్రతకడు. అర్జునుడు పోతే శ్రీకృష్ణునితో కూడా మేము అందరమూ పోతాం. క్రూరబుద్ధి, పాపకృత్యాలు చేసేవారిలో మేటి, పాపి అయిన కర్ణుడు, అర్జునుడి చూపులో పడితే పరాభవం పాలు అవుతాడు. క్రూరకార్యాలు చేసే ఈతడు, యుధిష్ఠిరుని కోపంతోనే పూర్వం దగ్ధుడు అయ్యాడు. ఇప్పుడు ఉపాయంతో ఈతనిని నా నుండి తప్పించావు."

అంతట శల్యుడు, యుద్ధంలో శోభిల్లేవాడు, మూర్ఛపోయిన సూతనందను డయిన కర్ణుని రథంతో కూడా యుద్ధభూమినుంచి తప్పించాడు. కర్ణుడు ఓడిపోగా, భీముడు పూర్వం ఇంద్రుడు దానవులను పారద్రోలినట్లు కౌరవుల మహాసేనను పారద్రోలాడు."

51. భీముడు ఆర్గురు కౌరవులను చంపుట. సంకుల సమరము.

"సంజయా! మహాబాహువయిన కర్ణుని, రథం వెనకాల పడేయటం అనే మిక్కిలి దుష్కరమయిన పని భీముడు చేశాడు. యుద్ధంలో కర్ణుడు ఒక్కడే పాండవులను సృంజయులతో సహా చంపగలడని దుర్యోధనుడు పలుమారులు నాతో గట్టిగా చెప్పాడు. యుద్ధంలో భీముడు కర్ణుని జయించటం చూసిన తరువాత, నా పుత్రుడు దుర్యోధనుడు ఏంచేశాడు ?"

సంజయుడు చెప్పాడు – "మహారాజా! మహాయుద్ధంలో సూతపుత్రుడు విముఖుడు కావటం చూసి, నీ కొడుకు సోదరులతో ఇలా అన్నాడు. "మీకు మేలు అగుగాక. కర్ణుని రక్షించటానికి త్వరగా వెళ్ళండి. భీమునివల్ల కలిగిన సంకటం అనే మహాసాగరంలో అతడు మునుగుతున్నాడు." రాజాజ్ఞను తలదాల్చి, వారు భీముని చంపదలచి, క్రుద్ధులై మిడుతలు అగ్నిలో దూకినట్లు భీముని మీదికి దూకారు. శ్రుతర్వుడు, దుర్ధరుడు, క్రాథుడు (క్రథనుడు), వివిత్సువు, వికటుడు (వికటాననుడు), సముడు, నిషంగి, కవచి, పాశి, నందోపనందకులు, దుష్ప్రధర్షుడు, సుబాహువు, వాతవేగుడు, సువర్చసుడు, ధనుర్గ్రాహుడు, దుర్మదుడు, జలసంధుడు, బలుడు, సహుడు అనే ఇరువదిమంది ధృతరాష్ట్రసుతులు వీర్యవంతులు, మహాబలులు. వీరందరూ రథాలు చుట్టూరాగా భీముని అన్నివైపులనుండి చుట్టుముట్టారు. రాజా! వారు అందరూ అనేక చిహ్నాలుగల బాణాల సమూహాన్ని భీముని మీద వేశారు. వారు తీవ్రంగా పీడిస్తుంటే, మహాబలు డయిన భీమసేనుడు నీ పుత్రులతో వచ్చిన ఏబది రథాలను నాశనం చేశాడు. క్రుద్ధుడయిన

భీముడు వివిత్సుని శిరస్సును బాణంతో అపహరించాడు. కుండలాలతో, శిరస్త్రాణంతో గూడిన ఆ శిరస్సు ఖండితమయి పూర్ణచంద్రునిలాగా భూమిమీద పడింది. శూరు డయిన ఆతడు పడిపోవటం చూసి, తక్కిన సోదరులు భీముని మీదికి దూకారు. భయంకరపరాక్రమంగల భీముడు మహాయుద్ధంలో రెండు బాణాలతో నీపుత్రులు ఇద్దరి ప్రాణాలను హరించాడు. రాజా! దేవపుత్రులవలెనున్న వికటుడు, సముడు గాలికి విరిగిపడిన చెట్లులాగా నేలగూలారు. తరువాత భీముడు మిక్కిలి పదునయిన బాణంతో క్రాథుని యమలోకానికి పంపాడు.

జననాథా! వీరులు, ధానుష్కులయిన నీ పుత్రులు చనిపోతుంటే తీవ్రమయిన హాహాకారాలు కలిగాయి. వారిసేన సంచలించింది. మహాబలు డయిన భీముడు మళ్ళీ నందుని, ఉపనందుని యమనిలయానికి పంపాడు. కాలునివలె, అంతకునివలె, యమునివలె ఉన్న భీముని రణరంగంలో చూసి, నీ పుత్రులు విహ్వలులై, భీతులయి పారిపోయారు. నీ కుమారులు మరణించటం చూసి, కర్ణుడు మిక్కిలిగా మనస్సులో దుఃఖించాడు. హంసవర్ణం గల గుర్రాలను మళ్ళీ కర్ణుడు భీముడు ఉన్నచోటికి తోలించాడు. మహారాజా! శల్యుడు తోలిన ఆ గుర్రాలు వేగంగా వచ్చి, భీముని రథాన్ని సమీపించి, ఆ రథాశ్వాలతో కలిశాయి. యుద్ధరంగంలో కర్ణభీముల సంఘర్షణ భయంకరమూ, రౌద్రమూ ఘోరరూపమూ ఆయింది. ఆ మహారథులు ఇద్దరు ఎదుర్కొన్నప్పుడు చూసిన నాకు, వీరి యుద్ధం ఎలా ముగుస్తుందో కదా ! అనే ఆలోచన కలిగింది. యుద్ధప్రియుడయిన భీముడు, యుద్ధంలో నీ పుత్రులు చూస్తుండగా, కర్ణుని బాణాలతో కప్పి వేశాడు. అప్పుడు తీవ్రంగా కుపితుడై, మహాస్త్రాలు తెలిసిన కర్ణుడు బాగా వంగిన ములుకులు గల తొమ్మిది బాణాలతో భీముని గాయపరిచాడు. భీముడు దెబ్బతిని, ఆ కర్ణాంతం ధనుస్సులాగి, ఏడు బాణాలతో కర్ణుని కొట్టాడు. కర్ణుడు సర్పంలాగా బుసకొడుతూ, మహత్తర బాణవర్షంతో భీముని ముంచివేశాడు. మహాబలుడయిన భీముడు కూడా, కౌరవులు చూస్తుండగా ఆ మహారథుని బాణ సమూహంతో కప్పివేసి, సింహనాదం చేశాడు. అప్పుడు తీవ్రంగా కోపించిన కర్ణుడు దృఢమయిన ధనుస్సు తీసుకొని, రాతిమీద పదునుపెట్టబడినవై, గ్రద్ద ఈకలు చివర గల పదిబాణాలతో భీముని గాయపరిచాడు. ఒక పదునయిన బాణంతో ఆయన ధనుస్సును ఖండించాడు. అంతట మహాబలు డయిన భీముడు కర్ణుని చంపదలచి, పెద్దగా కేకలువెడుతూ, సువర్ణ కవచంతో అలంకృతమై, అపరమృత్యుదండంలా ఉన్న ఘోరమయిన పరిఘాయుధాన్ని ఆయన మీదికి విసిరాడు. వజ్రంలాగా, మెరుపులాగా ధ్వనిస్తూ, తనమీద పడుతున్న

పరిఘను, కర్ణుడు సర్పాలవంటి బాణాలు వేసి, అనేక ఖండాలుగా ఛేదించాడు. అప్పుడు భీముడు శత్రుబలాన్ని నాశనం చేసే, గట్టి ధనుస్సు తీసుకొని బాణాలతో కర్ణుని కప్పివేశాడు. ఒకరినొకరు చంపగోరుతున్న కర్ణభీముల మధ్య రెండు సింహాలకు జరిగినట్లు యుద్ధం ఘోరంగా జరిగింది.

అంతట కర్ణుడు దృఢమయిన ధనుస్సును చెవి మూలందాకా బాగాలాగి వదలిన మూడు బాణాలతో భీముని గాయపరిచాడు. బలిష్ఠులలో శ్రేష్ఠుడు, మహాధనుష్కుడయిన భీముడు బాగా గాయపడి, కర్ణుని శరీరాన్ని చీల్చివేయగల ఘోరమయిన బాణాన్ని తీసుకొని ప్రయోగించాడు. రాజా! ఆ బాణం కర్ణుని కవచాన్ని, శరీరాన్ని ఛేదించి పుట్టలోకి పాముపోయినట్లు నేలలో దూరింది. తీవ్రమయిన ఆ దెబ్బకు తాళలేక కర్ణుడు విహ్వలుడయి భూకంపం వచ్చినప్పటి పర్వతంవలె కంపించాడు. కర్ణుడు రోషంతో, కోపంతో భీముని ఇరువది అయిదు బాణాలతో కొట్టాడు. అనేక బాణాలు వేశాడు. ఒక బాణంతో ధ్వజాన్ని ఖండించాడు. ఆయన సారథిని ఒక బాణం వేసి, వధించాడు. ఒకబాణం వేగంగా వేసి, భీముని ధనుస్సును ముక్కలు చేశాడు. రాజేంద్రా! అటు తరువాత కర్ణుడు, భీముని నవ్వుతూ అలవోకగా ఒక్కక్షణంలో విరథుని చేశాడు. మహాబాహువు, వాయుసమానుడయిన భీముడు విరథుడయి నవ్వుతూ, గదను తీసుకొని రథంమీది నుండి క్రిందికి దూకాడు. నరనాథా! వేగంగా దూకిన భీముడు గదతో, నీసేనను, శరత్కాల మేఘాన్ని మహావాయువువలె ధ్వంసం చేశాడు. రాజా! భీముడు, దెబ్బతీసే ఇరుసులాంటి దంతాలు గల ఏడువందల ఏనుగులను వేగంగా సంహరించాడు. ఏనుగుల మర్మస్థానాలు తెలిసినవాడు, బలిష్ఠుడయిన భీముడు ఏనుగు దంతాల చిగుళ్ళమీద, కన్నుల మీద, కుంభ స్థలాలమీద, దవడల మీద, మర్మస్థానాల మీద గదతో తీవ్రంగా కొట్టాడు. అవి భయపడి పారిపోసాగాయి. మావటివారు మరలించి ఆయనకు ఎదురుగా వాటిని తోలారు. వెనక్కు తిరిగి, అవి మేఘాలు సూర్యునివలె ఆయనను చుట్టుముట్టాయి. గజారోహకులు, ఆయుధాలు, జెండాలతో ఉన్న ఆ ఏడువందల ఏనుగులను ఆయన భూమిమీద ఉండి, వజ్రాయుధంతో ఇంద్రుడు పర్వతాలనువలె చంపాడు. ఆ తరువాత భీముడు శకునికి సంబంధించిన ఏబది రెండు ఏనుగులను చంపివేశాడు. ఆ రీతిగా పాండుపుత్రుడు నీ సేనను తపింపజేస్తూ యుద్ధరంగంలో పూర్తిగా నూరు రథాలను, వందలకొలది కాలిబంటులను సంహరించాడు.

మహాత్ముడయిన భీముడనే సూర్యుడు తహతహలాడించటం వల్ల, నీ సేన నిప్పులో వేసిన చర్మంవలె ముడుచుకుపోయింది. నీవాళ్లు అందరూ భీమభీతితో భయపడి,

భీముని వదలి పది దిక్కులకు పారిపోయారు. తరువాత చర్మం పైకప్పుగా గలవి, ఘర్ఘర ధ్వనించే ఇంకొక ఏబది రథాల రథికులు, బాణసమూహంతో భీముని అన్నిదిక్కుల నుంచి కొడుతూ చుట్టుముట్టారు. పతాకలు, ధ్వజాలు, ఆయుధాలతో సహా, ఆ ఏబది మంది రథిక వీరులను, భీముడు విష్ణువు అసురులను వలె, గదతో తుదముట్టించాడు. అంతట శకుని ఆదేశానుసారం శూరులు గౌరవించే మూడువేల మంది ఆశ్వికులు శక్తులు, ఋష్టులు, ప్రాసాలు చేతులలో ధరించి, వేగంగా భీముని మీదకి వచ్చారు. ఆయన అశ్వారోహకులను ఎదుర్కొని, నానారీతులుగా సంచరిస్తూ, గదతో వారందరిని చంపివేశాడు. రాళ్ళదెబ్బలు తగలటం వల్ల కలిగిన ధ్వనివలె గదాఘాతాలు తింటున్న ఆ రౌతుల నుండి మహాధ్వనులు వచ్చాయి. ఈ రీతిగా శకుని మూడువేల ఉత్తమ హయాలను, సంహరించి, క్రుద్ధు డయిన భీముడు ఇంకో రథం ఎక్కి, కర్ణుని మీదికి వెళ్ళాడు. రాజా! కర్ణుడు కూడా ధర్మపుత్రుని ఎదుర్కొని, ఆయనను బాణాలతో కప్పివేశాడు. ఆయన రథసారథిని సంహరించాడు. మహారథు డయిన కర్ణుడు మళ్ళీ యుద్ధరంగంలో అటూ ఇటూ పోతున్న ధర్మపుత్రుని రథాన్ని చూసి, సూటిగా పోయే గ్రద్ద ఈకలు గల బాణాలను వేస్తూ వెంబడించాడు. ధర్మరాజు వెంట పరుగెత్తుతున్న కర్ణుని చూసి, కోపించిన వాయుపుత్రుడు భీముడు, ఆయనను బాణాలతో కప్పివేసి, భూమిని, ఆకాశాన్ని కూడా బాణసమూహంతో నింపివేశాడు. శత్రువులను బాధించే రాధేయుడు వేగంగా మరలివచ్చి, పదునయిన బాణాలతో భీముని అంతటా కప్పివేశాడు. భారతా! అనంతమయిన ఆత్మబలం కల సాత్యకి, భీమసేనుని రథంతో ఇబ్బందిలోపడిన కర్ణుని, భీముని వెనుక భాగాన్ని రక్షించటం కారణంగా పీడించసాగాడు. తీవ్రంగా బాణపీడితు డయినా, కర్ణుడు భీముని ఎదుర్కొన్నాడు. విలుకాండ్రు అందరిలో శ్రేష్ఠులు, అభిమానవంతులు అయిన భీమకర్ణులు పరస్పరం ఎదుర్కొని, తేజోవంతాలయిన బాణాలను ప్రయోగిస్తూ విరాజిల్లారు. రాజేంద్రా! వారిద్దరు ఆకాశంలో వ్యాపింపజేసిన బాణజాలం భీమదర్శనమై, భయంకరమై, క్రౌంచ పక్షుల వెనుకభాగం వలె ఎర్రనయి కన్పించింది. రాజా! వారిద్దరు వేలకొలది బాణాలు వేయటం వల్ల, మేము గాని, వారు గాని, సూర్యకాంతిని, దిక్కులను, విదిక్కులను తెలుసుకోలేకపోయాం. రాజా! మధ్యాహ్న కాలంలో తపింపజేస్తున్న సూర్యుని మహాకాంతులు మొత్తం, కర్ణభీములు ప్రయోగించిన బాణ సమూహం చేత అపహరింపబడ్డాయి. శకుని, కృతవర్మ, అశ్వత్థామ, కర్ణుడు, కృపులతో పాండవులు తలపడటం వల్ల కౌరవసేనలు మళ్ళీవెనక్కు వచ్చాయి.

నరనాథా ! వర్షాకాలంలో వానలచేత పెంపొందుతున్న సముద్రాల గర్జనవలె,

ఆ సేనలు రావటం వల్ల పెద్దకోలాహలం ఏర్పడింది. మహాయుద్ధంలో పరస్పరం బాగా కలిసిన ఆ సేనలు, ఒకరినొకరు చూసికొని, హర్షోల్లాసాలతో పోరాడసాగాయి. సూర్యుడు మింటినడిమికి రాగా, యుద్ధం తీవ్రం అయింది. అలాంటి యుద్ధాన్ని అంతకుముందు ఎన్నడూ చూడలేదు, వినలేదు. రణరంగంలో ఒక బలసమూహం ఇంకొక సేనా సమూహాన్ని కదిపి, మహాజలప్రవాహం సముద్రాన్నివలె వేగంగా ఎదుర్కొన్నాయి. ఒకరిమీద ఇంకొకరు ప్రయోగిస్తున్న బాణ సమూహాల ధ్వని, గర్జిస్తున్న సముద్ర గంభీరనాదం వలె ఉంది. వేగవంతాలయిన ఆ రెండు సేనలు తలపడి, సంగమ స్థలంలో రెండు నదులవలె కలిసిపోయాయి. నరపాలా! అప్పుడు మహత్తర కీర్తిని పొందదలచిన కౌరవపాండవులకు మహాఘోర యుద్ధం జరిగింది. అక్కడ గర్జిస్తున్న శూరులు నిర్విరామంగా పేర్లు పెట్టి పిలుస్తున్న వివిధ వచనాలు వినవచ్చాయి. యుద్ధభూమిలో ఎవరెవరికి తల్లివల్ల గాని, తండ్రివల్ల గాని, క్రియవల్ల గాని, శీలం వల్లగాని, స్వభావం వల్లగాని కలిగిన విశేషాలు వారివారికి వినిపిస్తున్నారు. రాజా! యుద్ధంలో పరస్పరం ఆ శూరులు చేసే బెదరింపులు, అదలింపులు వింటున్న నాకు, ఇంక వీళ్ళు బ్రతకరు అని అనిపించింది. క్రుద్ధులయిన వారి శరీరాలను చూసిన నాకు, 'ఈ యుద్ధం ఇంకేమౌతుందో గదా' అని తీవ్రమయిన భయం కలిగింది. రాజా! ఆ తరువాత ఆ కౌరవులు, పాండవులు పదునయిన బాణాలు వేసుకొంటూ, ఒకరినొకరు తీవ్రంగా గాయపరచుకొన్నారు."

52. ఉభయసేనల సంకుల యుద్ధము.

సంజయుడు చెప్పాడు – "మహారాజా! వైరం పెంచుకొన్న ఆ క్షత్రియులు పరస్పరం చంపుకోదలచి, ఒకరినొకరు ఆయుధాలతో కొట్టుకొన్నారు. రథసమూహాలు, హయసమూహాలు, నరసమూహాలు, గజసమూహాలు పరస్పరం తలపడ్డాయి. మిక్కిలి దారుణమయిన సంగ్రామంలో నిరంతరం ప్రయోగిస్తున్న పరిఘలు, గదలు, బల్లేలు, భిందిపాలాలు, భుశుండులు ధారలుగా పడుతున్నట్లు మాకు కన్పించాయి. మిడుతల దండువలె అన్నివైపులనుంచి బాణవర్షం కురిసింది. యుద్ధంలో ఏనుగులను ఏనుగులు, అశ్వసమూహాలు అశ్వసమూహాలను, రథికులు రథికులను, ఎదుర్కొని పరస్పరం సంహరించారు. పదాతులు పదాతుల సమూహాలను,, హయసమూహాలను పదాతులు, పదాతులు రథగజాలను, రథాలు గజహయాలను, యుద్ధంలో వేగంగా పరిగెత్తే ఏనుగులు మిగిలిన మూడంగాలను – రథాశ్వపదాతులను నలిపివేశాయి. అక్కడ పరస్పరం వధిస్తున్న,

నిందిస్తున్న యోధుల మధ్య ఘోరమయిన యుద్ధం పశుసంహారం వలె జరిగింది. అంతటా రక్తం వ్యాపించిన యుద్ధభూమి, వర్షాకాలంలో ఆరుద్రపురుగులు అంతటా వ్యాపించిన భూమిలాగా విరాజిల్లింది. శ్యామవర్ణ అయిన యువతి, తెల్లటి చీరకు కుంకుమ రంగువేసి కట్టుకొన్నట్లు, యుద్ధభూమి కన్పించింది. మాంస రక్తాలతో నిండి విచిత్రంగా కన్పించే భూమి సువర్ణమయమయినట్లు తోచింది. అక్కడ భూమిమీద తెగిన తలలు, భుజాలు, పిక్కలు, పెద్దపెద్ద కుండలాలు, ఇతర భూషణాలు, బంగారు వెండి పతకాలు, ధనుర్ధారులయిన వీరుల శరీరాలు, డాళ్ళు, పతాకలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. రాజా! ఏనుగులను ఏనుగులు ఎదుర్కొని దంతాలతో పరస్పరం పొడుచుకొన్నాయి. దంతాలవల్ల కలిగిన గాయం నుంచి కారిన రక్తంతో తడిసిన ఏనుగులు, జేగురు రంగు కలిసిన జలప్రవాహాలను ప్రవహింపజేసే గైరిక ధాతువుతో అలంకృతాలయిన పర్వతాల లాగా ఉన్నాయి. ఆశ్వికులు విసిరిన తోమరాలను, అనేక శత్రు పక్షీయులను, తొండాలతో పట్టుకొని, అనేక గజాలు రణభూమిలో తిరిగాయి. ఇంకా కొన్ని వాటిని ముక్కలు చేశాయి.

రాజా! బాణాలతో కవచాలు పగిలిపోయిన ఏనుగులు, హేమంత ఋతువులో మేఘాలు లేని కొండలలాగా విలసిల్లాయి. చిత్రమయిన రీతిగా అలంకృతాలయిన ఉత్తమ గజాలు, బంగరు ఈకలు గల బాణాలు గ్రుచ్చుకొని ఉండటంచేత, ఉల్కలతో బాగా వెలుగుతున్న పర్వతాలవలె విరాజిల్లాయి. ఆ యుద్ధంలో పర్వతాల్లాంటి ఏనుగులు అన్యగజాలచే దెబ్బతిని, గాయపడి, రెక్కలు గల పర్వతాలలాగా నశించాయి. మహాయుద్ధంలో బాణఘాతాలతో ఆర్తిచెంది, గాయాలతో బాధపడే ఏనుగులు పారిపోయాయి. ఇంకా కొన్ని దంతాలు, కుంభస్థలాలు నేలకు ఆనించి, నేలగూలాయి. ఇంకా కొన్ని ఏనుగులు భయంకరంగా ఘీంకరిస్తూ, సింహాలలాగా గర్జించాయి. కొన్ని ఆటూ ఇటూ తిరిగాయి. కొన్ని ఛీత్కారాలు చేశాయి. బంగరు సామ్ములతో అలంకృతాలయిన అశ్వాలు, బాణాలచేత చచ్చి కూలబడుతున్నాయి. దుమ్ము కొట్టుకొని పదిదిక్కులా తిరిగాయి. బాణాలతో, తోమరాలతో దెబ్బలు తిని ఎన్నో అశ్వాలు నేలబడుతున్నాయి. ఏనుగులు ఈడ్చుకు పోతుంటే సకిలిస్తూ అవి నానాభావాలను వ్యక్తంచేశాయి. గాయపడిన పదాతులు నేలబడి బాంధవులను కొందరు, తండ్రులను కొందరు, తాతలను కొందరు చూసి, మూలుగుతున్నారు. అస్పష్టంగా పిలుస్తున్నారు. ఆ యుద్ధభూమిలో ఇంకా ఇతర మానవులు అనేకులు, పారిపోతున్న వారిని చూసి, పరస్పరం తమ గోత్రనామాలను చెప్పారు. మహారాజా! సువర్ణభూషణాలు గల వారి భుజాలు వేలకొలది తెగిపడి చలిస్తున్నాయి. గిలగిలకొట్టుకొంటున్నాయి, పడుతున్నాయి, ఎగురుతున్నాయి, క్రిందపడుతున్నాయి,

కదులుతున్నాయి. నరపాలా! మంచి గంధపు పూతలు గల పాము పడగల లాంటి ఆ చేతులు ఆయిదుతలలుగల పాములవలె రణభూమిలో రక్తసిక్తాలు కావటం చేత బాగా కదులుతూ, బంగారు జెండా కర్రలవలె విలసిల్లాయి.

ఘోరమయిన సంకుల సమరం అన్ని దిక్కులా సాగుతుండగా యోధులు ఎదుటివారు ఎవరో తెలుసుకోకుండా పరస్పరం చంపుకొంటున్నారు. శస్త్రాలు పడుతుండటం చేత సంకులమై, దుమ్ముతో నిండిన రణభూమి చీకటి క్రమ్మగా, యోధులు ఎవరు తమవారో, ఎవరు శత్రువులో తెలుసుకోలేకపోయారు. ఆ రీతిగా ఆ యుద్ధం ఘోర రూపమూ, భయంకరమూ అయింది. పలుమారులు అక్కడ రక్తజలంతో మహానదులు ప్రవహించాయి. యోధుల తల లనే రాళ్ళతో ఆ నదులు ఆచ్ఛాదితాలు అవుతున్నాయి. వారి శిరోజాలు నాచు, గడ్డిలాగా ఉన్నాయి. ఎముక లనే చేపలు వాటిల్లో నిండి ఉన్నాయి. ధనుస్సులు, బాణాలు తెప్పలులాగా ఉన్నాయి. మాంసం, రక్తం, బురదగా, భయంకరాలై, మిక్కిలి దారుణాలైన, రక్తప్రవాహాలను పెంపొందించే నదులను ఆ సేనలు ప్రవహింపజేశాయి. పిరికివారిని ఎక్కువగా భయపెట్టేవి, శూరుల హర్షాన్ని పెంచేవి, ఘోరరూపా లయిన ఆ నదులు ప్రాణులను యమలోకానికి పంపుతున్నాయి. అవి లోనికి వెళ్ళేవారిని ముంచివేస్తున్నాయి. క్షత్రియులకు భయంకలిగిస్తున్నాయి. నరశ్రేష్ఠా! అక్కడక్కడ, మాంసభక్షక ప్రాణుల అరుపులతో గూడిన ఆ యుద్ధభూమి ప్రేతరాజ పురం లాగా భయానకంగా ఉంది. అక్కడ నలువైపులా లేచిన అనేక కబంధాలు, రక్తమాంసాలతో తృప్తినందిన భూతగణాలు నృత్యం చేస్తున్నాయి. భారతా! అవి అన్నీ రక్తాన్ని, వసను త్రాగి మత్తిల్లాయి. మేదస్సును, మజ్జను, వసను తిని, మదించి, మాంసం తిని తృప్తినందిన కాకులు, గ్రద్దలు, కొంగలు పరుగులు తీస్తూ కన్పించాయి, రాజా! అక్కడ యోధులు మాత్రం, వీడరాని భయాన్ని వదలి, యోధుల వ్రత పాలనలో సమర్థులు కాబట్టి నిర్భయంగా వీరకృత్యాలను చేశారు. బాణాలు, శక్తులతో నిండి, మాంసభోజను లయిన ప్రాణులతో కిటకిటలాడుతున్న యుద్ధభూమిలో, శూరులు తమ పౌరుషాన్ని ప్రకటించుకొంటూ సంచరించారు. ప్రభూ, రణరంగంలో అనేక యోధులు పరస్పరం తమ పేరును, గోత్రాన్ని, తండ్రిపేరును వినిపిస్తున్నారు. నరనాథా ! అక్కడ అనేక యోధులు నామగోత్రాలను చెప్పుకొంటూ శక్తి, తోమరాలతో, పట్టిశాలతో పరస్పరం సంహరిస్తున్నారు. ఆ రీతిగా యుద్ధం ఘోరరూపంగా, మిక్కిలి దారుణంగా జరుగుతుండగా, కౌరవసేన సముద్రంలో పగిలిపోయిన నౌకవలె విషాదం పొందింది."

53. అర్జునుడు పదివేల సంశప్తకుల వధించుట.

సంజయుడు చెప్పాడు – "మాన్యా ! మహారాజా! క్షత్రియుల సంహారంతో ఆ మహాయుద్ధం జరుగుతున్న సమయంలో గాండీవ మహాఘోషం వినిపిస్తున్నది. అర్జునుడు సంశప్తకులతో, కోసలులతో, నారాయణ సేనతో యుద్ధం చేశాడు. జయకాంక్షులై, మిక్కిలి కుపితు లయిన సంశప్తకులు యుద్ధంలో అర్జునుని శిరస్సుమీద బాణవర్షం కురిపించారు. రాజా! ఆ బాణవర్షాలను వేగపూర్వకంగా, త్వరగా సహిస్తూ, శ్రేష్ఠరథికులను సంహరిస్తూ, అర్జునుడు రణరంగంలో చొచ్చుకొనిపోయాడు. సానబెట్టిన, బాణాలు వేస్తూ, అర్జునుడు రథికుల సేనలో దూరి, శ్రేష్ఠాయుధధారి అయిన సుశర్మను సమీపించాడు. సుశర్మ ఆయన మీద బాణవర్షం కురిపించాడు. సంశప్తకులు కూడా అర్జునుని బాణాలతో కొట్టారు. సుశర్మ పదిబాణాలతో అర్జునుని కొట్టి, శ్రీకృష్ణుని కుడిభుజాన్ని మూడు బాణాలతో గాయపరిచాడు. ఆయన ఇంకో బాణం జెండా మీద వేశాడు. ఆ జెండా మీద విశ్వకర్మ నిర్మించిన వానరశ్రేష్ఠుడు పెద్దకేకపెట్టాడు. భయపెడుతూ గర్జించాడు. వానరుని భీషణనాదం విని, భయపడిన నీ సేన, సమధికంగా భయపడి చేష్టలుడిగింది. నిశ్చేష్టంగా అలా ఉన్న ఆ సేన, అనేకవిధాలయిన పూలతో నిండి, ఉన్న చైత్రరథం అనే కుబేరుని పూలతోటలాగా ఉంది. కురుశ్రేష్ఠా! తరువాత కోలుకున్న ఆ యోధులు, పర్వతంమీద మేఘాలవలె, అర్జునుని మీద బాణాల జడివాన కురిపించారు. వాళ్లంతా కలిసి అర్జునుని విశాల రథాన్ని చుట్టుముట్టారు. తీవ్రమయిన పదునయిన బాణాలు తగులుతున్నా ఆయన రథాన్ని పట్టుకొని, పెద్దగా కేకలు వేయసాగారు. కోపావేశం గల వారు అన్నివైపులా వచ్చి గుర్రాలను, రథ చక్రాలను, కాడిని, పోలును పట్టుకోసాగారు. వేలకొలది మీ యోధులు రథాన్ని కదలకుండా పట్టుకొని, సింహనాదం చేశారు. మహారాజా! కొంతమంది శ్రీకృష్ణుని మహాభుజాలను పట్టుకొన్నారు. మరికొంతమంది రథంమీద ఉన్న అర్జునుని సంతోషంతో పట్టుకొన్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు రణముఖంలో చేతులుగట్టిగా విదిలిస్తూ, దుష్టమయిన ఏనుగు మావటీలను వలె వాళ్ళను అందరినీ క్రిందపడవేశాడు. ఆ మహారథు లందరు చుట్టుముట్టి, తన రథాన్ని పట్టుకోవటం, కృష్ణునిమీదికి పోవటం చూసి, అర్జునుడు తీవ్రంగా కోపించాడు.

తన రథాన్ని ఎక్కిన చాలామంది పదాతులను అర్జునుడు కొట్టి క్రిందకు నెట్టివేశాడు. సమీపంలో ఉన్న సంశప్తకులను, దగ్గరగా ఉండే వారిమీద ప్రయోగించదగిన బాణాలు వేసి, కప్పివేశాడు. శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. 'మహాబాహూ! కృష్ణా ! సంశప్తక

గణాలను వేలకొలదిగా వధిస్తున్నా, వాళ్ళు చేస్తున్న దారుణ కార్యం చూడు. యదుశ్రేష్ఠా! ఘోరంగా ఈరీతిగా రథాన్ని బంధించటాన్ని, లోకంలో నేను తప్ప ఇంకెవ్వడూ తట్టుకోలేడు.' అని చెప్పి అర్జునుడు దేవదత్తాన్ని, పూరించాడు. శ్రీకృష్ణుడు భూమ్యాకాశాలను, నింపివేసేటట్లు పాంచజన్యాన్ని పూరించాడు. మహారాజా! ఆ ఇద్దరి శంఖధ్వనులను విని సంశప్తక సేన సంచలించింది. భయకంపితమయి, వేగంగా పారిపోయింది. అర్జునుడు పలుమారులు నాగాస్త్రాన్ని ప్రయోగించి, వారి కాళ్ళను బంధించాడు. అర్జునుడు పాదబంధంతో బంధించగా, సంశప్తకులు ఇనుప బొమ్మలలాగా, నిశ్చేష్టులు అయ్యారు. పూర్వం తారకాసుర సంహారసమయంలో, ఇంద్రుడు దైత్యులను యుద్ధభూమిలో వధించినట్లు, అర్జునుడు నిశ్చేష్ట లయిన వారిని వధించాడు. బాణాలు తీవ్రంగా తగలటంవల్ల, వారు రథాన్ని వదలిపెట్టారు. తమ ఆయుధాలు అన్నింటిని వదలటం మొదలుపెట్టారు. పాదబంధంతో బంధింపబడటం వల్ల వారు కదల లేకపోయారు. అప్పుడు అర్జునుడు వారిని వంగిన ములుకులు గల బాణాలతో సంహరించాడు. అర్జునుడు పాదబంధం చేసిన ఆ యోధులు అందరిని పాములు చుట్టివేశాయి. సుశర్మ తన సేనా దుఃస్థితిని గమనించి వేగంగా గరుడాస్త్రం వేశాడు.

అప్పుడు పాములను తింటూ గరుడ పక్షులు దూకాయి. ఆ పక్షులను చూసి, పాములు పారిపోయాయి. నరనాథా ! మేఘబంధాన్నించి ముక్తుడయిన సూర్యుడు జనులను తపింపజేసినట్లు, పాదబంధాన్నుంచి ముక్తమయిన సంశప్తక సేన విరాజిల్లింది. ఆ విధంగా నాగాస్త్ర విముక్తులయిన ఆ యోధులు, అర్జునుని రథంమీద అనేక బాణాలను, శస్త్రసమూహాలను ప్రయోగించారు. ఆయన ప్రయోగించిన శస్త్రాలను అన్ని రీతులుగా ఖండించసాగారు. ఇంద్రపుత్రుడు మహాస్త్రమయ మయిన వృష్టిని తన బాణ వర్షంతో ధ్వంసం చేసి, సంశప్తక యోధులను సంహరించాడు. రాజా! అప్పుడు సుశర్మ వంగిన ములికి గల ఒక బాణం అర్జునుని గుండెల్లో కొట్టి, మూడు బాణాలతో ఆయనను గాయపరిచాడు. ఆ బాణం గాటంగా నాటుకోవటం వల్ల బాధతో అర్జునుడు రథంవెనక కూర్చున్నాడు. అప్పుడు అర్జునుడు హతు డయ్యాడని అందరూ పెద్దగా కేకలుపెట్టారు. అప్పుడు పుష్కలంగా శంఖధ్వనులు, భేరీ ధ్వనులు, నానావిధయుద్ధ వాద్య ధ్వనులు, సింహనాదాలు చెలరేగాయి. శ్రీకృష్ణుడు సారథిగా గల అర్జునుడు మళ్ళీ కోలుకొని మూర్ఛతేరి, త్వరగా ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు వేలబాణాలు ఆవిర్భవించి నీ సేనను సంహరిస్తూ అన్ని దిక్కులా కన్పించాయి. ఆ శస్త్రాలు వందలు వేలకొలది గుర్రాలను, రథాలను సంహరిస్తుంటే, నీ సేనలో గల సంశప్తక గణాలకు, గోపాలురకు

తీవ్రమయిన భయం కలిగింది. అక్కడ మీ సేనలోని వీరుల్లో అర్జునుని గాయపరచ గల వీరుడు ఒక్కడూ లేకపోయాడు. వీరులు అంతా చూస్తుండగా మీ సేన హతమయింది. మహారాజా! సేన అంతా నిశ్చేష్టం అయింది. వారిలో పరాక్రమించే వారు ఎవ్వరూ లేకపోయారు. యుద్ధంలో అర్జునుడు పదివేలమంది యోధులను సంహరించి పొగలేని అగ్నిలాగా ప్రకాశించాడు. సంశప్తక సేనలో పదునాల్గు వేలమంది పదాతులు, పదివేల రథాలు, మూడువేల ఏనుగులు మిగిలాయి. అప్పుడు సంశప్తకులు యుద్ధంలో మరణం గాని, జయంగాని కలగకుండా వెనుదిరగటం లేదు అని నిశ్చయించుకొని మళ్ళీ అర్జునుని చుట్టుముట్టారు. నరపాలా! అక్కడ మీవాళ్ళకు శూరుడు, బలవంతుడు, కిరీటధారి, పాండుపుత్రు డయిన అర్జునునితో మహాయుద్ధం జరిగింది. ఇంద్రుడు రాక్షసులను వలె అర్జునుడు వారిని చంపాడు."

54. సంకుల యుద్ధము.

సంజయుడు చెప్పాడు – "రాజా! కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు, ఉలూకుడు, శకుని, సోదరులతో కూడా దుర్యోధనుడు అర్జునుని భయంతో నీరసిస్తున్న సేనను చూసి, సముద్రంలో మునిగిపోతున్న ఓడను వలె ఉద్ధరించారు. అప్పుడు భీరువులకు భయమూ, శూరులకు హర్షమూ పెంపొందించే యుద్ధం రెండు గడియల కాలం జరిగింది. యుద్ధంలో కృపుడు వదలిన బాణవర్షాలు మిడుతల దండువలె సృంజయులను కప్పివేశాయి. అప్పుడు క్రుద్ధుడయిన శిఖండి, కృపాచార్యుని మీదికి వేగంగా వెళ్ళాడు. ఆ ద్విజశ్రేష్ఠునిమీద అంతటా బాణవర్షం కురిపించాడు. కృపుడు క్రుద్ధుడయి, ఆ శర వర్షాన్ని ధ్వంసంచేసి, శిఖండిని పదిబాణాలతో గాయపరిచాడు.

రాజా! సమరంలో క్రుద్ధ లయిన వారిద్దరికి, రామరావణులకు వలె రెండు గడియలసేపు దారుణ మయిన యుద్ధం జరిగింది.

అప్పుడు శిఖండి యుద్ధంలో సూటిగాపోయే బాణాలతో కృపుని గాయపరిచాడు. బ్రాహ్మణు డయిన కృపాచార్యుడు తీవ్రంగా గాయపడి, శిఖండి సూతుని, రథాన్ని ధ్వంసం చేశాడు. గుర్రాలు హతమయిన రథం మీదినుంచి శిఖండి దూకి, కత్తి డాలు తీసుకొని, బ్రాహ్మణుని మీదికి వెళ్ళాడు. తనమీదికి వస్తున్న శిఖండిని కృపుడు బాగా వంగిన ములుకులు గల బాణాలతో కప్పివేశాడు. అది ఆశ్చర్యకరం అయింది. రణరంగంలో శిఖండి నిశ్చేష్టుడయి నిలిచాడు. నీళ్ళల్లో రాళ్లు తేలినంత ఆశ్చర్యంగా దాన్ని మేము అక్కడ చూశాం.

శిఖండిని కృపుడు బాణాలతో కప్పివేయటం చూసి, మహాంధు డయిన ధృష్టద్యుమ్నుడు త్వరగా కృపుని మీదికి వెళ్ళాడు. కృపాచార్యుని రథం మీదికివెళ్లుతున్న ధృష్టద్యుమ్నుని కృతవర్మ అడ్డుకొన్నాడు. కృపాచార్యుని రథంవైపు పుత్రులతో, సైన్యంతో వస్తున్న యుధిష్ఠిరుని అశ్వత్థామ అడ్డగించాడు. త్వరగావస్తున్న నకుల సహదేవులను నీ పుత్రుడు బాణవర్షంతో వారించి, ఎదుర్కొన్నాడు. భీమసేనుని, కరూషులను, సృంజయులతో కూడా కేకయులను యుద్ధంలో కర్ణుడు అడ్డుకొన్నాడు. కృపుడు యుద్ధభూమిలో శిఖండిని దగ్ధం చేయదలచినట్లు మహావేశంతో వేగంగా బాణాలు వేశాడు. ఆయన వేసిన బాణాలను, శిఖండి ఖడ్గాన్ని పలుమారులు త్రిప్పుతూ ఛేదించాడు. అప్పుడు కృపుడు నూరు చంద్రబింబాలు గల ఆతని డాలును, బాణాలు వేసి ధ్వంసంచేశాడు. అది చూసి, జనం కోలాహలం చేశారు. మహారాజా! డాలులేని శిఖండి కేవలం ఖడ్గం మాత్రమే తీసుకొని, రోగి మృత్యుముఖంలోకి పోయినట్లు కృపుని వశమయి ఆయనవైపు వెళ్ళాడు. రాజా! శిఖండి కృపాచార్యుని బాణాలకు గురి అయి కష్టపడుతుండటం చూసి, చిత్రకేతువు కుమారుడు సుకేతువు త్వరగా ఆయనవైపు వెళ్ళాడు. అనంత మయిన ఆత్మవిశ్వాసం గల ఆతడు యుద్ధంలో పదునయిన అనేక బాణాలు కృపుని మీదవేస్తూ, ఆయన రథంవైపు వెళ్ళాడు. బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించిన బ్రాహ్మణు డయిన, కృపుడు సుకేతువుతో యుద్ధంచేయటం చూసి, శిఖండి వేగంగా తొలగాడు. తరువాత సుకేతువు గౌతముని తొమ్మిది బాణాలతో కొట్టాడు. తరువాత డెబ్బది మూడు బాణాలు వేశాడు. వెంటనే కృపుని బాణంతో గూడిన ధనుస్సును ఛేదించాడు. ఆయన సారథిని మర్మప్రదేశాల్లో తీవ్రంగా ఒక బాణంతో కొట్టాడు. కృపుడు దృఢమయిన ధనుస్సు తీసుకొని, సుకేతువును ముప్పదిబాణాలు వేసి అన్ని మర్మస్థానాలను ఛేదించాడు. భూకంపం వచ్చినప్పుడు బాగా కంపించే వృక్షం లాగా సుకేతువు సర్వాంగాలు విహ్వలం కాగా రథంమీద తీవ్రంగా కంపించాడు.

కదలిపోతున్న ఆతని శరీరం నుంచి ప్రకాశించేకుండలాలతో, తలపాగతో, శిరస్త్రాణంతో గూడిన శిరస్సును ఒక క్షురప్రంతో కృపుడు నేలగూల్చాడు. ఆయన శిరస్సు గ్రద్దతెచ్చిన మాంసఖండంవలె నేలబడింది. తరువాత ఆయన శరీరం పడింది. ఆతడు చనిపోగా, ఆయనకు ముందున్న సేనలు కృపుని చూసి, భయపడి ఆయనను వదలి పదిదిక్కులకూ పారిపోయాయి. కృతవర్మ యుద్ధభూమిలో ధృష్టద్యుమ్నుని నిలువరించి 'నిలు, నిలు' అని అన్నాడు. కృతవర్మ ధృష్టద్యుమ్నులకు, మాంసం కోసం గ్రద్దలకు పోరు జరిగినట్లు, యుద్ధం జరిగింది. ధృష్టద్యుమ్నుడు కృతవర్మను పీడిస్తూ, తొమ్మిది

బాణాలతో గుండెల్లో కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు తీవ్రంగా గాయపరచగా కృతవర్మ రథం, గుర్రాలతో సహా ఆయనను బాణాలతో కప్పివేశాడు. జలంతో నిండిన మేఘాలు బాగా కప్పివేసిన సూర్యునివలె ధృష్టద్యుమ్నుడు రథంతో కూడా కృతవర్మ బాణాచ్ఛాదితుడయి ఎవరికీ కన్పించలేదు. బంగారు అలంకారాలు గల బాణాలతో ఆయన బాణాలను భిన్నభిన్నంచేసి, గాయపడిన ధృష్టద్యుమ్నుడు విలసిల్లాడు. ధృష్టద్యుమ్నుడు క్రుద్ధుడయి కృతవర్మను ఎదుర్కొని మిక్కిలి దారుణమయిన బాణవర్షం కురిపించాడు. వేగంగా వచ్చి మీదపడుతున్న ఆ బాణవర్షాన్ని అనేక వేలబాణాలు వేసి కృతవర్మ వారించాడు. ఎదుర్కొన వీలులేని శస్త్రవర్షాన్ని ఆయన వారించటం చూసి, ధృష్టద్యుమ్నుడు కృతవర్మను ఎదుర్కొని, నిలువరించాడు. పదునయిన అంచుగల బాణంతో ఆయన సారథిని యమలోకానికి పంపాడు. హతుడయిన సారథి నేల గూలాడు.

మిక్కిలి కోపించిన కృతవర్మ, తగలబెట్ట గోరిన అగ్నివలె ధృష్టద్యుమ్నాదులయిన పాండవులను చుట్టుముట్టాడు. రాజా! అప్పుడు ధృష్టద్యుమ్నుడు గదను తీసుకొని మళ్ళీ చాలా వేగంగా వచ్చి, కృతవర్మను కొట్టాడు. ధృష్టద్యుమ్నుని వల్ల బాగా దెబ్బతిన్న కృతవర్మ మూర్ఛపోయాడు. శ్రుతర్వుడు ఆయనను రథం మీద ఎక్కించుకొని యుద్ధభూమి నుండి తొలగించి తీసుకుపోయాడు.

ధృష్టద్యుమ్నుడు శత్రువును జయించి, యుద్ధంలో కౌరవులను బాణాలతో నిలిపివేశాడు. అప్పుడు మీ పక్షంవారు సింహనాదాలు చేస్తూ ధృష్టద్యుమ్నుని మీదికి దూకారు. అప్పుడు యుద్ధం జరిగింది."

55. అశ్వత్థామతో యుద్ధము నుండి యుధిష్ఠిరుడు తొలగుట.

సంజయుడు చెపుతున్నాడు. "అశ్వత్థామ శూరులయిన ద్రౌపదీ పుత్రులతో, సాత్యకితో రక్షితుడయిన యుధిష్ఠిరుని చూసి, సంతోషంతో అటు వైపు వెళ్ళాడు. మహాస్త్రవేత్త అయిన అశ్వత్థామ ఘోరమయిన బాణాలు అలవోకగా వేయటంలో నేర్పరిలాగా, నానా విధాల మార్గాలతో తన విద్యానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, దివ్యాస్త్రాలతో అభిమంత్రిత మయిన బాణాలతో యుధిష్ఠిరుని అడ్డగించి, ఆకాశాన్నంతా బాణాలతో నింపివేశాడు. ఏది ఎక్కడ ఉన్నదో కొంచెం గూడా తెలియలేదు. యుద్ధభూమి అంతా బాణమయం అయింది. బంగరు జాలరులతో అలంకృతమయిన బాణ సమూహం, ఆకాశాన కట్టిన చాందినీలాగా విలసిల్లింది. బాణాలతో అవరుద్ధ మయిన ఆకాశంలో మేఘచ్ఛాయలాగా అది ఏర్పడింది. ఆకాశంలో ప్రయాణించే ఏ ప్రాణీ నేలమీదికి రాలేకపోయింది. అది మాకు ఆశ్చర్యకరంగా కన్పించింది. మిక్కిలిగా ప్రయత్నిస్తున్నా సాత్యకి, ధర్మరాజు, అలాగే ఇతర సైన్యాలు

ఫరాక్రమించలేకపోయాయి. అశ్వత్థామ శరప్రయోగ లాఘవాన్ని చూసి, అక్కడ మహారథులు ఆశ్చర్యమగ్ను లయ్యారు. సూర్యునివలె సంతాపం కలిగిస్తున్న ఆయనను రాజులు కన్నెత్తి చూడలేకపోయారు. సైన్యం అంతా చనిపోవటం చూసి, పాండవ సేనలోని మహారథులయిన ద్రౌపదీ పుత్రులు, సాత్యకి , ధర్మరాజు, పాంచాలురు కలిసి, మృత్యుభయం వదలి, అశ్వత్థామ పైకి దూకారు. సాత్యకి మొదట ఇరవైఏడు బాణాలతో అశ్వత్థామను కొట్టి, మళ్ళీ స్వర్ణభూషితా లయిన అయిదు బాణాలతో గాయపరిచాడు. యుధిష్ఠిరుడు డెబ్భది బాణాలతో, ప్రతివింధ్యుడు ఏడింటితో, శ్రుతకర్మ మూడింటితో, శ్రుతకీర్తి ఏడింటితో, సుతసోముడు తొమ్మిదింటతో, శతానీకుడు ఏడింటితో ఇంకాఎందరో ఇతర శూరులు అనేక బాణాలు వేసి, ఆయన్ను గాయపరిచారు.

క్రుద్ధుడయిన అశ్వత్థామ సర్పంలాగా బుసకొడుతూ, సాత్యకిని ఇరవై అయిదు బాణాలతో గాయపరిచాడు. శ్రుతకీర్తిని తొమ్మిదితో, సుతసోముని అయిదింటితో, శ్రుతకర్మను ఎనిమిదింటితో, ప్రతివింధ్యుని మూడు బాణాలతో, శతానీకుని తొమ్మిదింటితో, ధర్మపుత్రుని అయిదింటితో, అలాగే ఇతర శూరులను రెండేసి బాణాలతో కొట్టాడు. పదునయిన బాణాలతో శ్రుతకీర్తి ధనుస్సును ఖండించాడు. అప్పుడు శ్రుతకీర్తి ఇంకొక ధనుస్సు తీసుకొని, అశ్వత్థామను మూడు బాణాలతో కొట్టి, మళ్ళీ మూడు బాణాలతో గాయపరిచాడు. తరువాత ద్రోణపుత్రుడు పాండవసైన్యాన్ని బాణవర్షంతో అంతటా కప్పివేశాడు. అశ్వత్థామ నవ్వుతూ, ధర్మరాజు ధనుస్సును మూడు బాణాలతో విరగగొట్టాడు. అప్పుడు ధర్మరాజు ఇంకొక పెద్ద ధనుస్సు తీసుకొని, అశ్వత్థామను బాణాలతో బాధించాడు. భుజాల మీద, గుండెల్లో డెబ్భది బాణాలు గ్రుచ్చాడు. క్రుద్ధుడయిన సాత్యకి, యుద్ధంలో అందరిని ప్రహరిస్తున్న అశ్వత్థామ ధనుస్సును అర్ధచంద్రబాణంతో ఛేదించి తీవ్రమయిన గర్జన చేశాడు. అశ్వత్థామ ధనుస్సు విరుగగా శక్తిని వేసి, సాత్యకి రథంమీద నుంచి ఆయన సారథిని నేలపడేశాడు. ద్రోణపుత్రుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, సాత్యకిని బాణవర్షంతో కప్పివేశాడు. భారతా! యుద్ధభూమిలో సారథి పడిపోగా సాత్యకి పారిపోతూ, రథాశ్వాలు విభిన్న ప్రదేశాల్లో పరుగెత్తుతూ కన్పించాయి. యుధిష్ఠిరుడు మొదలయిన వారు ద్రోణ పుత్రుని పైన పదునయిన బాణాలను వేగంగా వదులుతూ వర్షించారు. అలా తనమీదికి వస్తువ్న వాటిని చూచి నవ్వుతూ, ద్రోణపుత్రుడు మహారణంలో ఎదుర్కొన్నాడు.

అడవిలోని ఎండుకర్రలను, ఎండుగడ్డిగాదాన్ని అగ్ని దగ్ధంచేసినట్లు, అశ్వత్థామ వందల బాణా లనే జ్వాలలతో పాండవసేనను దగ్ధం చేయసాగాడు. తిమి అనే పెద్ద చేప

నదీముఖాన్ని కల్లోలితం చేసినట్టు, ద్రోణపుత్రుడు పాండవ సైన్యాన్ని క్షోభింపజేశాడు. ద్రోణపుత్రుని పరాక్రమం చూచినవారు పాండవులను అందరినీ అశ్వత్థామ చంపివేశాడనుకొన్నారు. యుధిష్ఠిరుడు రోషంతో, కోపంతో నిండి అశ్వత్థామతో ఇలా అన్నాడు.

యుధిష్ఠిరుడన్నాడు – "గురుపుత్రా! నీవు యుద్ధం చేయటంలో శ్రేష్ఠుడివని, వీరుడివని, మహాబలుడివని, అస్త్రవిద్యావేత్తవని, విద్వాంసుడివని, గొప్ప పరాక్రమవంతుడివని ఎరుగుదును. ఈ బలాన్ని అంతా నీవు ధృష్టద్యుమ్నుని మీద చూపిస్తే, నిన్ను బలవంతుడ వని, అస్త్రవిద్యావేత్తవని తెలుసుకుంటాం. శత్రునాశకు డయిన ధృష్టద్యుమ్నుని యుద్ధరంగంలో చూస్తే, నీ బలం ఎందుకూ పనికిరాదు. ఇప్పుడు నీవు చేసే పనిచూస్తే నిన్ను బ్రాహ్మణుడని అనను.

పురుషశ్రేష్ఠా! ఇవ్వాళ నన్నే చంపదలచావు. కాబట్టి నీకు ప్రేమ, కృతజ్ఞత లేవు. బ్రాహ్మణుడు తపస్సు, దానం, వేదాధ్యయనం చేయాలి. క్షత్రియుడు ధనుస్సు పట్టి వంచాలి. కాబట్టి నీవు పేరుకే బ్రాహ్మణుడివి. నీవు చూస్తుండగానే కౌరవులను జయిస్తాను. నీ పరాక్రమం యుద్ధంలో చూపు. నిజానికి నీవు స్వధర్మభ్రష్ఠుడవయిన బ్రాహ్మణుడివి." ఇలా చెపుతుండగా అశ్వత్థామ నవ్వుతున్నట్టున్నాడు. ఈయన మాటలు యుక్తియుక్తాలు, యథార్థాలు అని తలచి సమాధానం చెప్పలేదు. కోపించిన యముడు ప్రళయకాలంలో ప్రజలను అదృశ్యం చేసినట్లు, ఆయన ఏమీ మాట్లాడకుండా ధర్మజుని బాణవర్షంతో కప్పివేశాడు. ఆర్యా! ఆ రీతిగా అశ్వత్థామ కప్పివేస్తుంటే ఆయన విశాలసైన్యాన్ని వదలి, యుద్ధభూమినుంచి తొలగిపోయాడు. యుధిష్ఠిరుడు తొలగిపోగా అశ్వత్థామ ఇంకోవైపు వెళ్ళాడు. రాజా! అప్పుడు యుధిష్ఠిరుడు ద్రోణపుత్రుని మహాయుద్ధంలో వదలి, క్రూర కార్యం చేయటానికి నీసేన మీదికి వెళ్ళాడు."

56. సంకుల యుద్ధము.

సంజయుడు చెపుతున్నాడు. "రాజా! చేది దేశీయులు, పాంచాలురతో గూడి ఉన్న భీమసేనుని కర్ణుడు అడ్డగించి, బాణాలతో వారించాడు. అప్పుడు భీముడు చూస్తుండగానే కర్ణుడు చేదివీరులను, కారూషలను, మహారథులయిన సృంజయులను గాయపరిచాడు. భీముడు కర్ణుని వదలి ఎండుగడ్డిని దగ్ధంచేసే అగ్నివలె జ్వలిస్తూ, కౌరవ సైన్యంమీదికి వెళ్ళాడు. సూతపుత్రుడు కూడా సమరంలో పాంచాలురను, కేకయులను, సృంజయులను వేలకొలది సంహరించాడు. సంశప్తకులలో అర్జునుడు, కౌరవసేనలో భీముడు, పాంచాలురలో కర్ణుడు ప్రవేశించారు. ఆ మహారథులు ముగ్గురూ ఆ మూడు సేనలను క్షీణింపజేశారు. రాజా! నీ చెడు ఆలోచన కారణంగా, అగ్నితుల్యులయిన ఆ మహావీరులు ముగ్గురూ

దగ్ధం చేస్తుంటే, ఆ క్షత్రియులు యుద్ధంలో నాశనం అయ్యారు. అప్పుడు క్రుద్ధు డయిన దుర్యోధనుడు తొమ్మిది బాణాలతో నకులుని గాయపరిచాడు. ఆయన రథాశ్వాలు నాలుగింటిని బాణాలతో కొట్టాడు. అనంతరం నీ పుత్రుడు మంగలి కత్తివంటి బాణంతో సహదేవుని స్వర్ణధ్వజాన్ని ఛేదించాడు. క్రుద్ధు డయిన నకులుడు ఆ యుద్ధ రంగంలో ఏడు బాణాలతో, సహదేవుడు అయిదు బాణాలతో నీ పుత్రుని కొట్టారు. వారిద్దరిని నీ పుత్రుడు గుండెల్లో అయిదు, అయిదు బాణాలు వేసి, గాయపరిచాడు. రాజా! రెండు బాణాలతో వారిద్దరి ధనుస్సులను ఖండించాడు, ఇరవై ఒక్క బాణాలతో వేగంగా వాళ్ళను గాయపరిచాడు. వారిద్దరు ఇంద్రధనుస్సులాంటి రెండు ధనుస్సులు గ్రహించి, దేవపుత్రులులాగా ప్రకాశించారు. మహామేఘాలు పర్వతం మీద వలె సోదరులయిన వారిద్దరు, ఘోరమయిన బాణాలను సోదరు డయిన దుర్యోధనునిమీద కురిపించారు. క్రుద్ధు డయిన నీ పుత్రుడు మహాధనుష్కు లయిన పాండుకుమారులనిద్దరిని బాణాలు వేసి వారించాడు. యుద్ధభూమిలో ఆయన మండలాకారమయిన ధనుస్సు మాత్రమే కన్పించింది. అంతటా దూసుకువస్తున్న ఆయన బాణాలే కన్పించాయి. సూర్యకిరణాలవలె ఆయన వేసిన బాణాలు అన్నిదిక్కులను కప్పివేశాయి. ఆకాశం బాణచ్ఛాదితమై బాణమే అయింది. అప్పుడు కాలునివలె, యమునివలె, అంతకుని వలె ఉన్న నీ పుత్రుని రూపాన్ని నకుల సహదేవులు చూశారు. నీ పుత్రుని మహా పరాక్రమాన్ని చూసిన మహారథులు మాద్రీపుత్రులు మృత్యుసమీపం చేరారని అందరూ అనుకొన్నారు.

అప్పుడు మహారథుడైన, ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడు ఉన్న చోటికి వెళ్ళాడు. ధృష్టద్యుమ్నుడు మాద్రీపుత్రులను అతిక్రమించి, నీ పుత్రుని బాణాలతో వారించాడు. నీ పుత్రుడు నవ్వుతూ ధృష్టద్యుమ్నుని ఇరువది అయిదు బాణాలతో గాయపరిచాడు. నీ పుత్రుడు మళ్ళీ ధృష్టద్యుమ్నుని అరువది అయిదు బాణాలతో కొట్టి సింహనాదం చేశాడు. అలాగే దుర్యోధనుడు యుద్ధంలో మిక్కిలి పదునయిన క్షురప్రంతో, బాణంతో గూడిన ఆయన ధనుస్సును ఛేదించాడు. పాంచాలరాజ పుత్రుడు ఆ ధనుస్సు వదలి, వేగంగా మిక్కిలి భారాన్ని సహించగల క్రొత్త విల్లు తీసుకొన్నాడు. ఆయన కన్నులు కోపంతో ఎర్రబడ్డవి. శరీరం అంతా గాయాలయ్యాయి. అందువల్ల ధృష్టద్యుమ్నుడు వేగంగా జ్వలిస్తున్న అగ్నిదేవుని వలె శోభిల్లాడు. ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని చంపదలచి, బుసకొడుతున్న పాములవంటి పదిహేను బాణాలను వేశాడు. ఆ బాణాలు దుర్యోధనుని శరీరాన్ని ఛేదించి, వేగంగా భూమిలో దూరాయి. మహారాజా! బాగా గాయపడిన నీ పుత్రుడు వసంతకాలంలో

బాగా వికసించిన మోదుగు చెట్టువలె విరాజిల్లాడు. ఆయన కవచం భిన్నమయింది. బాణాల దెబ్బలతో, శరీరం మీద బాగా గాయాలయ్యాయి. అందువల్ల కోపించి ఒక బాణంతో ధృష్టద్యుమ్నుని ధనుస్సు ఖండించాడు. అప్పుడు దుర్యోధనుడు త్వరపడి, ధనుస్సు విరిగిన ధృష్టద్యుమ్నుని, పది బాణాలతో కనుబొమల మధ్య కొట్టాడు. వికసించిన పద్మం తేనెను పొందగోరే తుమ్మెదలవలె అవి ఆయన ముఖాన్ని శోభిల్లజేశాయి.

అభిమాని అయిన ధృష్టద్యుమ్నుడు, విరిగిన ధనుస్సును వదలి, వేగంగా ఇంకో ధనుస్సును, పదహారు బాణాలనూ తీసుకొన్నాడు. తరువాత దుర్యోధనుని అశ్వాలను, సూతుని అయిదు బాణాలతో హతం చేసి బంగారంతో అలంకృతమయిన ధనుస్సును ఒక బాణంతో ఖండించాడు. పార్షతుడు పదిబాణాలతో, సర్వసామగ్రితో గూడిన నీ పుత్రుని రథాన్ని, చక్రాన్ని, శక్తిని, ఖడ్గాన్ని, గదను, ధ్వజాన్ని ఖండించాడు. సువర్ణమయమై అంగదాలతో విభూషితమై, నాగచిహ్నం గల చిత్ర మణిమయ ధ్వజం తెగి నేలగూలటం రాజులంతా చూశారు. భరతవంశశ్రేష్ఠా! యుద్ధరంగంలో రథహీనుడై, ఆయుధాలూ కవచమూ భిన్నమయిన దుర్యోధనుని, ఆయన సోదరులు అన్ని దిక్కులా ఉండి రక్షించారు. రాజా ! ధృష్టద్యుమ్నుడు చూస్తుండగా ఆ దుర్యోధనుని రథం ఎక్కించుకొని దండధారుడు ఎలాంటి గాబరాలేకుండా రణరంగం నుంచి దూరంగా తీసుకొనిపోయాడు. దుర్యోధనుని హితం కోరేవాడు, మహాబలు డయిన కర్ణుడు సాత్యకిని జయించి రణంలో ధృష్టద్యుమ్నునికి ఎదురువెళ్ళాడు. ముందుపోతున్న ఏనుగును ఇంకొక ఏనుగు దంతాలతో పొడుస్తూ పోతున్నట్లు, సాత్యకి బాణాలతో త్వరగా గాయపరుస్తూ కర్ణుని వెంబడించాడు. కర్ణదుర్యోధనుల మధ్య ఉన్న మనస్పులయిన మీవాళ్ళకు, పాండవయోధులకు మహాసంగ్రామం జరిగినది. పాండవయోధులలో గాని, మనవాళ్ళలో గాని ఒక్క యోధుడు కూడా వెనుదిరగటం కన్పించలేదు. అప్పుడు కర్ణుడు త్వరగా పాంచాలుర మీదకి వెళ్ళాడు. రాజా! పగలు మధ్యాహ్న సమయంలో ఆ క్షణంలో ఏనుగులు, గుర్రాలు, జనాలు రెండు పక్షాల్లో నశించారు. మహారాజా! జయేచ్ఛగల పాంచాలురు అందరూ చెట్టు మీదికి పక్షులలాగా కర్ణునిమీదికి దూకారు. క్రుద్ధు డయిన కర్ణుడు దృఢమనస్కులు, విజయంకోసం యత్నిస్తున్న పాంచాలసేనలో ముందు వచ్చేవారిని ఎన్నుకొని, బాణసమూహంతో సంహరించాడు. వ్యాఘ్రకేతువును, (పాండవ పక్షంలో ఉన్న) సుశర్మను, చిత్రుని, ఉగ్రాయుధుని, జయుని, శుక్లుని, రోచమానుని, దుర్జయుడయిన సింహసేనుని మీదికి కర్ణుడు వెళ్ళాడు. ఆ వీరులు రథమార్గంలో వచ్చి క్రుద్ధుడై, యుద్ధంలో శోభిల్లే, కర్ణుని చుట్టుముట్టారు.

రాధేయుడు దూరాన్నుంచే ఆ ఎనిమిది మంది వీరులను పదునయిన ఎనిమిది బాణాలతో బాధించాడు.

అనంతరం సూతపుత్రుడు యుద్ధనిపుణులయిన వేలకొలది యోధులను చంపాడు. ఆయన చేది దేశీయులయిన మహారథులలో జిష్ణువును, జిష్ణుకర్మను, దేవాపిని భద్రుని, దందుని, చిత్రుని, చిత్రాయుధుని, హరిని, సింహకేతుని, రోచమానుని, మహారథుడయిన శలభుని, రణంలో సంహరించాడు. వీరి ప్రాణాలు తీస్తున్న రక్తంతో తడిసిన కర్ణుని శరీరం ప్రాణులను సంహరించే రుద్రుని విశాల దేదీప్యమాన శరీరంలాగా ఉంది. భారతా! అక్కడ కర్ణుని బాణాలు తగలగా, భయపడిన ఏనుగులు సేనను అల్లకల్లోలం చేస్తూ అన్నిదిక్కులా పరుగుతీశాయి. కర్ణుని బాణాల దెబ్బలు తిన్న ఆ ఏనుగులు వజ్రాయుధం దెబ్బతిన్న కొండలలాగా నానా విధాల అరుస్తూ, యుద్ధంలో నేలగూలాయి. అంతటా పడుతున్న ఏనుగులు, గుర్రాలు, పదాతుల, రథాలతో, కర్ణుని మార్గంలో భూమి అంతా కప్పుకొన్నది. యుద్ధభూమిలో కర్ణుడు చేసిన మహావీర కృత్యాన్ని మీ పక్షంవారిలో భీష్ముడు గాని, ద్రోణుడు గాని, ఇంకా ఇతరులుగాని చేయలేదు. మహారాజా! కర్ణుడు శత్రుపక్షంలోని గజాల్లో, అశ్వాలలో, రథాలలో, పదాతులలో ప్రవేశించి మహాయుద్ధం చేశాడు. అడవి జంతువులలో సింహం నిర్భయంగా సంచరించినట్లు, కర్ణుడు పాంచాలుర మధ్య వీరవిహారం చేస్తూ కన్పించాడు. భయపడిన మృగ సమూహాన్ని సింహం నలుదిక్కులకు పారద్రోలినట్లు, కర్ణుడు పాంచాలుర రథసమూహాన్ని పారద్రోలాడు. సింహం నోటిలో పడిన మృగాలు బ్రతికి బయటపడలేనట్లు, పాంచాల మహారథులు కర్ణుని ఎదుటపడి బ్రతకలేదు. భారతా! అగ్నిలో పడిన జనం దగ్ధమయినట్లు, కర్ణు డనే అగ్ని స్పృంజయులను దగ్ధం చేసింది. భారతా! చేది కేకయ పాంచాల సేనలలో వీరులచే పూజితులయిన అనేకులను కర్ణుడు పేరు పెట్టి పిలిచి చంపాడు. సూతపుత్రుడు యుద్ధంలో పాంచాలురనే పలుమారులు వినాశం చేశాడు. యుద్ధంలో కర్ణుని వీర విజృంభణం చూసిన నాకు కూడా ఆయన చేతిలో పడిన పాంచాలుడు ఎవ్వడూ బ్రతికిబయట పడలేడు అని అనిపించింది.

మహా యుద్ధంలో పాంచాలురను సంహరిస్తున్న కర్ణుని చూసి, కుపితుడయిన యుధిష్ఠిరుడు ఆయన మీదికి వెళ్ళాడు. ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవులు, ఇంకా వందలకొలది జనులు రాధేయుని చుట్టుముట్టారు. శిఖండి, సహదేవుడు, నకులుడు, శతానీకుడు, జనమేజయుడు, సాత్యకి అనేక ప్రభద్రకులు యుద్ధంలో ధృష్టద్యుమ్నునికి ముందుండి,

బాణాలు ప్రయోగిస్తున్న కర్ణుని నానాశస్త్రాస్త్రాలతో ప్రహరిస్తూ సంచరించారు. కర్ణుడు ఒక్కడే అనేకులయిన చేది పాంచాల పాండవులను గరుత్మంతుడు పాములను వలె ఎదుర్కొన్నాడు. పూర్వం దానవులతో దేవతలకు జరిగిన ఘోర యుద్ధంలాంటి యుద్ధం వారితో ఆయనకు జరిగింది. వారిని అందరిని చీకట్లను సూర్యునివలె, కర్ణుడు ఒక్కడే కలతచెందక నాశనం చేశాడు. కర్ణుడు పాండవులతో పోరుతున్నప్పుడు భీముడు యమదండాల వంటి బాణాలతో బాహ్లీకులను కేకయులను, మత్స్యులను, వాసాత్యులను, మద్రదేశీయులను, సైంధవ దేశీయులను అన్నివైపుల నుంచి సంహరించసాగాడు. ఆయన అందరితో యుద్ధంచేస్తూ గొప్పగా శోభిల్లాడు.

అప్పుడు భీముడు బాణాలతో ఏనుగులను మర్మస్థలాలలో కొట్టగా, వైనున్నవారితో కూడా అవి పడిపోతూ భూమిని కంపింపజేశాయి. రౌతులు హతులు కాగా ఆ గుర్రాలు, పదాతులు కూడా యుద్ధరంగంలో భిన్నభిన్నాలయి రక్తం క్రక్కుతూ పడిపోతున్నారు. ఆయన వేలమంది రథికులను రథాలమీది నుంచి పడవేశాడు. వారి ఆయుధాలు కూడా పడిపోయాయి. గాయపడిన వారంతా భీమునికి భయపడి ప్రాణాలు వదిలారు. భీముని బాణాలతో మృతు లయిన రథికులు, రౌతులు, సారథులు, పదాతులు, అశ్వాలు, ఏనుగులతో భూమి నిండింది. ఆ మహాయుద్ధంలో దుర్యోధనుని సేన అంతా భీముని భయంతో పీడితమయి గాయాలు తగిలి నిరుత్సాహమూ, నిశ్చేష్టమూ భయంకరమూ, దీనమూ అయి కన్పించింది. రాజా! ఆటుపోటు లేని కాలంలో నీళ్ళు ప్రసన్నంగా ఉంటే సముద్రం నిశ్చలంగా ఉన్నట్లు, నీ సైన్యం నిశ్చలంగా ఉన్నది. నీ సైనికులలో కోపం, బలం ఉన్నా, వారి గర్వం అణిగింది. అప్పుడు నీ పుత్రునిసేన కాంతిహీనం అయింది. పరస్పరం గాయపరచుకొంటున్న ఆ సేన రక్తప్రవాహంతో మునిగి రక్తంతో తడిసింది. పరస్పరం గాయపరచుకొంటూ నాశనమయింది. కర్ణుడు యుద్ధభూమిలో పాండవసేనను, భీముడు కౌరవులను పారద్రోలుతూ శోభిల్లారు. ఆ రీతిగా యుద్ధం భీకరంగా అద్భుతంగా కన్పిస్తున్నది. అర్జునుడు అనేక సంశప్తక గణాలను సంహరించి, తరువాత సేనా మధ్యంలో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

"జనార్దనా! యుద్ధం చేస్తున్న ఈ సైన్యం చెల్లాచెదరయింది. సంశప్తకులలోని మహారథులు గణాలతో పారిపోతున్నారు. సింహ గర్జనను విన్న మృగాలవలె నా బాణాలదెబ్బలను వీరు తట్టుకోలేకపోతున్నారు. కృష్ణా! మహారణంలో స్ృంజయుల మహాసైన్యం చీలిపోతున్నది. ధర్మరాజసైన్యమధ్యంలో హర్షంలో సంచరిస్తున్న కర్ణుని హస్తికక్ష్య చిహ్నంగా

గల జెండా కన్పిస్తున్నది. ఇతర మహారథులు ఎవ్వరూ యుద్ధంలో కర్ణుని జయింపశక్తులు గారు. కర్ణుడు బలవంతుడు, పరాక్రమం చూపటంలో సమర్థుడని నీకు తెలుసుగదా. శ్రీకృష్ణా! ఈ కర్ణుడు మన సైన్యాలను పారద్రోలుతున్నాడు. కాబట్టి అక్కడికి పద. ఈ సంశప్తకులను యుద్ధంలో వదలి మహారథు డయిన సూతపుత్రునివైపు పోదాంపద. ఇది నాకు తోచింది. నీకు ఎలా తోస్తే అలా చేయి." అర్జునుని ఈ మాటలు విన్న గోవిందుడు నవ్వుతూ, "అర్జునా! ముందు నీవు కౌరవసేనను వధించు!" అని చెప్పాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు తోలగా, హంసవర్ణం గల అశ్వాలు శ్రీకృష్ణపాండవులను వహిస్తూ నీ సైన్యంలోకి ప్రవేశించాయి. తెల్లని బంగరు సొమ్ములు గల అశ్వాలు శ్రీకృష్ణుడు తోలగా, నీ సైన్యంలో ప్రవేశించగానే అది నాలుగు దిక్కులకు చీలిపోయింది. మేఘగర్జన వంటి ధ్వని, వానర ధ్వజం ఎగురుతున్న పతాక గల ఆ రథం, విమానం ఆకాశంలోకి వెళ్ళినట్లు ఆ సేనలో ప్రవేశించింది. క్రుద్ధులు, యుద్ధావేశంతో అరుణ నేత్రులై, మహాతేజోవంతులయిన ఆ శ్రీకృష్ణార్జునులు మహాసేనను ప్రవేశించి, విరాజిల్లారు. యజ్ఞంలో ఋత్విక్కులు యథావిధిగా ఆహ్వానించగా అశ్వినీ కుమారు లనే ఇద్దరు దేవతలు వెళ్ళినట్లు, యుద్ధనిపుణులయిన శ్రీకృష్ణార్జునులు ఆహూతుల వలె రణయజ్ఞంలోకి ప్రవేశించారు. విశాలమయిన మహారణ్యంలో చప్పట్ల మోతతో కోపించిన ఏనుగుల వలె, కుపితులయిన ఆ నరశ్రేష్ఠులు మహావేగంతో దూసుకుపోయారు. అర్జునుడు సైన్యమధ్యంలో రథసమూహాన్ని, అశ్వసమూహాన్ని ప్రవేశించి, పాశహస్తుడయిన యమునివలె సంచరించాడు. నీ సేనలో ప్రవేశించిన అర్జునుని చూసి, నీ పుత్రుడు మళ్ళీ సంశప్తక గణాలను పురికొల్పాడు. మహారాజా! అప్పుడు వేయి రథాలతో, మూడు వందల గజాలతో, పదునాల్గువేల అశ్వబలంతో లక్ష్యభేదనంలో నిపుణులు, ప్రఖ్యాతులు, శౌర్యసంపన్నులు విలుకాండ్రు రెండు లక్షల మంది పదాతులతో గూడిన మహారథులు బాణవర్షంతో పాండునందను డయిన అర్జునుని కప్పివేస్తూ, దండెత్తి వచ్చారు. అర్జునుడు యుద్ధంలో బాణాలతో కప్పివేస్తుండగా, పాశహస్తు డయిన యమునివలె, తన రౌద్రరూపాన్ని చూపిస్తూ, సంశప్తకులను సంహరిస్తూ, చాలాబాగా కన్పించాడు.

అప్పుడు అర్జునుడు ప్రయోగించిన మెరుపుల్లాగా మెరిసే, సువర్ణాలంకృత బాణాలు ఆకాశం అంతా తెరపి లేకుండా కప్పుకొన్నాయి. అర్జునుడు ప్రయోగించగా పడుతున్న మహాశరాలతో నిండిన భూమి, సర్పాలతో నిండినట్లు విరాజిల్లింది. అర్జునుడు బంగారు పిడులు, చక్కని అగ్రభాగం వంగిన ములుకులు గల బాణాలను అన్నిదిక్కులా

కురిపించాడు. అర్జునుని కరతల ధ్వని వల్ల భూమి, ఆకాశం, అన్ని దిక్కులు, సముద్రాలు, పర్వతాలు – పగులుతున్న వని అక్కడ ఉన్న వారంతా అనుకొన్నారు. అర్జునుడు అందరి ఎదుట, సంశప్తకులలోని పదివేల మంది రాజులను చంపి, త్వరగా ముందుకు వెళ్ళాడు. కాంబోజులు రక్షించే సేనలను సమీపించి, పార్థుడు దానవులను ఇంద్రునివలె బాణాలతో మథించాడు." చంపవచ్చిన శత్రువుల బాహువులను, తలలను, శస్త్రాలను, చేతులను బాణంతో ఆయన ఛేదించాడు. అన్ని దిక్కులనుండి వేగంగా వీచిన గాలితో పెల్లగిల్లిన కొమ్మలు గల చెట్ల వలె, తమ శరీరాలలోని ఒక్కొక్క అవయవం ఛిన్నంకాగా ఆయుధాలు చేజారిన వారు నేలగూలారు. ఏనుగుల, గుర్రాల, రథాల, పదాతుల గుంపులను సంహరిస్తున్న అర్జునుని, కాంబోజరాజు సుదక్షిణుని తమ్ముడు బాణవర్షంతో ముంచేశాడు. ఆ రీతిగా బాణాలు వేస్తున్న పరిఘులవంటి ఆతని బాహువులను అర్ధచంద్రబాణాలతోను, పూర్ణచంద్రుని లాంటి శిరస్సును క్షురప్రంతోను అర్జునుడు హరించాడు. మణిశిలలకొండ కొమ్ము వజ్రాయుధంతో తెగిపడినట్లు, అధికంగా రక్తంకారుతుండగా అతడు వాహనం మీదినుంచి నేలగూలాడు. సమున్నతుడై, కమల పత్రాలవంటి కన్నులు గలవాడై, చాలా అందగాడై, బంగారుస్తంభంలా ఉన్న సుదక్షిణుని తమ్ముడు, ఖండితమయిన బంగారు కొండవలె చనిపోయి పడిపోవటం, అక్కడివారు చూశారు.

అప్పుడు మళ్ళీ ఘోరమై, పరమాశ్చర్యకరమయిన యుద్ధం జరిగింది. అక్కడ యుద్ధం చేస్తున్న యోధులకు నానావస్థలు కలిగాయి. ఒక్కొక్క బాణంతో హతమయిన రక్తరంజితమయిన కాంబోజుల గుర్రాల, యవనుల, శకుల రక్తంతో ఆ యుద్ధరంగం అంతా అరుణవర్ణం అయింది. అశ్వాలు, సూతులు, విరిగిన రథాలతో, రౌతులు హతమయిన గుర్రాలతో, మావటీలు హతమయిన ఏనుగులతో, ఏనుగులు హతమయిన మావటీలతో యుద్ధభూమి నిండింది. మహారాజా! రెండు సేనలు పరస్పరం పోరాడి జనక్షయం చేశాయి. అర్జునుడు శత్రువుల పక్షాలను, ప్రపక్షాలను హతం చేశాడు. అర్జునుని మీదికి అశ్వత్థామ మహాధనుస్సును ఊపుతూ, తన కిరణాలను ధరిస్తున్న సూర్యునివలె, ఘోరమయిన బాణాలను తీసుకొని సంధిస్తూ త్వరగా వచ్చాడు. కోపంతో, అసహనంతో ఆయన ముఖం నిండింది. కన్నులు ఎర్రబడ్డాయి. ఆయన అంతకాలంలో కింకరమనే దండం ధరించిన యమునివలె, క్రుద్ధు డయి విలసిల్లాడు. అప్పుడు ఆయన ఉగ్రమయిన బాణవర్షాలను గుంపులు గుంపులుగా ప్రయోగించాడు. మహారాజా! ఆ విధంగా వర్షించిన బాణాలలో పాండవసైన్యం పారిపోయింది. ఆయన రథం మీద ఉన్న శ్రీకృష్ణుని చూచినంతనే

మళ్ళీభయంకర బాణ వర్షాలు కురిపించాడు. అశ్వత్థామ విడిచిన బాణాలతో, రథంమీద ఉన్న శ్రీకృష్ణార్జునులు ఇద్దరు కప్పబడ్డారు. అశ్వత్థామ పదునయిన వందలకొలది బాణాలు వేసి, శ్రీకృష్ణార్జునులను నిశ్చేష్టులను చేశాడు. చరాచర ప్రపంచానికి రక్షకులయిన వారు బాణచ్ఛన్నులు కాగా, స్థావరజంగమాత్మకమయిన సర్వప్రాణులు హాహాకారాలు చేశాయి. అప్పుడు సిద్ధచారణులు అన్నిచోట్లనుంచి అక్కడికి వచ్చి ఇప్పుడు అన్నిలోకాలకు మేలు కలగాలని ఆశించారు. రాజా! యుద్ధంలో శ్రీకృష్ణార్జునులను బాణవర్షంతో ముంచివేస్తున్న అశ్వత్థామ పరాక్రమాన్ని అంతకుముందు నేను ఎప్పుడూ చూడలేదు. రాజా! యుద్ధంలో అశ్వత్థామ ధనుష్టంకారాన్ని సింహగర్జనలాంటి దాన్ని పలుమారులు విన్నాను. రణరంగంలో సంచరిస్తూ, కుడిఎడమలకు బాణాలు విడుస్తున్న ఆయన అల్లెత్రాడు, మేఘమధ్యంలో ప్రకాశిస్తున్న మెరుపులాగా ఉంది. యుద్ధంలో చురుకయిన అర్జునుడు అశ్వత్థామను చూసి, తీవ్రమయిన ఇంద్రియ పటుత్వాన్ని కోల్పోయి, తన పరాక్రమం అంతా హతమయింది అనుకొన్నాడు. రాజా! యుద్ధంలో అశ్వత్థామ శరీరం తేరి పార జూడరానిదయింది.

ఈ రీతిగా అశ్వత్థామార్జునుల సమరం కొనసాగుతుండగా, ద్రోణపుత్రుడు పెంపొందుతుండగా, అర్జునుడు తగ్గుతుండగా చూసిన కృష్ణునికి రోషం కలిగింది. ఆయన రోషంతో నిట్టూర్పులు విడుస్తూ, చూపులతో దగ్ధం చేస్తూ, పలుమారులు అశ్వత్థామార్జునులను చూశాడు. క్రోధపూర్ణుడయిన శ్రీకృష్ణుడు ప్రేమగా అర్జునునితో ఇలా అన్నాడు – "అర్జునా! ఇవ్వాళ నిన్ను అశ్వత్థామ మించిపోతున్నాడు. యుద్ధభూమిలో ఇది అత్యద్భుతంగా నాకు కన్పిస్తున్నది. అర్జునా! నీ పరాక్రమం వెనుకటివలెనే ఉన్నదా? భుజబలం కూడా అలాగే ఉందా? నీ చేతిలో గాండీవం ఉన్నదా? రథంమీదనే ఉన్నావా? నీ బాహువులు క్షేమంగా ఉన్నాయా? నీ పిడికిలి పట్టు సడలలేదు కదా? రణంలో అశ్వత్థామ నిన్ను మించిపోతుండటం చూస్తున్నాను. భరతశ్రేష్ఠా! పార్థా! ఈయన గురుపుత్రుడు అని గౌరవిస్తూ ఉపేక్షించకు. ఇది ఉపేక్షించదగిన సమయం గాదు." ఈవిధంగా శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు త్వరపడదగిన సమయంలో త్వరపడి, పదునాల్గు బాణాలు తీసుకొని ప్రయోగించి అశ్వత్థామ ధనుస్సును, ధ్వజాన్ని, గొడుగును, పతాకను, ఖడ్గాన్ని, శక్తిని గదను, ఖండించాడు. అశ్వత్థామ మెడ ఎముకమీద వత్సదంతం అనే బాణంతో కొట్టాడు. ఆ దెబ్బతో తీవ్రంగా మూర్ఛనందిన అశ్వత్థామ జెండా కర్రను పట్టుకొన్నాడు. శత్రువు తీవ్రంగా పీడించటం వల్ల స్మృతితప్పిన ఆయనను సూతుడు అర్జునుని బారినుంచి రక్షింపదలచి, రణభూమి నుంచి దూరంగా రథం తోలాడు. ఈ సమయంలోనే అర్జునుడు నీ పుత్రుడు చూస్తుండగానే

నీ సేనలోని వందలు, వేల కొలది వీరులను సంహరించాడు. రాజా! నీ దురాలోచన వల్ల మీవారికి శత్రువు చేతిలో ఘోర మయిన నాశం జరిగింది. క్రూరమూ, భయంకరమయిన సంగ్రామం జరిగింది. సంశప్తకులను అర్జునుడు, కౌరవులను భీముడు, పాంచాలురను కర్ణుడు రణంలో ఒక్కక్షణంలో సంహరించారు. ఆ రీతిగా భయంకరంగా వీరశ్రేష్ఠుల నాశం జరుగుతుండగా, లెక్కకుమిక్కిలిగా మొండెములు అంతటా లేచాయి. భరతసత్తమా! యుద్ధంలో యుధిష్ఠిరుడు తీవ్రమయిన ప్రహారాలవల్ల అధికంగా బాధపడుతూ యుద్ధరంగాన్నుంచి క్రోసుదూరం అవతలకు వెళ్ళి నిలిచాడు."

57. అశ్వత్థామ ప్రతిజ్ఞ.

సంజయుడు చెప్పాడు – "భరతశ్రేష్ఠా! దుర్యోధనుడు కర్ణుని వద్దకు వచ్చి, శల్యుని, ఇతర రాజులను ఉద్దేశించి, ఇలా అన్నాడు. "కర్ణా! మనం అనుకోకుండా తలుపులు తెరుచుకున్న స్వర్గద్వారం మనకు లభించింది. ఈ అవకాశాన్ని సుఖ లయిన రాజులు మాత్రమే పొందుతారు. రాధేయా! తమతో సమానులయిన శూర క్షత్రియులతో రణభూమిలో యుద్ధం చేసే క్షత్రియులకు ఇది చాలా ఇష్టం. అది ఇప్పుడు మనకు ప్రాప్తించింది. యుద్ధంలో పాండవులను సంహరించి, సర్వసమృద్ధ మయిన రాజ్యాన్ని పొందండి లేక శత్రువులు యుద్ధంలో చంపితే వీర లోకాన్ని పొందండి." అనే దుర్యోధనుని ఉత్సాహ వచనాలు విని, క్షత్రియశ్రేష్ఠులు హర్షపూర్ణులయి గర్జించారు. అంతటా యుద్ధవాద్యాలు మ్రోగాయి. అప్పుడు దుర్యోధనుని సేనలు ఉత్సాహోల్లాసాలలో ఉండగా మీ యోధులను సంతోషపెట్టే విధంగా అశ్వత్థామ ఇలా అన్నాడు. "సర్వసైన్యాలు, మీరు చూస్తుండగా ఆయుధాలు వీడిన నా తండ్రిని, ధృష్టద్యుమ్నుడు కూల్చిన విషయం మీకు ప్రత్యక్షమే గదా ! క్షత్రియులారా! అపరాధం వల్ల కలిగిన కోపంతో మిత్రు డయిన దుర్యోధనునికోసం నేను నిజంగా ప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను, వినండి. ధృష్టద్యుమ్నుని చంపకుండా కవచం విడువను. ఈ ప్రతిజ్ఞ అబద్ధ మయితే నేను స్వర్గానికి వెళ్లకుందునుగాక. ధృష్టద్యుమ్నుని అర్జునుడు గాని, భీమసేనుడు గాని, ఇంకే యోధు డయినా యుద్ధంలో రక్షిస్తుంటే, ఆతనిని కూడా యుద్ధంలో బాణాలతో సంహరిస్తాను." అని ఆయన అనగానే భారతసైన్యం అంతా కలిసి పాండవుల మీదికి దూకింది. పాండవులూ అలాగే విరుచుకుపడ్డారు. రథసేనల అధిపతుల ఆ సంఘర్షం చాలా భయంకరం అయింది. కౌరవుల సృంజయుల సేనల నాశనం ప్రళయకాల జన నాశనం లాగా సాగింది. రణరంగంలో ప్రాణిసంహారం ప్రారంభంకాగా,

అప్సరసలు, దేవతలతో సమస్త ప్రాణులు కలిసి మహావీరులయిన యోధులను జూడటానికి వచ్చాయి. యుద్ధభూమిలో తమ కర్తవ్యాలను తత్పరతతో నిర్వహిస్తున్న మహావీరు లయిన నరశ్రేష్ఠుల మీద, హర్షపూర్ణ లయిన అప్సరసలు దివ్యమాలికలను, వివిధ గంధాలను, నానావిధ దివ్యరత్నాలను వర్షించారు. వాయువు ఆ దివ్య సుగంధాలను గ్రహించి, సమస్త శ్రేష్ఠ యోధులను సేవించింది. వాయువును పొందుతూ, యోధులు ఒకరినొకరు చంపుకొంటూ నేలగూలారు. దివ్యమయిన పుష్పమాలికలతో బంగారం వలె మెరిసే పిడులు గల విచిత్రమయిన బాణాలతో ఆచ్ఛాదితులైన, ఉత్తమవీరులతో ఆ యుద్ధ భూమి నక్షత్ర సమూహంతో చిత్రమయిన ఆకాశంవలె విలసిల్లింది. ఆ తరువాత ఆకాశంలో నుంచి కూడా సాధువాదాలు, వాద్యాల మ్రోతలు వచ్చాయి. అల్లెత్రాడుల మ్రోతలు, రథ చక్రాల ధ్వనులు కలిసి, సంగ్రామరంగం కోలాహల పూర్ణం అయింది."

58. అర్జునకు శ్రీకృష్ణుడు యుద్ధభూమిని జూపి చెప్పుట.

సంజయుడు చెప్పాడు – "రాజా! ఈ విధంగా అర్జునుడు, కర్ణుడు, భీమసేనుడు కోపించారు. అపుడు ఆ రాజులకు మహాసంగ్రామం జరిగింది. రాజా! అర్జునుడు అశ్వత్థామను, ఇతర మహారథులను జయించి, శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా ! పాండవసేన పారిపోతున్నది, చూడు. సంగ్రామంలో మహారథులను కాలుని సన్నిధికి పంపుతున్న కర్ణుని చూడు. యుధిష్ఠిరుడు కన్పించటం లేదు. ధర్మరాజు జెండా కూడా కన్పించటం లేదు. పగటి పూటలో మూడవ భాగం మాత్రమే మిగిలిఉంది. రణభూమిలో కౌరవసైన్యంలో ఎవ్వడూ నాతో యుద్ధం చేయటం లేదు. కృష్ణా! కాబట్టి నీవు నాతృప్తి కోసం యుధిష్ఠిరుడు ఉన్న చోటికి పద. యుద్ధంలో తమ్ములతో కూడా ధర్మపుత్రుడు క్షేమంగా ఉండటం చూసి, శత్రువులతో యుద్ధభూమిలో యుద్ధం చేస్తాను.' అర్జునుని మాట ప్రకారం శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుడు ఉన్న చోటికి రథం మీద త్వరగా వెళ్ళాడు. యుద్ధంనుంచి వెనుదిరగటానికి మృత్యువువే నిమిత్తం చేసుకొని వారు మీ వాళ్ళతో యుద్ధం చేశారు. అమితమయిన జనసంహారం జరుగుతున్న రణరంగాన్ని చూస్తూ శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. పార్థా! దుర్యోధనుని కారణంగా భరతవంశీయులు, భూమిమీదగల ఇతర క్షత్రియుల మహాభయంకర మయిన నాశం జరుగుతున్నది, చూడు. అటు చూడు. మృతులయిన ధనుర్ధారుల సువర్ణపృష్ఠభాగం గల ధనుస్సులు, మిక్కిలి విలు వయిన అమ్ముల పొదులు పడి ఉన్నాయి. బంగారు పిడులతో వంగిన ములుకులు గల బాణాలు,

నూనెతో బాగా కడిగిన నారాచాలు, కుబుసం విడిచిన పాముల లాగా ఉన్నాయి. బంగారంతో అలంకృతాలు, ఏనుగు దంతం పిడులు గల ఖడ్గాలు, సువర్ణాలంకృత కవచాలు పడి ఉన్నాయి. సువర్ణమయ మయిన ప్రాసాలు, సువర్ణాలంకృత శక్తులు, సువర్ణమయ మయిన రేకులు అమర్చిన పెద్ద గదలు పడి ఉన్నాయి. హిరణ్మయమయిన ఋష్టి ఆయుధాలు, సువర్ణాలంకృత పట్టిశాలు, కనక దండాలు గల గండ్రగొడ్డళ్ళు పడి ఉన్నాయి. పడి ఉన్న ఇనుప బల్లేలను, పెద్ద రోకళ్ళను, చిత్రమయిన శతఘ్నులను, పెద్ద పరిఘలను చూడు. మహాయుద్ధంలో పడిపోయిన చక్రాలను, తోమరాలను, అనేక విధాలయిన శస్త్రాలను పట్టుకొని, జయకాంక్షులయి, వేగవంతు లయిన వీరులు ప్రాణాలు పోయినా బ్రతికి ఉన్నట్లే కనపడుతున్నారు. గదలతో నాశనమయిన శరీరాలు, ముసలాలతో భిన్నమయిన తలలు, గల వారు ఏనుగుల గుర్రాల, రథాల, క్రింద నలిగిన వేలకొలది యోధులను చూడు. బాణాలు, శక్తులు, ఋష్టులు, పట్టిశాలు, ఇనుప పరిఘలు, ఘోరమయిన ఇనుప కుంతాలు, పరశ్వధాలు అనే ఆయుధాల దెబ్బలతో, అనేక మనుష్యుల, గుర్రాలు ఏనుగుల శరీరాలు భిన్నమయి, ప్రాణాలు పోగా, రక్తప్రవాహాల్లో తడిసి, యుద్ధభూములు నిండి ఉన్నాయి. భారతా! ఈ యుద్ధభూమి అంతా బంగారు అలంకారాలతో, భుజకీర్తులతో, మంచి గందపుపూత గల కేయూరాలు, హస్తకవచాలు గల వీరుల బాహువులతో విలసిల్లుతున్నది. అలంకృతాలై, వ్రేళ్ళకవచాలు గల సాహసిక వీరుల అరచేతులతో తెగిన ఏనుగు తొండాలవంటి తొడలతో; శ్రేష్ఠమయిన చూడామణులతో, కుండలాలతో అలంకృత శిరస్సులతో; నేలగూలిన ఎద్దుకన్నుల వంటి విశాలమయిన కన్నులు గల యోధులతో నిండి భూమి విరాజిల్లుతున్నది. రణభూమి రక్తంతో తడిసిపోయిన మొండెములతో, శరీరం భిన్నమయిన మెడలతో, మంటలు చల్లారిన అగ్నులతో వలె ప్రకాశిస్తున్నది. శుభకరాలు, బంగారు చిరుమువ్వలు గల రథాలు అనేక విధాలుగా విరిగిపోయాయి. బాణాలు బాగా తగలటం వల్ల హతమయి ప్రేగులు బయట పడిన గుర్రాలను చూడు. రథాల కోడిపీటలు, పతాకలు, రకరకాల జెండాలు, రథికుల తెల్లని మహాశంఖాలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. చూడు.

నాలుకలు బయటకు వచ్చి నేలబడిన కొండల్లాంటి చచ్చిన ఏనుగులను, విచిత్రమయిన పతాకలను, హతమయిన ఏనుగులను, గుర్రాలను చూడు. ఏనుగుల పైన వేసే చినిగిన వస్త్రాలను, చర్మాలను, కంబళ్ళను, వెండి నక్షత్రాలతో గుర్రాల మీద వేసే విచిత్రమయిన వస్త్రాలను, అంకుశాలను, నేలగూలిన పెద్ద ఏనుగుల మెడలలో

నానావిధాలుగా పగిలిన గంటలను చూడు. వైడూర్యమణులు పొదిగిన కర్రలు గల చక్కని అంకుశాలు, గుర్రపు రౌతుల భుజాలకు కట్టుకొన్న బంగారు కొరడాలు నేలబడి ఉన్నాయి. విచిత్రమయిన మణులు కూర్చినవి, బంగారు తీగలు అల్లినవి, రంకుమృగచర్మంతో చేసినవి, గుర్రాల మీద వేసే వస్త్రాలు గుట్టలుగా పడి ఉన్నాయి. రాజేంద్రులు తలపై అలంకరించుకొనే మణిమయ కిరీటాలను, విచిత్రమయిన సువర్ణమాలికలను, నేలబడిన గొడుగులను, చామరాలను చూడు. చంద్రునివలె, నక్షత్రాలవలె ప్రకాశించేవి, చక్కని కుండలాలు గలవి, తీర్చిదిద్దిన మీసకట్టు గలవి, అలంకృతా లయిన వీరుల ముఖాలతో కప్పబడి, రక్తపు బురద గల భూమిని చూడు. అర్జునా! ఇంకా ప్రాణావశిష్టులయిన యోధులను చూడు. వాళ్ళు మూలుగుతున్నారు. లెక్కలేనంతమంది ఆ వీరుల బంధువులు ఆయుధాలు క్రిందపడేసి, మాటిమాటికి రోదిస్తున్నారు చూడు. మరణించిన యోధులు కొంతమందిమీద బట్టలను కప్పి, జయకాంక్షులు, క్రుద్ధ లయిన సాహసవంతులు మళ్ళీ యుద్ధానికి వెళుతున్నారు. నేలబడిన బంధువు లయిన వీరులు దప్పికయి నీళ్ళు అడుగుతుంటే, కొంతమంది అక్కడే అటూ ఇటూ పరిగెత్తుతున్నారు. అర్జునా ! కొంతమంది నీళ్ళు తీసుకురావటానికి వెళ్ళారు. ఇంతలోనే దప్పిక గొన్న చాలామంది మరణించారు. నీరు తీసుకొని తిరిగివచ్చిన వారు, మృతులను చూసి, తెచ్చిన నీరు అక్కడే పారబోసి దుఃఖిస్తూ, నాలుగు దిక్కులా పరుగెత్తుతున్నారు. కొందరు నీరు త్రాగి మరణించారు. మరికొందరు నీటిని త్రాగుతూ త్రాగుతూనే మరణించారు. ఈ మహారణంలో కొంతమంది బంధుప్రియులు, తమ బంధువులను వదలి, మరణించి, అక్కడక్కడ కన్పిస్తున్నారు. చూడు. నరశ్రేష్ఠా! ఇంకా కొందరు వీరులు పెదవికొరుకుతూ, బొమముడిపాటుతో, కుటిలమయిన ముఖాలతో అన్నివైపులా చూస్తున్నారు.

ఇలా చెపుతూ మహారణరంగంలో శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుడు ఉన్న చోటికి వెళ్ళాడు. అర్జునుడు కూడా రాజదర్శనం కోసం వెళ్ళాడు. అర్జునుడు పలుమారులు 'పద పద' అని శ్రీకృష్ణుని తొందరపెట్టాడు. మాధవుడు ఆ యుద్ధభూమిని అర్జునునకు చూపి, త్వర పెడుతూనే మెల్లగా అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! రాజువద్దకు చాలామంది రాజులు వచ్చారు చూడు. మహారణరంగంలో మండుతున్న అగ్నిలాగా ఉన్న కర్ణుని చూడు. గొప్పవిలుకాడయిన ఈ భీముడు యుద్ధభూమికి తిరిగి వచ్చాడు. పాంచాలురకు, పాండవులకు ముఖస్థానీయుడయిన ధృష్టద్యుమ్నుడు మొదలయిన వీరులు ఆ భీముని వెంట వెళ్ళుతున్నారు. అర్జునా! వెనుదిరిగి ఎదుర్కొన్నా, పాండవులుగొప్ప

శత్రుసేనను భగ్నం చేశారు. పారిపోతున్న కౌరవులను ఈ కర్ణుడు నిలుపుతున్నాడు. అర్జునా! వేగంలో యమునితో సముడు, ఇంద్రునితో సమ మయిన పరాక్రమవంతుడు, శస్త్రధారులలో శ్రేష్ఠ డయిన ఈ అశ్వత్థామ కూడా అటే వెళ్తున్నాడు. ధృష్టద్యుమ్నుడు మిక్కిలి వేగంగా ఆయననే వెంబడిస్తున్నాడు. యుద్ధంలో చనిపోయిన సృంజయులను చూడు." శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు అంతా చెప్పాడు. అప్పుడు మహాఘోర మయిన యుద్ధం జరిగింది. రాజా! వెనుదిరగటానికి మృత్యువునే లక్ష్యం చేసు కున్న రెండు సేనలు ఎదురుకొని, సింహనాదాలు చేశాయి. భూపాలా! రాజా! నీ దురాలోచన వల్లనే మీ పక్షం, పరపక్షాలలో పృథివిలోని వీరుల నాశం జరిగింది."

59. అశ్వత్థామ పరాజయము.

సంజయుడు చెప్పాడు – "రాజా! తరువాత మళ్ళీ నిర్భయులయిన యుధిష్ఠిరాది పాండవులు, కర్ణుడు ముందున్న మన కౌరవ సృంజయులు తలపడ్డారు. అప్పుడు యమలోకాన్ని పెంపొందించే, గగుర్పాటు గలిగించే భయంకరమయిన, కర్ణపాండవ సంగ్రామం ప్రవర్తిల్లింది. యుద్ధం, ప్రారంభంకాగా మహారాజా! శూరులయిన సంశప్తకులు స్వల్పంగా మిగిలి ఉండగా, ధృష్టద్యుమ్నుడు, పాండవులు కర్ణునితోనే తలపడ్డారు. యుద్ధంలో విజయకాంక్షులు, హర్షపూర్ణులు అయి, ఎదురువస్తున్నవారిని అందరిని, కర్ణుడు ఒక్కడే మహాజల సమూహాన్ని పర్వతంవలె అడ్డుకొన్నాడు. మహా పర్వతాన్ని తగిలిన జలప్రవాహం వలె, ఆ మహారథు లందరు కర్ణుని ఎదుర్కొని, నిలువలేక నలుదిక్కులకు పారిపోయారు. వారి మధ్య గగుర్పాటు కలిగించే యుద్ధం జరిగింది. ధృష్టద్యుమ్నుడు వంగిన ములికి గల బాణంతో కర్ణుని కొట్టి యుద్ధంలో 'నిలు నిలు' అన్నాడు. కర్ణుడు విజయం అనే పేరుగల ధనుస్సును ఊపుతూ, ధృష్టద్యుమ్నుడు వేసిన పాములాంటి బాణాలను, ధనుస్సును ఖండించి, మిక్కిలి క్రుద్ధ డయి తొమ్మిది బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచాడు. ఆ బాణాలు సువర్ణమయమయిన ఆ మహాత్ముని కవచాన్ని ఛేదించి, రక్తసిక్తాలయి ఆరుద్రపురుగులు లాగా విరాజిల్లాయి. ధృష్టద్యుమ్నుడు ఆ ధనుస్సును ఆవలవైచి, ఇంకొక ధనుస్సును, సర్పతుల్యాలయిన బాణాలు తీసుకొన్నాడు. వంగిన ములుకులు గల డెబ్బది బాణాలతో కర్ణుని గాయపరిచాడు. అలాగే కర్ణుడు కూడా, శత్రువులను తపింపజేసే ధృష్టద్యుమ్నుని సర్పాల్లాంటి బాణాలతో కప్పివేశాడు. ద్రోణుని శత్రువయిన ధృష్టద్యుమ్నుడు కర్ణుని పదునయిన బాణాలతో కొట్టాడు. మిక్కిలి కోపించిన కర్ణుడు ఆపర యమదండం

లాంటిది, బంగారు బాణాన్ని ఆయన మీద వేశాడు. రాజా! నరపాలా! ఆ రీతిగా వచ్చిపడుతున్న ఆ బాణాన్ని, సాత్యకి సిద్ధహస్తు డయిన యోధునివలె నూరుముక్కలయ్యేటట్లు ఖండించాడు. నరపాలా! బాణాలతో తన బాణం హతంకావటం చూసి కర్ణుడు సాత్యకిని బాణవర్షంతో నలువైపులా కప్పివేశాడు. ఏడు బాణాలతో యుద్ధభూమిలో గాయపరిచాడు. సాత్యకి ఆయనను బంగారు సొమ్ములు గల బాణాలతో కొట్టాడు. ఆ తరువాత అంతటా ఘోరమయి, చిత్రమయి, చూడదగిన యుద్ధం జరిగింది. అది వినటానికి చెవులకూ, చూడటానికి కన్నులకూ భయంకరం అయింది. యుద్ధభూమిలో కర్ణసాత్యకుల వీరకృత్యాలు చూసిన సర్వప్రాణులకు శరీరాలు గగుర్పొడిచాయి.

ఇంతలో ధృష్టద్యుమ్నుని అశ్వత్థామ ఎదుర్కొన్నాడు. అశ్వత్థామ తీవ్రంగా కోపించి ఇలా అన్నాడు - 'బ్రాహ్మణఘాతకా! నిలు, నిలు, నిన్ను ప్రాణాలతో వదలను. అని అశ్వత్థామ మిక్కిలి పదునయి, ఘోరరూపాలు, తేజోవంతాలు అయిన బాణాలతో యథాశక్తిగా ప్రయత్నించే ధృష్టద్యుమ్నుని కప్పివేశాడు. పూర్వం యుద్ధరంగంలో ధృష్టద్యుమ్నుని చూసి, ద్రోణుడు భావించినట్లే, ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను రణరంగంలో చూసి, నిరుత్సాహంతో ఆతడు తనకు మృత్యువు అని అనుకొన్నాడు. యుద్ధంలో తనకు శస్త్రంతో వధలేదని గుర్తు తెచ్చుకొని, ప్రళయకాలంలో కాలుని కాలుడు ఎదుర్కొన్నట్లు, ఆయన వేగంగా అశ్వత్థామ మీదికి వచ్చాడు. ద్రోణసుతుడు ఎదురుగా ఉన్న ధృష్టద్యుమ్నుని చూసి, కోపంతో నిట్టూరుస్తూ, ఆయన మీదికి దూకాడు. ఇద్దరూ ఒకరినొకరు చూచుకొంటూనే తీవ్ర కోపావేశ పరవశు లయ్యారు. అప్పుడు ప్రతాపవంతు డయిన ద్రోణపుత్రుడు త్వరపడుతూ దగ్గరలో ఉన్న ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు. "పాంచాలకుల కళంకా! నిన్ను ఇవ్వాళ మృత్యుముఖం లోకి పంపుతాను. పూర్వం ద్రోణుని వధించి నీవు పాపకార్యం చేశావు. అది చాలా అశుభకార్యమని నీవు సంతాపం చెందేటట్లు చేస్తాను. అర్జునుడు రక్షించకుండా యుద్ధంలో నీవు నిలిస్తే, పారిపోకపోతే, నిన్ను తప్పక చంపుతాను. నీకు నిజం చెపుతున్నాను." అని అశ్వత్థామ అనగా ప్రతాపవంతు డయిన ధృష్టద్యుమ్నుడు "ఓరీ! యుద్ధంలో ప్రయత్నశీలి అయిన నీ తండ్రికి తగిన సమాధానం చెప్పిన ఆ ఖడ్గమే, నీకు ఇవ్వాళ సమాధానం ఇస్తుంది. పేరుకు మాత్రమే బ్రాహ్మణు డయిన ద్రోణుని హతం చేసిన నేను, ఇప్పుడు యుద్ధంలో పరాక్రమంతో నిన్ను ఎందుకు చంపను?" అని చెప్పి, మిక్కిలి పదునయిన బాణంతో అశ్వత్థామను గాయపరిచాడు. అప్పుడు మిక్కిలి కుపితు డయిన ద్రోణపుత్రుడు వంగిన ములుకులు గల బాణాలతో

యుద్ధంలో ధృష్టద్యుమ్నుని నాలుగువైపులనుంచి కప్పివేశాడు. వేలకొలది బాణాలు అంతటా కప్పివేయటం వల్ల అంతరిక్షం గాని, దిక్కులు గాని, యోధులు గాని కనిపించలేదు. రాజా! అలాగే యుద్ధంలో శోభించే అశ్వత్థామను, ధృష్టద్యుమ్నుడు కర్ణుడు చూస్తుండగానే బాణాలతో కప్పివేశాడు.

రాధేయుడు కూడా పాండవులతో పాటు పాంచాలురను ఉపపాండవులను, యుధామన్యువును, సాత్యకిని ఒక్కడే నిలువరించాడు. రాజేంద్రా! యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణపుత్రుని ధనుస్సును ఛేదించాడు. వేగవంతు డయిన అశ్వత్థామ దాన్ని వదలివేసి, ఇంకొక ధనుస్సు తీసుకొని, ఘోరమయిన సమరంలో పాములాంటి, బాణాలను ప్రయోగించి, ధృష్టద్యుమ్నుని ధనుస్సును, శక్తిని, గదను, ధ్వజాన్ని, గుర్రాలను, సూతుని, రథాన్ని ఒక్క క్షణంలో నాశనం చేశాడు. ధనుస్సు విరగగా, రథం ధ్వంసం కాగా, గుర్రాలు సారథి హతులు కాగా ఆయన పెద్ద ఖడ్గాన్ని, విశాలమయి సూర్యచిహ్నాలు గల డాలు తీసుకొన్నాడు. మహారథుడు, హస్తలాఘవం గలవాడు, దృఢమయిన ఆయుధాలు గలవాడు, వీరుడు అయిన అశ్వత్థామ, రథం మీదినుంచి ధృష్టద్యుమ్నుడు దిగకముందే ఆయన చేతిలోని ఖడ్గాన్ని, డాలును భిన్నం చేశాడు. అది అద్భుతంగా కన్పించింది. రథంకూలి, గుర్రాలు, చచ్చి, ధనుస్సు విరిగిన ధృష్టద్యుమ్నుని అనేక విధాలుగా బాణాలతో గాయపరచి, శరీరం, శస్త్రాలతో వేధించి, మహారథుడయిన అశ్వత్థామ వేయి విధాలుగా ప్రయత్నించి కూడా చంపలేకపోయాడు. బాణాలతో అశ్వత్థామ ఆయనను చంపలేక, ధనుస్సును వదలి, వేగంగా ధృష్టద్యుమ్నుని మీదికి వచ్చాడు. రథంమీదినుంచి దూకి పరుగెత్తివస్తున్న ఆయన వేగం, సర్పశ్రేష్ఠాన్ని పట్టుకొనదలచిన గరుత్మంతుని వేగం లాగా ఉంది. ఇంతలోనే శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. 'అర్జునా! అటు చూడు ! అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని వధించటానికి తీవ్రప్రయత్నం చేస్తున్నాడు. అతన్ని చంపుతాడు. సందేహం లేదు. మృత్యుముఖంలోకి పోయినట్లుగా అశ్వత్థామ ముఖంలోకి పోయిన ఆయనను విడిపించు.' అని చెప్పి వాసుదేవుడు అశ్వత్థామ ఉన్నచోటికి గుర్రాలను తోలాడు.

చంద్రునివలె తెల్లగా ఉన్న గుర్రాలు, కృష్ణుడు తోలగా ఆకాశాన్ని మ్రింగుతున్నట్లుగా అశ్వత్థామ రథంవైపు పరుగెత్తాయి. శ్రీకృష్ణార్జునులు రావటం చూసి, అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని వధింపయత్నం చేశాడు. అర్జునుడు ధృష్టద్యుమ్నుని లాగుతున్న అశ్వత్థామను చూసి, ఆయన మీద బాణాలు ప్రయోగించాడు.ఆ సువర్ణమయ బాణాలు గాండీవంనుంచి వేగంగా ప్రయోగింపబడి, పుట్టలో పాములు దూరినట్లు అశ్వత్థామకు తగిలాయి. ఆ

విధంగా బాణాలు తగలగా ద్రోణసుతుడు ధృష్టద్యుమ్నుని వదలి వేశాడు. అర్జున బాణాలతో బాధితు డయిన ఆ వీరుడు రథం ఎక్కాడు. శ్రేష్ఠమయిన ధనుస్సును తీసుకొని, అర్జునుని బాణాలతో కొట్టాడు. ఇంతలోనే వీరు డయిన సహదేవుడు ధృష్టద్యుమ్నుని తన రథం ఎక్కించుకుని, దూరంగా తీసుకుపోయాడు. మహారాజా! అర్జునుడు కూడా ద్రోణపుత్రుని బాణాలతో గాయపరిచాడు. మిక్కిలి క్రుద్ధుడయిన ద్రోణసుతుడు అర్జునుని బాహువులమీద, వక్షస్థలం మీద బాణాలు వేశాడు. కుపితు డయిన పార్థుడు కాలరూపమయిన ఇంకొక బాణం వేశాడు. ఆ బాణం బ్రాహ్మణుని మెడ దగ్గర తగిలింది. మహారాజా! బాణవేగంతో వ్యాకులు డయిన అశ్వత్థామ రథం వెనకాల కూలబడ్డాడు, మూర్ఛపోయాడు. అప్పుడు క్రుద్ధుడయిన కర్ణుడు సమరంలో అర్జునుని మాటిమాటికి చూశాడు. మహారణంలో అర్జునునికి ఎదురుపడి పోరాడదలచి విజయంతో ధనుష్టంకారం చేశాడు. ద్రోణపుత్రుడు మూర్ఛపోవటం చూసి, సారథి త్వరపడి రథాన్ని రణభూమినుండి తప్పించాడు. మహారాజా! అప్పుడు ధృష్టద్యుమ్నుడు విముక్తుడు కావటం, అశ్వత్థామ బాణపీడితుడు కావటం చూసి, విజయంతో ఉల్లసిల్లే పాంచాలురు పెద్దగా గర్జించారు. విజయసూచకంగా వాద్యాలను వేలకొలది మ్రోగించారు. యుద్ధంలో ఆ అద్భుతాన్ని చూసి, వారు సింహనాదాలు చేశారు. అపుడు ధనంజయుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. 'కృష్ణా! సంశప్తకుల మీదికి పద. ఇది నేను చేయవలసిన ముఖ్యమయిన పని.' అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుని మాటవిని మనోవేగ వాయువేగాలతో, మహోన్నత పతాకం గల రథంమీద అక్కడినుంచి వెళ్ళాడు."

60. శ్రీకృష్ణుడు అర్జునుని కర్ణవధకు ప్రోత్సహించుట.

సంజయుడు చెప్పాడు – "రాజా! ఈసమయంలోనే శ్రీకృష్ణుడు అర్జునునికి యుధిష్ఠిరుని చూపిస్తూ ఇలా అన్నాడు. 'పాండుపుత్రా! మహాబలవంతులు, మహాధనుష్కులయిన కౌరవులు యుధిష్ఠిరుని చంపదలచి వేగంగా ఆయన వెంట బడుతున్నారు. మహాబలులు, అయిన పాంచాలులు మహాత్ము డయిన యుధిష్ఠిరుని రక్షింపదలచి, ఆయనతో పాటు రోషావేశాలతో ఆయన వెంట వెళ్ళుతున్నారు. పార్థా! కవచధారి, సర్వజనులకు రాజు అయిన దుర్యోధనుడు రథసేనతో ధర్మజుని వెంబడిస్తున్నాడు. నరశ్రేష్ఠా! సర్వస్పర్శతోసమాన స్పర్శగల వారు, సర్వయుద్ధాలలో విశారదులు అయిన సోదరులతో కలిసి, బలవంతు డయిన దుర్యోధనుడు యుధిష్ఠిరుని చంపదలచి ఆయన వెంటపడ్డాడు. ఉత్తమదాతను యాచకులవలె కౌరవులు చతురంగ బలాలతో యుధిష్ఠిరుని

పట్టుకోదలచి, ఆయనను వెంబడిస్తున్నారు. అమృతాన్ని అపహరింపదలచిన దైత్యులను ఇంద్రాగ్నులు పలుమారులు అడ్డగించినట్లు, ఈ కౌరవులను సాత్యకి భీములు అడ్డుకోగా నిలిచిపోయారు. వర్షాకాలంలో జలప్రవాహ సమూహాలు సముద్రంవైపు పారినట్లు, ఈ కౌరవులు లెక్కలేనంతమంది త్వరగా యుధిష్ఠిరుని వైపు వెళ్ళుతున్నారు. బలిష్ఠులు, విలుకాండ్రు, ఆ కౌరవులు సింహనాదాలు చేస్తున్నారు. శంఖాలు ఊదుతున్నారు. ధనుస్సులను ఝళిపిస్తున్నారు. యుధిష్ఠిరుడు దుర్యోధనుని వశమై మృత్యుముఖంలోకి పోయినట్లు, అగ్నిలో హతమయినట్లు అనుకొంటున్నాను. దుర్యోధనుని సేనా వ్యూహం చూడగా దాని బాణాల త్రోవలోకి వస్తే ఇంద్రుడు కూడా తప్పించుకోలేడని అనిపిస్తున్నది. వీరుడు, మిక్కిలి క్రుద్ధుడయిన యముని వంటివాడై శీఘ్రంగా బాణాలు కురిపించే దుర్యోధనుని వేగాన్ని యుద్ధంలో ఎవడు ఓర్వగలడు?

దుర్యోధనుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు, కర్ణుడు అనే ఈ వీరుల బాణవేగం కొండలనయినా నాశనం చేస్తుంది. కర్ణుడు వేగంగా హస్తచాలనం చేసే బలిష్ఠుడు, విద్వాంసుడు అయిన యుధిష్ఠిరుని యుద్ధ విముఖుని చేశాడు. ధృతరాష్ట్రపుత్రులతో కూడి రాధేయుడు పాండవజ్యేష్ఠుని పీడించగలడు. సంగ్రామ మగ్నుడయి, నియమిత చిత్తుడైన యుధిష్ఠిరుడు వీరితో పోరుతుండగా, ఆయన కవచాన్ని, మహారథు లయిన కౌరవులు, ఇతరులు ధ్వంసం చేశారు. యుధిష్ఠిరుడు ఉపవాసాలు చేయటం చేత చాలా చిక్కిపోయాడు. ఈయన బ్రహ్మబలంతో ఉన్నాడు. క్షత్రియ బలాన్ని ప్రకటించ సమర్థుడు గాడు. యుధిష్ఠిరుడు కర్ణునితో తలపడి ప్రాణసంకటావస్థలో పడ్డాడు. భీమసేనుడు, కౌరవులు చేస్తున్న సింహనాదాలను, మాటి మాటికి జయశోభితులయి వారు మ్రోగిస్తున్న శంఖ ధ్వనులను వింటుంటే యుధిష్ఠిరుడు సజీవుడని అనిపించటం లేదు. భరతశ్రేష్ఠా! కర్ణుడు కౌరవులను 'యుధిష్ఠిరుని చంపండి' అని ప్రోత్సహిస్తున్నాడు. కౌరవ మహారథులు స్థూణా కర్ణం ఇంద్రజాలం, పాశుపతం తదితర శస్త్ర సమూహంతో యుధిష్ఠిరుని కప్పివేస్తున్నారు. భారతా! రాజును ఆతురునిగా, బాగా సేవించదగిన వానిని చేశారు. పాండవులతో కూడా పాంచాలురు ఆయన వెంట సేవించటానికి వెళ్ళుతున్నారు. పాతాళంలో పడిన వానిని వలె ఉన్న యుధిష్ఠిరుని, పాండవ యోధులు తొందరపడవలసినప్పుడు తొందరపడుతూ ఉద్ధరించగోరుతున్నారు. నకుల సహదేవులు, సాత్యకి, శిఖండి, ధృష్టద్యుమ్నుడు, భీముడు, శతానీకుడు, సర్వపాంచాలురు, చేది దేశీయులు చూస్తుండగానే యుధిష్ఠిరుని ధ్వజాన్ని కర్ణుడు ఖండించాడు. కాబట్టి అది కన్పించలేదు. పార్థా! సరస్సును ఏనుగువలె, యుద్ధంలో

ఈ కర్ణుడు పాండవసేనను బాణాలతో ధ్వంసం చేస్తున్నాడు. మీ రథికులు, వీరంతా, పారిపోతున్నారు. ఈ మహారథులు ఎలా పారిపోతున్నారో చూడు. కర్ణుడు బాణాలతో కొట్టగా, ఈ ఏనుగులు ఆర్తనాదాలు చేస్తూ, పదిదిక్కులకు పారిపోతున్నాయి. పార్థా! శత్రువులను బాధించే కర్ణుడు పారద్రోలగా, రణభూమిలో ఈ రథాల సమూహం అంతా పారిపోతున్నది.

అర్జునా! కర్ణుని రథంమీద ఉన్న పతాకం ఎలా ఎగురుతున్నదో చూడు. దానిమీద ఏనుగు మోకు గుర్తు ఉన్నది. ఈ రాధేయుడు వందలకొలది బాణాలను వదులుతూ, నీ సేనను సంహరిస్తూ, భీముని రథం వైపు పరుగెత్తుతున్నాడు. మహా యుద్ధంలో, ఇంద్రుడు చావగొడుతూ దైత్యులను పారద్రోలినట్లు,ఈ పాంచాలురను కర్ణుడు పారద్రోలుతున్నాడు. ఈ కర్ణుడు పాంచాలురను, పాండవులను, సృంజయులను జయించి, దిక్కులు చూస్తున్నాడు. అది నీకోసమే అని నా ఉద్దేశం. పార్థా! శత్రువును జయించి, దేవ సమూహం చుట్టూ ఉండగా ఇంద్రునివలె, ఈ కర్ణుడు ధనుష్టంకారం చేస్తూ విలసిల్లుతున్నాడు. చూడు. ఈ కౌరవులు కర్ణుని పరాక్రమం చూసి పాండవులను, సృంజయులను అంతటా భయపెడుతూ కేకలు పెడుతున్నారు. పార్థా! మహాయుద్ధంలో ఈ రాధేయుడు అన్ని విధాలా పాండవసేనను భయపెట్టి, తమ సమస్త సేనలతో ఇలా అంటున్నాడు. "కౌరవులారా! మీకు మేలు కలుగుగాక. పరుగెత్తండి. వేగంగా ఆక్రమించండి. యుద్ధంలో సృంజయుడు ఒక్కడు కూడా మీ నుంచి బ్రతికిపోకుండా చేయండి. మీ వెనకాల మేము అందరం వస్తున్నాం." పార్థా! ఇలా చెపుతూ ఈ కర్ణుడు బాణాలు వేస్తూ, వెనక వెళ్ళుతున్నాడు. చంద్రునితో ఉదయ పర్వతం శోభిల్లినట్లు, శ్వేతచ్ఛత్రంతో విరాజిల్లుతున్న కర్ణుని చూడు. యుద్ధంలో తలపయిన నూరు తేజోవంతమయిన శలాకలు (చువ్వలు) గలది, పూర్ణచంద్రునివలె ప్రకాశిస్తున్న శ్వేతచ్ఛత్రం గల కర్ణుడు నీ వైపు క్రీగంటితో చూస్తున్నాడు. ఈయన తప్పక యుద్ధరంగంలో మహావేగంతో నిన్ను ఎదుర్కొంటాడు. మహారణంలో మహాధనుస్సును ఊపుతూ, పాములవంటి బాణాలను వదులుతున్న ఈయనను చూడు. ఈ రాధేయుడు నీ వానరధ్వజాన్ని చూసి, నీతో యుద్ధం చేయగోరుతూ, ఇటువైపు వస్తున్నాడు. భారతా! మిడత జ్వలించే అగ్నిముఖంలో పడ్డట్లు, ఈ కర్ణుడు తన వధకోసమే మీ మీదికి వస్తున్నాడు. కర్ణుడు ఒంటరివాడు కావటం చూసి, రక్షించదలచి, దుర్యోధనుడు రథసమూహంతో వస్తున్నాడు. అర్జునా! యశస్సును, రాజ్యాన్ని, సుఖాన్ని కోరే నీవు వీరందరితో కూడా దుష్టాత్ముడయిన ఈ

కర్ణుని ప్రయత్నపూర్వకంగా వధించు. పార్థా! దేవాసుర సంగ్రామంలో దేవతలకు, దానవులకు యుద్ధం జరిగినట్లు, విశ్వవిఖ్యాత వీరులయిన మీ ఇద్దరి మధ్య యుద్ధం జరిగే సమయంలో కౌరవులంతా నీ పరాక్రమం చూతురు గాక. తీవ్రంగా కోపించిన నిన్ను, కర్ణుని చూసి కోపిష్ఠి అయిన ఈ దుర్యోధనునికి ఏ సమాధానం తోచదు.

భరతవంశోత్తమా! కుంతీ కుమారా! నీవు పుణ్యాత్ముడవని, ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుని విషయంలో కర్ణుడు తప్పు చేశాడని తెలుసుకొని సమయోచితంగా నీ కర్తవ్యాన్ని ఆచరించు. యుద్ధవిషయంలో ఉత్తమమయిన ఆలోచనను ఆశ్రయించి, రథసమూహాధిపతి అయిన కర్ణుని ఎదిరించు. యుద్ధరంగంలో చాలా ముఖ్యులయిన అయిదు వందల మంది రథికులు వస్తున్నారు. వీరితో పాటు అయిదువేల ఏనుగులు, పదివేల ఆశ్వికులు, ఏకమయి పదిలక్షల పదాతులయిన యోధులతో గూడి వస్తున్నారు. వీరా! అశ్వత్థామను ముందుపెట్టుకొని పరస్పరం రక్షించుకొంటున్న సేన నిన్ను ఎదుర్కొంటున్నది. కాబట్టి త్వరగా దీన్ని నాశనం చెయ్యి. ముందు ఈ రథసమూహాన్ని నాశనం చేసి, ఆ తరువాత, మహాధానుష్కు డయిన సూతపుత్రునికి కన్పించు. నీవు ఉత్తమ వేగంతో ఈ రథసమూహాన్ని ఎదుర్కొను. మిక్కిలి కుపితుడయిన ఈ కర్ణుడు పాంచాలుర మీదికి పరిగెత్తుతున్నాడు. ధృష్టద్యుమ్నుని రథం వైపు ఆతడు పోతున్నట్లుగా ఆతని రథధ్వజాన్ని చూస్తున్నాను. శత్రుతాపనా ! కర్ణుడు పాంచాలురమీదికి దూకుతున్నట్లు అనుకొంటాను. భరతశ్రేష్ఠా! నీకు సంతోషకరమయిన వార్త చెపుతాను. శోభాయుక్తుడు, ధర్మపుత్రు డయిన ఈ యుధిష్ఠిరుడు క్షేమంగా ఉన్నాడు అని మహాబాహు వయిన భీముడు సేనాముఖానికి తిరిగిరావటం వల్ల తెలుస్తున్నది. కౌంతేయా! సృంజయసేనలో, సాత్యకి, మహోత్ములయిన పాంచాలురు తనచుట్టూ ఉండగా భీమసేనుడు యుద్ధరంగంలో కౌరవులను పదునయిన బాణాలతో వధిస్తున్నాడు. భీముని బాణాలు తీవ్రంగా తగలటం వల్ల, బాగా గాయపడ్డ కౌరవసేన, గాయాల నుంచి రక్తంకారుతుండగా, వేగంగా పారిపోతున్నది. రక్తంతో బాగా తడిసిన కౌరవసేన, పంటలు నాశనమయిన భూమివలె దయనీయంగా ఉంది. భీమసేనుడు తిరిగివచ్చి, సర్పంవలె కోపించి, కౌరవసేనను పారద్రోలుతున్నాడు చూడు. పచ్చని, ఎర్రని, నల్లని, తెల్లని రంగులు గలవి, చంద్రసూర్య చిహ్నాలతో అలంకృతాలయిన ఈ పతాకలు, గొడుగులు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. బంగారు, వెండి మొదలయిన తైజసద్రవ్యాలతో చేసిన, నానావిధాలయిన ధ్వజాలు పడుతున్నాయి. ఏనుగులు, గుర్రాలు చెల్లాచెదరు అవుతున్నాయి. పారిపోవటం ఎరగని పాంచాలురు

వేసిన నానావర్ణాలయిన బాణాలతో హతమయి, ఇదిగో ! ఈ రథికులు ప్రాణాలు పోయి రథాలమీదినుంచి పడుతున్నారు.

ధనంజయా! నరశ్రేష్ఠులు భీముని బలాన్ని ఆశ్రయంగా తీసుకొని, పాంచాలురు మనుష్యరహిత గజాలను, అశ్వాలను, వేగశాలులయి కౌరవ సైనికులను నలిపివేస్తున్నారు. పాంచాలురు ప్రాణాలమీద ఉండే మోహాన్ని విడిచి, శత్రుబలాలను మర్దించి, శంఖాలు ఊదుతున్నారు. అర్జునా! ఈ పాంచాలుర మహత్తు చూడు. కోపించిన సింహాలు ఏనుగులను సంహరించినట్లు, వీరు బాణాలతో శత్రువులను చంపుతున్నారు. పరాక్రమంతో కౌరవులను హతమారుస్తున్నారు. నిరాయుధులయిన వీరు, సాయుధులయిన శత్రువుల ఆయుధాలను లాక్కొని, అమోఘాస్త్రాలు కావటం వల్ల వాటితోనే శత్రువులను చంపుతున్నారు. గర్జిస్తున్నారు. ఈ పాంచాలురు శత్రువుల శిరస్సులను, బాహువులను, రథాలను, ఏనుగులను, గుర్రాలను కీర్తిమంతులయిన వీరులను అందరిని నేలగూలుస్తున్నారు. మానస సరోవరం నుంచి వచ్చిన వేగవంతాలయిన హంసలు గంగానదిని కప్పివేసినట్లు, ఈ పాంచాలవీరులు కౌరవ మహాసైన్యాన్ని నలువైపులనుంచి ఆక్రమిస్తున్నారు. ఆబోతులు ఆబోతులను వలె, కృపకర్ణాదులయిన వీరులు పాంచాలురను అడ్డగించటానికి తీవ్రంగా పరాక్రమిస్తున్నారు. భీముని అస్త్రాలు తగులగా, పారిపోతున్న కౌరవసేనలోని మహారథులయిన వేలకొలది శత్రువులను ధృష్టద్యుమ్నాదులయిన వీరులు సంహరిస్తున్నారు. శత్రువులు పాంచాలురను ఓడించగా, భీముడు నిర్భయుడయి గర్జిస్తూ, శత్రుపక్షాన్ని ఎదిరించి బాణాలు వేస్తున్నాడు. కౌరవుల మహాసైన్యం అంతా అధికంగా ఖిన్నమయింది. ఈ రథికులు భీమసేన భయపీడితులయి, తీవ్రంగా భయపడ్డారు.

భీముని బాణాలతో భిన్నమయిన ఈ ఏనుగులు, ఇంద్రుని వజ్రాయుధంతో హతాలయిన పర్వత శిఖరాలలాగా పడుతున్నాయి చూడు. వంగిన ములుకులు గల భీమసేనుని బాణాల దెబ్బలు తిన్న ఈ మహాగజాలు తమసేనలనే త్రొక్కివేస్తూ పరుగెత్తుతున్నాయి.

భీమునికి భయపడి వేలకొలది కౌరవులు ఏనుగులను, గుర్రాలను, రథాలను వదలి పారిపోతున్నారు. పారిపోతున్న చతురంగ సేనల కేకలను, కౌరవులను పారద్రోతులుతున్న భీమసేనుని గర్జనను వినుము.

అర్జునా! యుద్ధరంగంలో జయశీలుడు, వీరుడు అయిన భీముడు, చెవులకు దుఃసహమయినంత ధ్వనితో గర్జిస్తూ చేస్తున్న సింహనాదం వినుము. ఈ నిషాదకుమారుడు గజశ్రేష్ఠాన్ని ఎక్కి, కోపించిన దండపాణి అయిన యముని వలె, తోమరాలతో చంపదలచి

భీముని ఎదుర్కొంటున్నాడు. గర్జిస్తున్న తోమరాలతో గూడిన ఈతని భుజాలను భీముడు ఛేదించి, అగ్నివలె సూర్యునివలె తీక్ష్ణమయిన పదిబాణాలతో చంపాడు. భీముడు ఆతనిని చంపి, ప్రహరించే ఇతర గజాల మీదికి వెళుతున్నాడు. అటు చూడు. భీమసేనుడు నీల మేఘాలవలె ఉన్నవి, మావటివారు ఎక్కి ఉన్న ఏనుగులను, శక్తులు తోమరాల సమూహంతో చంపుతున్నాడు. అర్జునా! మీ అన్న అయిన భీముడు పదునయిన బాణాలతో, ధ్వజాలతో గూడిన జెండాలను ధ్వంసం చేసి, నలువది తొమ్మిది ఏనుగులను ఖండించి వేశాడు. భరతశ్రేష్ఠ ! ఆయన పదేసి బాణాలతో ఒక్కొక్క ఏనుగును కూల్చాడు. ఇంద్రసమానుడయి క్రోధంతో భీముడు తిరిగి రాగా, కౌరవుల గర్జనలు వినరావటం లేదు. భీమసేనుడు ఏకత్ర ఉన్న దుర్యోధనుని మూడు అక్షౌహిణుల సేనను, ముందుకు కదలకుండా ఆపాడు. మధ్యాహ్నం వైకి వచ్చిన సూర్యుని, కంటి బలం లేనివారు చూడలేనట్లు, భీముని శత్రురాజులు కన్నెత్తి చూడలేకపోయారు. సింహాన్ని చూసిన ఇతర మృగాలు వలె, ఈ కౌరవులు భీముని బాణాలకు భయపడి యుద్ధభూమిలో సుఖంగా లేరు.

పాండవసైనికులు క్రోధపూర్ణ లయి దుర్యోధనుని బాధిస్తున్నారు. ఈ కర్ణుడు భీముని వదలి, అనేక సేనలతో కలిసి ధనుస్సును ప్రక్కన తీసుకొని, మహారాజయిన దుర్యోధనుని రక్షించటానికి వేగంగా వెళ్ళుతున్నాడు.

సంజయుడు చెప్పాడు – రాజా! అర్జునుడు ఇది విని, మిక్కిలి దుష్కరమయిన భీముని వీరకార్యాన్ని చూసి, తరువాత ఇంకా మిగిలిన శత్రువులను పదునయిన బాణాలతో సంహరించాడు. ప్రభూ! యుద్ధభూమిలో హతమవుతున్న బలిష్ఠ సంశప్తగణాలు నిరుత్సాహాలయి, పదిదిక్కులకూ పారిపోయాయి. చాలామంది వీరులు ఇంద్రునికి అతిథులయి (వీరస్వర్గాన్ని చేరి) వెంటనే శోక రహితు లయ్యారు. నరశ్రేష్ఠుడయిన అర్జునుడు వంగిన ములుకులు గల బాణాలతో దుర్యోధనుని చతురంగ సైన్యాన్ని సంహరించాడు."

61. సంకుల యుద్ధము.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "సంజయా! భీమయుధిష్ఠిరులు తిరిగి రాగా, పాండవ సృంజయులు నా సేనను వధించసాగారు. నా సైన్యం ఆనంద శూన్యమయి పలుమారులు పారిపోసాగింది. అప్పుడు కౌరవులు ఏం చేశారో నాకు చెప్పు." సంజయుడు చెప్పాడు – "రాజా! నీ దురాలోచన వల్ల మహత్తరమయిన నాశం జరిగింది. మహాబాహు వయిన భీముని చూసి, ప్రతాపవంతుడయిన సూతపుత్రుడు కోపంతో కన్నులు ఎర్రబడగా, భీమసేనుని మీదికి దూకాడు. భీముని ధాటికి మీసేన పెడమొహం కావటం చూసి,

బలవంతుడయిన కర్ణుడు తీవ్రప్రయత్నం చేసి నిలిపాడు. మహాబాహువయిన కర్ణుడు ఆ రీతిగా నీ కుమారుని సేనను స్థిరంగా నిలిపి, యుద్ధదుర్మదు లయిన పాండవుల మీదికి వెళ్ళాడు. పాండవులలోని మహారథాలు యుద్ధరంగంలో ధనుస్సులను ఊపుతూ, బాణాలు వేస్తూ రాధేయుని ఎదుర్కొన్నారు. భీమసేనుడు, సాత్యకి, శిఖండి, జనమేజయుడు, బలిష్ఠుడయిన ధృష్టద్యుమ్నుడు, ప్రభద్రకులు అందరూ నరశ్రేష్ఠులు, మిక్కిలి కుపితులు, యుద్ధంలో జయశోభితులు అయిన సేనను సంహరింపదలచి ముందుకు దూకారు. రాజా! అలాగే మీసేనలోని మహారథులు పాండవసేనను సంహరిస్తూ, త్వరగా ముందుకు వచ్చారు. రథాలు, ఏనుగులు, గుర్రాలతో నిండిన ఆ సమస్తసేన అద్భుతంగా కన్పించింది. శిఖండి కర్ణుని, ధృష్టద్యుమ్నుడు మహాసేనతో గూడిన నీ పుత్రుడైన దుఃశాసనుని ఎదుర్కొన్నారు. నకులుడు వృషసేనుని, యుధిష్ఠిరుడు చిత్రసేనుని, సహదేవుడు ఉలూకుని ఆ యుద్ధంలో ఎదుర్కొన్నారు. సాత్యకి శకునిని, ద్రౌపదీ పుత్రులు కౌరవులను, మహారథుడయిన అశ్వత్థామ అప్రమత్తు డయి అర్జునుని ఎదిరించారు. రణంలో మహాధానుష్కు డయిన యుధామన్యువును కృపాచార్యుడు, బలవంతుడయిన కృతవర్మ ఉత్తమౌజుని ఎదుర్కొన్నారు. ఆర్యా! భీమసేనుడు ఒక్కడే సైన్యాలతో కూడా నీ పుత్రులను నిలువరించాడు. మహారాజా! అప్పుడు భీష్మహంత అయిన శిఖండి నిర్భయుడుగా సంచరిస్తున్న కర్ణుని బాణాలు వేసి అడ్డుకొన్నాడు. తన వేగానికి అడ్డుతగలటం వల్ల కలిగిన కోపంతో పెదవి అదురుతుండగా, కర్ణుడు శిఖండి కనుబొమల మధ్య తగిలిటట్లు మూడు బాణాలు వేశాడు. ఆ బాణాలు గ్రుచ్చుకొని నిలువుగా శిఖండి పైకిలేచిన మూడు శిఖరాలు గల వెండికొండవలె చక్కగా శోభిల్లాడు.

కర్ణునిచే తీవ్రంగా దెబ్బతిన్న ఆ మహాధానుష్కుడు యుద్ధంలో కర్ణుని పదునయిన తొంబది బాణాలతో గాయపరిచాడు. కర్ణుడు శిఖండి గుర్రాలను, సారథిని, మూడు బాణాలతో చంపి, ఒక క్షురప్రంతో ధ్వజాన్ని ముక్కలు చేశాడు. శిఖండి గుర్రాలు చచ్చిన రథం మీది నుంచి క్రిందికి దూకి, కర్ణుని మీదికి శక్తిఆయుధాన్ని విసిరాడు. యుద్ధంలో కర్ణుడు దాన్ని మూడు బాణాలతో ముక్కలు చేసి, శిఖండిని తొమ్మిది పదునయిన బాణాలతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన నరోత్తముడు శిఖండి, కర్ణుని ధనుస్సు నుండి విముక్తమయిన బాణాల బారినుండి తప్పించుకొని, అక్కడినుంచి త్వరగా తొలగిపోయాడు. కర్ణుడు దూదిరాశిని గాలివలె పాండవసేనను చెల్లాచెదరు చేయసాగాడు. మహారాజా! నీ పుత్రునిచే పీడితు డయిన ధృష్టద్యుమ్నుడు, ఆయనను

మూడు బాణాలతో గుండెల్లో తగిలేటట్లు కొట్టాడు. మాన్యా! ఆయన కుడి చేతిని దుశ్శాసనుడు బంగారు పిడి, వంగిన ములుకులు గల బాణాలతో కొట్టాడు. గాయపడిన ధృష్టద్యుమ్నుడు కుపితుడయి, ఘోరమయిన బాణాన్ని దుఃశాసనుని మీద ప్రయోగించాడు. ప్రజాపాలకా! ధృష్టద్యుమ్నుడు వేసిన బాణం తీవ్రవేగంతో తన మీదికి వస్తుంటే, నీ పుత్రుడు దాన్ని మూడు బాణాలతో ఖండించాడు. తరువాత బంగారు సొమ్ములతో అలంకృత మయిన మరొక పదునేడు బాణాలతో, ధృష్టద్యుమ్నుని బాహువుల మీద, గుండెల మీద కొట్టాడు. ఆర్యా! అంతట క్రుద్ధు డయిన ధృష్టద్యుమ్నుడు బాగా పదునయిన క్షురప్రంతో ఆయన ధనుస్సును ఖండించాడు. అది చూసిన జనం కోలాహలం చేశారు. అంతట నీ పుత్రుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, నవ్వుతూ, ధృష్టద్యుమ్నుని బాణాలతో నలువైపులా చుట్టివేశాడు. రణంలో మిక్కిలి దృఢమనస్కుడయిన నీ పుత్రుని పరాక్రమం చూసి యోధులు, సిద్ధులు, అప్సరసల సమూహాలు మిక్కిలి ఆశ్చర్యపడ్డారు. సింహం గొప్ప ఏనుగును వలె, దుఃశాసనుడు నిలువరించి చిక్కులు పెట్టటం వల్ల, మహాబలుడయిన ధృష్టద్యుమ్నుడు తప్పించుకోలేక అవస్థ పడటం మేము చూడలేకపోయాం.

అప్పుడు పాంచాలురు రథాలు, ఏనుగులు, గుర్రాలతో గూడిన సైన్యంతో సేనాపతిని రక్షించదలచి, నీ పుత్రుని ఎదుర్కొన్నారు. అంతట మీవాళ్ళకు శత్రువులతో, ప్రాణులు తట్టుకోలేని ఘోరమయిన భయంకర యుద్ధం జరిగింది. తండ్రి దగ్గర ఉన్న వృషసేనుడు నకులుని మొదట అయిదు బాణాలతో కొట్టి, మళ్ళీ మూడు బాణాలతో గాయపరిచాడు. అప్పుడు శూరు డయిన నకులుడు నవ్వుతూ, మిక్కిలి పదునయిన బాణంతో వృషసేనుని గుండెల్లో కొట్టాడు. శత్రునాశకా! బలవంతు డయిన శత్రువు తీవ్రంగా గాయపరచగా, ఆయన శత్రువును ఇరువది బాణాలతో కొట్టాడు. నకులుడు అయిదు బాణాలతో ఆయనను గాయపరిచాడు. తరువాత ఆ పురుషశ్రేష్ఠులు ఇద్దరూ వేలకొలది బాణాలతో ఒకరినొకరు కప్పివేశారు. అప్పుడు సైన్యం చెల్లాచెదరయింది. ప్రజాపాలకా! దుర్యోధనుని సేన పారిపోవటం చూసి, కర్ణుడు బలంగా వెంబడించి, దాన్ని ఆపాడు. కర్ణుడు వెనుదిరుగగా, నకులుడు కౌరవ సేనమీదికి వెళ్ళాడు. కర్ణపుత్రుడు నకులుని వదలి, త్వరగా వెళ్ళి, తన తండ్రి రథచక్ర రక్షణ చేశాడు. ఉలూకుని సహదేవుడు వారించాడు. సహదేవుడు ఆయన నాలుగు అశ్వాలను చంపి, సారథిని యమలోకానికి పంపాడు. అప్పుడు తండ్రికి ఆనందం కలిగించే ఉలూకుడు రథంమీది నుంచి దూకి, త్రిగర్తుల సైన్యంలోకి వేగంగా వెళ్ళాడు. సాత్యకి శకునిని పదునయిన ఇరువది బాణాలతో

కొట్టి, నవ్వుతూ ఒక బాణంతో శకుని ధ్వజాన్ని ఖండించాడు. శకుని కుపితుడయి సాత్యకి కవచాన్ని ఛేదించి, సువర్ణధ్వజాన్ని ఛేదించాడు. మహారాజా! అలాగే సాత్యకి ఈయనను పదునయిన బాణాలతో కొట్టాడు. సారథిని మూడు బాణాలతో గాయపరిచాడు.

ఆ తరువాత ఆయన రథాశ్వాలను త్వరపడి, బాణాలతో యమలోకానికి పంపాడు. అప్పుడు శకుని త్వరగా రథంమీదినుంచి దూకి, మనస్వి అయిన ఉలూకుని రథం ఎక్కాడు. ఉలూకుడు రథం వేగంగా తోలించి, యుద్ధశోభితుడయిన సాత్యకి బారినుండి తండ్రిని తొలగించాడు. రణంలో మీవాళ్ళ సేనను వేగంగా పారద్రోలాడు. అందువల్ల సేన చెల్లాచెదరయింది. సాత్యకి బాణాలు కప్పివేయగా, నీ సైన్యం పది దిక్కులకు పారిపోయింది. ప్రాణాలుపోయినట్లు నేలమీద పడింది. నీ పుత్రుడు భీముని యుద్ధంలో నిలిపివేశాడు. జననాథు డయిన ఆయనను, భీముడు ముహూర్త కాలంలో అశ్వ సూత రథ హీనుని చేశాడు. అది చూసి, జనులందరూ సంతోషించారు. అంతట రాజు భీముని చూపునుంచి తొలగిపోయాడు. అప్పుడు కురుసైన్యం అంతా భీముని మీదికి దూకింది. భీమసేనుని పీడిస్తున్న వారి సింహనాదాలు అన్నివైపులా ప్రతిధ్వనించాయి. యుధామన్యువు కృపాచార్యుని గాయపరచి, ఆయన ధనుస్సును వేగంగా ఖండించాడు. అంతట శస్త్రధారులలో శ్రేష్ఠ డయిన కృపాచార్యుడు ఇంకోధనుస్సు తీసుకొని యుధామన్యుని ధ్వజాన్ని, సారథిని, గొడుగును నేలగూల్చాడు. అప్పుడు మహారథు డయిన యుధామన్యుడు రథం మీదనే అక్కడినుంచి పలాయనం చిత్తగించాడు. ఇంకొకచోట ఉత్తమౌజుడు భయంకరుడు, భయంకర పరాక్రమం గల కృతవర్మను, మేఘం వానతో పర్వతాన్ని కప్పినట్లు, బాణాలతో కప్పివేశాడు. వారిమధ్య ఘోర రూపమై, చాలా తీవ్రమయిన గొప్ప యుద్ధం జరిగింది. అలాంటి యుద్ధం అంతకుముందు నేను చూడలేదు. అప్పుడు కృతవర్మ యుద్ధంలో త్వరపడి, ఉత్తమౌజుని హృదయంలో బాణం వేశాడు. ఉత్తమౌజుడు అచేతనుడై రథంవెనుక కూలబడ్డాడు. రథికశ్రేష్ఠ డయిన ఆయనను సారథి అక్కడినుంచి తొలగించాడు. అప్పుడు కౌరవసైన్యం భీమసేనునిపై బడింది. దుఃశాసనుడు, శకుని విశాలమయిన గజసైన్యంతో భీముని చుట్టుముట్టి, ఆయన మీద బాణాలు వేశారు. అంతట భీముడు దుర్యోధనుని వందల కొలది బాణాలతో యుద్ధవిముఖుని చేసి, వేగంగా గజసేన మీదికి దూకాడు. భీముడు తన మీదికి వేగంగా వచ్చిపడుతున్న గజసేనను చూసినంతనే, చాలా తీవ్రంగా కుపితుడయి, దివ్యాస్త్రాన్ని ప్రయోగించాడు.

ఇంద్రుడు వజ్రాయుధంతో అసురులను సంహరించినట్లు, భీముడు ఏనుగులతో

ఏనుగులను కొట్టి వధించాడు. తరువాత వృకోదరుడు ఏనుగులను సంహరిస్తూ, మిడుతలతో వృక్షాన్ని వలె బాణాలతో ఆకాశం అంతా కప్పివేశాడు. తరువాత భీముడు గుమిగూడి ఉన్న వేలకొలది గజసమూహాలను, మేఘసమూహాన్ని గాలివలె వేగంగా సంహరించాడు. బంగారు జాలరులతో, మణుల జాలరులతో కప్పిన ఏనుగులు, యుద్ధభూమిలో మెరుపులతో గూడిన మేఘాలులాగా చక్కగా ప్రకాశించాయి. రాజా! భీమునిచే హతమవుతున్న ఏనుగులు పారిపోయాయి. కొన్ని ఏనుగులు గుండెలు పగిలి నేలగూలాయి. సువర్ణాలంకృతా లయిన ఏనుగులు కొన్ని పడిపోయాయి. ఇంకా కొన్ని పడుతున్నాయి. పగిలిన పర్వతాలవలె పడిపోయిన ఏనుగులతో భూమి శోభిల్లింది. చక్కగా ప్రకాశించే రత్నాలుదాల్చి పడిపోయిన గజ యోధులతో, భూమి పుణ్యం క్షీణించి నేలపడిన గ్రహాలతో వలె విరాజిల్లింది. భీముని బాణపు దెబ్బలు తిన్న ఏనుగులు కణతలు పగులగా, కుంభస్థలాలు, తొండాలు చీలగా యుద్ధంలో వందలకొలది పారిపోయాయి. కొండలవంటి కొన్ని ఏనుగులు రక్తం క్రక్కుతూ భయపీడితాలయి శరీరాలు బాణాలతో గాయపడగా గైరికాదిధాతువులతో చిత్రితమయిన పర్వతాలలాగా ఉండి, పారిపోయాయి. ధనుస్సును తీవ్రంగా కదిలిస్తున్న భీమసేనుని మహా సర్పసమానాలు, అగురు చందనం పూసిన భుజాలను అప్పుడు చూశాను. మెరుపులతోడి ఉరుముల వంటి ఆయన అల్లెత్రాటి భయంకర ధ్వనిని విని, ఏనుగులు మలమూత్రాలు విడుస్తూ వేగంగా పారిపోయాయి. ధీమంతుడు, ఏకాకి అయిన భీముడు చేస్తున్న ఆ వీరకార్యం, సర్వప్రాణులను సంహరిస్తున్న రుద్రుని మహత్కార్యం వలె విలసిల్లింది."

62. కౌరవసేన యుధిష్ఠిరుని ఆక్రమించుట.

సంజయుడు చెప్పాడు -"ఆ తరువాత శ్వేతాశ్వాలు గల్గి, నారాయణుడు అధిష్ఠించిన శ్రేష్ఠరథం మీద నిలిచి అర్జునుడు అక్కడికి వచ్చాడు. ప్రచండవేగం గల వాయువు మహా సాగరాన్ని వలె, ప్రచండమయిన అశ్వబలం గల నీ సైన్యాన్ని విజయుడు కల్లోలం చేశాడు. అర్జునుడు పరాకుగా ఉండగా, నీ సుతుడయిన దుర్యోధనుడు క్రోధంతో సగం సేనతో గూడి వేగంగా వచ్చి, యుధిష్ఠిరుడు తారసపడగా, ఆయనను చుట్టుముట్టాడు. తరువాత డెబ్బది మూడు క్షురప్రాలతో యుధిష్ఠిరుని గాయపరిచాడు. అందుకు మిక్కిలి క్రుద్ధు డయిన యుధిష్ఠిరుడు ముప్పది భల్లాలతో వేగంగా నీ పుత్రుని ప్రహరించాడు. అప్పుడు కౌరవులు యుధిష్ఠిరుని పట్టుకోదలచి పరిగెత్తారు. పాండవపక్షంలో కూడి ఉన్న

మహారథులు, శత్రువులు దురాలోచనలో ఉన్నారని తెలిసి, యుధిష్ఠిరుని రక్షించటానికి వచ్చారు. నకులుడు, సహదేవుడు, పృషతుని వంశీయుడయిన ధృష్టద్యుమ్నుడు, అక్షౌహిణి సేనతో యుధిష్ఠిరుని వద్దకు పరిగెత్తారు. భీమసేనుడు కూడా యుద్ధంలో మహారథులయిన శత్రువులను నిలిపివేస్తూ, శత్రువులు చుట్టుముట్టిన రాజును రక్షింపదలచి పరుగెత్తాడు. వైకర్తనుడయిన కర్ణుడు, ఆ వచ్చిన మహాధనుష్కులయిన వారినందరిని తీవ్రంగా బాణవర్షం కురిపించి ఆపాడు. వారందరూ బాణాలను వేస్తూ, తోమరాలను విసురుతూ, బాగా యత్నించి కూడా రాధేయుని ఎదిరించలేకపోయారు. సర్వశస్త్రాస్త్ర విద్యలలో పండితుడయిన రాధేయుడు, ఆ గొప్ప విలుకాండ్రను అందరిని చాలా తీవ్రమయిన బాణ వర్షంతో అడ్డుకొన్నాడు. సహదేవుడు శీఘ్రంగా వచ్చి, బాణాలను వేగంగా వేస్తూ, ఇరువది బాణాలతో దుర్యోధనుని కొట్టాడు. సహదేవుని బాణాలు తగిలిన దుర్యోధనుడు కొండలాగా విరాజిల్లాడు. రక్తంతో తడిసిన ఆయన మదధారలు స్రవించే మత్తగజంలాగా విలసిల్లాడు. పదునయిన బాణాలతో బాగా దెబ్బతిన్న నీ సుతుని చూసి, రాధేయుడు పరుగెత్తుకొని వచ్చాడు.

ఆ స్థితిలో ఉన్న దుర్యోధనుని చూసి, కర్ణుడు త్వరగా అస్త్రాలను ప్రయోగించాడు. దానితో యుధిష్ఠిరుని సేనను, ధృష్టద్యుమ్నుని హింసించాడు. ఉత్తముడయిన సూతపుత్రుని బాణాలు హింసించగా, ఆతని బాణాల దెబ్బలు తాళలేక యుధిష్ఠిర సేన పారిపోయింది. సూతపుత్రుని ధనుస్సు నుండి వెడలిన వివిధ బాణాలు, ఒక బాణం ములికి ఇంకొక బాణం పిడిలో గ్రుచ్చుకొని పడ్డాయి. ఆకాశంలో ఒకదాన్ని ఒకటి తగులుతున్న బాణ సమూహాల రాపిడివల్ల అగ్నిపుట్టింది. అప్పుడు కర్ణుడు ఇతరుల శరీరాలతో దిగబడేవి, మిడుతల దండువలె పది దిక్కులకు వెళ్ళే బాణాలతో శత్రువులను కొట్టాడు. దివ్యాస్త్రాలను ప్రదర్శిస్తూ, కర్ణుడు మణులతో, బంగారంతో అలంకృతాలై, రక్తచందనం పూసిన బాహువులను ఎక్కువగా పలుమారులు కదిలించాడు. రాజా! ఆ తరువాత కర్ణుడు అన్నిదిక్కులను బాణ ప్రయోగంతో మోహితాలను చేస్తూ, యుధిష్ఠిరుని తీవ్రంగా పీడించాడు. మహారాజా! అప్పుడు క్రుద్ధుడయిన యుధిష్ఠిరుడు పదునయిన ఏబది బాణాలతో కర్ణుని కొట్టాడు. మాన్యా! ధర్మపుత్రుడు నీ సైన్యాన్ని వధిస్తున్నప్పుడు ఘోరంగా కన్పించే యుద్ధభూమి గాఢాంధకార మగ్నం అయింది. నరనాథా ! మీవాళ్ళలో మహత్తరంగా హాహాకారాలు విన్పించాయి. యుధిష్ఠిరుడు నానావిధాలుగా రాతిమీద పదును తేరిన, బాణాలను, నానావిధాలయిన బరిసెలను, శక్తులను, ముసలాలను దుష్టమయిన పూర్ణదృష్టిని వ్యాపింపజేసిన

చోటనల్లా సేనలు నశించాయి. అమర్షి, పాపిష్ఠి, మిక్కిలి క్రుద్ధు డయిన కర్ణుడు రోషంతో ముఖం చలిస్తుండగా, అనంతమయిన ఆత్మ విశ్వాసంతో యుధిష్ఠిరుని మీదికి వెళ్ళి నారాచాలతో, అర్ధచంద్ర బాణాలతో, వత్సదంతాలతో, వివిధ భాగాలతో యుధిష్ఠిరుని చుట్టుముట్టాడు. యుధిష్ఠిరుడు కూడా, కర్ణుని, బంగరు పిడులు గల పదునయిన బాణాలతో కొట్టాడు. కర్ణుడు నవ్వుతూ, ఆయనను రాతిమీద పదును దేరి, గ్రద్ద ఈకలు చివర గల మూడు బాణాలతో వక్షఃస్థలంలో కొట్టాడు. కర్ణునిచేత తీవ్రంగా పీడితు డయిన యుధిష్ఠిరుడు రథంవెనుక కూర్చుండి 'రథంతోలు' అని సారథిని ఆదేశించాడు. అప్పుడు దుర్యోధనునితో కూడా కౌరవులందరూ 'రాజును పట్టుకోండి' అని అరుస్తూ అంతటా ఆయనవెంట పరుగెత్తారు. రాజా! అప్పుడు ప్రహారకుశలు లయిన కేకయులు పదిహేడు వందల మంది పాంచాలురతో కలిసి కౌరవులను వారించారు. మిక్కిలి సంకు లమయిన ఆ యుద్ధంలో జననాశం జరుగుతుంటే, మహాబలు లయిన దుర్యోధన భీములు తలపడ్డారు."

63. ధర్మజుని ఓటమి - పలాయనము

సంజయుడిలా చెప్తున్నాడు. "కర్ణుడు కూడా తన ఎదుట నిలిచిన కేకయ మహారథులను బాణ సమూహంతో సంహరింపసాగాడు. కర్ణుని నివారించాలని ప్రయతిస్తున్న ఆ మహారథులలో అయిదు వందలమందిని కర్ణుడు యమసదనానికి పంపించాడు. కర్ణుని బాణాల పీడనకు గురి అయిన ఆ యోధులు కర్ణుని సహించగలగటం కష్టమని గమనించి, భీమసేనుని దగ్గరకు వెళ్ళిపోయారు. బాణ సమూహాలతో రథసేనను వివిధరీతులతో భంగపరచి, కర్ణుడు ఒకే రథంతో యుధిష్ఠిరునిపై దాడిచేశాడు. బాణాలతో ఒళ్ళంతా హూనమై, నకులసహదేవుల మధ్యలో నుండి యుధిష్ఠిరుడు చైతన్యాన్ని కోల్పోయినట్లు, మెల్లమెల్లగా తన శిబిరంవైపు వెళ్తున్నాడు. ఆ స్థితిలో ధర్మజుని సమీపించి, కర్ణుడు దుర్యోధనుడికి మేలు చేయాలన్న తలంపుతో తీక్ష్ణమైన మూడు బాణాలతో ధర్మజుని మరల గాయపరిచాడు. అదే రీతిగా ధర్మరాజు కూడా రాధేయుని రొమ్ముపై గాయపరిచాడు. మూడు బాణాలతో అతని రథసారథిని, నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. నకులసహదేవులు యుధిష్ఠిరుని చక్ర రక్షకులుగా నున్నారు. వారుకూడా కర్ణుడు ధర్మజుని చంపుతాడేమో అని భావించి, కర్ణునివైపు దూసుకొనిపోయారు. ఆ నకుల సహదేవులిద్దరూ తీవ్ర ప్రయత్నంతో శరవృష్టిని కురిపిస్తూ, విడివిడిగా కర్ణుని

ముంచెత్తారు. అదేవిధంగా కర్ణుడు ఆ నకుల సహదేవులను పదునైన అంచులు గల రెండు భల్లాలతో తిరిగి గాయపరిచాడు. దంతపు వన్నె, నల్లనితోక, మనోవేగం గల యుధిష్ఠిరుని మేటి గుర్రాలను కర్ణుడు రణభూమిలో సంహరించాడు. ఆ తరువాత మరొక భల్లంతో కర్ణుడు మేటివిలుకాడైన యుధిష్ఠిరుని శిరస్త్రాణాన్ని (హెల్మెట్) నవ్వుతూ పడగొట్టాడు. అదే రీతిగా కర్ణుడు, నకులుని గుర్రాలను చంపి, రథం నొగలను, ధనుస్సును కూడా ఖండించాడు. తీవ్రంగా గాయపడి, గుర్రాలను, రథాలను కోల్పోయిన ఆ యుధిష్ఠిరనకులులు అప్పుడు సహదేవుని రథం ఎక్కారు.

రథాలను కోల్పోయిన ఆ ధర్మజ నకులులను చూసి, వారి మేనమామ శల్యుడు జాలి చూపుతూ కర్ణునితో ఇలా అన్నాడు. "నీవు ఈనాడు కుంతికొడుకైన అర్జునునితో పోరాడాలి. అంత కోపంతో ధర్మరాజుతో ఎందుకు యుద్ధం చేస్తున్నావు? కర్ణా! యుధిష్ఠిరుని శస్త్రాస్త్రాలు, కవచం నశించాయి. బాణాలు, అమ్ములపొది పాడయి పోయాయి. సారథి, గుర్రాలు అలసిపోయాయి. శత్రువుల బాణాలు అతనిని ఆవరించి ఉన్నాయి. ఈ స్థితిలో ధర్మజుని మీద పరాక్రమిస్తే నవ్వులపాలవుతావు." మద్రరాజు (శల్యుడు) అలా చెప్పినా కూడా, కర్ణుడు అదే కోపంతో ధర్మజుని బాణాలతో పీడించాడు. మాద్రికొడుకులైన నకుల సహదేవులను కూడా తీక్ష్ణశరాలతో గాయపరిచి, పెద్దగా నవ్వి, యుధిష్ఠిరుని యుద్ధవిముఖుని చేశాడు. తీవ్రకోపంతో రథంపై నిలిచి, యుధిష్ఠిరుని చంపాలని దృఢనిశ్చయంతో ఉన్న కర్ణుని చూసి, పెద్దగా నవ్వి, శల్యుడు మరల ఇలా అన్నాడు. "రాధేయా! దుర్యోధనుడు అర్జునుని కోసమే నిన్ను ఎప్పుడూ గౌరవిస్తుంటాడు. ఆ అర్జునుని వధించు. ధర్మజుని చంపి ఏం సాధిస్తావు.

యుధిష్ఠిరుని చంపితే అర్జునుడు మన రథికుల నందరినీ తప్పక చంపుతాడు. ఆ అర్జునుడే చనిపోతే దుర్యోధనుడు నిశ్చయంగా విజయాన్ని సాధించినట్లే. మహాబాహూ! ఆ అర్జునుని ధ్వజం మండిపడే సూర్యునివలె కనిపిస్తోంది చూడు. ఈ అర్జునుని చంపు. ధర్మజుని చంపి ఏం సాధిస్తావు.

కృష్ణార్జునులు పూరిస్తున్న శంఖాల ధ్వని పెద్దగా వినిపిస్తోంది. వర్షాకాల మేఘధ్వనివలె గాండివ చాప ధ్వని వినిపిస్తోంది. ఈ అర్జునుడు శరవృష్టితో మన గొప్ప గొప్ప రథికులను చంపుతూ, మనసేననంతా కబళిస్తున్నాడు. కర్ణా! రణరంగంలో ఆ అర్జునుని చూడు. శూరుడైన అర్జునుని వెనుక భాగాన్ని యుధామన్యుడు, ఉత్తమౌజుడు రక్షిస్తున్నారు. శూరుడైన సాత్యకి ఎడమవైపు చక్రాన్ని, ధృష్టద్యుమ్నుడు కుడివైపు చక్రాన్ని కాపాడుతున్నారు. కర్ణా! భీమసేనుడు దుర్యోధనునితో పోరాడుతున్నాడు. భీముడు మనమంతా చూస్తుండగానే

దుర్యోధనుని చంపవచ్చు. ఆ రాజును విడిపించటానికి వీలైన ప్రయత్నం చేయి. చూడు! యుద్ధరంగానికే వన్నె తెచ్చే దుర్యోధనుని భీమసేనుడు కబళిస్తున్నాడు. నీవు అక్కడకు వెళ్ళి దుర్యోధనుని విడిపిస్తే మహాశ్చర్యకర విషయమవుతుంది. 'వీమవుతాడో' అనే సందేహంలో పడిపోయిన దుర్యోధనుని దగ్గరకు వెళ్ళి రక్షించు. నకుల సహదేవులనో, ధర్మరాజునో చంపి ఏం సాధిస్తావు".

రాజా! శల్యుని ఆ మాటలు విని, మహాసంగ్రామంలో భీముడు కబళిస్తున్న దుర్యోధనుని చూసి, శల్యుని మాటల ప్రేరణతో, దుర్యోధనుని కాపాడుకోవాలన్న తీవ్రమైన అభిలాషతో కర్ణుడు ధర్మరాజును, నకుల సహదేవులను విడిచి, నీ కుమారుని రక్షించటానికి పరుగెత్తాడు. శల్యుడు తోలుతున్న గుర్రాలు ఆకాశం మీద వెళుతున్నట్టున్నాయి. కర్ణుడు వెళ్ళిపోగానే, యుధిష్ఠిరుడు వేగశాలులయిన గుర్రాలతో సహదేవునితో కలిసి పారిపోయాడు. నకులసహదేవులతో కలిసి యుధిష్ఠిరుడు సిగ్గుపడుతూ, వేగంగా తన శిబిరానికి చేరి, రథం నుండి దిగి, వెంటనే చక్కని శయ్యపై పడుకొన్నాడు. బాణాలతో ఒళ్ళంతా హూనమై ఉంది. ఒంటికి గ్రుచ్చుకొన్న బాణాలను తొలగించుకొని, మనస్సులో నాటిన బాణాలతో బాధపడుతూ, ధర్మజుడు నకులసహదేవులతో ఇలా అన్నాడు. 'పాండవులారా! వీరులారా! త్వరగా భీముని దగ్గరకు వెళ్ళండి. ఆ సేనను చేరండి. ఆ వృకోదరుడు మేఘంవలె గర్జిస్తూ పోరాడుతున్నాడు.' నకులుడు మరొకరథాన్ని తెచ్చాడు. సహదేవుడు తేజస్వి. ఆ సోదరులిద్దరూ మహావేగం గల గుర్రాలతో భీముని దగ్గరకు వెళ్ళారు. పరాక్రమశాలులైన ఆ సోదరులు అక్కడి సేనలతో కలిసి నిలిచారు."

64. అశ్వత్థామ ఓటమి - కర్ణుడు పాంచాలురను సంహరించుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! అశ్వత్థామ పెద్ద రథసేనను చుట్టూ నిలుపుకొని, వేగంగా అర్జునుడున్న చోటికి వచ్చాడు. కృష్ణుడు సహాయకుడైన అర్జునుడు మీదకువస్తున్న అశ్వత్థామను చెలియలికట్ట సముద్రాన్ని ఆపినట్టు వెంటనే నిలువరించాడు. ప్రతాపశాలి అయిన అశ్వత్థామ అర్జునుని చర్యతో కోపించి, బాణాలతో కృష్ణార్జునులను కప్పివేశాడు. కృష్ణార్జునులు ఆవరింపబడటాన్ని చూసి, అక్కడున్న కురుమహారథులు పరమాశ్చర్యంతో చూడసాగారు. ఆపై అర్జునుడు నవ్వుతూ దివ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. కానీ బ్రాహ్మణుడైన అశ్వత్థామ రణరంగంలో ఆ అస్త్రాన్ని నివారించాడు. రణభూమిలో అశ్వత్థామ అస్త్రాలను నష్టపరచాలని అర్జునుడు ప్రయోగించిన అస్త్రాలనన్నింటినీ

మేటివిలుకాడైన అశ్వత్థామ పడగొట్టాడు. అలా మహాభయంకరమైన అస్త్రయుద్ధం జరుగుతుంటే, రణభూమిలో అశ్వత్థామ నోరు తెరిచిన మృత్యువువలె కనిపించాడు. అశ్వత్థామ బాణాలతో దిక్కులనూ, మూలలనూ ఆవరింపజేసి, మూడు బాణాలతో కృష్ణుని కుడిభుజం మీద గాయం చేశాడు. అర్జునుడు ఆ మహానుభావుని గుర్రాలనన్నింటినీ చంపి, రణభూమిలో రక్తప్రవాహనదిని కల్పించాడు. పరలోకంవైపు ప్రవహిస్తున్న ఆ నది అందరినీ తనతో కొనిపోతోంది. అర్జునుని వింటి నుండి వెలువడిన బాణాలు అశ్వత్థామ పక్షంలోని రథికులను అందరినీ రథాలతో పాటు రణభూమిలో నశింపజేయటాన్ని అందరూ చూశారు. అశ్వత్థామ కూడా ఆ స్థితిని గమనించాడు. అప్పుడు తాను కూడా అటువంటి దారుణనదిని ప్రవహింపజేశాడు. అర్జున - అశ్వత్థామల మధ్య దారుణంగా ఆ సంకుల యుద్ధం జరుగుతుంటే, యోధులు హద్దులెరుగకుండా యుద్ధం చేస్తూ ఎటుపడితే అటు పారిపోసాగారు.

రాజా! రథాల గుర్రాలు, సారథులు చనిపోయారు. ఆశ్వికులు నశించారు. హస్తిపకులు, మావటీళ్ళు మరణించారు. ఏనుగులు చనిపోయాయి. అర్జునుడు రణభూమిలో ఘోరమైన జనవినాశనాన్ని కల్పించాడు. అర్జునుని వింటి నుండి వెలువడిన బాణాల తాకిడితో రథికులెందరో చచ్చి పడిపోయారు. గుర్రాల కళ్ళాలు వీడిపోయి అవి ఆటు, ఇటూ పరుగెత్తసాగాయి. అది చూసి పరాక్రమశాలి అయిన అశ్వత్థామ రణరంగానికే అందం తెచ్చే జయశీలుడైన అర్జునునిపై వేగంగా దాడిచేసి, బంగారు అలంకరణలు గల తన వింటిని ఝుళిపిస్తూ అన్నివైపుల నుండి పదునైన బాణాలను అర్జునునిపై కురిపించాడు. మహారాజా! మరల అశ్వత్థామ వింటిని లాగి, బాణాన్ని వేసి, నిర్దయగా అర్జునుని రొమ్ముపై తీవ్రంగా గాయం చేశాడు. అశ్వత్థామ తనను అలా గాయపరచగా గాండీవి రణభూమిలో మహాశర వృష్టితో అశ్వత్థామను కప్పివేసి, అతని ధనుస్సును ఖండించాడు. వెంటనే అశ్వత్థామ వజ్రంవలె కఠినస్పర్శగల పరిఘను చేతబట్టి అర్జునునిపైకి విసిరాడు. ఆ పరిఘ మీదకు వస్తుంటే, అర్జునుడు నవ్వుతూ వెంటనే దాన్ని ఖండించాడు. ఆ పరిఘ వజ్రం దెబ్బ తిన్న పర్వతంవలె ముక్కలు ముక్కలై అక్కడక్కడ పడిపోయింది.

మహారాజా! దానితో కోపించి, అశ్వత్థామ ఇంద్రాస్త్రంతో అర్జునునిపై వేగంగా బాణాలను కురిపించసాగాడు. రాజా! అశ్వత్థామ ప్రయోగించిన ఐంద్రాస్త్ర విస్తృతిని గమనించి, అర్జునుడు గాండీవాన్ని చేతబట్టి, వేగంగా మహేంద్రుడు సృష్టించిన గొప్ప అస్త్రంతో ఆ ఇంద్రజాలాన్ని ఉపసంహరింపజేశాడు. అర్జునుడు ఆ ఐంద్రాస్త్రం నుండి వెలువడిన ఇంద్రజాలాన్ని నశింపజేసి, ఆపై క్షణకాలంలో అశ్వత్థామను సమీపించి, అతని

రథాన్ని క్రమ్మివేశాడు. అప్పుడు అశ్వత్థామ అర్జునుని బాణాల దెబ్బతిన్నాడు. అప్పుడు అశ్వత్థామ బాణాలతో అర్జునుని బాణ వృష్టిని నివారింపజేసి, తనపేరు ప్రకటింపజేస్తూ వంద క్షుద్రకాలతో (బాణాలతో) కృష్ణుని, మూడు వందలతో అర్జునుని వెంటనే గాయపరిచాడు. అర్జునుడు వంద బాణాలతో గురుపుత్రుని మర్మస్థానాలను ఛేదించాడు. నీవారు చూస్తుండగానే అతని గుర్రాలను, రథసారథిని, అల్లెత్రాటిని బాణాలతో ముంచెత్తాడు. అర్జునుడు అశ్వత్థామను మర్మస్థానాలలో కొట్టి, ఒక భల్లంతో రథసారథిని రథాసనం నుండి పడగొట్టాడు. అశ్వత్థామ స్వయంగా గుర్రాలను నడుపుతూ, కృష్ణార్జునులను బాణాలతో ఆవరించాడు. అక్కడ అశ్వత్థామ వేగం, పరాక్రమం అద్భుతంగా కనిపించాయి. రాజా! అశ్వత్థామ గుర్రాలను నడుపుతున్నాడు, అర్జునునితో పోరాడుతున్నాడు. రణభూమిలోని ఆ చర్యను యోధులందరూ అభినందించారు. ఆపై జయశీలుడైన అర్జునుడు నవ్వుతూ, వేగంగా రణభూమిలో అశ్వత్థామ గుర్రాల పగ్గాలను క్షురప్రాలతో ఖండించాడు. బాణవేగ పీడనతో ఆ గుర్రాలు పారిపోసాగాయి. భారతా! అప్పుడు నీ సేనలో భీకర కోలాహలం చెలరేగింది. పాండవులు గెలిచి, నీ సైన్యంపైకి దూసుకొని వచ్చారు. మరల జయాభిలాషతో అన్నివైపుల నుండి పదునైన బాణాలను ప్రయోగించసాగారు. గెలుపుతో ముచ్చటపడే పాండవవీరులు మాటిమాటికీ దుర్యోధన మహాసేనను భంగపరచసాగారు. నీ కుమారులు, శకుని, కర్ణుడు చూస్తుండగానే ఇదంతా జరిగింది. నీ కుమారులు నివారిస్తున్నా, పీడనకు గురి అయిన ఆ మహాసేన ఎటుపడితే అటు పారిపోయింది. రణభూమిలో నిలువలేకపోయింది. ఆపై యోధులందరూ, అన్నివైపులకూ పారిపోతుంటే నీ కుమారుల ఆ మహాసేన అల్లకల్లోలమయింది. "నిలవండి! నిలవండి!' అని కర్ణుడు నివారిస్తున్నా, మహాత్ములయిన పాండవుల సంహారానికి గురి అయిన ఆ సేన నిలవలేకపోయింది. ఆపై దుర్యోధనసేన అన్ని దిక్కులకూ పారిపోతుంటే, విజయంతో ఉల్లాసపడే పాండవులు సింహనాదాలు చేయసాగారు.

అప్పుడు దుర్యోధనుడు ప్రేమపూర్వకంగా కర్ణునితో ఇలా అన్నాడు - 'కర్ణా! చూడు. మన మహాసేన పాంచాలురచే తీవ్రంగా బాధింపబడుతోంది. నీవుండగానే భయంతో పారిపోతోంది. అది గ్రహించి ఇప్పుడు చేయవలసిన పనిచేయి. పాండవులు పారద్రోలుతుంటే, వేలకొలది యోధులు రణభూమిలో నిన్నే పిలుస్తున్నారు.' ఆ దుర్యోధనుని మాట విని కూడా మహాత్ముడైన కర్ణుడు నవ్వుతూ శల్యునితో ఇలా అన్నాడు. 'రాజా! నా భుజబలాన్ని, అస్త్రబలాన్ని చూడు. ఈ రోజు రణభూమిలో పాండవులతో సహా పాంచాలురనందరినీ సంహరిస్తాను. నరోత్తమా! జాగ్రత్తగానే గుర్రాలను నడిపించు. అనుమానించవద్దు." కర్ణుడు

అలా పలికి, విజయమనే పేరుగల తన మేటివింటిని చేపట్టి, ఎక్కుపెట్టి, నిరంతరంగా సంధిస్తూ సత్యప్రతిజ్ఞతో యోధులను నిలిపాడు. ఆపై కర్ణుడు భార్గవాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆపై ఆ మహాసంగ్రామంలో ఆ అస్త్రంనుండి తీక్ష్ణబాణాలు వేలకొలది, లక్షల కొలది, కోట్ల కొలది, అర్బుదాల కొలది వెలువడసాగాయి. డేగ ఈకలు, నెమలి ఈకలతో అలంకరింపబడిన ఆ భీకర బాణాలు ప్రజ్వలిస్తూ పాండవసేనను కప్పివేశాయి. ఏమీ తెలియటం లేదు. రణభూమిలో బలసంపన్నమైన భార్గవాస్త్రపీడనకు గురి అయిన పాంచాలసేనలో తీవ్ర హాహాకారం చెలరేగింది. రాజా! ఏనుగులు, గుర్రాలు, రథాలు, సైనికులు వేలకొలదిగ అంతటా పడిపోతున్నారు. చనిపోయిన ఆ సేనలు పడిపోతుంటే అంతటా భూమి కంపించింది. పాండవ మహాసేన అంతా కలతపడింది. యోధులలో శ్రేష్ఠుడు అయిన కర్ణుడొక్కడే, పొగలేని నిప్పువలె శత్రువులను దహిస్తూ శోభించాడు. అరణ్యం తగులబడుతుంటే ఏనుగులు ఎక్కడికక్కడ మూర్ఛిల్లినట్లు కర్ణుడు సంహరిస్తుంటే పంచాలురు, చేదులు మూర్ఛిల్లసాగారు.

రాజా! పులులవలె నరపుంగవులంతా ఆక్రోశించసాగారు. రణరంగంలో భయంతో ఆక్రోశిస్తూ, పిరికితనంతో అన్నివైపులకూ పరుగెత్తుతూ వారు చేస్తున్న ఆక్రోశం, ప్రళయకాలంలో ప్రాణులు చేసే తీవ్రమైన ఆర్తనాదం వలె ఉంది. కర్ణుడు ఆ సేనలను కాలరాస్తుంటే పశుపక్ష్యాదులతో సహా సర్వభూతాలు భయానికి లోనయ్యాయి. రణభూమిలో కర్ణుడు శత్రుసంహారం చేస్తుంటే సృంజయులు యమనగరంలో బాధలతో అచేతనులైనవారు యమధర్మరాజును పిలుస్తూ ఆక్రోశించినట్లు మాటిమాటికీ కృష్ణార్జునులను పిలుస్తూ ఆక్రోశిస్తున్నారు. కర్ణబాణాల సంహారానికి గురి అవుతున్న వారి ఆర్తనాదాన్ని విని, కర్ణుడు ప్రయోగించిన భార్గవాస్త్రదారుణ పరిణామాన్ని చూసి, అర్జునుడు వాసుదేవునితో ఇలా అన్నాడు. "కృష్ణా! భార్గవాస్త్ర పరాక్రమాన్ని చూడు. యుద్ధంలో ఈ అస్త్రాన్ని నివారించటం ఏ రీతిగానూ వీలుకాదు. కృష్ణా! మహాసంగ్రామంలో కోపంతో ఉన్న కర్ణుని చూడు. పరాక్రమంలో యమరాజు వంటివాడై, దారుణ కర్మను కొనసాగిస్తున్నాడు. నిరంతరాయంగా గుర్రాలను నడుపుతూ, పదే పదే నావైపే చూస్తున్నాడు. రణభూమిలో కర్ణునికి ఎదురు పరుగెత్తటం తగదనుకొంటున్నాను. యుద్ధభూమిలో బ్రతికియుంటే విజయమో, పరాజయమో పొందవచ్చు. హృషీకేశా! మరణిస్తే భంగపాటే కానీ గెలుపు ఎలా దక్కుతుంది ?" అర్జునుడు అలా అనగానే, గొప్ప ధీశాలి అయిన అర్జునునితో అప్పటికి తగినట్లు కృష్ణుడిలా అన్నాడు. "అర్జునా! కర్ణుడు యుధిష్ఠిరుని తీవ్రంగా గాయరిచాడు. ఆయనను చూసి, అనునయించి

ఆపై కర్ణుని చంపవచ్చు." రాజా! కృష్ణుడలా చెప్పి యుధిష్ఠిరుని చూడటానికి, కర్ణుని యుద్ధభూమిలో ఇంకా అలసటకు గురిచేయటానికి వెళ్ళిపోయాడు. ఆపై అర్జునుడు కృష్ణుని ఆదేశంతో, శరపీడితుడైన ధర్మరాజును చూడటానికి, రణభూమి నుండి వేగంగా వెళ్ళిపోయాడు. భారతా ! అర్జునుడు అశ్వత్థామతో పోరాడి, యుద్ధంలో ఇంద్రునకు కూడా అసాధ్యుడైన అశ్వత్థామను ఓడించి, ధర్మరాజును చూడాలన్న అభిలాషతో సేననంతా కలయజూశాడు. అయితే అన్న కనిపించలేదు."

65. కృష్ణార్జునులు యుధిష్ఠిరుని కడకేగుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆపై శత్రువులు ఎదిరించలేని మేటివిలుకాడైన అర్జునుడు దుష్కరమైన పరాక్రమంతో అశ్వత్థామను ఓడించి, ఆపై తనసేనను పరికించాడు. అర్జునుడు సేనకు ముందు నిలిచి, యుద్ధం చేస్తున్న శూరులకు ఆనందాన్ని కల్గిస్తూ, అంతకుముందు తగిలిన దెబ్బలతో గాయపడియున్న వారిని అభినందిస్తూ, సేనలోని తన రథికులను కుదుటపరిచాడు. అక్కడ యుధిష్ఠిరుడు కనిపించనందువల్ల, అర్జునుడు వేగంగా భీముని దగ్గరకు వెళ్ళి, ధర్మజుని సమాచారాన్ని తెలిసికోవాలని "ఇప్పుడు రాజు ఎక్కడున్నాడు" అని అడిగాడు. భీమసేనుడిలా అన్నాడు. "యుధిష్ఠిరుడు ఇక్కడనుండి వెళ్ళిపోయాడు. కర్ణుని బాణాలతో బాగా దెబ్బతిన్నాడు. ఏదో రీతిగా బ్రతికియే ఉన్నాడు". అర్జునుడిలా అన్నాడు. "అయితే కురుశ్రేష్ఠుడైన ధర్మజుని సమాచారం తెచ్చేందుకై నీవు వెంటనే ఇక్కడనుండి వెళ్ళు. కర్ణుని బాణాలతో బాగా దెబ్బతిన్న ధర్మజుడు తప్పక శిబిరానికే వెళ్ళిఉంటాడు. వేగశాలి అయిన ధర్మజుడు ద్రోణుని పదునైన బాణాలతో తీవ్రంగా గాయపడి కూడా, జయాభిలాషతో ద్రోణాచార్యుడు మరణించే దాకా రణభూమిలోనే నిలిచేవాడు. అటువంటి మహానుభావుడు – పాండవాగ్రజుడు నేడు రణభూమిలో సంశయాత్మక స్థితికి చేరాడు. కాబట్టి భీమా! వెంటనే క్షేమసమాచారం తెలిసికొనటానికి వెళ్ళు. నేను శత్రు సమూహాలను నిరోధిస్తూ ఉంటాను." భీమసేనుడిలా అన్నాడు. "అర్జునా! భరతశ్రేష్ఠుడైన ధర్మజుని ప్రవృత్తిని నీవే తెలిసికో. నేను వెళ్ళిపోతే శత్రువీరు లందరూ నన్ను పిరికివాడనుకొంటారు." అప్పుడు అర్జునుడు భీమసేనునితో "ఇప్పుడు సంశప్తకులు నాకు ఎదురు నిలిచియున్నారు. వీరిని చంపకుండా ఈ శత్రుసేనా సమూహం నుండి నేనిప్పుడు వెళ్ళలేను" అన్నాడు. అప్పుడు భీమసేనుడు "కురుప్రవీరా! నా బలంతో ఇప్పుడు రణభూమిలో సంశప్తకులనందరినీ ఎదిరిస్తాను. అర్జునా! నీవు వెళ్ళు" అని అర్జునునితో అన్నాడు.

సంజయుడిలా చెప్తున్నాడు. "నేను ఒంటరిగా అసహ్యమైన ఈ సంశప్తకసేనను ఎదిరిస్తాను" అని శత్రుమధ్యంలో భీముడు పలికినమాటను విని అర్జునుడు యుధిష్ఠిరుని చూడాలని బయలుదేరుతూ కృష్ణునితో అప్పుడిలా అన్నాడు. "హృషీకేశా! ఈ సేనా సముద్రాన్ని వీడి గుర్రాలను నడిపించు, కేశవా! ధర్మరాజును చూడా లనుకొంటున్నాను". సంజయుడిలా చెప్తున్నాడు. "అప్పుడు కృష్ణుడు గుర్రాలను అదిలిస్తూ "భీమా! ఇప్పటి నీ పరాక్రమం విచిత్రమేమీ కాదు. నేను వెళ్తున్నాను. పార్థా! శత్రుసేనలను సంహరించు" అని భీమసేనునితో అన్నాడు. రాజా! ఆపై హృషీకేశుడు గరుత్మంతుని వంటి గుర్రాలతో, వేగాతివేగంగా యుధిష్ఠిర నరపాలుడున్న చోటికి వెళ్ళాడు. అరిందముడైన భీమసేనుని శత్రుసేనలో నిలిపి, ఆ వృకోదరునికి యుద్ధానికి సంబంధించిన సందేశాన్ని ఇచ్చి, కృష్ణార్జునులు బయలుదేరి వెళ్ళి, రథం నుండి దిగి ఒంటరిగా పడుకొనియున్న ధర్మజుని పాదాలకు నమస్కరించారు. ధర్మజుడు క్షేమంగా ఉండటాన్ని చూసి, ఇంద్రుని చూసిన అశ్వినీ దేవతలవలె కృష్ణార్జునులు ఆనందించారు. ఇంద్రుడు అశ్వినీదేవతలను అభినందించినట్లు, మహాసురుడైన జంభుడు సంహరింపబడినప్పుడు ఇంద్ర విష్ణువులను బృహస్పతి అభినందించినట్లు ధర్మజుడు వారిని అభినందించాడు. ధర్మరాజు కర్ణుడు మరణించాడని భావించి, ఆనందించి, ఆనందంతో గొంతు బొంగురుపోగా ఇలా అన్నాడు. విశాలమైన ఎర్రని కళ్ళతో, ఒంటినిండా గ్రుచ్చుకొన్న బాణాలతో, నెత్తుట తడిసిన అవయవాలతో తన దగ్గరకు వచ్చిన ఆ కృష్ణార్జునులతో ధర్మజుడు ఇలా అంటున్నాడు. ఆ కృష్ణార్జునులు కలిసి రావటం చూసి ధర్మజుడు రణభూమిలో కర్ణుడు అర్జునునిచే చనిపోయాడనే భావించాడు. ఆ భావనతో మందహాస పూర్వకంగా కృష్ణుని ప్రశంసించి, మధురసాంత్వన వచనాలతో వారినిద్దరినీ అభినందించాడు.

66. కర్ణుని మరణమును గూర్చి ధర్మజుని ప్రశ్న

యుధిష్ఠిరుడిలా అంటున్నాడు. "దేవకీ కుమారా! నీకు స్వాగతం, అర్జునా! నీకు స్వాగతం కృష్ణార్జునులారా! మీ దర్శనం నాకు చాలా ప్రియంగా ఉంది. మీరు గాయపడకుండా, క్షేమంగా ఉండియే మహారథుడైన కర్ణుని సంహరించారు. కర్ణుడు రణభూమిలో విషసర్పం వంటివాడు, సర్వశాస్త్ర విశారదుడు, ధార్తరాష్ట్రులకు ముందు నిలిచేవాడు. వారికి సంపదా, రక్షణ కవచం కూడా కర్ణుడే. విలుకాండ్రు అయిన సుషేణ, వృషసేనులు అతనిని రక్షిస్తుంటారు. పరశురాముని నుండి అస్త్రవిద్యను పొందిన మహాబలుడతడు. అస్త్రవిద్యలో తిరుగులేనివాడు లోకమంతటిలో శ్రేష్ఠుడైన రథికుడు,

లోకవిఖ్యాతుడు కూడా. ధార్తరాష్ట్రులకు అతడే రక్షకుడు. సేనలకు ముందు నిలిచిపోరాడేవాడు. శత్రుసైన్యాలను సంహరించేవాడు, విరోధుల అభిమానాన్ని దెబ్బతీయగలవాడు. దుర్యోధనునికి హితాన్ని కల్గించటంలో ఆసక్తుడై, మనకు దుఃఖం కల్గించాలని ఉద్యమించినవాడు. మహా సంగ్రామంలో దేవేంద్రునితో కలిసి, దేవతలంతా వచ్చినా ఎదిరింపజాలనివాడు కర్ణుడు. తేజస్సులో అగ్నితో, బలంలో, వాయువుతో సమానమైనవాడు. పాతాళంవలె లోతైనవాడు, మిత్రులకు ఆనందాన్ని పెంచేవాడు. నామిత్రులను చంపినవాడు, అటువంటి కర్ణుని మహాసంగ్రామంలో చంపి, అదృష్టం కొద్దీ, రాక్షసులను గెలిచిన దేవతలవలె మీరు వచ్చారు. కృష్ణార్జునులారా! ప్రజల నందరినీ చంపదలచుకొన్న మృత్యువువలె, నేడు నాతో ఘోరంగా పోరాడాడు. అయినా దీనత్వానికి లోనుకాలేదు. సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడు, శిఖండి, ద్రౌపది కొడుకులు, పాంచాలురు అందరూ చూస్తుండగానే నా ధ్వజాన్ని ఖండించాడు. పార్శ్వరక్షకులనూ, గుర్రాన్నీ కూడా చంపివేశాడు. కర్ణుడు ఈ శత్రుగణాల నెన్నింటినో గెలిచి, మహాయుద్ధంలో ప్రయత్నపూర్వకంగా నన్ను ఓడించాడు. యుద్ధభూమిలో నన్ను వెంటాడి ఎక్కడికక్కడ నన్ను పరాభవిస్తూ, పరుషవచనాలనెన్నింటినో పలికాడు. అర్జునా! నేను బ్రతికియున్నానంటే భీమసేనుని ప్రభావమే. ఇక్కడ ఇన్ని మాటలెందుకు? ఆ అవమానాన్ని నేను భరించలేకపోతున్నాను.

అర్జునా! పదమూడు సంవత్సరాలపాటు నేను కర్ణు డంటేనే భయపడ్డాను. రాత్రిపూట నిద్ర కానీ, పగటి పూట సుఖంకానీ పొందలేకపోయాను. అర్జునా! కర్ణుని మీది ద్వేషంతో, ప్రతిదినమూ దహించుకొనిపోతున్నాను. మేక ఆహారం కోసం కసాయివాడి దగ్గరకు వెళ్ళినట్లు, నా చావుకోసమే నేను కర్ణుని ఎదిరించాను. కర్ణుని యుద్ధంలో ఎలా చంపగలుగుతాను ? అన్న చింతతోనే నాకు ఈ దీర్ఘకాలం కడచిపోయింది. అర్జునా! మెలకువనైనా, కలలోనైనా నేను ఎప్పుడూ కర్ణునే చూస్తున్నాను. లోకమంతా నాకు కర్ణప్రాయమైంది. అర్జునా! కర్ణునకు భయపడి ఎక్కడకు వెళ్ళినా, అక్కడ కర్ణుడే నా ఎదుట కనిపిస్తున్నాడు. అర్జునా! యుద్ధంలో వెనుకంజవేయని ఆ వీరుడే, నన్ను నా గుర్రాలతో, సారథితోపాటు ఓడించి ప్రాణాలతో విడిచిపెట్టాడు. యుద్ధభూమిలో శోభించే కర్ణుడు నన్ను ఈ రోజు హీనం చేశాడు. ఇక జీవితమెందుకు? రాజ్యమెందుకు? రణభూమిలో భీష్ముని వలన కానీ, కృప ద్రోణులవలన కానీ ఇంతకుముందెప్పుడూ, ఇంత పరాభవం జరగలేదు. ఈ రోజు మహారథుడైన ఈ సూతపుత్రుని ద్వారా సంభవించింది. అర్జునా! అటువంటి నేను ఈ రోజు నీవు క్షేమంగా కర్ణుని ఎలా చంపగలిగావని అడగవలసివచ్చింది. దాన్ని పూర్తిగా వివరంగా నాకు చెప్పు. ఆ కర్ణుడు యుద్ధంలో

ఇంద్రునివలె బలశాలి, పరాక్రమంలో యముని వంటివాడు. అస్త్రవిద్యలో పరశురాముని వంటివాడు. అతనిని ఎలా చంపగలిగావు? సర్వ యుద్ధవిశారదుడై, ధనుర్ధారులలో శ్రేష్ఠుడై, శత్రుసేనలలో ప్రధానవ్యక్తియై, మహారథుడుగా ప్రసిద్ధికెక్కినవాడు కర్ణుడు. ఆ మహాబలుని, అతని కొడుకులనూ, ధృతరాష్ట్రుడు నీ కోసమే పెంచి పోషించాడు. అటువంటి కర్ణుని నీవు ఎలా చంపావు? అర్జునా! దుర్యోధనుడు యోధులందరిలో కర్ణుని మాత్రమే రణభూమిలో నీ మృత్యువుగా భావించేవాడు. పురుషశ్రేష్ఠా! అర్జునా! అటువంటి కర్ణుని నీవు ఎలా చంపావు? కర్ణుని చంపిన వృత్తాంతాన్ని వివరంగా నాకు చెప్పు. కర్ణుడు పోరాడుతుంటే, మిత్రులందరూ చూస్తుండగానే, సింహం జింకను పట్టినట్టు కర్ణుని శిరస్సును అపహరించావా?

ఆ కర్ణుడు రణభూమిలో నీకోసమే దిక్కులలో, మూలలలో సంచరించాడు. నీ ఆచూకీ చెప్పినవారికి ఏనుగులవంటి ఎద్దులను ఆరింటి నిస్తా నన్నాడు. దురాత్ముడైన ఆ సూతపుత్రు డిప్పుడు తీక్ష్ణమైన బాణాలచే నీచే చంపబడి, రణభూమిలో నేలపై బడియున్నాడా? ఈరోజు రణభూమిలో కర్ణుని చంపి, నీవు నాకు అత్యంతమూ ప్రియమైన పని చేశావు. నిత్యమూ గౌరవాన్ని పొంది, గర్వించిన ఆ సూతపుత్రుడు నీ కోసం అన్నివైపులా దాడిచేశాడు. తనను శూరునిగా భావించుకొనే ఆ కర్ణునితో పోరాడి, రణభూమిలో అతనిని సంహరించావా? నాయనా! రణభూమిలో నీ ఆచూకీ చెప్పినవారికి ఏనుగులతో, గుర్రాలతో కూడిన గొప్ప బంగారు రథాన్ని ఇస్తానని ఆశపెట్టాడు. ఆ పాపాత్ముడు ఎప్పుడూ యుద్ధంలో నీతో పోటీపడుతుంటాడు? రణభూమిలో అతనిని చంపి వేశావు గదా! కర్ణుడు ఎప్పుడూ శౌర్యమదంతో పొగరు పట్టి ఉంటాడు. కౌరవసభలో ప్రగల్భాలు పలుకుతుంటాడు. ఆ సుయోధనుడికి చాలా ఇష్టమైనవాడు, ఆ పాపాత్ముని ఈ రోజు నీవు చంపివేశావు గదా! యుద్ధంలో నీతో పోటిపడి, నీ ద్వారా వింటినుండి వెలువడి, గగనచారులయిన ఎర్రటి బాణాల ద్వారా శరీరమంతా బ్రద్దలు కాగా ఆ పాపి నేలబడిఉన్నాడా? దుర్యోధనుని బాహువులను బ్రద్దలు చేశావా? రాజులసమక్షంలో ఎప్పుడూ దుర్యోధనునికి ఆనందం కల్గించాలని గర్వంతో, వ్యామోహంతో "అర్జునుని నేనే చంపుతాను" అని తనను తాను గొప్పగా భావించుకొంటాడు. ఆ మాట నేడు వ్యర్థమైపోయింది గదా! అర్జునుడు జీవించినంతకాలం నేను ఎప్పుడూ ఇతరులపైకి కాలుదువ్వనని, ఒక శాశ్వత వ్రతాన్ని చేపట్టిన అల్పబుద్ధి కర్ణుడు. ఇంద్రసుతా! ఆ కర్ణుని నీ వీ రోజు చంపివేశావు గదా! దుష్టబుద్ధి అయిన ఆ కర్ణుడు కురువీరుల మధ్యలో సభలో "కృష్ణా! పరమ దుర్బలులు, పతితులు, సత్యహీనులు అయిన పాండవులను నీవు వదలవా?" అని ద్రౌపదితో పలికాడు. 'కృష్ణునితో సహా అర్జునుని చంపి, కానీ నేను వెనుకకు తిరిగిరా

నని ప్రతిజ్ఞ చేసిన పాపబుద్ధి ఆ కర్ణుడు, బాణాలతో శరీరం బ్రద్దలు కాగా నేలగూలిఉన్నాడు గదా! ఈనాటి యుద్ధంలో సృంజయకౌరవుల మధ్య జరిగిన సంగ్రామసమాచారం నీకు తెలిసినదే కదా! ఆ సమయంలోనే నాకీ దుర్దశ సంభవించింది. ఆ దుర్మార్గుడు నేడు నీచే చంపబడ్డాడు గదా! సవ్యసాచీ! నీవు రణభూమిలో గాండీవంనుండి వెలువడి ప్రజ్వలించే బాణాలతో మందమతి అయిన ఆ కర్ణుని కుండలాలతో శోభిస్తున్న తలను శరీరం నుండి నరికివేశావు గదా! వీరుడా! నేను బాణాలచే గాయపడినప్పుడు, కర్ణుని వధించటానికై నిన్నే తలచుకొన్నాను. నీవు కర్ణుని పడగొట్టి, నా ఆ ధ్యానాన్ని ఈ రోజు సఫలం చేశావు గదా! ఆ సుయోధనుడు కర్ణుని ఆశ్రయించి, మనవైపు గర్వంతో చూస్తుంటాడు. నీవు ఈనాడు పరాక్రమించి, ఆ సుయోధనుని ఆశ్రయాన్ని భంగపరిచావు గదా!

అసహనశీలుడైన ఆ కర్ణుడు గతంలో కొలువు కూటంలో కౌరవుల సమక్షంలో మనలను పుచ్చిన నువ్వులు (నపుంసకులు) అన్నాడు. ఆ దుర్మతిని - సూతపుత్రుని ఈరోజు రణభూమిలో చంపివేశావు గదా! దురాత్ముడైన ఈ సూతపుత్రుడే గతంలో నవ్వుతూ "శకుని ద్వారా గెలుచుకొన్న ద్రౌపదిని కూడా స్వయంగా బలాత్కారంగా ఇక్కడకు తీసికొనిరా!" అని దుశ్శాసనునితో అన్నాడు. ఆ కర్ణుని నేడు నీవు చంపావు గదా! భూమండలంలో శస్త్రధారులందరిలో శ్రేష్ఠుడు భీష్ముడు. అల్పబుద్ధి అయిన కర్ణుడు తనను అర్ధరథుడు అన్నాడని ఆయనను కూడా ఆక్షేపించాడు. ఆ సూతపుత్రుని నేడు నీవు చంపావు గదా! అర్జునా! నా హృదయంలో పుట్టిన అమర్షాగ్ని కర్ణుని వంచనమనే గాలిచే ప్రేరితమై నిత్యమూ మండుతోంది. "ఈరోజు యుద్ధంలో నేను ఆ కర్ణుని చంపివేశా"నన్న మాట చెప్పి దాన్ని శమింపజేయాలి. వీరా! ఇది నాకెంతో దుర్లభమైన సమాచారం. ఆ సూతపుత్రుని ఎలా చంపావు? వృత్రుని మరణం తర్వాత ఇంద్రునిఫలె నిన్ను ఎప్పుడూ తలచుకొంటూ ఉంటాను."

67. అర్జునవాక్యము

సంజయుడిలా చెప్తున్నాడు. "క్రోధంతో నిండియున్న ఆ ధర్మరాజు మాటలు విని, అర్జునుడు ఇలా అన్నాడు. "రాజా! ఈరోజు నేను సంశప్తకులతో పోరాడుతుంటే, కౌరవసేనలకు ముందు నిలిచిన అశ్వత్థామ విషసర్పాల వంటి బాణాలను విడుస్తూ వేగంగా ఎదుట నిలిచాడు. ఇటు కౌరవసేన అంతా మేఘధ్వని వంటి నా రథ ఘోషను విని, యుద్ధానికై ఎదురు వచ్చింది. పాండవాగ్రగణ్యా! వారిలో అయిదువందల మందిని

చంపి నేను అశ్వత్థామపై పరాక్రమించాను. మహారాజా! ఆ అశ్వత్థామ సంసిద్ధుడై, ఏనుగు సింహం మీదకు వచ్చినట్టు నాపై దాడిచేశాడు. సంహరణకు గురి అవుతున్న కౌరవ రథికులను ఉద్ధరించాలని కూడా భావించాడు. ఆపై కౌరవశ్రేష్ఠుడైన అశ్వత్థామ రణభూమిలో నిశ్చలంగా నిలిచి, విషంతో, అగ్నితో సమానమైన పదునైన బాణాలతో నన్నూ, జనార్దనునీ కూడా పీడించాడు. అశ్వత్థామ యుద్ధంచేసే సమయంలో ఎనిమిది ఎడ్లబండ్లు వందలకొలది బాణాలను మోసుకొని వస్తున్నాయి. ఆ అశ్వత్థామ ప్రయోగించిన బాణాలను నేను నా బాణాలతో, గాలి మేఘసమూహాన్ని చెదరగొట్టినట్టు నశింపజేశాను. ఆపై అశ్వత్థామ వర్షాకాలంలో నల్లనిమేఘం, జలధారలను కురిపించినట్లు శిక్షణ, అస్త్రాలు, బలం, ప్రయత్నం కలగలిపి, వింటిని చెవిదాకా లాగి, అనేక బాణసమూహాలను కురిపించాడు. ఆ అశ్వత్థామ రణరంగమంతా తిరుగుతున్నాడు. బాణాన్ని ఎప్పుడు తీసికొంటున్నాడో, ఎప్పుడు అనుసంధిస్తున్నాడో, ఏ చేతితో విడుస్తున్నాడో, కుడిచేతితోనో, ఎడమచేతితోనో ఏమీ తెలియటం లేదు. కేవలం మండలాకృతితో ఉన్న అశ్వత్థామ విల్లు మాత్రమే కనిపిస్తోంది. ఆ అశ్వత్థామ పదునైన బాణాలు అయిదింటితో నన్ను, మరో అయిదింటితో కృష్ణుని గాయపరిచాడు. నేను రెప్పపాటు కాలంలో వజ్రసమానమైన ముప్పయి బాణాలతో అశ్వత్థామను గాయపరిచాను. నేను విడిచిన బాణాలు ఒళ్ళంతా గ్రుచ్చుకొని అశ్వత్థామ క్షణకాలంలో ముండ్లపందివలె కనిపించాడు. ఆ అశ్వత్థామ శరీరమంతా నెత్తురోడుతూ, నన్ను ఎదిరించిన సైనికుల శరీరాలన్నీ నెత్తుటితో తడిసి ఉండటం చూస్తూ కర్ణుని రథసేనలో ప్రవేశించాడు.

ఆ తరువాత రణభూమిలో తనసేన భయపడి ఉండటం, గుర్రాలు, ఏనుగులు పారిపోవటం గమనించి, కర్ణుడు ఏభైమంది రథికశ్రేష్ఠులతో కలిసి త్వరపడుతూ నాపైకి వచ్చాడు. అతడు శత్రువులను మథించగలవాడు. వారినందరినీ చంపి, నేను కర్ణుని వీడి, నిన్ను చూడాలని వేగంగా వచ్చాను. సింహాన్ని చూసి చెదరిపోయే గోవులవలె, పంచాలురందరూ కర్ణుని చూసి ఉద్వేగానికి లోనవుతున్నారు. తెరిచియున్న మృత్యువు నోరువలె ఉన్న కర్ణుని ప్రభద్రకులు సమీపించారు. ఇబ్బందులు పడ్డారు. రణసాగరంలో మునిగిన ఆ ఏడు వందలమంది రథికులను, కర్ణుడు మృత్యు సదనానికి పంపించాడు. రాజా! మమ్మల్ని చూసేదాకా ఆ సూతపుత్రునిలో ఉద్వేగం లేదు. కానీ కర్ణుడు నీపై దృష్టిపెట్టాడని, యుద్ధం కూడా జరిగిందని, అంతకుముందే అశ్వత్థామ నిన్ను గాయపరిచాడనీ విని, క్రూరకర్ముడైన కర్ణుని ఎదుట నుండి నీ దగ్గరకు రావటమే తగినపనిగా నేను భావించాను. నేను రణభూమిలో నీ ఎదుట కర్ణుని విచిత్రాస్త్రాన్ని చూశాను. ఈనాడు మహారథుడైన కర్ణుని ఎదిరించి నిలవగలవాడు సృంజయులలో ఒక్కడూ లేడు. రాజా!

సాత్యకి ధృష్టద్యుమ్నులు నా చక్రరక్షకులు కావాలి. రాజపుత్రులు, శూరులైన యుధామన్యుడు, ఉత్తమౌజుడు నన్ను వెనుకనుండి రక్షించాలి. శత్రుసేనలోని రథికశ్రేష్ఠ లందరితో కలిసి దుర్జయుడైన సూతపుత్రుడు ఈ సంగ్రామంలో నేడు నాకు కనిపిస్తే, వజ్రధారి అయిన ఇంద్రుడు వృత్రునితో యుద్ధం చేసినట్లు వారితో యుద్ధం చేస్తాను. వచ్చి చూడు! ఈ రోజు విజయంకోసం కర్ణునితో చేసే పోరాటాన్ని చూడు. ప్రభద్రకులు మహాసర్పం నోట చిక్కువడుతున్నట్లు, కర్ణుని మీద దాడిచేస్తున్నారు. ఆరువేల మంది రాజపుత్రులు స్వర్గలోకం కోసం రణమగ్నులై ఉన్నారు. రాజసింహా! ఈ రోజు యుద్ధం చేస్తున్న కర్ణుని బలపూర్వకంగా, సబాంధవంగా చంపకపోతే ప్రతిజ్ఞ చేసి నెరవేర్చని వారు వెళ్ళే దుఃఖలోకాలకు నేను కూడా వెళతాను. నరేంద్రసింహా! నిన్ను వీడి వెళ్తున్నాను. యుద్ధంలో నాకు జయం కలగాలని దీవించు. అక్కడ ధార్తరాష్ట్రులు భీముని కబళిస్తున్నారు. కర్ణుని ఆలాగే సైన్యాన్ని, శత్రుగణాల నందరినీ సంహరిస్తాను."

68. యుధిష్ఠిరుని క్రోధవచనములు.

సంజయుడిలా చెప్తున్నాడు. "కర్ణబాణాల పీడనకు గురి అయి యుధిష్ఠిరనరపాలుడు, (అర్జునుని మాటల ద్వారా) కర్ణుడు క్షేమంగానే ఉన్నాడని విని, కోపంతో అర్జునునితో ఇలా అన్నాడు. "నాయనా! నీ సేన పారిపోయింది. తగని రీతిగా నేడు తిరస్కారానికి గురి అయింది. ఆపై నీవు కర్ణుని చంపటం చేతకాక పిరికివాడివై, భీముని అక్కడే విడిచి వచ్చావు. కుంతి కడుపున పుట్టికూడా, సోదరుడైన భీముని విషయంలో, తగని రీతిలో స్నేహాన్ని ప్రదర్శించావు. కర్ణుని చంపటం చేతకాక, భీముని రణరంగంలో వీడివచ్చావు. ద్వైతవనంలో ఉన్నప్పుడు "ఒకే రథంతో వెళ్ళి కర్ణుని చంపుతాను" అని ప్రతిజ్ఞ చేసి ఇప్పుడు కర్ణుడికి భయపడి, భీమసేనుని వీడి, ప్రతిజ్ఞను కూడా వదలి వెనుకంజవేసి వచ్చావు. అర్జునా! ద్వైతవనంలోనే "రాజా! నేను కర్ణునితో యుద్ధం చేయలే"నని చెప్పిఉంటే అప్పుడే మేమందరం ఆ సమయానికి తగినట్లు ఆలోచించి కర్తవ్యనిర్ణయం చేసే వాళ్ళం. వీరా! అతనిని చంపుతానని ప్రతిజ్ఞ చేసి దానిని పాటించలేకపోయావు. అదే నీవు చేయదలిస్తే మమ్ములను శత్రువుల మధ్యకు తెచ్చి, శిలావేదికపై నిలిపి ఎందుకు ఇబ్బంది పెట్టావు. రాజకుమారా! మేము మాకు ఇష్టమూ, శుభకరమూ అయిన ఎంతో ఫలితాన్ని పొందాలని నీపై ఆశపెట్టుకొన్నాం. అదంతా విఫలమైంది. ఫలాలు కోరేవారికి, పూలు ఎక్కువై, పండ్లులేని చెట్టు తారసపడినట్లయింది. నేను రాజ్యాన్ని కోరుతున్నాను. కానీ నీవు మాంసంతో కప్పబడిన బడిశంవలె, భోజన పదార్థాలతో కప్పబడిన విషంవలె,

రాజ్యరూపంలో ఉన్న వినాశనాన్ని చూపించావు. ఈ పదమూడూ సంవత్సరాలు మేమెప్పుడూ నీమీదనే ఆశలుంచి జీవించాం. విత్తినగింజ అదనులో మేఘంకోసం ఎదురు చూసినట్లు బ్రతికి నిలిచాం. కానీ నీవు మమ్ములనందరినీ నరకంలో (కష్టాలలో) ముంచావు.

మందమతీ! నీవు పుట్టి ఏడు రోజులు కాకముందే 'ఆకాశవాణి కుంతితో ఇలా అన్నది - ఈ కుమారుడు ఇంద్రునివంటి పరాక్రమశాలి. శూరులైన శత్రువుల నందరినీ గెలవగలడు. మహాశక్తి సంపన్నుడైన ఇతడు ఖాండవ వనంలో దేవతాగణాలను, సర్వప్రాణులను గెలువగలడు. మద్ర, కళింగ, కేకయులను ఓడించి రాజసమక్షంలో కౌరవులను చంపగలడు. ఇతనిని మించిన విలుకాడు ఉండడు. ఇతనిని ఏ ప్రాణీ జయించలేడు. అన్ని విద్యలలో ఆరితేరి, సంకల్పమాత్రంతో సర్వభూతాలనూ అదుపుచేయగల జితేంద్రియు డితడు. చంద్రునికాంతితో, వాయువేగంతో, మేరు పర్వతంవలె స్థైర్యంతో, భూమివలె ఓర్పుతో, సూర్యతేజస్సుతో, కుబేర సంపదతో, ఇంద్ర పరాక్రమంతో, విష్ణుబలంతో (ఇతడు సమానుడు). కుంతి! శత్రుసూదనుడైన ఈ కొడుకు అదితికి, విష్ణుమూర్తి జనించినట్లు నీకు పుట్టాడు. అమిత బలశాలియై, తనవారి గెలుపుకోసం, శత్రుసంహారం కోసం ప్రసిద్ధికెక్కి వంశపరంపరను కొనసాగింపగలడు". అని శతశృంగ పర్వతంపై తాపసు లందరూ వింటుండగా అశరీరవాణి పలికింది. కానీ అది అలా జరగలేదు. నిజమే! దేవతలు కూడా అసత్యాలు పలుకుతారు. అలాగే ఇతర మునిపుంగవులు కూడా నిన్ను ప్రశంసిస్తూ, ఎప్పుడూ ఇలాగే మాటాడేవారు. అది విని దుర్యోధనుని ఎదుట ఎప్పుడూ తలదించలేదు. నీవు కర్ణుడికి భయపడతావని అనుకోలేదు. సుయోధనుడు ముందే చెప్పాడు. మహాబలుడైన కర్ణుని ఎదుట రణభూమిలో అర్జునుడు నిలువలే డని. కానీ మూర్ఖత్వంతో వేనే దానిని అర్థంచేసికొనలేదు. అందువలననే ఈరోజు బాధపడవలసి వస్తోంది. శత్రువర్గంలో హద్దులేని నరకంలో పడవలసివచ్చింది. అర్జునా! నేను కర్ణునితో పోటీపడలేనని నాకు అప్పుడే చెప్పిఉండవలసింది. దానితో నేను సృంజయులు, కేకయుల వంటి మిత్రులను యుద్ధానికై తెచ్చుకొని ఉండేవాడిని. ఈ స్థితిలో ఇప్పుడు నేనేమి చేయగలను? సూతపుత్రునితో, సుయోధనరాజుతో, నాతో పోరాడాలని గుమిగూడి ఉన్న ఇతరరాజులతో ఎలా పోరాడి నెగ్గుకొని రాగలను?

కృష్ణా! కౌరవులు, మిత్రుల మధ్యలో యుద్ధానికి వచ్చిన ఇతర రాజుల సమక్షంలో నేను ఈనాడు కర్ణునికి వశమయ్యాను. ఛీ, ఎందుకు నాకీ జీవితం.

ఈ రోజు భీమసేనుడొక్కడే నాకు దిక్కు. మహాభీకర సంగ్రామంలో తానే నన్ను కాపాడాడు. నన్ను విడిపించటంతోపాటు, కోపంతో తీక్ష్ణబాణంతో కర్ణుని చీల్చిపడవేశాడు. భీమసేనుడు

గదను చేతబట్టి, నెత్తురోడుతూ, రణభూమిలో ప్రళయ కాలయమునివలె సంచరిస్తూ, ప్రాణాలను కూడా లెక్కచేయకుండా, కౌరవులతో యుద్ధం చేశాడు. భీముని ఆ సింహనాదాన్ని ధార్తరాష్ట్రులు పదేపదే వింటున్నారు.

అర్జునా! రథికశ్రేష్ఠుడు, నీ కొడుకు – అభిమన్యుడు బ్రతికి ఉంటే తాను శత్రువులను చంపగలిగేవాడు. నేను పరాభవానికి లోనయ్యేవాడిని కాదు. ఘటోత్కచుడు బ్రతికి ఉన్నా సరే నేను రణభూమిలో వెనుకంజ వేయవలసి వచ్చేది కాదు.

భీముని కొడుకు ఘటోత్కచుడు యుద్ధంలో ముందుండేవాడు, మహాస్త్రవేత్త, నీకు తగినవాడు. తానే ఉంటే మన శత్రుసేన ఎంత ప్రయత్నించినా సఫలం కాలేదు. వైవెచ్చ భయవ్యాకులమై కళ్ళు మూసికొంటుంది. ఆ ఘటోత్కచుడు ఒంటరిగా రాత్రివేళ యుద్ధం చేశాడు. అతన్ని చూసి భయపడి శత్రువులు పారిపోయారు. ఆ మహానుభావుడు రణభూమిలో కర్ణుని సమీపించి బాణగణాలతో మోహింపజేశాడు. కానీ కర్ణుడు ధైర్యంగా నిలిచి ఇంద్రుడిచ్చిన శక్తితో ఆ ఘటోత్కచుని సంహరించాడు.

ఈ రణభూమిలో నా దురదృష్టం, పురాకృత పాపం ప్రబలంగా కనిపిస్తోంది. దురాత్ముడైన ఆ కర్ణుడు రణభూమిలో నిన్ను తృణీకరించి నన్ను పరాభవించాడు. శక్తిహీనునితోనో, బంధుహీనునితోనో ప్రవర్తించినట్లు నాతో ప్రవర్తించాడు. ఆపదలో నున్నవానిని విడిపించినవాడే బంధువు, స్నేహితుడు, మంచిమనసున్నవాడూ అని ప్రాచీన మహర్షులు చెప్తుంటారు. సజ్జనులు పాటించిన ధర్మ మదే. పార్థా! నీ రథాన్ని విశ్వకర్మ తయారుచేశాడు. నిశ్శబ్దంగా సాగిపోగల దది. కపిధ్వజంతో, శుభలక్షణాలతో నున్న ఆ రథాన్ని ఎక్కి, బంగారు తొడుగుగల కత్తిని చేతబట్టి, తాటి చెట్టంత ఎత్తైన గాండీవాన్ని కూడా చేపట్టి, కృష్ణుడు రథాన్ని నడుపుతుంటే కర్ణునికి భయపడి నీవు ఎలా పారిపోయావు? ఆ వింటిని కృష్ణునికి ఇవ్వు. నీవు కృష్ణ రథసారథివి కమ్ము. అప్పుడు వజ్రధారి అయిన ఇంద్రుడు వృత్రుని చంపినట్లు, కృష్ణుడే ఆ భీకరవీరుని – కర్ణుని చంపుతాడు. ఉగ్రంగా సంచరిస్తున్న కర్ణుని ఎదిరించటానికి ఈరోజు శక్తిలేకపోతే అస్త్రవిద్యలో నీకన్నా మేటి అయిన ఏ రాజుకో నీ గాండీవాన్ని ఇచ్చివేయి. పాండునందనా! అప్పుడయినా ఈ లోకం పుత్రులను, ఇల్లాండ్రను కోల్పోయి, రాజ్యం నశించగా, సుఖభ్రష్టులమై అగాధంలోనో, పాపులకు నివాసమైన నరకంవంటి కష్టాలలోనో పడుతున్న మమ్ము చూడకుండా ఉంటుంది. దురాత్మా! నీవు అయిదవ నెలలోనే కుంతిగర్భం నుండి పడిపోయి ఉన్నా, అసలు కుంతికి కష్టదాయకమైన ఈ గర్భంలోనే పడకపోయినా నీకు మంచిదై ఉండేది. అప్పుడు ఇలా రణభూమి నుండి పారిపోయే స్థితి వచ్చేది కాదు. నీ గాండీవం, నీ బాహుబలం, లెక్కలేని నీ బాణగణాలు, నీ కపిధ్వజం, అగ్ని ఇచ్చిన నీ రథం ఛీ, ఛీ! అన్నీ దండగ"

69. కృష్ణార్జున సంవాదము.

సంజయుడిలా చెప్తున్నాడు. "యుధిష్ఠిరుడలా అనగానే శ్వేతవాహనుడైన అర్జునుడు భరతశ్రేష్ఠుడైన యుధిష్ఠిరుని చంపాలని, తీవ్రకోపంతో కత్తిపట్టాడు. అర్జునుని కోపాన్ని గమనించి పరుల మనస్సుల నర్థంచేసుకోగల కృష్ణుడు, అర్జునునితో ఇలా అన్నాడు "అర్జునా! ఏమిటిది? కత్తిపట్టావు. అర్జునా! ఇప్పుడు నీవు ఎవరితోనూ పోరాడ నవసరంలేదే! ధీమంతుడైన భీమసేనుడు ధార్తరాష్ట్రుల నందరినీ కబళించాడు. అర్జునా! ధర్మరాజును చూడాలని రణభూమిని వీడివచ్చావు. ఆయనను చూశావు. యుధిష్ఠిరుడు క్షేమంగానే ఉన్నాడు. పులివలె పరాక్రమశాలి అయిన యుధిష్ఠిరుని చూసి, ఆనందించవలసిన ఈ సమయంలో ఈ మోహచేష్ట ఏమిటి? అర్జునా! ఇప్పుడు నీవు చంపదగిన వాడెవ్వడూ నాకు కనిపించటం లేదు. మరి ఎవరిని కొట్టదలచుకొన్నావు ? ఏమిటీ చిత్తభ్రమ? ఇంతవేగంగా ఈ మహాఖడ్గాన్ని ఎందుకు చేతపట్టావు? అర్జునా! నిన్నే అడుగుతున్నాను. నీవు ఏం చేయదలచుకొన్నావు ? అద్భుత విక్రమా! కోపంతో కత్తినెందుకు సవరిస్తున్నావు?" కృష్ణుడలా అనగానే అర్జునుడు యుధిష్ఠిరుని చూస్తూ, కోపించిన పాములా బుసకొడుతూ కృష్ణునితో ఇలా అన్నాడు. 'గాండీవాన్ని ఇతరులకిమ్మని నన్ను ఎవరు రెచ్చగొట్టినా అతని తలను బ్రద్దలు కొడతానని నా మనస్సులోని వ్రతం. గోవిందా! ఇప్పుడు నీ సమక్షంలోనే యుధిష్ఠిరుడు ఆ మాట అన్నాడు. దానిని క్షమించలేను. కాబట్టి ధర్మానికి భయపడే ఈ ధర్మరాజును సంహరిస్తాను. ఈ నరశ్రేష్ఠుని చంపి, నా ప్రతిజ్ఞను నిలుపుకొంటాను. అందుకే కత్తిని చేపట్టాను. జనార్దనా! సత్యానికి బాకీ పడియున్న నేను ఈ యుధిష్ఠిరుని చంపి, శోకతాపాలను పోగొట్టుకొంటాను. ఈ సమయంలో నీవు తగినపనిగా దేనిని భావిస్తున్నావు ? ఈ లోకానికి సంబంధించి భూతభవిష్యత్తులన్నీ నీవెరుగుదువు. నీవు చేయమన్నది చేస్తాను".

సంజయుడిలా చెప్తున్నాడు. "ఛీ! ఛీ!" అంటూ కృష్ణుడు మరల అర్జునునితో ఇలా అన్నాడు. "పార్థా! ఇప్పుడు అర్థమవుతోంది. నీవు వృద్ధసేవ చేయలేదు. పురుషశ్రేష్ఠా! తగని వేళలో నీవు కోపానికి లోనయ్యావు. అర్జునా! ధర్మానికి భయపడి, అపండితుడవై నీవిప్పుడు ప్రవర్తించిన రీతిగా ధర్మా ధర్మాలు తెలిసినవాడెవ్వడూ ప్రవర్తించడు. అర్జునా! చేయదగనివాటిని చేస్తూ, చేయవలసిన వానిని చేయనివాడు పురుషాధముడు. ధర్మమార్గాన్ని అవలంబిస్తూ, శిష్యుల ఉపాసనల నంది, వారికి ధర్మోపదేశం చేసేవారు ధర్మస్వరూపాన్ని సంక్షేపంగా విస్తారంగా గ్రహించగలవారు. వారు ఈ విషయంలో ఏం నిర్ణయిస్తారో నీకు తెలియదు. పార్థా! కర్తవ్య కర్తవ్య నిర్ణయంలో నిశ్చయజ్ఞానం లేనివాడు అసమర్థుడై,

మూఢుడై నీవలె మోహానికి గురి అవుతాడు. కర్తవ్య కర్తవ్య నిర్ణయం అంత తేలికగా అర్థమయ్యేది కాదు. అదంతా శాస్త్రంద్వారా తెలిసికోవాలి. ఆ శాస్త్రం నీకు తెలియదు. అర్జునా! అజ్ఞానానికి లోనయి, నిన్ను ధర్మవేత్తనుగా భావించుకొని ధర్మరక్షణ చేస్తానంటున్నావు. కానీ ప్రాణి హింసఅనే పాపం దానిలో ఉంది. నీవంటి ధార్మికుడికి కూడా అది తెలియటం లేదు. నాయనా! **ప్రాణిహింస చేయకుండటమే ధర్మాలలో మిన్న అని నా అభిప్రాయం.** ప్రాణరక్షణకై అసత్యం చెప్పినా చెప్పవచ్చు. కానీ ప్రాణిహింస ఏ రీతిగానూ తగదు. నరోత్తమా! నీవు మామూలు మనిషివలె ధర్మవేత్త అయిన పెద్దన్నను చంపటానికి ఎలా సిద్ధపడుతున్నావు? మానదా! ఎదురునిలిచి పోరాడని వానిని, శత్రువు కాని వానిని, యుద్ధవిముఖుడై పారిపోయేవాడిని, శరణుకోరినవానినీ, ఆశ్రయించి చేతులు జోడించిన వానినీ, ప్రమత్తునీ సంహరించటాన్ని సజ్జనులు అంగీకరించరు. మీ అన్నలో ఆ లక్షణాలన్నీ సరిపోలుతాయి. పార్థా! గతంలో ఎప్పుడో బాలునివలె ఏదో ప్రతిజ్ఞ చేశావు. దాని కారణంగా మూర్ఖత్వంతో అధర్మకార్యానికి ఒడిగడుతున్నావు. పార్థా! దురవగాహమైన ధర్మసూక్ష్మగమనాన్ని గ్రహించకుండానే, నీవు అన్నను చంపివేస్తానని పరుగులు పెడుతున్నావు. పాండుకుమారా! ధర్మరహస్యాన్ని చెపుతాను విను. ధనంజయా! భీష్ముడు కానీ, యుధిష్ఠిరుడు కానీ, విదురుడు కానీ, యశస్వినీ అయిన కుంతి కానీ నీకు ఉపదేశించగల తత్త్వాన్నే నేను కూడా చెపుతాను. సావధానంగా విను.

సత్యం పలకటం మంచిదే. సత్యాన్ని మించినది ఏదీ లేదు. కానీ సజ్జనులు ఆచరించే సత్య స్వరూపాన్ని ఉన్నదున్నట్టు గ్రహించటం అంత తేలిక కాదు. అసత్య కథనం సత్యసమానమైన ఫలితాల నివ్వగలిగినా, సత్యకథనం అసత్యపరిణామాలకు దారితీయగలిగినా అక్కడ సత్యం చెప్పకూడదు. అసత్యాన్నే చెప్పాలి. వివాహవేళలో, స్త్రీ ప్రస్తావనలో, ప్రాణాపాయ సమయంలో, ధనాన్ని కోల్పోయే సమయంలో, విప్రరక్షణకోసం, అసత్యం చెప్పవచ్చు. ఈ అయిదు సందర్భాలలో అసత్య కథనం పాపకారణం కాదు. ఎవరైనా, సర్వస్వాన్నీ కోల్పోయే పరిస్థితిలో అసత్యాన్నే చెప్పాలి. అక్కడ అసత్యం సత్యమవుతుంది. సత్యం, అసత్యమవుతుంది. అటువంటి దానిని అజ్ఞాని వ్యవహారదశలో ఆచరణలో నున్న సత్యంగా మాత్రమే గ్రహిస్తాడు. కేవలం అనుష్ఠానంలో కనిపించే అసత్యరూపమైన సత్యాన్ని చెప్పకూడదు. ముందు సత్యాసత్యనిర్ణయం చేసి, ఆ తర్వాతనే సత్యపాలన చేయాలి. అలా చేసినవాడే ధర్మవేత్త. నిష్కామబుద్ధి గలవాడు పరమదారుణంగా ప్రవర్తించినా, అంధప్రాణులను చంపిన బలాకుడు పుణ్యాన్ని పొందినట్లుగా, మహాపుణ్యాన్నే

పొందగలడు. అది ఆశ్చర్యకరమేమీ కాదు. ధర్మాన్ని అభిలషిస్తూ కూడా మూర్ఖుడై, అజ్ఞానియై ప్రవర్తిస్తే, నదీ సంగమస్థానంలో నివసిస్తూ కౌశికుడు అజ్ఞానంతో ధర్మాన్ని ఆచరించి కూడా పాపాన్నే పొందినట్లు మహాపాపాన్ని పొందుతాడు".

అర్జునుడిలా అడుగుతున్నాడు. "భగవాన్! బలాకుని గురించి, నదీ సంగమంలోని కౌశికుని గురించి వివరంగా చెప్పు. తెలిసికొంటాను". వాసుదేవుడిలా చెప్తున్నాడు. "భారతా! ఒకప్పుడు బలాకుడనే వ్యాధుడుండే వాడు. అతడు భార్యాపుత్రులను పోషించటానికై వేటాడేవాడు. కోరికతో కాదు. నిత్యమూ సత్యవచనుడై, అసూయారహితుడై వృద్ధులైన తల్లిదండ్రులనూ, ఆశ్రితులయిన ఇతరులను సేవిస్తూ స్వధర్మాసక్తుడై యుంటాడు. అతడొకనాడు మృగానికై వేటాడుతూ ఒక్క మృగాన్ని కూడా పొందలేకపోయాడు. అంతలో నీళ్ళు త్రాగుతున్న ఒక క్రూర జంతువును చూశాడు. అది గ్రుడ్డిది. అటువంటి జంతువును ఆ వ్యాధుడు అంతకుముందెప్పుడూ చూడలేదు. ఆ గ్రుడ్డి జంతువు చనిపోగానే ఆకాశం నుండి పుష్పవృష్టి కురిసింది. దానితోపాటు ఆ క్రూర జంతువును చంపిన వ్యాధుని తీసుకొనిపోయేందుకు, అచ్చరల గీతాలతో, వాద్య విశేషాలతో సహా అందమైన విమానం స్వర్గం నుండి వచ్చింది. అర్జునా! ఆ క్రూరజంతువు గతంలో తపస్సు చేసి సర్వప్రాణులను సంహరించే వరాన్ని పొందింది. అందుకని బ్రహ్మ దానిని గ్రుడ్డిదానిని చేశాడు. సర్వప్రాణులనూ లేకుండా చేయాలని నిశ్చయించుకొన్న ఆ క్రూర జంతువును చంపి, బలాకుడు స్వర్గానికి వెళ్ళగలిగాడు. కాబట్టి ధర్మస్వరూపం తెలియటం కష్టం. అలాగే కౌశికు డనే విప్రుడుండేవాడు. ఆయన తపస్వి, పండితుడు కూడా. గ్రామానికి దగ్గరలో నదీసంగమ స్థానంలో నివసించేవాడు. అర్జునా! ఎప్పుడూ సత్యాన్నే పలకాలన్నది ఆయన వ్రతం. అందువలన ఆరోజుల్లో ఆయన సత్యవాది అని ప్రసిద్ధి. అప్పుడు దొంగలభయంతో కొందరు ఆ వనంలో ప్రవేశించారు. దొంగలు కోపంతో అక్కడ కూడా ప్రయత్న పూర్వకంగా వెదకసాగారు. ఆపై వారు సత్యవాది అయిన కౌశికుని దగ్గరకు వచ్చి. ఇలా అడిగారు. "స్వామీ! చాలామంది జనాలు ఏ దారిన వెళ్ళారు? సత్య ప్రమాణంగా అడుగుతున్నాను. వారిని గురించి తెలిస్తే చెప్పు". వారలా అడగగానే కౌశికుడు సత్య వచనాన్ని పలికాడు. "అనేక వృక్షాలతో, తీగలతో, పొదలతో కూడిన ఈ వనాన్ని ఆశ్రయించారు" అంటూ కౌశికుడు వారికి వాస్తవాన్ని తెలియజేశాడు. ఆపై క్రూరులైన ఆ దొంగలు వారిని పట్టి చంపారని వింటున్నాం. ధర్మసూక్ష్మాలు తెలియని ఆ కౌశికుడు ఆ దుర్వచనం కారణంగా పెద్ద అధర్మానికి పాల్పడి, కష్టమైన నరకానికి వెళ్ళాడు.

అల్పజ్ఞుడైన మూఢుడు ధర్మాధర్మ విశ్లేషణ కుదరక, పెద్దలతో సలహాపడక, నరక సమానమైన పెద్ద కష్టాలు కొని తెచ్చుకొంటాడు. ధర్మా ధర్మ నిర్ణయానికి లక్షణం చెప్పాలంటే ఇది ఇలా ఉంటుంది. కొందరు దుష్కరమైన ఆ పరమజ్ఞానాన్ని తర్కం ద్వారా పొందుతారు. కానీ ఒకే రీతిగా ఆలోచించే అనేకులు వేదాలద్వారానే ధర్మాన్ని గ్రహించా లంటారు. ఈ విషయంలో నాకు దేనిమీదా అసూయలేదు. కేవలం వేదం ద్వారా సర్వధర్మకర్మలు విధింపబడవు. ప్రాణుల అభ్యుదయం కోసమే ధర్మ ప్రవచనం జరిగింది. **అహింసతోకూడినదే ధర్మమని నిర్ణయం. ప్రాణుల అహింస కోసమే ధర్మప్రవచనం జరిగింది.*** ధారణను బట్టి ధర్మమని వ్యవహారం. ప్రజలను ధరించగలది ధర్మమే. కాబట్టి ధారణతో కూడినదే ధర్మమని నిర్ణయం. అన్యాయంగా ఇతరుల ధనాదులను దోచుకోవాలని, ఎవరినుండి అయినా సత్యపాలన రూపమైన, ధర్మాన్ని కోరితే, మాటాడకుంటేనే విముక్తి లభించేటట్లయితే ఎట్టి పరిస్థితిలోనూ మాటాడకూడదు. తప్పని సరిగా మాటాడవలసి వస్తే, మౌనమే సందేహాలకు కారణమయ్యేటట్లయితే అక్కడ అసత్యాన్ని చెప్పటమే శ్రేయస్సు. నిస్సందేహంగా అది సత్యమే. మనిషి ఏ పనికోసమైనా ప్రతిజ్ఞ చేసి, కార్యవేళలో దానిని మరొక రీతిగా ప్రతిపాదిస్తే, వాడు దంబాలు పలికినందువలన దాని ఫలితాన్ని పొందాడని బుద్ధిమంతులంటారు. ప్రాణాపాయం సంభవించినప్పుడు, సర్వబాంధవులు నశించేటప్పుడు, పరిహాసవేళలో మాటాడిన మాటలకు అసత్య దోషం లేదు. ధర్మతత్త్వ ద్రష్టలు దాన్ని అధర్మమనరు. అసత్య శపథాలు చేస్తేనే దొంగలనుండి విముక్తి లభించేటట్లయితే, అక్కడ అసత్యభాషణమే మంచిది. అది నిశ్చయంగా సత్యమే. వీలయినంత వరకు దొంగలకు ధనమివ్వరాదు. ఎందుకంటే పాపాత్ముల కిచ్చినధనం దాతకు కూడా దుఃఖాన్ని కలిగిస్తుంది. కాబట్టి ధర్మం కోసం అసత్యమాడినా, అసత్య దోషమంటదు. నేను యథాశాస్త్రంగా భావించిన ధర్మ లక్షణమిదే. నీ హితాన్ని కోరి నేడు యథాధర్మంగా, యథామతిగా ధర్మాన్ని వివరించాను. ఇది విని, ఇప్పుడు చెప్పు. అర్జునా! యుధిష్ఠిరుని చంపాలా?'

అర్జునుడిలా అన్నాడు – "మహామేధావి, మహాపండితుడు చెప్పిన రీతిగా, మాకు హితాన్ని కలిగించే రీతిగా నీ మాటలున్నాయి. కృష్ణా! మాకు నీవు తల్లివంటివాడవు. తండ్రి వంటివాడవు. పరమగతివి, ఆశ్రయానివీ నీవే. మూడు లోకాలలోనూ, నీకు తెలియనిది ఎక్కడా లేదు. కాబట్టి నీవు పరమధర్మాన్ని యథాతథంగా గ్రహించగలిగావు. యుధిష్ఠిరుడైన

---

* యత్ స్యాదహింసాసంయుక్తం న ధర్మ ఇతి నిశ్చయః ।
అహింసార్థాయ భూతానాం ధర్మప్రవచనం కృతమ్ ॥ 57

ధర్మరాజును చంపనవసరం లేదని భావిస్తున్నాను. ఈ నా సంకల్పవిషయంలో నీవు అనుగ్రహాన్ని చూపాలి. నా మనస్సులో ఉన్న, నేను చెప్పదలచుకొన్న మాటను మరలా వినుము. దాశార్హా! నా మానసిక వ్రతం నీకు తెలుసు. మనుష్యులలో ఎవరైనా "అస్త్ర విద్యలోనూ, శక్తిలోనూ నిన్నుమించినవానికి నీ గాండీవాన్ని ఇవ్వు" అని అంటే బలపూర్వకంగా అతనిని చంపుతాను. కేశవా! భీముడు కూడా తననెవరైనా గడ్డం మీసాలు లేనివాడంటే వాణ్ణి చంపివేస్తాడు. వృష్ణివీరా! ధర్మరాజు నీ సమక్షంలోనే చాలాసార్లు 'నీ గాండీవాన్ని ఇచ్చివేయు'మని నాతో అన్నాడు. కేశవా! ధర్మరాజును చంపితే స్వల్పకాలం కూడా నేను నేలమీద జీవించలేను. పాపం నుండి విముక్తి పొందగలిగినా, ధర్మరాజు హత్యను గూర్చియే ఆలోచిస్తూ, పరాక్రమాన్ని కోల్పోయి, చైతన్య రహితుణ్ణి అవుతాను. లోకదృష్టిలో నా ప్రతిజ్ఞ సత్యమయ్యేటట్లు, ధర్మజుడు నేనూ ప్రాణాలతో నిలువగలిగేటట్లు, నీవు ఏదైనా సలహా నివ్వాలి.

వాసుదేవుడిలా అన్నాడు. "వీరుడా! ధర్మజుడు కర్ణునితోడి పోరాటంలో పదునైన బాణాలచే గాయపడి, అలసిపోయి, దుఃఖిస్తున్నాడు. యుద్ధంలో కర్ణుడు నిరంతరాయంగా ధర్మజుని బాణాలతో తీవ్రంగా గాయపరిచాడు. అందువలన ఆ బాధలో, కోపంలో, నీతో తగనిరీతిగా మాటాడాడు. అర్జునునికి కోపాన్ని తెప్పించకపోతే, యుద్ధంలో కర్ణుని చంపలేడని భావించి కూడా అలా అనిఉండవచ్చు. అర్జునా! పాపాత్ముడైన ఆ కర్ణుని, లోకంలో ఇతరు లెవ్వరూ సహించలేరని ధర్మజునకు కూడా తెలుసు. అందుకే తీవ్రకోపంతో, నా సమక్షంలోనే నిన్ను అన్ని మాట లన్నాడు. కర్ణుడు ఎప్పుడూ ఉద్యమించి ఉండేవాడు. ఎదిరింపరానివాడు. అటువంటి కర్ణునితో ఈ రోజు రణద్యూతం ఏర్పడింది. కర్ణుడు మరణిస్తే కౌరవు లందరూ ఓడిపోయినట్లే. ధర్మజుడు ఆ విధంగా ఆలోచించి ఉండవచ్చు. కాబట్టి ధర్మజుని చంపదగదు. అర్జునా! నీ ప్రతిజ్ఞ కూడా పాలింపబడాలి. కాబట్టి జీవించిఉన్నా, మరణించినట్లు భావింపబడే మార్గం నీకిప్పుడు తగినది. అది చెపుతా వినుము. గౌరవార్హుడు గౌరవాన్ని పొందితే, అప్పుడు లోకంలో జీవించిఉన్నట్లే, తీవ్రమైన అవమానాన్ని పొందితే అప్పుడు జీవన్మృతుడి క్రింద లెక్క. నీవు, భీముడు, నకుల సహదేవులు, లోకంలో పెద్దలు ధర్మజుని ఎల్లప్పుడూ గౌరవిస్తున్నారు. ఇప్పుడు ఆయనను స్వల్పంగా అవమానించు. భారతా! అర్జునా! ఆ ధర్మజుని నీవు అని సంబోధించు. పెద్దవారిని నీవు (అని ఏకవచనంతో) సంబోధిస్తే చంపినట్టే లెక్క. అర్జునా! కురూద్వహా! యుధిష్ఠిరుడైన ధర్మజుని విషయంలో అలా ప్రవర్తించు. అధర్మబద్ధమయిన వచనంతో,

ఆయనతో వ్యవహరించు. అధర్వాంగిరసులు దేవతలైన ఒక శ్రుతివచనముంది. అది ఉత్తమశ్రుతి, శ్రేయస్కాములయిన నరులు ఏమీ ఆలోచించకుండా దానిని పాటించవచ్చు. సమర్థుడైన గురువును 'నీవు' అని సంబోధించటం చంపకుండా చంపినట్టే, ధర్మాన్ని గ్రహించి నేను చెప్పినట్టు ధర్మజునితో అలా మాటాడు. పాండునందనా! నీవు తననలా అనుచితంగా సంబోధించగానే, తాను వధింపబడినట్లే భావిస్తాడు ధర్మజుడు. ఆ వెంటనే పాదాలకు నమస్కరించి, అనునయిస్తూ, ఆయనకు క్షమార్పణ చేయవచ్చు. పార్థా! ప్రాజ్ఞుడైన నీ సోదరుడు - ధర్మరాజు ధర్మం తెలిసి నీపై ఎప్పుడూ కోపించడు. నీవు అసత్య దోషంనుండీ, సోదర వధ దోషంనుండీ కూడా విముక్తినందగలవు. నీవు ఆనందంగా సూతపుత్రుడైన కర్ణుని చంపవచ్చు."

70. యుధిష్ఠిర సమాశ్వాసనము.

సంజయుడిలా చెప్తున్నాడు. "జనార్దనుడు అలా చెప్పగానే అర్జునుడు ఆ మిత్రవచనాన్ని అభినందించాడు. ఆపై అర్జునుడు అంతకుముందెన్నడూ మాటాడని రీతిగా, మొండిగా; ధర్మజునితో పరుషంగా మాటాడాడు. అర్జునుడిలా అన్నాడు. "రాజా! నీవు రణభూమి నుండి పారిపోయివచ్చి యుద్ధానికి క్రోసెడు దూరంలో నిలిచావు. మాటాడకు ! మాటాడకు ! సర్వలోకవీరులతో పోరాడుతున్న భీముడు నన్ను నిందిస్తే నిందించవచ్చు. రణభూమిలో సమయోచితంగా శత్రువులను పీడిస్తూ, శూరులైన రాజులను, ప్రముఖ రథికులను, ఉత్తమ గజాలను, మేలు జాతి గుర్రాలను, లెక్కలేనంతమంది వీరులను, వేలకొలదిగ ఏనుగులను, కాంబోజ జాతికి చెందిన పదివేల గుర్రాలను, పర్వతీయ వీరులను చంపి, మృగాలను చంపిన సింహంవలె భీకరంగా గర్జిస్తున్నాడు భీమసేనుడు. చేతిలో గదను పట్టి, రథం నుండి దూకి, దానితో గుర్రాలను, రథికులను, ఏనుగులను రణభూమిలో సంహరిస్తున్నాడు. ఆ వీరుడు ప్రకటిస్తున్న దుష్కర పరాక్రమాన్ని నీవెప్పుడూ ప్రకటించలేదు. ఇంద్రునివంటి పరాక్రమం గల భీమసేనుడు గొప్ప కత్తితో, రథచక్రాలతో, వింటితో శత్రువులను దహిస్తున్నాడు. పాదాలతో త్రొక్కి, చేతులతోనూ శత్రువులను చంపుతున్నాడు. కుబేరునివలె, యమునివలె మహాబలుడైన భీముడు బలపూర్వకంగా శత్రుసేనను చంపుతున్నాడు. ఆ భీమసేనుడు నన్ను నిందిస్తే నిందించవచ్చు కానీ, నిత్యమూ మిత్రుల రక్షణలో ఉండే నీవు నన్ను నిందింపదగదు. మహారథికులను, శ్రేష్ఠగజాలను, గుర్రాలను, ప్రముఖసైనికులను మథించి, ధార్తరాష్ట్రులలో ఒకరిగా మునిగిపోయి ఉన్న

భీముడు నన్ను నిందించవచ్చు. కళింగ, వంగ, అంగ, నిషాద, మాగధ దేశాలలో పుట్టి, ఎప్పుడూ మదమత్తతతో నల్లటి మేఘాలవలె నున్న శత్రుగజాలను ఎన్నింటినో సంహరిస్తున్న భీముడు నన్ను నిందింపదగినవాడు. వీరుడైన ఈ భీమసేనుడు తగిన సమయంలో కట్టిన రథాన్ని ఎక్కి, ధనుస్సును ఝుళిపిస్తూ, పిడికిలినిండా బాణాలను తీసికొని, మహాసంగ్రామంలో మేఘం జలధారలను కురిపించినట్లు శరవృష్టిని కురిపిస్తున్నాడు. ఈ రోజు రణభూమిలో భీమసేనుడు తన బాణాలతో ఎనిమిది వందల ఏనుగులను, వాటి కుంభస్థలాలను తొండాలను, తొండాల చివరలను ఖండించి చంపివేశాడు. అటువంటి శత్రుసంహర్త నన్ను క్రూరుడు అనవచ్చు.

రాజా! నకులుడు రణభూమిలో ప్రాణాలపై ఆశను వీడి, వేగంగా ముందుకు దూకి, ఎన్నో వీనుగులను, గుర్రాలను, శూరులైన యోధులను సంహరించాడు. యుద్ధకాంక్షి, అరిందముడు అయిన ఆ నకులుడు నన్ను నిందించవచ్చు. సహదేవుడు శత్రుసేనలను మర్దిస్తూ, పోరాడుతూ దుష్కరపరాక్రమాన్ని ప్రదర్శించాడు. ఆ బలశాలి ఇక్కడకు వచ్చి కూడా, వీమీ మాటడలేదు. తనకూ, నీకూ మధ్యగల భేదాన్ని గమనించు. ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, ద్రౌపది కొడుకులు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, శిఖండి వీరంతా కూడా యుద్ధభూమిలో ఎంతో బాధను సహించినవారు. వారు నన్ను నిందించవచ్చు గానీ నీవు నిందించగూడదు.

బ్రాహ్మణులకు వాక్కులో బలముంటుంది. క్షత్రియులు బాహుబల సంపన్నులని పండితులంటారు. భారతా! నీవు వాచా బలవంతుడవు, నిష్ఠురుడవు. నేనెంత బలశాలినో నీకు తెలుసు. భార్యను, బిడ్డలను, జీవితాన్ని కూడా పణంగా పెట్టి నిత్యమూ నీ అభీష్టాన్ని నెరవేర్చే ప్రయత్నం చేస్తుంటాను. అటువంటి నన్ను మాట లనే బాణాలతో హింసిస్తున్నావు. మేము నీ ద్వారా పొందిన సుఖమంటూ ఏదీ లేదు. ద్రౌపది శయ్యపై కూర్చుండి నన్ను పరాభవించవద్దు. నీకోసం మహారథికులను సంహరిస్తున్నాను. భారతా! ఆ స్థితిలో కూడా నీవు నన్ను శంకించి, నిష్ఠూరంగా మాటాడావు. నీ ద్వారా పొందిన సుఖమేమిటో నాకు తెలియటం లేదు. నరదేవా! నీ ప్రియంకోసమే సత్యసంధుడు, మహాత్ముడు అయిన భీష్ముడు ద్రుపదుని కొడుకు శిఖండియే తన మృత్యువని ప్రకటించాడు. ఆ శిఖండి సారక్షణలో నిలిచి భీష్ముని వధించాడు. నీ రాజ్యాధిపత్యాన్ని నేను అంగీకరించటం లేదు. నీవు అహితాన్ని కోరితెచ్చుకొంటూ జూదమాడావు. స్వయంగా నీచులు చేసే పాపకర్మను చేసి, ఇప్పుడు మా ద్వారా శత్రువులను అతిక్రమించాలని కోరుకొంటున్నావు. పాచికలాడటంలో ధర్మహీనమయిన దోషాలు ఎన్నో ఉన్నాయి. సహదేవుడు చెప్పగా నీవు విన్నావు కూడా! కానీ నీవు దుర్జన సేవితమైన ఆ జూదాన్ని విడనాడలేదు. దానివలననే మేమంతా నరకం

వంటి బాధ పడవలసివచ్చింది. నీ వల్ల మేము పొందిన సుఖం కొంచెం కూడా లేదు. ఎందుకంటే నీవు జూదమనే వ్యసనంలో పడిపోయావు. పాండవా! నీవు స్వయంగా వ్యసనపరుడవై, మమ్ము అనరాని తీవ్ర వచనాలతో నిందిస్తున్నావు. మేము దెబ్బతీసిన శత్రుసేన, చితికిన శరీరాలతో నేలపై బడి ఆక్రోశిస్తోంది. నీవు అంత క్రూరమైన ఆ పని చేశావు. దానితో పాపమూ కలుగుతోంది. కౌరవ వినాశమూ, జరుగుతోంది. ఉత్తరదిక్కువారు చచ్చారు. పడమటివారు మరణించారు. ప్రాచ్యులు నశించారు. దాక్షిణాత్యులు నరకబడ్డారు. మనపక్షంలోనూ, శత్రుపక్షంలోనూ ఉన్న యోధులు రణభూమిలో సాటిలేని పరాక్రమాన్ని ప్రదర్శించారు. నరేంద్రా! నీవు జూదమాడావు. నీవలననే రాజ్యం నశించింది. నీవలననే మాకు బాధ కలిగింది. రాజా! ఆటువంటి మాకు మరల క్రూర వాక్యాలనే అంకుశాలతో పొడిచి, అల్పభాగ్యుడవైన నీవు కోపం తెప్పిస్తున్నావు.

సంజయుడిలా చెప్తున్నాడు. "స్థిరప్రజ్ఞుడు, ప్రాజ్ఞుడు, ధర్మభీరువు అయిన అర్జునుడు కఠినమైన ఈ నిష్ఠురవచనాలను పలికి, ఈ విధమైన పాపపుపని చేసి విమనస్కు డయ్యాడు. అప్పుడు ఇంద్రసూనుడు పశ్చాత్తాపానికి లోనయ్యాడు. నిట్టూర్పులు విడుస్తూ ఒరనుండి కత్తిని తీశాడు. కృష్ణుడు వెంటనే ఇలా అన్నాడు. "ఏమిటిది? మరలా ఆకాశంవలె నిర్మలమైన కత్తిని ఒరలోనుండి తీస్తున్నావు. నా మాటకు సమాధానం చెప్పు. నీ పని నెరవేరే మార్గం చెపుతాను. కృష్ణుడలా అడగగానే అర్జునుడు తీవ్రదుఃఖంతో "నేను మొండిగా అహితమైన పని చేశాను. అందుకని నన్ను నేనే చంపుకొంటాను" అని కృష్ణునితో అన్నాడు. అర్జునుని ఆ మాటవిని, ధర్మవేత్తలలో శ్రేష్ఠుడైన కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు.'అర్జునా! ఈ ధర్మరాజును అలా అని నీవు తీవ్రవేదనకు లోనయినట్లున్నావు. నిన్ను నీవే చంపదలచుకొన్నావు. కిరీటీ! ఇది సజ్జనులు పాటించే మార్గం కాదు. నరవీరా! ధర్మస్వరూపుడైన నీ పెద్దన్నను ధర్మభీరుడవై ఈనాడు చంపిఉంటే నీవు ఏమయ్యేవాడివి? ఆ తరువాత ఏం చేసేవాడివి ? పార్థా! ధర్మం చాలా సూక్ష్మమైనది. దాన్ని అర్థం చేసికొనటం కష్టం. నిన్ను నీవు చంపుకొంటే, భ్రాతృహత్యను మించి ఘోరనరకంలో పడతావు. అర్జునా! ఇప్పుడు నీ గుణాలను నీవే పొగడుకో. దానితో ఆత్మహత్య చేసికొన్నట్టే. ఆ మాటలు విని "కృష్ణా! అలాగే" అని అర్జునుడు వింటిని వంచి ధర్మవేత్తలలో పెద్ద అయిన యుధిష్ఠిరునితో "రాజా! విను" అంటూ ఇలా అన్నాడు.

"నరదేవా! పినాకపాణి అయిన శివుడు తప్ప, నన్ను మించిన విలుకాడు మరెవ్వడూ లేడు. ఆ మహాత్ముని అనుమతితో, నేను క్షణకాలంలో చరాచరసహితంగా ఈ జగత్తునంతనూ సంహరించగలను. నేను దిక్పాలకులతో పాటు దిక్కుల నన్నింటినీ జయించి నీ వశం చేశాను. నా బలం వలన భూరిదక్షిణలతో రాజసూయం ముగిసింది. నీకు దివ్యసభ లభించింది. నా చేతిలోని బాణాలు పదునైనవి. బాణాన్ని ఎక్కుపెట్టిన నా ధనుస్సు విశాలమైనది. నా పాదాలలో రథ ధ్వజ చిహ్నాలు ఉన్నాయి. నేను రణభూమిలో నిలిస్తే నన్నెవ్వరూ గెలవలేరు. ఉత్తరదిక్కువారు చచ్చారు. పడమటివారు మరణించారు. ప్రాచ్యులు నశించారు. దాక్షిణాత్యులు నరకబడ్డారు. సంశప్తకులు కొద్దిమందిమాత్రమే మిగిలారు. నేను కౌరవసైన్యంలో అర్ధభాగం చంపివేశాను. రాజా! నాచే చచ్చిన కౌరవసేన, దేవతలసేన వలె రణభూమిలో పడి ఉంది. అస్త్రవిద్యావేత్తలనే నేను అస్త్రాలతో చంపుతాను. అందువలననే మొత్తం లోకాన్ని నేను భస్మం చేయటం లేదు. కృష్ణా! జయశీలమై, భీకరమైన ఈ రథాన్ని ఎక్కి, సూతపుత్రుని చంపటానికి వెళ్దాం. ధర్మజుడు ఈరోజు ఆనందించాలి. రణభూమిలో బాణాలతో కర్ణుని సంహరింపబోతున్నాను" అని పలికి మరల అర్జునుడు ధర్మవేత్తలలో పెద్ద అయిన యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "ఈరోజు కర్ణుని తల్లి పుత్రహీనురాలు అవుతుంది. లేదా కర్ణుని ద్వారా కుంతి ఒక కుమారుని - నన్ను కోల్పోతుంది. సత్యం చెపుతున్నాను. ఈ రోజు రణరంగంలో బాణాలతో కర్ణుని చంపకుండా ఈ కవచాన్ని వీడను".

సంజయుడిలా చెప్తున్నాడు - "ధర్మవేత్తలలో పెద్ద అయిన ధర్మజునితో మరల అలా పలికి శస్త్రాలను విడిచి, వింటిని వీడి, వెంటనే కత్తిని ఒరలో పెట్టి సిగ్గుపడుతూ తలవంచి, చేతులు జోడించి అర్జునుడు యుధిష్ఠిరుని ఇలా అన్నాడు. "రాజా! అనుగ్రహించు. నేనన్నమాటలకు నన్ను క్షమించు. తగినవేళలో అర్థం చేసికొంటావు. నమస్తే". శత్రువులను సహించటంలో సమర్థుడైన ధర్మజుని ఈ రీతిగా ప్రసన్నుని జేసికొని, మేటివీరుడైన అర్జునుడు మరలా ఇలా అన్నాడు. "ఇది ఇక ఆలస్యం కాదు. వెంటనే జరుగుతుంది. కర్ణుడు ఇటే వస్తున్నాడు. అతనికి ఎదురువెళ్తాను. ఇదిగో! భీముని రణభూమినుండి విడిపించటానికి వెళ్తున్నాను. సర్వవిధాలా కర్ణుని సంహరించటానికి పోతున్నాను. నీ ప్రియం కోసమే నా జీవితం. సత్యం చెపుతున్నాను. రాజా! గ్రహించు." అలాపలికి ప్రజ్వలించే తేజస్సు గల కిరీటి ధర్మజుని పాదాలుపట్టి బయలుదేరాడు. పాండుసుతుడైన ధర్మజుడు సోదరుడైన అర్జునుని పరుషవచనాలను విని, ఆ పక్కమీదనుండి లేచి,

మనస్సు నిండా దుఃఖం నిండగా అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! నేను సరిగా ప్రవర్తించలేదు. అందువలననే మీకు భీకర సంకటాలు కలిగాయి. కాబట్టి నా శిరస్సునిప్పుడు ఖండించు. నేను కులాంతకుడను. అధమ పురుషుడను, పాపాత్ముడను, పాపవ్యసనాలతో కూడినవాడను. మూర్ఖబుద్ధిని అలసుడను, పిరికివాడిని. నేను పెద్దలను పరాభవించేవాడిని. పరుషుడను. రూక్షమైన నా మాటలను ఇంకా ఎంతకాలం అనుసరిస్తావు ? పాపాత్ముడనైన నేను ఇప్పుడు అరణ్యానికే వెళతాను. నేను లేకుండా నీవే సుఖంగా ఉండు. మహాత్ముడైన భీమసేనుడు తగినరాజు. నపుంసకుడను. నాకు రాజ్యపరిపాలనమెందుకు? ఇప్పుడు కోపంతో నీవు పలికిన పరుష వచనాలను కూడా సహించలేనివాడిని. వీరా! భీముడే రాజు అవుతాడు. ఇంత పరాభవానికి గురి అయ్యాక నేను జీవించటం అనవసరం. "అలా పలికి ధర్మరాజు వెంటనే లేచి, ఆ పక్కను వీడి, అరణ్యాలకు వెళ్ళటానికి సిద్ధపడ్డాడు. అప్పుడు కృష్ణుడు నమస్కరించి ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"రాజా! సత్యసంధుడైన అర్జునుడు గాండీవ విషయంలో చేసిన ప్రసిద్ధమైన ప్రతిజ్ఞ నీవెరిగినదే. గాండీవాన్ని ఇతరులకు ఇచ్చివేయమని ఎవరైనా అంటే అతనిని అర్జునుడు చంపుతాడు. నీవీరోజు అలా మాటాడావు. దానితో అర్జునుడు తన సత్యప్రతిజ్ఞను కాపాడుకొంటూ నా ఆజ్ఞ ననుసరించి నిన్ను అవమానించాడు. రాజా! గురువులను అవమానించటం వధించటంతో సమానం. రాజా! మహాబాహూ! కాబట్టి నీకు సత్యసంరక్షకై నేను, అర్జునుడు చేసిన ఈ అపరాధాన్ని మన్నించాలి. మహారాజా! మేమిద్దరమూ నిన్ను శరణుకోరుతున్నాం. రాజా! పాదాలపైపడి క్షమను యాచిస్తున్న మమ్ము క్షమించాలి. పాపాత్ముడైన ఈ కర్ణుని నెత్తురు త్రాగుతుంది ఈ రోజు రణభూమి, సత్యప్రమాణంగా చెప్తున్నాను. ఈరోజు కర్ణుడు మరణించినట్లే భావించు. నీవు ఎవరి చావును కోరుతున్నావో వాడి జీవితం అంతమైనట్లే." అలా పలికిన కృష్ణుని మాటలు విని, యుధిష్ఠిరుడైన ధర్మరాజు నమస్కరించిన కృష్ణుని హడావుడిగా లేవదీసి, చేతులు జోడించి, ఇలా అన్నాడు. "అచ్యుతా! నీవు చెప్పినది నిజమే. వాస్తవానికి ఈ అతిక్రమణం నాదే. గోవిందా! నన్ను అనునయించి ఆనందింపజేశావు. మాధవా! ఘోరవ్యసనం నుండి ఈరోజు మేమంతా బయటపడ్డాం. నిన్ను దిక్కుగా గొనియే, ఈరోజు అజ్ఞానమోహంలో పడిన మేమిద్దరమూ, ఈ వ్యసన సాగరం నుండి తరింపజేయబడ్డాం. నీబుద్ధి అనే తెప్పను ఆశ్రయించి, మేమంతా అమాత్యులతో సహా, రక్షకులతో సహా ఈ దుఃఖశోక సముద్రాన్ని దాటగలిగాం."

71. అర్జున ప్రతిజ్ఞ

సంజయుడిలా చెప్తున్నాడు. "ప్రీతిపూర్వకమైన ఆ ధర్మజుని మాటను విని ధర్మాత్ముడయిన గోవిందుడు అర్జునునితో ఇలా అన్నాడు. అప్పుడు అర్జునుడు కృష్ణుని మాటమేరకు యుధిష్ఠిరుని నిందించి, కొంచెం తప్పుచేసిన వానివలె విమనస్కుడై ఉన్నాడు. అందువలన వాసుదేవుడు నవ్వుతూ ఇలా అంటున్నాడు. "అర్జునా! ఇదేమిటి? తీక్ష్ణమైన కత్తివాదరతో ధర్మజుని చంపుతానన్నావే. ధర్మజుని 'నీవు' అని తిరస్కార పూర్వకంగా పలికినందుకే ఇలా దుఃఖిస్తున్నావే. నిజంగా చంపి ఉంటే ఏమయ్యేవాడివి ? అర్జునా! ధర్మజుని చంపియే ఉంటే ఎలా సమాధానపడేవాడివి? ధర్మస్వరూపం ఇంత క్లిష్టమైనది. గ్రహించటం కష్టం. విశేషించి మందమతులు అసలు తెలియలేరు. నీవు అలా ధర్మభీరుడవై నీ పెద్ద అన్నను చంపినందుకు, తప్పని సరిగా ఘోరమైన నరకకూపంలో పడేవాడివి. కాబట్టి నీవు ధర్మధారులలో శ్రేష్ఠుడై, ధర్మపరాయణుడై, కురుశ్రేష్ఠుడైన ధర్మజుని ఇప్పుడు ప్రసన్నుని చేసికోవాలని నా అభిప్రాయం. భక్తితో ధర్మజుని ప్రసన్నుని చేసికొని, యుధిష్ఠిరుని మీది ప్రేమతో త్వరగా కర్ణుని రథం మీదకు యుద్ధానికి వెళదాం. మానదా! ఈరోజు నీవు పదునైన బాణాలతో రణభూమిలో కర్ణుని చంపి, ధర్మజునికి బాగా ఆనందాన్ని కలిగించు. మహాబాహూ! ఇప్పటికిది తగినదని నా అభిప్రాయం. ఇలా చేస్తే నీ కర్తవ్యమంతా పూర్తి అయినట్లే."

మహారాజా! అప్పుడు అర్జునుడు సిగ్గుపడుతూ, ధర్మజుని చరణాలకు శిరస్సు వంచి నమస్కరించి, 'రాజా! ధర్మదృష్టితో పిరికివాడనై నేనన్న మాటలను క్షమించండి" అంటూ మాటిమాటికి యుధిష్ఠిరునితో అన్నాడు. భరతర్షభా! శత్రుసంహారకుడైన అర్జునుడు తన పాదాలపై పడి ఏడుస్తుంటే, యుధిష్ఠిరుడైన ధర్మజుడు చూసి, సోదరుడైన అర్జునుని లేవనెత్తి, ప్రణయ పూర్వకంగా కౌగిలించుకొని, పెద్దగా ఏడవసాగాడు. మహారాజా! మహాతేజస్వులైన ఆ సోదరులిద్దరూ చాలాసేపు రోదించి, మనస్సులోని మాలిన్యాన్ని తొలగించుకొని, ఒకరిపై ఒకరు ప్రీతిని నింపుకొన్నారు. ఆపై ధర్మరాజు అర్జునుని ప్రేమతో కౌగిలించుకొని, శిరస్సును ఆఘ్రాణించి, పరమ ప్రీతితో కూడి, తెరలు తెరలుగా నవ్వుతూ అర్జునునితో ఇలా అన్నాడు. "విజయానికై నేను ప్రయత్నిస్తుంటే సర్వసేనలూ చూస్తుండగా కర్ణుడు రణభూమిలో బాణాలతో నా కవచాన్ని, ధ్వజాన్ని, వింటిని, శక్తిని, గుర్రాలను, బాణాలను నరికివేశాడు. అర్జునా! అటువంటి నేను రణభూమిలో కర్ణుని ఆ పరాక్రమాన్ని చూసి, గ్రహించి దుఃఖిస్తున్నాను. నాకు ప్రాణాలపై ప్రీతి లేదు. ఈ రోజు యుద్ధంలో

ఆ వీరుని సంహరించకపోతే నేను ప్రాణాలు విడుస్తాను. నేను బ్రతికి లాభమేముంది?"

భరతర్షభా! ధర్మజుని ఆ మాట విని, అర్జునుడు ఇలా అన్నాడు. "రాజా! నరశ్రేష్ఠా! సత్యంమీద, నీ ప్రసన్నత మీద, భీముని మీద, నకుల సహదేవుల మీద ఒట్టువేసి చెపుతున్నాను. ఈరోజు యుద్ధంలో కర్ణుని చంపుతాను లేదా నేనే చచ్చి నేలగూలుతాను. సత్యప్రమాణంగా ఆయుధాన్ని పట్టి చెపుతున్నాను". ధర్మజునితో అలా పలికి, అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! ఈరోజు తప్పక కర్ణుని యుద్ధంలో సంహరిస్తాను. నీకు మేలు జరుగుగాక! నీ ఆలోచనతోనే ఆ దురాత్ముని వధ జరుగుతుంది". రాజసత్తమా! అర్జునుడు అలా అనగానే, కేశవుడు అర్జునునితో ఇలా అన్నాడు. "భరతశ్రేష్ఠా! మహాబలశాలి అయిన కర్ణుని చంపటానికి నీవు సమర్థుడవే. మహారథా ! సజ్జనశ్రేష్ఠా! 'నీవు యుద్ధంలో కర్ణుని ఎలా చంపుతావో అని నేను ఎప్పుడూ మనస్సులో సంకల్పిస్తూనే ఉంటాను". మతిమంతుడైన మాధవుడు మరల ధర్మజునితో ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! ఈ అర్జునుని నీవే అనునయించాలి. దురాత్ముడైన ఆ కర్ణుని సంహరించటానికి అనుమతించాలి. పాండునందనా! నీవు కర్ణుని బాణాలతో గాయపడ్డావని విని, నేను అర్జునుడు నీ పరిస్థితిని తెలిసికోవాలని ఇక్కడకు వచ్చాం. రాజా! భాగ్యం కొద్దీ నీవు మరణించలేదు, పట్టుపడలేదు కూడా. అనఘా! అర్జునుని ఊరడించి, విజయానికై ఆశీర్వదించు".

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "పార్థా! బీభత్సా! పాండవా! దగ్గరకు రా! నన్ను కౌగిలించుకో! నీవు నాతో అనదగిన మాటలే, హితవచనాలే పలికావు. దాన్ని నేను క్షమించాను. ధనంజయా! నేను ఆదేశిస్తున్నాను. కర్ణుని చంపు, పార్థా! నేను దారుణంగా మాటాడానని బాధపడవద్దు".

సంజయుడిలా చెపుతున్నాడు. "రాజా! ఆపై అర్జునుడు శిరస్సు వంచి పెద్దన్న అయిన ధర్మజుని పాదాలను చేతులతో పట్టుకొన్నాడు. ధర్మజుడు బాధపడుతున్న అర్జునుని లేవదీసి, కౌగిలించుకొని, శిరస్సు నాఘ్రాణించి మరలా ఇలా అన్నాడు. 'ధనంజయా! మహాబాహూ! నీవు నన్ను చక్కగా గౌరవించావు. మరల నీలో పూర్వపు శక్తి కలగాలి. నీవు గెలుస్తావు". అర్జునుడిలా అన్నాడు. "బలగర్వితుడైన పాపకర్ముడైన ఆ రాధేయుని ఆక్రమించి, ఈ నాడు రణభూమిలో అనుచరులతో సహా, అతనిని నా బాణాలతో అంతం చేస్తాను. వింటిని బాగా వంచి, నిన్ను బాణాలతో బాధించాడు గదా! ఆ పనికి తగిన దారుణఫలితాన్ని కర్ణుడు ఇప్పుడనుభవిస్తాడు. రాజా! ఈరోజు కర్ణుని చంపిన

తరువాతనే నీ దర్శనానికి వస్తాను. రణభూమిలో నిన్ను అభినందించటానికే వస్తాను. నీకు సత్యం చెపుతున్నాను. రాజా! సత్యప్రమాణంగా నీ పాదాలనంటి చెప్తున్నాను. ఈరోజు కర్ణుని సంహరించకుండా రణరంగం నుండి మరలిరాను !"

సంజయుడిలా చెప్తున్నాడు. అలా అంటున్న కిరీటితో, నిర్మల హృదయుడైన ధర్మజుడు గొప్ప మాట ఇలా అన్నాడు. 'అర్జునా! నీకు అక్షయకీర్తి, చిరాయుస్సు, మనోవాంఛలు, విజయం, శత్రునాశకమైన పరాక్రమం ఎప్పుడూ లభించాలి. నీవు వర్ధిల్లాలి! దేవతలు నిన్ను వర్ధిల్లజేయాలి. నేను కోరుకొంటున్నదంతా నీకు జరగాలి. వెంటనే బయలుదేరు. ఆత్మవృద్ధికోసం ఇంద్రుడు వృత్రుని చంపినట్లు రణభూమిలో కర్ణుని చంపు".

72. కృష్ణార్జున సంవాదము.

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆ రీతిగా ధర్మజుని ప్రసన్నుని చేసికొని, అర్జునుడు కర్ణసంహారానికి సంసిద్ధుడై, ప్రసన్న హృదయంతో కృష్ణునితో ఇలా అన్నాడు. 'గోవిందా! ఇక నా రథాన్ని సిద్ధంచేయాలి. మేలు జాతి గుర్రాలను పూన్చాలి. ఆ మహారథంలో ఆయుధాల నన్నింటినీ సిద్ధంగా ఉంచాలి. ఆశ్వికుల శిక్షణనొందీ, మరలివచ్చిన గుర్రాలను రథోపకరణాలతో సిద్ధంచేసి త్వరగా తీసికొని రావాలి. కర్ణవధకై బయలుదేరు". మహారాజా! మహాత్ముడైన అర్జునుడు అలా చెప్పగానే కృష్ణుడు "భరతశ్రేష్ఠుడు సర్వధనుర్ధారులలో మేటి అయిన అర్జునుడు చెప్పినట్లు అంతా పూర్తి చేయి" అని దారుకుని ఆదేశించాడు. రాజశ్రేష్ఠా! కృష్ణుడు ఆ రీతిగా ఆదేశించగానే, దారుకుడు పులితోలు పరిచి, శత్రువులకు తాపాన్ని కల్గించే రథాన్ని సిద్ధంచేసి, ఆ విషయాన్ని మహాత్ముడైన అర్జునునకు నివేదించాడు. మహాత్ముడైన దారుకుడు సిద్ధంచేసిన ఆ రథాన్ని చూసి, అర్జునుడు ధర్మరాజును వీడ్కొలిపి, విప్రులచే స్వస్తి వచనాలను పలికించి, కళ్యాణకరమై మంగళమయమైన రథాన్ని ఎక్కాడు. యుధిష్ఠిరుడు, మహాప్రాజ్ఞుడు అయిన ధర్మరాజు అర్జునుని ఆశీర్వదించాడు. ఆపై అర్జునుడు కర్ణరథంవైపు బయలుదేరాడు. భారతా! మేటివిలుకాడైన అతని రాకను గమనించి, సర్వభూతాలు, మహాత్ముడైన అర్జునుని చేతిలో కర్ణుడు మరణించినట్లే భావించాయి. రాజా! సర్వదిక్కులు పూర్తిగా నిర్మలమయ్యాయి. నెమళ్ళు, సారసపక్షులు, క్రౌంచ పక్షులు ఆ అర్జునునకు ప్రదక్షిణం చేశాయి. శుభాన్ని, మంగళాన్ని కలిగించగల ఎన్నో మగ పక్షులు అర్జునుని రణభూమివైపు తొందరచేస్తూ ఆనందంగా కూయసాగాయి. తెల్లడేగలు, గ్రద్దలు, కొంగలు, డేగలు, కాకులు మొదలయిన భయంకర పక్షులు మాంసంకోసం

అర్జునునికి ముందు వెళ్తున్నాయి. ఎన్నో శుభశకునాలు శత్రుసేనా వినాశనాన్నీ, కర్ణవధను అర్జునునకు చెప్తున్నాయి. బయలుదేరిన అర్జునునికి తీవ్రంగా చెమట పట్టింది. 'ఇదెలా జరుగుతుందో' అని తీవ్రమైన చింతకూడా కలిగింది.

ఆపై చింతకు లోనయిన స్థితిలో నున్న గాండీవధారిని చూసి మధుసూదనుడిలా అన్నాడు. వాసుదేవుడిలా అన్నాడు. "గాండీవధారీ! రణభూమిలో, నీ ధనుస్సుతో ఎందరినో జయించావు. నీవు తప్ప మరొక మనిషి వారిని గెలవలేడు. ఇంద్రుని వంటి పరాక్రమం గల శూరు లెందరో కనిపించారు. కానీ రణభూమిలో, శూరుడవైన నిన్ను సమీపించి, వారంతా మరణించారు. ద్రోణుని, భీష్ముని, భగదత్తుని అవంతిదేశీయులైన వింద - అనువిందులను, కాంబోజరాజైన సుదక్షిణుని, మహా పరాక్రమశాలులైన శ్రుతాయువును, అచ్యుతాయువును ఎదిరించి, నీవంటి సమర్థుడు తప్ప మరెవడు క్షేమంగా నిలువగలడు ? అర్జునా! నీవి దివ్యాస్త్రాలు, నీలో లాఘవముంది, బలముంది. రణభూమిలో మోహానికి గురికావు. అస్త్రవిజ్ఞానం విస్తృతం. లక్ష్యాన్ని గురిచూడటంలో, పడగొట్టడంలో నీవు యోగివి. గంధర్వులతో సహా దేవతలను, చరాచర ప్రాణులను నీవు ఒకేసారి సంహరించగలవు. అర్జునా! లోకంలో మరే మగవాడూ నీవంటి యోధుడు కాదు. ఈ లోకంనుండి దేవలోకం వరకు, యుద్ధ దుర్మదులై వింటిని పట్టే క్షత్రియులలో, నీతో సమానమైన వానిని చూడలేదు. వినలేదు. అర్జునా! బ్రహ్మ ప్రజలను సృష్టించాడు. ఈ విశాలమైన గాండీవ ధనుస్సును కూడా సృష్టించాడు. దానితో నీవు యుద్ధం చేస్తున్నావు. కాబట్టి నీతో సమానమైన వాడు లేడు.

అర్జునా! నీకు హితకరమైన మాటనొకదానిని నేను తప్పక చెప్పాలి. మహాబాహూ! రణరంగానికే వన్నె తేగల కర్ణుని పరాభవించవద్దు. కర్ణుడు బలశాలి. ఆత్మాభిమాని, అస్త్రవిద్యాపారంగతుడు, మహారథుడు, యుద్ధనిపుణుడు, చిత్రంగా పోరాడగలవాడు. దేశకాల తత్త్వజ్ఞుడు. అర్జునా! ఇన్ని మాటలు చెప్పటమెందుకు ? సంక్షేపంగా వినుము. మహారథుడైన కర్ణుడు నీతో సమానుడు లేదా నిన్ను మించినవాడు. తీవ్రమైన ఆ పోరాటంలో, మహాప్రయత్నంతో నీవు కర్ణుని చంపవలసి ఉంటుంది. కర్ణుడు తేజస్సులో నిప్పులాంటివాడు. వేగంలో వాయువుతో సమానుడు. కోపంలో యమునివంటివాడు. సింహం వంటి దృఢశరీరం, బలం గలవాడు. కర్ణుడు ఎనిమిది రత్నుల (పిడివెలితిమూరల) పొడవైనవాడు. మహాబాహువు, విశాలమైన ఛాతిగలవాడు. జయింపరానివాడు, అభిమాని, శూరుడు, గొప్పవీరుడు, చూడముచ్చటైనవాడు. యోధుల కుండవలసిన సర్వగుణాలూ

కర్ణునిలో ఉన్నాయి. మిత్రుల కతడు అభయదాత, ఎప్పుడూ ధార్తరాష్ట్రహితాన్ని కోరుతూ పాండవులను ద్వేషిస్తుంటాడు. ఇంద్రునితో కలిసి దేవతలందరూ వచ్చినా, కర్ణుని చంపలేరు. నీవు తప్ప మరెవ్వరూ ఆ పని చేయలేరు. కాబట్టి ఈనాడు కర్ణుని చంపు. దేవతలు రక్తమాంసాలు గల మానుషశరీరాలను ధరించి, సంసిద్ధులై, యుద్ధాభిలాషతో వచ్చినా ఆ రథికుని (కర్ణుని) గెలవలేరు. దురాత్ముడు, పాపవృత్తి, క్రూరుడు, పాండవుల విషయంలో ఎప్పుడూ దుర్బుద్ధి, పాండవులతో పోరాడటానికై స్వప్రయోజనాలను లెక్కచేయనివాడు కర్ణుడు. నేడు అతనిని చంపి కృతార్థుడవు కమ్ము ! రథికశ్రేష్ఠుడైన కర్ణుడు తాను కాలం అదుపులోనున్నట్లు భావించడు. అతనిని నేడు కాలాధీనుని చేయి. రథికశ్రేష్ఠ డైన ఆ కర్ణుని చంపి ధర్మరాజుకు ప్రీతిని కలిగించు. అర్జునా! నీ బలమెంతో యథాతథంగా నాకు తెలుసు. సురాసురులు కూడా నిన్ను ఎదిరించలేరు కానీ దురాత్ముడైన ఈ సూతపుత్రుడు గర్వంతో ఎప్పుడూ పాండుపుత్రులను పరాభవిస్తాడు. అర్జునా! కర్ణుని వలననే పాపి అయిన సుయోధనుడు తనను వీరుడ ననుకొంటాడు. పాపానికి మూలమైన ఆ కర్ణుని ఈనాడు సంహరించు. అర్జునా! ఖడ్గమే నాలుకగా, ధనుస్సే నోరుగా, బాణాలే దంతాలుగా పొగరుపడుతూ, వేగంగా సాగే ఆ పురుషశార్దూలాన్ని చంపు. సింహం ఏనుగును చంపినట్టు, నీ పరాక్రమంతో, బలంతో, రణరంగంలో కర్ణుని చంపు. నేను ఆదేశిస్తున్నాను. అర్జునా! కర్ణుని బలంతో, దుర్యోధనుడు నీ బలాన్ని తక్కువచేసి చూస్తారు. సూర్యసుతుడైన కర్ణుని ఈనాటి యుద్ధంలో చంపు."

73. శ్రీకృష్ణుడు అర్జునుని ప్రోత్సహించుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "భారతా! ఆపై కర్ణవధను సంకల్పించి వస్తున్న అర్జునునితో కృష్ణుడు మరలా ఇలా అన్నాడు. "భారతా! నరులు, ఏనుగులు, గుర్రాలు అతిఘోరంగా నశించిపోతున్న ఈ సంగ్రామం ప్రారంభమై నేటికి పదిహేడురోజులు. శత్రుసేనలతోపాటు నీసేన కూడా విశాలమైనదే. కానీ ఈ పరస్పర సంగ్రామంలో కొంచెం మాత్రమే మిగులుతుంది. అర్జునా! కౌరవుల ఏనుగులు, గుర్రాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. కానీ నీవంటి శత్రువును ఎదిరించి రణశిరస్సున నశించిపోయాయి. ఇదిగో! ఈ రాజులు, సృంజయులు, పాండవ యోధులు నిన్ను ఆశ్రయించి, నీ పక్షాన నిలిచియున్నారు. శత్రువులు జయింపలేనివాడవు నీవు. నీ రక్షణలో నిలిచి పాంచాలురు, పాండవులు, మత్స్య దేశీయులు, కారూషులు, చేదివంశస్థులు శత్రుగణ వినాశనం చేస్తున్నారు. నాయనా!

నీ రక్షణలో నిలిచిన ఈ పాండవ మహారథులు తప్ప, మరెవ్వరు కౌరవులను యుద్ధంలో జయించగలరు ? నీవు సురలు, అసురులు, మానవులు కలిసి వచ్చినా, యుద్ధంలో మూడు లోకాలనూ గెలవగలవాడివి. ఇక ఈ కౌరవసేన ఎంత ? భగదత్త మహారాజు ఇంద్రుని వంటివాడు. నీవు తప్ప మరెవ్వరు ఆయనను గెలువగలరు ? పార్థా! ఆ రీతిగా నీచే రక్షింపబడుతున్న ఈ విశాలసేనను, రాజులందరూ కళ్ళతో కూడా చూడలేకపోయారు. అలాగే ఎప్పుడూ రణభూమిలో నీరక్షణలో నుండియే, ధృష్టద్యుమ్న శిఖండులు భీష్మద్రోణులను పడగొట్టగలిగారు. భారతీయులలో మహారథులై, ఇంద్రతుల్య పరాక్రమం గల భీష్మద్రోణులను యుద్ధంలో పోరాడి ఎవరు జయించగలరు ? భీష్ముని, ద్రోణుని, సూర్యసుతుని (కర్ణుని), కృపుని, అశ్వత్థామను, భూరిశ్రవుని, కృతవర్మను, సైంధవుని, శల్యుని, సుయోధన నరపాలుని ఎవరు జయించగలరు? వారంతా వీరులు, అస్త్రవిద్యానిపుణులు. యుద్ధంలో వెనుకంజ వేయనివారు. అక్షౌహిణీపతులు, ఒక్కటై నిలిచిన యుద్ధదుర్మదులు, రౌద్రులు, పురుషోత్తమా! నీవు తప్ప, మరే మగవాడు వారిని జయించగలడు ?

అసహనశీలులైన క్షత్రియుల దళాలు చాలా ఎక్కువ. వివిధ జనపదాలలో నివసించే ఉగ్రస్వభావులు వారు. ఆ దళాలన్నీ నశించిపోతున్నాయి. గుర్రాలు, రథాలు, ఏనుగులు బ్రద్దలయిపోతున్నాయి. గోవాసులు, దాసమీయులు, వసాతులు, ప్రాచ్యులు, వాటధానులు, భోజదేశనివాసులు, ఇతర సర్వక్షత్రియ సేనలూ ఉద్దండహయాలూ, ఉన్మత్త గజాలతో సహా నిన్ను, భీమునీ ఎదిరించి నశించిపోయాయి. తీవ్రపరాక్రములు, ఉగ్ర స్వభావులు, భీకర కర్ములు అయిన తుషారులు, యవనులు, ఖశులు, దార్వాభిసారులు, దరదులు, శకులు, మారరులు, తంగణులు, ఆంధ్రకులు, పులిందులు, కిరాతులు, మ్లేచ్ఛులు, పర్వతీయులు, సాగరతీరవాసులు - వీరంతా యుద్ధనిపుణులు, క్రుద్ధులు, బలశాలులు, దండపాణులు. సుయోధనుని కోసం, కోపంతో కౌరవులతో కలిసి పోరాడుతున్నవారు. పరంతపా! నీవు తప్ప మరెవ్వడు వీరిని యుద్ధంలో జయించగలడు ? భీకరమైన సుయోధనవ్యూహాన్నీ, మహాబలాన్ని చూసి, నీవు రక్షణగా నిలవకపోతే ఏ మానవుడు వారిని ఎదిరించగలడు ? ప్రభూ! నీ రక్షణలోనే పాండవసేనలు ధూళితో కప్పబడి, సముద్రంవలె ఎగిసిపడుతున్న కౌరవసేనను ఛిన్నాభిన్నం చేయగలిగాయి. మగధాధిపతి అయిన జయత్సేనుని అభిమన్యుడు యుద్ధంలో చంపి ఇప్పటికి ఏడు రోజులు. ఆపై భీమసేనుడు భీమకర్ములు చేయగల ఆ జయత్సేనుని, పదివేల ఏనుగులను గదతో కొట్టి చంపాడు. ఆ తరువాత బలాన్ని ప్రదర్శిస్తూ వందలకొలది ఏనుగులను, రథికులను

సంహరించాడు. అర్జునా! ఈ రీతిగా మహాభయంకరమైన పోరు జరుగుతుంటే, కౌరవులు భీమసేనుని, నిన్ను ఎదిరించి గుర్రాలతో, రథాలతో, ఏనుగులతో సహా ఈ రణభూమి నుండి మృత్యులోకానికి వెళ్ళిపోయారు. అర్జునా ! ఆ రీతిగా పాండవులు కౌరవ సేనా ముఖాన్ని, భగ్నం చేయగా భీష్ముడు తీక్ష్ణ బాణసమూహాలను కురిపించాడు.

పరమాస్త్రవేత్త అయిన ఆ భీష్ముడు చేది వంశస్థులను, కాశి దేశీయులను, పాంచాలురను, కరూషులను, మత్స్యకేకయులను బాణాలతో కప్పి చంపివేశాడు. ఆయన వింటినుండి వెలువడిన బాణాలు శత్రు శరీరాలను చీల్చగలవి. బంగారు పక్షాలు గల ఆ బాణాలతో గగనమంతా నిండిపోయింది. ఒకే ఒక పిడికెడు బాణాలతో ఆ భీష్ముడు రణభూమిలో గుమిగూడిన వేలకొలది రథికులను, మహాబలులైన లక్షమంది సైనికులను, ఏనుగులను చంపగలడు. భీష్ముడు రణభూమిలో దోషయుక్తమైన తొమ్మిది మార్గాలను వీడి, పదవగతితోనే బాణాలు విడిచాడు. అవి మన సేనలోని గుర్రాలను, రథికులను, ఏనుగులను చంపాయి. భీష్ముడు పదిరోజులు నీ సేనను సంహరిస్తుంటే, రథం మీది ఆసనాలన్నీ శూన్యం చేయబడ్డాయి. ఏనుగులు, గుర్రాలు చనిపోయాయి. రుద్రునితో, విష్ణువుతో సమానమైన తన రూపాన్ని ప్రదర్శించి, రణభూమిలో పాండవసేనలను బలపూర్వకంగా నాశనం చేశాడు. చేది, పాంచాల, కేకయరాజులను సంహరిస్తూ రథాలతో, గుర్రాలతో, ఏనుగులతో నిండియున్న పాండవ సేనను దహించాడు. తెప్పలేకుండా మునిగిపోతున్న మందమతియైన సుయోధనుని ఉద్ధరించాలని అలా ప్రయత్నించాడు. ప్రజ్వలించే సూర్యునివలె రణభూమిలో అలా సంచరిస్తున్న భీష్ముని గొప్పగొప్ప ఆయుధాలు చేతబట్టిన వేలకోట్ల సృంజయసైనికులు కానీ, ఇతర రాజులు కానీ కనీసం చూడలేకపోయారు. జయశీలుడై ఆ రీతిగ యుద్ధరంగంలో విజృంభిస్తున్న భీష్ముని పాండవులు తీవ్రప్రయత్నంతో ఎదిరించారు. ఆ భీష్ముడు రణరంగంలో పాండవులనూ, సృంజయులనూ కూడా ఒంటరిగా పారద్రోలి ఏకవీరుడయ్యాడు. నీ రక్షణలో నున్న శిఖండి మహావ్రతశీలుడు, పురుషశ్రేష్ముడు అయిన భీష్ముని సమీపించి, వంగిన కణుపులు గల బాణాలతో కొట్టాడు. ఇంద్రుని ఎదిరించి వృత్రుడు నేలగూలినట్లు, పురుషోత్తముడవైన నీతో తలపడి ఆ భీష్ముడు శరతల్పంపై పడిపోయాడు. అడుగో.

ఉగ్రుడైన ద్రోణుడు అయిదుదినాలు అభేద్య వ్యూహాలను నిర్మించి, మహారథులను పడగొట్టి, శత్రువులను మథించి, మహారథుడై రణభూమిలో సైంధవుని రక్షించి, యమసమానుడై రాత్రి యుద్ధంలో ప్రజలను దగ్ధం చేశాడు. వీరుడు అయిన ద్రోణుడు బాణాలతో

యోధులను దహించి, ధృష్టద్యుమ్ననితో తలపడి పరమపదాన్ని పొందాడు. ఆ సమయంలో నీవు రణభూమిలో కర్ణుడు మొదలయిన రథికులను నివారించిఉండకపోతే ద్రోణుడు మరణించేవాడు కాదు. ధనంజయా! దుర్యోధనుని సైన్యమంతటినీ నీవు నిరోధించావు. అందువలన ధృష్టద్యుమ్నుడు ద్రోణుని చంపగలిగాడు. సైంధవవధ విషయంలో నీవు ప్రదర్శించిన పరాక్రమాన్ని, నీవు తప్ప రణభూమిలో మరే క్షత్రియుడు ప్రదర్శించగలడు ? రాజా! నీవు అస్త్రబలతేజస్సుతో మహాసైన్యాన్ని నిలువరించి, శూరులైన రాజులను సంహరించి, సైంధవుని చంపావు. రాజులందరూ సైంధవుని వధను ఆశ్చర్యకర విషయంగా భావించారు. కానీ నీవు మహారథుడవు. నీకది ఆశ్చర్య విషయం కాదు. భారతా! రణభూమిలో నిన్నెదిరించిన ఈ క్షత్రియగణం ఒక్కరోజులోనే నశించిపోగలదు. అది తగినదని నా భావన. నా నిశ్చయం కూడా. అర్జునా! దుర్యోధనుని ఈ మహాసేన రణరంగంలో భీష్మద్రోణులు పడిపోయినప్పుడే, వీరు లందరినీ కోలుపోయినట్లే గదా! ఈ కౌరవసేన ప్రధానయోధులందరూ శిథిలం కాగా, గుర్రాలు, రథికులు, ఏనుగులు నశించగా, సూర్యచంద్రులు లేని ఆకాశం వలె భాసిస్తోంది. పార్థా! భీమపరాక్రమా! ఇంద్రుని పరాక్రమంలో రాక్షసపురసేన ధ్వంసమయినట్లు, ఈ కౌరవసేన నీ పరాక్రమంతో విధ్వంసానికి లోనయింది. చావగా మిగిలిన వారిలో అయిదుగురు మహారథులున్నారు. వారు అశ్వత్థామ, కృతవర్మ, కర్ణుడు, శల్యుడు, కృపుడు. నరోత్తమా! ఈనాటి యుద్ధంలో నీవు ఆ అయిదుగురు మహారథులనూ చంపి, శత్రుశేషం లేని ఈ రాజ్యాన్ని ద్వీపనగరాలతో సహా ధర్మరాజుకు అందించు. ఆకాశ సముద్ర పాతాళాలతో, పర్వత మహావనాలతో సహా అమిత బలసంపన్నుడైన ధర్మరాజు ఈ రోజు రాజ్యాన్ని పొందాలి. పూర్వకాలంలో దైతేయదానవులను చంపి విష్ణువు ఇంద్రునకు మూడులోకాల నిచ్చినట్లు, నీవు రాజ్యాన్ని ధర్మరాజున కివ్వు. విష్ణువు దానవులను చంపినప్పుడు దేవతలు ఆనందించినట్లు, నీవు శత్రువులను చంపగా, పంచాలురు నేడు ఆనందించాలి.

అరవిందనేత్రా! మానవోత్తముడైన ద్రోణునిపై గల గౌరవభావంతో అశ్వత్థామపై, కృపునిపై నీవు జాలిచూపితే, మాతృపక్షం, బంధువులను పరమపూజనీయులుగా భావించి కృతవర్మను సమీపించి కూడా నీవు చంపకపోతే, మీ అమ్మ సోదరుడన్న దయతో మద్రరాజైన శల్యుని నీవు చంపదలపకపోతే... నరశ్రేష్ఠా! పాపబుద్ధి, క్షుద్రుడు, తీవ్రపాండవ ద్వేషి అయిన కర్ణుని అయినా ఈ రోజు పదునైన బాణాలతో చంపు. ఇది నీవు చేసే పుణ్యకర్మయే. ఇక్కడ ఆలోచించవలసిన దేదీ లేదు. మేము కూడా అంగీకరిస్తున్నాం.

దీనిలో తప్పేమీ లేదు. అనఘా! రాత్రివేళ బిడ్డలతోపాటు నీ తల్లిని తగులబెట్టడంలో, జూదం విషయంలో మీ పట్ల సుయోధనుని ప్రవర్తనకు అంతటికీ మూలం దురాత్ముడైన ఈ కర్ణుడే. సుయోధనుడు ఎప్పుడూ కర్ణునివలననే తనకు రక్షణ అని భావిస్తాడు. అందువలననే కోపంతో నన్ను కూడా బంధించాలని ప్రయత్నించాడు. మానదా! "కర్ణుడు రణరంగంలో పాండవులనందరినీ గెలువగలడు. అనుమానం లేదు" అన్నది సుయోధనుని స్థిరనిర్ణయం. అర్జునా! కర్ణుని ఆశ్రయించియే, సుయోధనుడు నీ బలం తెలిసి కూడా, నీతో పోరాటాన్ని ఇష్టపడుతున్నాడు. "నేను ఒక్కటిగా వచ్చినా పాండవులనందరినీ, దాశార్హుడు, మహారథుడు అయిన వాసుదేవుని గెలువ గల"నని కర్ణుడు రోజూ మాటాడుతుంటాడు. దురాత్ముడు, మహాదుర్బుద్ధి అయిన సుయోధనుని ప్రోత్సహిస్తూ, కర్ణుడు సభలో గర్జిస్తుంటాడు. భారతా! ఈరోజు చంపివేయి. దుర్యోధనుడు మీ విషయంలో ప్రయోగించిన పాప కృత్యాలన్నింటిలో దురాత్ముడు, పాపబుద్ధి అయిన కర్ణుడే ప్రధాన కారణం. సఖా! సుభద్రకొడుకు అభిమన్యుడు ఋషభ నేత్రుడు, ఋషభస్కంధుడు, కౌరవ, వృష్ణివంశాలకు కీర్తి తెచ్చేవాడు. అతడు వీరులు నరశ్రేష్ఠులైన ద్రోణుని, అశ్వత్థామను, కృపుని పీడించసాగాడు. ఏనుగులపైనున్న హస్తిపకులను పడగొట్టాడు. మహారథులను, విరథులను జేశాడు. గుర్రాల మీదనుండి ఆశ్వికులను కూలగొట్టాడు. సైనికులచేతి ఆయుధాలను పడగొట్టి, ప్రాణాలు తీశాడు. సేనలను ధ్వంసం చేస్తూ, మహారథులను వ్యథ పెట్టాడు. సైనికులను, గుర్రాలను, ఏనుగులను యమలోకానికి పంపించాడు. అటువంటి అభిమన్యుడు బాణాలతో సేనను దహిస్తూ వస్తుంటే, దుర్యోధనుని మహారథులు ఆర్గురు క్రూరులై చంపివేశారు. అది నా కళ్ళతో నేను చూశాను. అది నా శరీరాన్ని దహిస్తోంది. సత్యప్రమాణంగా చెప్తున్నాను. ఆ సందర్భంలో కూడా దుష్టాత్ముడైన కర్ణుడు ద్రోహం చేశాడు.

కర్ణుడు రణభూమిలో అర్జునునకు ఎదురునిలువలేక, అభిమన్యు బాణాల పీడనకు గురియై, నెత్తురోడుతూ చైతన్యాన్ని కోల్పోయాడు. ఆపై క్రోధంతో మండిపడుతూ, నిట్టూర్పులు విడుస్తూ బాణాల పీడనకు లోనయి యుద్ధవిముఖు డయ్యాడు. పారిపోవటానికే ఉత్సహించాడు. జీవితం మీద ఆశ వదులుకొన్నాడు. రణభూమిలో గాయపడినందువలన శ్రమకు గురియై పరవ్యాకులత్వంతో నిలిచిపోయాడు. ఆపై ఆ కాలానికి తగినట్లుగా ద్రోణుడు పలికిన పలుకులను విని, కర్ణుడు ఆ తరువాత అభిమన్యుని ధనుస్సును ఖండించాడు. కర్ణుడు రణభూమిలో అలా అభిమన్యుని వింటిని విరగగొట్టిన తరువాత, వంచనా నిపుణులైన ఆ అయిదుగురు మహారథులు శరవృష్టితో అభిమన్యుని

గాయపరచసాగారు. వీరుడైన ఆ అభిమన్యుడు మరణించగానే అందరూ దుఃఖించారు. దురాత్ముడైన కర్ణుడు, ఆ సుయోధనుడు మాత్రం నవ్వారు. కౌరవ పాండవ సమక్షంలో, కొలువులో, క్రూరునివలె కర్ణుడు ద్రౌపదితో పరుషంగా ఇలా మాటాడాడు.

"ద్రౌపదీ! పాండవులు నశించినట్లే. శాశ్వత నరకానికి వెళ్ళినట్లే. పృథుశ్రోణీ! మృదుభాషిణీ! మరొక భర్తను వరించు. ఈ స్థితిలో నీవు ధృతరాష్ట్రునకు దాసివై అంతఃపురంలోనికి ప్రవేశించు. విశాలాక్షీ ! నీకు భర్తలు లేరు. పాండవులు ఏరీతిగానూ నీపై అధికారులు కాలేరు. పాంచాలీ! నీవు దాసుల భార్యవు. సుందరీ ! నీవు స్వయంగా దాసివి. ఇప్పుడు లోకంలో దుర్యోధను డొక్కడే రాజుగా భావింపబడుతున్నాడు. రాజులందరు సుయోధనుని యోగక్షేమాలనే కోరుతున్నారు. కళ్యాణీ! ఇప్పుడు చూడు! పాండవులందరూ సుయోధనుని తేజస్సుతో ఒక్కసారిగా నశించి, ఒకరి నొకరు చూసికొంటున్నారు. వీరంతా పుచ్చిపోయిన నువ్వులవంటివారు (నపుంసకులు) నరకాన మునిగిపోయారు. దాసులవలె దుర్యోధన నరపాలుని సేవించబోతున్నారు". భారతా! ధర్మమెరుగని పరమదుర్బుద్ధి, పాపి అయిన కర్ణుడు, నీవు వింటుండగానే అటువంటి పాపవచనాలను పలికాడు. ఈనాడు బంగారంతో చేసి సానపెట్టిన ఈ బాణాలు నీవు ప్రయోగించగా, జీవితాన్ని ఛేదించి, ఆ పాపాత్ముని ఆ వాక్యాలను ఉపశమింపజేయాలి.

దుష్టాత్ముడైన కర్ణుడు నీ విషయంలో మరెన్నో పాపాలను కూడా చేశాడు. నీ బాణాలు ఆ పాపాలను, కర్ణుని జీవితాన్ని శమింపజేయాలి. ఈనాడు గాండీవం నుండి వెలువడిన దారుణ బాణాలు శరీరాన్ని తాకుతుంటే, దుష్టాత్ముడైన కర్ణుడు ద్రోణభీష్ముల వచనాలను తలచుకొంటాడు. నీవు విడవబోయే బాణాలు బంగారు రెక్కలు గలవి. శత్రుసంహారం చేయగలవి. మెరుపువంటి కాంతిగలవి. అవి కర్ణుని కవచాన్ని ఛేదించి, నెత్తురు త్రాగాలి. నీ భుజాలనుండి వెలువడి, మహావేగంగా ప్రసరించే బాణాలు, మర్మస్థానం ఛేదించి కర్ణుని యమసదనానికి పంపాలి. నేడు నీ బాణాలచే పీడింపబడి, విషణ్ణులై ఉన్న రాజులు హాహాకారాలు చేస్తూ, రథంమీద నుండి పడుతున్న కర్ణుని చూస్తారు. ఈరోజు ఆయుధాలు అటు ఇటూ పడి పోగా, నేలపైబడి, నెత్తుటిలో మునిగి ఉన్న కర్ణుని, బాంధవు లందరూ దీనులై చూస్తారు. ఏనుగు పట్టా చిహ్నంగా గల కర్ణుని మహాధ్వజం, నీచేత భల్లంచే మథింపబడి, కంపిస్తూ నేలపై కూలిపోవాలి. శల్యుని రత్నవిభూషితమైన రథాన్ని, నీవు వందల బాణాలతో భగ్నం చేసి, గుర్రాలను చంపివేస్తే శల్యుడు దాన్ని వీడి భయంతో పారిపోవాలి. అర్జునా! కర్ణుడు చూస్తుండగానే, నీవు

ప్రతిజ్ఞాపాలన చేస్తూ, బాణాలతో కర్ణుని కుమారుని సంహరిస్తే, చనిపోయిన ప్రియపుత్రుని చూసి, దురాత్ముడైన కర్ణుడు ద్రోణుడు, భీష్ముడు, విదురుడు చెప్పిన మాటలను తలచుకోవాలి. ఆపై నీచేత చచ్చిన కర్ణుని చూసి, నీ శత్రువైన దుర్యోధనుడు జీవితం మీదా, రాజ్యం మీదా ఈ రోజే ఆశను వదలుకోవాలి. పదునైన బాణాలతో కర్ణుడు హింసిస్తున్నా, ఈ పాంచాలురు పాండవులను ఉద్ధరించాలన్న భావనతో, కర్ణుని మీదకు దూసుకొనిపోతున్నారు. పంచాలురు, ద్రౌపది కొడుకులు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ధృష్టద్యుమ్నుని కొడుకులు, నకులుని కొడుకు శతానీకుడు, నకులుడు, సహదేవుడు, దుర్ముఖుడు, జనమేజయుడు, సుధర్ముడు, సాత్యకి – వీరంతా కర్ణుని అధీనంలోనికి వెళ్ళారు. నీ బంధువులైన పంచాలురు రణరంగంలో కర్ణుని చేత గాయపరచబడి, ఘోరంగా చేస్తున్న ఆర్తనాదం వినిపిస్తోంది. పంచాలురు పిరికివారై ఎట్టి పరిస్థితిలోనూ యుద్ధవిముఖులు కారు. ఈ మేటివిలుకాండ్రు మహా సంగ్రామంలో మృత్యువును కూడా లెక్కచేయరు. భీష్ముడు ఒంటరిగా పాండవసేన నంతటినీ బాణ సమూహాలతో చుట్టివేశాడు. అటువంటి భీష్ముని ఎదిరించి కూడా పంచాలురు యుద్ధవిముఖులు కాలేదు. ఇక ఆ మహారథులు కర్ణుని ఎదుటనుండి ఎలా పారిపోతారు ?

మిత్రవత్సలా! వీరుడైన ద్రోణాచార్యుడు ఒంటరిగానే, ప్రతిదినమూ పంచాలుర నందరనూ సంహరిస్తూ, వారి రథసేనలో మృత్యువు వలె సంచరించసాగాడు. ద్రోణుడు తన బలంతో ఎదురులేనివాడై, అస్త్రాగ్నితో మండిపడుతూ, యుద్ధంలో బలాలను సంహరిస్తుంటే, పాంచాలురు పాండవులకోసం ఎప్పుడూ ఉల్లాసంతో యుద్ధం చేస్తూనే ఉన్నారు. శత్రువులను గెలవటానికి ఉద్యమిస్తూనే ఉన్నారు. కర్ణునకు భయపడి, వారు యుద్ధవిముఖులు కాలేదు. నిప్పు తనను సమీపించిన మిడతలను దహించినట్లు, పంచాలురు వేగంగా తనమీదకు వస్తుంటే శూరుడైన, కర్ణుడు బాణాలతో వారి ప్రాణాలు బలిగొన్నాడు. భరతశ్రేష్ఠా! చూడు ! చూడు ! పంచాలురు పారిపోతున్నారు. శత్రుయోధులు, కర్ణుడు వారిని తరుముతున్నారు. వారి స్థితిని గమనించు. మిత్రులకై, ప్రాణాలపై ఆశవీడి, అలా ఎదిరించిన పాంచాలవీరులను, రణభూమిలో, వందల కొలదిగ కర్ణుడు సంహరిస్తున్నాడు. మేటి విలుకాండ్రు అయిన పాంచాలురు అగాధమైన కర్ణసాగరంలో తెప్పలేక మునిగిపోతున్నారు. నీవు తెప్పవై వారిని కాపాడాలి. ఋషిసత్తముడైన భార్గవరాముని నుండి కర్ణుడు పొందిన అస్త్రం తన మహాఘోర రూపాన్ని ప్రకటిస్తోంది. ఆ భార్గవాస్త్రం ఘోరరూపంతో, పరమదారుణంగా మహాసేనను ఆవరించి, తన తేజస్సుతో ప్రజ్వలిస్తూ, సర్వసేనలను

తపింపజేస్తున్నది. రణరంగంలో కర్ణుని వింటినుండి వెలువడిన ఈ బాణాలు తుమ్మెదల సమూహంవలె, నీ సేనలను తపింపజేస్తున్నాయి.

తమను తాము అదుపులో ఉంచుకొనలేని వారు, ఎదిరింపరాని కర్ణాస్త్రం తగిలి, ఈ పంచాలురు అన్ని దిక్కులకు పారిపోతున్నారు. పార్థా! ఈ భీముడు తీవ్రకోపంతో సృంజయుల మధ్యలో నిలిచి కర్ణునితో పోరాడుతూ, పదునైన బాణాలతో పీడింపబడుతున్నాడు. వచ్చిన రోగం శరీరాన్ని నశింపజేసినట్లు, కర్ణుని ఉపేక్షిస్తే, పాండవులను, సృంజయులను, పంచాలురను నశింపజేస్తుంది. రణభూమిలో రాధేయుని ఎదిరించి క్షేమంగా ఇంటికి రాగలవాడు యుధిష్ఠిరసేనలో నీవు తప్ప నాకెవ్వరూ కనిపించటం లేదు. ఆ కర్ణుని నీవు నేడు పదునైన బాణాలతో సంహరించి, ప్రతిజ్ఞను పూర్తి చేసికొని కీర్తిని పొందాలి. కర్ణునితో సహా కౌరవులను రణభూమిలో నీవే జయించగలవు. మరెవ్వరూ చేయలేరు. నీకు ఈ సత్యాన్ని చెప్తున్నాను. మహాకార్యాన్ని సాధించి, మహారథుడైన కర్ణుని సంహరించి, కృతార్థుడవై, సఫలుడవై సుఖంగా ఉండు."

74. అర్జునుడు వీరోచితముగా పలుకుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "భారతా! ఆ కేశవుని మాటలు విని, అర్జునుడు క్షణకాలంలోనే శోకాన్ని వీడి, ఉత్సాహాన్ని పొందాడు. ఆపై అల్లెత్రాటిని పరామర్శించి, గాండీవ ధనుస్సును వంచి, కర్ణవినాశం కోసం ఎక్కుపెట్టి, కృష్ణునితో ఇలా అన్నాడు. "గోవిందా! నీవు ఆసరాగా ఉంటే, నాకు తప్పక గెలుపు లభిస్తుంది. లోకంలోని భూతభవిష్యత్తులకు కర్తవైన నీవు నేడు నాకు ప్రసన్నుడవయ్యావు. కృష్ణా! మూడు లోకాలు కలిసి ఎత్తివచ్చినా, నీ సహాయముంటే నేను పరలోకానికి పంపగలను? ఇక ఈ మహాసంగ్రామంలో కర్ణుడెంత ? జనార్దనా! పాంచాలసేన పారిపోవటం చూస్తూనే ఉన్నాను. రణభూమిలో నిర్భయంగా చరిస్తున్న కర్ణుని చూస్తూనే ఉన్నాను. కృష్ణా! వార్ష్ణేయా! ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధం వలె, కర్ణుడు ప్రయోగించిన భార్గవాస్త్రం ప్రజ్వలిస్తోంది చూస్తూనే ఉన్నాను. నేను కర్ణుని సంహరిస్తాను. భూమి ఉన్నంతకాలం, ప్రాణులు ఈ సంగ్రామాన్ని గురించి చెప్పుకోవాలి. కృష్ణా! ఈ రోజు నేను ప్రయోగించగా, గాండీవం నుండి వెలువడిన బాణాలు కర్ణుని మృత్యు సన్నిధికి కొనిపోతాయి. రాజ్యానికి అర్హతలేని దుర్యోధనుని, ధృతరాష్ట్రుడు రాజును చేశాడు. నేడు ఆయన తన ఆ బుద్ధిని నిందించుకోవాలి. నేడు ధృతరాష్ట్రుడు రాజ్యం నుండి, సుఖం నుండి, సంపదనుండి, రాష్ట్రం నుండి,

నగరం నుండి, కుమారుల నుండి విముక్తిని పొందాలి.

గుణవంతుని ద్వేషించి, గుణహీనుని రాజును చేసేవాడు, వెంటనే వచ్చిన వినాశనాన్ని చూసి బాధపడవలసి వస్తుంది. జనార్దనా! ఒకడు పెద్ద మామిడితోటను నరికి, ఆపై మామిడిపండును చూసి, తీవ్రంగా దుఃఖించినట్లు, కర్ణుడు నేడు మరణించగానే, దుర్యోధనుడు నిరాశకు లోనవుతాడు. కృష్ణా! ఈరోజు కర్ణుడు చనిపోగానే, దుర్యోధనుడు రాజ్యంనుండి, జీవితంనుండి విరక్తు డవుతాడు. నీకు సత్యం చెప్తున్నాను. నేడు నా బాణాలతో ముక్కలు ముక్కలైన కర్ణుని చూసి, రాజు సంధివిషయంలో నీవు చెప్పిన మాటలను గుర్తు చేసికోవాలి. కృష్ణా! ఈరోజు శకుని బాణాలే ఎత్తుగడలనీ, గాండీవమే పాచికలనీ, రథమే అక్షవేది అనీ గ్రహిస్తాడు. ఈ రోజు పదునైన బాణాలతో కర్ణుని సంహరించి, యుధిష్ఠిరుని జాగరణను తొలగిస్తాను. నేడు నేను కర్ణుని సంహరించగానే, ధర్మరాజు మనసా పరమానందపడి, ఆనందంతో చిరసుఖాన్ని అనుభవిస్తాడు. ఈ రోజు తిరుగులేని వింటిని, సాటిలేని బాణాన్ని సృష్టిస్తాను. అవి కర్ణుని జీవితం నుండి తప్పిస్తాయి. ఆ దురాత్ముడు అర్జునుని చంపేదాకా, ఇతరులవైపు కాళ్ళు కదపనని, వ్రతాన్ని పూనాడు. ఆ పాపాత్ముని వ్రతాన్ని అసత్యం చేస్తూ, పదునైన బాణాలతో అతని శరీరాన్ని రథంమీద నుండి పడగొడతాను. రణభూమిలో లోకంలోని మరొక మనుష్యుని ఆ కర్ణుడు అంగీకరించడు. అటువంటి సూతపుత్రుని నెత్తుటిని ఈరోజు భూమి త్రాగుతుంది.

సూతపుత్రుడైన కర్ణుడు ధృతరాష్ట్రునివైపు నిలిచి తన గుణాలను శ్లాఘించుకొంటూ "ద్రౌపదీ, నీవు భర్తృహీనవు" అన్నాడు. కోపించిన సర్పాలవంటి నా పదునైన బాణాలు దానిని అసత్యం చేస్తాయి. భూమి నెత్తురు త్రాగుతుంది. హస్తలాఘవం గల నేను ప్రయోగించే మెరుపుల వంటి బాణాలు గాండీవం నుండి వెలువడి, కర్ణునికి పరమపదాన్ని అందిస్తాయి. సభా మధ్యంలో పాండవులను నిందిస్తూ, పాంచాలిని గురించి క్రూరంగా మాటాడినందుకు, కర్ణుడు నేడు పశ్చాత్తాపపడతాడు. దురాత్ముడు సూర్యసుతుడైన కర్ణుడు మరణిస్తే, నాటి పుచ్చిన నువ్వులే నేడు మంచి నువ్వులవుతాయి. కర్ణుడు తన గుణాలను తానే ప్రశంసించు కొంటూ "పాండవుల నుండి మిమ్ములను నేను కాపాడుతాను" అని ధృతరాష్ట్రుని కొడుకులకు మాట ఇచ్చాడు. నా పదునైన బాణాలు దానిని అసత్యం చేస్తాయి. పాండవుల యుద్ధ ప్రయత్నమంతా పరిసమాప్తమవుతుంది. పాండవులనందరినీ, కొడుకులతో సహా సంహరిస్తానని కర్ణుడన్నాడు. ఆ కర్ణుని విలుకాండ్రు అందరూ చూస్తుండగా నేడు సంహరిస్తాను. దుర్బుద్ధి, దురాత్ముడు, ఆత్మాభిమాని అయిన దుర్యోధనుడు

కర్ణుని బలాన్ని ఆశ్రయించి, మమ్ములను పరాభవించాడు. ఆ కర్ణుని రణభూమిలో సంహరించి నేను అన్నను సంతోషపెడతాను. వివిధ శరాలను విడిచి శత్రువులను భయపెడతాను. చెవిదాకా లాగి విడిచిన నా బాణాలు యమలోకాన్ని వర్ధిల్లజేస్తాయి. వాటితో రథాలను, ఏనుగులను పడగొట్టి రణభూమికి అందం తెస్తాను. ఆ మహాసంగ్రామంలో యుద్ధదుర్మదుడు, శస్త్రాస్త్ర సంపన్నుడు అయిన కర్ణుని, బాణాలతో నేడు ఘోరంగా చంపివేస్తాను.

కృష్ణా! నేడు కర్ణుడు చనిపోగానే, దుర్యోధనునితో పాటు ధార్తరాష్ట్రులందరూ సింహానికి భయపడిన జంతువుల వలె, పదిదిక్కులకూ పారిపోతారు. ఈరోజు సంగ్రామంలో కర్ణుడు పుత్రులతో, మిత్రులతో పాటు మరణించగానే దుర్యోధనుడు తనపై తాను జాలిపడాలి. కృష్ణా! ఈరోజు చనిపోయిన కర్ణుని చూసి, మరీ అసహనశీలుడైన దుర్యోధనుడు యుద్ధంలోనన్ను ధనుర్ధారులందరిలో మేటినిగా తెలిసికోవాలి. ఈ రోజు పుత్రులతో, పౌత్రులతో, అమాత్యులతో, భృత్యులతో సహా ధృతరాష్ట్ర మహారాజుకు రాజ్యలోభాన్ని పోగొడతాను. ఈ రోజు బాణాలతో భిన్నమైన కర్ణుని శరీరావయవాలపై చక్రవాకాలు, వివిధ మాంస భక్షక జంతువులు విహరించాలి. ఈరోజు యుద్ధంలో విలుకాండ్రు అందరూ చూస్తుండగా కర్ణుని తలను ఖండిస్తాను. ఈరోజు తీక్ష్ణమైన విపాఠాలతో, క్షురాలతో, రణభూమిలో కర్ణుని శరీరావయవాలను ఖండిస్తాను. ఈరోజు యుధిష్ఠిరరాజు పెద్ద కష్టం నుండి బయటపడతాడు. ఎప్పటినుండియో తనలో నున్న మనోవ్యథను ఆ వీరుడు తొలగించుకొంటాడు. కేశవా! ఈ రోజు బంధువులతో సహా కర్ణుని సంహరించి, నేను ధర్మపుత్రుడైన యుధిష్ఠిరనరపాలుని ఆనందింపజేస్తాను. కృష్ణా! ఈ రోజు దీనులైన కర్ణుని అనుచరులను రణభూమిలో విషసర్పాలవలె, అగ్నివలె ప్రకాశించే బాణాలతో సంహరిస్తాను. ఈరోజు నేను కవచాలు, మణికుండలాలు ధరించిన రాజులతో ఈ నేలనంతా పరుస్తాను. ఈ రోజు అభిమన్యుని శత్రువులందరి శిరస్సులను, శరీరాలను, పదునైనబాణాలతో మధిస్తాను. ఈరోజు ధార్తరాష్ట్రులు లేని రాజ్యాన్ని అన్నకిస్తాను. లేదా అర్జునుడు లేని నేలపై నీవు సంచరిస్తావు. ఈరోజు నేను ధనుర్ధారులూ, కోపం, కురువంశస్థులు, బాణాలు, గాండీవం – వీటన్నింటి ఋణం నుండి విముక్తినందుతాను.

పదమూడు సంవత్సరాల నుండి నేను భరిస్తున్న దుఃఖాన్ని, నేడు ఇంద్రుడు శంబరుని చంపినట్లు, కర్ణుని చంపి వదిలించుకొంటాను. ఈ రోజు యుద్ధంలో కర్ణుడు చనిపోతే, రణభూమిలో మిత్రకార్యం సఫలం కావాలని కోరుకొనే సోమక మహారథులందరూ

తమను సఫలులుగా భావించుకొంటారు. ఈరోజు నేను కర్ణుని చంపి, విజయంతో ప్రతిష్ఠనందగానే, సాత్యకి ఎంత ఆనందిస్తాడో తెలియదు. నేను యుద్ధంలో కర్ణునీ, మహారథుడైన అతని కుమారునీ చంపి, భీమునికి, నకుల సహదేవులకు, సాత్యకికి ప్రీతిని కలిగిస్తాను. మాధవా! ఈ రోజు మహాసంగ్రామంలో కర్ణుని చంపి, ధృష్టద్యుమ్న, శిఖండి, పంచాలుర ఋణం తీర్చికొంటాను. ఈరోజు రణభూమిలో కౌరవులతో యుద్ధం చేస్తూ, కర్ణుని చంపుతున్న అసహనశీలుడైన అర్జునుని చూడవచ్చు. నీ సమక్షంలో మరల ఆత్మస్తుతి చేసికొంటాను. ధనుర్వేదంలో నా పాటివాడు లోకంలో లేడు. పరాక్రమంలో నా సాటివాడు లేడు. నాఅంత సహనశీలుడూ లేడు. నాతో సమానమైన కోపనుడూ లేడు. నేను విల్లుపట్టి సురాసురులతో పాటు సర్వప్రాణులు కలిసివచ్చినా, నా బాహుబలంతో పరాభవింపగలను. నా పౌరుషం పెచ్చులకంటే పెచ్చు. బాణజ్వాలలతో కూడిన గాండీవంతో నేను ఒంటరిగా కౌరవులనందరినీ, బాహ్లికులను కూడా చంపి, గ్రీష్మకాలంలో ఎండుగడ్డిలోని అగ్నివలె, అందరినీ బలపూర్వకంగా దహించగలను. నా చేతిలో బాణచిహ్నాలున్నాయి. బాణంతో కూడిన విశాలమైన వింటి గుర్తుంది. నా పాదాలలో రథధ్వజ చిహ్నాలున్నాయి. అటువంటి నన్ను యుద్ధంలో ఎవరూ గెలవలేరు." అలా పలికి ఏకవీరుడైన అర్జునుడు కోపంతో కళ్ళెర్రజేసి, శత్రుసూదనుడై రణభూమిలో భీముని విడిపించటానికీ, కర్ణుని తలను శరీరం నుండి అపహరించటానికి బయలుదేరాడు."

75. ద్వంద్వ యుద్ధము - సుషేణవధ

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "నాయనా! నా వారికి, పాండవ సృంజయులకు మధ్య అగాధమూ, భయంకరమూ అయిన యుద్ధం అప్పటికే జరుగుతోంది. ఆ స్థితిలో అర్జునుడు కర్ణునితో యుద్ధానికి వచ్చాడు. అప్పుడు యుద్ధమెలా జరిగింది ?" సంజయుడు ఇలా చెప్తున్నాడు. "ఇరుపక్షాల సేనలూ, పెద్ద పెద్ద ధ్వజాలతో అస్త్రశస్త్ర సంపదతో గుమిగూడాయి. భేరీ నినాదాలతో వారు రణోన్ముఖులై, వర్షాకాలపు మేఘాలవలె గర్జిస్తున్నారు. క్రమంగా క్రూరమైన ఆ యుద్ధం, అకాలంలో కురిసిన అనిష్టవృష్టివలె, జనవినాశన హేతువయింది. పెద్దపెద్ద ఏనుగుల గుంపులు మేఘాల వలె క్రమ్ముకొన్నాయి. అస్త్రాలే అక్కడ జలం అయ్యాయి. వాద్యధ్వని, రథనేమిధ్వని మేఘగర్జనవలె ఉన్నవి. బంగారు తొడుగులు గల ఆయుధాలు మెరుపులు, బాణాలు, కత్తులు, నారాచాలు మొదలయిన అస్త్రపరంపర జలధారవలె ఉన్నది. అది వేగాన్ని పుంజుకొని నెత్తుటి ప్రవాహాలను కల్పించింది.

కత్తుల విసురులతో క్షత్రియుల ప్రాణాలు పోతున్నాయి. అనేక రథికులు ఒక్కటిగా కూడి, ఒక రథికుని చుట్టుముట్టి యమలోకానికి పంపుతున్నారు. అలాగే ఒకే రథికుడు ఒకే రథికుని లేదా అనేక శ్రేష్ఠ రథికులను యమలోకానికి పంపుతున్నాడు. ఒకానొక రథికుడు సారథితో, గుర్రాలతో పాటు ఒక రథికుని మృత్యువునకు అధీనం చేస్తున్నాడు. ఒకానొకడు ఒకే ఏనుగుతో అనేక రథికులను, గుర్రాలను మృత్యుపరం చేస్తున్నాడు. అర్జునుడు సారథితో, గుర్రాలతో సహా రథాలను, ఏనుగులను, సర్వ శత్రువులను, అలాగే రౌతులతో పాటు గుర్రాలను, కాల్బలాన్ని బాణ సమూహాలతో మృత్యుపరం చేస్తున్నాడు. రణభూమిలో కృపుడు, శిఖండి కలబడ్డారు. సాత్యకి దుర్యోధనునిపై దాడిచేశాడు. శ్రుతశ్రవుడు అశ్వత్థామతో, యుధామన్యుడు చిత్రసేనునితో తలపడ్డారు. సృంజయ వంశీయుడైన రథికుడు ఉత్తమౌజుడు కర్ణసుతుడైన సుషేణుని ఆక్రమించాడు. ఆకలిగొన్న సింహం ఎద్దుపై దాడిచేసినట్టు సహదేవుడు శకునిపై దాడిచేశాడు. నకులుని కొడుకైన శతానీకుడు యువకుడు, కర్ణుని కొడుకు, యువకుడు అయిన వృషసేనుని శరసమూహాలతో పీడించాడు. శూరుడైన వృషసేనుడు అనేక శరవృష్టులతో శతానీకుని గాయపరిచాడు.

రథికశ్రేష్ఠుడు, చిత్రయోధి, మాద్రి కొడుకు అయిన నకులుడు కృతవర్మను ఆక్రమించాడు. పాంచాలరాజు, సేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడు సేనలతో సహా కర్ణునిపై దాడి చేశాడు. భారతా! దుశ్శాసనుడు, కౌరవసేన, సమృద్ధమైన సంశప్తకసేన కలిసి భీమసేనునిపై దాడిచేశారు. వీరుడైన ఉత్తమౌజుడు బలపూర్వకంగా కర్ణుని కొడుకైన వృషసేనుని కొట్టి, తలను ఖండించాడు. ఆ తల తన ఆర్తనాదంతో భూమ్యాకాశాలను ధ్వనింపజేస్తూ నేలబడింది. నేలగూలిన సుషేణుని తలను చూసి, కర్ణుడు శోకాతురుడై, కుపితుడై మంచి వాదరగల పదునైన బాణాలతో, ఉత్తమౌజుని రథాన్ని, ధ్వజాన్ని, గుర్రాలను చంపివేశాడు. ఆ ఉత్తమౌజుడు పదునైన బాణాలతో కర్ణుని గాయపరిచి - అడ్డువచ్చిన కృపుని, అతని పార్శ్వ రక్షకులను, గుర్రాలను తళతళలాడే కత్తితో చంపి, వెంటనే శిఖండి రథాన్ని ఎక్కాడు. కృపుడు రథహీనుడు కావటం చూసి, రథం మీదున్న శిఖండి ఆయనను కొట్టడానికి ఇష్టపడలేదు. అప్పుడు అశ్వత్థామ శిఖండిని అడ్డగించి, బురదలో కూరుకొన్న గోవును ఉద్ధరించినట్లు, కృపుని రథాన్ని ఉద్ధరించాడు. ఆషాఢమాసంలోని మధ్యాహ్న సూర్యునివలె, సువర్ణకవచాన్ని ధరించిన భీమసేనుడు పదునైన బాణాలతో నీ కుమారులను తీవ్రంగా తపింపజేయసాగాడు."

76. భీమసేన విశోక సంవాదము

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆపై అటువంటి భీకర యుద్ధంలో అనేక శత్రువులు చుట్టుముట్టిన ఒంటరి భీముడు మహాసంగ్రామంలో సారథితో ఇలా అన్నాడు. "దుర్యోధనసేన వైపు రథాన్ని నడుపు". 'సారథీ ! గుర్రాలను వేగంగా నడుపు. ఈ ధార్తరాష్ట్రులను యమలోకానికి పంపుతాను.' భీమసేనుడలా ప్రోత్సహించగానే, ఆ సారథి నీ సేనవైపు రథాన్ని నడిపాడు. ఆపై తీవ్రవేగంతో, తొందరగా భీముడు ఆక్రమించదలచిన కౌరవసేన కాక, మరికొందరు కౌరవులు ఏనుగులతో, రథాలతో, గుర్రాలతో, కాల్బలంతో అన్నివైపుల నుండి భీమసేనుని ఎదిరించారు. వారు మహా వేగంగల ఆ భీముని రథాన్ని, నాలుగువైపుల నుండి బాణసమూహాలతో కొట్టారు. అప్పుడు మహాత్ముడైన ఆ భీముడు మీదపడుతున్న బాణాలను బంగారు రెక్కలు గల బాణాలతో ఛేదించాడు. భీముని బాణాలచే ఖండింపబడిన ఆ బంగారు రెక్కల బాణాలు రెండు మూడు ముక్కలయ్యాయి. రాజా! ఆపై ఆ మహారాజసమూహంలో భీముడు, సంహరించిన ఏనుగులు, రథికులు, గుర్రాలు, యువకుల ఆర్తనాదాలు భీకరంగా వినిపించసాగాయి. నరేంద్రా! అది వజ్రాయుధం దెబ్బతిన్న పర్వతాల ఆర్తనాదం వలె ఉంది. అప్పుడే రెక్కలు వచ్చిన పక్షులు అన్నివైపుల నుండి చెట్టు మీదకు ఎగిరినట్లు, భీముని బాణాల వేగంతో సంహరింపబడుతూ, బ్రద్దలవుతున్న ప్రముఖరాజులందరూ రణభూమిలో భీమునిపై దాడిచేశారు.

ఆపై నీ సేన అలా ఎదిరించగానే, అనంతవేగశాలి అయిన భీముడు వేగాన్ని పెంచాడు. అది ప్రళయకాలంలో, ప్రాణులను అంతం చేయటానికి దండాన్ని చేతబట్టిన యముడు అందరినీ నశింపజేస్తూ దహిస్తున్నట్లుంది. ఆ భీముని వేగాన్ని రణభూమిలో నీవారు నివారించలేకపోయారు. ప్రళయకాలంలో, ప్రజలను హరిస్తూ, నోరుతెరిచి మీదపడుతున్న యమునివలె కనిపించాడు భీమసేనుడు. భారతా! ఆపై రణభూమిలో భీమునిచే దహింపబడుతూ, పారద్రోలబడిన నీ సేన, భయంతో, మహానిలం చెదరగొట్టిన మేఘసమూహాల వలె దిక్కులకు చెదరిపోయింది. ఆ తరువాత భీముడు ఆనందంతో, సారథితో మరలా ఇలా అన్నాడు. "సూతా! గుంపులుగా దూసికొని వస్తున్న వారిలో మనవారెవరో శత్రువులెవరో నీవే గుర్తించు. యుద్ధం చేస్తుంటే నాకేమీ తెలియదు. ఒకవేళ బాణాలతో మనసేననే కప్పివేస్తానేమో! విశోకా! అన్నివైపులా శత్రువులే కనిపిస్తుంటే, నా మనస్సును తీవ్రచింత కలచివేస్తోంది. సూతా! ధర్మజుడు గాయపడ్డాడు. అర్జునుడు ఇంకా రాలేదు. అందువల్ల నాకెంతో దుఃఖంగా ఉంది. సారథీ! ధర్మరాజు నన్ను వీడి, స్వయంగా శత్రువుల మధ్యకు

వెళ్ళాడు. అది నాకు తొలి బాధ. తాను బ్రతికియున్నాడో, మరణించాడో ఇంకా తెలియలేదు. అర్జునుడు ఏమయ్యాడో తెలియదు. అది మరీ బాధగా ఉంది. అయినా నేను పూర్తి విశ్వాసంతో ప్రచండమైన శత్రుసేనను నశింపజేస్తాను. గుమిగూడిన ఈ సేనను రణభూమిలో సంహరించి నీతో కలిసి ఆనందిస్తాను. సూతా! నా రథంలో నున్న అమ్ములపొదుల నన్నింటినీ పరిశీలించి, ఎన్నిబాణాలు మిగిలిఉన్నాయో, ఏజాతివి ఉన్నాయో, ఎంతటివి ఉన్నాయో స్పష్టంగా తెలిసికొని చెప్పు. సారథీ ! ఎన్ని వేలున్నాయో, ఎన్ని వందలున్నాయో వెంటనే నాకు చెప్పు!!"

విశోకుడిలా చెప్తున్నాడు. "వీరా! ఈ రోజు నేను అంతా గ్రహించియే నీ మనోరథం సిద్ధించే మాట చెప్తున్నాను. కేకయులు, కాంబోజులు, సురాష్ట్రులు, బాహ్లికులు, మ్లేచ్ఛులు, సుహ్మలు, పరతంగణులు, మద్రులు, వంగదేశీయులు, మాగధులు, కులిందులు, ఆ నర్తకులు, ఆవర్తకులు, పర్వతీయులు - వీరందరూ గొప్ప గొప్ప ఆయుధాలను పట్టి, నాలుగువైపుల నిన్ను చుట్టి, యుద్ధానికై గర్జిస్తున్నారు. వీరా! నీ దగ్గర ఇంకా అరవైవేల బాణాలున్నాయి. పదివేల క్షురాలు, పదివేల భల్లాలు ఉన్నాయి. రెండువేల నారాచాలు, మూడువేల ప్రదరాలు మిగిలి ఉన్నాయి. పాండునందనా! ఆరు ఎద్దులు కట్టిన బండి అయినా లాగలేనన్ని ఆయుధాలు ఇంకా మిగిలి ఉన్నాయి. పండితా! వేలకొలదిగ ఉన్న ఈ అస్త్రాలను ప్రయోగించు. నీ దగ్గర ఇంకా గదలు, కత్తులు, బాహుబలమూ ఉన్నాయి. ప్రాసాలు, ముద్గరాలు, శక్తులు, తోమరాలు ఉన్నాయి. ఆయుధాలు అయిపోతాయేమోనని భయపడవద్దు." భీమసేనుడిలా అన్నాడు. "సూతా! ఈ రోజు రణరంగాన్ని గమనించు. భీమసేనుడు ప్రయోగించిన వేగశాలులయిన బాణాలు ఈ రణరంగమంతా కప్పివేశాయి. సూర్యుడు కూడా కనిపించక మృత్యులోకంవలె కనిపిస్తోంది. సూతా! ఈనాడు చిన్నపిల్లల మొదలు పెద్దవారి వరకు రాజులకందరకూ - "భీమసేనుడు ఒంటరిగా రణభూమిలో చొరబడి కౌరవులను గెలిచా డన్న విషయం తెలుస్తుంది. యుద్ధంలో కౌరవులందరూ నేలగూలాలి. పిల్లలు, పెద్దలు అందరూ నన్ను ప్రస్తుతించాలి. వారినందరినీ నేనొక్కడినే పడగొడతాను. లేదా వారంతా కలిసి భీమసేనుని పీడిస్తారు. ఉత్తమ కర్మలను ఆదేశించే దేవతలు ఒక్కపనిని నాకు సాధించిపెడతారు. యజ్ఞంలో పిలవగానే, వేగంగా వచ్చే ఇంద్రునివలె, శత్రుసంహారకుడైన అర్జునుడు ఇక్కడకు రావాలి.

విశోకా! చూడు చూడు! నా బలాన్ని చూడు! నా దెబ్బలతో శత్రుసేన బ్రద్దలయిపోతోంది. చూడు! బలశాలులయిన ధృతరాష్ట్రుని కొడుకులందరూ రకరకాలుగా ఆర్తనాదాలు చేస్తూ రణభూమిని వీడి పారిపోతున్నారు.

ఈ కౌరవసేన చీలిపోతోంది చూడు. ఈరాజులందరూ ఎందుకు పారిపోతున్నారు? తెలిసింది. నరోత్తముడు, ధీశాలి అయిన అర్జునుడు బాణాలతో ఈ సైన్యాన్ని కప్పివేస్తున్నాడు. విశోకా! రణభూమి నుండి పారిపోతున్న రథ ధ్వజాలను చూడు. ఏనుగులను, గుర్రాలను, పదాతి గణాలను, చెదరిపోయిన రథాలను, శరాలతో, శక్తులతో దెబ్బలు తిని పారిపోతున్న రథికులను చూడు. అర్జునుని బాణాలు వజ్రవేగం గలవి. బంగారు రెక్కలతో నెమలి ఈకలతో అలంకరింపబడినవి. ఆ బాణాలు ఆవరించిన కౌరవసేన తీవ్రంగా దెబ్బతింటూ, మాటిమాటికీ ఆర్తనాదాలు చేస్తోంది. ఈ రథాలు, గుర్రాలు, ఏనుగులు, కాల్బలాన్ని త్రొక్కుకొంటూ పారిపోతున్నాయి. కౌరవులందరూ చైతన్యాన్ని కోల్పోతున్నట్లుగా, మంటకు భయపడిన ఏనుగులవలె పారిపోతున్నారు. విశోకా! రణభూమిలో హాహాకారాలు మిన్నుముట్టాయి. అనేకగజాలు ఆర్తనాదాలు చేస్తున్నాయి."

విశోకుడిలా అన్నాడు. "భీమా! నీవు ఇప్పుడు బాగా లాగిన ఘోరమైన గాండీవ ధ్వనిని వినటం లేదా? కోపంతో అర్జునుడు చేస్తున్న ధనుష్టంకారంతో ఈ నీ చెవులు వినపడటం లేదా ? పాండవా! నీ కోరికలన్నీ తీరబోతున్నాయి. కౌరవసేనలో కపి కనిపిస్తోంది. నల్లని మేఘం నుండి పైకి వస్తున్న మెరుపువలె ప్రకాశిస్తున్న గాండీవ ధనుస్సు యొక్క అల్లెత్రాటిని చూడు. ఈ కపి అర్జునుని ధ్వజంమీదకెక్కి, యుద్ధంలో శత్రుసేనలను భయపెడుతూ, అన్నివైపులా చూస్తోంది. దాన్ని చూసి నాకు కూడా భయం కలుగుతోంది. అర్జునుని ఈ విచిత్ర కిరీటం ఎంతో ప్రకాశిస్తోంది. ఆ కిరీటంలోని దివ్యమణి సూర్యకాంతితో వెలుగొందుతోంది. అర్జునుని ప్రక్కన తెల్లటి మేఘంవలె, గంభీర ఘోషగల దేవదత్తం వెలుగొందుతోంది. పగ్గాలుపట్టి, శత్రుసేనలో ప్రవేశిస్తున్న జనార్దనుని ప్రక్కన, సూర్యకాంతితో చక్రం ప్రకాశిస్తోంది. దాని మధ్యలో వజ్రాలు కనిపిస్తున్నాయి. చివరలలో క్షురాలు అనుసంధింపబడి ఉన్నాయి. వీరా! యాదవులు నిత్యమూ పూజించే ఆ చక్రం కేశవుని కీర్తిని పెంపొందింపజేసేది చూడు. అర్జునుడు క్షురాలతో ఖండించగా, మహాగజాల తొండాలు దేవదారుతరువుల వలె నేలగూలుతున్నాయి. అర్జునుని బాణాలతో శిథిలమై, అవి వజ్రాయుధం దెబ్బకు కూలిన పర్వతాలవలె, హస్తిపకులతో పాటు పడుతున్నాయి. అలాగే చంద్రకాంతి గల కృష్ణుని పాంచజన్యాన్ని చూడు. అది ఎంతో విలువైనది. కౌంతేయా! కృష్ణుని వక్షస్థలంపై ప్రకాశించే కౌస్తుభమణిని, వైజయంతీమాలను కూడా గమనించు.

రథికులలో శ్రేష్ఠుడైన అర్జునుడు, శత్రుసేనలను పారద్రోలుతూ ఇటే వస్తున్నాడు. తెల్లని మేఘాలవంటి కాంతితో ప్రకాశిస్తున్న గొప్ప గుర్రాలను పూన్చిన ఆ అర్జున

రథాన్ని కృష్ణుడు నడుపుతున్నాడు. అనుమానం లేదు. ఇంద్రతేజస్సు గల నీ తమ్ముడు బాణాలతో రథాలను, గుర్రాలను, కాల్బలాన్ని బ్రద్దలు చేస్తుంటే, వారు గరుడుని రెక్కలగాలికి మహారణ్యాలవలె కూలిపోతున్నారు. చూడు. రణభూమిలో మేటిబాణాలతో అర్జునుడు చంపిన ఈ నాలుగువందల గుర్రాలను, ఏడువందల ఏనుగులను, అనేక రథాలను కాల్బలాన్ని, రౌతులను చూడు. బలశాలి అయిన అర్జునుడు కౌరవులను చంపుతూ, చిత్రానక్షత్రం వలె నీ దగ్గరకు వస్తున్నాడు. ఇప్పుడు నీ కోరిక తీరబోతోంది. నీ శత్రువులు నశించిపోయారు. నీ బలము, చిరాయువు వర్ధిల్లాలి." భీమసేనుడిలా అన్నాడు. "అర్జునుని రాకను తెలియజేశావు. సారథీ! ప్రియమైన మాట చెప్పావు. ఆనందంగా ఉంది. నీకు పదునాలుగు మంచి గ్రామాలను ఇస్తాను. వందమంది దాసీలను, ఇరవై రథాలను నీకిస్తాను."

77. శకుని పరాజయము

సంజయుడిలా చెప్తున్నాడు. 'రణభూమిలో రథఘోషనూ, సింహనాదాన్ని విని అర్జునుడు "త్వరగా గుర్రాలను నడుపు" అని కృష్ణునితో అన్నాడు. అర్జునుని మాట విని గోవిందుడు "ఇదిగో! భీముడున్న చోటికి తీవ్రవేగంతో వెళ్తాను" అని అర్జునునితో అన్నాడు. జంభాసురుని చంపాలని, వజ్రాన్ని ధరించి, కోపంతో బయలుదేరిన దేవేంద్రునివలె, అర్జునుడు శత్రువులను జయించాలని, భయంకర క్రోధంతో, సువర్ణముక్తామణులతో అలంకరింపబడి, హిమశంఖవర్ణం గల గుర్రాలపై వచ్చాడు. అప్పుడు శత్రుపక్షంలోని మేటి వీరులు రథికులు, గుర్రపు రౌతులు, హోస్తిపకులు, కాల్బలం తమ బాణ ధ్వనులతో, రథనేమి ధ్వనులతో, గుర్రపుడెక్కల చప్పుళ్ళతో భూమినీ, దిక్కులనూ ప్రతిధ్వనింపజేస్తూ అర్జునుని ఎదిరించటానికి ముందుకు వచ్చారు. మారిషా! జయశీలుడైన విష్ణుదేవునకు, గతంలో త్రిలోకరాజ్యం కోసం అసురులతో యుద్ధం జరిగినట్లు, అర్జునునకు, ఆ శత్రుసేనలకు మధ్య దేహాలను, ప్రాణాలను, పాపాలనూ శమింపజేసే ఘోరయుద్ధం జరిగింది. వారు ప్రయోగించిన చిన్న, పెద్ద ఆయుధాల నన్నింటినీ, అర్జునుడు ఒంటరిగా ఖండించాడు. క్షురాలతో, అర్ధచంద్ర బాణాలతో, పదునైన భల్లాలతో వారి తలలను, బాహువులను, గొడుగులను, వింజామరలను, ధ్వజాలను, గుర్రాలను, రథాలను, ఏనుగులను, కాల్బలాన్ని వివిధ రీతులలో ఖండించాడు. అవన్నీ గాలికి కూలిన అడవులవలె విరూపంగా, వివిధంగా నేలగూలాయి. బంగారు జాలరులతో ఆచ్ఛాదింపబడి, వైజయంతీ ధ్వజాలతో శోభిస్తూ, యోధులు సిద్ధం చేసిన పెద్దపెద్ద ఏనుగులు, బంగారు పక్షాలుగల బాణాలు

గ్రుచ్చుకొని, ప్రజ్వలించే పర్వతాలవలె ప్రకాశించాయి.

అర్జునుడు ఇంద్రుని వజ్రంతో సమానమైన గొప్పబాణాలతో ఏనుగులను, గుర్రాలను, రథాలను భంగపరిచి, బలాసురుని చంపటానికి గతంలో ఇంద్రుడు బయలుదేరినట్లు కర్ణుని చంపాలని వేగంగా బయలుదేరాడు. ఆపై అర్జునుడు మొసలి సముద్రంలో ప్రవేశించినట్లు, నీ సేనలోనికి చొచ్చుకొనివచ్చాడు. రాజా! రథాలతో, కాల్బలంతో, ఏనుగులతో, గుర్రాలతో, రౌతులతో కూడిన నీ వారంతా ఉల్లాసంగా అర్జునునిపై దాడిచేశారు. అర్జునుని మీదకు దాడిచేస్తున్న ఆ సేనల ధ్వని క్షోభించిన సాగరంలోని నీటిధ్వనివలె తీవ్రంగా ఉంది. ఆ మహారథులు పులులవలె రణభూమిలో ప్రాణభయాన్ని వీడి ఆ అర్జునునిపై దాడిచేశారు. శరవృష్టిని కురిపిస్తూ తన మీదకు వచ్చిన ఆ సేనను పెనుగాలి మేఘాలను చెదరగొట్టినట్లు అర్జునుడు సంహరించాడు. దెబ్బతీయగల ఆ మేటి విలుకాండ్రు అందరూ, రథసమూహాలతో గుమిగూడి, అర్జునుని ఎదిరించి, పదునైన బాణాలతో అతనిని గాయపరిచారు.

వారంతా ఉల్లాసంగా, శక్తులతో, తోమరాలతో, ప్రాసాలతో, కుణపాలతో, కూటాలతో, ముద్గరాలతో, శూలాలతో, త్రిశూలాలతో, పరిఘలతో, భిందిపాలాలతో, పరశువులతో, ఖడ్గాలతో, హేమదండాలతో, కర్రలతో, ముసలాలతో, ఇంకా వివిధాయుధాలతో అర్జునుని చుట్టుముట్టారు.

ఆపై అర్జునుడు పదునైన బాణాలతో వేలకొలదిగ రథాలను, ఏనుగులను, గుర్రాలను యమసదనానికి పంపించాడు. గాండివం నుండి వెలువడిన బాణాలచే సంహరింపబడుతున్న ఆ కౌరవ మహారథులు భయంతో ఎక్కడికక్కడ దాగుకొంటున్నారు. వీరులై, మహారథులై, విజయానికై ప్రయత్నిస్తున్న వారిలో నాలుగు వందలమందిని అర్జునుడు పదునైన బాణాలతో యమసదనానికి పంపాడు. రణరంగంలో పదునైన బాణాలతో సంహరింపబడుతున్న ఆ వీరులు అర్జునుని వీడి పదిదిక్కులకూ పారిపోయారు.

సముద్రపు మహాప్రవాహం కొండను ఢీకొని బ్రద్దలయినట్లు, రణముఖంలో పారిపోతున్న ఆ సేనలలో తీవ్రహాహాకారం చెలరేగింది. అర్జునుడు ఆ సేనను బాణాలతో తీవ్రంగా గాయపరచి, పారద్రోలి, ఆ తరువాత కర్ణుని సేనవైపు బయలుదేరాడు. శత్రువుల కభిముఖంగా వెళ్తున్న అర్జున రథధ్వని గతంలో, ఏ పామునో పట్టుకొనటానికి వస్తున్న గరుడుని రెక్కల గాలిధ్వనివలె ఉంది. ఆ చప్పుడును బాగా విని, భీమసేనుడు అర్జునుని చూడాలన్న తహతహతో పరమానందాన్ని పొందాడు. అర్జునుడు వస్తున్నట్లు రథ ధ్వని వినిపించగానే, భీమసేనుడు ప్రాణాలను లెక్కచేయక నీ సేనలను మర్దించాడు. వాయు బలం, వాయువేగం గల ఆ భీమసేనుడు వేగంగా వాయువు వలె (రణభూమిలో)

సంచరించాడు. రాజేంద్రా! మహారాజా! ఆ భీమునిచే పీడింపబడుతున్న నీ సేన, సముద్రంలో బ్రద్దలైన నౌకవలె పూర్తిగా చెదరిపోయింది. అప్పుడు భీముడు తన హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ, ఆ సేనను యమసదనానికి పంపుతూ తీక్ష్ణ బాణాలతో సంహరించాడు. భారతా! ప్రళయకాలంలోని యముని బలం వలె అమానుషమైన ఆ భీమబలాన్ని చూసి, రణభూమిలోని యోధులందరూ భ్రాంతికి లోనయ్యారు. భారతా! తనవారు ఆ రీతిగా భీముని పీడనకు గురికావటాన్ని చూసి, దుర్యోధన నరపాలుడు ఇలా అన్నాడు.

భరతర్షభా! మేటి విలుకాండ్రయిన సైనికులను, యోధులను అందరినీ "భీముని చంపండి" అని రణరంగంలో ఆదేశించాడు. భీముడు చనిపోతే పాండవసైన్యం నిశ్శేషంగా హతమయినట్లే, అని తన భావాన్ని ప్రకటించాడు. నీ కుమారుని ఆ ఆదేశాన్ని స్వీకరించి, రాజులు బాణవృష్టితో అన్నివైపుల నుండి భీమసేనుని కప్పివేశారు. రాజా! అనేక గజాలు, జయాభిలాష గల అనేక సైనికులు, రథికులు వృకోదరుని చుట్టుముట్టారు. రాజా! శూరులచే ఆ రీతిగా అన్నివైపుల నుండి ముట్టడింపబడిన భీమసేనుడు నక్షత్రాల నడుమనున్న చంద్రుని వలె శోభించాడు. మహారాజా! చుట్టూ ఆవరణ గల చంద్రుడు పరిపూర్ణంగా ప్రకాశించినట్లు, భీమసేనుడు చూడముచ్చటగా వెలుగొందాడు. అర్జునునకు ఏమీ తీసిపోనట్లు కనిపించాడు. శూరులైన ఆ రాజులందరూ కోపంతో కళ్ళెర్రజేసి, వృకోదరుని చంపదలచి శరవృష్టిని కురిపించారు. చేప వలలో చిక్కి, దానినుండి నీటిలోనికి జారినట్లు భీముడు వంగిన కణుపులు గల బాణాలతో ఆ మహాసేనను చీల్చి, రణభూమినుండి నిష్క్రమించాడు. భారతా! భీముడు వెనుకంజవేయని పదివేల ఏనుగులను, రెండు లక్షల రెండు వందల మంది సైనికులను, అయిదువేల గుర్రాలను, వంద రథాలను భంగపరచి, రక్త ప్రవాహం గల నదిని ప్రవహింపజేశాడు. ఆ నదిలో నెత్తురే నీరు. రథాలే సుళ్లు, ఏనుగులే మొసళ్లు, సైనికులు చేపలు. గుర్రాలు నక్రాలు, జుట్టు నాచు గడ్డి, తెగిన బాహువులే సర్పాలు. దానిలో రత్నాలు ఎన్నో కొట్టుకొని పోతున్నాయి. ఊరువులు మొసళ్లు, మజ్జ బురద, తలలే రాళ్ళు. ధనుస్సులు రెల్లు. బాణాలు అంకురాలు, గదలు పరిఘలు, పాములు, గొడుగులు, ధ్వజాలు హంసలు, తలపాగాలు నురగలు. హారాలు, పద్మలతలు, ధూళి అలల వరుసలు, యోధులు జలజంతువులు. రణభూమిలో ప్రవహిస్తున్న ఈ రక్తనది యమలోకంవైపు సాగుతోంది. వైతరణివలె అది సజ్జనులకు దాటదగినది, పిరికివారు దాటలేనిది. క్షణకాలంలోనే భీమసేనుడు వైతరణి వంటి ఆ భీకర నదిని కల్పించాడు.

ఆ భీమసేనుడు తాను వెళ్ళిన అన్నివైపుల, లక్షలకొలది యోధులను

సంహరించాడు. భీమసేనుడు చూపిన ఆ భీకర పరాక్రమాన్ని చూసి, దుర్యోధనుడు శకునితో ఇలా అన్నాడు. "మామా! ఈ యుద్ధంలో భీమసేనుని చంపు. ఈ భీముడు ఓడితే పాండవ బలమంతా ఓడిపోయినట్లే." మహారాజా! ఆ తరువాత ప్రతాపశాలి అయిన శకుని సోదరులతో కలిసి, సంసిద్ధుడై, మహాసంగ్రామానికి బయలుదేరాడు. ఆ శకుని భీమపరాక్రముడైన భీముని సమీపించి, చెలియలికట్ట సముద్రాన్ని నిలవరించినట్లు అతనిని నివారించాడు. శకుని ప్రయోగించిన పదునైన బాణాలతో నివారింపబడిన భీమసేనుడు, అతనిమీద ఎదురుదాడి చేశాడు. శకుని బంగారు రెక్కలు గలిగి సానపెట్టిన బాణాలను భీముని ఎడమరొమ్ముపై ప్రయోగించాడు. గ్రద్ద ఈకలు, నెమలి ఈకలు గల ఆ భీకర బాణాలు మహాత్ముడైన భీముని కవచాన్ని చీల్చి, నేలగూలాయి. రణభూమిలో తీవ్రంగా గాయపడిన భీముడు బంగారు అలంకరణలు గల బాణాన్ని కోపంగా శకునిపై ప్రయోగించాడు. శకుని తన మీదకు వస్తున్న ఆ బాణాన్ని ఏడుముక్కలు చేశాడు. ఆ బాణం నేలబడగానే, భీముడు క్రుద్ధుడై ఒక భల్లంతో శకుని వింటిని ఖండించాడు. శకుని విరిగిన ఆ ధనుస్సును విడిచి వెంటనే మరొక ధనుస్సును తీసికొని, పదహారు భల్లాలను చేతబట్టాడు. వంగిన కణుపులు గల ఆ భల్లాలలో రెండింటితో సారథిని, ఏడింటితో భీమసేనుని గాయపరిచాడు. ఒక భల్లంతో ధ్వజాన్నీ, రెండింటితో గొడుగునూ, నాలుగింటితో నాలుగు గుర్రాలను శకుని గాయపరిచాడు. దానితో కోపించి, భీమసేనుడు సువర్ణదండం గల లోహశక్తిని రణభూమిలో శకునిపై విసిరాడు. రణభూమిలో భీముని భుజంనుండి వెలువడిన ఆ శక్తి, పామునాలుక వలె చంచలంగా కదులుతూ, వెంటనే శకునిపై పడింది. ఆపై శకుని సువర్ణాలంకారాలు గల ఆ శక్తినే చేతబట్టి, కోపాన్ని ప్రదర్శిస్తూ భీమసేనునిపైకి విసిరాడు. అది ఆకాశం నుండి జారిన మెరుపు తీగవలె పాండవుని కుడిభుజాన్ని చీల్చి నేలపై పడింది.

మహారాజా! అప్పుడు ధార్తరాష్ట్రులు అన్నివైపుల నుండి ఆక్రోశించారు. వేగశాలుల ఆ సింహనాదాన్ని భీముడు సహించలేకపోయాడు. భీమసేనుడు తొందరగా మరొక ధనుస్సును పట్టి, ఎక్కుపెట్టి, ముహూర్తకాలంలో, రణరంగంలో తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా, శకుని సైన్యాన్ని బాణాలతో కప్పివేశాడు. భీముడు శకుని రథాశ్వాలను నాలుగింటిని చంపి, ఒక భల్లంతో ధ్వజాన్ని కూడా తొందరగా ఖండించాడు. శకుని గుర్రాలు చనిపోయిన ఆ రథాన్ని వీడి, క్రోధంతో కన్నెర్రజేసి, నిట్టూర్చుతూ, ధనుష్టంకారం చేస్తూ నిలిచాడు. శకుని అనేక బాణాలతో భీముని ఒళ్ళంతా గాయపరిచాడు. భీమసేనుడు

వెంటనే ఎదురు దెబ్బతీసి, తీవ్రకోపంతో శకుని వింటిని ఖండించి పదునైన బాణాలతో గాయపరిచాడు. ఆ శకుని శత్రువుచే తీవ్రంగా గాయపరచబడి, ఏ కొంచెమో ప్రాణంతో మిగిలి నేలబడ్డాడు. శకుని నలిగిపోవటాన్ని గమనించి, దుర్యోధనుడు భీమసేనుడు చూస్తుండగానే తన రథంపై శకునిని రణభూమినుండి తప్పించికొని పోయాడు. భీముడు రథంపై నిలిచి ఉండగానే, అతనివలన తీవ్రభయానికి లోనయి ధార్తరాష్ట్రులు యుద్ధవిముఖులై పదిదిక్కులకూ పారిపోయారు.

భీముడు శకునిని ఓడించగానే, దుర్యోధనుడు తీవ్రభయానికి గురి అయి, మేనమామ మీది ప్రేమతో, వేగశాలులయిన గుర్రాలతో, రణభూమి నుండి మేనమామ దగ్గరకు వెళ్ళిపోయాడు. రాజు యుద్ధవిముఖుడై పారిపోవటం చూసి, సేనలు అన్నివైపులా ద్వంద్వ యుద్ధాలను మాని పారిపోయారు. ధార్తరాష్ట్రులందరూ యుద్ధవిముఖులై పారిపోవటం చూసి, భీముడు వందలకొలదిగ వివిధ బాణాలను విడుస్తూ వేగంగా వెంటబడ్డాడు. రాజా! భీముడు సంహరిస్తుంటే ఆ ధార్తరాష్ట్రులు యుద్ధవిముఖులై, రణభూమిలో అన్నివైపుల నుండి కర్ణుని దగ్గరకు చేరి నిలిచారు. రాజా! కర్ణుడు ఆ ధార్తరాష్ట్రులకు ద్వీపమయ్యాడు. పురుషోత్తమా! పడవ పగిలిపోతే, నావికులు కొంతకాలానికి ఏదో ఒక ద్వీపాన్ని చేరి ఆనందించినట్లు, నీవారంతా కర్ణునిదగ్గరకు చేరి ఊరట పొందారు. రాజా! ఒకరినొకరు ఆనందంగా పలుకరించుకొని, మృత్యువును వెనుకకు మరలించి, మరల యుద్ధానికి సిద్ధమై వచ్చారు."

78. కర్ణుడు పాండవసేవను సంహరించుట

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! భీమసేనుడు యుద్ధంలో సేనలను భంగపరచిన తరువాత దుర్యోధనుడు ఏమన్నాడు? శకుని ఏమన్నాడు? జయశీలులలో శ్రేష్ఠుడైన కర్ణుడు, నా పక్షంలోని యోధులు, కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ, దుశ్శాసనుడు ఏమన్నారు ? రణభూమిలో ఒక్కడే నిలిచి, మా పక్షంలోని యోధు లందరితో పోరాడిన భీముని పరాక్రమం అత్యద్భుత మనుకొంటున్నాను. సంజయా! తానుచేసిన ప్రతిజ్ఞకు తగినట్లు కర్ణుడు పని పూర్తిచేశాడు. శత్రుసూదనుడైన ఆ కర్ణుడే కౌరవుల కందరకు ఆశ్రయమూ, రక్షణ కవచమూ, ప్రతిష్ఠా, జీవితాశ కూడా. భీముడు రణభూమిలో కౌరవబలాన్ని భంగపరచటం చూసి అధిరథసుతుడు, రాధేయుడు అయిన కర్ణుడు ఏం చేశాడు? దుర్ధర్షులైన నా కుమారులు కానీ, మహారథులైన రాజులు కానీ ఏం చేశారు? సంజయా!

నాకంతా చెప్పు. నీవు బాగా చెప్పగల వాడవు."

సంజయుడిలా చెప్తున్నాడు. "మహారాజా! కర్ణుడు అపరాహ్ణ వేళలో భీమసేనుడు చూస్తుండగానే సోమకులనందరనూ చంపాడు. భీముడు కూడా అత్యంత బలసంపన్నమైన ధార్తరాష్ట్రసేనను సంహరించాడు. అప్పుడు కర్ణుడు శల్యునితో "నన్ను పంచాలుర దగ్గరకు తీసికొనిపో" అని పలికాడు. భీముడు తమసేనను పారద్రోలటం చూసి "నన్ను పంచాలుర వద్దకే కొనిపో" అని కర్ణుడు సారథితో అన్నాడు. అప్పుడు శల్యుడు మహావేగం గల తెల్లని గుర్రాలను పంచాల, కరూషుల వైపు నడిపించాడు. శల్యుడు ఆనందంతో ఆ మహాసేనలో ప్రవేశించి, కర్ణుడు వెళ్ళదలచిన తావులకు గుర్రాలను నడిపించాడు. పులిచర్మాన్ని పరిచి మేఘంవలెనున్న ఆ రథాన్ని చూసి, పాండవులు, పంచాలురు భయపడ్డారు. ఆపై మేఘగర్జనవలె, పర్వతం బ్రద్దలవుతున్నట్లు రథఘోష ఆ మహాసంగ్రామంలో ఉద్భవించింది. ఆ తరువాత కర్ణుడు చెవిదాకా లాగి విడిచిన వందలకొలది తీక్ష్ణబాణాలతో వందలు, వేల కొలదిగ పాండవసేనను కొట్టాడు. ఓటమి నెరుగని ఆ కర్ణుడు అలా రణభూమిలో పరాక్రమప్రదర్శన చేస్తుంటే, మేటి విలుకాండ్రైన పాండవ మహారథులందరూ కర్ణుని చుట్టుముట్టారు. శిఖండి, భీముడు, ద్రుపదసుతుడైన ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది కొడుకులు, సాత్యకి కర్ణుని చంపదలచి బాణవృష్టులతో అతన్ని చుట్టుముట్టారు. అప్పుడు సాత్యకి ఇరవై పదునైన బాణాలతో, రణభూమిలో కర్ణుని మెడ ఎముక మీద కొట్టాడు. శిఖండి ఇరవై అయిదు, ధృష్టద్యుమ్నుడు ఏడు, ద్రౌపది కొడుకులు అరవైనాలుగు సహదేవుడు ఏడు, నకులుడు వంద బాణాలతో కర్ణుని గాయపరిచారు. భీమసేనుడు కోపించి, వంగిన కణుపులు గల తొంబది బాణాలతో కర్ణుని మెడఎముకపై గాయపరిచాడు.

అప్పుడు కర్ణుడు నవ్వి, గొప్ప వింటిని చేపట్టాడు. కర్ణుడు భీముని పీడిస్తూ, భీముని బాణాలను కర్ణుడు అయిదు అయిదు బాణాలతో ఖండించాడు. సాత్యకి వింటినీ, ధ్వజాన్నీ ఖండించి తొమ్మిది బాణాలతో అతని రొమ్ముపై కొట్టాడు. ఆపై కోపంతో కర్ణుడు ముప్పది బాణాలతో భీముని గాయపరిచాడు. ఒక భల్లంతో సహదేవుని ధ్వజాన్ని ఖండించాడు. పరంతపుడైన కర్ణుడు మూడు బాణాలతో సహదేవసారథిని కొట్టాడు. రెప్పపాటు కాలంలో ద్రౌపది కొడుకులను రథహీనులను చేశాడు. అది అద్భుతంగా ఉంది. వంగిన కణుపులు గల బాణాలతో వారినందరినీ యుద్ధవిముఖులను చేసి, శూరులైన పంచాలురను, మహారథులయిన చేదులను సంహరించాడు. రాజా! రణభూమిలో హింసకులోనైన ఆ చేది, మత్స్య యోధులు, ఒక్క కర్ణుని మీదనే దాడి చేసి, బాణసమూహాలతో

పీడించారు. కర్ణుడు వారిని పదునైన బాణాలతో కొట్టాడు. రణభూమిలో హింసకులోనైన ఆ చేది మత్స్యయోధులు భయపడి, సింహానికి భయపడిన మృగాలవలె రణభూమి నుండి పారిపోయారు. భారతా! ఆ సమయంలో అత్యద్భుతమైన పరాక్రమాన్ని చూశాను. మహారాజా! కర్ణుడొక్కడే రణభూమిలో శూరులు, ధనుర్ధారులై మహాశక్తితో ప్రయత్నపూర్వకంగా పోరాడుతున్న పాండవులను బాణాలతో నివారించాడు. ఆ కర్ణుడు ప్రదర్శించిన నైపుణ్యంతో సర్వదేవతలు, సిద్ధులు, చారణులు ఆనందించారు. సర్వధనుర్ధారులలో శ్రేష్ఠుడు అయిన కర్ణుని మేటివిలుకాండ్రు అభినందించారు. అప్పుడు వేసవిలో నిప్పు ఎగసి, తీవ్రంగా జ్వలిస్తూ, చెత్తను తగులబెట్టినట్లు, కర్ణుడు శత్రుసేనను దహించాడు. కర్ణుడు సంహరిస్తున్న పాండవసేనలు, ఆ మహారధుని చూసి, భయపడి రణభూమి నుండి అటూ - ఇటూ పారిపోయారు.

ఆ మహాసంగ్రామంలో కర్ణుని మేటి వింటినుండి వెలువడిన తీక్ష్ణబాణాలతో సంహరింపబడుతున్న పంచాలుర ఆర్తనాదాలు తీవ్రంగా చెలరేగాయి. ఆ శబ్దంలో పాండవ మహాసేన భయపడింది. ఆ సమయంలో శత్రువులు రణరంగంలో కర్ణుని ఒక్కడినే యోధునిగా భావించారు. కర్ణుడు మరల అక్కడ అద్భుతాన్ని చేసి చూపాడు. పాండవులందరూ కనీసం కర్ణుని చూడలేకపోయారు. ప్రవాహం కొండను ఢీకొని బ్రద్దలయినట్లు, ఆ పాండవసైన్యం కూడా కర్ణుని ఎదిరించి బ్రద్దలయింది. రాజా! కర్ణుడు కూడా పొగలేని నిప్పువలె జ్వలిస్తూ, పాండవ మహాసైన్యాన్ని దహిస్తూ నిలిచారు. కర్ణుడు శత్రువీరుల తలలను, కుండలాలతో సహా చెవులను, బాహువులను వేగంగా బాణాలతో ఖండించాడు. రాజా! ఏనుగుదంతాల పిడులు గల కత్తులను, ధ్వజాలను, శక్తులను, గుర్రాలను, ఏనుగులను, వివిధ రథాలను, పతాకలను, వింజామరలను, ఇరుసులను, కాడెలను, కాడెపలుపులను, వివిధ చక్రాలను ఖండించి కర్ణుడు యోధవ్రతాన్ని పాటించాడు. భారతా! అక్కడ కర్ణునిచేత చచ్చిన ఏనుగులు, గుర్రాలతో మాంసం, నెత్తురుతో ఏర్పడిన బురదతో నేల కనిపించడం లేదు. చనిపోయిన గుర్రాలవలన, కాల్బలం వలన, రథాల వలన, ఏనుగుల వలన రణభూమిలో మిట్ట-పల్లం ఏదీ తెలియటం లేదు. విజృంభించిన కర్ణుని అస్త్రంద్వారా అక్కడ ఘోరమైన అమ్మల చీకటి ఆవరించింది. తమవారెవరో, శత్రువులెవరో కొంచెం కూడా తెలియటం లేదు. కర్ణుని వింటినుండి వెలువడిన స్వర్ణ భూషణాలు గల బాణాలచే పాండవ మహారథులు ఆవరింపబడ్డారు. ఆ పాండవ మహారథులు ఎంత ప్రయత్నిస్తున్నా, కర్ణుడు రణభూమిలో మాటిమాటికీ వారిని చెదరగొట్టాడు. కోపించిన సింహం అరణ్యంలో

మృగసమూహాలను పారద్రోలినట్లు, కర్ణుడు రణభూమిలో పాంచాల రథ శ్రేష్ఠులను, శత్రుయోధులను పారద్రోలుతూ, భయపెడుతూ, తోడేలు పశువులను చంపినట్లు, ఆ సైన్యాన్ని సంహరించాడు.

యుద్ధవిముఖమైన పాండవసేనను చూసి, మేటి విలుకాండ్రయిన ధార్తరాష్ట్రులు పెద్దగా గర్జిస్తూ అక్కడకు చేరారు. రాజేంద్రా! దుర్యోధనుడు పరమానంద సహితుడై, ఉల్లాసంగా వివిధ వాద్యాలను అంతటా మ్రోగింపజేశాడు. ఆ సమయంలో అంతకుముందు చెదరిపోయిన మేటి విలుకాండ్రు, నరోత్తములు అయిన పంచాలురు కూడా, మరణాన్నే పరమావధిగా భావించి, మరలా కర్ణునితో తలపడటానికి వచ్చారు. కర్ణుడు మరల యుద్ధానికి వచ్చిన ఆ శూరులను చాలాసార్లు పారద్రోలాడు. అక్కడ కర్ణుడు కోపంతో బాణాలతో ఇరవైమంది పంచాల రథికులను, వందలకొలదిగ చేది యోధులను సంహరించాడు. రథాసనాలను గుర్రాల వీపులను శూన్యంగా చేసి, ఏనుగు అంబారీలపై మనుష్యులు లేకుండా చేసి, కాల్బలాన్ని పారద్రోలాడు. మధ్యాహ్నకాలపు సూర్యునివలె చూడరానివాడై, ఆ కర్ణుడు మృత్యురూపుడై విరాజిల్లాడు. మహారాజా! ప్రాణులను సంహరించి యముడు నిలిచినట్లు, కర్ణుడు సైనికులను, గుర్రాలను, రథాలను, ఏనుగులను భంగపరచి నిలిచాడు. ఆ రీతిగా కర్ణుడు ఒంటరిగా సోమకులను చంపి నిలిచాడు. అక్కడ పంచాలుర పరాక్రమం అద్భుతంగా కనిపించింది. కర్ణుడు సంహరిస్తున్నా, వారు రణభూమి ప్రధానస్థానాన్ని వీడలేదు. దుశ్శాసనుడు, కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ, శకుని పాండవ సేనను వందలు వేలకొలదిగ సంహరించారు. కర్ణుని కొడుకులు కోపించి, పాండవసేనను ఇటు - అటు నశింపజేయసాగారు. అక్కడ మహాసంగ్రామం జరిగింది. దారుణంగా మహావినాశం జరిగింది. అలాగే పాండవులూ శూరులైన ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ద్రౌపది కొడుకులు తీవ్రకోపంతో నీ సేనను సంహరించారు. ఇదే రీతిగా అక్కడక్కడ పాండవులకు కూడా నష్టం జరిగింది. మహాబలుడైన భీముని రణభూమిలో ఎదిరించిన నీవారికి కూడా నష్టం జరిగింది."

79. సంకుల యుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. మహారాజా! అర్జునుడు మహాసంగ్రామంలో తీవ్రకోపంతో ఉన్న కర్ణుని చూసి, కౌరవుల చతుర్విధ సేనను సంహరించి రక్తనదిని ప్రవహింపజేశాడు. నేల అంతా రక్తప్రవాహంతో నిండింది. మాంసం, మజ్జ, ఎముకలు బురదగా మారాయి. సైనికుల తలలు పాషాణాలు. ఏనుగులు, గుర్రాలు తటాలుగా

మారాయి. శూరుల ఎముకల సమూహాలు దానిలో పడి ఉన్నాయి. కాకులు, గ్రద్దలు అరుస్తున్నాయి. గొడుగులు హంసలవలె, తెప్పలవలె ఉన్నాయి. వీరుల శరీరాలనే చెట్లు ప్రవాహంలో కొట్టుకొని పోతున్నాయి. హారాలు పద్మలతలు, తలపాగాలు నురగలు, ధనుస్సులు, బాణాలు, ధ్వజాలు దానిలో పడి ఉన్నాయి. నరుల చిన్న పుర్రెలు దానిలో దొర్లుతున్నాయి. డాళ్ళు, కవచాలు, సుళ్ళు తిరుగుతున్నాయి. రథాలు తెప్పలవలె కనిపిస్తున్నాయి. అది జయశీలులు అవలీలగా దాటగలది. పిరికివారు దాటలేనిది. పరవీరహంత పురుషోత్తముడు అయిన అర్జునుడు దానిని ప్రవహింపజేసి, కృష్ణునితో ఇలా అన్నాడు.

అర్జునుడిలా అన్నాడు. "కృష్ణా! ఇదిగో. రణభూమిలో కర్ణుని కేతువు కనిపిస్తోంది. భీమసేనాదులు, ఆ మహారథునితో పోరాడుతున్నారు. జనార్దనా! కర్ణునకు భయపడి ఈ పంచాలురు పారిపోతున్నారు. ఈ దుర్యోధనరాజు తెల్లని గొడుగును ధరించి, కర్ణుడు చెదరగొట్టిన పంచాలురను తరుముతూ ఎంతో శోభిస్తున్నాడు. కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ వీరంతా కర్ణుని రక్షణలో నిలిచి దుర్యోధనుని రక్షిస్తున్నారు. వారు మన పీడనకు లోనుగాక సోమకులను సంహరిస్తున్నారు. కృష్ణా! పగ్గాలు పట్టడంలో నేర్పుగల ఈ శల్యుడు రథాసనంపై కూర్చొని కర్ణుని రథాన్ని నడుపుతూ, ఎంతో అందగిస్తున్నాడు. జనార్దనా! అక్కడకు వెళ్ళాలనిపిస్తోంది నాకు. రథాన్ని అక్కడకు నడుపు. రణభూమిలో కర్ణుని సంహరించకుండా ఏ స్థితిలోనూ వెనుదిరగను. లేకపోతే కర్ణుడు మనం చూస్తుండగానే పాండవ సృంజయ మహారథులలో రణభూమిలో ఎవ్వడినీ మిగల్చడు. ఆపై కేశవుడు రథాన్ని వేగంగా కర్ణునితో అర్జునుని ద్వంద్వ యుద్ధానికి అనుగుణంగా నీ సేనవైపు నడిపాడు. కృష్ణుడు అర్జునుని ఆదేశంతో రథంమీద నుండియే పాండుసేనలను అన్ని వైపులనుండీ ఆశ్వాసిస్తూ బయలుదేరాడు. రణరంగంలో అర్జునుని రథఘోష ఇంద్రుని వజ్రాయుధ ధ్వనివలె, మేఘగర్జనవలె వినిపించింది. అర్జునుడు మహారథఘోషతో నీ సేనను ఓడిస్తూ ముందుకు సాగాడు. తెల్లని గుర్రాలతో, కృష్ణుని సారథ్యంలో వస్తున్న అర్జునుని గమనించి, ఆ మహాత్ముని కేతువును చూసి మద్రరాజు - శల్యుడు కర్ణునితో ఇలా అన్నాడు.

"కర్ణా! నీవు అడుగుతున్న ఆ రథం తెల్ల గుర్రాలతో, కృష్ణసారథ్యంలో శత్రువులను సంహరిస్తూ వస్తోంది. ఇడుగో! అర్జునుడు గాండీవధనుస్సును స్పృశిస్తూ నిలిచిఉన్నాడు. ఈనాడు అతనిని సంహరిస్తే మనకు శ్రేయస్సు కలుగుతుంది. కర్ణా! అర్జునుని అల్లెత్రాటిని చూడు. చంద్రుడు, తారకలు దానిపై గుర్తులు. పతాకాన్ని చూడు. మువ్వలతో కూడి

ఉంది. ఇది ఆకాశంలోని మెరుపువలె కనిపిస్తోంది. ఇదిగో! ఈ అర్జునుని ధ్వజం పైభాగాన రణభూమిని కలయజూస్తూ, వీరులకు కూడా భయాన్ని పెంచుతూ వానరుడు భీకరంగా కనిపిస్తున్నాడు. రాజా! అర్జునుని రథాశ్వాలను నడుపుతున్న కృష్ణుని చక్రం, గద, శంఖం, శార్ఙ్గం కనిపిస్తున్నాయి. అర్జునుడు లాగిన గాండీవం టంకారం చేస్తోంది. లాఘవం గల అర్జునుడు విడిచిన ఆ పదునైన బాణాలు శత్రువులను సంహరిస్తున్నాయి. యుద్ధంలో వెనుకంజవేయని రాజుల శిరస్సులతో రణభూమి నిండిపోయింది. వారి కళ్ళు విశాలంగా, ఎర్రగా ఉన్నాయి. వారి ముఖాలు పూర్ణచంద్రులవలె ఉన్నాయి. ఇవిగో రణశూరులు ఎత్తిన సాయుధ బాహువులు అలాగే నరకబడుతున్నాయి. అవి గడియలవలె పొడవైనవి, పుణ్యగంధలేపనం గలవి. అర్జునుడు పడగొట్టిన, పడగొడుతున్న గుర్రాలు, నాలుకలు, కళ్ళు బయటకు వచ్చిన దశలో శిథిలమై రౌతులతో సహా నేలబడి నిదురిస్తున్నాయి. ఇవిగో! కొండకొమ్ములవంటి ఈ హిమాలయ గజాలు అర్జునుడు కుంభస్థలాలను బ్రద్దలు చేయగా, కొండలవలె పడుతున్నాయి. గంధర్వ నగరాలవలె శోభిస్తున్న రథాలనుండి రాజులు, పుణ్యం ముగియగానే విమానం నుండి జారిపడుతున్న స్వర్గవాసులవలె పడిపోతున్నారు. వేలకొలదిగ ఉన్న వివిధ మృగాలను సింహం కలచివేసినట్లు అర్జునుడు శత్రుసైన్యాన్ని తీవ్రంగా కలచివేశాడు.

కర్ణా! రాధేయా! అసహనంతో నిన్ను సమీపించాలని గొప్ప రథికులను సంహరిస్తూ అర్జునుడు వస్తున్నాడు. అతని మీదకు పద.

జాతిని, వీరపాటును వీడి భార్గవాస్త్రాన్ని తలచుకో, పరశురాముని ఉపదేశాన్ని తలచుకొని దృష్టిని ముష్టిని సంధించి జయాభిలాషతో మహారథుడైన అర్జునునకు ఎదురు వెళ్ళు.

వేగంగా అనేకశత్రువులను సంహరిస్తున్న అర్జునుని చూసి, భయపడి, ఈ ధార్తరాష్ట్రసేన అన్ని ప్రక్కలకూ చీలిపోతోంది. సర్వసేనలను వీడి అర్జునుడు త్వరపడుతున్నాడు. ఉప్పొంగుతున్న ఆ అర్జునుని శరీరాన్ని చూస్తే నీ కోసమే వస్తున్న ట్లనిపిస్తోంది. భీమసేనుడు బాధకు లోనయ్యాడని అర్జునుడు కోపంతో మండి పడుతున్నాడు. కాబట్టి నీతో తప్ప మరెవ్వరితోనూ యుద్ధం చేయాలని ఆగడు. రథాన్ని కోలుపోయి తీవ్రంగా గాయపడిన ధర్మరాజును, శిఖండిని, సాత్యకిని, ధృష్టద్యుమ్నుని (ద్రుపద సుతుడు) ద్రౌపది కొడుకులను, యుధామన్యుని, ఉత్తమౌజుని, సోదరులైన నకుల సహదేవులను చూసి, వేగంగా అర్జునుడు క్రోధంతో కళ్ళెర్రజేసి రాజుల నందరినీ సంహరించాలని వస్తున్నాడు. సైన్యాలనన్నింటినీ వీడి, నిస్సందేహంగా త్వరగా మనవైపే వస్తున్నాడు. అతనిని ఎదిరించు. మరొక విలుకాడు లేడు. కోపంతో రణభూమిలో చెలరేగుతున్న అర్జునుని, చెలియలికట్టవలె నిరోధించటానికి,

ఈలోకంలో నీవు తప్ప మరొక విలుకాడు కనిపించటం లేదు. అతనికి వెనుకగానీ, ప్రక్కల గానీ రక్షకులెవ్వరూ లేరు. ఒంటరిగా నీ మీదకు వస్తున్నాడు. నిన్ను నీవు సఫలుని చేసికో. రణభూమిలో కృష్ణార్జునులను సంహరింపగలవాడవు నీవు మాత్రమే. భారమంతా నీదే! కర్ణా! అర్జునుని మీదకు పద! నీవు భీష్మునితో, ద్రోణునితో, అశ్వత్థామతో, కృపునితో సమానుడవు. మహాసంగ్రామంలో ఎత్తి వస్తున్న అర్జునుని నివారించు.

కర్ణా! బుసలుకొట్టే పామును, రంకెవేస్తున్న ఆబోతును, అడవిలోని పులిని చంపినట్లు అర్జునుని చంపు. మహారథులైన ధార్తరాష్ట్రులూ, ఇతర రాజులూ ఆత్మీయతను కూడా విడనాడి, అర్జునునకు భయపడి రణభూమి నుండి పారిపోతున్నారు. సూతనందనా! పారిపోతున్న వారి భయాన్ని పోగొట్టగల వీరమానవుడు రణభూమిలో నీవు తప్ప మరొకడు లేడు. పురుషశ్రేష్ఠా! రణరంగంలోని ఈ కౌరవ లందరూ శరణు కోరుతూ, నిన్నే. ద్వీపంగా భావించి నీ చుట్టూ చేరారు. రాధేయా, సుదుర్జయులైన వైదేహులను, అంబష్ఠులను, కాంబోజులను, నగ్నజితులను, గాంధారులను యుద్ధంలో ధైర్యంతో జయించావు. ఆ ధైర్యాన్ని ఇప్పుడు ఆశ్రయించు, అర్జునునిపై దాడిచేయి. మహాబాహూ! కిరీటి ఎక్కువగా ప్రేమించే వృష్ణి వంశస్థుడైన వాసుదేవుని మహా పౌరుషంతో నిలిచి, ఎదిరించు.

గతంలో నీవు ఒంటరిగా దిగ్విజయం సాగించావు. ఇంద్రుడిచ్చిన శక్తితో వాయుసుతుని కుమారుని (ఘటోత్కచుని) చంపావు. అదంతా మనస్సుకు తెచ్చుకొని కౌంతేయుడైన అర్జునుని చంపు.'

కర్ణుడిలా అన్నాడు. "మహాబాహూ! శల్యా! ఇప్పుడు నీవు నీకు తగినట్లు అన్నావు. నాకు నచ్చావు. అర్జునునకు నీవు భయపడవద్దు. ఈరోజు నా బాహుబలాన్ని చూడు. నా శిక్షణను గుర్తించు. పాండవ మహాసేనను ఈరోజు ఒంటరిగా జయిస్తాను. పురుషవ్యాఘ్రా! సత్యప్రమాణంగా నీకు చెప్తున్నాను. వీరులైన ఆ కృష్ణార్జునులను చంపకుండా, రణభూమి నుండి ఏ పరిస్థితిలోనూ వెనుదిరగను. లేదా వారిచేత చచ్చి దీర్ఘనిద్రపోతాను. యుద్ధంలో గెలుపు అనిశ్చితం, వారిని చంపి! లేదా వారిచే చచ్చి నేడు కృతార్థుడ నవుతాను." శల్యుడిలా అన్నాడు. "కర్ణా! రథికశ్రేష్ఠుడైన ఈ అర్జునుడు ఒంటరి అయినా రణభూమిలో అజయ్యుడని మహారథులే అంటుంటారు. ఇక ఇప్పుడు కృష్ణుని రక్షణలో కూడా ఉన్నాడు. ఇతనిని గెలవటానికి ఎవరు ఉత్సాహం చూపగలరు?" కర్ణుడిలా అన్నాడు. "మనం విన్నంతలో లోకంలో ఎక్కడా ఇటువంటి రథికశ్రేష్ఠుడు ఎప్పుడూ లేడు. ఇటువంటి అర్జునుని ఇప్పుడు మహాసంగ్రామంలో ఎదిరిస్తాను. నా పౌరుషాన్ని చూడు. ఈ అర్జునుడు తెల్లని గుర్రాలతో రణరంగంలో సంచరిస్తున్నాడు. అతడు ఈ రోజు నన్ను కష్టాలపాలు

చేయవచ్చు. ఈ కర్ణుని మరణంతో సమస్త కౌరవ యోధులు నశించిపోవచ్చు. ఆ అర్జునుని చేతులకు చెమట పట్టదు. అవి ఎప్పుడూ వణకవు. ఆ విశాలహస్తాలు కాయలు కాచి, ఉన్నాయి. దృఢమైన ఆయుధాలుగల ఆ అర్జునుడు, వాటిని వేగంగా ప్రయోగించగల జ్ఞాని. ఆ అర్జునునితో సమానుడైన యోధుడు లేడు. ఒకే బాణమున్నట్లుగా ఒకేమారు కంక పత్రాలు గల అనేక బాణాలను తీసి, వెంటనే అన్నింటినీ ప్రయోగించగలడు. అవి క్రోసెడు దూరంలో అమోఘంగా పడతాయి. అతనితో సమానుడైన యోధ్ధ లోకంలో లేడు. ఖాండవవనంలో కృష్ణునితో కలిసి వేగంగా అగ్నిని తృప్తిపరచిన అతిరథుడు అర్జునుడు. ఆ సమయంలోనే మహాత్ముడైన కృష్ణుడు చక్రాన్నీ, సవ్యసాచి అయి, అర్జునుడు గాండీవ ధనుస్సును పొందారు.

అర్జునుడు మంచి ధ్వని, తెల్లని గుర్రాలు గల ఉగ్రరథాన్ని దివ్యరూపం గల అక్షయమైన అమ్ములపొదులను, దివ్యశస్త్రాలనూ అగ్నిద్వారా పొందాడు. అలాగే ఇంద్రలోకంలో లెక్కలేనంత మంది రాక్షసులనూ, కాలకేయుల నందరనూ చంపి, అక్కడ దేవదత్త శంఖాన్ని పొందాడు. లోకంలో అతనిని మించినవాడెవడు? అర్జునుడు సాక్షాత్తు పరమేశ్వరునే అస్త్రాలతో తృప్తి పరచాడు. ఆయన నుండి భీకరమై, మూడులోకాలనూ సంహరించగల మహాస్త్రాన్ని పాశుపతాన్ని పొందాడు. లోకపాలులంతా ఒక్కటై కలసివచ్చి, విడివిడిగా, లెక్కలేనన్ని మహాస్త్రాలను ఇచ్చారు. నరశ్రేష్ఠుడైన అర్జునుడు ఆ అస్త్రాలతోనే ఒక్కటై వచ్చిన కాలకేయ రాక్షసుల నందరనూ యుద్ధంలో చంపాడు. అలాగే విరాట నగరంలో ఒక్కటై వెళ్ళిన మమ్మందరినీ ఒంటరి రథంతో జయించి, గోధనాన్ని తిరిగి తీసికొన్నాడు. రణభూమిలోనే మహారథుల వస్త్రాలను కూడా తీసికొన్నాడు. శల్యా! అటువంటి వీర్యగుణ సంపదతో, కృష్ణుని సహాయంతో, రాజులలో మేటి అయిన అర్జునుని ఆహ్వానించి, నా ఉత్తమసాహసాన్ని సర్వలోకాలకూ తెలియజేస్తాను. అనంతపరాక్రమశాలి, అసమానుడు, నారాయణుడు అయిన కేశవుని రక్షణలో ఉన్నాడు. లోకులంతా కలిసి పదివేల సంవత్సరాలు కీర్తించినా కృష్ణుని గుణాలను చెప్పలేరు. ఆయన మహాత్ముడు, శంఖచక్రఖడ్గ ధారి, విష్ణువు, వసుదేవుని కుమారుడు జయశీలుడు. ఒకే రథంలో కలిసి ఉన్న కృష్ణార్జునులను చూస్తుంటే నాకు భయమూ, సిగ్గూ కలుగుతున్నాయి. అర్జునుడు యుద్ధంలో ధనుర్ధారులనందరినీ మించిన వాడు. చక్రయుద్ధంలో కృష్ణుడు సాటి లేనివాడు. హిమవంతుడు తన స్థానం నుండి కదిలినా, కృష్ణార్జునులు నిశ్చలంగానే ఉంటారు. శల్యా! ఇద్దరూ శూరులు, బలశాలులు, మేటి ఆయుధాలు గలవారు, మహారథులు, చక్కని శరీరాలు

గలవారు. అటువంటి కృష్ణార్జునులను నేను తప్ప మరెవ్వరు ఎదిరించగలరు ? మద్రరాజా! ఆ అర్జునునితో యుద్ధం చేయాలన్న ఈ నా కోరిక, త్వరలోనే అత్యద్భుతంగా అసాధారణంగా, చిత్రంగా తీరబోతోంది. రణరంగంలో వారిని చంపి పడగొడతాను. లేదా కృష్ణార్జునులే నేడు నన్ను పడగొడతారు."

అలా శల్యునితో పలికి కర్ణుడు రణభూమిలో పెద్దగా అరిచాడు. అప్పుడు నీ కుమారుడు దుర్యోధనుడు అతనిని అభినందించాడు. అప్పుడు కర్ణుడు దుర్యోధనునితో, కృపునితో, కృతవర్మతో, సోదరసహితుడైన శకునితో అశ్వత్థామతో, తన చిన్నతమ్మునితో, సైనికులతో, హస్తిపకులతో ఇలా అన్నాడు. - "కృష్ణార్జునులను అడ్డగించి దాడిచేయండి. సర్వప్రయత్నాలతో వారిని అలసటకు గురిచేయండి. రాజులారా! వారిద్దరినీ మీరు తీవ్రంగా గాయపరిస్తే నేను తేలికగా వారిని చంపుతాను". అలాగే అని మహావీరులైన వారంతా వేగంగా అర్జునుని సంహరించాలని దాడిచేశారు. ఆ మహారథులు కర్ణుని ఆదేశాన్ని పాటిస్తూ, బాణాలతో యుద్ధభూమిలో అర్జునుని గాయపరిచారు. అధికజలం గల మహాసముద్రం నదీ నదాలను మ్రింగినట్లు, అర్జునుడు రణరంగంలో వారిని కబళించాడు. అర్జునుడు బాణాలను ఎక్కుపెట్టడం కానీ, విడవటం కానీ శత్రువులకు కనిపించటం లేదు. కానీ తాను ప్రయోగించిన బాణాలతో చీలిపడిపోయిన సైనికులు, గుర్రాలు, ఏనుగులు మాత్రమే కనిపిస్తున్నాయి. అర్జునుడు శరజ్వాలలతో, గాండీవంతో ఏర్పడిన అందమైన మండలంతో, ప్రళయకాలంలోని సూర్యునితో సమానమైన తేజస్సుతో ప్రకాశిస్తున్నారు. నేత్రవ్యాధి గల జనులు సూర్యుని చూడలేనట్లు, కౌరవులు ఆ అర్జునుని చూడలేకపోయారు. మహారథులు ప్రయోగించిన ఉత్తమశరాలను, అర్జునుడు నవ్వుతూ బాణసమూహాలతో ఖండించాడు. మరల గాండీవ ధనుస్సును పూర్తిగావించి, బాణ గణాలతో శత్రువులను పీడించాడు. రాజా! జ్యేష్ఠ - ఆషాఢమాసాల మధ్యలో తీక్ష్ణ కిరణాలతో సూర్యుడు తేలికగా జలరాసులను హరించినట్లు, అర్జునుడు బాణగణాలను ప్రయోగించి, నీ సేనను దహించాడు.

కృపుడు, శరవృష్టిని కురిపిస్తూ అర్జునునిపై దాడిచేశాడు. కృతవర్మ, స్వయంగా నీకుమారుడు, అశ్వత్థామ మేఘాలు కొండపై కురిసినట్లు అర్జునునిపై బాణవర్షాన్ని కురిపించారు. తనను చంపాలనే ప్రయత్నంతో గుమిగూడిన ఆ యోధులు ప్రయత్నపూర్వకంగా ప్రయోగించిన ఆ బాణాలను, అర్జునుడు వేగంగా బాణాలతో ఖండించాడు. అందరి ఛాతీలపై మూడు మూడు బాణాలతో కొట్టాడు. వంచిన గాండీవ ధనుస్సు అనే పూర్ణమండలం గల

అర్జునుడనే సూర్యుడు తన బాణ కిరణాలతో ప్రకాశిస్తూ, శత్రువులను తపింపజేస్తూ, జ్యేష్ఠాషాఢాల మధ్యవర్తి అయి పరివేషధారి అయిన సూర్యునివలె ప్రకాశించాడు. ఆపై అశ్వత్థామ పది బాణాలతో అర్జునుని, మూడింటితో కృష్ణుని, నాలుగింటితో నాలుగు గుర్రాలను ఆపై గొప్ప బాణాలతో ధ్వజం మీది కపిని కొట్టాడు. అప్పుడు అర్జునుడు మూడు బాణాలతో అశ్వత్థామ వింటిని, ఒక క్షురంతో సారధి తలను, నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను, మరో మూడు బాణాలతో ధ్వజాన్ని రధం మీదనుండి పడగొట్టాడు.

ఆ అశ్వత్థామ రోషంతో నిండి మరొకధనుస్సు చేతబట్టాడు. అది మణులతో, వజ్రాలతో, బంగారంతో అలంకరింపబడి తక్షకుని పడగవలె ప్రకాశిస్తోంది. ఎంతో విలువైన దానిని పర్వతతటం నుండి మహాసర్పాన్ని తీసినట్టు తీశాడు అశ్వత్థామ. విరిగిపోయిన తన వింటిని నేలపై నుంచి, నూతన ధనుస్సును ఎక్కుపెట్టి, గుణాధికుడైన అశ్వత్థామ ఓటమినెరుగని ఆ కృష్ణార్జునులను, మేటి అమ్ములతో దగ్గరనుండి కొట్టి పీడించాడు. కృపుడు, భోజుడు, నీ కుమారుడు రణాగ్రాన నిలిచి అనేక బాణాలతో అర్జునుని కప్పివేశారు. అది మేఘాలు సూర్యుని ఆవరించినట్లుంది. గతంలో ఇంద్రుడు బలిని పీడించినట్లు, కార్తవీర్యుని వంటి పరాక్రమం గల అర్జునుడు కృపుని ధనుర్బాణాలను, గుర్రాలను, ధ్వజాలను, సారథిని బాణాలతో పీడించాడు. ఆ మహాసంగ్రామంలో అర్జునుని బాణాలతో కృపుని ఆయుధం నేలగూలగా, ధ్వజం పడిపోగా, అర్జునుడు అంతకుముందు భీష్ముని వేలబాణాలతో నియంత్రించినట్లు, కృపాచార్యుని కూడా నియంత్రించాడు. ఆ తరువాత అర్జునుడు బాణాలతో గర్జిస్తున్న నీ కుమారుని ధ్వజాన్నీ, ధనుస్సును ఖండించాడు. శుభలక్షణాలు గల కృతవర్మ గుర్రాలను, ధ్వజాన్ని కూడా ఖండించాడు. ఆపై అర్జునుడు త్వరపడుతూ గుర్రాలనూ, సారధులను, ధనుస్సులను, ధ్వజాలతో పాటు రథాలను, ఏనుగులను, గుర్రాలను, రధికులనూ సంహరించసాగాడు. నీరు సేతువును బ్రద్దలు చేసి ప్రవహించినట్లు, దానితో నీ మహాబలం చెల్లాచెదరయింది.

ఆపై శ్రీకృష్ణుడు కలతపడుతున్న తన శత్రువుల నందరినీ రథంతో అపసవ్యంగా నడిపించాడు. వృత్రుని సంహరించాలని బయలుదేరిన ఇంద్రునివలె, వేగంగా సాగుతున్న అర్జునునిపై ఇతరులు దాడిచేశారు. వారు ధ్వజాలను ఎగురవేసి చక్కగా కూర్చిన రథాలతో యుద్ధాభిలాషతో వచ్చారు. అర్జునునిపై దాడి చేయటానికి వచ్చిన వారి ముందుకు వచ్చి, మహారథులైన శిఖండి, సాత్యకి, నకుల సహదేవులు వారిని నివారించి, పదునైన బాణాలతో వారిని చీల్చి, భీకరంగా గర్జించారు. ఆపై సృంజయులు, కౌరవవీరులు

కలబడి కుపితులై, వేగంగలిగి, పదునైన బాణాలతో పరస్పరం కొట్టుకోసాగారు. అది గతంలోని దేవదానవ మహాసంగ్రామం వలె ఉంది. జయాన్ని కోరుతూ, స్వర్గానికి వెళ్ళటానికి ఉత్సాహపడుతూ ఏనుగులు, గుర్రాలు, రథాలు శత్రువులపై పడుతున్నాయి. చక్కగా విడిచిన బాణాలతో ఒకరినొకరు విడివిడిగా తీవ్రంగా గాయపరిచారు. పెద్దగా గర్జనలు చేశారు. రాజా! మహాసంగ్రామంలో యోధశ్రేష్ఠులు శరాలతో అంధకారాన్ని కల్పించగా, నాలుగుదిక్కులా, నాలుగు మూలలా, సూర్యకాంతి అంతా చీకటితో కప్పబడింది."

80. అర్జునుడు కౌరవసేనను ధ్వంపము చేయుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! కౌరవసేనలోని ప్రముఖ వీరులు భీమునిపై దాడిచేశారు. భీమసేనుని దాదాపు ముంచెత్తారు. భారతా! అర్జునుడు భీముని ఉద్ధరించటానికై కర్ణుని సేనను విడిచి, భీమునిపై దాడిచేస్తున్న శత్రువీరులను బాణాలతో మృత్యులోకానికి పంపించాడు. ఆపై అర్జునుని బాణసమూహాలు కొన్ని ఆకాశాన్ని ఆవరించాయి. మరికొన్ని నీ సేనను సంహరిస్తూ కనిపించాయి. ఆ అర్జునుడు పక్షి సమూహాలవలె ఆకాశాన్ని బాణాలతో నింపుతూ, కౌరవుల పాలిటికి మృత్యువయ్యాడు. ఆపై అర్జునుడు భల్లాలతో, క్షురప్రాలతో వివిధ బాణాలతో కౌరవసేనల శరీరాలను నరికాడు. తలలను ఖండించాడు కూడా. అప్పుడు రణభూమిలో కొందరి శరీరాలు శిథిలమయ్యాయి. కొందరి కవచాలు, కొందరి తలలు తెగాయి. వారు అన్నివైపులా పడ్డారు. ఇంకా కొందరు పడుతున్నారు. వారితో రణరంగం ఆవరింపబడింది. ధనంజయుని బాణాలచే సంహరింపబడిన రథాలు, గుర్రాలు, రథికులు, ఏనుగులతో రణభూమి నిండింది. వారిలో కొందరు ఛిన్నాభిన్నమై విధ్వంసానికి లోనయ్యారు. రాజా! రణభూమి వైతరణివలె మరీ విషమంగా, దుర్గమంగా, ఘోరంగా చూడడానికి అసలు వీలులేని రీతిగా తయారయింది.

రణరంగమంతా రథాలతో కప్పబడింది. కొన్నింటి కాడెలు, చక్రాలు, ఇరుసులు భంగమయ్యాయి. కొన్నింటి గుర్రాలు చనిపోయాయి. కొన్నింటి గుర్రాలు ఉన్నాయి. వాటి సారథులు కొందరు చనిపోయారు. కొందరున్నారు, ఆ రథికులు పోరాడుతున్నారు. అర్జునుని మేటి అమ్ముల దెబ్బతిని, నిత్యమూ మదజలం స్రవిస్తూ, మంగళకరాలయి కవచాలు ధరించి, కోపంతో ఉన్న నాలుగు వందల ఏనుగులు చనిపోయాయి. వాటిపై బంగారు వన్నెగల కవచాలు, కనకభూషణాలు ధరించిన యోధులున్నారు. క్రూర స్వభావంగల మావటీళ్ళు వాటిని తమ మడమలతో బొటనవ్రేళ్ళతో ప్రేరేపించేవారు. వారితోపాటు

పడిపోయిన ఆ ఏనుగులు జంతువులతో పాటు, నేలబడియున్న మహా పర్వత శిఖరాలవలె ఉన్నాయి. అర్జునుని బాణాల తాకిడితో గాయపడిన ఆ ఏనుగులతో భూమి కప్పబడింది. అర్జునుని రథం సూర్యుడు మేఘాలను బ్రద్దలు చేసినట్లు, మేఘాల వలె నుండి, మదజలాన్ని స్రవించే ఏనుగులను బ్రద్దలు చేస్తూ ముందుకు వచ్చింది. అర్జునునిచే చనిపోయిన ఏనుగులతో, మనుష్యులతో, గుర్రాలతో, అనేకవిధాలుగా భగ్నమైన రథాలతో, శస్త్రాలను, యంత్రాలను, కవచాలను కోలుపోయి, నిరాయుధులై మరణించియున్న సైనికులతో యుద్ధమార్గమంతా ఆవరింపబడింది. అర్జునుడు ఆకాశంలోని మేఘధ్వని వలె, భయానకమైన వజ్రపాతధ్వనిని తిరస్కరిస్తూ, భీకరధ్వనితో గాండివ ధనుష్టంకారం చేశాడు. ఆపై అర్జునుని బాణాలచే ఆహతమైన ఆ సేన, పెనుగాలిచే సాగరంలో కొట్టబడిన నావ వలె బ్రద్దలయింది. గాండీవం నుండి ప్రయోగింపబడిన వివిధ రూపాల బాణాలు కొరవులవలె, తోకచుక్కలవలె, వజ్రం వలె ప్రాణాలను అపహరిస్తూ నీ సేనను దహించాయి. మహాపర్వతం మీద రాత్రివేళ వెదురు వనం ప్రజ్వలించినట్లు, నీ మహాసేన అర్జున శరపీడితమై, అగ్నిజ్వాలల మధ్యనున్నట్లు ప్రకాశించింది.

అర్జునుడు నీ సేనను పిండిచేశాడు. దహించాడు. ధ్వంసం చేశాడు. బాణాలతో బ్రద్దలు చేశాడు. అన్నిదిక్కులకూ పారద్రోలాడు. మహారణ్యంలో దావాగ్నికి భయపడిన మృగ సమూహాలవలె, అర్జునునిచే దహింపబడిన కౌరవులు అన్నివైపుల పరిభ్రమించసాగారు. ఆ రీతిగా ఉద్విగ్నమై, పరాఙ్ముఖమై ఉన్న కౌరవ బలం అంతా రణభూమిలో భీమసేనుని వీడి, యుద్ధ విముఖమైంది. కౌరవులు భంగపడగానే, ఓటమి నెరుగని అర్జునుడు భీమసేనుని సమీపించి, ముహూర్తకాలం నిలిచాడు. అర్జునుడు భీమునితో కలిసి, మాటాడి యుధిష్ఠిరుని శరీరం నుండి బాణాలను తొలగించినట్లు, అతడు క్షేమంగా ఉన్నట్లు చెప్పాడు. భారతా! ఆ తరువాత అర్జునుడు భీమసేనుని అనుమతితో, రథఘోషతో భూమ్యాకాశాలను ప్రతిధ్వనింపజేస్తూ బయలుదేరాడు. వీరులు, యోధశ్రేష్ఠులు, దుశ్శాసనుని కంటె చిన్నవారు అయిన నీ కొడుకులు పదిమంది అర్జునుని చుట్టుముట్టారు. ఆ పదిమంది శూరులు కౌరవులతో ఏనుగును బాధించినట్లు, ధనుస్సులను బాగా లాగి నృత్యం చేస్తున్నట్లు అర్జునుని బాణాలతో పీడించారు. మధుసూదనుడు వారికి అపసవ్యంగా రథాన్ని పోనిచ్చాడు. అర్జునుడు వారిని యమలోకానికి పంపటం తగదని భావించాడు కృష్ణుడు. అర్జునుడు యుద్ధవిముఖుడైనా మరికొందరు మూడులు అర్జునునిపైకి వచ్చారు. అలా మీదకు వస్తున్నవారి ధ్వజాలను, గుర్రాలను, విండ్లను, బాణాలను అర్జునుడు వేగంగా అర్ధచంద్రాకార

బాణాలతో పడగొట్టాడు. ఆపై విడిగా అనేక భల్లాలతో వారి తలలను పడగొట్టాడు. క్రోధంతో ఎర్రజేసిన కళ్ళతో, కొరుకుతున్న పెదవులతో ఆ ముఖాలు పద్మాలవలె ఎంతో ప్రకాశించాయి. శత్రుసూదనుడైన అర్జునుడు బంగారు రెక్కలు, మహావేగం గల పది భల్లాలతో రుక్మాంగదాలు ధరించిన ఆ పదిమందిని చంపి బయలుదేరాడు."

81. సంకులయుద్ధము - కర్ణపరాక్రమము

సంజయుడిలా చెప్తున్నాడు. "తీవ్రవేగం గల గుర్రాలతో వస్తున్న కపిధ్వజుడైన అర్జునునిపై, కౌరవసేనలోని తొంబది మంది వీరరథికులు దాడిచేశారు. నరశ్రేష్ఠులైన సంశప్తకులు పరలోకానికి సంబంధించి ఘోరశపథం చేసి, రణభూమిలో నరోత్తముడైన అర్జునుని చుట్టుముట్టారు. కాంచన భూషణాలతో, ముత్యాల జాలరులతో అలంకరింపబడి, మహావేగంగా కదులుతున్న తెల్లని గుర్రాలను కృష్ణుడు కర్ణునిరథం మీదకు నడిపాడు. ఆపై అర్జునుడు కర్ణుని రథంమీదకు వెళ్తుండగా, రథికులైన సంశప్తకులు బాణ వృష్టితో అర్జునుని గాయపరుస్తూ, దాడిచేశారు. త్వరపడుతున్న ఆ తొంబది మంది వీరులను అందరినీ ధనుస్సులతో, ధ్వజాలతో సహా అర్జునుడు పదునైన బాణాలతో కొట్టాడు. నానారూపాలు గల అర్జునుని బాణాల దెబ్బతిని వారు, పుణ్యం క్షీణించగా స్వర్గంనుండి విమానాలతో సహా జారిపడుతున్న సిద్ధులవలె నేలగూలారు. ఆపై భరతశ్రేష్ఠుడు, కురుసత్తముడు అయిన అర్జునుని కౌరవులు రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో నిర్భయంగా ఎదిరించారు. అప్పుడు నీ సేనలోని రథికులు, గుర్రాలు అలసిపోగా, గొప్ప ఏనుగులు ఎగిసిపడుతుండగా, నీ కుమారుల మహాసేన అర్జునుని నిలువరించింది. మేటి విలుకాండ్రైన కౌరవులు శక్తులతో, ఋష్టులతో, తోమరాలతో, ప్రాసాలతో, గదలతో, కత్తులతో, బాణాలతో అర్జునుని కప్పివేశారు. ఆకాశమంతటా ఆవరించిన ఆ శరవృష్టిని సూర్యుడు కిరణాలతో చీకటిని చీల్చినట్లు, అర్జునుడు బాణాలతో ఛిన్నాభిన్నం చేశాడు. ఆపై నీ కుమారుని ఆదేశం మేరకు పదమూడు వందల మదపుటేనుగులతో ఉన్న మ్లేచ్ఛులు ఒక ప్రక్కనుండి అర్జునుని గాయపరచసాగారు. కర్ణులతో, నాలీకాలతో, నారాచాలతో, తోమరాలతో, ప్రాసాలతో, శక్తులతో, ముసలాలతో, భిందిపాలాలతో వారు రథంపైనున్న అర్జునుని పీడించారు. ఏనుగుల తొండాల ద్వారా విసరబడిన ఆ అసాధారణ శస్త్రవృష్టిని, అర్జునుడు అర్ధచంద్రాకారం గల పదునైన భల్లాలతో ఛేదించాడు.

ఆపై ఆ ఏనుగులనన్నింటినీ పతాకలతో, ధ్వజాలతో, హస్తిపకులతో పాటు,

వజ్రపు దెబ్బలతో కొండలను ధ్వంసం చేసినట్లు, అర్జునుడు ఎన్నో రకాల బాణాలతో సంహరించాడు. బంగారు జాలరులు అలంకరించిన ఆ ఏనుగులు సువర్ణపక్షాలు గల బాణాలచే పీడింపబడి, అగ్నిజ్వాలలు క్రక్కుతూ, కొండలు కూలినట్లు నేలగూలాయి. అప్పుడు గాండీవధనుష్టంకారం జోరుగా వినిపించింది. అరుస్తున్న సైనికుల ధ్వని, ఏనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింతలు ఎక్కువయ్యాయి. దెబ్బతిన్న ఏనుగులు అన్నిదిక్కులకూ పారిపోసాగాయి. గుర్రాలు కూడా, రౌతులు చనిపోగా, పదిదిక్కులకూ పరుగుదీయసాగాయి. సారథులు, గుర్రాలు చనిపోయిన రథాలు గంధర్వ నగరాకారంతో వేలకొలదిగ కనిపిస్తున్నాయి. మహారాజా! ఇటు అటు పారిపోతున్న ఆశ్వికులు ఎక్కడి వారక్కడే అర్జునుని బాణాలచే చచ్చి కనిపిస్తున్నారు. ఆ క్షణంలో అర్జునుని బాహుబలం ప్రస్ఫుటమైంది. రణభూమిలో ఒంటరిగా ఆశ్వికులను, ఏనుగులను, రథాలను జయించాడు.

రాజా! గుర్రాలు, ఏనుగులు, రథాలు విడివిడిగా రణభూమికి మరలివచ్చి, గర్జనలు చేస్తూ అర్జునుని ఎదిరించాయి.

భరతర్షభా! అప్పుడు భీమసేనుడు మూడు రకాల మహాసేన అర్జునుని చుట్టుముట్టడం గమనించి, చావగా మిగిలిన నీ కొద్దిమంది రథికులను విడిచి, ధనంజయుని రథం దగ్గరకు వేగంగా వచ్చాడు. నీసేనలో చాలామంది చనిపోయారు. ఎందరో గాయపడ్డారు. అయినా నీ సైన్యం అర్జునునిపై దాడి చేసింది. ఆ స్థితిలో అర్జునుని చూసి, భీమసేనుడు తన తమ్ముని రథం దగ్గరకు వచ్చాడు. అర్జునుడు చంపగా మిగిలిన ఆ మహాబలశాలులైన గుర్రాలను, భీముడు మహాసంగ్రామంలో గదను చేతబట్టి సంహరించాడు.

మారిషా! కాళరాత్రి వలె భీకరమై, సైనికులను ఏనుగులను, గుర్రాలను కబళిస్తూ, ప్రాకారాలను, బురుజులను, నగరద్వారాలనూ కూడా చీల్చగల తన గదను, భీమసేనుడు వేగంగా సైనికులపై, గుర్రాలపై, ఏనుగులపై విసిరాడు. అది ఎన్నో గుర్రాలను, ఎందరో ఆశ్వికులను సంహరించింది. భీముడు తన గదతో ఉక్కుకవచాలను ధరించిన సైనికులను, గుర్రాలను కూడా సంహరించాడు. అవి చచ్చి ఆక్రోశిస్తూ నేలగూలాయి. కౌరవసేనలు నెత్తురోడుతూ, దంతాలతో మట్టి కరచి, తలలు, ఎముకలు, పాదాలు చితికిపోగా, క్రూరజంతువులకు ఆహారమై నేలపై బడిఉన్నారు. కాళరాత్రివలె, చూడరాని ఆ గద సైనికుల నెత్తురు, మాంసం, క్రొవ్వులతో తృప్తిపడి, ఎముకలను కూడా కబళిస్తూ నిలిచింది. పదివేల గుర్రాలను, ఎందరో సైనికులను చంపి, భీముడు తీవ్రకోపంతో గదను చేతబట్టి అటు ఇటు పరుగెత్తసాగాడు. భారతా! గదను చేతబట్టియున్న భీముని చూసి, నీవారంతా కాలదండాన్ని ఎత్తిపట్టిన యముడే వచ్చినట్లు భావించారు. ఆ భీమసేనుడు మదించిన

ఏనుగువలె, మొసలి సముద్రంలో ప్రవేశించినట్లు, తీవ్రకోపంతో గజసేనలో ప్రవేశించాడు. పెద్దగదను తీసికొని, గజసేనలోనికి చొచ్చుకొనిపోయిన, భీముడు, తీవ్రకోపంతో క్షణకాలంలో దానిని యమసదనానికి పంపాడు. మదపుటేనుగులు కవచాలతో, హస్తిపకులతో, పతాకాలతో సహా రెక్కల పర్వతాలవలె పడటం కనిపిస్తోంది. భీమసేనుడు ఆ గజసేనను సంహరించి, మరల తన రథాన్ని ఎక్కి అర్జునుని వెనుకనే వెళ్ళాడు. భీమార్జునులు శస్త్రాలతో చుట్టుముట్టగా, నీసేన ఉత్సాహాన్ని కోల్పోయి, దాదాపు యుద్ధవిముఖమై ఉదాసీనంగా నిలిచింది. ఆ నీ సేనను గమనించి అర్జునుడు ప్రాణాలను తపింపజేసే బాణాలతో వారిని ఆవరించాడు. సైనికులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు, కేసరాలతో కూడిన కదంబకుసుమాలవలె రాజిల్లాయి. అర్జునుని బాణాలు సైనికులను, గుర్రాలను, ఏనుగులను ప్రాణాలు తీసి వధిస్తుంటే, కౌరవసేనలో తీవ్రమైన ఆర్తనాదం రేగింది. తీవ్రంగా భయపడి హాహాకారాలు చేస్తూ, ఒకరిమీద ఒకరు పడుతూ, నీ సేన కొరివి చక్రంవలె పరిభ్రమించసాగింది.

ఆపై కౌరవసేనతో మహాసంగ్రామం జరిగింది. దానిలో అర్జునుని బాణాలు చీల్చని రథం కానీ, రౌతు కానీ, గుర్రం కానీ, ఏనుగు కానీ లేదు. బాణాలతో కవచాలు తెగిపోయి, బాగా నెత్తుటితో తడిసి ప్రజ్వలిస్తున్న ఆ సేన, వికసించిన అశోకవనం వలె కనిపించింది.

భరతర్షభా! పదునైన బాణాలచే వధింపబడుతున్నా, ఆ సేన అర్జునుని సమీపించిందే కానీ రణభూమిని వీడలేదు. అక్కడ కౌరవుల పరాక్రమం అద్భుతంగా కనిపించింది. భరతర్షభా! సంహరింపబడుతూ కూడా ఆ సేన అర్జునుని వీడలేదు.

అలా పరాక్రమిస్తున్న సవ్యసాచిని చూసి, కౌరవులు అందరూ కర్ణుని జీవితంపై నిరాశకు లోనయ్యారు. రణభూమిలో అర్జునుని బాణాల తాకిడిని భరించటం కష్టమని గ్రహించి, కౌరవులు అర్జునుని చేతిలో ఓడిపోయి వెనుదిరిగారు. బాణాలతో వధింపబడుతున్న వారు రణభూమిలో కర్ణుని ఒంటరిగా వదలి, భయంతో దిక్కులు పట్టిపారిపోయారు. రక్షణకై కర్ణునికి మొరపెట్టుకొన్నారు. ఎన్నో వందలకొలదిగ బాణాలను వెదజల్లుతూ, భీమసేనుడు మొదలయిన పాండవయోధులకు ఆనందాన్ని కలిగిస్తూ, అర్జునుడు కౌరవసేనను పారద్రోలసాగాడు. మహారాజా! నీ కుమారులు కర్ణుని రథం దగ్గరకు వెళ్ళారు. అగాధమైన సముద్రంలో మునుగుతున్న వారికి అప్పుడు కర్ణుడు ద్వీపమయ్యాడు. మహారాజా! కౌరవులు అర్జునునకు భయపడి విషంలేని పాములవలె కర్ణునిలో లీనమయ్యారు.

కర్మచేసే ప్రాణులన్నీ మృత్యువునకు భయపడి ధర్మంలో లీనమయినట్లు, మహోత్ముడైన అర్జునునకు భయపడిన నీ కొడుకులు మేటి విలుకాడైన కర్ణునిలో లీనమయ్యారు.

బాణాల దెబ్బలకు భయపడి, నెత్తుటితో తడిసి, విషమస్థితిలో నున్నవారిని చూసి కర్ణుడు "భయపడవద్దు, నా దగ్గరకు రండి" అన్నాడు. పార్థబలంతో భగ్నమైన నీ సేనను చూసి, కర్ణుడు శత్రువులను చంపగోరి, ధనుస్సును వంచుతూ నిలిచాడు. శస్త్రధారులలో మేటి అయిన కర్ణుడు తన దగ్గరకు పారిపోయి వచ్చిన కౌరవులను చూసి, ఆలోచిస్తూ, నిట్టూర్చుతూ అర్జునుని చంపటంపై మనసుపెట్టాడు. ఆపై ధర్మశీలుడైన కర్ణుడు తన వింటిని వంచుతూ, అర్జునుడు చూస్తుండగానే మరల పంచాలురపై దాడిచేశాడు. అది చూసి క్షణంలో పంచాలరాజులు కళ్ళెర్రజేసి మేఘం కొండను కప్పినట్లు, బాణసమూహాలను కర్ణునిపై కురిపించారు. ఆపై కర్ణుడు విడిచిన వేలకొలది బాణాలు పంచాలురకు ప్రాణహాని కలిగించసాగాయి. మహామతీ! మిత్రహితాన్ని కోరి, మిత్రునికై పోరాడుతూ కర్ణునిచే సంహరింపబడుతున్న పంచాలురలో తీవ్రంగా ఆర్తనాదం రేగింది."

82. కర్ణపరాక్రమము - భీమదుశ్శాసన యుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! ఆపై కౌరవులు పారిపోతుండగా, సూతసుతుడైన కర్ణుడు తెల్లగుర్రాల రథంపై వచ్చి, గాలి మేఘాల సమూహాలను చెదరగొట్టినట్లు, మేటి అమ్ములతో పాంచాలరాజు కుమారులను సంహరించసాగాడు. ఆ కర్ణుడు అంజలికాలనే బాణాలతో జనమేజయుని సారథిని పడగొట్టి, గుర్రాలను చంపివేశాడు. శతానీక సుతసోములను భల్లాలతో నిరోధించాడు. వారి ధనుస్సులను ఖండించాడు. ఆ తరువాత కర్ణుడు ఆరు బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరచి, రణభూమిలో వేగంగా అతని గుర్రాలను కూడా సంహరించాడు. సాత్యకి గుర్రాలను చంపి, కేకయరాజకుమారుడైన విశోకుని కూడా చంపాడు. కుమారుడు మరణించగానే కైకయసేనాపతి అయిన ఉగ్రకర్ముడు కర్ణునిపై దాడిచేశాడు. తన ధనుస్సును వేగంగా కదిలిస్తూ, భీకర వేగంగల బాణాలతో కర్ణుని కొడుకైన ప్రసేనుని సంహరించాడు. కర్ణుడు నవ్వి, అర్ధచంద్రాకృతిగల మూడు బాణాలతో అతని బాహువులను, తలను ఖండించాడు. అతడు ప్రాణాలు కోల్పోయి, గొడ్డలితో నరికిన సాలవృక్షంవలె, రథంమీద నుండి నేలగూలాడు. కర్ణుడు సాత్యకి గుర్రాలను ఖండించినప్పుడు, ప్రసేనుడు వేగంగా దూసుకొనిపోయే పదునైన బాణాలతో సాత్యకిని ఆవరించాడు. ఆపై ఆ కర్ణసుతుడు సాత్యకి బాణాల దెబ్బతిని, నృత్యం చేస్తున్నట్లు పడిపోయాడు. పుత్రుడు మరణించగానే కర్ణుడు క్రోధానికి లోనైన మనస్సుతో, సాత్యకిని చంపగోరి "సాత్యకీ! చచ్చావు" అంటూ శత్రుసంహారకమైన బాణాన్ని ప్రయోగించాడు.

ఆ బాణాన్ని శిఖండి మూడు బాణాలతో ఖండించి, మరో మూడు బాణాలతో కర్ణుని పీడించాడు. అప్పుడు కర్ణుడు రెండు క్షురాలతో శిఖండి ధనుస్సును, ధ్వజాన్నీ విరిచి పడగొట్టాడు. ఆపై రుద్రరూపం దాల్చిన కర్ణుడు ఆరు బాణాలతో శిఖండిని గాయపరిచి, ధృష్టద్యుమ్నుని కుమారుని తలను ఖండించాడు. అదే రీతిగా మహోత్సాహైన ఆ కర్ణుడు పదునైన బాణంతో సుతసోముని శిథిలం చేశాడు. రాజశ్రేష్ఠా! ఆపై భీకర ద్వంద్వ యుద్ధం జరుగుతుండగా, ధృష్టద్యుమ్నుని కుమారుడు చనిపోగా కృష్ణుడు "అర్జునా! పాంచాలు రందరూ నశిస్తున్నారు. కర్ణుని చంపు" అని అర్జునునితో అన్నాడు. అర్జునుడు నవ్వి, గాయపడి భయపడుతున్న పాంచాలురను రక్షించాలని తన రథంతో రథ సమూహాలకు అధిపతి అయిన కర్ణుని సమీపించాడు. భీకరఘోషగల గాండీవాన్ని వంచి, అల్లెత్రాటిని ఎక్కుపెట్టి, అల్లెత్రాటితో అరచేతిపై కొడుతూ, వేగంగా బాణాంధకారాన్ని కల్పించి ఏనుగులను, గుర్రాలను, రథాలను, ధ్వజాలను కొట్టారు. అర్జునుడు అల్లెత్రాటిని మండలాకారంగా లాగి, విజృంభించి, రౌద్రముహూర్తంలో శత్రువులపై విజృంభించగానే అంతరిక్షంలో ధనుష్టంకారం ప్రతిధ్వనించింది. పక్షులు భయంతో కొండ గుహలలో దాగాయి.

అద్వితీయవీరుడైన భీమసేనుడు అర్జునుని వెనుక భాగాన్ని రక్షిస్తూ, రథంతో అనుసరించాడు. ఆ రాజకుమారు లిద్దరూ వేగంగా శత్రువులను చెదరగొడుతూ కర్ణుని మీదకు వెళ్ళారు. అంతలో కర్ణుడు సోమకులను సంహరిస్తూ మహాసంగ్రామాన్ని కొనసాగించాడు. రథాలు, గుర్రాలు, ఏనుగుల సమూహాలను సంహరించాడు. బాణాలతో దిక్కులను కప్పివేశాడు. ఉత్తమౌజుడు, జనమేజయుడు, యుధామన్యు శిఖండులు, ధృష్టద్యుమ్నుడు వీరంతా గర్జిస్తూ ఒక్కటై కూడి, బాణాలతో కర్ణుని ఛేదించారు. పాంచాల రథికశ్రేష్ఠులైన అయిదుగురు కర్ణునిపై దాడిచేసి కూడా అతనిని రథంమీద నుండి పడగొట్టలేకపోయారు. ధైర్యంగా ఇంద్రియాలను జయించిన వానిని విషయాలు పడగొట్టలేనట్లు, అది కనిపించింది. కర్ణుడు వారి ధనుస్సులను, ధ్వజాలను, గుర్రాలను, రథసారథులను, పతాకలను వెంటనే బాణాలతో ఖండించి, అయిదు బాణాలతో ఆ అయిదుగురిని గాయపరిచాడు. ఆపై సింహనాదం చేశారు. కర్ణుడు బాణాలను విడుస్తూ శత్రువులను సంహరిస్తున్నాడు. అతని చేతిలో అల్లెత్రాడు, బాణాలు కదులుతూనే ఉన్నాయి. విల్లు నినదిస్తూనే ఉంది. భూమి కొండలతో, వనాలతో పాటు బ్రద్దలయిందేమో అని ప్రజలు కలతపడ్డారు. ఇంద్రచాపంవలె నున్న వింటిని బాగా లాగి, బాణాలను విడుస్తూ, కర్ణుడు రణభూమిలో ప్రజ్వలించే

కిరణాలతో గూడి పరివేషాన్ని పొందిన సూర్యునివలె భాసించాడు. శిఖండిని పంద్రెండు, ఉత్తమౌజుని ఆరు, యుధామన్యుని మూడు పదునైన బాణాలతో గాయపరిచాడు. సోమకుని, ధృష్టద్యుమ్నుని మూడు మూడు బాణాలతో తీవ్రంగా గాయపరిచాడు. మహాసంగ్రామంలో కర్ణునిచే ఓడింపబడిన ఆ మహారథులు అయిదుగురు, శత్రువులకు ఆనందాన్ని కలిగిస్తూ, జితేంద్రియునిచే జయింపబడిన ఇంద్రియాలవలె నిష్ప్రయత్నంగా నిలిచారు. ఓడ పగిలిపోతే సముద్రంలో మునుగుతున్న వ్యాపారులను పడవల ద్వారా సముద్రం నుండి బయటకు తెచ్చినట్లు, కర్ణు డనే సముద్రంలో మునుగుతున్న తమ మేనమామలను చక్కగా సిద్ధం చేయబడిన రథాలతో ద్రౌపదికొడుకులు ఉద్ధరించారు. ఆ తరువాత శినిశ్రేష్ఠుడైన సాత్యకి పదునైన బాణాలతో కర్ణుడు ప్రయోగించిన అనేక బాణాలను చీల్చి, లోహమయాలై, పదునైన ఎనిమిది బాణాలతో నీ పెద్దకొడుకును గాయపరిచాడు. ఆపై కృపుడు, భోజుడు (కృతవర్మ) నీ కొడుకు దుర్యోధనుడు, కర్ణుడు కలిసి పదునైన బాణాలతో సాత్యకిని కొట్టారు. యదుశ్రేష్ఠుడైన సాత్యకి దిక్పాలకులతో దానవరాజు పోరాడినట్లు, ఆ నలుగురితో పోరాడాడు. అమితంగా బాణవృష్టిని కురిపిస్తూ, బాగా లాగబడి ధ్వనిస్తున్న తన విశాలమైన వింటితో, సాత్యకి, శరత్కాలంలో ఆకాశమధ్యంలో నున్న సూర్యునివలె, మరీ సహింపరానివాడయ్యాడు. పరంతపులైన పాంచాల మహారథులు కవచాలు ధరించి, మరల రథాలనెక్కి, ఒక్కటై, రణభూమిలో సాత్యకిని రక్షించటానికి వచ్చారు. శత్రునిగ్రహం కోసం మరుద్గణాలు ఇంద్రుని సమీపించినట్లున్న దది. గతంలో దేవతలకు రాక్షసులతో పోరు జరిగినట్లు, నీ శత్రువులకు, నీ సేనలతో మరీ దారుణమైన యుద్ధం జరిగింది. దానిలో రథాలు, గుర్రాలు, ఏనుగులు నశించాయి. రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం కూడా వివిధ శస్త్రాలచే చుట్టబడి, పరస్పరం కొట్టుకొంటూ జారిపడసాగారు. ఆర్తనాదాలు చేయసాగారు. చచ్చిపడసాగారు.

ఆ స్థితిలో నీ కొడుకు, దుశ్శాసనుడు నిర్భయంగా బాణాలను కురిపిస్తూ భీమునిపై దాడిచేశాడు. ఆపై ప్రాణాలను పణంగాపెట్టి, జూదమాడుతున్న వారిద్దరి మధ్య భీకరమైన పోరు జరిగింది. అది ఒకరిపై ఒకరికి తీవ్రమైన కోపంతో ప్రచండంగా పోరాడుతున్న ఇంద్ర శంబరాసుర సంగ్రామం వలె ఉన్నది. కామాసక్తి గల ఆడ ఏనుగుకై మదనాసక్త మనస్సుతో పోరాడే మదజలం స్రవించే రెండు ఏనుగులవలె, వారిద్దరూ మరీ పదును గలిగి, శరీరానికి పీడ కలిగించగల బాణాలతో పరస్పరం తీవ్రంగా కొట్టుకొన్నారు.

సారథులతో కలిసి ఆ ఇద్దరు శూరులు అక్కడ ఒకరినొకరు కలిసినప్పుడు "దుశ్శాసనుని

వైపు పద" అని భీముడూ, "భీమునివైపు పద" అని దుశ్శాసనుడు సారథులను ఆదేశించారు. నానాయుధాలు, విచిత్ర పతాకాలు, ధ్వజాలు గల ఆ రెండు రథాలు సారథులచే నడుపబడుతూ, వేగంగా గతంలో స్వర్గంలో ఇంద్ర బలాసురుల రథాలవలె దగ్గరయ్యాయి. భీముడిలా అన్నాడు. 'దుశ్శాసనా! భాగ్యం కొద్దీ నేడు నా కంటబడ్డావు. నీ కొలువులో ద్రౌపదిని నీవు స్పృశించినప్పుడు నేను తీసికొన్న ఋణాన్ని అసలు, వడ్డీలతో చెల్లిస్తాను తీసికో." సంజయుడిలా చెప్తున్నాడు. "భీముడలా అనగానే మహాత్ముడు, వీరుడు అయిన దుశ్శాసనుడిలా అన్నాడు. భీమసేనా! అంతా గుర్తుంది. దేనినీ మరచిపోలేదు. చెప్తున్నా విను. మీరు చేసిన పనులన్నీ ఎప్పటినుండో గుర్తుంచుకొన్నాను. లక్క ఇంటిలో విశ్వాసం లేకుండా పగలు రేయి గడిపింది గుర్తుంది. అక్కడ నుండి బయలుపడి అరణ్యాలన్నీ తిరగటం గుర్తుంది. మహాభయంతో రాత్రిపగలు కూడా విచారిస్తూ, సుఖోపభోగాలకు దూరమై, అరణ్యాలలో, కొండ గుహలలో తిరుగుతూ పాంచాలరాజ్యంలో ప్రవేశించారు. వీదో మాయలోపడి రూపాన్ని కప్పి పుచ్చుకొని తిరిగారు. అందువలననే ద్రౌపది మీలో అర్జునుని వరించింది. పాపాత్ములైన మీరంతా కలిసి మీ తల్లికి తగినట్లుగా ప్రవర్తించారు. ద్రౌపది ఒక్కని వరించింది. కానీ మీరయిదుగురు ఒకరిని చూసి మరొకరు సిగ్గుపడకుండా, ఆమెను భార్యను చేసికొన్నారు. శకుని నిండుకొలువులో మిమ్ములనందరినీ, ద్రౌపదితో సహా దాసులను చేయటం గుర్తుంది."

సంజయుడిలా చెప్తున్నాడు. నీ కొడుకు అలా అనగానే భీముడు కోపానికి లోనయ్యాడు. ఆపై వేగంగా రెండు క్షురాలతో నీకుమారుని వింటిని, ధ్వజాన్ని నరికాడు. ఒక బాణంతో అతని నుదురు బ్రద్దలు చేసి, సారథి తలను శరీరం నుండి వేరు చేశాడు. దుశ్శాసనుడు మరొక వింటిని తీసికొని పన్నెండు బాణాలతో వృకోదరుని చీల్చివేశాడు. గుర్రాలను తానే స్వయంగా నడుపుతూ సూటిగావెళ్ళే బాణాలను మరల భీమునిపై కురిపించాడు.

ఆపై సూర్యకాంతివంటి కాంతి గలిగి, బంగారు, వజ్రాలు, గొప్ప రత్నాలతో అలంకరింపబడి, ఇంద్రుని వజ్రంవలె, పిడుగుపాటు వలె దుస్సహమై, భీముని శరీరాన్ని చీల్చగల బాణాన్ని విడిచాడు. ఆ బాణంతో తీవ్రంగా గాయపడిన భీముడు శరీరమంతా శిథిలంకాగా, ప్రాణాలు పోయినట్లు పడిపోయాడు. అయితే చేతులు చాచి, రథాన్ని పట్టుకొని, మరల చైతన్యాన్ని పొంది, సింహనాదం చేశాడు."

83. దుశ్శాసన వధ

సంజయుడిలా చెప్తున్నాడు. "అక్కడ దుశ్శాసనుడు ద్వంద్వయుద్ధం చేస్తూ దుష్కర పరాక్రమాన్ని ప్రదర్శించాడు. ఒక బాణంతో భీముని వింటిని ఖండించి, అరవైబాణాలతో భీముని సారథిని గాయపరిచాడు. ఆ పనిచేసి, ఆ రాజకుమారుడు

వేగంగా తొమ్మిది బాణాలతో భీముని గాయపరిచాడు. ఆ మహాత్ముడు మరల వేగంగానే ఎన్నో గొప్ప బాణాలతో భీమసేనుని చీల్చివేశాడు. దానితో కోపించిన భీమసేనుడు వేగశాలియై భీకరమైన శక్తిని నీ కొడుకుపై ప్రయోగించాడు. వేగంగా, అతిభీకరంగా, ప్రజ్వలించే తోకచుక్కవలె మీద పడుతున్న ఆ శక్తిని మహాత్ముడైన నీ కొడుకు చెవిదాకా లాగి విడిచిన పది బాణాలతో ఖండించాడు. దుష్కరమైన ఆ దుశ్శాసన పరాక్రమాన్ని చూసి; యోధు లందరూ ఉల్లాసంగా అభినందించారు. ఆపై మరల నీ కుమారుడు బాణంతో భీముని తీవ్రంగా గాయపరిచాడు. మరల భీముడు కోపించి, దుశ్శాసనుని వైపు చూసి రోషంతో మండిపడ్డాడు. "వీరా! నీవు నేడు నన్ను తీవ్రంగా గాయపరిచావు. మరల గదా ప్రహారాన్ని భరించు" అని పలికి భీముడు కుపితుడై దుశ్శాసనుని చంపటానికి భీకరమైన గదను చేపట్టాడు. "దురాత్ముడా! ఈరోజు రణరంగంలో నీ నెత్తురు త్రాగుతాను" అని భీముడు అన్నాడు. అప్పుడు నీ కొడుకు మృత్యువు వలె భీకర రూపంగల శక్తిని వేగంగా భీమునిపైకి విసిరాడు. గాయపడిన భీముడు కూడా రోషంతో నిండి మరీ ఘోరమైన గదను దుశ్శాసనునిపైకి విసిరాడు. ఆ గద వెంటనే నీ కుమారుడు ప్రయోగించిన శక్తిని ముక్కలుచేసి రణభూమిలో అతని తలపై పడింది.

భీమసేనుడు మదజలాన్ని స్రవిస్తున్న ఏనుగువలె, నెత్తురోడుతూ, బలపూర్వకంగా దుశ్శాసనుని పైకి విసిరిన భీకర గద దుశ్శాసనుని నలభై మూరలు వెనక్కు నెట్టింది. ఆ గద చాలా వేగంగా దుశ్శాసనుని కొట్టింది. దుశ్శాసనుడు వణుకుతూ పడిపోయాడు. కవచం, ఆభరణాలు, వస్త్రాలు, మాలలు ధ్వంసమయ్యాయి. తీవ్రవేదనకు లోనై కొట్టుకొనసాగాడు. రాజా! గుర్రాలు, సారథి చనిపోయారు. గద మీదపడి రథాన్ని చూర్ణం చేసింది. దుశ్శాసనుని చూసి పాండవులు, పాంచాలురు ఆనందంతో సింహనాదాలు చేయసాగారు. వృకోదరుడు అలా దుశ్శాసనుని పడగొట్టి, ఆనందంతో దిక్కులను ప్రతిధ్వనింపజేస్తూ గర్జించాడు. ఆ ధ్వనితో సమీపంలోనున్న వారంతా స్పృహతప్పి పడిపోయారు. భీముడు కూడా వేగంగా రథం మీద నుండి దిగి దుశ్శాసనుని మీదకు దూకాడు. ఆ సమయంలో, వేగశాలి అయిన భీముడు నీ కుమారులు చూపిన వైర ప్రవర్తనను మనస్సులో తలచాడు. రాజా! ప్రధాన ప్రముఖవీరుల మధ్య అలా ద్వంద్వయుద్ధం జరుగుతోంది. మహాబాహువు, అచింత్య పరాక్రముడైన భీమసేనుడు అక్కడ దుశ్శాసనుని చూసి, ద్రౌపది జుట్టుపట్టుకోవటాన్ని, రజస్వలఅయిన ఆమె వస్త్రాన్ని అపహరించటాన్ని, నిరపరాధినియై, భర్త సహాయం కూడా లేని దశలో ఆమెకు కల్పించిన దుఃఖాలను తలచుకొన్నాడు.

ూనితో నేయివోసిన అగ్నివలె, భీమసేనుడు కోపంతో మండిపడ్డాడు. అక్కడ భీముడు కర్ణుని, సుయోధనుని, కృపుని, అశ్వత్థామను, కృతవర్మను ఉద్దేశించి "సమస్త యోధులారా! పాపి అయిన దుశ్శాసనుని నేడు చంపబోతున్నాను. కాపాడుకోండి" అని పలికాడు.

అలా పలికి మహాబలమూ, మహావేగమూ గల వృకోదరుడు తన రథంమీద నుండి నేలపైకి దూకి, దుశ్శాసనుని చంపాలని వేగంగా అతనిమీది కురికాడు. కర్ణసుయోధనుల సమక్షంలోనే సింహం మహాగజం మీదకురికినట్లు, దుశ్శాసనునిపై దాడిచేశాడు. ప్రయత్నపూర్వకంగా దృష్టిని దుశ్శాసనునిపై నిలిపి, మంచివాదర గల తెల్లని కత్తిని ఎత్తి, దుశ్శాసనుని మెడపై నరికాడు. దుశ్శాసనుడు వణికిపోతున్నాడు. భీమసేనుడతనితో ఇలా అన్నాడు. "దురాత్మా! కర్ణసుయోధనులతో కలిసి ఆనందంతో నన్ను 'ఏద్దు' అన్నావు. రాజసూయ యాగం చేసి అవభృథ స్నానంతో పవిత్ర అయిన ద్రౌపది జుట్టుపట్టావు. ఆ జుట్టును ఏ చేతితో పట్టుకొన్నావో చెప్పు. ఈ భీమసేనుడు నిన్ను అడుగుతున్నాడు." పరమఘోరంగా ఉన్న ఆ భీమసేనుని మాటలు విని దుఃశ్శాసనుడు, భీముని చూసి కౌరవులు, సోమకులు వింటుండగా నవ్వుతూ రోషపూర్వకంగా కనుబొమలు ముడివేస్తూ, భీమునితో ఇలా అన్నాడు. "ఇదిగో! ఈ చేయి ఏనుగుతొండం వంటి ఆకృతి గలది. పీనస్తనాలను మర్దించినది. వేలకొలది గోవులను దానం చేసినది. క్షత్రియులను అంతం చేసినది. భీమా! ఈ చేతితోనే కౌరవసభలో కురుకుల శ్రేష్ఠులు, మీరు చూస్తుండగా ద్రౌపది జుట్టుపట్టి లాగాను."

రణభూమిలో అలా మాటాడుతున్న రాజసుతుడైన దుశ్శాసనుని మాట విని భీముడు, దుశ్శాసనుని రొమ్ముపైకి దూకి, రెండు చేతులతో అతనిని గట్టిగా పట్టుకొని సింహనాదం చేస్తూ, యోధులందరితో ఇలా అన్నాడు. "ఈ దుశ్శాసనుని బాహువులు నేడు విరిగిపోతున్నాయి. దుశ్శాసనుడు నేడు చావక తప్పదు. బలవంతుడెవడైనా ఉంటే కాపాడుకోవచ్చు" అలా యోధులందరినీ ఆహ్వానించి మహాబలుడు, మహామనస్వి అయిన భీమసేనుడు కుపితుడై ఒకే చేతితో దుశ్శాసనుని బాహువును విరిచాడు. వజ్రసమానమైన తన చేతితో వీరుల సమక్షంలో దుశ్శాసనుని కొట్టాడు. రాజా! దుశ్శాసనుడు నేలగూలగానే వక్షస్థలాన్ని చీల్చి వెచ్చటి నెత్తురును త్రాగసాగాడు. ఆపై లేవాలని ప్రయత్నిస్తున్న దుశ్శాసనుని మరల త్రోసి, ఆ కత్తితో నీ కుమారుని తలను ఖండించి, తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనదలచి భీముడు దుశ్శాసనుని వెచ్చని రక్తాన్ని త్రాగి, త్రాగి క్రోధంతో చూస్తూ ఇలా పలికాడు. "మాతృస్తన్యం కన్న, మధువు కన్న, నేయి కన్న, చక్కగా తయారు చేసిన ద్రాక్ష రసం

కన్న, మంచినీటి కన్నా, పాలకన్నా, వెన్న కన్నా, లోకంలోని సుధామధుర పదార్థాలన్నిటి కన్నా" ఇప్పుడు నేను త్రాగిన శత్రురక్తమే రుచికరమైనది.

అప్పుడు క్రోధంతోనిండిన మనస్సుతో ఉగ్రపరాక్రమం ప్రదర్శిస్తున్న భీముడు దుశ్శాసనుడు మరణించటం చూసి, నవ్వి, స్పష్టంగా "ఏం చేయగలను. మృత్యువు నిన్ను కాపాడాడు" అని పలికాడు. అలా అంటూ మరల మరల పరమ ప్రసన్నతతో దుశ్శాసనుని నెత్తురు త్రాగుతూ భీముడు గంతులు వేయసాగాడు. ఆ భీమసేనుని చూసినవారు భయానికి లోనయి పడిపోసాగారు. తడబడకుండా నిలిచిన మనుష్యుల చేతులలోని శస్త్రాలు కూడా పడిపోయాయి. వారంతా భయంతో ఆక్రోశింపసాగారు. కళ్ళుమూసికొని అన్నివైపులా చూడసాగారు. భీముడు దుశ్శాసనుని నెత్తురు త్రాగటాన్ని చూసినవారు భయభీతులై "ఇతడు మనుష్యుడు కాదు" అంటూ అరుస్తూ పారిపోసాగారు.

భీమసేనుడు అలా భీకరంగా కనిపిస్తూ, నెత్తురు త్రాగుతుంటే చూసిన ప్రజలు భయార్తులై, భీమసేనుని రాక్షసుడంటూ చిత్రసేనునితో పాటు పారిపోసాగారు. చిత్రసేనుడు పారిపోవటాన్ని గమనించి, రాజపుత్రుడైన యుధామన్యుడు తన సేనతో కూడా అతనిని వెంటాడాడు. నిర్దయంగా వేగంగా విడిచిన వీడుపదునైన బాణాలతో అతనిని గాయపరిచాడు. పాదాలు తగిలి పడగవిప్పిన పాము నాలుకలల్లారుస్తూ క్రోధవిషాన్ని వెడల గ్రక్కుతున్నట్లు వెనుదిరిగి, చిత్రసేనుడు పాంచాల రాజకుమారుని మూడు బాణాలతో, అతని సారథిని ఆరు బాణాలతో గాయపరిచాడు. ఆపై మంచిరెక్కలు కలిగి, చక్కగా పదును చేయబడి, చక్కగా అనుసంధించబడి, చెవిదాకాలాగి విడిచిన బాణంతో శూరుడైన యుధామన్యుడు చిత్రసేనుని తలను ఖండించాడు. తన సోదరుడైన చిత్రసేనుడు మరణించగానే కర్ణుడు కోపంతో పౌరుషాన్ని ప్రదర్శిస్తూ పాండవసేనను తరిమాడు. అప్పుడు నకులుడు కర్ణుని ఎదిరించాడు.

భీముడు అమర్షణశీలుడైన దుశ్శాసనుని అక్కడే చంపి, మరల దోసిలిని, నెత్తుటితో నింపుకొని పెద్దగొంతుతో లోకవీరులందరు వింటుండగా ఇలా అన్నాడు. "పురుషాధమా! ఇదిగో నీ కంఠం నుండి నెత్తురు త్రాగుతున్నాను. ఇప్పుడు ఆనందంతో "ఎద్దు ఎద్దు" అను. ఆ రోజు మమ్ములను చూసి "ఎద్దు ఎద్దు" అని నృత్యం చేసిన వారిని గూర్చి, ఈ రోజు మేము మరల "ఎద్దు ఎద్దు" అని నృత్యం చేస్తున్నాం. "విషాన్ని త్రాగించి ప్రమాణ కోటితీర్థంలో త్రోశారు. భోజనంలో విషం కలిపారు. జూదంతో రాజ్యాన్ని అపహరించారు. అరణ్యవాసాన్ని కల్పించారు. దారుణంగా ద్రౌపది జుట్టుపట్టారు. యుద్ధాలలో

మాపై బాణాలు వేశారు. ఇంటిలో సుఖంగా ఉండనీయలేదు. విరాట భవనంలో మేము పొందిన క్లేశం విలక్షణమైనది. శకుని, దుర్యోధనుడు, కర్ణుడు చేసిన మంత్రాంగంతో దుఃఖాలను అనుభవించాం. అక్కడ కారణం నీవే. దుర్యోధనునితో కలిసి ధృతరాష్ట్రుడు ప్రదర్శించిన దుర్మార్గతతో, మేము దుఃఖాలనే అనుభవించాము కానీ సుఖాలను ఎప్పుడూ పొందలేదు." రాజా! అలా పలికి నెత్తుటితో తడిసి, ఎర్రనైన ముఖంతో తీవ్రకోపమూ, తీవ్రవేగమూ గల భీముడు యుద్ధంలో విజయాన్ని పొంది, నవ్వుతూ కృష్ణార్జునులతో ఇలా అన్నాడు. 'వీరులారా! దుశ్శాసనుని విషయంలో నేను చేసిన ప్రతిజ్ఞను రణభూమిలో ఈనాడు సత్యం చేశాను. ఇక్కడే రెండవ యజ్ఞపశువైన దుర్యోధనుని చంపి బలి ఇస్తాను. కౌరవుల సమక్షంలో కాలితో ఆ దురాత్ముని శిరస్సును తన్ని శాంతిని పొందుతాను.' అలా షలికి నెత్తుటితో తడిసిన శరీరం గల మహాత్ముడు, భీమసేనుడు ఆనందంగా పెద్దగా గర్జించాడు. అది వృత్రుని చంపి, ఇంద్రుడు గర్జించినట్లుంది."

84. నకుల పరాజయము

సంజయుడిలా చెప్పున్నాడు. "దుశ్శాసనుడు చనిపోగానే మహాక్రోధవిషంతో గూడిన వీరులు, రణభూమిలో వెనుదిరగనివారు, మహాపరాక్రమశాలులు, మహారథులు అయిన నీ కొడుకులు పదిమంది బాణాలతో భీముని ముంచెత్తారు. నిషంగి, కవచి, పాశి, దండధారుడు, ధనుర్గ్రహుడు, అలోలుపుడు, శలుడు, సంధుడు, వాతవేగుడు, సువర్చసుడు - ఈ పదిమంది ఒక్కటై కూడి సోదరుని మరణంతో దుఃఖిస్తూ కూడా మహాబాహువైన భీమసేనుని బాణాలతో నివారించారు. ఆ మహారథులచే అన్నివైపులనుండి బాణాలచే నిరోధింపబడిన భీముడు క్రోధాగ్నితో కళ్ళెర్రజేసి కోపించిన మృత్యువు వలె ప్రకాశించాడు. బంగారురెక్కలు, మహావేగమూ గల పది భల్లాలతో, బంగారు అంగదాలు ధరించిన ఆ పదిమంది కౌరవులను భీముడు యమసదనానికి పంపించాడు. ఆ వీరులు చనిపోగానే నీ సేన భీమభయంతో పీడింపబడి, కర్ణుడు చూస్తుండగానే పారిపోయింది. ప్రజలపై మృత్యువు వలె, సేనపై విరుచుకొని పడుతున్న భీముని పరాక్రమాన్ని చూసి, కర్ణుడు మహాభయానికి లోనయ్యాడు. యుద్ధానికి వన్నె తేగల శల్యుడు కర్ణుని ఆకృతిని, భావాన్ని గ్రహించి, అప్పటికి తగినట్లుగా కర్ణునితో ఇలా అన్నాడు.

"రాధేయా! బాధపడవద్దు. నీకిది తగదు. భీమసేన భయంతో ఈ రాజులంతా పారిపోతున్నారు. సోదరుని మరణబాధతో దుర్యోధనుడు కూడా చైతన్యాన్ని కోల్పోయాడు.

మహాత్ముడైన భీముడు దుశ్శాసనుని నెత్తురు త్రాగుతుంటే, కృపుడు మొదలయిన వీరులు చావగా మిగిలిన దుర్యోధన సోదరులు మనస్సులు చెడి, శోకంతో చైతన్యాన్ని కోల్పోయి అన్నివైపుల నుండి దుర్యోధనుని చుట్టూ మూగుతున్నారు. అర్జునుడు మొదలయిన పాండవ శూరులు లక్ష్యాన్ని గుర్తించి, యుద్ధసన్నద్ధులై నీవైపే వస్తున్నారు. పురుషశార్దూలా! ఆ స్థితిలో నీవు పౌరుషాన్ని ఆశ్రయించి, క్షత్రధర్మాన్ని ముందు నిలుపుకొని అర్జునుని మీదకు పద. మహాబాహూ! దుర్యోధనుడు భారమంతా నీ మీదనే ఉంచాడు. యథాశక్తిగా, యథాబలంగా దానిని మోయి. గెలిస్తే విశాలకీర్తిని పొందగలవు. ఓడిపోతే నిశ్చితంగా స్వర్గానికి వెళ్ళగలవు. రాధేయా! నీవు మోహానికి గురికాగానే నీ కొడుకు - వృషసేనుడు తీవ్రకోపంతో పాండవులపై దాడిచేస్తున్నాడు."

ఆ శల్యుని మాట విని, కర్ణుడు యుద్ధంలో ముందుకు సాగటానికి తగినట్లు మనస్సులో గట్టిగా నిర్ణయించుకొన్నాడు. ఆపై వృషసేనుడు కోపంతో" ఎదురుగా గదాహస్తుడై నిలిచి దండధారి అయిన యమునివలె, నీవారితో పోరాడుతున్న భీమునిపై దాడి చేశాడు. గతంలో జంభాసురుని చంపదలచిన దేవేంద్రుని వలె, మేటివీరుడైన నకులుడు కోపంతో రణభూమిలో ఉల్లాసంగా ప్రవర్తిస్తున్న శత్రువులను కర్ణుని కుమారుని బాణాలతో తరుముతూ వెంటబడ్డాడు. నకులుడు ఒక క్షురంతో స్ఫటికాలు కుట్టిన చిత్రవస్త్రంగల వృషసేనధ్వజాన్ని, ఒక భల్లంతో బంగారుపూతగల వింటిని విరిచాడు. ఆపై వృషసేనుడు వెంటనే మరొక వింటిని తీసికొని నకులుని గాయపరిచాడు. అయితే నేర్పరి అయిన వృషసేనుడు కూడా నకులునిపై దివ్యాస్త్రవృష్టిని కురిపించాడు. రాజా! నేయిపోస్తే అగ్ని భగ్గున మండినట్లు, వృషసేనుడు కూడా బాణాల తాకిడి వలన, కోపంవలన, అస్త్రప్రయోగం వలన, స్వీయ తేజస్సువలన మండిపడ్డాడు. రాజా! వృషసేనుడు మేటి అస్త్రాలతో నకులుని గుర్రాల నన్నింటిని నశింపజేశాడు. ఆ గుర్రాలు వనాయుదేశంలో పుట్టినవి. తెల్లనివి. తీవ్రవేగం గలవి. బంగారు జాలరులతో ఆచ్ఛాదింపబడినవి. ఆపై గుర్రాలు చనిపోగా, ఆ రథం నుండి దిగి నకులుడు, సువర్ణచంద్ర చిహ్నాలు గల డాలు, ఆకాశంవలె నిర్మలంగా ఉన్న కత్తి చేతబట్టి, వాటిని త్రిప్పుతూ పక్షివలె సంచరించసాగాడు. ఆ తరువాత చిత్రంగా యుద్ధం చేయగల నకులుడు గాలిలోనే కత్తిని త్రిప్పుతూ, రథాలను, గుర్రాలను, ఏనుగులను ఖండించాడు. కత్తిదెబ్బతో తెగి, అవన్నీ అశ్వమేధయాగంలో శమిత (యజ్ఞ పశువును నరికేవాడు) చేత నరుకబడిన పశువుల వలె నేలగూలాయి.

నకులుడొక్కడే రణభూమిలో జయాభిలాషతో, యుద్ధనిపుణులైన రెండు వేలమందిని నరికి చంపాడు. వారంతా నానాదేశాల నుండి వచ్చినవారు. సత్యసంధులు,

చక్కగా పోషింపబడినవారు. చందన చర్చిత శరీరులు. మీదకు వస్తున్న నకులునిపై అన్నివైపుల నుండి బాణాలను ప్రయోగించి వృషసేనుడు గాయపరిచాడు. బాణాల తాకిడికి రెచ్చిపోయిన నకులుడు వృషసేనుని గాయపరిచాడు. గాయపడిన వృషసేనుడు కోపానికి లోనయ్యాడు. ఆ మహాభయంకర సంగ్రామంలో సోదరుడైన భీమునిచే రక్షింపబడే మహాత్ముడైన నకులుడు భీకరంగా పోరాడాడు. ఒంటరిగా సైనికులు, గుర్రాలను, ఏనుగులను, రథాలను లెక్కలేనంతగా సంహరించసాగాడు. అలా క్రీడిస్తున్న వీర నకులుని వృషసేనుడు కోపంతో పద్దెనిమిది బాణాలతో గాయపరిచాడు. రాజా! వేగశాలి అయిన నకులుడు ఆ మహా సంగ్రామంలో కోపించిన వృషసేనుని ద్వారా తీవ్రంగా గాయపడ్డాడు. నరవీరుడైన ఆ పాండు కుమారుడు రణభూమిలో వృషసేనుని చంపదలచి, అతనివైపు పరుగుతీశాడు. రెక్కలు విప్పి, మాంసంమీది లోభంతో నేలవ్రాలుతున్న డేగవలె రణభూమిలో దూసుకొని వస్తున్న ఉదారవీరుడైన నకులునిపై వృషసేనుడు పదునైన శరవృష్టిని కురిపించాడు. ఆ శరసమూహాలను విఫలం చేస్తూ నకులుడు విచిత్ర మార్గాలలో సంచరించాడు. రాజా! ఆ రీతిగా మహాసంగ్రామంలో కత్తిపట్టి చిత్రంగా, వేగంగా చరిస్తున్న నకులుని సహస్ర తారలుగల డాలును వృషసేనుడు గొప్ప బాణాలతో ధ్వంసం చేశాడు.

ఆపై శత్రువులను సహించటంలో నేర్పరి అయిన వృషసేనుడు తీవ్రవేగమూ, మంచి పదునుగల ఆరు బాణాలతో కత్తి త్రిప్పుతున్న ఆ నకులుని కత్తిని కూడా ముక్కలు ముక్కలు చేశాడు. ఆ కత్తి లోహంతో తయారయి తీక్ష్ణమైన వాదర గలది. ఎంత భారాన్ని అయినా సహించగలది. ఒర నుండి వెలువడి సర్పంవలె ఉగ్రరూపంతో భయంకరమైనది. శత్రువులను అంతం చేయగలది. కత్తిని ఖండించి, మరల పదునెక్కి ప్రజ్వలించే బాణాలతో నకులుని రొమ్ముపై తీవ్రంగా గాయపరిచాడు. రాజా! మహాత్ముడైన నకులుడు ఇతరులకు దుష్కరమై, సజ్జన సేవితమైన పరాక్రమకర్మను రణభూమిలో ప్రదర్శించి, వృషసేనుని బాణాలచే గాయపడి వేగంగా భీమసేనుని దగ్గరకు చేరాడు. తన గుర్రాలను కోల్పోయి, వృషసేనుని బాణాల దెబ్బతిని, నకులుడు ఆర్జునుడు చూస్తుండగానే సింహం కొండపైకెక్కినట్లు భీమసేనుని రథం మీదకు ఎక్కాడు. ఆపై వీరుడు మహాత్ముడైన వృషసేనుడు ఒకే రథంపైనున్న ఆ పాండవేయ మహారథుల నిద్దరినీ బాణాలతో చీల్చుతున్నట్లు, బాణ సమూహాన్ని వారిపై కురిపించారు. ఆ రణభూమిలో నకులుని రథం విరిగిపోగా, వేగంగా బాణాలతో కత్తి బ్రద్దలు కాగా, ఇరత కౌరవ వీరులు గుమిగూడి, శరవరాలతో నకులుని, భీముని సమీపించి శరవృష్టితో గాయపరచసాగారు. పాండవేయులయిన ఆ

భీమార్జునులు నేయిపోయగా ప్రజ్వరిల్లిన రెండు అగ్నులవలె, వృషసేనునిపై కోపిస్తూ, తమచుట్టూ నిలిచిన కౌరవసేనలపై దారుణమైన శరవృష్టిని కురిపించారు. ఆపై భీముడు "చూడు! నకులుడు వృషసేనునిచే పీడింపబడి వచ్చాడు. ఈ కర్ణసుతుడు మనలను బాగా బాధిస్తున్నాడు. కాబట్టి నీవు అతనిపై దాడిచేయి" అని అర్జునునితో అన్నారు. భీమని ఆ మాట విని అర్జునుడు భీముని రథాన్ని సమీపించగా, నకులుడు తనను సమీపించిన అర్జునుని చూసి "వృషసేనుని వెంటనే చంపు" అని అన్నాడు. రణభూమిలో ఎదురువచ్చి, సోదరుడైన నకులుడు అర్జునునితో అలా అనగానే కృష్ణుడు కపిధ్వజరథాన్ని తీవ్రవేగంతో నడిపించాడు."

85. వృషసేన వధ

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆపై వృషసేనుడు నకులుని వింటిని, కత్తిని ఖండించి, విరథుని చేసి, బాణాలతో పీడించి, పరాజయం పాల్జేసిన విషయాన్ని గ్రహించిన భీమసేనుని ఆదేశం మేరకు, శత్రువులను సహించగల ద్రుపదసుతులు అయిదుగురు, సాత్యకి, ద్రౌపది కొడుకులు అయిదుగురు కలిసి శస్త్రధారులై, నీ సేనలోని ఏనుగులను, గుర్రాలను, రథికులను, కాల్బలాన్ని తమ సర్పతుల్య బాణాలతో సంహరిస్తూ, రథాలపై అక్కడకు వేగంగా వచ్చారు. అప్పుడు వారి పతాకలు గాలికి రెపరెపలాడుతున్నాయి. వారి గుర్రాలు దౌడు తీస్తున్నాయి. వారంతా సింహనాదాలు చేస్తున్నారు. ఆపై నీసేనలోని రథిక ముఖ్యులైన కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ, దుర్యోధనుడు, శకుని సుతుడైన ఉలూకుడు, వృకుడు, క్రాథుడు దేవావృధుడు వేగంగా ధనుస్సులు చేతబట్టి, ఏనుగు ఘీంకారాలు, మేఘగర్జనల వంటి రథాలతో వారిని ఎదిరించారు. రాజా! కృపుడు మొదలయిన నీ రథిక వీరులు తమ మేటి అమ్ములతో కొడుతూ, పాండవ సేనలోని ఆ పదుకొండుమంది వీరులను నిరోధించారు. ఆపై నూతన మేఘాలవంటి రంగు, కొండ చరియల వంటి ఆకృతి గలిగి, భీకర వేగంగల ఏనుగులతో కులిందులు కౌరవ వీరుల నెదిరించారు. హిమ్మాలయ ప్రాంతగజాలు చక్కగా సిద్ధం చేయబడి ఉన్నాయి. వాటిపై బంగారు జాలరులు పరచబడి ఉన్నాయి. వాటిపై యుద్ధకుశలులైన కులిందవీరులు కూర్చొని యున్నారు. అప్పుడవి ఆకాశంలో మెరుపుతో కూడిన మేఘాలవలె ప్రకాశిస్తున్నాయి.

కులిందపుత్రుడు పూర్తిగా లోహమయమైన పది బాణాలతో కృపు అతని గుర్రాలతో సారథితో పాటు తీవ్రంగా గాయపరిచాడు. ఆపై కృపుని బాణాల దెబ్బతిని ఏనుగుతో పాటు నేలగూలాడు. కులింద రాజకుమారుని తమ్ముడు సూర్య కిరణాలవంటి

లోహమయతోమరాలతో, శకుని రథాన్ని భంగపరిచి గర్జించాడు. ఆపై గర్జిస్తున్న అతని తలను శకుని ఖండించాడు. కుళిందులు అలా చంపబడగా నీ సేనలోని మహారథులు ఆనందించారు. వారు శంఖాలను గట్టిగా ఊది, ధనుస్సులను చేతబట్టి శత్రువులపైకి వెళ్ళారు. ఆపై కౌరవులకు మరల పాండవ సృంజయులతో మరీ దారుణమైన యుద్ధం జరిగింది. శరాలతో, కత్తులతో, శక్తులతో, ఋష్టులతో, గదలతో, గొడ్డళ్ళతో వారు పోరాడారు. సైనికులు, గుర్రాలు, ఏనుగులు చనిపోతున్నాయి. భీకరంగా యుద్ధం సాగింది. రథికులచే, ఆశ్వికులచే, హస్తిపకులచే, కాల్బలంచే పరస్పరం చంపుకొంటున్న వారు చచ్చి నేలబడ్డారు. అది మెరుపులతో కూడి గర్జిస్తున్న మేఘాలు పెనుగాలుల తాకిడికి అన్నిదిక్కులకూ చెదిరిపోయినట్లుంది. ఆపై శతానీకునకు చెందిన మహాగజాలను, రథాలను, గుర్రాలను, పెద్ద కాల్బలాన్ని భోజుడు (కృతవర్మ) సంహరించాడు. అవి కృతవర్మ బాణాలతో ముక్కలై క్షణకాలంలో నేలగూలాయి. అశ్వత్థామ సర్వాయుధాలతో, యోధులతో, ధ్వజాలతో కూడిన మరో మూడు మహాగజాలను సంహరించాడు. అవి ప్రాణాలు కోల్పోయి, వజ్రాయుధం దెబ్బతిన్న పర్వతాలవలె నేలగూలాయి. కుళిందరాజు కడగొట్టు తమ్ముడు తన మేటి అమ్ములతో నీకుమారుని రొమ్ముపై కొట్టాడు. నీ కుమారుడు పదునైన బాణాలతో అతని శరీరాన్ని, ఏనుగును కూడా గాయపరిచాడు. ఆ గజరాజు రాజకుమారునితో పాటు, శరీరమంతా నెత్తురోడుతూ పడిపోయింది. అది వర్షాకాలంలో ఇంద్రుని వజ్రపు దెబ్బ తిని గైరికజలాన్ని స్రవిస్తున్న పర్వతంవలె ఉంది.

కుళిందపుత్రుడు పంపిన మరొక ఏనుగు, క్రాథుని సారథిని, గుర్రాలను, రథాన్ని భంగపరిచింది. అయితే ఆపై క్రాథుని బాణాల దెబ్బతిని, వజ్రపు దెబ్బతిన్న పర్వతం వలె తన యజమానితో పాటు పడిపోయింది. దుర్జయుడైన క్రాథరాజు రథంపై నిలిచి, ఏనుగునెక్కిన ఒక పర్వతీయుని బాణాలదెబ్బతిని, గుర్రాలతో, సారథితో, ధనుస్సుతో, ధ్వజంతో సహా పడిపోయాడు. అది పెనుగాలికి మహావృక్షం కూలినట్లుంది. వృకుడు ఏనుగునెక్కియున్న పర్వతరాజును పన్నెండు బాణాలతో తీవ్రంగా గాయపరిచాడు. దానితో ఆ పర్వతీయుని మహాగజం వృకుని గుర్రాలు, రథంతో పాటు తన నాలుగు కాళ్ళతో వేగంగా త్రొక్కి, చితకకొట్టింది. కడకు ఆ ఏనుగు బభ్రుపుత్రుని బాణాలతో తీవ్రంగా గాయపడి, హస్తిపకునితో పాటు నేలబడింది. ఆ దేవావృధకుమారుడు కూడా సహదేవుని కొడుకుచే పీడింపబడి నేలగూలాడు. మరొక కుళిందరాజకుమారుడు శకునిని చంపదలచి, దంతాలతో, శరీరంతో, తొండంతో యోధులను పడగొట్టగల ఏనుగుతో వేగంగా శకునిని

ఆక్రమించి తీవ్రంగా గాయపరిచాడు. కానీ శకుని అతని శిరస్సును ఖండించాడు. ఆపై శతానీకుడు ఆక్రమించి నీ సేనలోని మహాగజాలను, గుర్రాలను, రథాలను, కాల్బల సమూహాలను చంపాడు. వారు గరుత్మంతుని రెక్కలగాలి తగిలి పడిపోయిన పాములవలె, వివశులై పొడిపొడిగా నేలగూలారు. ఆపై నవ్వుతూ కళింగరాజకుమారుడు పదునైన అనేక బాణాలతో శతానీకుని గాయపరిచాడు. దానితో కోపించిన శతానీకుడు తామ్రపు పువ్వువంటి ముఖంగల అతని తలను ఒక క్షురంతో ఖండించాడు.

ఆపై కర్ణుని కొడుకు – వృషసేనుడు మూడు లోహబాణాలతో శతానీకుని, మూడు బాణాలతో అర్జునుని, మూడింటితో భీమసేనుని, ఏడింటితో నకులుని, పన్నెండు బాణాలతో కృష్ణునీ గాయపరిచాడు. వృషసేనుని ఆ అమానుషపరాక్రమాన్ని చూసి, కౌరవులు ఆనందించి, అతనిని అభినందించారు. కానీ అర్జునుని పరాక్రమాన్ని తెలిసినవారు మాత్రం "ఇతడు ఆహుతి అయి పోతున్నాడు" అని భావించారు. ఆ తరువాత శత్రుసంహారకుడు, నరశ్రేష్ఠుడు అయిన అర్జునుడు, అందరి సమక్షంలో నకులుని గుర్రాలు చనిపోవటం, కృష్ణుడు తీవ్రంగా గాయపడటం గమనించి, వేగంగా వృషసేనుని వైపు వెళ్ళి, అతని ఎదుట నిలిచాడు. అర్జునుడు భీకరంగా తనవైపు రావటాన్ని చూసి, వృషసేనుడు గతంలో నముచి ఇంద్రునిపై దాడిచేసినట్లు అర్జునుని ఆక్రమించాడు. ఆపై వీరుడు మహానుభావుడైన వృషసేనుడు ఒక పదునైన బాణంతో అర్జునుని గాయపరిచి, పెద్దగా గర్జించాడు. అది నముచి ఇంద్రుని గాయపరిచి గర్జించినట్లుంది. మరల వృషసేనుడు తీక్ష్ణబాణాలతో అర్జునుని కుడిచంకలో గాయపరిచాడు. అలాగే తొమ్మిది బాణాలతో కృష్ణుని గాయపరిచి మరల పది బాణాలతో అర్జునుని కొట్టాడు. అంతకుముందే వృషసేనుడు ప్రయోగించిన ఆ బాణాలతో అర్జునుని మనస్సులో కొంత కోపం కలిగింది. దానితో వృషసేనుని సంహరించాలని అర్జునుడు మనసా నిర్ణయించుకొన్నాడు. ఆపై మహాత్ముడైన అర్జునుడు రణభూమిలో, నుదుటనున్న కనుబొమలను మూడుగా ముడిచి, వెంటనే కర్ణసుతుని సంహరించాలన్న నిర్ణయంతో బాణాలను విడిచాడు.

ఆ సమయంలో కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. యమునివంటి శత్రువును కూడా అంతం చేయగల అర్జునుడు అప్పుడు నవ్వుతూ, కర్ణుడు, దుర్యోధనుడు అశ్వత్థామ మొదలగు ప్రముఖవీరుల నుద్దేశించి ఇలా అన్నారు. "కర్ణా! ఈ రోజు నీవు చూస్తుండగానే యుద్ధంలో వృషసేనుని పదునైన బాణాలతో యమలోకానికి పంపుతాను." నా కుమారుడు ఒంటరిగా ఉన్నప్పుడు మీరంతా కలిసి అతనిని వధించారు. అది హీనకర్మ అని జనులు

చెప్పుకొంటున్నారు. కానీ ఇప్పుడు నేను మీ అందరి ఎదుట వృషసేనుని చంపుతున్నాను. రథికులైన మహారథులారా! మీరు ఈ కుమారుని కాపాడుకొనగలిగితే కాపాడుకోండి. నేను - అర్జునుడను ఈరోజు రణభూమిలో ముందు వృషసేనుని చంపుతాను. ఆపై మూఢుడైన ఈ కర్ణుని కూడా చంపుతాను. ఈ కలహానికి మూలం కర్ణుడే. దుర్యోధనుని ప్రాపుతో గర్వపడుతున్నవాడు. ఈరోజు రణభూమిలో బలపూర్వకంగా ఆతనిని చంపుతాను. పురుషాధముడైన ఈ దుర్యోధనుని భీమసేనుడు చంపుతాడు. ఈ దుర్యోధనుని అవినీతివలననే ఈ మహావినాశనం సంభవించింది". రాజా! మహాత్ముడైన అర్జునుడు అలా పలికి, చాపాన్ని ధనుస్సును తుడిచి, రణభూమిలో వృషసేనుని గురిచూసి, ఆ కర్ణసుత సంహారానికై బాణాలను విడిచాడు. అర్జునుడు నవ్వుతూ, పది బాణాలతో నిస్సంశయంగా వృషసేనుని మర్మస్థానాలలో గాయపరిచాడు. నాలుగు పదునైన క్షురాలతో వృషసేనుని ధనుస్సును, భుజాలను, శిరస్సును ఖండించాడు. ఆ వృషసేనుడు అర్జునుని బాణాలదెబ్బతిని, బాహువులను, తలను కోల్పోయి, రథంమీద నుండి నేలగూలాడు. అది చక్కగా పుష్పించిన పెద్ద మద్దిచెట్టు గాలికి ఊగి, కొండశిఖరం నుండి పడిపోయినట్లుంది. అర్జునుని బాణాల దెబ్బతిని రథంమీదనుండి పడుతున్న కుమారుని చూసి కర్ణుడు, పుత్ర మరణశోకంతో తపిస్తూ, కోపంగా, వేగంగా తన రథాన్ని అర్జునుని రథంవైపు నడిపించాడు. ఆపై రణభూమిలో అర్జునుని చేతిలో తన సమక్షంలోనే చనిపోయిన కుమారుని చూసి, కర్ణుడు తీవ్రకోపంతో వెంటనే కృష్ణార్జునులపై దాడిచేశాడు."

86. వాసుదేవ వాక్యము

సంజయుడిలా చెప్తున్నాడు. "సింహనాదాలు చేస్తూ పెద్ద శరీరంతో చెలియలికట్టను దాటిన సముద్రంవలె, దేవతలు కూడా వారించలేని రీతిగా వస్తున్న కర్ణుని చూసి, కృష్ణుడు నవ్వి ఇలా అన్నాడు. "ఇదిగో! తెల్లగుర్రాలు పూన్చిన రథంపై శల్యసారథ్యంలో కర్ణుడు వస్తున్నాడు. ధనంజయా! నీవు అతనితో పోరాడాలి. స్థిరంగా ఉండు. చక్కగా సిద్ధంచేసిన తెల్లగుర్రాల రథాన్ని, ఆ రథంమీద నున్న కర్ణుని కూడా గమనించు. ఆ కర్ణుని ధ్వజాన్ని చూడు. నాగకక్షం (ఏనుగును కట్టివేసేత్రాడు) దానిపై గుర్తు. ఆ రథంపై పతాకలు రెపరెపలాడుతున్నాయి. చిరుమువ్వల వరుసలు రథానికి అలంకారాలు. తెల్లగుర్రాలు ఆకాశంలో విమానంవలె రథాన్ని లాగుతున్నాయి. ఆయన ధ్వజం ఇంద్రధనుస్సువలె ఆకాశాన్ని చిత్రిస్తోంది. ధార్తరాష్ట్రునకు ప్రియాన్ని కల్గించే కర్ణుడు

వస్తున్నాడు చూడు. మేఘం నీటిని వర్షించినట్లు శరధారలను కురిపిస్తున్నాడు. ఆ కర్ణుని గుర్రాలను మద్రరాజైన ఈ శల్యుడు రథం ముందు కూర్చొని నియంత్రిస్తున్నాడు. పాండవా! దుఃదుభి ధ్వనులను, భీకరమైన శంఖధ్వనిని విను. అన్నివైపుల నుండి వినిపిస్తున్న సింహనాదాలను విను. మహాశబ్దాలనన్నింటినీ కప్పిపుచ్చి, వినిపిస్తున్న కర్ణుని తీవ్ర ధనుష్టంకార ధ్వనిని విను.

ఇదిగో, ఇటు పాంచాల మహారథులు సేనలతో సహా, అడవిలో కోపించిన సింహాన్ని చూసిన మృగాలవలె సంగ్రామ భూమినుండి చెదరిపోతున్నారు. కొంతేయా! సర్వప్రయత్నాలతో కర్ణుని నీవే చంపాలి. ఈ కర్ణుని బాణాల తాకిడిని మరొకనరుడు సహించలేడు. దేవతలు, అసురులు, గంధర్వులు, చరాచర ప్రాణులు - అందరితో కూడిన మూడులోకాలను యుద్ధంలో గెలువగలవాడవు నీవే. నాకు అలాగే తెలుసు. భీకరుడు, రుద్రుడు, మహాత్ముడు, శర్వుడు, కపర్ది, ఈశానుడు, సమర్థుడు అయిన ముక్కంటిని ఇతరులెవ్వరూ కనీసం చూడలేరు. ఇక పోరాడేదేముంది ? కానీ నీవు సర్వభూత శివంకరుడు, మంగళకరుడైన ఆ మహాదేవుని సాక్షాత్తుగా యుద్ధంతో ఆరాధించావు. ఆ స్థాణువు, దేవతలు నీకు వరదాతలు. దేవదేవుడైన ఆ శూలిప్రసాదంతో, ఇంద్రుడు నముచిని చంపినట్లు కర్ణుని చంపు అర్జునా! నీకు ఎప్పుడూ శ్రేయస్సు కలుగుతుంది. యుద్ధంలో గెలుపొందు".

అర్జునుడిలా అన్నాడు. "కృష్ణా! మధుసూదనా! సర్వలోక గురువువు అయిన నీవు ఆనందంగా ఉంటే నాకు గెలుపు లభించినట్లు. ఈ విషయంలో సంశయం లేదు. హృషీకేశా! మహారథా! గుర్రాలను తోలు, రథాన్ని నడిపించు. యుద్ధంలో కర్ణుని చంపకుండా అర్జునుడు వెనుదిరగడు. గోవిందా! ఈ రోజు నా బాణాలతో ముక్కలైన కర్ణుని చూడు. లేదా కర్ణబాణాలతో మరణించిన నన్ను అయినా చూస్తావు. మూడు లోకాలకు పిచ్చెత్తించే ఘోరయుద్ధం సమీపించింది. భూమి ఉన్నంత కాలం ప్రజలు దీన్ని గురించి చెప్పుకొంటారు". అర్జునుడు అనాయాసంగా పనులు సాధించగల కృష్ణునితో అలాపలికి ఏనుగుపై ఏనుగు దాడి చేసినట్లు రథంతో కర్ణుని మీదకు పోయాడు. మరల అరిందముడైన కృష్ణునితో తేజస్వి అయిన అర్జునుడు "హృషీకేశా! గుర్రాలను నడిపించు. వేళ మించిపోతోంది" అన్నాడు. మహాత్ముడైన అర్జునుడు అలా పలకగానే కృష్ణుడు జయంకలగాలని అర్జునుని ఆశీర్వదించి, అప్పుడు మనోవేగం గల గుర్రాలను నడిపించాడు. ఆ అర్జునుని రథం మనోవేగంతో క్షణకాలంలో కర్ణుని రథానికి ముందు నిలిచింది."

87. కర్ణార్జున సమాగమము

సంజయుడిలా చెప్తున్నాడు. "వృషసేనుని మరణాన్ని చూసి కర్ణుడు శోకానికీ, అసహనానికీ, లోనయ్యాడు. పుత్రశోకంతో కంటతడి పెట్టాడు. ఆపై తేజస్వి అయిన కర్ణుడు అసహనంతో కళ్ళెర్రజేసి,అర్జునుని యుద్ధానికి ఆహ్వానించి, శత్రువుకు ఎదురుగా రథాన్ని నడిపించాడు. పులితోలు పరిచిన ఆ కర్ణార్జునుల రథాలు సూర్యకాంతితో వెలుగుతూ దగ్గరై, ఉదయించిన ఇద్దరు సూర్యులవలె ప్రకాశించాయి. తెల్లని గుర్రాలు గల రథాలనెక్కిన ఆ ఇద్దరు కర్ణార్జునులు అరిమర్దనులు, దివ్యపురుషులు. ఆ మహాత్ములు ఆకాశంలో సూర్యచంద్రులవలె శోభించారు. ఆ ఇద్దరిని చూసి సర్వసేనలు ఆశ్చర్యానికి లోనయ్యాయి. వారు త్రిలోక విజయానికై పోరాడుతున్న ఇంద్రబలుల వలె ఉన్నారు. రథఘోష, అల్లెత్రాటి ధ్వని, చేతిచరుపుల చప్పుడు, బాణ ధ్వని, సింహనాదాలతో ఒకరిపైకి ఒకరు దూసుకొని వస్తున్న ఆ ఇద్దరినీ చూసి రాజులందరూ ఆశ్చర్యపడ్డారు. నాగకక్ష గుర్తుగాగల కర్ణుని ధ్వజం, వానరసహితమైన అర్జున ధ్వజం బాగా దగ్గరయ్యాయి. భారతా! బాగా దగ్గరగా వచ్చిన ఆ రథాలను చూసి రాజులందరూ సింహనాదాలను, మిక్కుటంగా సాధువాదాలను చేశారు. వారిద్దరి ద్వంద్వ యుద్ధాన్ని చూస్తూ వేలకొలదిగ ఉన్న యోధులు జబ్బలు చరిచారు. ఉత్తరీయాలను ఎగురవేయసాగారు.

కౌరవసేనలు కర్ణునికి ఉల్లాసాన్ని కలిగిస్తూ అన్నివైపుల నుండి వాద్యాలను మ్రోగించారు. అంతటా శంఖాలను పూరించసాగారు. అదే రీతిగా పాండవులందరూ అర్జునునికి ఉల్లాసాన్ని కలిగిస్తూ తూర్యనాదాలతో, శంఖధ్వనులతో అన్ని దిక్కులనూ ప్రతిధ్వనింపజేశారు. కర్ణార్జున సమాగమ సమయంలో సింహనాదాలతో, చప్పట్లతో, గర్జనలతో, శూరుల జబ్బచరుపులతో అంతటా భీకరధ్వని చెలరేగింది. పురుషోత్తములైన ఆ కర్ణార్జునులు ఇద్దరూ రథికశ్రేష్ఠులు, రథస్థులు, మహాధనుస్సులను ధరించినవారు. బాణశక్తి ధ్వజ సంపన్నులు, కవచధారులు, నడుముకు కత్తులు కట్టుకొన్నవారు. తెల్లని గుర్రాలు, శంఖాలు, అమ్ములపొదులతో ఇద్దరూ చూడముచ్చటైనవారు. రక్తచందనాన్ని ఒంటికి పూసికొన్నవారు. మదించిన ఆబోతు వంటివారు. మెరుపువంటి ధనుస్సులు గల్గి శస్త్రసంపదతో పోరాడగలవారు. చామరాలతో, వ్యజనాలతో, తెల్లగొడుగులతో శోభిస్తున్నవారు. కృష్ణ శల్యుల సారథ్యంలో నడుస్తున్న సమానరూపంగల మహారథులు. సింహం వంటి మెడ, విశాల బాహువులు, ఎర్రటికళ్ళు, స్వర్ణమాలలు, విశాలమైన వక్షస్సు, మహాబలం గలవారు. ఒకరినొకరు చంపాలనీ, ఒకరినొకరు గెలవాలని ఆకాంక్షిస్తున్నారు. గోశాలలో ఆబోతులవలె, పరస్పరం దాడిచేస్తున్నవారు.

మదజలాన్ని స్రవిస్తున్న ఏనుగులవలె, కోపించిన కొండలవలె, విషసర్ప శిశువులవలె, యమునివలె, కాలుని వలె, మృత్యువు వలె కనిపిస్తున్నారు. కోపించిన ఇంద్రవృత్రుల వలె ఉన్నారు. సూర్యచంద్రమసులవలె, యుగాంతం కోసం కోపంతో లేచిన మహాగ్రహాలవలె ఉన్నారు. ఆ ఇద్దరూ దైవాంశసంభూతులు, దేవబలులు, రూపంతో దేవసమానులు. అనుకోకుండా కలిసిన సూర్యచంద్రులవలె ఆ బలశాలులు ఇద్దరూ నానాశస్త్రధారులై, గర్వంతో రణభూమిలో ఎదురునిలిచినవారు. రాజా! ఎదుట నిలిచిన రెండు సింహాలవలె నున్న ఆ పురుషోత్తములనిద్దరినీ చూసి నీ వారికి పరమానందం కలిగింది.

కర్ణ ధనంజయులు అలా కలబడుతుంటే, చూసిన సర్వప్రాణులలోనూ, ఎవరు గెలుస్తారో అని సంశయం కలిగింది. ఇద్దరూ గొప్ప ఆయుధాలను ధరించినవారే. ఇద్దరూ యుద్ధంలో ఆరితేరినవారే. ఇద్దరూ జబ్బచరిచి ఆకాశాన్ని ప్రతిధ్వనింపజేస్తున్నవారే. ఇద్దరూ పౌరుషబలాలలో ప్రసిద్ధికెక్కిన పరాక్రమశాలులే. ఇద్దరూ యుద్ధంలో ఇంద్రశంబరాసురుల వంటివారే. యుద్ధంలో ఇద్దరూ కార్తవీర్యునితో, రామునితో, విష్ణువుతో, పరమేశ్వరునితో సమానమైనవారే. రాజా! ఇద్దరివీ తెల్లగుర్రాలే. ఇద్దరూ గొప్ప రథాలపై వస్తున్నవారే. ఆ ఇద్దరికీ ఆ మహాసంగ్రామంలో సారథులు కూడా గొప్పవారే. వెలుగొందుతున్న ఆ మహారథులను చూసి, సిద్ధచారణ సమూహాలు ఆశ్చర్యానికి లోనయ్యాయి. బలశాలులైన నీ కుమారులు మహాత్ములై యుద్ధానికే వన్నె తేగల కర్ణుని వేగంగా చుట్టు నిలిచారు. అదే రీతిగా ధృష్టద్యుమ్నుని ముందు నిలుపుకొని, పాండవులు కూడా మహాత్ములై యుద్ధంలో అసమానుడైన అర్జునుని ఆనందంగా చుట్టి నిలిచారు.

నకులుడు, సహదేవుడు, చేకితానుడు, హార్దిక్యుడులై ప్రభద్రకులు, నానాదేశాల నుండి యుద్ధాభిమానులై వచ్చిన ఇతర శూరులు, అందరూ ఒక్కటై ఉల్లాసంగా అర్జునుని చుట్టూ నిలిచారు. వారు కాల్బలంతో గుర్రాలతో, రథాలతో, ఏనుగులతో, శత్రుసూదనుడైన అర్జునుని కాపాడదలిచారు. అర్జునుని విజయంపై, కర్ణుని మరణంపై గట్టినమ్మకం గలవారు. రాజా! అలాగే దుర్యోధనుడు మొదలయిన నీ కుమారులు అందరూ కూడా శత్రుసేనను దెబ్బతీయటానికి సంసిద్ధులై రణభూమిలో కర్ణుని కాపాడసాగారు.

రాజా! రణభూమిలో నీవారిలో కర్ణుడే పందెం. అలాగే పాండవ పక్షంలో అప్పుడు అర్జునుడే పందెం. అలనాటి జూదంలో సభ్యులే ఇప్పుడు ప్రేక్షకులుగా ఉన్నారు. ఆ రణభూమిలో జూదమాడుతున్న వారిలో ఒకరి ఓటమి, మరొకరి గెలుపు నిశ్చితం. ఆ ఇద్దరూ రణశిరస్సున నిలిచియున్న మనకూ, పాండవులకూ గెలుపుకోసమో, ఓటమి కోసమో రణద్యూతాన్ని ప్రారంభించారు. మహారాజా! యుద్ధశాలులయిన ఆ ఇద్దరూ

రణభూమిలో ఒకరిపై ఒకరు కోపంతో, ఒకరినొకరు గెలవాలన్న కోరికతో ఉన్నారు. రాజా! ఆ ఇద్దరూ ఇంద్ర వృత్రులవలె పరస్పరం దాడిచేయదలచినవారు. రెండు పెద్ద కేతుగ్రహాలవలె భీకరరూపాన్ని ధరించిఉన్నారు. భరతర్షభా! ఆపై ఆకాశంలోని ప్రాణులలో, కర్ణార్జునుల మధ్యగల తేడాలను గూర్చి, ఆక్షేపాలతో గూడిన వివాదాలు, పరస్పర భేదాలు ప్రారంభమయ్యాయి. మారిషా! సర్వలోకాలలోనూ పరస్పరం భిన్నమైన అభిప్రాయాలు వెలువడ్డాయి. కర్ణార్జునుల పోరు విషయంలో దేవదానవ గంధర్వులు, పిశాచోరగరాక్షసులు రెండు పక్షాలుగా చీలారు. ఆకాశం కర్ణుని పక్షంలో తల్లివలె నిలిచింది. భూమి అర్జునునివైపు జయాన్ని కోరుతూ తల్లివలె నిలిచింది. గిరులు, సాగరాలు, జీవనదులు, వృక్షాలు, ఓషధులు అర్జునుని వైపు నిలిచాయి. పరంతపా! అసురులు, యాతుధానులు, గుహ్యకులు ఆనందంగా అన్నివైపుల నుండి కర్ణపక్షాన్ని అవలంబించారు. మహారాజా! మునులు, చారణులు, సిద్ధులు, గరుడవంశం వారు, పక్షులు, రత్నాలు, సర్వనిధులు, ఉపవేదాలు, ఉపనిషత్తులు, రహస్య సంగ్రహ పురాణాలతోపాటు, వేదాలు, వాసుకి, చిత్రసేనుడు, తక్షకుడు, మణికుడు, సమస్త సర్పాలు, తమ వంశీయులతో సహా కద్రువసంతతి, విషసర్పాలు, ఐరావత, సౌరభేయ, వైశాలేయసర్పాలు అర్జునపక్షాన్ని ఆశ్రయించాయి. చిన్న చిన్న పాములు కర్ణునికి మద్దతు నివ్వసాగాయి. రాజా! ఈహామృగాలు, వ్యాలమృగాలు, మంగళసూచకాలైన మృగాలు, పక్షులు అన్నీ అర్జునుని గెలుపుపై పట్టుగా ఉన్నాయి.

మహారాజా! వసువులు, మరుత్తులు, సాధ్యులు, రుద్రులు, విశ్వేదేవులు, అశ్వినులు, అగ్ని, ఇంద్రుడు, సోముడు, పవనుడు, పది దిక్కులు, అర్జునుని పక్షాన్ని అవలంబించారు. ఆదిత్యులు కర్ణునివైపు నిలిచారు. వైశ్యులు, శూద్రులు, సూతులు, ఇతర సంకరజాతుల వారు అందరూ కర్ణుని పక్షాన్ని ఆశ్రయించారు. తమ గణాలతో, అనుచరులతో కలిసి దేవతలు, పితరులు, యముడు, కుబేరుడు, వరుణుడు అర్జునునివైపు నిలిచారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, యజ్ఞాలు, దక్షిణలు అర్జునుని పక్షాన నిలిచాయి. ప్రేతాలు, పిశాచాలు, మాంసాహారులైన జంతువులు, పక్షులు, రాక్షసులు, జలజంతువులు, కుక్కలు, నక్కలు, కర్ణునివైపు నిలిచాయి. రాజా! దేవర్షి! బ్రహ్మర్షి, రాజర్షి గణాలు అర్జునుని పక్షమే. తుంబురుడు మొదలయిన గంధర్వులు అర్జునుని పక్షమే. ప్రాధ, ముని – ఈ ఇద్దరి వంశాలకు చెందిన గంధర్వ – అప్సరోగణాలు అర్జునునివైపే.

పవిత్రలయిన అప్సరలతో పాటు దేవదూతలు, గుహ్యకులు, మనోరంజకాలైన పుణ్యగంధాలు అర్జునునివైపు నిలిచాయి. మలిన గంధాలన్నీ కర్ణుని ఆశ్రయించాయి. నశించబోయే వారిదగ్గర విపరీతమైన

అరిష్టాలు కనిపిస్తాయి. అవసానదశలో విపరీత భావాలకు లోనైన వారిలో, మృత్యుకాలం సమీపించగానే, వేగంగా వివిధ భావాలు కలుగుతాయి. అటువంటి భావాలు, అరిష్టాలు అన్ని కలిసి కర్ణునిలో ప్రవేశించాయి. నృపోత్తమా! ఓజస్సు, తేజస్సు, సిద్ధి, ప్రహర్షం, సత్యం, పరాక్రమం, మనస్తుష్టి, జయం, ఆనందం - ఇటువంటి శుభనిమిత్తాలు ఆ సంగ్రామ సాగరంలో జయశీలుడైన అర్జునునిలో ప్రవేశించాయి. మహారాజా! ఋషులు బ్రాహ్మణులతో సహా అర్జునుని సేవించారు. ఆపై దేవగణాలతో సహా సిద్ధులు, చారణులు రెండు భాగాలయి, నరోత్తములైన కర్ణార్జునులను ఆశ్రయించారు. వారంతా విచిత్రంగా అలంకరింపబడిన మంచి విమానాలనెక్కి, కర్ణార్జునుల ద్వంద్వయుద్ధాన్ని చూడటానికి వచ్చారు.

ఈహామృగాలు, పక్షిసమూహాలు, ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాల్బలాలతో కలిసి దివ్యపురుషులు మేఘాలను, వాయువును వాహనాలుగా చేసి కర్ణార్జున సమాగమాన్ని చూడాలని వచ్చారు. మహారాజా! దేవతలు, దానవులు, గంధర్వులు, నాగులు, యక్షులు, పక్షులు, మహర్షులు, వేదవేత్తలు, స్వధాభోక్తలైన పితరులు, తపస్సు, విద్యలు, ఓషధులు వివిధ రూపాలతో, వివిధ బలాలతో కూడి, కోలాహలం చేస్తూ గగనతలంపై నిలిచారు. బ్రహ్మర్షులతో, ప్రజాపతులతో కలిసి బ్రహ్మ, మహేశ్వరుడు దివ్యయానాలలో ఆ ప్రదేశానికి వచ్చారు. అప్పుడు మహాత్ములైన ఆ కర్ణార్జునులు తలపడుతుండగా చూసి "అర్జునుడు కర్ణునిపై గెలుచుగాక" అని ఇంద్రుడన్నాడు. "కర్ణుడు అర్జునునిపై గెలుచుగాక" అని సూర్యుడన్నాడు. యుద్ధంలో అర్జునుని చంపి, నా కుమారుడైన కర్ణుడే గెలవాలి. ఈ రోజు కర్ణుని చంపి నాకుమారుడైన అర్జునుడే గెలవాలి. ఆ రీతిగా ఇంద్రసూర్యుల మధ్య వివాదమేర్పడింది. భారతా! దేవతా శ్రేష్ఠులైన ఆ ఇద్దరూ, చెరొకపక్షానికి మద్దతు పలుకుతున్నారు. దేవతలలో, రాక్షసులలో కూడా రెండు పక్షాలు ఏర్పడ్డాయి.

మహాత్ములైన ఆ కర్ణార్జునులు యుద్ధానికి తలపడుతుండగా, దేవర్షులతో, చారణులతో సహా మూడులోకాలు వణకసాగాయి. దేవతాగణాలు, సమస్త ప్రాణులూ కూడా భయానికి లోనయ్యాయి. దేవతలు అర్జునునివైపు, అసురులు కర్ణునివైపు నిలిచారు. రథసమూహాలకు అధిపతులై, కురుపాండవ వీరులైన కర్ణార్జునుల విషయంలో రెండుపక్షాలు ఏర్పడటాన్ని గమనించి, దేవతలు ప్రజాపతి అయిన బ్రహ్మతో ఇలా అన్నారు. "దేవా! ఈ కౌరవపాండవ యోధులలో ఎవరు గెలుస్తారు. స్వామీ! ఈ నరశ్రేష్ఠులకు ఇద్దరికీ గెలుపు సమానం కావాలి. కర్ణార్జునుల వివాదంలో, లోకమంతా సంశయానికి లోనయింది. స్వయంభూ! దేవా! మాకు వీరి గెలుపు విషయమై యథార్థాన్ని చెప్పండి. వీరిద్దరికీ విజయం సమానమన్న మాట చెప్పండి." ఆ మాటలు విని బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన

ఇంద్రుడు పితామహునకు నమస్కరించి, ఆ దేవదేవునితో ఇలా అన్నాడు. "స్వామీ! మీరు ఇంతకుముందు కృష్ణార్జునులే గెలుస్తారని నిశ్చయంగా చెప్పారు. నన్ను అనుగ్రహించి దానిని అలాగే జరగనివ్వండి. మీకు నమస్సులు.

ఆపై బ్రహ్మ, ఈశానుడు దేవేంద్రునితో ఇలా అన్నారు. "మహాత్ముడైన ఈ విజయునిదే విజయం. ఈ సవ్యసాచి ఖాండవవనంలో అగ్నిని తృప్తిపరిచాడు. ఇంద్రా! స్వర్గానికి వచ్చి నీకు సహాయం కూడా చేశాడు. కర్ణుడు దానవపక్షానికి చెందినవాడు. కాబట్టి ఓడి తీరాలి. ఇలా జరిగితే నిశ్చితంగా దేవతల పని నెరవేరినట్లే. ఇంద్రా! ఎవరికైనా తమపనియే గొప్పది కదా! మహాత్ముడైన అర్జునుడు ఎప్పుడూ సత్యధర్మాలపై ఆసక్తి గలవాడు. కాబట్టి తప్పక విజయ మతనిదే. ఈ విషయంలో సంశయించనవసరం లేదు. సహస్రనేత్రా! అర్జునుడు మహాత్ముడైన వృషభధ్వజుని ఆనందింపజేసినవాడు. అటువంటి వానికి విజయం దక్కక ఏమవుతుంది ? జగత్ప్రభువైన విష్ణువే అర్జునునకు సారథ్యాన్ని వహిస్తున్నాడు. అటువంటి మనస్వి, బలశాలి, శూరుడు, అస్త్రనిపుణుడు, తపోధనుడు అయిన అర్జునుడు తప్పక గెలుస్తాడు. మహాతేజస్వి అయిన అర్జునుడు ధనుర్వేదాన్ని పూర్తిగా అభ్యసించినవాడు. సర్వగుణ సంపన్నుడు. పైపెచ్చు ఇది దేవకార్యం. పాండవులు వనవాసాది దుఃఖాలతో, నిరంతరంగా ఎంతో కష్టపడ్డారు. పురుషశ్రేష్ఠుడైన అర్జునుడు తపోబల సంపన్నుడూ సమర్థుడూ అయ్యాడు. అర్జునుడు తన మాహాత్మ్యంతో దైవనిర్ణయాన్ని కూడా దాటిపోగలడు. అలా అతిక్రమిస్తే లోకాలన్నీ తప్పక నశిస్తాయి.

కృష్ణార్జునులు కోపిస్తే ఈ లోకస్థితి ఉండదు. వారు పురుషోత్తములు. నిరంతరంగా జగత్తును సృష్టిస్తున్నవారు. ఈ నరనారాయణులు ప్రాచీనులైన ముని పుంగవులు, వీరిని ఎవరూ నియంత్రించలేరు. వీరు అందరికీ శాసకులు. కాబట్టి శత్రుసంహారం చేయగలరు. వీరితో సమానుడైన వాడెవ్వడూ స్వర్గలోకంలో కానీ, మనుష్యులలో కానీ లేడు. దేవర్షులతో, చారణులతో సహా మూడులోకాలు వీరిని అనుసరించవలసినదే. సర్వ దేవతా సమూహాలు, సర్వప్రాణులు, సమస్త విశ్వమూ వీరి ప్రభావంతోనే ప్రవర్తిస్తుంది. కర్ణుడు ఉత్తమలోకాలను పొందగలడు. ఈ సూర్యసుతుడు శూరుడే కానీ గెలుపు కృష్ణార్జునులదే. కర్ణుడు ద్రోణభీష్ములతో పాటు వసులోకాన్నో, మరుత్తులలోకాన్నో, స్వర్గలోకాన్నో, పొందవచ్చు." దేవదేవులయిన బ్రహ్మ, మహేశ్వరుల మాటలు విని ఇంద్రుడు సర్వభూతాలను పిలిపించి, బ్రహ్మమహేశుల శాసనాన్ని ఇలా తెలిపాడు. బ్రహ్మమహేశ్వరులు జగద్ధితంగా చెప్పిన మాటను మీరు విన్నారు. అది అలాగే జరుగుతుంది. మరొకరీతిగా జరగదు. ఇక నిశ్చింతగా

నిలవండి" రాజా! అలా చెప్పిన ఇంద్రవచనాన్ని విని సర్వభూతాలు ఆశ్చర్యపోయాయి. కృష్ణార్జునులను ప్రశంసించాయి. ఆనందంతో మంచివాసన గల పుష్పాలను కురిపించాయి. దేవతలు వివిధ రూపాల తూర్యవాద్యాలను మ్రోగించారు.

నరశ్రేష్ఠులైన కర్ణార్జునుల అసాధారణ ద్వైరథయుద్ధాన్ని చూడటానికి, దేవదానవ గంధర్వ లందరూ సిద్ధంగా నిలిచారు. రాజా! ఆ మహోత్కృలిద్దరి రథాలు తెల్లగుర్రాలివి. దివ్యలక్షణాలతో, యుద్ధసామగ్రితో కూడినవి. వాటిపై కర్ణార్జునులు ఉత్సాహంతో కూర్చొనియున్నారు. భారతా! అక్కడ చేరియున్న లోకవీరులందరూ విడివిడిగా శంఖాలు మ్రోగించారు. వీరులైన కృష్ణార్జునులు, కర్ణశల్యులు కూడా శంఖాలూదారు. ఇంద్రశంబరాసురులవలె పరస్పరం తీవ్రంగా పోటీపడుతున్న ఆ కర్ణార్జునుల మధ్య అప్పుడు యుద్ధం ప్రారంభమైంది. అది పిరికివారికి మరీ భయాన్ని కల్గిస్తోంది. వారి ధ్వజాలు రథాలపై నిర్మలంగా ప్రకాశిస్తున్నాయి. జగత్ప్రళయకాలంలో గగనతలంలో పుట్టిన రాహుకేతువులవలె కనిపిస్తున్నాయి. కర్ణుని ధ్వజం నాగకక్ష్య గుర్తుగా గలది. అది స్వర్ణమయం. ఎంతో దృఢంగా ఇంద్రధనుస్సువలె ప్రకాశిస్తోంది. అర్జునుని రథంపై వానరశ్రేష్ఠుడు నోరు తెరిచిన యమునివలె దంతాలతో భయపెడుతూ. కాంతులతో సూర్యునివలె చూడవీలుగాకున్నాడు. అర్జునుని ధ్వజం యుద్ధాభిలాషను పొందినట్లు కర్ణధ్వజానికి దగ్గరయింది. అప్పుడు అర్జునుని ధ్వజంపై నున్న కపి తన స్థానం నుండి కదలి, తీవ్రవేగంతో కర్ణుని ధ్వజం మీదకు దూకి నాగకక్ష్యను గోళ్ళతో, దంతాలతో కొట్టసాగింది. అది గరుడుడు పామును సంహరిస్తున్నట్లుంది. కర్ణుని ధ్వజంపై నున్న ఆ హస్తికక్ష్య మువ్వల ఆభరణాలతో లోహమయమైన కాలపాశంవలె ఉన్నది. అది తీవ్రకోపంతో వానరునిపై దాడిచేసింది. వారిద్దరిమధ్య భీకరమైన ద్వైరథయుద్ధమనే జూదం ప్రారంభమైంది. అందువల్ల మరీముందుగానే వారి ధ్వజాలు యుద్ధం ప్రారంభించాయి. పరస్పరం పోటీపడుతూ గుర్రాలు గుర్రాలను చూసి, సకిలించాయి. కృష్ణుడు చూపుల బాణాలతో శల్యుని గాయపరిచాడు. శల్యుడు కూడా పుండరీకాక్షుని అదే రీతిగా చూశాడు. కానీ వాసుదేవుడే చూపుల బాణాలతో శల్యుని గెలిచాడు.

అర్జునుడు కూడా చూపులతోనే కర్ణుని ఓడించాడు. అప్పుడు కర్ణుడు నవ్వుతూ శల్యుని సంబోధించి ఇలా అన్నాడు. "శల్యా! ఒకవేళ ఈ రోజు ఇక్కడే అర్జునుడు నన్ను చంపితే రణభూమిలో నీవేం చేస్తావు? యథార్థం చెప్పు". శల్యుడిలా అన్నాడు. "కర్ణా! ఒకవేళ ఈరోజు అర్జునుడు నిన్ను చంపితే కృష్ణార్జునుల నిద్దరినీ ఒకే రథంతో నేను

చంపుతాను". సంజయుడిలా చెప్తున్నాడు. "అర్జునుడు కూడా కృష్ణుని అలాగే అడిగాడు. అప్పుడు నవ్వి కృష్ణుడు అర్జునునితో ఇలా వాస్తవాన్ని చెప్పాడు. అర్జునా! సూర్యుడు తన స్థానం నుండి పడిపోవచ్చు. సముద్రం ఎండిపోవచ్చు. అగ్ని చల్లబడవచ్చు. కానీ కర్ణుడు నిన్ను చంపలేడు. ఒకవేళ ఏ రీతిగానైనా అలా జరిగితే లోకం తలక్రిందుల వుతుంది. రణభూమిలో చేతులతోనే కర్ణశల్యులను చంపుతాను". కృష్ణుని ఆ మాటలు విని, కపిధ్వజుడైన అర్జునుడు నవ్వుతూ అనాయాసంగా కార్యసాధన చేయగల కృష్ణునితో ఇలా అన్నాడు.

"జనార్దనా ! కర్ణశల్యులు నాకే చాలరు. పతాకధ్వజాలతో, శల్యునితో, రథాలతో, గుర్రాలతో, గొడుగుతో, కవచంతో, శక్తి శరాలతో, వింటితో పాటు రణభూమిలో బాణాలతో కర్ణుని ఈ రోజు ముక్కలు చేస్తాను. చూస్తావుగా ! ఈరోజే రథంతో, గుర్రాలతో, శక్తులతో, కవచంతో, ఆయుధంతో సహా అరణ్యంలో ఏనుగు చెట్టును త్రొక్కివేసినట్లు, కర్ణుని పిండిపిండి చేస్తాను. మాధవా! ఈరోజు కర్ణుని భార్యలకు వైధవ్యస్థితి కలుగబోతోంది. వారు కలలో తప్పనిసరిగా అపశకునాలను చూసియుంటారు. కృష్ణా! కర్ణుని భార్యలను ఈ రోజు విధవలుగా చూస్తావు. ఇతడు గతంలో కలిగించిన కోపం నాలో ఇంకా శమించలేదు. సభలో ద్రౌపదిని చూసి, దీర్ఘదృష్టి లేని ఈ మూఢుడు మమ్ములను పరాభవించి పదే పదే రెచ్చగొట్టాడు. అది ఇంకా చెదరిపోలేదు. గోవిందా! మదించిన ఏనుగు పుప్పించిన చెట్టును మథించినట్లు, ఈరోజు నాచే మథింపబడిన కర్ణుని చూడగలవు. మధుసూదనా! ఈ రోజు కర్ణుడు చనిపోగానే "వార్ష్ణేయా! అదృష్టం కొద్ది నీవే గెలిచావు. అనే మధురవచనాలను వింటావు. జనార్దనా ! ఈరోజు ఆనందంగా సుభద్రను ఓదార్చగలవు. మేనత్తను - కుంతిని ఉత్సాహంగా ఊరడించగలవు. మాధవా! ఈరోజు బాష్పముఖి అయిన ద్రౌపదిని, పాండుసుతుడైన ధర్మరాజు అమృతతుల్య వచనాలతో అనునయించగలవు".

88. అశ్వత్థామ - దుర్యోధనుల సంభాషణ

సంజయుడిలా చెప్తున్నాడు. "అప్పుడు ఆకాశంలో దేవతలు, నాగులు, అసురులు, సిద్ధులు, యక్షులు, గంధర్వులు, అప్సరల సమూహాలు, బ్రహ్మర్షులు, రాజర్షులు, గరుడుడు - వీరంతా చేరారు. గగనతలస్వరూపం ఆశ్చర్యకరంగా ఉంది. మనోహరమైన శబ్దాలతో, వాద్యాలతో, గీతాలతో, స్తుతులతో, నృత్యాలతో, పరిహాసాలతో గగనసీమ ప్రతిధ్వనిస్తోంది. భూతలవాసులు, ఆకాశచారులు అందరూ ఆ ఆశ్చర్యకరమైన రూపాన్ని చూశారు. ఆపై కౌరవపాండవయోధులు ఉల్లాసంగా వాద్యాలతో, శంఖధ్వానాలతో, సింహనాదాల ధ్వనులతో

భూమినీ, దిక్కులనూ ప్రతిధ్వనింపజేస్తూ సర్వశత్రువులను సంహరించసాగారు. అప్పుడు సైనికులతో, గుర్రాలతో, ఏనుగులతో, రథాలతో నిండి బాణాలు, కత్తులు, శక్తులు, ఋష్టుల ప్రయోగంతో భరింపరానిదై ధీరులతో కూడి, శవాలతో ఆవరింపబడి రణభూమి నెత్తుటితో ఎర్రగా ప్రకాశించింది. దేవతలకు రాక్షసులతో పోరు జరిగినట్లు పాండవకౌరవుల మధ్య భీకర యుద్ధం జరిగింది. కర్ణార్జునుల బాణాలతో, అత్యంతమూ దారుణమైన ద్వైరథ యుద్ధం ప్రారంభమైంది. కవచాలు ధరించిన కర్ణార్జునులు ఇద్దరూ పదునైన తమ బాణాలతో దిక్కులనూ, సైన్యాన్నీ కప్పివేశారు.

అప్పుడు నీవారు కానీ, శత్రువులు కానీ బాణాలతో చీకటి కప్పటంతో ఏమీ చూడలేకపోయారు. భయపీడితులై, ఏకరథులైన కర్ణార్జునులను ఆశ్రయించారు. అది అంతటా అద్భుతంగా కనిపించింది. ఆపై ఆ కర్ణార్జునులు ఇద్దరూ తూర్పు పడమటిగాలులవలె ఒకరినొకరు చెదర గొడుతూ, అస్త్రాలతో ఇతరుల అస్త్రాలు భంగపరుస్తూ, గాఢాంధకారంలో ఉదయించిన సూర్యచంద్రులు ప్రకాశించినట్లు వెలుగొందారు. "ఎవ్వరూ పారిపోకూడదు" అన్న ఆదేశాలను పాటిస్తూ శత్రుసేనలూ, నీ వారూ కూడా ఆ మహారథుల నిద్దరినీ అన్నివైపులనుండి చుట్టి పూర్వం దేవతలు, రాక్షసులు ఇంద్రశంబరులను చుట్టి నిలిచినట్టు నిలిచారు. ఉభయపక్షాలలోని మృదంగాలు, భేరులు, పణవాలు, ఆనకాల ధ్వనులతో పాటు నరోత్తములైన కర్ణార్జునులు సింహనాదాలు చేయసాగారు. అప్పుడు ఆ పురుషశ్రేష్ఠ లిరువురూ మేఘ ధ్వనులతో కూడిన సూర్యచంద్రులవలె ప్రకాశించారు. ఇద్దరూ ప్రళయకాలంలో చరాచర జగత్తును దగ్ధం చేయదలచి, ఇద్దరు సూర్యులవలె, శత్రుదుస్సహంగా ప్రకాశించసాగారు. ఆ ఇద్దరు తమ విశాలధనుర్మండలాల మధ్య నిలిచి, వేల బాణాల కిరణాలతో వెలుగొందుతున్నారు. ఇద్దరూ అజేయులే. ఇద్దరూ శత్రుసంహారకులే. ఇద్దరూ సమర్థులే. ఇద్దరూ ఒకరినొకరు చంపగోరినవారే. కర్ణార్జునులు ఇద్దరూ ఆ మహాసంగ్రామంలో, ఇంద్రజంభాసురులవలె నిర్భయంగా సంచరిస్తున్నవారే.

ఆపై మేటివిలుకాండ్రయిన ఆ మహారథులిద్దరూ మహాస్త్రాలను ప్రయోగిస్తూ, భయంకర బాణాలతో సైనికులను, గుర్రాలను, ఏనుగులను లెక్కలేనంతగా సంహరిస్తూ, ఒకరినొకరు కూడా గాయపరుచుకొంటున్నారు. ఆ పురుషశ్రేష్ఠుల బాణాల పీడనకు లోనయి కౌరవపాండవ పక్షాలలోని సైనికులు, ఏనుగులతో, కాల్బలంతో, గుర్రాలతో, రథాలతో సహా సింహపు దెబ్బతిన్న ఆటవిక జంతులవలె, పదిదిక్కులకూ పారిపోయారు. ఆపై దుర్యోధనుడు, కృతవర్మ, శకుని, కృపాచార్యుడు, కర్ణుడు – ఈ మహారథులు

అయిదుగురు శరీరానికి బాధ కలిగించే బాణాలతో కృష్ణార్జునులను కొట్టారు. అర్జునుడు బాణాలతో వారి విండ్లను, అమ్ములపొదులను, ధ్వజాలను, గుర్రాలను, రథాలను, రథసారథులను ఒక్కసారిగా మథించి శత్రువులను వెంటనే చెదరగొట్టాడు. పన్నెండు బాణాలతో కర్ణునిపై దాడిచేశాడు. ఆపై వందల రథికులు, వందల ఏనుగులు ఆతతాయులై* అర్జునుని చంపదలచి ముందుకురికాయి. వారిలో శకులు, తుషారులు, యవనులు, కాంబోజదేశీయులైన ఆశ్వికులు కూడా ఉన్నారు. కానీ అర్జునుడు తన చేతిలోని బాణాలతో, క్షురాలతో వారి ఆయుధాలను ఖండించాడు. వారి తలలను పడగొట్ట సాగాడు. వారి గుర్రాలను, ఏనుగులను, రథాలను, పోరాడుతున్న శత్రుగణాలను కూడా నేలగూల్చాడు.

ఆపై ఆకాశం హర్షంతోనిండిన దేవతల తూర్యనాదాలు, సాధువాదాలతో పాటు వారు కురిపించిన గొప్ప పూలవానలు కూడా, గాలికి వ్యాపించే పరిమళంతో పాటు అర్జునునిపై కురిశాయి. దేవమనుష్యుల సాక్షిగా జరిగిన ఆ అద్భుతాన్ని చూసి, అప్పుడు ప్రాణులన్నీ ఆశ్చర్యపడ్డాయి. కానీ నీ కుమారుడు – దుర్యోధనుడు, కర్ణుడు ఒకే నిశ్చయంతో నిలిచి ఆశ్చర్యానికీ లోనుకాలేదు. వ్యథనూ చెందలేదు. అప్పుడు అశ్వత్థామ నీ కుమారుని చేతిని తన చేతితో గట్టిగా నొక్కి, ఊరడిస్తూ ఇలా అన్నాడు. "దుర్యోధనా! పాండవులతో సంధి చేసికొని ప్రసన్నుడవు కమ్ము ! విరోధం వద్దు. యుద్ధం వద్దు. బ్రహ్మ సమానుడు, మహాస్త్రవేత్త అయిన ద్రోణాచార్యుడు చనిపోయాడు. అలాగే భీష్ముడు మొదలయిన మహారథులు గతించారు. నేను, నా మేనమామ (కృపుడు) అవధ్యులం. పాండవులతో కలిసి చిరకాలం రాజ్యాన్ని పరిపాలించు. నేను నివారిస్తే అర్జునుడు శాంతిస్తాడు. కృష్ణుడు కూడా శత్రుత్వాన్ని కోరుకోడు. యుధిష్ఠిరుడెప్పుడూ ప్రాణిహితాన్ని అభిలషించేవాడు. వృకోదరుడు, నకుల సహదేవులు ఆయననునుసరించేవారు. నీవు పాండవులతో అవగాహనకు వస్తే, నీ కోరిక మేరకు ప్రజలంతా శుభాన్ని పొందుతారు. మిగిలిన బంధువులందరూ, వారి వారి నగరాలకు వెళతారు. సైనికులు యుద్ధాన్ని విరమిస్తారు. రాజా! నా మాట వినకుంటే రణభూమిలో దెబ్బతిని తప్పక బాధపడతావు.

ధర్మరాజు కృపాళువు. ఆయనను అడిగితే వృద్ధుడైన తండ్రిని, కీర్తిమతి అయిన గాంధారిని దృష్టిలో నుంచుకొని సంధికి అంగీకరిస్తాడు. సమర్థుడైన ఆ ధర్మజుడు, పండితుడు, బుద్ధిశాలి, ధీరుడు, సర్వశాస్త్రార్థాల తత్త్వ మెరిగినవాడు. నీకు తగిన రీతిగా రాజ్యాన్ని స్వయంగా ఇచ్చి పరిపాలించనిస్తాడు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు శత్రుత్వాన్ని దూరం చేస్తాడు. ఆత్మీయుల దోషాన్ని తీవ్రంగా పరిగణింపడు.

---

* వి. ఆతతాయులు ఆరుగురు *1) ఇంటికి నిప్పుపెట్టేవాడు. 2) విషం పెట్టేవాడు. 3) కత్తితో నరికేవాడు. 4) ధనాన్ని దోచేవాడు. 5) నేలనపహరించేవాడు. 6) పరస్త్రీని చెరపట్టేవాడు.*

కృష్ణుడు కూడా యుద్ధబుద్ధి గలవాడు కాదు. స్వజనులను చూసి సంతోషించేవాడు. భీమసేనుడు, అర్జునుడు, మాద్రేయులయిన నకులసహదేవులు – వీరంతా వాసుదేవుని అభిప్రాయాన్ని, ధీమంతుడైన యుధిష్ఠిరుని అభిప్రాయాన్ని గౌరవించేవారు. ఈ పురుషశ్రేష్ఠులు వారిమాటమీదనే నిలుస్తారు. దుర్యోధనా! నిన్ను నీవు రక్షించుకో. శరీరమే అన్నిటికీ మూలం, బ్రతకటానికే ప్రయత్నించు. బ్రతికిఉంటేనే శుభాలను చూడగలం. కౌరవ్యా! బ్రతికిఉంటే రాజ్యమూ, సంపదా, శుభాలు కలుగుతాయి. చనిపోతే రాజ్యమూ ఉండదు, సుఖమూ ఉండదు.

భారతా! లోకప్రచురమైన ఈ ప్రవృత్తిని గమనించు. పాండవులతో సంధి చేసికొని కురువంశాన్ని మిగుల్చు. మహాబాహూ! కౌరవ్యా! నేను నాఅంతగా అహితమైన మాటను నీకు చెప్పే రోజు రాకూడదు. నా మాటను తిరస్కరించవద్దు. ఈ నా మాట ధర్మానుకూలం, రాజుకు, రాజ్యానికీ హితకరం. కురువంశవృద్ధికి ఇది పరమ శ్రేయస్కరం. గాంధారీనందనా! నా మాట ప్రజలకు హితకరం, వంశానికి సుఖదాయకం, లాభకరం, భవిష్యత్తులో మంగలకరం. నరోత్తముడైన అర్జునుని కర్ణుడు గెలవలేడని నా నిశ్చితాభిప్రాయం. నరశ్రేష్ఠా! నా ఈ శుభవచనాన్ని అంగీకరించు. రాజేంద్రా! ఆలా కాకపోతే మహావినాశనం తప్పదు.

అర్జునుడు ఒంటరిగా ప్రదర్శించిన పరాక్రమాన్ని, లోకంతోపాటు నీవు కూడా చూశావు. ఇంతటి పరాక్రమాన్ని ఇంద్రుడు కానీ, యముడు కానీ, బ్రహ్మకానీ, కుబేరుడు కానీ ప్రదర్శించలేరు. అర్జునుడు తన గుణాల ద్వారా ఇంతకన్నా గొప్పవాడు. అయినా నా మాటను అతిక్రమించడు. ఎప్పుడూ నిన్ను అనుసరించి మెలగగలడు. రాజేంద్రా! ప్రసన్నుడవై సంధిని చేసుకో. నాకు కూడా నీ మీద ఎల్లప్పుడూ ఎంతో అభిమానం, ఆ పరమమైత్రితో నీతో చెప్తున్నాను. నీకు నచ్చితే నేను కర్ణుని కూడా యుద్ధం నుండి విరమింపజేయగలను. మిత్రులు నాలుగు రకాలని పండితులంటారు. సహజమిత్రులు, సంధివలన మిత్రులు, ధనంతో సాధించిన మిత్రులు, ప్రతాపంతో ఏర్పడిన మిత్రులు – పాండవులతో నీకు ఈ నాలుగు విధాలమైత్రి ఉంది. వీరుడా! రాజా! పాండవులు నీకు నిసర్గబంధువులు. మరల వారిని సామోపాయంతో పొందు. నీవు ప్రసన్నుడవై వారితో మైత్రిని పొందితే లోకానికే నీవు సాటిలేని హితాన్ని సమకూర్చినట్లు."

దుర్యోధనుడు తన మిత్రుడైన అశ్వత్థామ చెప్పిన హితవచనాన్ని విని, ఆలోచించి, నిట్టూర్చి, మనస్సు వికలమై ఇలా అన్నాడు. "మిత్రమా! నీవు చెప్పినది యుక్తమే. నా మాట కూడా చెపుతాను. విను. దుర్బుద్ధి అయిన వృకోదరుడు, సింహంవలె, బలపూర్వకంగా దుశ్శాసనుని చంపి, పలికిన మాట నా హృదయంలో నిలిచి నన్ను పీడిస్తోంది. అది మీరు కూడా విన్నదే. ఇక సంధి ఎలా జరుగుతుంది ? రణభూమిలో అర్జునుడు కర్ణుని ఎప్పుడూ భరించలేడు. మహాగిరి అయిన మేరువును పెనుగాలి ఢీ కొనడం వంటిదది.

బలపూర్వకమైన మావైరాన్నే కదా ఆలోచించి పార్థులు నాపై విశ్వాసాన్ని ప్రకటించలేరు. అచ్యుతా! గురుసుతా! యుద్ధాన్ని విరమించమని నీవు కర్ణునితో చెప్పనవసరం లేదు. అర్జునుడు ఈ రోజు ఎంతో అలసిపోయి ఉన్నాడు. కర్ణుడు అతనిని తప్పక చంపగలడు." అశ్వత్థామతో అలా పలికి, పదే పదే అతనిని ఊరడించి, నీకుమారుడు తన సైనికుల నిలా ఆదేశించాడు. "చేతిలో బాణాలు పట్టుకొని మిన్నకున్నారేమిటి? నాశత్రువులపై దాడిచేయండి. చంపండి."

89. కర్ణార్జున యుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! నరోత్తములైన ఆ కర్ణుడు అర్జునుడు, శంఖభేరీ నినాదాలు వృద్ధిచెందగానే, యుద్ధానికై ముందుకు వచ్చారు. ఇదంతా నీ కుమారుని దురాలోచనల ఫలితమే.

అప్పుడు యశస్వినులైన ఆ కర్ణార్జునులు విషసర్పాలవలె నిట్టూర్పులు విడుస్తూ; తమ ముఖాల నుండి పొగలేని నిప్పువలె వైరాన్ని ప్రకటిస్తూ, నేయివోసిన అగ్నివలె రణభూమిలో జ్వలించారు.

మదజలాన్ని స్రవిస్తూ, బాగా పెరిగిన దంతాలతో ఆడ ఏనుగుకై పోరాడుతున్న రెండు హిమాలయ ప్రాంత గజాలవలె ఉగ్రపరాక్రమం గల ఆ వీరులు - కర్ణార్జునులు ఇద్దరూ పరస్పరం ముందుకు రాసాగారు. ఒక మేఘం మరొకపెద్ద మేఘంతో, ఒక కొండ దైవికంగా మరొక కొండతో ఢీకొన్నట్లు అల్లెత్రాడు, చేతితొడుగులు రథపుటిరుసుల ధ్వనులతో, బాణవృష్టిని కురిపిస్తూ, వారు ఒకరి మీదకొకరు రాసాగారు. శిఖరాలు, చెట్లు, పొదలు, ఓషధులు సమృద్ధంగా పెరిగి, రకరకాలైన పెద్దపెద్ద సెలయేళ్ళకు జన్మస్థానాలైన రెండు పర్వతాలవలె కదులుతూ, మహాబలులైన ఆ ఇద్దరూ గొప్ప అస్త్రాలతో ఒకరినొకరు కొట్టసాగారు.

ఆ కర్ణార్జునుల మహాసంగ్రామం గతంలోని ఇంద్రబలుల పోరాటంవలె ఉంది. బాణాల తాకిడితో వారి శరీరాలు, సారథులు, గుర్రాలు శిథిలమవుతున్నాయి. చిక్కని నెత్తురు అక్కడ నీటివలె ప్రవహిస్తోంది. అది ఇతరులకు దుస్సహమైన పోరు. తామరలు, కలువలు, చేపలు, తాబేళ్ళు, పక్షి సమూహాలతో దట్టంగా ఆవరింపబడిన రెండు మహాసరస్సులు గాలికి కదలి, ఒకదానితో ఒకటి కలిసిపోయినట్లు, ధ్వజాలతో శోభిస్తున్న ఆ ఇద్దరిరథాలు కలిసిపోయాయి. ఇద్దరూ మహేంద్రునితో సమానమైన పరాక్రమం గలవారు. ఇద్దరూ ఇంద్రునివంటి మహారథులు. ఇంద్రుని వజ్రాయుధం వంటి బాణాలతో ఇంద్రవృత్రులవలె ఒకరినొకరు కొడుతున్నారు. విచిత్రకవచాలు, ఆభరణాలు, వస్త్రాలు, ఆయుధాలు ధరించిన

ఏనుగులతో, కాల్బలంతో, గుర్రాలతో, రథాలతో కూడిన ఉభయ సేనలు కర్ణార్జునుల ఆశ్చర్యకరమైన పోరాటాన్ని చూసి కంపించారు. గగన చారులు కూడా భయపడ్డారు. ఒక మదపుటేనుగు మరొక ఏనుగు పై దాడిచేసినట్టు అర్జునుడు కర్ణుని చంపదలచి దాడిచేశాడు. అప్పుడు ప్రేక్షకులు ఆనందంతో సింహనాదాలు చేస్తూ, చేతులు పైకెత్తి ఊపారు. ప్రేక్షకులు వస్త్రాలను ఊపసాగారు.

ఆ మహాసంగ్రామంలో, అపరాహ్ణవేళలో, పర్వతంపై ప్రసరించే మేఘంవలె, కర్ణుడు అర్జునునిపై దాడిచేసినప్పుడు కౌరవ సోమకులలో అన్నివైపుల నుండి కోలాహలం చెలరేగింది. నెత్తురు, మాంసాలతో బురదగా ఉన్న ఆ మహాయుద్ధ భూమిలో ఆ రెండు రథాలు సంఘర్షించసాగాయి.

అక్కడ సోమకులు ముందుకువచ్చి అర్జునునితో ఇలా అన్నారు – "అర్జునా! కర్ణుని చంపు. అతని తలను, దుర్యోధనుని రాజ్యాశను ఖండించు. జాగు చేయవద్దు. అలాగే మన యోధులు చాలామంది కర్ణునితో ఇలా అన్నారు. "కర్ణా! ముందుకురుకు, ముందుకురుకు. తీక్ష్ణ బాణాలతో అర్జునుని చంపు. పాండవులు మరల దీర్ఘకాలం అరణ్యాలకు వెళ్ళాలి". ఆపై ముందుగా కర్ణుడు అర్జునుని పది గొప్పబాణాలతో గాయపరిచాడు. అర్జునుడు నవ్వుతూ పదునైన మొనలుగల పదిబాణాలతో, కర్ణుని చంకలో గాయం చేశాడు. కర్ణార్జునులు మంచిరెక్కలు గల బాణాలతో ఒకరినొకరు చెరుగుకొన్నారు. ఉల్లాసంగా ఆ పోరాటంలో పరస్పరం గాయపరచుకొన్నారు. భీకరంగా పరాక్రమిస్తున్నారు.

ఆపై ఉగ్రధానుష్కుడైన అర్జునుడు రెండు భుజాలను, గాండీవాన్ని సవరించుకొని నారాచాలను, నాళీకాలను, వరాహకర్ణాలను, క్షురాలను అంజలికాలను, అర్ధచంద్రబాణాలను ప్రయోగించారు. ఆ పార్థుని బాణాలు కర్ణరథాన్ని ప్రవేశించి అంతటా ఆవరిస్తున్నాయి. అది సంధ్యాకాలంలో పక్షి సమూహాలు తలలు క్రిందకు వాల్చి, వేగంగా రాత్రిబసకై చెట్టుమీదకు వ్రాలినట్టుంది. రాజా! బొమముడి వేసి చూస్తూ శత్రుజేత అయిన కర్ణునిపై ప్రయోగించిన బాణాలను, కర్ణుడు తన బాణాలతో, విడిచిన బాణాలను విడిచినట్లుగా కబళించివేస్తున్నాడు. ఆపై ఇంద్రసుతుడైన అర్జునుడు శత్రుసాధకమైన ఆగ్నేయాస్త్రాన్ని కర్ణునిపై ప్రయోగించాడు. ఆ ఆగ్నేయాస్త్రం భూమ్యాకాశాలలో, సూర్యమార్గాన్ని ఆవరించి, అక్కడ ప్రజ్వలిస్తోంది. యోధుల వస్త్రాలు బాగా అంటుకొన్నాయి. తగులబడిన వస్త్రాలతో వారు రణభూమి నుండి పారిపోసాగారు. వెదురుతోట తగులబడుతున్నట్లు, అక్కడ భీకరధ్వని చెలరేగింది. ఎగిసిమండుతున్న ఆ ఆగ్నేయాస్త్రాన్ని చూసి కర్ణుడు దానిని ఉపశమింపజేయటానికి రణరంగంలో వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు. దానితో ఆ నిప్పు

చల్లారింది. మేఘసమూహం వేగంగా సర్వదిక్కులనూ చీకటితో కప్పివేసింది. దిగంతాలు పర్వతాలవలె కనిపిస్తున్నాయి. ఆ చోటంతా నీటితో నిండిపోయింది. ఆ మేఘాలు ముందుచెప్పినట్లు అతిప్రచండంగా ఉన్న ఆ అగ్నిని శమింపజేశాయి. ఆపై మరల ఆ మేఘాలు దిగంతాలలో, ఆకాశంలో వ్యాపించాయి. ఆ రీతిగా సర్వదిక్కులు మేఘాలు, చీకటి క్రిప్పి ఏమీ కనిపించటం లేదు. అప్పుడు కర్ణుని బాణం నుండి వెలువడుతున్న ఆ మేఘసమూహాల నన్నింటినీ వాయవాయస్త్రంతో పాగొట్టాడు అర్జునుడు. ఆపై శత్రువులకు అప్రధృష్యుడైన ధనంజయుడు గాండీవాన్ని, అల్లెత్రాటిని, బాణాలను అనుమంత్రించి ఇంద్రునకు ఇష్టమై, ప్రభావసంపన్నమైన వజ్రాస్త్రాన్ని ప్రయోగించాడు. తీక్ష్ణమైన క్షురాలు, ప్రాంజలికాలు, అర్ధచంద్రబాణాలు, నాళీకాలు, నారాచాలు, వరాహకర్ణాలు వేలకొలదిగ గాండీవం నుండి వజ్రసమాన వేగంతో వెలువడ్డాయి. మంచి పదును, గ్రద్దరెక్కలు, తీవ్రవేగం, మహాప్రభావం గల ఆ బాణాలు కర్ణుని సమీపించి అతని శరీరావయవాలపై, గుర్రాలపై, ధనుస్సుపై, రథంకాడిపై, చక్రాలపై, ధ్వజంపై నాటుకొన్నాయి. మరీ తీక్ష్ణమైన ఆ బాణాలు వాటినన్నింటినీ చీల్చి, గరుడునకు భయపడిన పాములు నేలచొచ్చినట్లు వాటికి గ్రుచ్చుకొన్నాయి. బాణాలు శరీరానికి గ్రుచ్చుకొని, శరీరమంతా నెత్తుటితో తడవగా అప్పుడు కర్ణుడు కోపంతో కళ్ళు త్రిప్పాడు.

కర్ణుడు గట్టి అల్లెత్రాడు గల తన ధనుస్సును వంచి, సముద్రఘోషవలె గర్జించే భార్గవాస్త్రాన్ని ప్రయోగించాడు. దానితో కర్ణుడు వజ్రాస్త్రం నుండి వెలువడిన అర్జున బాణ సమూహాలను ముక్కలు చేశాడు. అర్జునుని అస్త్రాన్ని తన అస్త్రంతో నిర్వీర్యం చేసి, కర్ణుడు రణభూమిలో రథాలను, ఏనుగులను, కాల్బలాన్ని సంహరించాడు. అసహనశీలుడైన కర్ణుడు భార్గవాస్త్ర ప్రతాపంతో, మహాసంగ్రామంలో ఇంద్ర పరాక్రమాన్ని ప్రదర్శించసాగాడు. క్రోధానికి లోనయి, వేగశాలి అయిన కర్ణుడు రణభూమిలో బంగారు రెక్కలు గలిగి సానపెట్టబడిన బాణాలను, బలపూర్వకంగా, చక్కగా ప్రయోగించి పంచాలురలోని ముఖ్యయోధులను కూడా గాయపరిచాడు. రాజా! ఆ పంచాలురు, సోమకులు రణభూమిలో కర్ణుని బాణసమూహాల పీడనకు గురి అయి, క్రోధానికి లోనయి, అందరూ కలిసి తీక్ష్ణ బాణాలతో అతనిని అన్నివైపుల నుండి గాయపరిచారు. వారినీ, ఆ పంచాలుర రథాలను, ఏనుగులను, గుర్రాల సమూహాలను కర్ణుడు బాణాలతో కొట్టాడు. తన బాణసమూహాలతో వారిని బలపూర్వకంగా, ఉల్లాసంగా కర్ణుడు గాయపరిచాడు. కర్ణబాణాలతో వారి శరీరాలు శిథిలంకాగా ఆర్తనాదాలు చేస్తూ, ప్రాణాలు కోల్పోయి నేలగూలారు.

మహారణ్యంలో భీమబలం గల సింహం కోపంతో ఏనుగుల గుంపును నేలగూల్చినట్లుంది. రాజా! ఆపై పంచాలురలో ముఖ్యులైన యోధుల నందరినీ బలపూర్వకంగా చంపి, అదీనుడైన ఆ కర్ణుడు, తీక్ష్ణకిరణాలు గల సూర్యుడు ఆకాశంలో ప్రకాశించినట్లు, రణభూమిలో ప్రకాశించాడు.

కౌరవేంద్రా! కర్ణుడు గెలిచాడని భావించి నీవారు పరమానందాన్ని పొంది, సింహనాదాలు చేశారు. కర్ణుని చేతిలో కృష్ణార్జునులు తీవ్రంగా దెబ్బతిన్నారని అందరూ అనుకొన్నారు. మహారథుడైన కర్ణుని శత్రుదుస్సహమైన ఆ పరాక్రమాన్ని చూసి, అర్జునుని ఆ అస్త్రాన్ని రణభూమిలో కర్ణుడు పడగొట్టడాన్ని గమనించి, భీముడు అసహనంతో కోపంతో కళ్ళుమండుతుండగా చేతితో చేతిని పీడించసాగాడు. క్రోధంతో, అసహనంతో, నిట్టూర్పులు విడుస్తూ, సత్యసంధుడైన అర్జునునితో భీముడిలా అన్నాడు. "అర్జునా! ఈ రోజు రణరంగంలో ధర్మానికి దూరమై, పాపాత్ముడైన ఈ సూతసుతుడు నీ సమక్షంలోనే బలపూర్వకంగా పాంచాలయోధముఖ్యులను అనేకులను ఎలా చంపగలిగాడు? అర్జునా! నిన్ను గతంలో దేవతలు కూడా గెలవలేకపోయారు. కాలకేయులు నిన్ను ఓడించలేకపోయారు. సాక్షాత్తు పరమేశ్వరుని బాహువులతో కలబడినవాడవు. అటువంటి నిన్ను ఈ కర్ణుడు పదిబాణాలతో ముందే ఎలా కొట్టగలిగాడు? నీవు ప్రయోగించిన బాణసమూహాలను కర్ణుడు కబళించాడు. ఈరోజు ఇది నాకు ఆశ్చర్యమనిపిస్తోంది. ద్రౌపది పడిన కష్టాలను నీవు తలచుకో! పాపమతి అయిన ఈ కర్ణుడు మనలను తీక్ష్ణంగా, కటువుగా, నిర్భయంగా, నపుంసకులని నిందించిన మాటను గుర్తుతెచ్చుకో! అర్జునా! అదంతా స్మరించి ఇక్కడ పాపాత్ముడైన ఈ కర్ణుని యుద్ధంలో చంపు! కిరీటీ! ఉపేక్షిస్తున్నావెందుకు? ఇది ఉపేక్షింపదగిన కాలం కాదు. ఖాండవవనాన్ని అగ్నికి ఆహారంగా కల్పిస్తూ, ఏ ధైర్యంతో సర్వభూతాలను జయించావో, ఆ ధైర్యంతో సూతపుత్రుని చంపు. లేదా నేను ఇతనిని గదతో సంహరిస్తాను"?

అప్పుడు కృష్ణుడు కూడా, అర్జున రథం నుండి వెలువడిన బాణాలు నిర్వీర్యమై పోవటాన్ని చూసి, అతనితో ఇలా అన్నాడు. "అర్జునా! ఏమిటిది? నీవు ఎన్ని అస్త్రాలు ప్రయోగించినా కర్ణుడు తన అస్త్రాలతో నీ అస్త్రాలను భంగపరుస్తున్నాడు. వీరా! మోహానికి లోనయ్యావా? ఆనందంతో కౌరవులు సింహనాదాలు చేస్తున్నారు. గమనించలేదా? నీ అస్త్రాలను తన అస్త్రాలతో నష్టపరచగలుగుతున్నాడని కర్ణుని గురించి అందరూ అర్థంచేసికొంటున్నారు. ఏ ధైర్యంతో ప్రతియుగంలోనూ ఘోరరాక్షసులను, వారి తామసాస్త్రాన్ని భంగపరచారో, యుద్ధంలో దంభోద్భవులనే రాక్షసులను చంపావో ఆ ధైర్యంతో ఈరోజు

కర్ణుని చంపు! ఇదిగో! నేను సుదర్శనచక్రాన్ని ఇస్తున్నాను. దీనికి ఇరుసుగా క్షురాలున్నాయి. వాటితో బలపూర్వకంగా, వజ్రంతో ఇంద్రుడు తనశత్రువైన నముచిని చంపినట్లు, కర్ణుని తలను ఖండించు. మహాత్ముడైన పరమేశ్వరుడు కిరాత రూపంలోనుండి నీ ధైర్యాన్ని చూసి ఆనందించాడు. వీరుడా! నీవు ఆ ధైర్యాన్నే అనుసరించి తనవారితో సహా 'కర్ణుని చంపు'! పార్థా! ఆ తరువాత పట్టణ గ్రామ సమృద్ధమై, సాగరమేఖల అయిన ఈ భూమిని, శత్రుసమూహాన్ని సంహరించి - ధర్మరాజుకు అందించు. సాటిలేని కీర్తిని పొందు".

భీమకృష్ణులు అలా చెప్పగానే బలశాలి, మహాత్ముడైన, అర్జునుడు కర్ణుని సంహరించటాన్ని గూర్చి ఆలోచించాడు. స్వస్వరూపాన్ని స్మరించి, అన్ని మాటలను పరిశీలించి, తానక్కడకు రావటానికి గల ప్రయోజనాన్ని గుర్తించి కృష్ణునితో ఇలా అన్నాడు. 'లోకకళ్యాణం కోసం, కర్ణవధకోసం భీకరమైన ఒక మహాస్త్రాన్ని ప్రకటించబోతున్నాను. నీవు, దేవతలు, బ్రహ్మ, మహేశుడు, వేదవేత్తలు - అందరూ దీనికి అనుమతించాలి.' కృష్ణునితో అలా పలికి, అమితాత్ముడైన సవ్యసాచి బ్రహ్మకు నమస్కరించి, మనోవిధేయమైన బ్రహ్మాస్త్రాన్ని ప్రాదుర్భవింపజేశాడు. అదిగొప్ప అస్త్రం. అందరూ భరించలేనిది. కర్ణుడు మేఘం జలధారలను కురిపించినట్లు, బాణాలను కురిపించి అర్జునుని బ్రహ్మాస్త్రాన్ని భంగపరిచి విరాజిల్లాడు. కర్ణుడు రణమధ్యంలో అర్జునుని ఆ బ్రహ్మాస్త్రాన్ని భంగపరచటం చూసి, బలవంతుడు, అసహనశీలుడు అయిన భీముడు క్రోధంతో మండిపడుతూ సత్యసంధుడైన అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! నీవు పరమవిధేయమైన మహాస్త్రాన్ని - బ్రహ్మాస్త్రాన్ని తెలిసినవాడవని జనులందరికీ తెలుసు. కాబట్టి మరొక అస్త్రాన్ని ప్రయోగించు". భీముడలా చెప్పగానే, మహాతేజస్వి అయిన అర్జునుడు విషసర్పాలవలె భయంకరమై, సూర్యకిరణాలవలె ప్రజ్వలించే బాణాలను గాండీవం నుండి వెలువరించి, సర్వదిక్కులనూ, మూలాలనూ వాటితో నింపివేశాడు. భరతశ్రేష్ఠుడైన అర్జునుడు బంగారురెక్కలు గల పదివేల బాణాలను ప్రయోగించాడు. అవి ప్రళయకాలంలోని అగ్నివలె, సూర్యకిరణాలవలె ప్రకాశిస్తూ, కర్ణరథాన్ని క్షణంలో కప్పివేశాయి. ఆ దివ్యాస్త్రం నుండి శూలాలు, గొడ్డళ్ళు, చక్రాలు, వందలకొలది నారాచాలు వెలువడసాగాయి. అవి అన్నివైపుల యోధులను సంహరింపసాగాయి.

ఎవరో ఒక శత్రువు తల తెగి రణరంగంలో నేలగూలింది. అది చూసి భయంతో వాడు కూడా నేలపై పడిపోయాడు. అతడిని చూసి, మరొకడు అక్కడ నుండి కనిపించకుండా పోయాడు. మరొక యోధుని బాహువు నరకబడి, ఏనుగుతొండం వలె

కత్తితోపాటు క్రిందపడింది. మరియొకని సవ్యభుజం క్షురం దెబ్బకు తెగి, కవచంతోపాటు నేలబడింది. ఈ రీతిగా అర్జునుడు శ్రేష్ఠయోధుల నందరినీ ధ్వంసం చేశాడు. అర్జునుడు శరీరాన్ని అంతం చేయగల ఘోరబాణాలతో దుర్యోధన సేననంతటినీ ధ్వంసం చేశాడు. కర్ణుడు కూడా రణమధ్యంలో వేలకొలదిగ బాణాలను కురిపించాడు. అవి మేఘం విడిచిన జలధారలవలె ఘోషపెడుతూ అర్జునుని మీదకు వచ్చాయి. ఆపై కర్ణుడు కృష్ణుని, అర్జునుని, భీముని మూడు మూడు బాణాలతో కొట్టి పెద్దఎలుగుతో భయంకరంగా గర్జించాడు. కర్ణుని బాణాల దెబ్బతిన్న ఆ అర్జునుడు ఆ స్థితిలో ఉన్న కృష్ణుని, భీముని చూసి అసహనంతో మరల పద్దెనిమిది బాణాలను అమ్ములపొది నుండి తీశాడు. అర్జునుడు ఒక బాణంతో ధ్వజాన్ని చీల్చి, నాలుగింటితో శల్యుని, మూడింటితో కర్ణుని గాయపరిచి ఆపై బంగారుకవచాన్ని ధరించియున్న సభాపతిని పదిబాణాలతో చంపివేశాడు. ఆ రాజకుమారుడు - సభాపతి తలను, చేతులను, గుర్రాలను, సారథిని, ధనుస్సును, ధ్వజాన్నీ కోలుపోయి చచ్చి గొడ్డళ్ళతో నరికిన శాలవృక్షం విరిగిపడినట్టు రథం ముందు భాగం నుండి పడిపోయాడు. అర్జునుడు మరల మూడింటితో, ఎనిమిదింటితో, రెండింటితో, నాలుగింటితో, పదింటితో కర్ణుని గాయపరిచి ఆయుధాలతోనున్న నాలుగువందల ఏనుగులను చంపి, ఎనిమిది వందల రథాలను భగ్నం చేశాడు. ఆపై ఆశ్వికులతోపాటు వేలకొలది గుర్రాలను, కాల్బలంలోని ఎనిమిది వేలమంది వీరులను చంపి, వేగశాలులయిన బాణాలతో సారథి, రథ, కేతువులతోపాటు కర్ణుని అదృశ్యుని చేశాడు.

ఆపై అర్జునునిచే సంహరింపబడుతున్న కౌరవులు అన్నిదిక్కుల నుండి ఆక్రోశిస్తూ కర్ణునితో ఇలా అన్నారు. "కర్ణా! బాణాలు విడు. వెంటనే అర్జునుని గాయపరచు. ఇంతలోనే కౌరవులనందరినీ బాణాలతో హింసిస్తున్నారు." అలా వారిచే ప్రేరేపించబడిన కర్ణుడు సర్వప్రయత్నంతో, అనేక బాణాలను ఆపకుండా విడిచాడు. నెత్తురు దుమ్ము అంటుకొన్న ఆ బాణాలు పాండవ పాంచాలుర మర్మస్థానాలను ఛేదిస్తూ, వారిని పీడించాయి. ఆ కర్ణార్జునులు ఇద్దరూ విలుకాండ్రందరికంటే శ్రేష్ఠులు, మహాబలులు, సర్వశత్రువులనూ సహించగలవారు. అస్త్రవిద్యావేత్తలు, వారు మహాస్త్రాలతో, పరస్పరం భీకరమైన శత్రుసేనను సంహరించసాగారు.

ఆపై మంత్రాలతో, ఓషధులతో, మిత్రులచే, మేటి వైద్యులచే గాయాలు మాన్పబడి, విశల్యుడై, బంగారు కవచాన్ని ధరించి, యుధిష్ఠిరుడు కర్ణార్జున యుద్ధం చూడాలని వేగంగా అక్కడకు వచ్చాడు. అలా రణభూమికి వచ్చిన ధర్మరాజును చూసి

సర్వప్రాణులు ఆనందంతో అభినందించాయి. రాహువుచే పూర్తిగా విడువబడిన నిర్మలచంద్రుడు ఉదయించినట్లుంది ధర్మజునిరాక. పరస్పరం పోరాడుతున్న, శత్రునాశకులు, శూరవరులు అయిన ఆ కర్ణార్జునులను చూసి, వారిపై దృష్టి నిలిపి, గగనసీమలో, భూతలంపై నున్న జనులంతా స్థిరంగా నిలిచారు. అక్కడ కర్ణార్జునులు గొప్ప అమ్ములతో పరస్పరం గాయపరచుకొంటున్నారు. వారి ధనుస్సుల, అల్లెత్రాళ్ళ, కరతలాల ఘర్షణ భయంకరంగా ఉంది. వాటినుండి బాణాలు చక్కగా వెలువడుతున్నాయి. ఆ తరువాత అర్జునుడు తన అల్లెత్రాటిని బాగా లాగటం వలన అది హఠాత్తుగా తెగిపోయింది. అదే అదనుగా భావించి కర్ణుడు వందబాణాలను అర్జునునిపై ప్రయోగించాడు. నూనెతో తోమబడి, పక్షిరెక్కలు అమర్చబడి కుబుసం విడిచిన పాములవలె ఉన్న అరవై బాణాలతో నిరంతరాయంగా వాసుదేవుని, ఆపై ఎనిమిది బాణాలతో అర్జునుని కర్ణుడు నుగ్గునుగ్గు చేశాడు. సూర్యసుతుడైన కర్ణుడు భీముని పదివేల గొప్ప బాణాలతో మర్మస్థానాలలో కొట్టాడు. కృష్ణుని, అర్జునుని, ధ్వజాన్ని, అర్జునుని తమ్ములను, సోమకులను, కూడా పడగొట్టే ప్రయత్నం చేశాడు. మేఘసమూహాలు ఆకాశంలో సూర్యుని కప్పివేసినట్లు, వారందరూ కర్ణుని మంచి మొనగల బాణాలతో ఆచ్ఛాదించారు. నిపుణుడైన కర్ణుడు తన మీదకు వస్తున్న ఆ బాణాలను అనేక శరాలతో నిరోధించాడు. వారు విడిచిన అస్త్రాలనన్నింటిని ఖండించి, వారి రథాలను, గుర్రాలను, ఏనుగులను కొట్టాడు కర్ణుడు. రాజా! అలాగే వారిసేనలోని ప్రముఖులనందరినీ బాణాలతో పీడించాడు.

భయంకర బలశాలి అయిన సింహం కోపంతో పెద్దకుక్కల గుంపును పడగొట్టినట్టు, కర్ణుని బాణాలచే శరీరాలు చీల్చబడగా వారంతా నేలపైబడి, మూలుగుతూ ప్రాణాలు విడిచారు. మరల మరికొంతమంది పాంచాలప్రముఖులు కర్ణార్జునుల మధ్యకు వచ్చారు. కానీ బలశాలి అయిన కర్ణుడు చక్కగా విడిచిన బాణాలతో, బలపూర్వకంగా వారిని సంహరించాడు. నీ సేనలు గెలిచినట్లే భావించుకొని చప్పట్లు కొట్టారు. సింహనాదాలు చేశారు. ఆ సంగ్రామంలో కృష్ణార్జునులను కర్ణుడు లొంగదీసినట్లే వారు అనుకొన్నారు. ఆపై కర్ణుని బాణాలతో శరీరం గాయపడగా, తీవ్రకోపంతో అర్జునుడు అల్లెత్రాటిని బాగా వంచి, కర్ణుడు ప్రయోగించిన బాణాలను వేగంగా ఖండించి, రణభూమిలో కౌరవులను నిరోధించాడు. అల్లెత్రాటిని తుడిచి, అర్జునుడు కర్ణుని చేతి తొడుగుల మీద కొట్టాడు. వెంటనే బాణాలతో అంధకారాన్ని కల్పించాడు. కర్ణుని, శల్యుని, కౌరవుల నందరినీ బాణాలతో తీవ్రంగా గాయపరిచాడు. అప్పుడు మహాస్త్రం చీకట్లను కల్పించగానే ఆకాశంలో

పక్షుల సంచారం ఆగిపోయింది. అప్పుడు ఆకాశంలోనున్న ప్రాణిసమూహాల ప్రేరణతో, గాలి దివ్యపరిమళంతో వీచసాగింది. అర్జునుడు నవ్వుతూ పదిబాణాలతో శల్యుని చేతితొడుగుమీద తీవ్రంగా గాయం చేశాడు. ఆపై చక్కగా విడిచిన పన్నెండు బాణాలతో కర్ణుని గాయపరిచి, మరల ఏడు బాణాలతో చీల్చివేశాడు.

అర్జునుని ధనుస్సు నుండి వేగంగా విడువబడిన వేగశాలులయిన ఆ బాణాలచే తీవ్రంగా గాయపడి, శరీరం బ్రద్దలై, నెత్తురోడుతూ కర్ణుడు, నెత్తుటితో తడిసి బాణాలచే ఆవరింపబడిన శరీరంతో రౌద్ర ముహూర్తంలో శ్మశానమధ్యంలో క్రీడిస్తున్న రుద్రునివలె ప్రకాశించాడు. ఆపై దేవేంద్రుని వంటి అర్జునుని, కర్ణుడు మూడు బాణాలతో బ్రద్దలు చేశాడు. అచ్యుతుని చంపదలచి విషంక్రక్కుతున్న పాములవలె నున్న అయిదుబాణాలను ఆయన శరీరానికి నాటుకొనేటట్లు విడిచాడు. సువర్ణాలంకారాలు గల ఆ బాణాలు కర్ణుడు చక్కగా ప్రయోగించినందువలన కృష్ణుని కవచాన్ని చీల్చి, వేగంగా నేలలోనికి చొచ్చుకొనిపోయాయి. తీవ్రవేగం గల అవి పాతాళ గంగలో స్నానంచేసి మరల కర్ణుని వైపు వెళ్ళసాగాయి. అవి బాణాలు కాదు. తక్షక పుత్రుడైన అశ్వసేనుని పక్షానికి చెందిన అయిదు పెద్దపాములు. అర్జునుడు చక్కగా విడిచిన పది భల్లాలతో, అవి ఒక్కొక్కటి మూడు మూడు ముక్కలయ్యాయి. అవి అర్జునాస్త్రాలతో మరణించి నేలగూలాయి. కర్ణుని చేతులనుండి వెలువడిన ఆ బాణాలు కృష్ణుని శరీరాన్ని గాయపరచటం చూసి, అర్జునుడు చెత్తను తగులబెడుతున్న అగ్నివలె క్రోధంతో మండిపడ్డాడు. ఆ అర్జునుడు ప్రజ్వలించే చెవిదాకా లాగి బాణాలు విడిచాడు. అవి ప్రాణాంతకాలు. అవి కర్ణుని మర్మస్థానాలలో గాయపరిచాయి. దానితో కర్ణుడు బాధతో కంపించిపోయాడు. కాని అదృష్టం కొద్దీ ధైర్యబుద్ధితో నిలిచాడు. రాజా! ఆపై అర్జునుడు కోపించగా, బాణ సమూహాలచే దిక్కులు, మూలలు, సూర్యకాంతి, కర్ణుడు కూడా మంచుకప్పిన ఆకాశం వలె కనిపించకుండా పోయారు. రాజా! కురుకుల శ్రేష్ఠుడు, ఏకవీరుడు, శత్రునాశకుడు అయిన అర్జునుడు కర్ణుని చక్రరక్షకులను, పాదరక్షకులను ముందు నడిచేవారినీ, వెనుక కాపాడేవారినీ అందరినీ క్షణకాలంలో రథాలతో, గుర్రాలతో, సారథులతో సహా నశింపజేశాడు. వారంతా దుర్యోధనుని ఆదేశంమేరకు నడిచేవారు. ఎప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉండేవారు. లెక్కకు వారు రెండువేలమంది. ఆపై చావగా మిగిలిన నీకుమారులు, కౌరవసేనలు కర్ణుని వీడి, చనిపోయిన వారినీ, బాణాలతో గాయపడినవారినీ, రక్షణకై పిలుస్తున్న పుత్రులనూ, తండ్రులను కూడా కాదని అక్కడనుండి పారిపోయారు.

అర్జునుని బాణాలచే తపింపజేయబడిన కౌరవులందరూ శిథిలశరీరులై కనిపించకుండా పారిపోయారు. ఆపై సుయోధనుడు వారిలో శ్రేష్ఠులను కర్ణుని అనుసరించమని మరలా ఆదేశించాడు. దుర్యోధనుడిలా అన్నాడు "క్షత్రియులారా! మీరంతా గొప్ప శూరులు. క్షాత్రధర్మతత్పరులు. కర్ణుని ఇక్కడవీడి, అతని నుండి పారిపోవటం మీకు తగినది కాదు". సంజయుడిలా చెప్తున్నాడు. "అర్జునుని బాణాలద్వారా తీవ్రతాపానికి గురి అయినవారు నీకుమారుడలా ఆదేశించినా కూడా నిలవలేదు. క్షణకాలంలోనే భయంతో పారిపోయి, దిక్కులకు మూలలకూ పోయి దాక్కొన్నారు. భారతా! భయంతో పారిపోయిన కౌరవుల లేమివలన పూర్తిగా శూన్యమైన దిక్కులు కలయజూచి కూడా కర్ణుడు వ్యధ చెందలేదు. ఉత్సాహంతోనే అర్జునునిపై దాడిచేశాడు."

90. కర్ణుని రథచక్రము క్రుంగిపోవుట

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆపై అలా పారిపోయిన కౌరవులు బాణం పడేంత దూరంలో నిలిచారు. వారిసేనలన్నీ చెదరిపోయాయి. తీవ్రవేగంగా ముందుకురుకుతున్న అర్జునాస్త్రం మెరుపువలె అన్నిదిక్కులా ప్రకాశించటం వారు చూశారు. ఆ మహాసంగ్రామంలో అర్జునుడు కోపించి, కర్ణవధకై తీవ్రవేగంతో ప్రయోగించిన అస్త్రాన్ని కర్ణుడు మరీ భీకరమైన తన బాణాలతో ఆకాశంలోనే కబళించాడు (ఖండించాడు). కర్ణుని విల్లు అమోఘమైనది. అతని వింటి అల్లెత్రాడు గట్టిది. ఆ వింటిని లాగి కర్ణుడు శరవృష్టిని కురిపించసాగాడు. కౌరవులను దహిస్తున్న అర్జునాస్త్రాన్ని, కర్ణుడు బంగారురెక్కలు గల బాణాలతో మట్టిలో గలిపాడు. కర్ణుడు తాను పరశురాముని దగ్గరనుండి పొందిన మహామహిమ గల ఆధర్వణాస్త్ర ప్రభావంతో పదునైన బాణాలతో అర్జునుడు ప్రయోగించిన ఆ అస్త్రాన్ని భగ్నంచేశాడు. రాజా! ఆపై అక్కడ దంతాఘాతాలతో రౌద్రంగా పోరాడుతున్న రెండు ఏనుగుల మధ్యవలె బాణాలతో ఒకరినొకరు శిథిలం చేసికొంటున్న కర్ణార్జునుల మధ్య మహాసంగ్రామం జరిగింది. రాజా! అక్కడ అప్పుడు అస్త్రసమూహాలచే ఆచ్ఛాదితమై రణభూమి అంతా భయంకరమైంది. ఆ కర్ణార్జునులు శరవృష్టులతో, ఆకాశంలో సందులేకుండా నింపివేశారు. ఆపై కౌరవులు, సోమకులు అందరూ అక్కడవ్యాపించిన విశాలమైన బాణాల వలను చూశారు. బాణాలచే భీకరమైన అంధకారం ఏర్పడగా అప్పుడు వారు మరే ప్రాణినీ చూడలేకపోయారు.

రాజా! విలుకాండ్రందరిలో శ్రేష్ఠులు, పురుషశ్రేష్ఠులు ఆయిన ఆ కర్ణార్జునులు ఆ భయానక యుద్ధంలో శరీరమోహాన్ని వీడి తీవ్రంగా శ్రమించసాగారు. ఇద్దరూ శత్రువులకు అలవికానివారే. యుద్ధతత్పరులై ఒకరి లోపాలపై మరొకరు దృష్టిని నిలిపి పోరాడుతున్న వారిని చూసి దేవతలు, ఋషులు, గంధర్వ సమూహాలు, యక్షులు, పితృదేవతలు ఆనందంగా వారిని ప్రశంసించసాగారు.

రాజా! ఆ విలుకాండ్రిద్దరూ నిరంతరంగా అనేక బాణాలను ఎక్కుపెడుతూ, విడుస్తూ రణభూమిలో వారు నేర్పు వహించిన వివిధ విచిత్ర మార్గాలను ప్రదర్శించసాగారు. రణమధ్యంలో అలా పోరాడుతున్న ఆ ఇద్దరిలో పరాక్రమంలో, అస్త్రప్రయోగంలో మాయా బలంలో, పౌరుషంలో ఒకసారి కర్ణుడు మిన్నగా కనబడుతున్నాడు. మరొకసారి అర్జునుడు మిగులుగా కనిపిస్తున్నాడు. ఒకరినొకరు దెబ్బతీయాలని అవకాశం కోసం ఎదురుచూస్తూ, ఆ ఇద్దరువీరులు పరస్పరం దుస్సహంగా పోరాడుతుంటే రణరంగంలోనున్న యోధులందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. రాజా! ఆపై ఆకాశంలోనున్న ప్రాణులన్నీ కర్ణార్జునులను ప్రశంసించసాగాయి. "కర్ణా! భళా! అర్జునా! భళా" అన్న మాటలు ఆకాశంలో అన్ని వైపులనుండీ వినిపించసాగాయి.

రాజా! ఆ ఘోరసంగ్రామంలో రథాలు, గుర్రాలు, ఏనుగులతో భూతలమంతా బ్రద్దలవుతుండగా, కర్ణార్జునుల యుద్ధాన్ని చూసి, పాతాలతలంలో శయనించియున్న అశ్వసేనుడు (నాగుపాము) వేగంగా భూమిమీదకు వచ్చాడు. ఆ అశ్వసేనుడికి అర్జునునితో శత్రుత్వముంది. ఖాండవవన దహన సమయంలో తప్పించుకొని నేలలో దాక్కొన్న వాడతడు. ఊర్ధ్వగమనశక్తి గలవాడు. రాజా! "దురాత్ముడైన అర్జునునిపై పగతీర్చుకొనటానికి ఇదే తగిన సమయం" అని ఆలోచించి ఆ అశ్వసేనుడు, బాణరూపాన్ని ధరించి కర్ణుని అమ్ములపొదిలో ప్రవేశించాడు. ఆపై అప్పుడు అస్త్రసమూహాలచే ఆచ్ఛాదితమై, రణభూమి అంతా కిరణాలవలె కప్పినట్లయింది. ఆ కర్ణార్జునులు శరవృష్టులతో ఆకాశంలో సందులేకుండా చేశారు. ఆ బాణమహాజాలాన్ని చూసి కౌరవులు, సోమకులు అందరూ భయపడ్డారు. అత్యంతఘోరమైన ఆ బాణాంధకారంలో ఏది పడుతున్నా కనిపించటం లేదు. ఆ కర్ణార్జునులు ప్రాణాలపై మోహాన్ని వీడి రణభూమిలో పోరాడుతూ అలసిపోయారు. అప్పుడు ఆకాశంలో నిలిచి యున్న అప్సరలు దివ్యమైన చామరాలతో వీస్తూ చందనజలాన్ని వారిపై చల్లారు. ఆపై ఇంద్రుడు, సూర్యుడు తమ కరకమలాలతో వారి ముఖాలను తుడిచాడు. ఆపై కర్ణుడు అర్జునుని మించలేకపోయాడు. అర్జునుడు కర్ణుని బాణాలతో తీవ్రంగా ఇబ్బందిపెట్టాడు. బాణాలతో శరీరమంతా తూట్లుపడగా వీరుడైన ఆ కర్ణుడు సర్పముఖబాణాన్ని ప్రయోగించాలని తలచాడు. ఆపై కర్ణుడు అర్జునుని చంపాలని తాను ఎప్పటినుండియో దాచిన బాణాన్ని చెవిదాకా లాగి, అర్జునునివైపు అనుసంధించాడు. కర్ణుడు ఆ బాణాన్ని బంగారు అమ్ములపొదిలో ఎప్పుడూ చందనపు పొడిపై ఉంచి పూజించేవాడు. ఆ సర్పముఖబాణం శత్రునాశకం. చక్కని వంపులు, స్వచ్ఛత, మహాతేజస్సు

మంచి తీర్పు కలిగి ప్రజ్వలిస్తున్న దది. అర్జునుని తలను అపహరించాలని కర్ణుడు ప్రయోగించగా ప్రజ్వలిస్తూ వస్తున్న ఆ బాణం ఐరావతవంశంలో జన్మించిన అశ్వసేనుడే. దానితో దిక్కులూ, ఆకాశం వెలుగొందాయి. వందల కొలదిగ భీకరంగా తోకచుక్కలు పడసాగాయి.

కర్ణుడు ఆ బాణాన్ని వింటిపై అనుసంధిస్తున్నప్పుడే ఇంద్రునితో సహా లోకపాలురు హాహాకారాలు చేశారు. యోగబలంతో అశ్వసేనుడే ఆ బాణంలో ప్రవేశించాడని కర్ణునకు కూడా తెలియదు. ఇంద్రుడు ఆ సర్పం బాణంలో ప్రవేశించటం చూసినప్పుడే "నా కుమారుడు చనిపోయినట్లే" అని భావించి సడలిపోయాడు. అప్పుడు బ్రహ్మ" బాధపడవద్దు. గెలుపు అర్జునునిదే" అని ఇంద్రునితో అన్నాడు. ఆపై కర్ణుడు ఆ ఉగ్రబాణాన్ని ప్రయోగించబోవటం చూసి, మహాత్ముడైన శల్యుడు "కర్ణా! ఇది శత్రువు మెడలో గ్రుచ్చుకోదు. పరిశీలించి మరలా సంధించు. శత్రువు తల తెగిపడాలి" అని కర్ణునితో అన్నాడు. అది విని కోపంతో కళ్ళెర్రజేసి, వేగశాలి అయిన కర్ణుడు "శల్యా! కర్ణుడెప్పుడూ బాణాన్ని రెండుసార్లు సంధించడు. నావంటివారు కపటత్వంతో పోరాడరు" అని శల్యునితో అన్నాడు. శల్యునితో అలా పలికి కర్ణుడు ఎన్నో సంవత్సరాల నుండి తాను పూజిస్తున్న ఆ బాణాన్ని ప్రయత్నపూర్వకంగా ప్రయోగించి "అర్జునా! చచ్చావు" అని అర్జునుని అధిక్షేపిస్తూ పెద్దగా, దర్పంగా పలికాడు. కర్ణుని బాహువులనుండి విడువబడి అగ్నివలె, సూర్యునివలె ఘోరమైన ఆ బాణం కర్ణుని ధనుస్సునుండి వెలువడి ఆల్లెత్రాటినుండి జారి ఆకాశం మీదకు ప్రజ్వలిస్తూ ఎగిసింది.

రణభూమిలో వేగంగా జ్వలిస్తూ వస్తున్న ఆ బాణాన్ని చూసి కృష్ణుడు విలాసంగా, వేగంగా తన రథాన్ని కాలితో కొద్దిగా నేలలోనికి అదిమాడు. బంగారు ఆవరణలు గలిగి చంద్ర కిరణాలవలె తెల్లనైన ఆ రథాశ్వాలు మోకాళ్ళపై నేలపై నిలిచాయి. అప్పుడు కృష్ణుని ప్రశంసిస్తూ ఆకాశంలో మహానినాదం చెలరేగింది. కృష్ణుని ప్రయత్నంతో ఆ రథం అలా నేలలో కొంచెం కూరుకోగానే దివ్యప్రశంసా వచనాలు సింహనాదాలు చెలరేగాయి. దివ్యపుష్పాలు కురిశాయి. ధీమంతుడైన అర్జునుని కిరీటం భూతల, గగనతల, అంతరిక్షపాతాళలోకాలలో ప్రసిద్ధి చెందింది. అది ఇంద్రుని కానుక. చాలా గట్టిది. కర్ణుడు ప్రయోగించిన ఆ బాణం ఆ కిరీటాన్ని ఢీకొన్నది. కర్ణుడు నాగాస్త్రాన్ని సృష్టించి, ఉత్తమ ప్రయత్నంతో, తీవ్రకోపంతో ప్రయోగించినా, అది అర్జునుని తలమీది కిరీటాన్ని పడగొట్టగలిగింది. ఆ కిరీటం సూర్యచంద్రాగ్నుల వంటి కాంతి గలది. బంగారం, ముత్యాలు,

మణులు, వజ్రాలతో అలంకరింపబడినది. ఆ కిరీటాన్ని జగత్ప్రభువైన బ్రహ్మ స్వయంగా తపస్సుతో, ప్రయత్నంతో ఇంద్రునికోసం నిర్మించింది. ఎంతో విలువైన రూపం గల ఆ కిరీటం శత్రుభయంకరం. దానిని ధరించేవారికి ఎంతో సుఖాన్ని, సుగంధాన్ని కల్పించగలది. దేవశత్రువులను చంపదలచిన సుమనస్కుడైన అర్జునునకు, ఇంద్రుడు దానిని స్వయంగా కానుక చేశాడు. దేవేశ్వరులైన శివుడు, వరుణుడు, ఇంద్రుడు, కుబేరుడు కూడా తమ పినాకంతో కానీ, పాశంతో కానీ, వజ్రాయుధంతో కానీ, బాణాలతో కానీ దానిని నాశనం చేయలేరు. అటువంటి కిరీటాన్ని బలపూర్వకంగా కర్ణుడు పడగొట్టగలిగాడు. మనస్సులో దురాలోచన, నిష్ఫలప్రతిజ్ఞ గల ఆ అశ్వసేనుడు స్వర్ణవిచిత్రమై, అద్భుతమైన ఆ అర్జునకిరీటాన్ని వేగంగా అపహరింపగలిగాడు. బంగారు జాలరులతో విశాలమై ధగధగ లాడుతున్న ఆ కిరీటం పెద్ద చప్పుడుతో నేలబడింది. ఎర్రని బింబంగల సూర్యుడు అస్తాద్రినుండి జారిపడినట్లు అర్జునునకు ప్రియమైన ఆ ఉత్తమకిరీటం కాంతులు వెదజల్లుతూ, విషాగ్నితో ప్రజ్వలిస్తూ నేలబడింది. చక్కని చివురులతో, పూలతో ప్రకాశించే చెట్లతో కూడిన గిరిశిఖరాన్ని ఇంద్రుని వజ్రం కూల్చినట్లు, బహురత్న భూషితమైన కిరీటాన్ని ఆ నాగాస్త్రం అర్జునుని తలమీద నుండి పడగొట్టింది.

భారతా! అప్పుడు భూమి, ఆకాశం, స్వర్గం, జలం – పెనుగాలికి కంపించి పెడుతున్న ఘోషవంటి శబ్దాన్ని లోకాలలోని జనులు అనుభవంలోనికి తెచ్చుకొని కలతపడి, ఉన్నచోటనే జారిపడ్డారు. యువకుడు, శ్యామలవర్ణుడు అయిన అర్జునుడు కిరీటం లేకపోయినా ఉన్నత శిఖరాలు గల నీలగిరివలె శోభించాడు. అప్పుడు అర్జునుడు తొట్రుపడకుండా తన తెల్లటి వస్త్రంతో జుట్టుముడివేసికొని యుద్ధానికి సిద్ధమయ్యాడు. తెల్లటివస్త్రంతో జుట్టును బంధించినందువలన శిఖరంపై సూర్యకాంతులు వ్యాపించిన ఉదయాద్రివలె భాసించాడు. అంశుమాలి అయిన సూర్యుని కొడుకు కర్ణుడు నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. అది ఆ అశ్వసేనుని తల్లి తానే బాణరూపాన్ని ధరించిన పుత్రుని రూపంలో వచ్చినట్టుంది. చక్షుఃశ్రవమూ, సుముఖి అయిన ఆ బాణం (ఆ నాగమాత) తేజస్సుతో, ప్రాణశక్తితో ప్రకాశిస్తున్న అర్జునుని తలను, గుర్రాల కళ్ళాల ఎత్తులోనే గురిపెట్టినందువల కిరీటాన్నే ఎగరగొట్టగలిగింది. ఆ కిరీటాన్ని బ్రహ్మ స్వయంగా, అందంగా ఇంద్రుని తలను అలంకరించింది. సూర్య సమానకాంతితో అది జగత్తును నింపుతుంది. ఆ సర్పాన్ని తన బాణాలతో మర్దించగల అర్జునుడు, మరల దాడిచేసే అవకాశం దానికి రానందువల్ల మృత్యువుకు లొంగలేదు. కర్ణుని చేతినుండి వెలువడిన ఆ బాణం అగ్నివలె, సూర్యునివలె

విలువైనది. తేజస్సు గలది. అర్జునునితో ముందే శత్రుత్వం వహించి ఆ బాణంలో ప్రవేశించిన మహాసర్పం అర్జునుని కిరీటాన్ని పడగొట్టి అక్కడనుండి వెళ్ళిపోయింది.

సువర్ణచిత్రమైన ఆ అర్జునుని కిరీటాన్ని లాగి, దహించి ఆ అశ్వసేనుడు మరల కర్ణుని అమ్ములపొదిలో దూరాలని ప్రయత్నించాడు. ఆ సమయంలో కర్ణుడు అతనిని చూశాడు. అప్పుడు అశ్వసేనుడు కర్ణునితో ఇలా అన్నాడు. 'కర్ణా! నీవు సరిగా ఆలోచించకుండా నన్ను విడిచావు. అందువలన నేను అర్జునుని శిరస్సును అపహరించలేకపోయాను. మరల చక్కగా అవగాహనకు వచ్చి, నన్ను రణభూమిలో వెంటనే ప్రయోగించు. నీకు, నాకు శత్రువైన అర్జునుని చంపగలను. రణభూమిలో అశ్వసేనుడు అలా చెప్పగా కర్ణుడు "ఇంత భయంకర రూపంగల నీవెవడవు"? అని ప్రశ్నించాడు. అప్పుడు అశ్వసేనుడిలా అన్నాడు. "అర్జునుడు నాకు కీడు చేశాడు. నాతల్లిని అర్జునుడు చంపాడు. దానితో అతనితో నాకు వైరమేర్పడింది. దేవేంద్రుడే స్వయంగా వచ్చి అతనికి రక్షకుడైనా, అర్జునుడు యమసదనానికి వెళ్ళి తీరుతాడు". కర్ణుడిలా అన్నాడు. "నాగా! కర్ణుడు ఈ రణభూమిలో ఇతరుల బలాన్ని, విజయాన్ని కోరుకోడు. నేను వందమంది అర్జునులనైనా చంపుతాను. కానీ ఒకే అస్త్రాన్ని రెండుమార్లు ప్రయోగించలేను". సూర్యుని కుమారుడైన కర్ణుడు మరల ఆ అశ్వసేనునితో ఇలా అన్నాడు. "నాగాస్త్రం నాదగ్గరున్నది. తీవ్ర ప్రయత్నంతో, అర్జునుని మీద ఉన్న కోపంతో దానిని ప్రయోగించి అతనిని చంపగలను. నీవు సుఖంగా వెళ్ళు". రాజా! రణభూమిలో కర్ణుడు అలా చెప్పగానే నాగరాజు ఆ మాటను సహించలేక, రోషంతో అర్జునుని చంపాలని ఉగ్రరూపాన్ని ధరించి తానే స్వయంగా బయలుదేరాడు. ఆపై రణభూమిలో కృష్ణుడు "నీతో శత్రుత్వాన్ని వహించిన మహాసర్పాన్ని చంపు" అని అర్జునునితో అన్నాడు. మధుసూదనుడు అలా అనగానే శత్రుపరాక్రమాన్ని సహించగల అర్జునుడు" ఎవరీ పాము? నేరుగా గరుడుని నోట పడుతున్నట్లు నా మీదకు ఎందుకు వస్తోంది?" అని కృష్ణుని అడిగాడు.

కృష్ణుడిలా అన్నాడు. "ఖాండవవనంలో నీవు విల్లు పట్టి అగ్నికి తృప్తి కలిగిస్తున్న సమయంలో తల్లిచాటున శరీరాన్ని దాచుకొని తన శరీరాన్ని రక్షించుకొన్న వాడితడు. నీవు ఒకే పాము అనుకొని ఇతని తల్లిని చంపావు. ఆ వైరాన్ని గుర్తుతెచ్చుకొని ఈ సర్పం కేవలం తాను చావటానికే నీ మీదకు వస్తోంది. శత్రుసూదనా! ఆకాశంనుండి జారి ప్రజ్వలిస్తున్న తోకచుక్కవలె నీ మీదకు వస్తున్న దానిని గమనించు." సంజయుడిలా

అన్నాడు. "ఆపై అర్జునుడు కోపంగా తిరిగి మంచి పదునుగల ఆరుబాణాలతో ఆ సర్పాన్ని ఖండించాడు. ఆకాశంలో పక్షివలె ఎగురుతూ వస్తున్న ఆ పాము శరీరం తెగి క్రిందపడింది.

రాజా! అర్జునుడు ఆ సర్పాన్ని సంహరించగానే సమర్థుడైన శ్రీకృష్ణుడు స్వయంగా తన భుజాలతో నేలక్రుంగిన రథాన్ని మరల ఉద్ధరించాడు. అదే సమయంలో కర్ణుడు అడ్డంగా చూస్తూ నెమలి ఈకలు కలిగి, సానబెట్టబడిన పది బాణాలతో అర్జునుని గాయపరిచాడు. ఆపై అర్జునుడు వరాహకర్ణాలనబడే పన్నెండు పదునైన బాణాలను చక్కగా విడిచి కర్ణుని గాయపరిచాడు. విషసర్పవేగం గల మరొక బాణాన్ని చెవిదాకా లాగి కర్ణునిపై ప్రయోగించాడు. చక్కగా విడిచిన ఆ గొప్పబాణం విచిత్రకవచాన్ని ఛేదించి, ప్రాణాలను తోడివేస్తున్నట్లుగా కర్ణుని నెత్తురుత్రాగి, నెత్తుటితో తడిసిన రెక్కలతో నేలలోనికి చొచ్చుకొనిపోయింది. ఆపై బాణం దెబ్బకు కోపించిన కర్ణుడు కర్రతో కొట్టిన పాములె, వెంటనే విషసర్పం మహావిషాన్ని క్రక్కినట్లు, గొప్ప బాణాలను అర్జునునిపై కురిపించాడు. కర్ణుడు పన్నెండు బాణాలతో శ్రీకృష్ణుని, అలాగే తొంబది తొమ్మిది బాణాలతో అర్జునుని గాయపరిచాడు. మరల ఒక భీకర బాణంతో అర్జునుని గాయపరిచి కర్ణుడు సింహనాదం చేసి నవ్వాడు.

అర్జునుడు కర్ణుని నవ్వును సహించలేకపోయాడు. ఇంద్రుడు రణరంగంలో బలాసురుని బలంగా కొట్టినట్లు, ఇంద్రవిక్రముడు, మర్మవేత్త అయిన అర్జునుడు వందకుపైగా బాణాలతో కర్ణుని మర్మస్థానాలను ఛేదించాడు. ఆపై అర్జునుడు యమదండాల వంటి తొంబది బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. ఆ బాణాలతో శరీరం గాయపడగా, వజ్రందెబ్బకు బ్రద్దలైన కొండవలె కర్ణుడు వ్యథచెందాడు. గొప్పమణులు, వజ్రాలు, బంగారు నగలు అలంకరించిన కర్ణుని కిరీటాన్ని, విలువైన కుండలాలనూ అర్జునుడు బాణాలతో కొట్టినేలగూల్చాడు. ఆ కర్ణుని కవచం ఎంతో విలువైనది. గొప్ప శిల్పులు ప్రయత్నపూర్వకంగా ఎంతోకాలం పనిచేసి తయారు చేసినది. ప్రకాశవంతమైన ఆ కవచాన్ని అర్జునుడు బాణాలతో క్షణకాలంలో ముక్కలు చేశాడు. కవచహీనుడైన ఆ కర్ణుని అర్జునుడు కోపించి పదునైన నాలుగు గొప్ప బాణాలతో తీవ్రంగా దెబ్బతీశాడు. పిత్త, శ్లేష్మ, వాత జ్వరాలతో రోగి బాధపడినట్లు, శత్రువుచే తీవ్రంగా దెబ్బతిన్న కర్ణుడు వ్యధ చెందాడు.

అర్జునుడు త్వరపడుతూ క్రియ, ప్రయత్నం, బలాలతో తన విశాలధనుర్మండలం నుండి వెలువరిస్తున్న పదునైన అనేక మహాశరాలతో కర్ణుని చెరిగివేశాడు. మర్మస్థానాలను

ఛేదించాడు. పదునైన మొనలు, తీవ్రవేగం గల వివిధ బాణాలతో అర్జునునిచే తీవ్రంగా గాయపరచబడిన కర్ణుడు నెత్తురోడుతూ, గైరికధాతువులచే ఎర్రనైన జలాన్ని ప్రవహింపజేస్తున్న కొండవలె భాసిల్లాడు. ఆపై అర్జునుడు బంగారు రెక్కలు గలిగి లోహంతో తయారై దృఢంగా ఉన్న అనేక నూతన శరాలతో కార్తికేయుడు క్రౌంచపర్వతాన్ని బ్రద్దలు చేసినట్లు, కర్ణుని రొమ్ముపై కొట్టాడు. ఆ బాణాలు యమదండ అగ్నిదండాలవంటివి. సూటిగా సాగిపోయేవి. రాజా! ఆపై అర్జునునిచే తీవ్రంగా గాయపడిన ఆ కర్ణుడు ఇంద్రధనుస్సు వంటి తన వింటిని, అమ్ములపొదిని విడిచి పిడికిలి సడలిపోగా రథంమీదనే తొట్రుపడుతూ మూర్ఛిల్లాడు. పురుషకారాన్నే వ్రతంగా స్వీకరించిన ఆర్యుడైన అర్జునుడు అలా సంకటస్థితిలో నున్న కర్ణుని చంపదలచలేదు. అప్పుడు కృష్ణుడు త్వరపడుతూ ఇలా అన్నాడు. "అర్జునా! ఏమరుపాటుగా ఉన్నావా? పండితులు ఎప్పుడూ దుర్బల శత్రువులను చంపటానికైనా సరే ఎదురుచూస్తూ కూర్చోరు. ప్రత్యేకించి శత్రువు ఇబ్బందిలో ఉన్నప్పుడు పండితుడు అతనిని చంపి, కీర్తినీ, ధర్మాన్ని పొందుతాడు. కాబట్టి ఆద్వితీయవీరుడై నీకు శత్రువైన కర్ణుని వెంటనే చంపటానికి త్వరపడు. కర్ణుడు శక్తిని పుంజుకొని నీపై ఆక్రమించక ముందే, హరి నముచిని చంపినట్లు నీవితనిని చంపు".

అప్పుడు అలాగే అని కృష్ణుని మాటను మన్నిస్తూ కురువంశీయులందరిలో మేటి అయిన అర్జునుడు, గొప్ప బాణాలతో, గతంలో ఇంద్రుడు బలిచక్రవర్తిని గాయపరిచినట్లు కర్ణుని గాయపరిచాడు. భారతా! గుర్రాలతో, రథంతో సహా అర్జునుడు కర్ణుని వత్సదంతాలతో (ఆపేరుగల బాణాలు) ఆవరించాడు. స్వర్ణపక్షాలు గల బాణాలతో సర్వప్రయత్నాలతో దిక్కులను కప్పివేశాడు. విశాలమైన, ఉన్నతమైన వక్షస్థలం గల ఆ కర్ణుడు శరీరమంతా బాణాలు గ్రుచ్చుకొనగా పుష్పించిన అశోకాలు, మోదుగులు, బూరుగుచెట్లు, చందనవనాలతో కూడిన పర్వతంవలె ప్రకాశించాడు. రాజా! రణభూమిలో ఎన్నో బాణాలు శరీరమంతా గ్రుచ్చుకొనగా కర్ణుడు తన చరియలపై, గుహలపై వ్యాపించిన చెట్లతో వికసించిన గోగుచెట్లతో నిండిన పర్వతంవలె ప్రకాశించాడు. కర్ణుడు ఆ తరువాత బాణ సమూహాల నెన్నింటినో శత్రువులపై కురిపిస్తూ, ఆ బాణకిరణాలతో ప్రకాశిస్తున్నాడు. అప్పుడు ఆతడు ఎర్రని కిరణాలతో, ఎర్రని బింబంతో అస్తాద్రివైపు వెళ్తున్న సూర్యునివలె ప్రకాశించాడు. కర్ణుని భుజాలనుండి వెలువడి పెద్దపాముల వలె వెలుగుతున్న ఆ బాణాలను, అర్జునుని బాహువుల నుండి వెలువడిన వాడి మొనగల బాణాలు దిక్కులన్నీ వ్యాపించి నశింపజేశాయి. ఆపై కర్ణుడు ధైర్యాన్ని తెచ్చికొని, కోపించిన సర్పాలవంటి బాణాలను విడుస్తూ, పది

బాణాలతో అర్జునుని, కోపించిన సర్పాలవంటి ఆరు బాణాలతో కృష్ణుని గాయపరిచాడు.

ఆపై మహామతి, కిరీటి అయిన అర్జునుడు ఆ మహాసంగ్రామంలో భీకరంగా శబ్దం చేస్తూ సర్పవిషం, అగ్నివంటి తేజస్సు గలిగి, లోహనిర్మితాలై మరీ రౌద్రమైన అస్త్రాలచే మంత్రించబడిన విశాలబాణాలను కర్ణునిపై ప్రయోగించాలని భావించాడు. రాజా! ఆ సమయంలో కాలుడు అదృశ్యంగా బ్రాహ్మణక్రోధం వలన కర్ణుని వధను సూచిస్తూ, కర్ణునకు మృత్యుకాలం సమీపించగానే ఇలా అన్నాడు - "ఇప్పుడు భూమి రథచక్రాన్ని క్రుంగదీస్తుంది". నరవీరా! మహాత్ముడైన పరశురాముడిచ్చిన ఆ అస్త్రం కర్ణుని మనస్సు నుండి తొలగిపోయింది. ఎడమచక్రం భూమిలో కూరుకొనిపోయింది. కర్ణుని సంహారానికి సమయమాసన్నమైంది. రాజా! ఆపై విప్రోత్తముని శాపం వలన, ఆ రథచక్రం ఘోషవెడుతూ భూమిలో కూరుకొనిపోయింది. రణభూమిలో కర్ణుడు కలతపడ్డాడు.

చక్కగా పుష్పించిన పెద్దరావిచెట్టు వేదికతో సహా భూమిలోనికి క్రుంగినట్లు రథం క్రుంగింది. విప్రశాపం వలన రథం తూలుచుండగా, పరుశురాముడిచ్చిన అస్త్రం గుర్తురాకపోగా, ఘోరమైన నాగాస్త్రాన్ని అర్జునుడు ముక్కలు చేయగా ఆ సంకటాలను సహించలేక కర్ణుడు ఖిన్నుడై, రెండు చేతులు విసురుతూ, ధర్మనింద చేయసాగాడు. ధర్మవేత్తలు ఎప్పుడూ ధర్మపరాయణులను ధర్మం కాపాడుతుందని అంటుంటారు. మేము ఎప్పుడూ, మాశక్తిని, జ్ఞానాన్ని అనుసరించి ధర్మపాలనకై, ప్రయత్నిస్తున్నాం. అయినా ఆ ధర్మమే మమ్ము చంపుతోంది. భక్తులను రక్షించటం లేదు. ధర్మం ఎప్పుడూ రక్షించలేదని అనుకొంటున్నాను. అలా అంటుండగానే అర్జునుని బాణాలు కర్ణుని తాకాయి. దానితో చలించిపోయాడు. అంతలో గుర్రాలు, సారథి క్రిందపడసాగారు. బాణాలు మర్మస్థానాలలో తగలటంతో కర్ణుడు క్రియాశూన్యుడై మాటిమాటికీ ధర్మాన్ని నిందించసాగాడు. ఆపై మరీభీకరాలైన మూడు బాణాలతో, రణరంగంలో కృష్ణుని చేతిని, ఏడు బాణాలతో అర్జునుని గాయపరిచాడు కర్ణుడు. ఆపై అర్జునుడు తీవ్రవేగంతో సూటిగా, ఇంద్రుని వజ్రంతో సమానంగా, ఘోరంగా, అగ్నిసదృశంగా సాగే పదిహేడు బాణాలను కర్ణునిపై కురిపించాడు. భీమవేగం గల ఆ బాణాలు కర్ణుని చీల్చి నేలగూలాయి. ఆపై కర్ణుడు కంపించాడు. అయినా యథాశక్తిగా యుద్ధం చేయసాగాడు.

శక్తిని కూడగట్టుకొని నిలిచి, కర్ణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించబోయాడు. అప్పుడు అదిచూసి అర్జునుడు కూడా ఇంద్రాస్త్రాన్ని ఉపమంత్రించాడు. పరంతపుడైన ఆ అర్జునుడు గాండీవాన్ని, అల్లెత్రాటిని, బాణాలను మంత్రించి, ఇంద్రుడు వర్షాన్ని కురిపించినట్లు

శరవర్షాన్ని కురిపించాడు. ఆపై తేజోమయమై, మహాబలం గల ఆ బాణాలు అర్జునుడి రథం నుండి వెలువడి, కర్ణుని రథానికి దగ్గరగా బయటపడసాగాయి. మహారథుడైన కర్ణుడు తన సమీపానికి వచ్చిన ఆ బాణాలను వ్యర్థం చేశాడు. ఆ అస్త్రం నశింపజేయబడగా కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! కర్ణుడు శరాలను కబళిస్తున్నాడు. పరమాస్త్రాన్ని ప్రయోగించు." అనగానే అతిరౌద్రమైన బ్రహ్మాస్త్రాన్ని మంత్రించి ప్రయోగించాడు అర్జునుడు. దానితో బాణాలవృష్టిని కురిపించి, అర్జునుడు కర్ణుని కప్పివేశాడు. అప్పుడు మొనదేలిన పదునైన బాణాలతో కర్ణుడు అర్జునుని అల్లెత్రాటిని ఛేదించాడు. రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది – అల్లెత్రాళ్ళను కర్ణుడు వరుసగా ఖండించాడు. అలాగే తొమ్మిది, పది, పదకొండు – అల్లెత్రాళ్ళను కర్ణుడు ఖండించాడు. కానీ అర్జునుని ధనుస్సుకు, వంద అల్లెత్రాళ్ళున్నాయని కర్ణునకు తెలియదు. ఆపై అర్జునుడు మరొక అల్లెత్రాటిని బిగించి, మండుపడుతున్న పాములవంటి బాణాలను కర్ణునిపై కురిపించాడు.

రణభూమిలో కర్ణుడు అర్జునుని అల్లెత్రాటిని ఖండించటం, వెంటనే అర్జునుడు మరొక అల్లెత్రాటిని బిగించటం చాలా వేగంగా – కర్ణునకు కూడా తెలియనంత వేగంగా – జరుగుతున్నాయి. అది అద్భుతమనిపించింది. కర్ణుడు తన పరాక్రమాన్ని బాగా ప్రదర్శిస్తూ అర్జునుని అస్త్రాలను తన అస్త్రాలతో నివారిస్తూ, భంగపరుస్తూ అతని కన్నా ఎక్కువగా పోరాడాడు. ఆపై కర్ణుని బాణాలచే పీడింపబడిన అర్జునుని చూసి కర్ణుడు "బాణాలు విడు. గొప్ప అస్త్రాలను ప్రయోగించు. ముందుకు పద" అన్నాడు. రాజా! అప్పుడు పరంతపుడు, కిరీటి అయిన అర్జునుడు అగ్నివలె, పాముविషం వలె ఘోరమై, లోహమయమైన భీకరాస్త్రాన్ని సంధించి కర్ణునిపై విడువబోయాడు. అప్పుడే కర్ణుని రథచక్రాన్ని భూమి కబళించింది.

ఆపై కర్ణుడు వేగంగా రథంమీద నుండి దిగి, ఉద్యమించి, భుజాలు ఆసరాగా చక్రాన్ని పైకెత్తాలని ఆలోచించాడు. కర్ణుడు రథచక్రాన్ని పైకెత్తే ప్రయత్నం చేస్తున్న సమయంలో సప్తద్వీపాలతో, పర్వతాలతో, వనాలతో, కాననాలతో సహా భూమి నాలుగంగుళాలు పైకి లేచింది. చక్రంమాత్రం భూమిలోనే క్రుంగి ఉంది. చక్రం క్రుంగిపోయినందున, కర్ణుడు కోపంతో కన్నీరు కార్చాడు. అర్జునుని చూసి రోషావేశంతో ఇలా అన్నాడు. 'ఓయీ! అర్జునా! మేటివిలుకాడా! ముహూర్తకాలమాగు, ఇంతలో క్రుంగిన ఈ చక్రాన్ని భూమిలోనుండి పైకి లేపుతాను. పార్థా! దైవికంగా భూమిలో క్రుంగిన ఈ నా సవ్యచక్రాన్ని చూసి, నీవు కాపురుషులకు తగిన కపట ప్రవర్తనను విడనాడు. కౌంతేయా! నీవు రణకర్మలలో

విశిష్టుడవుగా పేరుపొందినవాడవు. చెడ్డవారు చరించే మార్గంలో నీవు నిలువదగదు. పాండవా! నీవు ఇంకా విశిష్టంగా పనిచేయ వలసినవాడవు. అర్జునా! సజ్జన వ్రతంలో నిలిచిన శూరులు జుట్టు ఊడిన వాడు, విముఖుడు, బ్రాహ్మణుడు, చేతులు జోడించినవాడు, శరణాగతుడు, శస్త్రాలు విడిచినవాడు, ప్రార్థిస్తున్నవాడు, బాణరహితుడు, కవచహీనుడు, ఆయుధాలు భగ్నమైనవాడు – వీరిపై శస్త్రాలను ప్రయోగించరు. పాండవా! నీవులోకంలో అందరికన్నా శూరుడవు. సత్పవర్తన గలవాడవు. యుద్ధధర్మాలనెరిగినవాడవు. వేదాంతాధ్యయన రూపమైన యజ్ఞం చేసి అవభృథస్నానం చేసినవాడవు. దివ్యాస్త్రవేత్తవు. అమేయబలుడవు. యుద్ధంలో కార్తవీర్యునితో సమానుడవు. మహాభుజా! నేలక్రుంగిన ఈ చక్రాన్ని పైకెత్తే దాకా నేను నేలపైనున్న వాడిని, నీవు రథంపై ఉన్నావు. నాపై బాణాలు ప్రయోగించి కలతపెట్టవద్దు. పాండవా! నాకు నీవన్నా, కృష్ణుడన్నా భయం లేదు. నీవు క్షత్రియ కుమారుడవు. మహావంశ వర్ధకుడవు. అందుకని నీకు చెప్తున్నాను. ముహూర్తకాలం ఓపికపట్టు."

91. కర్ణవధ

సంజయుడిలా చెప్తున్నాడు. "రథంపైనున్న వాసుదేవుడు కర్ణునితో ఇలా అన్నాడు. "రాధేయా! నీవు ధర్మాన్ని తలచుకోవటం గొప్ప అదృష్టం. సాధారణంగా కష్టాలలో చిక్కుకొన్న నీచులు దైవాన్ని నిందిస్తారు కానీ తాము చేసిన చెడ్డపనులను నిందించరు. ఏకవస్త్ర అయిన ద్రౌపదిని నీవు సభలోనికి రప్పించావు. సుయోధనుడు, దుశ్శాసనుడు, సుబలసుతుడైన శకుని దానిని సమర్థించారు. కర్ణా! అప్పుడు నీకు ధర్మం స్ఫురించలేదు. సభలో పాచికలాడటం చేతకాని ధర్మరాజును, శకుని ఆ విద్య తెలిసి గెలిచాడు. అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ? కర్ణా! పదమూడు సంవత్సరాల పాటు వనవాసం పూర్తి అయినా రాజ్యమివ్వలేదు. అప్పుడు నీధర్మ మెక్కడికి పోయింది ? నీ మద్దతుతో సుయోధనుడు భీముని విషపర్వాలతో కరిపించాడు. విషాన్నాన్ని పెట్టాడు. అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది రాధేయా! వారణావతంలో లక్కఇంటిలో నిదురిస్తున్న పాండవులను తగులబెట్టించావు. రాధేయా! అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ? రజస్వల అయిన ద్రౌపది దుశ్శాసనునికి లోబడినప్పుడు సభలో నవ్వావు. కర్ణా! అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ? నిరపరాధిని అయిన ద్రౌపది గతంలో మర్యాద తెలియని కౌరవులచే బాధింపబడుతున్నప్పుడు మిన్నక చూస్తున్నావు. అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ?

రాధేయా! "పాండవులు నశించారు. శాశ్వత నరకంలో పడిపోయారు. ద్రౌపదీ! మరొక భర్తను కోరుకో!" అని ద్రౌపదితో అంటూ చూస్తూ కూర్చున్నావు. అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ? కర్ణా! రాజ్యలోభంతో శకునిని ఆశ్రయించి, పాండవులను వ్యథపాలుజేశావు. అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ? మహారథులైన చాలామంది కలిసి రణభూమిలో బాలుడైన అభిమన్యుని చుట్టుముట్టి చంపారు. అప్పుడు నీ ధర్మ మెక్కడికి పోయింది ? ఆ సమయాలలో లేని ధర్మాన్ని గురించి, ఈ రోజు దవడలు ఎండేటట్లు మాటాడితే లాభమేముంది? సూతా! ఈరోజు ఇక్కడ ఎన్నిధర్మాలు పలికినా ప్రాణాలతో నిన్ను విడిచిపెట్టేది లేదు. పుష్కరుడు పాచికలతో నలుని జయించాడు. అయినా నలుడు పరాక్రమంతో తిరిగి రాజ్యాన్ని పొందాడు. అలాగే లోభరహితులైన పాండవులు కూడా అందరితో కలిసి, రణభూమిలో పెద్దపెద్ద శత్రువులను చంపి, రాజ్యాన్ని పొందగలరు. సోమకులతో కలిసి అధికారాన్ని అందుకొనగలరు. పురుషశ్రేష్ఠులైన పాండవులు నిత్యమూ ధర్మ రక్షితులు అందువలన వీరు ధార్తరాష్ట్రులను నశింపజేయటం తథ్యం"

సంజయుడిలా చెప్తున్నాడు. 'భారతా! వాసుదేవుడు కర్ణునితో అలా పలుకగా సిగ్గుతో తలదించుకొని కర్ణుడు ఏమీ సమాధానం చెప్పలేదు. కోపంతో పెదవులు వణుకుతుండగా వింటిని ఎత్తి, మహావేగ పరాక్రమాలతో అర్జునునితో పోరాటం కొనసాగించాడు. అప్పుడు కృష్ణుడు పురుషశ్రేష్ఠుడైన అర్జునునితో "మహాబలా! దివ్యాస్త్రంతోనే చీల్చి, కర్ణుని పడగొట్టు" అన్నాడు. దేవుడైన కృష్ణుడలా అనగానే అర్జునుడు కోపానికి లోనయ్యాడు. గతంలో కర్ణుడు చేసిన పనులను తలచుకొనగా అర్జునునిలో తీవ్రరోషం ప్రవేశించింది. కోపానికి లోనుకాగానే కర్ణుని రోమ కూపాలలోనుండి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. అది అద్భుతమనిపించింది. అది చూసి, ఆపై కర్ణుడు బ్రహ్మాస్త్రంతో అర్జునునిపై బాణాలను కురిపించాడు. రథాన్ని పైకెత్తటానికి మరల ప్రయత్నం చేశాడు. అర్జునుడు బ్రహ్మాస్త్రంతోనే కర్ణునిపై శరవృష్టిని కురిపించాడు. కర్ణుని అస్త్రాన్ని తన అస్త్రంతో నివారించి అర్జునుడు మరల కర్ణుని గాయపరిచాడు. ఆపై అర్జునుడు అగ్నికిష్టమైన మరొక అస్త్రాన్ని కర్ణునిమీదకు ప్రయోగించాడు. అది తేజస్సుతో మండిపడుతోంది. కర్ణుడు వారుణాస్త్రంతో అగ్నిని శమింపజేశాడు. సర్వదిక్కులనూ మేఘాలు ఆవరించి, అంధకారంతో దుర్దినాన్ని కల్పించాయి. వీర్యవంతుడైన అర్జునుడు తడబడకుండా వాయవ్యాస్త్రంతో కర్ణుడు చూస్తుండగానే ఆ మేఘాలను చెదరగొట్టాడు. ఆపై కర్ణుడు అర్జునుని చంపదలచి, అగ్నివలె జ్వలిస్తున్న మహాఘోరమైన బాణాన్ని చేతబట్టాడు. రాజా! ఆ బాణాన్ని ఆ మేటి ధనుస్సుపై సంధించగానే

కొండలు, వనాలు, కాననాలతో సహా భూమి కంపించింది. భారతా! గాలి దుమ్ముతోపాటు వీచింది. దిక్కులు ధూళితో నిండిపోయాయి. స్వర్గంలో దేవతల హాహాకారం చెలరేగింది. మారిషా! కర్ణుడు ఆ బాణాన్ని సంధించటాన్ని చూసి, పాండవులు దీనమనస్కులై పరమ విషాదానికి లోనయ్యారు. ఇంద్రుని వజ్రాయుధం వంటి కాంతి, వాడిమొనగల ఆ బాణం కర్ణభుజాల నుండి విడివడి, పెద్దపాము పుట్టలో దూరినట్టి అర్జునుని రొమ్ముపై దిగబడింది. మహాత్ముడు, శత్రుమర్దను డైన అర్జునుడు ఆ బాణంతో తీవ్రంగా గాయపడ్డాడు. కళ్ళు తిరిగాయి. చేతిలోని గాండీవం జారిపోయింది. భూకంపసమయంలో పర్వతంవలె అర్జునుడు కంపించాడు.

ఆ తరువాత మహారథుడైన కర్ణుడు నేలలో దిగబడిన రథచక్రాన్ని పైకి లేపాలని రథంనుండి దిగి, భుజాలతో పట్టి ప్రయత్నించాడు. కానీ మహాబలుడైనా, విధివశాన లేపలేక పోయాడు. ఆపై అర్జునుడు చైతన్యాన్ని పొంది యమదండం వంటి బాణాన్ని చేతబట్టి, కృష్ణునకు చేతులు జోడించాడు. అప్పుడు కృష్ణుడు "రథాన్ని ఎక్కకముందే శత్రువైన ఈ కర్ణుని శిరస్సును బాణంతో ఖండించు" అని అర్జునుని ఆదేశించాడు. అలాగే అని అర్జునుడు శ్రీకృష్ణుని మాటను మన్నించి, ప్రజ్వలించే బాణాన్ని తీసికొని, చక్రం నేలపై కూరుకొని యున్న ఆ రథంపై నిర్మలసూర్యవర్ణంతో ప్రకాశిస్తున్న ధ్వజాన్ని కొట్టాడు. నాగకక్ష చిహ్నంగా ఉన్న ఆ ధ్వజం వెనుకవైపు బంగారం, ముత్యాలు, మణులు, వజ్రాలు కుట్టబడి యున్నాయి. గొప్ప జ్ఞానం గల మేటిశిల్పులు స్వర్ణమయమైన ఆ సుందరధ్వజాన్ని నిర్మించారు. ఆ ధ్వజం లోకవిఖ్యాతం, నీ సేనకు జయాస్పదం. శత్రుభీకరం, స్తుతిపాత్రమైన రూపం గలది. తేజస్సుతో అగ్నితో, సూర్యునితో, చంద్రునితో సమానమైనది. ఆ తరువాత అర్జునుడు బంగారు రెక్కలు, ప్రజ్వలిస్తున్న అగ్నితేజస్సు గలిగి శోభతో ధగధగలాడుతున్న ఒక పదునైన క్షురప్రంతో మహారథుడైన కర్ణుని ధ్వజాన్ని భంగపరచాడు.

ఆ కేతువుతో పాటు కౌరవుల యశస్సు, దర్పమూ, అన్ని అభీష్టకార్యాలు, హృదయాలు కూడా క్రుంగిపోయాయి. మహాహాహాకార ధ్వని చెలరేగింది. భారతా! వేగంగా పనిచేయగల అర్జునునిచే రణభూమిలో ఖండింపబడి, పడిపోయిన ధ్వజాన్ని చూసి, నీ వారందరూ కర్ణుని విజయాన్ని ఆశించలేకపోయారు. ఆపై అర్జునుడు కర్ణుని చంపటానికి త్వరపడుతూ మహేంద్రుని వజ్రంవలె, అగ్ని దండంవలె, సూర్యుని కిరణాలలోని ఉత్తమకిరణం వలె నున్న ఒక అంజలికాన్ని (బాణాన్ని) అమ్ములపొదినుండి తీసికొన్నాడు. అది శత్రువుల

మర్మచ్ఛేదన చేయగలది. రక్తమాంసాలతో తడవబోయేది. అగ్నిసూర్యులతో సమానమైనది. విలువైనది. సైనికులు గుర్రాలు, ఏనుగుల ప్రాణాలు హరింపగలది. మూడు మూరలు పొడవుగలది. ఆరు రెక్కలతో అతి తీవ్రవేగంతో పయనించగలది. ఇంద్రుని వజ్రం వంటి శక్తిగలది. నోరుతెరిచిన కాలాగ్నివలె అతి భయంకరమైనది. పినాకంతో, విష్ణుచక్రంతో సమానమైనది. భయానకమై ప్రాణులను నశింపజేయగలది. దేవతల సంఘమైనా, అర్జునుని అంత తేలికగా నిరోధించలేదు. ఎప్పుడూ అందరిచే పూజింపబడే మహాత్ము డతడు, మహాశరుడై దేవతలనూ, అసురులను కూడా గెలువగల వాడు. ఆ అర్జునుడు ఉత్సాహంతో ఆ బాణాన్ని చేతబట్టాడు.

మహాసంగ్రామంలో అర్జునుడు ఆ బాణాన్ని చేబట్టి, పరామర్శించటం చూసి, చరాచర జగమంతా కంపించిపోయింది. మహారణభూమిలో ఎత్తిన ఆ బాణాన్ని చూసి, ఋషులు జగత్తునకు శుభం కలగాలి అని పెద్దగా అరిచారు. ఆపై అప్రమేయమైన ఆ బాణాన్ని అర్జునుడు వింట సంధించాడు. ఆ మహాస్త్రాన్ని, గాండీవ ధనుస్సుపై సంధించి, వెంటనే బాగా లాగుతూ, ఇలా అన్నాడు. 'మహాస్త్రప్రేరితమైన ఈ మహాశరం దుర్మనస్కుల శరీరాలను, హృదయాలను, ప్రాణాలను అపహరింపగలది. నేను తపస్సు చేసి ఉంటే, గురువులను ఆనందింపజేసి ఉంటే, యాగాలు చేసి ఉంటే, మిత్రుల మాటలను విని ఉంటే, ఆ సత్యంతో చక్కగా అనుసంధించి ప్రయోగించిన ఈ బాణం కర్ణుని చంపును గాక!' అలా అని అర్జునుడు కర్ణవధకై ఘోరమైన ఆ బాణాన్ని ప్రయోగించాడు. అధర్వాంగిరసమంత్రాల ద్వారా పుట్టించిన కృత్య ప్రజ్వలిస్తూ, యుద్ధంలో మృత్యువుకు కూడా లొంగదు. అటువంటిదే ఆ అర్జునబాణం. అర్జునుడు పరమోత్సాహంతో "ఈ బాణం నాకు విజయాన్ని కల్గించాలి. నేను విడిచిన ఈ సంహారక బాణం సూర్యచంద్ర ప్రభావంతో కర్ణుని యమలోకానికి కొనిపోవాలి" అన్నాడు.

కిరీటి అయిన అర్జునుడు అత్యంతోత్సాహంతో శత్రువును సంహరింపదలచి ఆతతాయి అయ్యాడు. విజయావహమై, సూర్యచంద్రకాంతిగల ఆ మేటి అమ్మును శత్రువు (కర్ణుని)పై నాటాడు. బలశాలి అయిన అర్జునునిచే అలా విడుబడిన ఆ బాణం సూర్యతేజస్సుతో దిక్కులను, ఆకాశాన్ని ప్రజ్వలింపజేసింది. ఆపై ఇంద్రుడు వజ్రంతో వృత్రుని సంహరించినట్లు, అర్జునుడు కర్ణుని శిరస్సును అపహరించాడు. రాజా! అప్పుడు ఇంద్రసుతుడైన అర్జునుడు అపరాహ్ణవేళలో, మహాస్త్ర మంత్రాలతో అభిమంత్రించిన ఆ అంజలికంతో కర్ణుని శిరస్సును ఖండించాడు. ఆ అంజలికం ఖండించిన శిరస్సు ముందు

నేలబడింది. ఆ తరువాత మొండెం పడింది. ఎర్రని బింబం గల సూర్యుడు అస్తాద్రి నుండి పడినట్లు, సేనాముఖంలో నేలగూలిన ఆ తల ఉదయించిన సూర్యునివంటి తేజస్సుతో, శరత్కాలంలో గగనమధ్యాన సంచరిస్తున్న భాస్కరునితో సమానంగా కనిపించింది. ఉదార కర్ముడైన కర్ణుని శరీరం నిత్యమూ సుఖాలకు తగినది. ఎంతో అందమైనది. అప్పు డది శత్రువుచే ఎంతో కష్టంతో శిరస్సును వదిలింది. ఆ స్థితి జీవుడు ఇంటినీ, సంపదనూ, సత్సాంగత్యాన్నీ ఎంతో కష్టంతో వీడినట్టుంది.

తేజస్సంపన్నుడైన ఆ కర్ణుని విశాలశరీరం బాణాలచే శిథిలమై, గాయంనుండి నెత్తురు కారుతుండగా ప్రాణాలు విడిచింది. అది వజ్రందెబ్బతిని, గైరికజలాన్ని ప్రవహిస్తూ పడిపోయిన గిరిశిఖరం వలె ఉంది. కర్ణుని దేహం పడిపోగా దానినుండి వెలువడిన ఒక తేజస్సు ఆకాశంలో వ్యాపించి, సూర్యమండలంలో లీనమైంది. కర్ణుడు చనిపోగా తేజస్సు సూర్యునిలో లీనమైన ఆ అద్భుతాన్ని అక్కడున్న యోధులందరూ చూశారు. అర్జునుడు కర్ణుని పడగొట్టిన ఆ అద్భుతాన్ని చూసి, పాండవులు పెద్దగా శంఖాలను పూరించారు. అలాగే కృష్ణుడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ఆనందంగా శంఖాలను ఊదారు. చచ్చిపడి ఉన్న ఆ కర్ణుని చూసి సోమకులు సైన్యాలతో కలిసి సింహనాదాలు చేశారు.

రాజా! మిక్కిలిగా ఆనందించి తూర్య నాదాలను మ్రోగించారు. వస్త్రాలను ఎగరవేసి ఊపారు. చేతులు ఊపారు. మిక్కిలి ఆనందంతో అర్జునుని ప్రశంసిస్తూ, యోధులందరూ గుమిగూడారు. అర్జునుని బాణాలచే ఖండింపబడి, చచ్చి, రథంమీదనుండి నేలబడియున్న కర్ణుని చూసి, బలశాలులైన సైనికులు ఒకరినొకరు కౌగిలించుకొని, గర్జిస్తూ, నృత్యాలు చేశారు. పెనుగాలికి విరిగిపడిన కొండకొమ్మువలె, యజ్ఞం ముగిసిన పిమ్మట శాంతించిన అగ్నివలె, అస్తమిస్తున్న సూర్యబింబంవలె తెగిపడిన కర్ణునితల ప్రకాశించింది. ఒళ్ళంతా బాణాలు గ్రుచ్చుకొని, నెత్తుటి ప్రవాహంతో తడిసిన కర్ణుని శరీరం తన కిరణాలతో ప్రకాశిస్తున్న సూర్యునివలె భాసించింది. బలిష్ఠమై, ప్రజ్వలిస్తున్న బాణ కిరణాలతో శత్రుసేనను తపింపజేసిన అర్జును డనే కాలం, కర్ణు డనే సూర్యుని అస్తమింపజేసింది. అస్తమిస్తున్న సూర్యుడు కాంతిని కొనిపోయినట్లు, అర్జునుని బాణం కర్ణుని జీవితాన్ని కొనిపోయింది. మరునాటి కోసం ఆగకుండా, అర్జునుడు అంజలికంతో రణభూమిలో ఖండించిన కర్ణశిరస్సు శరీరంతో పాటు ఆ అపరాహ్ణవేళలో నేలగూలింది. ఆ బాణం సేనలనన్నింటిని దాటి అర్జునుని శత్రువైన కర్ణుని శిరస్సును, దేహంతో సహా

వేగంగా, తేలికగా అపహరించింది. శూరుడైన కర్ణుడు బాణాలు గ్రుచ్చుకొని, రక్తసిక్తమైన శరీరంతో నేలబడి ఉండటం చూసి మద్రరాజు (శల్యుడు) ధ్వజం విరిగిన ఆ రథంతో అక్కడనుండి నిష్క్రమించాడు. కర్ణుడు చనిపోగానే, రణభూమిలో తీవ్రంగా గాయాలు తగిలిన కౌరవులు భయపీడితులై, ప్రజ్వలిస్తున్న రూపం గల ఆ అర్జునధ్వజాన్ని మాటిమాటికి చూస్తూ పారిపోయారు. ఇంద్రసమానమైన పరాక్రమం గలవాడు కర్ణుడు. ఆయనవదనం పద్మతుల్యం. అందమైన ఆ కర్ణుని శిరస్సు సంధ్యాకాల సూర్యునివలె నేలగూలింది.

కర్ణుడు విశాలమైన వక్షస్థలంగల వాడు. కమలనయనుడు, బంగరు వన్నెవాడు. ఆటువంటివాడు అర్జున బాణాలతో తపించి నేలగూలటం, దుమ్ముతో మలినపడటం అదే పనిగా చూసి తనకుమారుని స్థితికి దుఃఖించి, సూర్యుడు కాంతి మందగించగా మెల్లమెల్లగా మందిరానికి వెళ్ళిపోయాడు."

92. శల్యుడు దుర్యోధనుని ఓదార్చుట

సంజయుడిలా చెప్తున్నాడు. "కర్ణార్జునుల పోరులో బాణాలచే సేనలన్నీ మర్దింపబడగా, కర్ణుడు పదాతియై సంహరింపబడగా, శల్యుడు పూర్తిగా ధ్వంసమైన ఆ రథంతో అక్కడనుండి వెళ్ళిపోయాడు. కౌరవుల రథాలు, గుర్రాలు, ఏనుగులు, పడిపోయాయి. సేన నశించింది. కర్ణుడు చనిపోయాడు. ఆస్థితిలో దుర్యోధనుడు దీనుడై, మాటిమాటికీ ఆర్తితో నిట్టూరుస్తూ, కళ్ళనిండా నీరు పెట్టాడు. శూరుడైన కర్ణుడు బాణాలు గ్రుచ్చుకొని రక్తసిక్తమైన శరీరంతో నేలబడ్డాడు. అప్పుడు అనుకోకుండా నేలకు దిగిన సూర్యుని వలె నున్న ఆ కర్ణుని చూడాలని అందరూ చుట్టూ చేరారు.

కొందరు ఆనందించారు. కొందరు భయపడ్డారు. కొందరు విషాదానికి లోనయ్యారు. కొందరు ఆశ్చర్యపడ్డారు. మరికొందరు శోకోపహతు లయ్యారు. శత్రువులు, నీవారు కూడా వారి వారి స్వభావాన్ని అనుసరించి పరస్పరం భావోద్వేగాలకు గురి అయ్యారు. అర్జునుని బాణాల తాకిడికి కవచం, ఆభరణాలు, వస్త్రాలు, ఆయుధాలు ఛిన్నాభిన్నమై, మహాబలశాలి అయిన కర్ణుడు ప్రాణాలు కోల్పోయాడని విని, కౌరవులు నిర్జనారణ్యంలో ఆబోతు చంపబడితే ఆవులు పరుగెత్తినట్లు పారిపోయారు. కర్ణుడు చనిపోగానే ధార్తరాష్ట్రులను బెదిరిస్తూ భీముడు భీకరధ్వనితో గర్జించి, భూమ్యాకాశాలను కంపింపజేస్తూ, జబ్బచరుస్తూ, ఊగుతూ నృత్యం చేయసాగాడు. రాజా! అదే రీతిగా సోమకులు, సృంజయులు కూడా శంఖాలు పూరించారు. అందరూ సింహనాదాలు చేశారు. కర్ణుడు చంపబడగానే, అప్పుడు క్షత్రియులు ఆనందించి పరస్పరం కౌగిలించుకొని అభినందించుకొనసాగారు. అర్జునుడు మహాసంహారాన్ని సాగించి, సింహం ఏనుగును చంపినట్లు కర్ణుని సంహరించాడు. ఆ

పురుషశ్రేష్ఠుడు ప్రతిజ్ఞను పూర్తిచేసికొన్నాడు. శత్రుత్వానికి ముగింపు కల్పించాడు. రాజా! మద్రరాజు - శల్యుడు కూడా చైతన్యహీనుడై ధ్వజహీనమైన రథంతోనే వేగంగా దుర్యోధనుని సమీపించి, కన్నీరు కారుస్తూ, దుఃఖిస్తూ ఇలా అన్నాడు.

"నీ సేన ఏనుగులను, గుర్రాలను, రథాలను, వీరసైనికులను కోల్పోయి యమరాజ్యంవలె ఉన్నది. మహాత్ములంతా గిరిశిఖరాల వంటి సైనికులతో, గుర్రాలతో, ఏనుగులతో ఒకరినొకరు ఎదిరించి మరణించారు. భారతా! కర్ణార్జునుల పోరువంటి యుద్ధం ఎప్పుడూ జరగలేదు. కర్ణుడు కృష్ణార్జునుల నిద్దరినీ, ఇంకా మిగిలిన నీ శత్రువుల నందరినీ కబళించగలిగాడు. కాని దైవం నిశ్చయంగా అర్జునునకు లోబడి నడిచింది. అందుకే ఆది పాండవులను రక్షించి, మనలను హింసించింది. నీ ప్రయోజనాన్ని సిద్ధింపజేస్తున్న వీరులందరూ బలపూర్వకంగా శత్రువులచే చంపబడ్డారు. రాజా! నీ వీరులు కుబేరుడు, యముడు, దేవేంద్రుని వంటి ప్రభావం గలవారు. బలపరాక్రమాలలో, శౌర్యతేజస్సులలో వివిధగుణసమూహాలతో కూడినవారు. వారంతా చంపసాధ్యపడనివారు. కానీ రణభూమిలో నీ ప్రయోజనాన్ని ఆశిస్తున్న వారంతా పాండవులచే చంపబడ్డారు. భారతా! బాధపడవద్దు. ఇదంతా విధి, అందరికీ అన్నివేళలా కార్యం సిద్ధించదు. నీవు ఊరట చెందు." ఇలా శల్యుడు చెప్పిన మాట విని, తాను చేసిన అవినీతిని మనసా పరిశీలించి దుర్యోధనుడు దీనమనస్కుడై, చైతన్య రహితుడై, దుఃఖంతో మాటిమాటికీ నిట్టూర్చాడు."

93. కౌరవసైన్య పలాయనము

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "కర్ణార్జునుల ఆ పోరాటంలో ఆ భీకరమైన రోజున బాణాలచే దగ్ధమై పారిపోతున్న ఆ కౌరవ సృంజయసేనల పరిస్థితి ఎలా ఉంది ?" సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! మహావినాశనం ఎలా సంభవించిందో సావధానంగా విను. ఆది మానవశరీరాలకూ, ఏనుగులకు, గుర్రాలకు ఘోరమైన వినాశం. రాజా! కర్ణుడు చనిపోగానే అర్జునుడు సింహనాదం చేశాడు. అప్పుడు నీ కుమారులను మహాభయం ఆవహించింది. కర్ణుడు మరణించగానే నీయోధులలో ఎవ్వరికీ వెంటనే పరాక్రమించటం మీద కానీ, సేనలను సంఘటితం చేయటం మీద కానీ, బుద్ధి పోలేదు. అగాధమైన ప్రవాహంలో నౌక బ్రద్దలయిపోతే, ద్వీపం కనిపించకుండా పోతే, తీరమెరుగని వ్యాపారులు తీరానికై ఎదురుచూసినట్టుంది వారి పరిస్థితి. రాజా! కర్ణుడు చనిపోగానే సింహంచే పీడింపబడిన మృగాలవలె, నీ సేనలు బెదిరిపోయారు. శస్త్రాలచే గాయాలపాలయి, అనాథులై,

రక్షకునికై ఎదురుచూశారు. సాయంకాలంలో మనవారంతా అర్జునుని చేతిలో ఓటమిపొంది, కొమ్ములు విరిగిన ఎద్దులవలె, కోరలు తీసిన పాములవలె వెనుదిరిగారు. రాజా! కర్ణుడు చనిపోగానే వీరుల నందరినీ కోల్పోయి, ధ్వంసమై, పదునైన బాణాలచే సంహరింపబడి, నీ కుమారులు భయంతో పారిపోయారు. వారి యంత్రాలు, కవచాలు జారిపోయాయి; చైతన్యం నశించింది. ఏదిక్కుకు వెళ్ళాలో తెలియటం లేదు. ఒకరినొకరు త్రోసికొంటూ, భయపీడితులై దిక్కులు చూస్తున్నారు.

"అర్జునుడు నావెంటే పడుతున్నాడు. భీముడు నా మీదనే దాడి చేస్తున్నాడు" అని తలచుకొంటూ కంగారుపడి, పడిపోతున్నారు. ఉదాసీను లవుతున్నారు. మహారథులలో కొందరు గుర్రాలనెక్కి, కొందరు ఏనుగులనెక్కి, కొందరు రథాలనెక్కి మహావేగంతో భయంతో పారిపోతున్నారు. కాల్బలాన్ని అక్కడే వదలివేశారు. భయానికి లోనయి పారిపోతున్న ఏనుగులు రథాలను, మహారథులు ఆశ్వికులను, అశ్వసమూహాలు కాల్బలాన్ని త్రొక్కివేశాయి. రాజా!, పాములతో, దొంగలతో నిండిన అడవిలో తోటివారినుండి విడిపోయిన వారివలె కర్ణుడు చనిపోగానే నీ యోధులు దిక్కుతోచని వారయ్యారు. ఏనుగులనెక్కినవారు చనిపోయారు. సైనికుల చేతులు తెగిపోయాయి. వారికి లోకమంతా అర్జునుడుగానే కనిపిస్తోంది. తీవ్రభయానికి లోనయ్యారు. భీమసేన భయపీడితులై పారిపోతున్న తన వారినందరినీ చూసి, దుర్యోధనుడు హాహాకారాలు చేసి, తన సారథితో ఇలా అన్నాడు. సర్వసేనల వెనుక నేను వింటిని ధరించి నిలిచిఉంటే అర్జునుడు నన్ను దాటిపోలేడు. మెల్లగా గుర్రాలను నడిపించు. పోరాటానికి దిగిన అర్జునుని నిస్సందేహంగా చంపుతాను. చెలియలికట్ట మహాసముద్రాన్ని దాటలేనట్లు అర్జునుడు నన్ను అతిక్రమించి, వెళ్ళలేడు. ఈ రోజు కృష్ణునితో సహా అర్జునుని, అభిమాని అయిన భీమని, మిగిలిన శత్రువులను చంపుతాను. కర్ణుని ఋణాన్ని తీర్చుకొంటాను." శూరునకు, మాననీయునకు తగినట్లుగా ఉన్న ఆ కురురాజు మాటను విని, సారథి సువర్ణాలంకరణలు గల గుర్రాలను మెల్లగా తోలసాగాడు.

రథాలు, గుర్రాలు, ఏనుగులు నశించగా నీ కాల్బలం కేవలం ఇరవై అయిదు వేలమంది యుద్ధానికి సిద్ధపడిఉన్నారు. కోపించిన భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు చతురంగబలాలతో ఈ కాల్బలాన్ని చుట్టుముట్టి, బాణాలతో కొట్టసాగారు. నీ కాల్బలం రణభూమిలో భీమధృష్టద్యుమ్నులను ఎదిరించింది. వారిలో కొందరు భీమునీ, కొందరు ధృష్టద్యుమ్ననీ పేరుపెట్టి పోరాటానికి పిలవసాగారు. రణభూమిలో వారలా నిలిచిఉంటే,

భీమసేనుడు తీవ్రంగా కోపించి, వేగంగా రథం మీదనుండి దిగి, గదను చేతబట్టి, పోరాడసాగాడు. భీముడు భుజబలాన్ని, పరాక్రమాన్ని ఆశ్రయించిన వాడు. ధర్మాపేక్ష గలవాడు. అందువలన తాను రథంమీద నిలిచి భూమిపైనున్న వారితో పోరాడదలచలేదు. బంగారు తొడుగు గల పెద్దగదను చేతబట్టి, దండపాణి అయిన యమునివలె నీవారి నందరినీ సంహరించాడు. ఆ పదాతిసేన కూడా తమకు ప్రియమైన ప్రాణాలపై ఆశను వీడి, రణభూమిలో మిడతలు అగ్నిమీదకు దూకినట్లు, భీమునిపై దాడిచేసింది. యుద్ధదుర్మదులై కోపంతో భీముని సమీపించిన వారు, యముని చూసిన ప్రాణి సమూహంవలె, వెంటనే నశించారు. మహాబలుడైన భీముడు గదనుచేతబట్టి డేగవలె సంచరిస్తూ, నీ సైనికులను ఇరవై అయిదు వేలమందిని సంహరించాడు. మహాబలుడు అయిన భీముడు ఆ పురుషుల నందరినీ చంపి, ధృష్టద్యుమ్నుని ముందుంచుకొని రణభూమిలో నిలిచాడు. అర్జునుడు రథసేనపై దాడిచేశాడు. సాత్యకి, నకుల సహదేవులు ఉత్సాహంతో దుర్యోధనబలాన్ని సంహరిస్తూ, వేగంగా శకునిపై దాడిచేశారు. శకుని సేనలోని ఆశ్వికులను అనేకులను పదునైన బాణాలతో చంపి, వేగంగా కవలు ముందుకురికారు. అక్కడ మహాసంగ్రామం జరిగింది. అర్జునుడు కూడా నీ రథసేనను సమీపించి, త్రిలోక విఖ్యాతి చెందిన గాండీవ ధనుస్సును టంకరించాడు. తెల్లని గుర్రాల రథంతో, కృష్ణ సారథ్యంలో వస్తున్న యోధుడైన అర్జునుని చూసి, నీవారు భయంతో పారిపోయారు. ఇరవై వేలమంది కాల్బలంతో ఎందరో రథాలను కోల్పోయారు. ఎందరో బాణాలతో గాయపడ్డారు. వారంతా కాలగతిలో పడిపోయారు. ధృష్టద్యుమ్నుడు సైనికులను చంపి, భీమసేనుని ముందు కొద్దిసేపటిలోనే కనిపించాడు. అతడు మేటివిల్లుకాడు, తేజస్వి, శత్రుతాపనుడు. పావురాలవన్నె గల గుర్రాలతో, కాంచన వృక్షచిహ్నం గల ధ్వజంతో వచ్చిన ధృష్టద్యుమ్నుని రణభూమిలో చూసి, నీవారు భయంతో పరుగెత్తారు. శకుని వేగంగా బాణాలను ప్రయోగిస్తుండగా, కీర్తిమంతులైన నకులసహదేవులు, సాత్యకి వెంటనే ఆయన వెంటబడుతూ కనిపించారు. చేకితానుడు, శిఖండి, ద్రౌపది కొడుకులు నీ మహాసైన్యాన్ని సంహరించి, శంఖాలను పూరించారు. నీవారు పరాఙ్ముఖులై పారిపోవటం చూసి చేకితానుడు మొదలయిన వారంతా, కోపించిన ఆబోతును ఓడించి, మిగిలిన ఎద్దులు దానివెంటబడ్డట్టు, నీవారి వెంటబడ్డారు.

అప్పుడు అక్కడ నిలిచియున్న బలశాలి అయిన అర్జునుడు, నీ సేనలో కొంతభాగం ఇంకా మిగిలిఉండటం గమనించి, క్రోధానికి లోనయ్యాడు. ఆ పరాక్రమశాలి రథసేనపై దాడిచేశాడు. త్రిలోకవిఖ్యాతి జెందిన గాండీవ ధనుస్సును టంకరింపజేశాడు. ఆపై వెంటనే బాణసమూహాలను వారిపై కురిపించాడు. అంతా చీకటి క్రమ్మింది. ఏమీ

కనిపించటం లేదు. మహారాజా! లోకమంతా అంధకారం కాగా, భూమిఅంతా ధూళిమయం కాగా, నీ యోధులందరూ భయంతో పారిపోయారు. రాజా! సైన్యం చెదరిపోగా నీ కొడుకు తన యెదుటనున్న శత్రువులపై దాడిచేశాడు. భారత శ్రేష్ఠా! ఆ తరువాత గతంలో బలిచక్రవర్తి దేవతలను పిలిచినట్లు, దుర్యోధనుడు పాండవుల నందరినీ యుద్ధానికి ఆహ్వానించాడు.

పాండవసేనలు ఒక్కటై, నానాశస్త్రాలను ధరించి, మాటిమాటికీ గర్జనలతో బెదిరిస్తూ, కోపంగా దుర్యోధనుని మీదకు వచ్చారు. క్రుద్ధుడైన దుర్యోధనుడు కూడా తడబడకుండా, రణభూమిలో పదునైన బాణాలతో వందలు, వేలకొలదిగ వారిని సంహరించాడు. పాండవసేనలతో అన్నివైపుల నుండి పోరాడాడు. అక్కడ నీ కుమారుని పౌరుషం అద్భుతంగా కనిపించింది. తానొక్కడే రణరంగంలో పాండవు లందరితో పోరాడగలిగాడు. రాజేంద్రా! మహాత్ముడైన దుర్యోధనుడు తన సేనలు తీవ్రదుఃఖానికి లోనయి ఉండటం గమనించాడు. ఆపై ధీశాలి అయిన నీ కొడుకు యుద్ధాన్ని ఆపి, యోధులను ఉత్సాహపరుస్తూ ఇలా అన్నాడు.

"మీరంతా భయంతో పారిపోతున్నారు. కానీ ఎక్కడకు పారిపోయినా పాండవుల నుండి ముక్తి పొందగల ప్రదేశం నాకు కనిపించటం లేదు. ఇక పారిపోవటమెందుకు? వీళ్ళ సేన స్వల్పం. కృష్ణార్జునులు తీవ్రంగా గాయపడి ఉన్నారు. ఈరోజు అందరినీ చంపగలను. గెలుపు నిశ్చయం. మీరు పాపం చేసి, బెదరి, పారిపోయినా పాండవులు వెంటపడి చంపుతారు. దానికంటే యుద్ధంలో చావటమే మంచిది. యుద్ధంలో మరణించటం సుఖం. క్షత్రధర్మంతో పోరాడండి. యుద్ధంలో చనిపోతే బాధ ఉండదు. మరణానంతరం అనంతసుఖాలను పొందవచ్చు. ఇక్కడ చేరిన క్షత్రియులందరూ వినండి. అంతకుడైన యముడు శూరుని, భీరుని – ఇద్దరినీ చంపుతాడు. అది తెలిసి కూడా క్షత్రియవ్రతాన్ని చేపట్టిన నావంటివాడు యుద్ధంచేయక మూర్ఖుడెలా అవుతాడు? కోపించిన భీమునికి పోరాడుతూనే లోబడండి. పెద్దలు పాటించిన ధర్మాన్ని విడువదగదు. క్షత్రియునకు పారిపోవటాన్ని మించిన అధర్మం కానీ, పాపం కానీ లేవు. కౌరవులారా! స్వర్గప్రాప్తికి, యుద్ధ ధర్మంకన్నా శ్రేయస్కరమైన దారిలేదు. యోధులారా! యుద్ధంలో చనిపోయి వెంటనే ఉత్తమలోకాలను అనుభవించండి". సంజయుడిలా చెప్తున్నాడు. "నీ కుమారుడు అలా చెపుతున్నా తీవ్రంగా గాయాలకులోనైన సైనికులు ఆ మాటను లెక్కచేయకుండా అన్ని దిక్కులకూ పారిపోయారు."

94. రణభూమి వర్ణనము

సంజయుడిలా చెప్తున్నాడు. "నీకుమారుడు తన సేనలను వెనుకకు మరలించటాన్ని చూసి, అప్పుడు శల్యుడు మూఢచిత్తుడై, శరీరం భయసూచనలు చేస్తుండగా దుర్యోధనునితో ఇలా అన్నాడు. శల్యుడిలా అన్నాడు. "రాజా! చూడు ఈ రణరంగం చచ్చిన మనుష్యులు, గుర్రాలు, ఏనుగుల శవాలతో నిండి ఎంతభయంకరంగా ఉన్నదో! పర్వతాలవంటి ఏనుగులు, కుంభస్థలాలనుండి మదజలాన్ని స్రవిస్తూ, బాణాలతో శరీరాలు బ్రద్దలు కాగా, పడి ఉన్నాయి. కొన్నివేదనకు గురి అయ్యాయి. కొన్ని ప్రాణాలు కోల్పోయాయి. వాటిపై నున్న వీరుల కవచాలు, ఆయుధాలు, డాళ్ళు, కత్తులు ధ్వంస మయ్యాయి. వజ్రందెబ్బకు శిథిలమై, రాళ్ళతో, పెద్దచెట్లతో ఓషధులతో సహా కూలిన కొండలవలె అవి కనిపిస్తున్నాయి. వాటిపైనున్న ఘంటలు, అంకుశాలు, తోమరాలు, ధ్వజాలు ముక్కలు ముక్కలయ్యాయి. ఆ ఏనుగులపై బంగారు జాలరు లున్నాయి. నెత్తుటి ప్రవాహంతో అవి తడిసి ఉన్నాయి. గుర్రాలు బాణాల తాకిడికి చీలి, పడిపోయి, బాధతో నిట్టూరుస్తూ, నెత్తురు క్రక్కుతున్నాయి. దీనంగా ఆక్రోశిస్తున్నాయి. వాటి కళ్ళు తిరుగుతున్నాయి. పళ్ళతో నేలగరచి దయనీయంగా సకిలిస్తున్నాయి. ఏనుగులు, గుర్రాలు, కాల్బలం, బాణాలతో నలిగిపోయాయి. చచ్చిపడిపోయాయి. కొందరు కొంచెం శ్వాసతీస్తున్నారు. కొందరి ప్రాణాలు పోయాయి. ఏనుగులు, గుర్రాలు, మనుష్యులు, రథాలు మర్దనకు గురి అయ్యాయి. ఆ మహాసంగ్రామంలో కాంతి మందగించింది. అది వాస్తవంగా వైతరణివలె భాసిస్తోంది. ఏనుగుల తొండాలు, శరీరాలు ఛిన్నాభిన్నమయ్యాయి. నేలమీద కూలి కంపిస్తున్నాయి. కొన్నింటి దంతాలు భగ్న మయ్యాయి. నెత్తురు క్రక్కుతూ బాధతో దీనంగా మూల్గుతున్నాయి. పెద్ద పెద్ద రథాల సమూహాలు రణభూమిలో మేఘాల్లా ఆవరించి ఉన్నాయి. ఆ రథాల చక్రాలు, బాణాలు, కాడెలు, కట్టుత్రాళ్ళు తెగిపోయాయి. అమ్ములపొదులు, పతాకలు, ధ్వజాలు చెల్లాచెదరయ్యాయి. బంగారు జాలరులతో విస్తరించిన ఆ రథాలు బాగా దెబ్బతిన్నాయి. ఏనుగులపై, రథాలపై, గుర్రాలపై నిలిచి పోరాడే కీర్తిశాలులైన యోధులు, కాల్బలాలు తమ ఎదుటనున్న శత్రువుల చేతిలో మరణించారు. వారి కవచాలు, ఆభరణాలు, వస్త్రాలు, ఆయుధాలు ముక్కలయ్యాయి. ప్రశాంతంగా పడి ఉన్న నీ వారి శవాలతో భూమి కప్పబడింది. బాణాల దెబ్బతిని పడిపోయిన వేలకొలది మహాబలులయిన యోధులు ఆకాశం నుండి నేలగూలి అత్యంతకాంతితో నిర్మలంగా ప్రకాశిస్తున్న గ్రహాలవలె కనిపిస్తున్నారు. వారితో నిండిన భూమి. రాత్రివేళ ఆ గ్రహాలతో కూడిన ఆకాశంవలె శోభిస్తోంది.

కర్ణార్జునుల బాణాలచే శరీరాలు శిథిలమై పడిపోయిన కౌరవ సృంజయవీరుల శరీరాలతో, రణరంగం అగ్నులు ప్రజ్వలిస్తున్న యజ్ఞభూమివలె శోభిస్తోంది. వారిలో కొందరు చైతన్యాన్ని కోల్పోయారు. కొందరు ఇంకా ఊపిరి పీలుస్తున్నారు. కర్ణార్జునులు విడిచిన బాణాలు ఏనుగులు గుర్రాలు, మనుష్యుల శరీరాలను బ్రద్దలు చేసి, వారి ప్రాణాలను తీసి, వెంటనే ఎర్రగానున్న పెద్దపాములు పుట్టలో దూరినట్లు నేలలోనికి చొచ్చుకొనిపోయాయి. రాజా! రణభూమిలో కర్ణార్జునుల బాణాలతో చనిపోయిన మనుష్యులు, గుర్రాలు, ఏనుగులతో ముక్కలయిన రథాలతో నిండి, భూమిపై అడుగు కదల్చటానికి వీలులేకపోయింది. చక్కగా సిద్ధంచేయబడిన రథాలు గొప్ప బాణాలతో చితకకొట్టబడ్డాయి. వాటిపైనున్న యోధులు, శస్త్రాలు, ఆయుధాలు, ధ్వజాలు కూడా చితికిపోయాయి. వాటి చక్రాలు, కట్టుత్రాళ్ళు, ఇరుసులు, కాడెలు, నొగకట్లు కూడా ముక్కలయ్యాయి. వాటిపైనుంచిన శస్త్రాలు, సామగ్రి దూరంగా పడిపోయాయి. నొగల క్రిందున్న కోడిపీటలు, అమ్ముల పొదులు, కట్టుత్రాళ్ళు భగ్నమయ్యాయి. రథంమీది ఆసనాలు ముక్క లయ్యాయి. స్వర్ణ మణిభూషలు గల ఆ రథాలు ఆవరించగా, రణభూమి శరదృతువులో మేఘాలు కప్పిన ఆకాశంవలె శోభిస్తోంది.

రథికులు చనిపోగా చక్కగా సమకూర్చిన ఆ రథాలను వేగశాలులయిన గుర్రాలు లాగుకొనిపోతున్నాయి. సైనికులు, ఏనుగులు, రథాలు, గుర్రాల సమూహాలు పారిపోతున్నాయి. వాటి త్రొక్కిడితో, వేగంగా పారిపోతున్న సైనికు లెందరో పిండిపిండి అవుతున్నారు. బంగారు రెక్కలు గల పరిఘలు, గొడ్డళ్ళు, పదునైన శూలాలు, రోకళ్ళు, ముద్గరాలు, ఒరనుండి వెలువడి వెలుగులు జిమ్మే కత్తులు, బంగారు తొడుగు గల గదలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. రుక్మాంగదాలతో అలంకరింపబడిన విండ్లు, బంగారు రెక్కలు గల బాణాలు, ఋష్టులు, ఒరనుండి వెలువడి వెలుగులు చిమ్మే కత్తులు, సువర్ణదండాలు గల ప్రాసాలు, గొడుగులు, వింజామరలు, శంఖాలు, విచిత్రమాలలు ఛిన్నాభిన్నమై పడి ఉన్నాయి. రాజా! ఏనుగుల అంబారీలపై పరిచిన కంబళ్ళు, పతాకలు, బంగారు నగలు, కిరీట మాలలు, నిర్మలకిరీటాలు, పగడాలతో, ముత్యాలతో చేసిన హారాలు అటు ఇటు చెల్లాచెదరుగా వ్యాపించి ఉన్నాయి.

శిరోభూషణాలు, కేయూరాలు, అంగదాలు, కంఠాభరణాలు, పతకాలు, బంగారు గొలుసులు, ఉత్తమమణులు, వజ్రాలు, సువర్ణం, ముత్యాలు మొదలయిన చిన్నా పెద్దా రత్నాలు, అత్యంత సుఖాలకు తగిన శరీరాలు, చంద్రబింబం వంటి ముఖాలుగల తలలు

దేహాలు, భోగాలు, వస్త్రాలు, ఇష్టసుఖాలు - వీటినన్నింటినీ విడిచి శ్రేష్ఠమైన స్వధర్మనిష్ఠను మాత్రమే పాటించి, సర్వ లోకాలలోనూ కీర్తి వ్యాపింపజేసికొని, పుణ్యలోకాలకు వెళ్ళారు. రాజా! మానదా! వెనుకకు మరలు, దుర్యోధనా! సైనికులను కూడా వెళ్ళనీ! శిబిరానికి పద! రాజా! సూర్యుడు కూడా అస్తమిస్తున్నాడు. నరేంద్రా! కానీ దీనికంతటికీ నీవే కారణం".

శోకవ్యాకులమైన మనస్సుతో దుర్యోధనునితో అలా పలికి శల్యుడు విరమించాడు. దుర్యోధనుడు కూడా నిరంతరంగా కన్నీరు కారుస్తూ ఆర్తితో "అయ్యో కర్ణా! అని విలపిస్తూ చైతన్యహీనుడై నిలిచాడు. అశ్వత్థామ మొదలయిన ప్రముఖులు, ఇతరరాజులు వచ్చి దుర్యోధనుని అనునయించి, కీర్తితో ప్రజ్వలిస్తున్న అర్జునుని మహాధ్వజాన్ని చూస్తూ, మరలిపోతున్నారు. ఆ రణభూమి సైనికులు, గుర్రాలు, ఏనుగుల శరీరాలనుండి కారిన నెత్తుటితో తడిసి, ఎర్రటి వలువలు, మాలలు, సువర్ణాభరణాలు ధరించి అందరిముందు నిలిచిన వేశ్యవనితలవలె కనిపిస్తోంది. రాజా! ఎంతో అందంగా ప్రకాశిస్తున్న ఆ సంధ్యాకాలంలో, నెత్తుటితో స్వరూపాన్ని కప్పుకొన్న రణభూమిని చూసి, కౌరవసేనలు అక్కడ నిలువలేకపోయారు. వారంతా దేవలోక ప్రయాణానికి సిద్ధపడి ఉన్నారు. రాజా! కర్ణవధతో దుఃఖిస్తున్న వారు "అయ్యో! కర్ణా! అయ్యో! కర్ణా" అని ఆక్రోశిస్తూ ఎర్రబడ్డ సూర్యుని చూసి, వేగంగా శిబిరాలకు వెళ్ళిపోయారు. కర్ణుడు బంగారురెక్కలు గలిగి, సానపెట్టబడి, అర్జునుని గాండీవం నుండి వెలువడిన బాణాలచే ఆవరింపబడిఉన్నాడు. ఆ బాణాలు రెక్కల నెత్తుటితో తడిసి ఉన్నాయి. అలా మరణించినా కూడా, అతడు రణభూమిలో కిరణమాలి అయిన సూర్యునివలె ప్రకాశిస్తున్నాడు.

'భక్తులపై దయచూపే సూర్యభగవానుడు నెత్తుట తడిసిన కర్ణుని శరీరాన్ని తన కిరణాలతో తాకి, నెత్తురువలె ఎర్రగా మారి, స్నానం చేయాలని కాబోలు పశ్చిమ సముద్రంవైపు వెళుతున్నాడు.' అలా భావించి దేవర్షి సమూహాలు అక్కడ నుండి బయలుదేరి తమ నివాసాలకు వెళ్తున్నారు. ఈ విషయాన్నే ఆలోచిస్తూ, లోకులు ఏ ఇబ్బందిలేకుండా ఆకాశంమీదనో, భూమిమీదనో ఉన్న తమ నివాసాలకు బయలుదేరారు. కురువీరముఖ్యులయిన కర్ణార్జునుల యుద్ధం ప్రాణధారులకు భీకరమైనది, అద్భుతమైనది. అది విని జనులు ఆశ్చర్యానికి లోనయి వారిని అభినందిస్తూ వెళ్ళిపోయారు.

కర్ణుని కవచం బాణాలతో తెగిపోయింది. బట్టలు నెత్తుటితో తడిసిపోయాయి. విగతజీవుడైనా, అందం, జీవకళ ఆ కర్ణుని వీడలేదు. ప్రజ్వలిస్తున్న బంగారంవలె, అగ్నివలె,

సూర్యునివలె కాంతులీనుతున్న శూరుడు - కర్ణుడు బ్రతికియున్నట్లే సర్వప్రాణులూ భావించాయి. మహారాజా! కర్ణుడు రణభూమిలో చనిపోయాడు. అయినా సింహాన్ని చూసి, ఇతర మృగాలు చెదిరినట్లు, కర్ణుని చూసి యోధులందరూ భయపడుతున్నారు. పురుషశ్రేష్ఠా! కర్ణుడు మరణించికూడా బ్రతికిఉన్నట్లే కనిపిస్తున్నాడు. ఆ మహాత్ముడు చనిపోయినా, ఏ మార్పూ ఏర్పడలేదు. కర్ణుని ముఖం పూర్ణచంద్రునితో సమానంగా కాంతిగలది. అందమైన వేషాన్ని ధరించిన వీరుడు తాను, అందమైన శిరస్సు, మెడగలవాడు కర్ణుడు. రాజా ! నానాభరణాలు, సువర్ణాంగదాలు ధరించిన కర్ణుడు, మరణించి, చివురించిన చెట్టువలె పడియున్నాడు. పురుషశ్రేష్ఠా! మేలిమి బంగారం వలె, అగ్నివలె ప్రజ్వలిస్తూ కర్ణుడు అర్జునుని బాణా లనే జలంతో ఆరిపోయాడు. మండిపడుతున్న అగ్ని నీరు పైబడగానే శాంతించినట్లు రణభూమిలో కర్ణుడనే అగ్ని అర్జునుడనే మేఘంచే ఆర్పివేయబడింది.

మేటి పోరాటంతో లోకంలో తాను ఉజ్జ్వల కీర్తినిపొంది, బాణవృష్టులను కురిపించి, పది దిక్కులను తపింపజేసిన ఆ కర్ణుడు, యుద్ధంలో పుత్రసహితంగా అర్జునుని తేజస్సుతో శాంతించాడు. అస్త్రతేజస్సుతో పాండవులనందరినీ, పాంచాలురనూ తపింపజేసి, శరవృష్టిని కురిపించి, శత్రుసేనను తపింపజేసి, తేజస్వి అయిన సూర్యుని వలె సర్వజగత్తును ప్రతాపింపజేసి, యాచకులకూ, పక్షి సమూహాలకూ కల్పవృక్షం వంటి సూర్యసుతుడు - కర్ణుడు పుత్రులతో, వాహనాలతో సహా చంపబడ్డాడు. యాచకులు అడిగితే ఇస్తాను అనే కానీ లేదు అని ఎప్పుడూ అనలేదు. సజ్జనులచే ఎప్పుడూ సత్పురుషుడుగా కీర్తింపబడ్డాడు. ఆ కర్ణుడు ద్వైరథయుద్ధంలో మరణించాడు. కర్ణుడు మహాత్ముడు, మహారథుడు. ఆయన సంపద అంతా బ్రాహ్మణాధీనమే. బ్రాహ్మణులకు ఇవ్వరానిదంటూ తన దగ్గర ఏదీ లేదు. తన ప్రాణమైనా సరే! స్త్రీలకు ఎప్పుడూ ఇష్టమైనవాడు తాను. నిత్యమూ దాత. అటువంటివాడు అర్జున బాణాలచే దహింపబడి పరమగతిని పొందాడు. నీ కుమారుడు ఆ కర్ణునిమీద ఆధారపడియే శత్రుత్వాన్ని పూనాడు. నీకుమారులకు జయాశను, సంపదను, రక్షణను కల్పించినవాడు. ఆ కర్ణుడు స్వర్గానికి వెళ్ళాడు.

కర్ణుడు మరణించగానే నదులు ప్రహించలేదు. సూర్యుడు అస్తమించాడు. అగ్నివంటి, సూర్యునివంటి రంగుగల కుజుడు, బుధుడు కూడా అడ్డంగా ఉదయించారు. ఆకాశం బ్రద్దలైంది. భూమి ఘోషించింది. గాలులు పరుషంగా ఘోరంగా వీచాయి.

దిక్కులు పొగతో కూడా మండసాగాయి. మహాసముద్రాలు ఘోషిస్తూ క్షోభించాయి. రాజా! కొండల సమూహాలు కాననాలతో సహా కంపించాయి. భూతగణాలన్నీ వ్యథ చెందాయి. బృహస్పతి రోహిణిని చుట్టి సూర్యచంద్రులవలె ప్రకాశింపసాగాడు. కర్ణుడు మరణించగానే మూలలు కూడా జ్వలించాయి. ఆకాశమంతా చీకటి క్రమ్మింది. భూమి కంపించింది. నిప్పువంటి ఉల్కలు నేలబడ్డాయి. నిశాచరులు కూడా ప్రసన్నులయ్యారు. చంద్రునివలె ప్రకాశిస్తున్న ముఖంగల కర్ణుని శిరస్సును అర్జునుడు క్షురంతో పడగొట్టిన వెంటనే ఆకాశంలో దేవతలు చేస్తున్న హాహాకార ధ్వని వినిపించింది. రాజా! దేవతలు, గంధర్వులు, మనుష్యుల పూజలనందుకొన్న శత్రువును - కర్ణుని రణభూమిలో సంహరించి, అర్జునుడు పూర్వం వృత్రుని చంపిన ఇంద్రునివలె పరమతేజస్సుతో ప్రకాశించాడు.

ఆపై నరశ్రేష్ఠులైన కృష్ణార్జునులు రణభూమిలో రథారూఢులై, అగ్నిసూర్య తేజస్సులై, ఒకే రథంపైనున్న ఇంద్రవిష్ణులవలె భయరహితులై అందగించసాగారు. ఆ రథం మేఘ సమూహగర్జనవలె ధ్వనిస్తోంది. శరత్కాలంలో ఆకాశ మధ్యంలో నిలిచిన సూర్యునివలె, తేజస్సుతో వెలుగుతోంది. భీకరంగా గర్జిస్తున్న కపిధ్వజ పతాక రెపరెపలాడుతోంది. ఆ రథకాంతి మంచువలె, చంద్రునివలె, శంఖంవలె, స్ఫటికం వలె నిర్మలంగా ఉంది. అది ఇంద్రుని రథంతో సమానంగా శోభిస్తోంది. దానిపైనున్న ఆ ఇద్దరు పురుష శ్రేష్ఠులు ఇంద్రుని వలె శక్తిమంతులు, పౌరుషవంతులు. బంగారు, ముత్యాలు, మణులు, వజ్రాలు, పగడాల ఆభరణాలతో వారు శోభిస్తున్నారు. ఆపై కపిధ్వజుడు - అర్జునుడు, గరుడధ్వజుడు - కృష్ణుడు వింటి అల్లెత్రాడు, కరతలాలు, బాణాల ధ్వనులతో బలపూర్వకంగా శత్రువుల ప్రభలను హరించి, కౌరవసేనలను మేటి అమ్ములతో ఆవరింపజేసి, ఉత్సాహంతో, అమితప్రభావంతో శత్రువుల మనస్సులను చీల్చుతూ, చేతులలోనికి రెండు శంఖాలను తీసికొని, వాటిని తమ అందమైన ముఖాలతో చుంబించి, మ్రోయింపసాగారు. ఆ రెండు శంఖాలు బంగారు జాలరులు వ్రేలాడేవి. మంచువలె తెల్లనివి, మహాధ్వనిని పుట్టించగలవి. ఆ రెండు శంఖాలు - పాంచజన్య దేవదత్తాల ధ్వని భూమిని, ఆకాశాన్ని, దిక్కులను ప్రతిధ్వనింపజేసింది.

రాజశ్రేష్ఠా! ఆ కృష్ణార్జునుల శంఖనాదంతో కౌరవులందరూ బెదిరిపోయారు. ఆ శ్రేష్ఠవీరులిద్దరూ శంఖనాదంతో వనాలను, కొండలను, నదులను, గుహలను ప్రతిధ్వనింపజేస్తూ, నీ కుమారుని సేనను భయానికి గురిచేస్తూ, యుధిష్ఠిరుని ఆనందింపజేశారు.

భారతా! ఆ శంఖధ్వనిని వింటూనే కౌరవ యోధులందరూ మద్రరాజు - శల్యుని, భారతవంశాధిపతి - దుర్యోధనుని అక్కడే వీడి వేగంగా పారిపోయారు. అప్పుడు ఉదయించిన ఇద్దరు సూర్యులవలె, ఆ మహారణభూమిలో ఎంతో శోభిస్తున్న అర్జునునీ, కృష్ణునీ భూతగణాలన్నీ సమకూడి అభినందించాయి. రణభూమిలో కర్ణుని బాణాలు గ్రుచ్చుకొన్న ఆ పరంతపులైన కృష్ణార్జునులిరువురూ, అంధకారాన్ని అంతరింపజేసి, ఆకాశంలో ఆవిర్భవించిన నిర్మల కిరణమాలులయిన చంద్రసూర్యుల వలె భాసించారు. ఆ బాణాలను తొలగించుకొని అసమాన పరాక్రమశాలులు, సర్వసమర్థులు అయిన కృష్ణార్జునులు, మిత్రులు చుట్టు నిలువగా, యజ్ఞంలోనికి ప్రవేశిస్తున్న విష్ణుదేవేంద్రులవలె తమ శిబిరాలలోనికి ప్రవేశించారు. ఆ మహాసంగ్రామంలో కర్ణుడు చనిపోగానే దేవతలు, గంధర్వులు, మనుష్యులు, చారణులు, మహర్షులు, యక్షులు, నాగులు, కృష్ణార్జునుల జయాన్నీ, వృద్ధినీ ఆకాంక్షిస్తూ పరమశ్రద్ధతో అభినందించారు. తగినరీతిగా పూజింపబడి, తమ గుణగణాల వలన అభినందింపబడి, మిత్ర గణసమేతులైన ఆ కృష్ణార్జునులు, అప్పుడు బలాసురుని అణచివేసి ఆనందించిన ఇంద్రవిష్ణువుల వలె ఆనందించారు."

95. కౌరవసేన శిబిరాలలో ప్రవేశించుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! కర్ణుడు చనిపోగానే వేలకొలదిగ కౌరవులు భయపీడితులై అన్నిదిక్కులా కలయజూస్తూ పారిపోసాగారు. మహాసంగ్రామంలో శత్రువులు కర్ణుని చంపటాన్ని చూసి, నీ సేనలు తీవ్రంగా గాయాలపాలయి భయంతో దిక్కులు పట్టిపోయాయి. ఆపై తీవ్రదుఃఖంతో ఉద్వేగానికి లోనైన నీ యోధు లందరూ నివారింపబడుతున్నా కూడా అన్నివైపుల నుండి వెనుదిరగసాగారు. రాజా! అలా చెదరిపోతున్నవారి అభిప్రాయాన్ని గురించి, శల్యుని అనుమతితో నీ కొడుకు - దుర్యోధనుడు యుద్ధవిరమణకు అనుమతించాడు. కృతవర్మ నీ రథాలచే చుట్టబడి, మిగిలిన నారాయణసేనతో కలిసి శిబిరానికే పరుగెత్తాడు. వేయిమంది గాంధారసైనికులు చుట్టు నిలువగా శకుని, చనిపోయిన కర్ణుని చూసి, శిబిరంవైపే పారిపోయాడు. రాజా! కృపుడు మహా మేఘసమూహం వలె నున్న గజసేనతో శిబిరానికే పరువెత్తాడు. ఆపై శూరుడైన అశ్వత్థామ పాండవుల విజయాన్ని చూసి, మాటిమాటికీ నిట్టూరుస్తూ శిబిరంవైపే వెళ్ళిపోయాడు. రాజా! సంశప్తకులలో మిగిలియున్న మహాసేన చుట్టు నిలువగా, సుశర్మకూడా, కర్ణవధను చూసి, భయపీడితుడై వెళ్ళిపోయాడు.

దుర్యోధన నరపాలుడు కూడా సర్వబాంధవులు మరణించగా, విమనస్కుడై, దీర్ఘంగా ఆలోచిస్తూ, శోకానికి లోనయి వెళ్ళిపోయాడు. రథికశ్రేష్ఠుడైన శల్యుడు ధ్వజం విరిగిపోయిన ఆ రథంమీదనే పది దిక్కులనూ పరికించి చూస్తూ, శిబిరానికి వెళ్ళిపోయాడు. ఆ తరువాత భారతసేనలో మహారథు లయిన ఇతరు లెందరో భయానికి లోనయి, సిగ్గుపెనవేయగా, చైతన్య రహితులై పారిపోయారు. కర్ణుడు పడిపోవటం చూసి కౌరవు లందరూ నెత్తురోడుతూ, భయంతో కంపిస్తూ, ఉద్వేగానికి లోనై పరుగులు పెట్టారు. కురుసత్తమా! కౌరవులు కొందరు అర్జునుని ప్రశంసిస్తూ, కొందరు మహారథులు కర్ణుని ప్రశంసిస్తూ, పదిదిక్కులకు పారిపోయారు. ఆ మహాసంగ్రామంలో వేలకొలదిగనున్న నీ యోధులలో యుద్ధంమీద మనసుపెట్టిన మగవాడు ఒక్కడూ లేడు. మహారాజా! కర్ణుడు చనిపోగానే కౌరవులకు జీవితాల మీదా, రాజ్యాల మీదా, భార్యలమీదా, ధనాల మీదా కూడా నిరాశ కలిగింది. సమర్థుడైన నీ కుమారుడు మహాప్రయత్నంతో వారి నందరినీ వెంటపెట్టుకొని, దుఃఖశోకసమన్వితుడై శిబిరానికి వెళ్ళటాన్ని గురించి ఆలోచించాడు. రాజా! మహారథు లైన ఆ యోధు లందరూ దుర్యోధనుని ఆదేశాన్ని శిరసావహించి, పాలిపోయిన ముఖాలతో శిబిరాలలో ప్రవేశించారు."

96. యుధిష్ఠిర హర్షము

సంజయుడిలా చెప్తున్నాడు. "కర్ణుడలా చనిపోయాడు, శత్రుసేన పారిపోయింది, కృష్ణుడు అర్జునుని కౌగిలించుకొని ఆనందంతో ఇలా అన్నాడు. ధనంజయా! ఇంద్రుడు వృత్రుని చంపాడు. నీవు కర్ణుని చంపావు. వృత్రవధను, కర్ణవధను మానవులు ఘోరమైన వాటినిగా చెప్పుకొంటారు. యుద్ధంలో అధికతేజస్సుగల వజ్రంతో వృత్రుడు చనిపోయాడు. నీవు వింటితో, పదునైన బాణాలతో, కర్ణుని చంపావు. కౌంతేయా! యశస్కరమై లోకప్రసిద్ధమైన ఈ నీ పరాక్రమాన్ని ధీశాలి అయిన యుధిష్ఠిరునకు నివేదిద్దాం. యుద్ధంలో ఎప్పటినుండియో కోరుకొంటున్న ఈ కర్ణ సంహారాన్ని ధర్మరాజుకు నివేదించి, నీవు ఋణవిముక్తి నందగలవు. నీకూ, కర్ణునకూ మధ్య మహాసంగ్రామం జరుగుతున్నప్పుడు, యుద్ధాన్ని చూడాలని ధర్మనందనుడు ముందు వచ్చాడు. కానీ తీవ్రంగా గాయపడినందువలన రణరంగంలో నిలువలేకపోయాడు. ఆపై ఆ పురుషశ్రేష్ఠుడు శిబిరానికి వెళ్ళి కూర్చున్నాడు."

అది విని అర్జునుడు 'అలాగే' అనగానే యదుశ్రేష్ఠుడైన కృష్ణుడు రథికశ్రేష్ఠుడైన అర్జునుని రథాన్ని సావధానుడై, వెనుకకు త్రిప్పాడు. అర్జునునితో అలా పలికి కృష్ణుడు "ఇతరులకు వెన్ను చూపకుండా సప్రయత్నంగా నిలవండి. మీకు మంచి జరగాలి" అని సైనికులతో అన్నాడు. ధృష్టద్యుమ్ననితో యుధామన్యునితో, నకుల సహదేవులతో, భీమసేనునితో, యుయుధానునితో కృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునుడు కర్ణుని చంపినట్లు ధర్మరాజుకు నివేదించి వచ్చేదాకా మీరు, రాజులందరూ కూడా సిద్ధంగా సావధానంగా ఉండాలి". ఆ కృష్ణుడు ఆ శూరుల అంగీకారంతో ధర్మజుని శిబిరంవైపు వెళ్ళాడు. గోవిందుడు అర్జునునితో కలిసి యుధిష్ఠిరుని సందర్శించాడు. రాజశ్రేష్ఠుడైన ధర్మజుడు బంగారు పక్కమీద శయనించియున్నాడు. కృష్ణార్జునులు ఆనందించి, ఆయన పాదాలను స్పృశించారు. వారి ఆనందాన్ని గమనించి, ధర్మజుడు ఆనందబాష్పాలు రాల్చాడు. రాధేయుడు మరణించాడని భావించి లేచాడు. ధర్మజుడు మాటిమాటికి ప్రేమతో పలుకరిస్తూ, వారిద్దరినీ కౌగిలించుకొన్నాడు. యదుపుంగవుడైన కృష్ణుడు అర్జునునితో కలిసి, ఆ కర్ణవధ వృత్తాంతాన్ని యథాతథంగా ధర్మరాజుకు చెప్పాడు. అచ్యుతుడైన శ్రీకృష్ణుడు చేతులు జోడించి చిరునవ్వుతో, శత్రువులు నశించిన ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"రాజా! అదృష్టం కొద్దీ గాండీవధన్వి అయిన అర్జునుడు, వృకోదరుడు, పాండుసుతులు నకుల సహదేవులు, నీవూ కూడా కుశలులే. పాండవా! మీరంతా వీరవినాశకమై, రోమాంచహేతువైన ఈ యుద్ధంనుండి బయటపడ్డారు. ఇక అనంతర కర్తవ్యాన్ని గురించి ఆలోచించు. రాజా! మహారథుడు, సూర్యసుతుడు అయిన కర్ణుడు మరణించాడు. రాజేంద్రా! అదృష్టం కొద్దీ గెలిచావు. అదృష్టం కొద్దీ వర్ధిల్లుతున్నావు. బూదంలో ఓడిపోయిన ద్రౌపదిని చూసి, పురుషాధముడైన కర్ణుడు నవ్వాడు. ఆ కర్ణుని రక్తాన్ని ఈరోజు భూమి త్రాగుతోంది. కురుపుంగవా! ఈ నీ శత్రువు ఒళ్ళంతా బాణాలతో నిండి నేలబడి యున్నాడు. పురుషశ్రేష్ఠా! అనేకబాణాలతో శిథిలమైన ఆ కర్ణుని చూడు. మహారాజా! శత్రువులు నశించిపోయిన ఈ రాజ్యాన్ని పరిపాలించు. సంసిద్ధుడవై మాతో కలిసి ఈ భోగాలను పుష్కలంగా అనుభవించు." సంజయుడిలా చెప్తున్నాడు. "మహాత్ముడైన ఆ కృష్ణుని మాట విని, ధర్మరాజు ఆనందించి కృష్ణునితో ఇలా అన్నాడు. రాజేంద్రా! "అహో! భాగ్యం! అహో భాగ్యం" అంటూ యుధిష్ఠిరుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "మహాబాహూ! దేవకీనందనా! నీవుంటే ఇదేమంత ఆశ్చర్యకరంకాదు. అర్జునుడు నీ సారథ్యం వలననే ప్రయత్నపూర్వకంగా కర్ణుని చంపగలిగాడు. నీ బుద్ధి ప్రసాదంతో ఇది జరగటం ఆశ్చర్యకరం

కాదు". కురుశ్రేష్ఠా! అంగద భూషితమైన కృష్ణుని కుడిభుజాన్ని పట్టుకొని ధర్మరాజు ఆ కేశవార్జునులతో ఇలా అన్నాడు.

"నరనారాయణులు దేవతలనీ, ప్రాచీన ఋషిసత్తములనీ, ధర్మాత్ములనీ, మహాత్ములనీ నారదుడు నాకు చెప్పాడు. మహాభాగా! మేధావి, తత్త్వవేత్త అయిన కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు) ఎన్నోసార్లు ఈ కథ చెప్పాడు. కృష్ణా! నీ అనుగ్రహం వలననే పాండుసుతుడైన ఈ అర్జునుడు శత్రువులకు అభిముఖంగా నిలిచి, గెలిచాడు. ఎప్పుడూ విముఖుడు కాలేదు. నీవు రణభూమిలో అర్జునునికి సారథ్యాన్ని అంగీకరించినప్పుడే, మా విజయం నిశ్చితమైంది. మాకు పరాజయం కాదు. గోవిందా! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, మహాత్ముడు గౌతమవంశీయుడైన కృపుడు వారి ననుసరించేవారు, ఇతరులైన అనేకశూరులు అందరూ - ఈరోజు నీ బుద్ధిబలంతో కర్ణుడు చనిపోగానే - పూర్తిగా హతులయినట్లే భావిస్తున్నాను".

అలాపలికి పురుషసింహుడు, మహాబాహువు అయిన యుధిష్ఠిరుడు, తెల్లటి రంగు, నల్లనితోక, మనోవేగం గల గుర్రాలు పూన్చిన స్వర్ణరథాన్ని ఎక్కి, తనసేన చుట్టూ నిలువగా యుద్ధాన్ని చూడటానికి బయలుదేరాడు. వీరులైన కృష్ణార్జునులతో ఇష్టమైన విషయాలు ముచ్చటిస్తూ, వారితో మాటాడుతూ రణభూమిలో శయనించియున్న పురుషోత్తముడైన కర్ణుని చూశాడు. అన్నివైపులా కేసరాలతో నిండిన కదంబ పుష్పం వలె వందలకొలది బాణాలతో ఆవరింపబడియున్న కర్ణుని ఆ ధర్మరాజు చూశాడు. అప్పుడు గంధతైలాన్ని నింపిన సువర్ణదీపికలను వేలకొలదిగ వెలిగించారు. ఆ కాంతిలో ధర్మజుడు కర్ణుని చూశాడు. కర్ణుని కవచం బ్రద్దలై ఉంది. శరీరాన్ని బాణాలు చీల్చాయి. పుత్రసహితంగా కర్ణుడు చచ్చిపడి ఉన్నాడు. ఆ కర్ణుని మాటిమాటికీ చూసి యుధిష్ఠిర నరపాలుడు కర్ణుని మరణాన్ని నమ్మి, నరోత్తములైన కృష్ణార్జునుల నిద్దరినీ ప్రశంసించారు. "గోవిందా! నేడు వీరుడవు, పండితుడవు, అయిన నీవు దిక్కయి రక్షించగా సోదరులతో సహా నేను ఈ నేలకు రాజయ్యాను. మిక్కిలి అభిమాని, నరశ్రేష్ఠుడు అయిన కర్ణుడు మరణించటాన్ని చూసి, దురాత్ముడైన ఈ దుర్యోధనుడు జీవితంమీదా, రాజ్యం మీదా ఆశను వదులుకొంటాడు. పురుషోత్తమా! నీ అనుగ్రహంతో మేము కూడా కృతార్థుల మయ్యాం. గోవిందా! అదృష్టం వలన జయించావు. అదృష్టం కొద్దీ శత్రువు చనిపోయాడు. పాండుసుతుడు, గాండీవధారి అయిన అర్జునుడు అదృష్టంవలన విజయు డయ్యాడు. పదమూడు సంవత్సరాలు తీవ్రవేదనతో జాగరణతో గడచిపోయాయి. మహాభుజా! నీ

దయవలన ఈ రాత్రి సుఖంగా నిద్రిస్తాం".

సంజయుడిలా చెప్తున్నాడు. "ఈ రీతిగా యుధిష్ఠిరుడైన ధర్మరాజు జనార్దనుని, కురుశ్రేష్ఠ డైన అర్జునుని బహుధా ప్రశంసించాడు. అర్జునుని, బాణాలతో పుత్రులతో సహా మరణించిన కర్ణుని చూసి, ఆ ధర్మరాజు తాను పునర్జన్మ నెత్తినట్లు భావించాడు. మహారాజా! మహారథులందరూ కౌంతేయుడైన యుధిష్ఠిర నరపాలుని సమీపించి, తాము ఆనందిస్తూ, ధర్మజుని ఆనందింపజేశారు. మహారాజా! కర్ణుడు మరణించగానే నకులుడు, సహదేవుడు, పాండుసుతుడు - భీముడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, పాంచాలురు, సృంజయులు ధర్మజుని అభినందించారు. ఆ మహారథులందరూ జయశీలులు, యుద్ధనిపుణులు, శత్రువును దెబ్బతీయగలవారు, లక్ష్యాన్ని సాధించినవారు, వారు ధర్మస్వరూపుడైన యుధిష్ఠిరుని వర్ధిల్లజేసి స్తుతికి తగిన మాటలతో పరంతపులైన కృష్ణార్జునులను స్తుతించి ఆనందంతో తమ తమ శిబిరాలకు వెళ్ళారు. రాజా! ఈ రీతిగా రోమాంచజనకమైన మహాసంగ్రామం జరిగింది. ఇదంతా నీ అవినీతి వలననే. ఇంకా బాధపడటమెందుకు ?" వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "ఈ అప్రియవచనాలను విని, అంబికాసుతుడైన ధృతరాష్ట్రుడు వేరుతెగిన చెట్టువలె నిశ్చేష్టుడై నేలపై పడ్డాడు. అదే రీతిగా దీర్ఘదృష్టిగల గాంధారి కూడా పడిపోయింది. రణరంగంలో కర్ణుని మరణాన్ని గురించి దుఃఖిస్తూ ఏవేవో మాటాడసాగింది. ఆమెను విదురుడు, ధృతరాష్ట్రుని సంజయుడు పట్టుకొన్నారు. ఆ ఇద్దరూ ధృతరాష్ట్రనరపాలుని ఊరడించారు. అలాగే కౌరవస్త్రీలు గాంధారిని లేవనెత్తారు. దైవం, భవితవ్యం ప్రబలమని భావించి, ధృతరాష్ట్రుడు తీవ్రవ్యధకు లోనయ్యాడు. మహాతపస్వి అయిన ఆయన చింతాశోకాలలో మునిగి, మోహపీడితుడై చేతనను కోల్పోయాడు. విదుర సంజయుల ఊరడింపుతో అచేతనంగా, మౌనంగా కూర్చుండిపోయాడు.

శ్రవణమహిమ

మహాత్ములైన కర్ణార్జునుల ఈ మహాసంగ్రామ రూపమైన యాగాన్ని గురించి చదివిన వాడు చక్కగా చేసిన యాగఫలాన్ని పొందుతాడు. భారతా! విన్నవాడు కూడా అటువంటి ఫలితాన్ని పొందగలడు. విష్ణువే సనాతనయజ్ఞం. అగ్ని, వాయువు, చంద్రుడు, సూర్యుడు కూడా అతడే అని చెపుతారు. కాబట్టి అసూయలేకుండా దీనిని విన్నవాడు, చదివినవాడు కూడా లోకులంతా తనను అనుసరించగా, సుఖంగా ఉంటాడు. సర్వదా భక్తి భావంతో పుణ్యప్రదమైన ఈ మహాసంహితను పఠించిన నరులు ధనంతో, ధాన్యంతో,

కీర్తితో ఆనందిస్తారు. దీనిని గురించి మరోరీతిగా ఆలోచించ నవసరం లేదు. కాబట్టి అసూయలేకుండా దీనిని వింటే, అప్పుడు మనిషి సర్వసుఖాలను పొందగలడు. విష్ణువు, బ్రహ్మ, మహేశ్వరుడు కూడా ఆ నరోత్తముని విషయంలో తృప్తినందుతారు. ఇది చదివినా, విన్నా, బ్రాహ్మణునకు వేదజ్ఞానం లభిస్తుంది. క్షత్రియులకు యుద్ధంలో శక్తి, జయమూ కలుగుతాయి. వైశ్యులు ధనంతో గొప్పవాళ్ళవుతారు. శూద్రు లందరూ ఆరోగ్యాన్ని పొందుతారు. అలాగే సనాతన భగవానుడైన విష్ణుదేవుడు ఇక్కడ కీర్తింపబడినందువలన, ఆయన ద్వారా, మనిషి కోరికలను నెరవేర్చుకొని సుఖాన్ని పొందగలడు. మహాముని అయిన వ్యాసుని వాణి ఆటువంటి ఫలితాన్ని ఇవ్వగలది. దూడలతో సహా కపిలగోవులను నిరంతరంగా సంవత్సరకాలం పాటు దానం చేసిన పుణ్యం, కర్ణపర్వ శ్రవణం ద్వారా కలుగుతుంది."

ఇది కర్ణపర్వం

A.C.No 96362

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక, భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకి తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇరుపర లోకాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.

336